# పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు

వ్యాససంపుటి

## గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

సరసభారతి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

**Purvaangla kavula mucchatlu**

by **Gabbita Durga Prasad**

First Edition: **August 2014**

Copies: 1000

© **Author**

Price. Rs.**200/-**

Cover Design: **Kalasagar**

Dtp: **Ramya bharathi, Vijayawada**

For Copies:-

**Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/suvarchalanjaneyaswamy.wordpress.com

Printed : **Sree Ram Offset Printers,** vijayawada-2

# అంకితం



మానవత్వమున్న సాహితీమూర్తి

**డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహశర్మ ఎం.డి. గారికి..**

– గబ్బిట దుర్గాప్రసాద్

**నేను రాసిన ఎనిమిదవది, సరసభారతి 13వ పుస్తకం అయిన "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు"ను. ఆత్మీయులైన నా అమెరికా మిత్రులు శ్రీ మైనేని గోపాలకృష్ణ గారి బావగారు ప్రముఖ వైద్యులు, ఆంధ్రాంగ్ల కవి, రచయిత, గ్రంథకర్త, అనువాదకులు, వితరణశీలి డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహశర్మ ఎం.డి.గారికి అంకితమిస్తున్నాం. ఈ సందర్భంగా వారి ప్రతిభా విశేషాలను వివరిస్తున్నాను.**

నరసింహశర్మగారు ప్రఖ్యాత కథకులు, నవలా రచయితా అయిన స్వర్గీయ రా.వి.శాస్త్రి(రాచకొండ విశ్వనాథశాస్త్రి)గారి తమ్ముడు. స్వర్గీయ శ్రీనారాయణమూర్తి, శ్రీమతి సీతామహాలక్ష్మీగార్ల కుమారులు. శ్రీకాకుళం జిల్లాలో 28-08-1924లో జన్మించారు. వీరికి ఇద్దరన్నలు శ్రీమహాదేవ శాస్త్రి, కీ.శే.విశ్వనాథశాస్త్రి, ఒక

తమ్ముడు శ్రీసుబ్బారావు. చెల్లెలు డాక్టర్ శ్రీమతి నిర్మల. హైస్కూల్ విద్యాభ్యాసం తర్వాత కాలేజి విద్య నేర్చి, విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్యకళాశాలలో ఎం.బి.బి.ఎస్.లో 1948లో చేరి, మెడిసిన్ చదివారు. 1959లో ఎం.డి.పొందారు. వైద్యవృత్తి స్వీకరించి, ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖలో వైద్యుడిగా 1950 నుండి 1967 వరకు పనిచేశారు. 1967లో అమెరికా వెళ్లి 25 ఏళ్ళు మెసాచూసెట్స్ వి.ఏ హాస్పిటల్ (లెబనాన్, పెన్సిల్వేనియా) వివిధ వైద్యాలయాలలో, వివిధ రంగాలలో– Univerrsity of Kentacky, Medical Center, V.A.Hospitals, Letanon State Hospitals Pennsylvania and Masoachucetes వైద్య సేవలందించారు. 1945లో అనాటమిలో ఒకసారి 1947లో మెడిసిన్‌లో రెండవసారి స్వర్ణ పతకాలను పొందారు. పదికి పైగా విలువైన రిసెర్చ్ పేపర్స్ తయారు చేసి విదేశీ జర్నల్స్‌తో సహా అనేక జర్నల్స్‌కు రాశారు. వీటిని గమనించిన అమెరికాలోని కెంటకి యూనివర్సిటిలోని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బోరిస్ సురావిజ్ శ్రీశర్మగారిని అమెరికాకు రమ్మని ఆహ్వానించారు.

తనతోపాటు వైద్య విద్యను అభ్యసిస్తున్న కృష్ణాజిల్లా, ఉయ్యూరుకు చెందిన మైనేనివారి ఆడపడుచు శ్రీమతి అన్నపూర్ణాదేవిని వలచి వలపింపజేసుకొని పెద్దల అంగీకారంతో వర్ణాంతర వివాహం చేసుకొన్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు శ్రీసుధాకర్. చిన్న కుమారుడు శ్రీరమేష్. పెద్ద కూతురు శ్రీమతి జ్యోతి. చిన్న కూతురు శ్రీమతి సంధ్య.

శర్మగారి వృత్తి వైద్యమే అయినా ప్రవృత్తి గ్రంధ సేకరణతో బాటు ఆంగ్లం ఆంధ్రాలలో కవితా రచన, ఆంగ్ల కవితలను తెలుగు చేయటం. ఈ దిశలో కృషి చేసి అనురాగాలు – ఆత్మీయతలు, పడమటి సంధ్యారాగం పుస్తకాలను రాసి ప్రచురించారు. వివిధ పత్రికలలో ఎన్నో వ్యాసాలూ రాశారు. అమెరికాలోని ఆంగ్ల పత్రికలలో వీరి ఆంగ్ల కవితలు ప్రచురితాలు, తెలుగు కవితలు ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, అమెరికాలోని తెలుగు జ్యోతిలలో ముద్రణ పొందాయి. అమెరికాలోని "తానా పత్రిక" గుంటూరులోని "భావ వీణ", విశాఖలోని "ప్రసన్న భారతి" పత్రికలలో వీరి రచనలు ప్రచురింపబడ్డాయి. కుప్పంలోని ద్రవిడియన్ విశ్వవిద్యాలయం ప్రచురించిన రావిశాస్త్రి కథల ఆంగ్లానువాదానికి సమన్వయకర్తగా, అనువాదకులుగా ఉన్నారు. ఇటీవలనే "హ్యూమన్ టచ్ అండ్ అదర్ పోయెమ్స్" వెలువరించారు.

"అయితే" అను అనువాద కవితా సంకలనం ముద్రణలో వున్నది. కందపద్యాలను రసకందాయంగా రాసే నేర్పు వారిది. సీసాలతో శ్రీనాధునిలా ఉయ్యాలలూగిస్తారు. సృజనాత్మక రచనలు చేయటంలో దిట్ట. ఆయన సేకరించిన గ్రంధాలు అసంఖ్యాకం. ప్రకృతి ప్రేమికులు, ఆరాధకులు శర్మాజీ.

"విశాఖ సాగరానికి యారాడకొండ, జనసాగరానికి ఈ రాచకొండ శిఖరాయమానాలు" అంటారు. "అన్నపూర్ణాక్షరం" పేర శర్మగారు రాసిన ఆంగ్ల కవితలకు ప్రముఖ రచయితా విమర్శకుడు శ్రీరామతీర్థ తెలుగు వచన కవితా అనువాదంతో ద్విభాషా కవితా సంపుటిగా వెలువడింది. అవే కవితలను శ్రీ బులుసు వెంకటేశ్వర్లు గారు "అనువాదం" అనే పుస్తకంలో ప్రచురించారు. ఇంతటి సాహితీమూర్తికి "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" అంకితమివ్వటం సముచితమే కదా.

బంధువులందరితో ఎంతో ఆప్యాయంగా, పెద్దలలో పెద్దగా, పిన్నలలో చిన్నవాడిగా ఉంటూ సందడి చేస్తారు శర్మగారు. అందరికి అనురాగం, ఆత్మీయతలను పంచిపెట్టే కుటుంబి. మమతానురాగాలు మూర్తీభవించిన మూర్తిమత్వం శర్మగారిది. మనుష్యులంటే వల్ల మాలిన ప్రేమ. దేనిలోనైనా సంపూర్ణత సాధించటం ఆయన ధ్యేయం. ఈ డాక్టర్ దంపతులు ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడి ఉంటున్నారు. శ్రీమతి అన్నపూర్ణాదేవిగారితో వారి దాంపత్యం ఆదర్శప్రాయమైనది. సంపూర్ణ ఆరోగ్యంతో ఆ దంపతులు అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఇలాంటి వ్యక్తిత్వం, అర్హత ఉన్న, మానవత్వం మూర్తీభవించిన ప్రేమమూర్తి డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహశర్మగారికి ఈ పుస్తకం అంకితం ఇవ్వటం ఎంతో సముచితం అని భావిస్తున్నాం. సరసభారతి స్థాపించినప్పటి నుండి శర్మగారికి సంస్థతోను, నాతోనూ పరిచయం ఎక్కువైంది. సంస్థ చేస్తున్న కార్యక్రమాలను మెచ్చుకుంటూ ఫోన్లు చేస్తుంటారు. సరసభారతి ప్రచురించిన "శ్రీఆంజనేయస్వామి మహత్మ్యం" పుస్తక ముద్రణకు అడగకుండానే భక్తితో విరాళం సమర్పించిన సహృదయ సుమనస్కులు. అందుకే "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" డాక్టర్ శర్మగారి 90వ జన్మదినోత్సవం రోజు 28-08-2014న అంకితమిచ్చి సరసభారతి ధన్యమైందని భావిస్తున్నాం.

**– గబ్బిట దుర్గాప్రసాద్**
అధ్యక్షులు, సరసభారతి



# విద్యావేత్త, వితరణశీలి శ్రీ మైనేని గోపాలకృష్ణ

దాదాపు పది సంవత్సరాలుగా శ్రీమైనేని గోపాలకృష్ణ గారితో నాకు పరిచయం ఉంది. ఆయన ఎప్పుడూ ఇతరులను "ఎలివేట్" చేయించటానికే శ్రమపడతారు కాని తనను గురించి చెప్పుకోవటానికి ఇష్టపడని మొహమాటం, బిడియం ఉన్న వ్యక్తి. అయిదేళ్లుగా సరసభారతికి అంతకుముందు అయిదేళ్ళు సాహితీ మండలికి ఆయన అభిమాని. సరసభారతి ప్రచురించిన "సిద్ధయోగి పుంగవులు", "మహిళా మాణిక్యాలు" పుస్తకాలు మైనేని వితరణ వల్లనే తేగలిగాము. ఇప్పుడు "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" పుస్తకాన్ని నేను రాయటానికి ప్రోద్బలం వారిదే. దాని ముద్రణ బాధ్యత అంతా తానే వహిస్తానని చెప్పి ముందుకొచ్చి కావలసిన ధనాన్ని ఎప్పుడో పంపించేశారు. మైనేనిగారి బావగారు, ప్రముఖ వైద్యులు, ఆంధ్రాంగ్ల కవి, రచయిత, అనువాదకులు, వితరణశీలి డాక్టర్ రాచకొండ నరసింహశర్మగారికి అంకితమివ్వాలని భావించాను. ఈ పుస్తకంలో గోపాలకృష్ణగారి గురించి పరిచయం కూడా ఉండటం భావ్యమనిపించి, వారి నుంచి బయోడేటా సేకరించాను. దాన్ని ఆధారంగా వారిని గురించి సంక్షిప్త సమాచారం అందిస్తున్నాను.

మైనేని గోపాలకృష్ణగారు కృష్ణాజిల్లా ఉయ్యూరుకు దగ్గరలో ఉన్న కుమ్మమూరు గ్రామంలో శ్రీ మైనేని వెంకట నరసయ్య, శ్రీమతి సౌభాగ్యమ్మ

దంపతులకు 10-01-1935న ఆరవ సంతానంగా జన్మించారు. వీరి అన్నలు స్వర్గీయ నారాయణ, స్వర్గీయ తాతయ్య అనే రాజశేఖర్, అక్కయ్యలు శ్రీమతి అన్నపూర్ణాదేవి, స్వర్గీయ కనకదుర్గాదేవి, శ్రీమతి భారతీదేవి, చెల్లెళ్ళు శ్రీమతి హేమలతా దేవి, శ్రీమతి సత్యవాణి. వీరి బాల్యంలోనే తండ్రిగారు కుటుంబాన్ని పిల్లల చదువుల కోసం ఉయ్యూరుకు మార్చారు. ఉయ్యూరులో చిన్నతనంలో గోపాలకృష్ణగారు స్వర్గీయ కోట సూర్యనారాయణగారి వద్ద చదువుకొన్నారు. ఆయనే నాకూ గురువుగారు కూడా. నాలుగవ తరగతి వారివద్దే చదివాను. మా ఇంటికి దక్షిణాన రెండో ఇంట్లో దేవులపల్లి సీతమ్మగారింట్లో అద్దెకుండేవారు. ఆ మేస్టారంటే మైనేనిగారికి అత్యంత భక్తీ, విశ్వాసాలు. ఆయన్ను స్మరించకుండా ఉండనేలేరు. 'గురువు'గారు అని ఎంతో గౌరవంగా సంభావించి సంభాషిస్తారు. దాదాపు డెబ్భై ఏళ్ళ క్రితం చదువు చెప్పిన గురువుగారిని ఈనాటికీ గుర్తుంచుకొని స్మరించటం ఆయన సంస్కారం. అంతేకాదు ఆ మేస్టారి పేర ఏదో చేయాలనే తపన ఈ మధ్య ఎక్కువై ఆయన ఫోటో సంపాదించటానికి తీవ్ర కృషి కూడా చేసిన ఉత్తమ శిష్యులు శ్రీగోపాల కృష్ణగారు. మేస్టారే తన పుట్టినరోజును నమోదు చేసి స్కూల్‌లో చేర్పించారని గర్వంగా చెప్పుకొంటారు. ఆయన శిక్షణను మరవలేనని అంటారు. తన దగ్గర చదివే విద్యార్థులలో తప్పు దిద్దుకొనేవాడిని "వెధవ" అంటే "వెయ్యేళ్ళు ధనధాన్యాలతో వర్ధిల్లు" అని ఎన్నిసార్లు చెప్పినా మారని వాడిని "ఎదవ" అంటే 'ఎల్లప్పుడూ దరిద్రంతో వర్ధిల్లు" అని తమాషాగా తిట్టేవారని మైనేని గుర్తు చేసుకొంటారు. "అనుమానస్తుడికి అదేదో ఆరు చోట్ల అంటుకుంటుంది" అని సామెతను తనకు వర్తించేట్లు అనేవారనీ గోపాలకృష్ణగారు చెప్పుకొన్నారు.

గోపాలకృష్ణగారు తాడంకి హైస్కూల్‌లో 1950 వరకు చదివి ఎస్.ఎస్.ఎల్.సి పాసయ్యారు. తరువాత విజయవాడలో ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కాలేజిలో చేరి ఇంటర్ చదివి 1953లో ఉత్తీర్ణులయ్యారు. అప్పటికే కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈయన కూడా చదువు మీద అంతగా శ్రద్ధ చూపించలేదు. కాలేజి నాటకాలతో కాలక్షేపం చేశారు. ఆత్రేయ రాసిన "యెన్.జి.వో" ఎదురీతల నాటికలో చిన్న పాత్ర ధరించారు. విజయవాడలో

సోషలిస్ట్ పార్టీపై ఆకర్షణ ఏర్పడింది. ఆ సభలూ, సమావేశాలలో తిరుగుతూ కాలేజికి "దుమ్మా" కొట్టేవారు. "బెజవాడ హోటల్ వర్కర్స్ యూనియన్" స్థాపకులతో చేరి హోటల్ యాజమాన్యం, కస్టమర్లు "హోటల్ క్లీనర్ల"ను అసభ్య పదజాలంతోను, అమానుష పద్ధతిలోను వేధించే విధానాన్ని అరికట్టేటందుకు, వారి జీవన పరిస్థితులు మెరుగుపరచటానికి చేసిన కృషిలో పాల్గొని తన వంతు కర్తవ్యం నిర్వహించారు. బెజవాడ అనుభవంతో ఉయ్యూరులో స్నేహితులతో కలిసి "డ్రమాటిక్ అసోసియేషన్"ను 1953-54లో స్థాపించి ఆత్రేయ యెన్ జి వొను ప్రాక్టీస్ చేశారు కాని ప్రదర్శన ఇవ్వలేకపోయారు. 1954-55లో ఒక కజిన్ భర్తకున్న ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేశారు. 1955-1958 కాలంలో విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిలాసఫీ మెయిన్ సబ్జెక్ట్‌గా, ఎడ్యుకేషనల్, సోషల్ అండ్ చైల్డ్ సైకాలజీలు మైనర్ సబ్జెక్టులుగా తీసుకొని చదివి 1959లో ఎం.ఏ డిగ్రీ సెకండ్ రాంక్‌తో సాధించారు.

1959-60లో మహారాష్ట్రలోని పూనాలో డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఆడిటర్ అప్పర్ డివిజన్ క్లెర్క్ (యు.డి.సి)గా ట్రెయినింగ్ పూర్తి చేసిన వెంటనే, బొంబాయి నావల్ అకౌంట్స్‌కు బదిలీ చేస్తే విసుగెత్తి ఉద్యోగానికి నీళ్ళు ఒదిలిపెట్టి వచ్చేశారు. 1960లో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా నల్లూరు గ్రామవాసి స్వర్గీయ పరుచూరి భావనారాయణ చౌదరి, శ్రీమతి రత్న మాణిక్యమ్మ దంపతుల కుమార్తె శ్రీమతి సత్యవతిని వివాహం చేసుకున్నారు.

1960-61లో అమెరికా వెళ్లి మిన్నే పోలిస్‌లోని మిన్నేసోటా యూనివర్సిటిలో ఎడ్యుకేషన్ సైకాలజి, స్టాటిస్టిక్స్‌లో కొంత కోర్సు వర్క్ చేశారు. "ఫాదర్ ఆఫ్ క్రియేటివిటి" అని అందరూ ఆప్యాయంగా గౌరవంగా పిలుచుకొనే డాక్టర్ పాల్ ఇ.టారెన్స్ 'అప్పుడు బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చి అధిపతిగా ఉండి, సృజనను ఎంతో ప్రోత్సహించాడు. 1961-62లో మాడిసన్‌లోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ఇండియన్ స్టడీస్‌కు అనుబంధంగా ఉన్న తెలుగు గ్రంధాలను కేటలాగ్ చేయటానికి సహాయపడుతూ, కొన్ని లైబ్రరి కోర్సులను పూర్తి చేశారు. 1962లో ఇండియా తిరిగి వచ్చి 1964 వరకు రెండేళ్ళు ఉద్యోగం లేక, కుటుంబాన్ని

పోషించటానికి చాలా ఇబ్బందులు పడ్డారు.

1964–65లో విజయవాడలో మిల్క్ ఫాక్టరీ నిర్మాణం చేస్తున్న స్నేహితుడికి చెందిన సమ్మిట్ అల్లైడ్ వర్క్స్ అనే కాంట్రాక్టర్ సంస్థలో సైట్ సూపర్వైజర్గా కాషియర్గా పనిచేశారు. 1965–66లో మళ్ళీ నిరుద్యోగి. ఉయ్యూరులోని స్వర్గీయ శ్రీ పుచ్చా శివయ్య, శ్రీ అన్నే హనుమంతరావులు స్థాపించిన "సరస్వతి ట్యుటోరియల్ కాలేజి"లో పిల్లలకు సోషల్ చెబుతూ హాస్టల్ వార్డెన్గా ఒకే ఒక్కవారం రోజులు పనిచేసి నిలబడ్డారు. అదే సమయంలో స్వర్గీయ మన్నే శివరాం (నెత్తుర్లు కలం ఫేం) ఏర్పాటు చేసిన రామమనోహర్ లోహియా కృషికార్ లోక్‌పార్టీకి కృష్ణాజిల్లా సెక్రెటరిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

1966–68 మధ్య ఉయ్యూరు కే.సి.పి షుగర్ ఫాక్టరీలో పంచదార సంచుల లోడింగ్ ఆపరేటర్ అసిస్టెంట్‌గా, ఆఫీస్ అసిస్టెంట్‌గా, స్క్రాప్‌మెటల్‌ను లారీలకు లోడ్‌చేసే చోట తూకం తూచేవాడిగా, ఏ పని చెప్పినా హీనంగా భావించకుండా "డిగ్నిటి ఆఫ్ లేబర్"గా భావించి చేస్తూ, అది అనేక షిఫ్ట్‌లలో పనిచేస్తూ ఫాక్టరీకి రైతులు ఎడ్లబండ్ల తోలిన చెరుకు నాణ్యాన్ని పరిశీలించమంటే అదీ చేస్తూ పక్వానికి రాని చెరుకు దంట్లను, వాటర్ షూట్‌లను ఏరి పారేస్తూ, మనసులోనే భావాలను అణచుకొంటూ, ఈ వ్యవస్థలో తాను ఇమడలేకపోతున్నానని బాధపడుతూ, అసలు వ్యవస్థలోనే ఏదో లోపం ఉందేమో అని అనుమానిస్తూ, ఇదంతా తన బలహీనత, ఖర్మ అనుకొంటూ కాలం గడిపారు.

ఈ క్షోభ నుండి విముక్తి ఎప్పుడా అని ఎదురు చూస్తున్న గోపాలకృష్ణగారికి అదృష్టం తలుపు తట్టి అవకాశం అంది పుచ్చుకొంది. 1969లో అమెరికా వెళ్లి టెన్నేసిలో లైబ్రరి సైన్స్‌లో ఎం.ఎస్ చేసి, అందరి అభిమానాన్ని, గౌరవాలను పొంది డిగ్రీ తీసుకొని సంతృప్తి చెందారు. ఉయ్యూరులో పడిన శ్రమకు, మానసిక వేదనకు విముక్తి కలిగింది. డిగ్రీ ఇంకా నాలుగు నెలలకు పూర్తి అవుతుంది అనగానే లూవిల్‌లోని కెంటకి యూనివర్సిటిలో కేటలాగర్ అండ్ ఇంస్ట్రక్టర్ ఇన్ లైబ్రరి సైన్స్‌కు ఎంపికైనారు. ఉద్యోగంలో చేరేనాటికి ఇండియా నుంచి భార్య సత్యవతిగారు కొడుకులు కృష్ణరవితో కలిసి వచ్చి చేరారు.

న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీని సందర్శించారు. మేషీన్ రీడబుల్ కేటలాగింగ్‌కు ఇన్‌హౌస్ ట్రైనింగ్ ఇచ్చారు. ఆంగ్లో అమెరికన్ కేటలాగింగ్ రూల్స్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అబ్స్ట్రాక్ట్ ఆఫ్ అకాడెమిక్ ప్లాన్ అండ్ బిల్డింగ్ ప్రోగ్రాంకు సహకరించారు. లాంగ్ రోల్ బడ్జెట్, పెర్సనల్ అండ్ రిసోర్సెస్ ప్రొజెక్షన్‌కు సహాయకుడిగా సేవలు అందించారు. యూనివర్సిటి ఆఫ్ లువిల్ లైబ్రరి సిస్టంకు టెక్నికల్ సిస్టం అందజేయటంతో ప్రముఖ పాత్ర వహించారు. పై అధికారుల చేత ప్రశంసలు అందుకొన్నారు. తోటి ఉద్యోగుల చేత ఆత్మీయ మిత్రుడిగా అభినందనలు పొందారు. 1997లో అసోసియేటెడ్ ప్రొఫెసర్ అండ్ స్పెషల్ అసిస్టంట్ టు యూనివర్సిటి లైబ్రేరియన్‌గా పదవీ విరమణ చేశారు. కెంటకిలో సదరన్ బాప్టిస్ట్ థియాలజికల్ సేమినరి ముర్రే స్టేట్ యూనివర్సిటిలలో "హిందూ ధర్మం"పై ప్రసంగాలు చేశారు. లూవిల్ యూనివర్సిటిలో రెలిజియస్ స్టడీ డిపార్ట్‌మెంట్ ఆహ్వానంపై బౌద్ధ ధర్మంపై ధార్మికోపన్యాసం చేశారు.

అతిధులకు, బాధితులకు సానుభూతి ఆత్మీయత, సహవేదన చూపి వారితో స్వానుభావాన్ని పంచుకొని చేతనైన సాయం చేయటమే జీవిత పరమావధిగా భావించి జన్మను చరితార్ధం చేసుకొంటున్నారు. ప్రతిక్షణం ఉపయోగకరమైన పనిలో గడపటానికి కృషి చేస్తారు. "భయం తలుపు తడితే విశ్వాసం ఇంట్లో ఎవరూ లేరు అని సమాధానం చెబుతుంది" అనే సామెతను నమ్మి పనిచేస్తారు. "Faith is reflected in courage to face reality" అన్నది నమ్ముతారు. అబ్బాయిలు కృష్ణ, రవిలు వివాహాలు చేసుకొని పిల్లలతో ఇద్దరూ అమెరికాలోనే కోరుకున్న ఉద్యోగాలు చేసుకొంటూ తలిదండ్రులను కనిపెడుతూ ఆదర్శ కుటుంబంగా ఉంటున్నారు. నిరంతరం సాహిత్యాధ్యయనం చేయటమే ఆయన హాబీ. చదివిన పుస్తకం బాగుంటే వెంటనే నాలాంటి వారికి కొని పోస్ట్ ఖర్చులు పెట్టి పంపటం మరో "చెడ్డ గుణం".

అమెరికాలో ఉంటున్నా గోపాల కృష్ణగారికి ఉయ్యూరుమీద అభిమానం ఏమీ తగ్గలేదు. ఇక్కడి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ ఉంటారు. ఉయ్యూరులో ఏ.సి లైబ్రరి నిర్మాణానికి అయిదు లక్షల రూపాయలు భూరి విరాళాన్ని,

మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయానికి ఇరవై వేల రూపాయలను, భగవద్గీతలో రాణిస్తున్న చి.మాదిరాజు బిందు దత్తశ్రీకి ఉన్నత విద్యకోసం పదిహేను వేల రూపాయలను, ఉయ్యూరులోని "హిందు స్మశాన వాటిక"ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్న రోటరీ క్లబ్ వారికి 25 వేల రూపాయలను అందజేసిన వితరణశీలి మైనేని. ప్రపంచ ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ఉయ్యూరు వాసి, ప్రస్తుత అమెరికా నివాసి శ్రీఆరికపూడి ప్రేమచంద్‌గారిని ఉయ్యూరు రప్పించి స్వయంగా డబ్బులు ఖర్చుపెట్టి మాతో సన్మానం చేయించిన వారి హృదయ వైశాల్యం గొప్పది. అలానే బౌద్ధ ధర్మ ప్రచారకులు శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారికి సన్మానం చేయించి, వారి పుస్తక ముద్రణకు ధనసాయమూ చేసిన వదాన్యులు గోపాలకృష్ణగారు. సరసభారతికి కొంగు బంగారం. సరసభారతి ప్రచురించిన "సిద్ధయోగి పుంగవులు", "మహిళా మాణిక్యాలు" అనే రెండు పుస్తకాలకు ఆయనే స్పాన్సర్. మొదటిది ఆయన తల్లిగారు స్వర్గీయ మైనేని సౌభాగ్యమ్మ గారికి, రెండవది తమ ప్రియతమ అర్ధాంగి శ్రీమతి మైనేని సత్యవతి గారికి అంకితం యిప్పించిన తీవ్ర మాతృభక్తి, సహధర్మచారిణి యెడ గాఢమైన అనురక్తి వున్నవారు. ఇప్పుడు రాసిన మాటన్నీ యదార్థాలేనని అందరికీ తెలిసిన విషయమే. మరొక్కసారి గుర్తు చేయటమే నేను చేసిన పని.

ఇదంతా వారిని ఉబ్బేయటానికో, స్వలాభా పేక్షకో రాసినది కాదు. వారి కష్టపడి పైకొచ్చిన జీవితాన్ని చూసి స్ఫూర్తి పొందటానికి, వారిలా సమాజ సేవలో ధన్యం అవటానికి, ముఖ్యంగా యువత మాతృదేశ సేవలో తరించటానికి అందరికి ప్రేరణ కలిగిస్తుందని మాత్రమేనని సవినయంగా మనవి చేస్తున్నాను.

**– గబ్బిట దుర్గాప్రసాద్**

అధ్యక్షులు, సరసభారతి



## కీర్తిచంద్రికలు

– డా॥ లంకా శివరామప్రసాద్,
వరంగల్

**"తే** వంద్యాస్తే మహాత్మన: – తేషాం లోకే స్థిరం యశ: – యైర్నిబద్ధాని కావ్యాని – ఏచ కావ్యే ప్రకీర్తితా:"

లబ్ధ ప్రతిష్టులైన కవి చంద్రులు వారి కావ్య శోభిత వెన్నెల కాంతులతో సదా ప్రకాశిస్తూనే ఉంటారు.

"More words, but O, how crystal clear they shine - How like the chime of silver bells they are.
A voice for those who have no voice at all - A song sung in the dark, and heard afar"

"కవిత్వం మానవ హృదయాలను స్వర్గ తీరాలకు ఉప్పొంగజేసి ఆ భగవానుని నేలపై అవతరించేట్లు చేయగలుగుతుంది" అంటుంది గ్రేస్ నొల్ క్రాంవెల్.

దివ్య లోక ప్రేరణో, జీవితానుభవమో కవిలోని కవిత్వ ఝరిని జాలువారించగా, జీవితానికి ప్రతీకమైన సంగీతం కవిత్వానికి పూవుకు అబ్బిన పరిమళంలా, సెలయేటి గలగలలా రూపొంది మధురానుభూతిని కలిగిస్తుంది.

"God is the author, and not man - He laid the key note of

all harmonies - He planned all perfect combinations and He made us so that we could hear and understand"

సంగీతం దైవ సృష్టి. ప్రకృతి నుంచి దానిని రవ్వంతైనా గ్రహించడానికి మనం ప్రయత్నిస్తే ధన్యులమవుతాము. కవులకు ఆశక్తి జన్మత: లభ్యమవుతుందేమో. వాళ్ళు "రవి గాంచని వాటిని" కూడా గ్రహించి సామాన్యులకు కవితా రూపాన అందించిన చిరస్మరణీయులౌతారు.

కవిత్వాన్ని చదివి కవి జీవితాన్ని అర్థం చేసుకోవడం, కవి జీవితాన్ని చదివి అతడి కవిత్వాన్ని పునర్యానించడం, విమర్శకుల విశ్లేషకులకున్న విచిత్రమైన వ్యాపకం. సాధారణ పాఠకులు కవిత్వాన్ని ఆనందించి, తమ తమ వ్యాసాల్లో, వ్యాపారాల్లో మునిగిపోతారు. కవికి పేరు ప్రతిష్టలొచ్చాక విమర్శకులు ఆ కవి పూర్వాపరాల ఆచూకీతో రంధ్రాన్వేషణలు చేసి అతడు ప్రస్తుత ఉన్నత స్థితికి కారణాలు కనుగొని ప్రపంచానిక వెల్లడి చేసి సంతృప్తి పొందుతారు. మహాకవి అన్నట్లు "ప్రైవేటు జీవితాలు వారి వారి స్వంతం. పబ్లిక్‌లోకి వస్తేనే ఏమైనా అంటాం".

కవుల పుస్తకాలు అధ్యయనం చేయడం ద్వారా అతడు లేక ఆమె దృక్పథాన్ని ఆర్థిక, సామాజిక ఇతర పరిస్థితుల్లో మారిన దృక్కోణాన్ని, వయసుతో వచ్చే పరిపక్వతను, సామాజిక స్థితిగతుల్ని అంచనా వేయవచ్చు. అలాగే కవుల జీవితాన్ని పరిశీలించటం వలన వారి కుటుంబ జీవనాన్ని, వాళ్ళు ఎదుర్కొన్న ఒడిదుడుకులను, వారి కవిత్వ కడలి ఆటుపోట్లను అర్థం చేసుకోవచ్చు.

Louis Untermeyer తన "Lives of the poets" అనే దాదాపు ఏడు వందల పేజీల గ్రంథంలో ఒక సహస్రాబ్దిలోని ఆంగ్ల, అమెరికన్ కవుల జీవిత చిత్రాల్ని ముప్ఫై భాగాలుగా వర్గీకరించి Geoffrey Chaucer నుంచి Dylan Thomas వరకు నూట ఇరవై అయిదు మందికి పైగా కవుల జీవితాల్ని సంక్షిప్తంగా పాఠకుల దృష్టికి తీసుకువచ్చినాడు.

వాటిని 55 భాగాలుగా విఖ్యాత రచయిత శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారు, శ్రీమైనేని గోపాలకృష్ణగారి ప్రేరణతో తేనెలొలికే తీయని తెలుగుభాషలోకి "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు"గా సరళ సుందరంగా, సహజ ప్రవాహ ధోరణిలో అనువదించి

సరసమైన శీర్షికతో తెలుగు పాఠకుల ముంగిటిలోనికి తీసుకురావడం ముదావహం. అభినందనీయం, శ్లాఘనీయం. శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారికి వైద్యులు, కవి, అనువాదకులు అయిన శ్రీ రాచకొండ నరసింహాశర్మగారి ఆశీస్సులు, ప్రోత్సాహం లభించటం అదృష్టం.

"అమృతం చైవ మృత్యుశ్చ ద్వయం దేహే ప్రతి ష్ఠితం – మృత్యు రాపద్యతే మోహాత్ సత్యే నా పద్యతే మృతం"

మోహము వలన మృత్యువును, సత్య దర్శనము వలన అమృతాన్ని మానవులు పొందుతున్నారని విజ్ఞులు చెబుతారు. వెయ్యేళ్ళ ఆంగ్ల కవితామూర్తుల జీవిత సత్య దర్శనాన్ని కవిత్వామృతాన్ని, జీవన సారార్థాన్ని మనం ఈ పుస్తకం ద్వారా పొందగలుగుతున్నాము. అందుకు మనం శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారికి శాశ్వతంగా ఋణపడి ఉంటాము.

As they sang -
Of what I know not, but the music touched Each cord of being - I felt my secret life stand open to it as the parched earth yawns to drink the summer rain – ఆ విధంగా కవి చంద్రుల వెన్నెల కిరణాల నారగించటానికి తహతహలాడే చాతక పక్షులం మనం.

క్రీ.శ. 1340లో చాసర్ జన్మించాడు. అంతకుముందు ఆంగ్ల కవిత్వం లేదా? (వీళ్ళకూ మన తెలుగు వాళ్ళకూ గొప్ప పోలికలున్నాయి ఈ విషయంలో). Stone henge లాంటి బృహత్ శిలా నిర్మాణాలు గావించిన ఘనత కలిగి పూర్వం పదమూడు వందల సంవత్సరాలకు పూర్వం జరిగిన ట్రాయ్ యుద్ధంలో (Trozen war) పరాజితులు పక్షాన ఉన్న ఎయినాస్ (Aenes) యుద్ధ సమాప్తి కాలంలో తప్పించుకొని, రోమన్ రాజ్యమూల పురుషుడుగా రూపొందటం అతని మనుమడైన బ్రూటస్ వంశీకులే బ్రిటన్లుగా తామరతంపరగా వృద్ధి చెందటం చరిత్ర విషయాలే అయినా, అప్పటి నుంచి క్రీ.శ. 14వ శతాబ్దం వరకు ఆంగ్లంలో కవిత్వ సంపద లేదనడం సమంజసంగా తోచదు. అయితే ఆనాటి ఆంగ్ల భాషలోనే పండితులకు భాషా కోవిదులకు తప్ప అన్యులకర్థంకానట్లు ఉంటుంది.

ఆదికవి ఎవరు? నన్నయ భట్టారకుడా, కాదా అని మనం తర్జన భర్జనలు

పడుతున్నట్లే. అక్కడా కొంత గొడవ ఉంది. Anglo saxon సాహిత్యంలో Beowulf, Caedmon వ్రాతప్రతులు The sea farer, The wander, wid sith, The dream of the road వ్రాతప్రతులు ఇప్పుడు మ్యూజియంలలో భద్రపరచబడి ఉన్నాయి. అంతకు ముందున్నదంతా మౌఖిక సాహిత్యమే. జానపద వీరుల (Heroic) భక్తి (devotion) కవిత్వం ఆరోజుల్లో ప్రాచుర్యంలో ఉండేది.

ఆధునిక ఆంగ్ల సాహిత్యం Geoffrey Chaucerతో ప్రారంభమైందని చెప్పవచ్చును. “He is the father of English poetry and perhaps the prince of it” అంటాడు. John Dryden మానవుల బాహ్యాంతరంగాలు క్షుణ్ణంగా తెలిసిన catalystగా The Canterbury talesతో గత ఏడు వందల ఏండ్లుగా సాహితీ ప్రియుల్ని అలరిస్తున్న కవి గాయకుడు Geoffrey Chaucer. The Canterbury tales చదివినప్పుడల్లా నాకు మన కాశీ మజిలీ కథలు గుర్తుకొస్తుంటాయి.

Pearl poet - William Langland జనకవి, నిరంకుశత్వంపై నిరసన తెలిపినవాడు, భాష ప్రజా బాహుళ్యం దగ్గరగా ఉండి, మన తిక్కనామాత్యుడిలా జనానికి చేరువైనాడు. స్కాటిష్ చాసరియన్లు చాసర్‌కు వీరాభిమానులు. వీరు చాసర్ గురించి గొప్పగా చెప్పుకున్నారు. వీరి తరువాతి కవులలో రాజకవి మొదటి జేమ్స్ (1394–1437) మన కృష్ణదేవరాయలులా కవి, గొప్ప రాజు. The king's Quair రచించి ప్రసిద్ధికెక్కినాడు. తరువాతి కాలం “Miracles and moralities” ప్రాముఖ్యత ఉన్న సాహిత్యం, నాటక రంగంలో అడుగుపెట్టింది. బైబిల్ విషయాల ప్రధాన అంశంకాగా, ముద్రణా యంత్రం (Gutten Berg) రాకతో 1477లో caxton తొలి ఇంగ్లీషు పుస్తకాన్ని ముద్రించాడు. కవిత్వం ఎల్లలు దాటింది. బంధనాలున్న మత సాహిత్యాన్ని నిరసించి, మకార త్రయం (మగువ, మద్యం, మంచిపాట)తో కూడిన goliardic verse (gula-gluttony – తిండిపోతు) ప్రాచుర్యంలోకి వచ్చింది.

భారత కవిత్రయం ప్రశస్తి తగ్గి స్వంత గొంతు వినిపించే నేపథ్యం వచ్చినట్లు శ్రీనాథుడు లాంటి కవి జాన్ స్కెల్‌టన్ (John skeleton) 1460లో పుట్టి, ఎనిమిదవ

హెన్రికు ఆస్థానకవిగా గౌరవింపబడి, రాజుతో కలిసి రాజభోగాలను అనుభవించిన వాడితడు. నాలుగు దీర్ఘాక్షర సముదాయపు ఛందస్సుతో (skeleton meter)గా సద్యోగర్భిత భావజాలంతో తన తరువాతి తరాలను కూడా ప్రభావితం చేశాడు. శ్రీనాధుడి సీస పద్యం, జాన్ స్కెల్టన్ skeleton meter శాశ్వత కీర్తి దాయకాలే. ఇతడి జీవితమూ శ్రీనాధుడి జీవితంలా చరమాంకం కష్టాల పాలైంది.

పద్నాలుగు పంక్తుల sonnetను లాటిన్ భాష నుంచి ఇంగ్లీష్‌లోకి తెచ్చి సుందరీకరించిన కవిగా wytt సంక్షిప్తతకు ప్రాధాన్యమిచ్చే “Blank verse”కు ఆద్యుడు. Surrey (Henry Howard) ఇద్దరూ ఆంగ్ల కవితా ఛందస్సు, శైలిని మార్చిన మొదటి సంస్కర్తలు. జంట కవులు. వీరి జీవిత చరిత్ర అత్యద్భుతంగా ఉంటుంది. సర్రేను 30వ ఏట శిరచ్ఛేదం చేశారు.

సాహస నౌకా యాత్రికుడు Sir walter Raleigh, కవులకు కవి Edmund Spenser, కవిత్రయం Sidney, Daniel, Dray ton, జగదేక సుందరి హెలెన్‌ను “is that the face that launched thousand lips?” అని కీర్తించి జగత్ప్రసిద్ధి కెక్కిన “The muses”, Darling - Christopher Marlowe (వాణి నా రాణి అన్న పిల్లల మర్రి పినవీర భద్రుడు గుర్తుకు రావడం లేదా?) వీరి జీవితాలను “పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు”లో శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు కమనీయంగా వర్ణించారు.

ఇప్పుడు ఆంగ్ల నాటక కవితా పితామహుడు – William Shakespeare జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్య మేలు? విధ్వనాధ సృష్టి మనకెలాగో ఇంగ్లీషు భాష పరిచయం ఉన్న ప్రతివారికీ షేక్స్‌పియర్ సృజన అలాంటిదే. “take all my loves, my love, yea take them all - loves fire heats water, water cools not love” మూడు భాగాలలో షేక్స్‌పియర్ జీవిత చరిత్రను మనం అధ్యయనం చేస్తామీ గ్రంధంలో.

కాలం ముందుకు సాగిపోతూనే ఉన్నది. “man is the beauty of the world, the paragon of animals” అన్న భావన స్పష్టమైంది. ఎలిజబెత్ శకం అంతరించింది. తళుకు బెళుకు యుగం ప్రారంభమై, మొట్ట మొదటి రాజాస్థాన

కవి Ben Johnson, యువకవి Thomas Nashe, పాటల కవి Campion, జంట కవులు Beaumont, Fletcherల రోల్డ్‌గోల్డ్ తళుకుల కాలమది.

పదిహేడవ శతాబ్దం మెటాఫిజికల్ (మెట్ట) వేదాంతపు కాలం. John Donne(మృత్యు కవిత్వం) John Herbert (బంధ కవిత్వం – Anagram), Richard Crashaw, Abraham Cowley, Henry Vaughan, Thomas Trahemeల కవిత్వంతో ఈ యుగం పరిసమాప్తికి వచ్చింది.

ప్యూరిటన్లు అనబడిన రంధ్రాన్వేషకుల కాలం చార్లెస్ రాజు – ఆలివర్ క్రాంవెల్ మధ్య విద్వేషాగ్నులు రగిలినప్పుడిది. క్రాంవెల్‌ను బలపరచి సుఖాలు, కష్టాలు పడ్డకవి John Milton. అతడి Paradise Lost and Paradise regained అందరికి తెలిసినవే. అనిబద్ధ కవితా పిత – A verbal Wizadry జాన్ మిల్టన్.

John Dryden, John Wilmont కవయిత్రులైన Cavendish, Aphra Behn, Anne Frenchలు, ఆ తర్వాత అలేక్సాండర్ పోప్, లాలిత్యాల పతనకాలంలో Samuel Johnson ఇత్యాదులు బ్రిటన్ జాతీయ గీతాన్ని రచించిన James Thompson కాపీ కవిగా పేరుబడి (forgery) ఆత్మహత్య చేసుకున్న Thomas Chatterton. ఆ తర్వాత స్వర్గ నరకాలను ఆమె సంధానం చేసిన చిత్రశిల్ప కవి William Blake (ఈయనలో హాలిక కవి, భక్త కవి పోతన ఛాయలు కనిపిస్తాయి) ముఖ్యులు.

మరో హాలిక కవి Robert Burns. ప్రకృతి కవి William Words worth నల్లమందు మత్తులో అజరామజరమైన కవిత్వాన్ని అందించిన Coleridge. వీళ్ళతో కలిసి భూతల స్వర్గం స్థాపించాలనుకున్న (Utopia), Robert Southey మనకు శ్రీశ్రీ, తిలక్, నారాయణ రావులను గుర్తుకు తెస్తారు.

శేషేంద్ర శర్మ లాంటి Lord Byron లేక బైరన్‌లా శేషేంద్ర, P.B.Shelley (కృష్ణశాస్త్రి), John Keats (దాశరథి), Robert Browing (పానుగంటి), పందొమ్మిదవ శతాబ్దపు చీకటి వెలుగుల్లో తళుక్కుమన్న Tennyson (గురజాడ), నవలాకారిణి Emily Bronte (హేమలత), ముని కవి Mathew

Arnold(జాషువా), Rosetti, Swin Burne, Thomas Hardy లాంటి కవుల అనంతరం కవిత్వ కాల రథం కొత్త ప్రపంచంలోకి ప్రవేశించింది.

Bryant, Emerson, Long fellow, Edger Allen Poeల సమకాలీనులు వేమన, కాళోజి లాంటి Walt Whitman ఆత్రేయలా మనసు కవులు. Emily Dickson, Gerald Hopkins వచనమే ఎక్కువ రాసిన Rudyard Kipling మొదటి నోబెల్ బహుమతి పొందిన ఐర్లాండ్ కవి William Butler Yeats (సి.నారాయణ రెడ్డి). వీరితో ఆంగ్ల కవితా వనం రమణీయ పుష్పోద్యాన వనమై భాసిల్లింది.

అమెరికాలో E.A.Robinson, Robert Frost, Carl sandburg, Lindsay, ఇంగ్లాండ్‌లో Mase field, Lawrence అమెరికాలో స్టైలిస్ట్ కవులు. Ezra Pound, T.S.Eliotలు ప్రసిద్ధికెక్కారు. యాంత్రిక యుగ విజృంభణం ఇంగ్లాండ్, అమెరికాలు ప్రపంచాన్ని శాసించే స్థితికి చేరుకొని, అభివృద్ధి చెందిన దేశాలుగా మారినాయి.

రెండు ప్రపంచ యుద్ధాలు ప్రజలలో ఆందోళనలను పెంచాయి. అదే కవులలోనూ ప్రతిబింబించింది. యుద్ధ కవులు (war poets), శాంతి కవులు, దిగంబర కవులు, నిరంతర కవులు లాంటివాళ్ళు దాదాపు రెండు వందల మంది ప్రసిద్ధులయ్యారని (మనమనుకొంటున్నట్లే) అనుకున్నా, ఒక పదహారు మందిని తరువాతి తరాలు గుర్తుంచుకోవచ్చు. వారిలో Auden, Spender, Empson, Sitwell, Wilfred Owen, Graves, Wallace Sterns, Williams, Marianne Moore, Ranson, Conrad Aiken, Arch bald, Macleish, E.E.Cummings, Hart Crane, Robert Lowell, Dylan Thomasలు అగ్రగణ్యులు.

"పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" (Lives of the Poets) అనే గ్రంథాన్ని తెలుగులోకి తీసుకురావటం ఓ సాహసం, యజ్ఞం. ఎంతో పుణ్యం చేసుకున్న వారికే ఇటువంటి అదృష్టం లభిస్తుంది.

"యజ్ఞ దాన తప: కర్మ నత్యాజ్యం కార్య మేవ తత్ - యజ్ఞో జ్ఞానం తపశ్చైవ, పావనాని మనీషిణాం" అని భగవానుడు గీత 18-5లో వచించాడు.

శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారు ఈ మహా యజ్ఞాన్ని అద్భుతంగా నిర్వహించినారు.

మన తెలుగు కవులపై కూడా ఇటువంటి గ్రంథం రావాల్సి ఉన్న ఆవశ్యకతను గుర్తు చేయడానికే అక్కడక్కడా నేను పోలికలు వాడినాను. అవి నా దృక్కోణానికి పరిమితమైనవి.

ఈ గ్రంథం ద్వారా రచయిత శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారు, వారికి ప్రోత్సాహమిచ్చిన శ్రీ మైనేని గోపాలకృష్ణగారు, గ్రంధాన్ని అంకితమొందుతున్న డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహశర్మగారు ధన్యులైనారు. ఈ కొద్ది మాటలు వ్రాసి అవకాశమిచ్చినందుకు నేను వారికి సర్వదా కృతజ్ఞుడిని.

ఆంగ్ల కవిత్వాన్ని, కవి జీవితాన్ని సాదికారికంగా అర్థం చేసుకోడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుందని, తెలుగు భాషా ప్రియులు ఈ ప్రయత్నాన్ని విశేషంగా ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

“సర్వ స్తరతు దుర్గాణి సర్వో భద్రాణి పశ్యతు – సర్వ: సద్బుద్ధి మాప్నోతు సర్వ: సర్వత్ర నందతు”.

ఓం శాంతిః శాంతిః శాంతిః❀



## నేనొక కేటలిస్ట్ మాత్రమే

**- డా॥ రాచకొండ నరసింహ శర్మ, ఎం.డి**

"ఇతని హృదయమ్ము ఏదియో ఒక మంచి కార్యమ్ము సాధించ కలవరించు" - మా బావమరిది మైనేని గోపాలకృష్ణ(గారి)పై 2005లో రాసిన సీస పద్యంలోని పై పంక్తులు ఈ పుస్తక నిర్వహణలో ఆయన పాత్రను వ్యక్తపరుస్తాయి.

ఈ సంవత్సరం ఏప్రిల్ మూడవ వారంలో ఆయనతో (Hunts ville - Alabama, U.S.A) టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఒక సందర్భంలో "Louis Untermeyer" రాసిన "Lives of the poets" గొప్ప పుస్తకం ఆంగ్ల కవుల జీవిత చరిత్రలు తెలుసుకోవటానికి ఒక "golden mine" లాంటిదని, నా ఇంట్లో మంచి కాపీని మిత్రులకిచ్చేసి జిరాక్స్ కాపీ పెట్టుకొని చదవక వీకీపీడియా చూసి కాలం వృధా చేసుకొన్నాను అని అన్నాను. ఆ మాట ఆయన చెవిని పడిందో లేదో ఆ పుస్తకం కొని express mailలో ఉయ్యూరుకు పంపించేరు. ఎవరికో మీకు తెలుసు. ఇది ఈ పుస్తక ప్రచురణకు నాంది. ఆయన సాధించుటకు "కలవరించిన" మరొక మంచి కార్యం.

ఏప్రిల్ 30వ తేదీకు దుర్గాప్రసాద్‌గారికి పుస్తకం అందింది. మే మూడవ తారీకుకు అప్పుడే 150 పేజీలు చదివి, పుస్తకం చాలా ఆసక్తికరంగా ఉన్నదని,

అనువాదం చేస్తే బాగుంటుందని వెంటనే ఆ పని ఆరంభించారు. ఆయన మిగతా కార్యక్రమాలకు భంగం కలుగకుండా రోజుకు 10–15 పేజీలు చదువుతూ, జూన్ ఏడవ తేదీకు 750 పేజీల ఉద్గ్రంధాన్ని సంక్షిప్తీకరించి (కుదించి) 250 పేజీలు తెలుగులో సరళ సుందరమైన శైలితో జాతీయములతోనూ, నుడికారముతోను రసవంతంగా "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" అనే ఈ పుస్తకం పూర్తి చేసారు. ఇతర గ్రంధాలు కూడా చూసి కొన్ని చేర్పులూ మార్పులు చేసారు.

ఈ గ్రంథ రచయిత శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారు సరసభారతి అధ్యక్షులు. శేముషీ విశేష విభవ సంపన్నులు. అర్ధ సహస్రాధిక వ్యాసాలను రచించి ప్రామాణికమైన పత్రికలలో ప్రచురించినవారు. డెబ్బెది ఐదేండ్ల వయసులోనూ నిబ్బరముగా వైవిధ్య భరితమగు సాహితీ ప్రక్రియలను కొనసాగిస్తున్న గబ్బిట దుర్గాప్రసాద్ గారిని కొనియాడుటకు మనకు మాటలు చాలవు. ఎంత మేధావియో అంత నిగర్వి, నిరాడంబరులు. అకుంఠితమైన కార్యదీక్షలో వారికున్న బాధ్యత, నిబద్ధత, సత్వరత అపూర్వములు, అనన్య సాధ్యములు.

2008లో నేను అమెరికా వెళ్ళినప్పుడు వారు కూడా అక్కడ ఉండటం తటస్థ పడింది. అప్పటికి అచ్చయిన నా రెండు పుస్తకాలు కవితా సంకలనాలు వారికి పంపగా మరునాటికే సుదీర్ఘమైన విశ్లేషణతో ప్రోత్సాహకరమగు ప్రశంసా వాక్యాలతో వ్రాసి పంపించారు. నా ఆశ్చర్యానందములకు మేరలేదు. తరువాత ఈ ఎనిమిది సంవత్సరాలలో సరసభారతి ప్రచురణలన్నీ నాకు వారు పంపడం, నేను నా అసమర్ధత వల్ల వెంటనే స్పందించకపోవడం మామూలైపోయింది.

కవిగా, రచయితగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా వివిధ పాత్రలలో శతాధిక గ్రంథములను వెలువరించిన "లూయీ అంటర్ మేయర్" గురించి చర్చించిన ఈ సందర్భంలో, వారిని ఆరాధించిన నా మిత్రులు, గురుతుల్యులు కృష్ణాజిల్లా బందరు వాస్తవ్యులుగా ఉండిన శ్రీకోట సుందర రామశర్మగారు ద్వాదశ భాషా ప్రవీణులు జ్ఞాపకానికి వచ్చారు. వారు సంస్కృత ఆంధ్ర ఆంగ్లములలో పండిత ప్రకాండులు. "Return of the rambler" అని వారు రచించిన ఆంగ్ల కావ్యమును లూయీ అంటర్ మేయర్‌కు పీఠిక వ్రాయమని పంపారు. దురదృష్ట

వశమున 90 ఏళ్ళ వయసులో అంటర్ మేయర్‌గారు అస్వస్థగా ఉండి వారం దినములలో చనిపోయారు. పీఠిక రాలేదు. ఆ సందర్భంలో లూయీ అంటర్ మేయర్ గురించి "ఆయన చాలా గొప్పవాడు" అని మొదటి సారిగా విన్నాను. కోట సుందర రామశర్మగారు అయిదు లేక ఆరు సంవత్సరాల క్రిందట బందరులో వారు నిర్మించిన వృద్ధాశ్రమంలో స్వర్గస్థులైనారు. అమెరికాలో 20 సంవత్సరాలు ఉండి వారు ఆర్జించినదంతా వారి భార్య పేర "త్రిపుర సుందరీ సంస్థ" అను "చారిటబుల్ ట్రస్ట్" నెలకొల్పిన వితరణశీలురు. బందరు చేరువలో ఉన్న ఉయ్యూరులో శ్రీ కోటసుందర రామశర్మ గారిని ఈ సందర్భంలో సంస్మరించుట ఔచిత్యమే కదా.

2007లో నేను ప్రచురించిన "పడమటి సంధ్యారాగం"లోని మూల కవితలు కొన్ని (snow flakes, tiger tiger) మొదలైనవి 1971లో లూయీ అంటర్ మేయర్ ప్రచురించిన "Singing world"లోవే. ఆ తర్వాత Anthology of American verse, Anthology of British verse ఎక్కువగా వాడుతూ ఉండేవాడిని. వాటిలో కూడా కవుల యొక్క జీవిత చరిత్రలు ఒకటి రెండు పేజీలు పొందుపరచేవాడు. "Lives of the Poets" నా వద్ద అయిదేళ్ళు ఉండి 100 పేజీల కన్నా చదవలేదు. రెండు నెలలో దుర్గాప్రసాద్‌గారు మొదటిసారిగా చదివి, జీర్ణించుకుని, కుదించి తెలుగులో అనువదించారంటే వారి ప్రతిభా వ్యుత్పత్తులకు మరొక నిదర్శనం మాత్రమే.

ఈ గ్రంథ రాజమునకు పీఠిక వ్రాసిన డా. లంకా శివరామప్రసాద్ గారు "వయసున పిన్నయైన శేయుషీ విశేషమున మిన్న". అమూల్యమైన స్వీయ రచనలే కాక, అర్ధ శత సమీప ద్విభాషానువాదములు అనితర సాధ్యములు. భాగవతాది పురాణములను ఆంగ్లములో అనువదించుటమే కాక, ఇతః పూర్వం తెలుగులో అనువదింపబడని ఆంగ్ల క్లాసిక్స్‌ను ఎన్నిటినో అనువదించి తెలుగు పాఠకులను వారు ఋణగ్రస్తులను గావించిరి. వృత్తిరీత్యా వారు హృదయ (శస్త్ర) వైద్యులని తెలుసుకున్నప్పుడు మన ఆశ్చర్యమునకు మేర యుండదు.

"పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" అను ఈ గ్రంథం నేను అంకితం

పొందటంలో "ఇద్దరు ప్రసాదు"గార్లతో నా పేరు కూడా శాశ్వతంగా ముడిపడి ఉండటం నా పూర్వజన్మ లేక పూర్వీకుల సుకృతంగా భావిస్తున్నాను. దుర్గాప్రసాద్‌గారికి నాపై ఉన్న అవ్యాజాను రాగమే కారణముగా భావిస్తున్నాను. వారికి నా హృదయ పూర్వక అభినందనలు, శుభాశీస్సులు.

తెలుగు పాఠకులకు వినోదముతోపాటు విజ్ఞానము, మానసిక వికాసము, విశాల దృష్టి, ఆధ్యాత్మిక చింతన కలిగించు అమూల్య గ్రంథములు మునుపటి వలె వెలయించునట్లు శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారిని సర్వేశ్వరుడు ఆయురారోగ్య భాగ్య పరంపరాభివృద్ధి ప్రసాదించి కాపాడుగాక అని ప్రార్థిస్తూ ఈ వ్యాసమున ముగిస్తున్నాను. ❁

# సాహిత్యమే శ్వాసగా జీవించిన లూయిా అంటర్ మేయర్



శతాధిక గ్రంధకర్త లూయిా అంటర్ మేయర్ అమెరికా కవి, జీవిత చరిత్రకారుదు, అగ్రశ్రేణి విమర్శకుడు, పత్రికా సంపాదకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి. అమెరికా ప్రభుత్వ పద్నాలుగవ ఆస్థాన కవి. వెయ్యేళ్ళ ఆంగ్ల కవిత్వంలో కవిత్వాన్ని మలుపు తిప్పిన ఇంగ్లాండ్, అమెరికన్ కవుల గురించి, సంఘటనల గురించి అత్యద్భుతమైన "లైవ్స్ ఆఫ్ ది పోయెట్స్" అనే మహా గ్రంథాన్ని 1959లో రాశాడు. భావుకత ఉన్న కవి. ఫస్ట్ లవ్ ఫ్రెంచ్, చాలెంజ్ సెంచరి, వన్ అండ్ వన్ మొదలైన ఇరవైకి పైగా కవితా సంపుటాలను, 'ఫ్రం అనదర్ వరల్డ్', 'బైగాన్స్' అనే స్వీయ చరిత్రలను రాసుకున్నాడు. ప్లె ఇన్ పోయెట్రీ, ది లోఎస్ట్ ఫారం ఆఫ్ విట్, ది పర్సూట్ ఆఫ్ పోయెట్రీ మొదలైన ఆరు వ్యాస సంపుటాలు రాసి ప్రచురించాడు. మోజెస్ నవల, ది డాగ్ ఆఫ్ పంపే మున్నగు ఏడు కాల్పనిక సాహిత్య పుస్తకాలు రాసి పాఠకులకు చేరువయ్యాడు. ట్రెజరీ ఆఫ్ గ్రేట్ పోయెమ్స్, మోడరన్ అమెరికన్ పోయెట్రీ, మోడరన్ బ్రిటిష్ పోయెట్రీ, న్యూ సాంగ్స్ ఫర్ న్యు వాయిసెస్, గెలాక్సీ ఆఫ్ వేర్స్, ట్రెజరీ ఆఫ్ లాఫ్టర్, ఆంతాలజి ఆఫ్ న్యూ ఇంగ్లాండ్ బెస్ట్ పోయెట్స్, హ్యూమర్ యాన్యువల్, ది గోల్డెన్ బుక్ ఆఫ్ పోయెమ్స్ ఫర్ ది వెరీ యంగ్ మొదలైన ముప్పైకి పైగా జీవిత చరిత్రలను రాసి వెలుగులు ప్రసరింపజేశాడు. వండర్‌ఫుల్ అడ్వెంచర్స్ ఆఫ్ పాల్ బన్యన్, ఈసప్స్ ఫేబుల్స్, వరల్డ్స్ గ్రేట్ స్టోరీస్ మొదలైన అనువాద గ్రంథాలను డజనుకు పైగా వెలువరించాడు. బాల సాహిత్యాన్నీ సుసంపన్నం చేశాడు.

1885 అక్టోబర్ ఒకటిన న్యూయార్క్‌లో జన్మించిన మేయర్ ఒక జామెట్రీ లెక్క చెయ్యలేకపోయినందుకు గ్రాడ్యుయేట్ కాలేకపోయాడు. ఇరవై ఏళ్ళు తీవ్ర కృషి చేసి సాహిత్య సంస్కృతులను స్వయంగా అభ్యసించి, ఏ యూనివర్సిటీలో చదివిన దానికంటే అధిక జ్ఞానాన్ని సంపాదించుకున్నాడు. ఇంగ్లాండ్ వెళ్లి కొంతకాలం ఉండి, ఆస్ట్రియా, ఇటలీలు చూసి అమెరికాకు తిరిగి వచ్చి రచనా వ్యాసంగంలోను, సాహిత్యోపన్యాసాలతోనూ, వ్యవసాయంతోనూ కాలం గడిపాడు. అనేక యూనివర్సిటీలలో "పోయెట్ ఇన్ రెసిడెన్స్"గా గౌరవం పొందాడు. యుద్ధ సమాచార రచయితగా, ఆర్మడ్ సర్వీసెస్ ఎడిషన్‌లకు సంపాదకుడిగా, తర్వాత ప్రముఖ టి.వి.చానెల్‌లో ముఖ్య ప్రోగ్రామర్‌గా పనిచేశాడు. అమెరికా లైబ్రరి ఆఫ్ కాంగ్రెస్‌కు ఇంగ్లీష్ కవిత్వంలో కన్సల్టంట్‌గా వ్యవహరించాడు. అతని "మోసెస్" నవల చాలా ప్రసిద్ధమైంది. అతని ఉద్గ్రంధాలన్ని అనేక ప్రచురణలు పొంది ప్రాచుర్యం పొందాయి. 1977 డిసెంబర్ 18న 92వ ఏట మేయర్ మరణించాడు. ఆంగ్ల సాహిత్యంలో అంటర్ మేయర్ మేజర్ పాత్రనే నిర్వహించాడు. లూయీ అంటర్ మేయర్ రాసిన ఇప్పటికీ కరదీపికగా ఉన్న "లైవ్స్ ఆఫ్ ది పోయెట్స్" గ్రంథం ముఖ్య భూమికగా తీసుకుని, అనేక విషయాలు జోడించి, అందరూ హాయిగా చదువుకునే వీలుగా ''పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు''ను యువతరానికి స్ఫూర్తిదాయకంగా రాసి పూర్వ ఆంగ్ల కవిత్వాన్ని వారికి చేరువగా తెచ్చే ప్రయత్నం చేశాను. సాహిత్యాభిమానులందరూ ఆదరిస్తారని భావిస్తాను. ఆంగ్ల కవితా సాగరాన్ని అవలీలగా మధించి అందులోని అనర్ఘ మణులను వెలికి తీసి సాహితీ లోకానికి అందజేసిన సాహితీ పిపాసి లూయీ అంటర్ మేయర్‌కు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.❋

**– గబ్బిట దుర్గాప్రసాద్**



# కృతజ్ఞతలు

**"పూ**ర్వాంగ్ల కవుల ముచ్చట్లు" గ్రంధాన్ని రాయటానికి నన్ను ప్రోత్సహించి, రాస్తున్నవి బాగున్నాయని అభినందిస్తూ, పుస్తక ముద్రణ ఖర్చును పూర్తిగా భరించి సరసభారతి సాహితీ కార్యక్రమాలకు ప్రేరణ, స్ఫూర్తినిస్తున్న ఆత్మీయులు **శ్రీ మైనేని గోపాలకృష్ణగారికి,** ఈ పుస్తకాన్ని అంకితం పొందటానికి పెద్ద మనసుతో అంగీకరించిన కవి, రచయిత, వితరణశీలి, సరసభారతి ప్రోత్సాహకులు **డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహ శర్మ ఎం.డిగారికి,** అంకిత మహోత్సవానికి శ్రీ శర్మగారి తరఫున హాజరైన **శ్రీ రాచకొండ లక్ష్మీనరసింహప్రసాద్** (శ్రీ రావిశాస్త్రిగారి కుమారులు)గారికి, క్షణం తీరికలేని వైద్యవృత్తిలో ఉంటూ, అనేక గ్రంధాలను రాసిన ఆంధ్రాంగ్ల సంస్కృత సాహితీ సంపన్నులు మేము కోరిన వెంటనే మన్నించి ఈ గ్రంధానికి ముందుమాటగా "కీర్తి చంద్రికలు" పేరిట సమీక్ష రాసిన ప్రముఖ వైద్యులు **శ్రీ లంకా శివరామ ప్రసాద్‌గారికి,** ఈ గ్రంధాన్ని తమ అమృత హస్తాలతో ఆవిష్కరిస్తున్న శాసన మండలి మాజీ సభ్యులు **శ్రీ యలమమంచిలి వెంకట బాబూ రాజేంద్ర ప్రసాద్‌గారికి,** కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు **శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారికి,** ముఖ్య కార్యదర్శి డా॥ జి.వి.పూర్ణచంద్ గారికి, రమ్యభారతి త్రైమాసపత్రిక సంపాదకులు శ్రీ చలపాక ప్రకాష్ గారికి, ఈ కార్యక్రమాన్ని తమ కళాశాలలో విద్యార్ధుల సమక్షంలో నిర్వహించటానికి అనుమతించి తామూ భాగస్వాములైన ఎ.జి అండ్ ఎస్.జి. సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ **శ్రీ కొడాలి సత్యనారాయణ గారికి** వారి కన్వీనర్ **శ్రీ తాతినేని శ్రీహరిరావు గారికి, అధ్యాపక**

**అధ్యాపకేతర బృందానికి, కళాశాల యాజమాన్యానికి, విద్యార్థినీ విద్యార్థులకు కృతజ్ఞతలు...**

ఈ గ్రంథాన్ని ఇంత ముచ్చగా ముద్రించటానికి మా బాధ్యతను తానే స్వీకరించి అహరహరం కృషి చేసిన శ్రీ చలపాక ప్రకాష్ గారికి వారి బృందానికి కృతజ్ఞతలు...

"పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" గ్రంధ రచనకు తోడ్పడిన గ్రంథాలు

1. Louis Untermeyer రాసిన Lives of the Poets
2. Encyclopedia of Literature - Edited by Joseph T. Shiplay
3. ఇంగ్లీష్ వీకీపీడియా
4. Encyclopedia Britannica

మొదలైనవి

అంతర్జాలంలో రాసిన పుస్తక శీర్షికతో రాసిన యాభై అయిదు భాగాలను చదివి ప్రోత్సహించిన సాహిత్యాభిమానులకు కృతజ్ఞతలు. మేయర్ గ్రంధాన్ని ఆధారంగానే ఈ పుస్తకాన్ని రాసినా అందులో లేని ఎన్నో విషయాలను, ఆయా కవుల ప్రత్యేకతలను మిగిలిన వాటి నుండి గ్రహించి తగిన శీర్షికను పెట్టి వారి ప్రత్యేకతను తెలియజేశాను. ఆ కవుల మరణానంతరం వారిపై జరిగిన పరిశోధనలను, వివిధ దేశాలు వారిని గుర్తుంచుకోవటానికి నిర్వహించిన కార్యక్రమాలను కూడా పొందుపరచాను. సాహిత్యాభిమానంతోనే కాక సరదాగా కూడా చదువుకోవటానికి వీలుగా, ఆకర్షణీయంగా ఉండటానికి "ముచ్చట్లు" అన్నాను.

సరసభారతి గౌరవాధ్యక్షులు **శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి** గారికి, కార్యదర్శి **శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి**కి, కోశాధికారి **జి.వి.రమణ**కు మిగిలిన కార్యవర్గ సభ్యులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను.

**– గబ్బిట దుర్గాప్రసాద్**

అధ్యక్షులు – సరసభారతి

సాహిత్య సాంస్కృతిక సంస్థ – ఉయ్యూరు

# ఇదీ ముచ్చట్ల తీరు

1. పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు 1) జియోఫ్రీ చాసర్ ............33
2. " " జియోఫ్రీ చాసర్ -2 ............37
3. - 2) పెరల్ పోయెట్ - విలియం లాంగ్లాండ్ ............39
- 3) జాన్ గోవర్
- 4) థామస్ హాక్లీవ్
- 5) జాన్ లిడ్ గేట్
4. - 6) దన్బార్ ............42
- 7) రాబర్ట్ హెన్రిసన్
- 8) రాజ కవి- మొదటి జేమ్స్
5. సృజన సూర్యోదయం- 9) ప్రజాస్థాన కవి- జాన్ స్కెల్టన్ ............46
6. - 10) థామస్ వ్యాట్ ............49
- 11) బ్లాంక్ వేర్స్‌కు ఆద్యుడు- హెన్రి హూవార్డ్- ఎరల్ ఆఫ్ రోచెస్టర్
7.- 12) సర్ వాల్టర్ రాలీ - సాహస నౌకా యాత్రికుడు ............52
- 13) కవులకు కవి- ఎడ్మండ్ స్పెన్సర్
8. - 14) మనసున్న రాజ కవి- సర్ ఫిలిప్ సిడ్నీ ............56
15) సామ్యుల్ డేనియల్
16) ఊహా ప్రేమ లేఖల కవి- మైకేల్ డేట్రన్
9. - 17)కవితాశక్తి జలపాతం - క్రిస్టఫర్ మార్లో ............59
10.-18) ఆంగ్ల నాటక పితామహుడు - విలియం షేక్స్పియర్............62
11. ఆంగ్ల నాటక పితామహుడు - విలియం షేక్స్పియర్ - 2............64
12. ఆంగ్ల నాటక పితామహుడు - విలియం షేక్స్పియర్ - 3............68
13. తళుకుల యుగం-19) మొట్టమొదటి రాజస్థాన కవి- బెన్ జాన్సన్..71
14. - 20) యువ బాలుడు, కరపత్ర సవ్యసాచి - థామస్ నాషె ..........74
21) పెళ్ళి చావు పాటల కవి- డాక్టర్ థామస్ కాంపి యాన్
22) ఫ్రాన్సిస్ బీమాంట్
23) జాన్ ఫ్లెచర్
15. - 24) జాన్ డోన్నే ............78
16. - పునర్వైభవం తర్వాత 25) హోలీ జార్జి హెర్బర్ట్ .............82

17. - 26) రిచార్డ్ క్రాషా ............85
27) అబ్రహాం కౌలీ
18.- 28) టెన్నిసన్‌కు మార్గదర్శి - హెన్రి వాన్ ............88
29) వర్డ్స్ వర్త్‌కు ప్రేరణ- థామస్ ట్రహర్నే
19. పవిత్రులు - రంధ్రాన్వేషకులు 30) ఆండ్రూ మార్వెల్ ............91
20.- 31) కొంటె కవి - రాబర్ట్ హీర్రిక్ ............94
32) థామస్ కారే
33) హీరోయిక్ కప్లేట్ కవి- ఎడ్మండ్ వాలెస్
34) క్రిబ్బేజ్ ఆట కనిపెట్టిన - జాన్ సక్లింగ్
35) రిచార్డ్ లవ్ లేస్
21.-36) చీకటితో(లో) వెలుగు - జాన్ మిల్టన్ ............99
22. స్వేచ్ఛా స్వాతంత్ర్య పిపాసి- జాన్ మిల్టన్ -2 ...........104
23. హేతువాద యుగం - 37) జాన్ డ్రైడేన్ ...........109
24. చమత్కార ప్రపంచం -
38) సెటైర్ వజ్రం- ఎరల్ ఆఫ్ రోచెస్టర్- జాన్ విల్మాంట్...........113
25. - 39) డచెస్ ఆఫ్ న్యూ కాజిల్ - అందాల రాశి -
స్త్రీవాద రచయిత్రి - మార్గరెట్ లూకాస్ కేవండిష్ ...........116
40) గూఢచారి కవి- అఫ్రా బెన్
41) అన్నే ఫించ్
42) చార్లెస్ సిడ్నీ
43) షార్ట్ హాండ్ పిత- జాన్ బిరాం
44) జాన్ గే
45) జోనాథన్ స్విఫ్ట్
46) మాథ్యూ ప్రయర్
26.-47) పొట్టివాడైనా గట్టివాడు -
అనధికార ఆస్థానకవి - అలేక్సాండర్ పోప్ ...........122
27. సొగసు, లాలిత్యాల పతనం -
48) సాహిత్య షరాబు- నిఘంటు నిర్మాత- సామ్యుల్ జాన్సన్ ......126
49) వ్యంగ్య కవి- చార్లెస్ చర్చిల్
50) జాన్ గ్రీన్
51) ఉన్ని కవి- జాన్ డయ్యర్ వేల్స్

52) జాతీయ కవి - జేమ్స్ థాంసన్
28. -53)విలియం కాలిన్స్ ...........131
54) విలియం కూపర్
55) బీద డాక్టర్ కవి- జార్జి క్రేబిల్
56) ఆస్థాన హోదాను తిరస్కరించిన- థామస్ గ్రే
29.-57) ఆలివర్ గోల్డ్‌స్మిత్ ...........135
58) క్రిస్టఫర్ స్మార్ట్
59) థామస్ చాటర్టన్
30.- 60) స్వర్గ నరకాల పరిణయం, చిత్ర శిల్ప కవి - విలియం బ్లేక్ ...140
31.- 61) హాలిక కవి - రాబర్ట్ బర్న్స్ ...........145
32. అంతమైన స్వప్నం 62) ప్రకృతి కవి- విలియం వర్డ్స్ వర్త్.........149
63) సామ్యుల్ టైలర్ కాల్ రిడ్జ్
64) రాబర్ట్ సూతీ
33. పై ముగ్గురు కవుల ముచ్చట్లు ...........155
34. చిత్ర విచిత్రాలకు ప్రేరణ
65) వాల్టర్ సావేజ్ లాండర్ ...........160
66) జాన్ క్లేర్
67) థామస్ లోవెల్ బెడ్డోస్
35.-68) రొమాంటిసిజం ప్రేరకుడు- జార్జి గార్డన్ లార్డ్ బైరన్...........165
36. రొమాంటిసిజంకు ప్రేరకుడు - లార్డ్ బైరన్ - 2 ...........169
37. - 69) వాస్తవంపై తిరుగుబాటు - పెర్సీబిషి షెల్లీ ...........174
38. శోకకవి - కవి అనధికార శాసనకర్త అన్న -
పెర్సీబిషి షెల్లీ - 2 (చివరి భాగం) ...........178
39.-70) క్లాసికల్ స్కాలర్ - జాన్‌కీట్స్ ...........183
40. విక్టోరియా కాలపు ప్రేమకథలు -
71) మోనో లోగ్స్ సిద్ధహస్తుడు - రాబర్ట్ బ్రౌనింగ్ ...........188
41. పందొమ్మిదవ శతాబ్దం - చీకటి వెలుగులు-
72) లఘు కవితలతో మేటి అయిన ఆస్థాన కవి-ఆల్ఫ్రెడ్ ...........192
42.-73) విదరింగ్ హైట్స్ నవలాకారిణి - ఎమిలి బ్రాంట్ ...........196
74) ఫ్లారెన్స్ నైటింగేల్‌కు సెక్రటరి- ఆర్థర్ హూగ్ క్లగ్
75) ముని కవి- మాథ్యూ ఆర్నోల్డ్

76) కోవెంట్రీ పాట్ మోర్
77) కవి, చిత్రకారుడు- డాంటే గేబ్రియల్ రోసేట్టి
43.- 78) క్రిస్మస్ గీత రచయిత్రి - క్రిస్టినా రోసెట్టి ...........201
79) ఎడ్గార్ అలెన్ పో తో సాటి- ఆల్గేర్నాన్ చార్లెస్ స్విన్ బర్న్
80) విక్టోరియన్ రియలిస్ట్- థామస్ హార్డీ
44. అమెరికా కవులు ...........205
81) అమెరికా కవిత్వ జనకుడు- విలియం కల్లెన్ బ్రయాంట్
82) వ్యక్తిత్వ వికాస కవి- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్
83) బానిసత్వ వ్యతిరేక కవి- జాన్ గ్రీన్‌లీఫ్ విట్టర్
84) హెన్రి వాడ్స్ వర్త్ లాంగ్ ఫెలో
45.- 85) మానవీయ కవి - జేమ్స్ రస్సెల్ లోవెల్ ...........211
86) అన్ని ప్రక్రియలకు ఆద్యుడు- ఎడ్గార్ అలెన్ పో
46.- 87) సామాన్యుడిని కవిత్వంలో మాన్యుడిని చేసిన
జాతీయ కవి - వాల్ట్ విట్మన్ ...........214
88) కవిత్వంలో ఆత్మాన్వేషణ చేసిన- ఎమిలీ డికెన్సన్
89) స్ప్రుంగ్ రిధంను ప్రవేశపెట్టిన - జేరాల్డ్ మాన్లి హాప్కిన్స్
47.- 90) ఫ్రాన్సిస్ థామ్సన్ ...........224
91) ఏ.ఇ.హౌస్మన్
92) జంగిల్ బుక్ రచయిత- రుడ్యార్డ్ కిప్లింగ్
93) మొదటి నోబెల్ బహుమతి పొందిన ఐర్లాండ్ కవి-
విలియం బట్లర్ యేట్స్
48. అమెరికాలో కొత్త ధోరణులు ...........231
94) సానెట్లకు సానబెట్టిన- ఎడ్విన్ ఆర్లింగ్‌టన్ రాబిన్‌సన్
95) అమెరిక వ్యావహారిక భాషా కవి- రాబర్ట్ ఫ్రాస్ట్
49.-96) నేషనల్ బార్డ్ - కారల్ శాండ్ బర్గ్ ...........236
97) ప్రయరి ట్రూబ డోర్- వాచల్ లిండ్ సే
98) పర్యావరణ ఉద్యమ సారధి- రాబిన్సన్ జెఫర్స్
99) అమెరికన్ మహిళా బైరన్ - ఎడ్నా సెంట్ విన్సెంట్ మిల్లె
50. ఇంగ్లాండ్ ధోరణులు, జార్జియన్ కవిత్వం ...........241
100) వీధి కవి- డబ్ల్యు.హెచ్.డేవీస్
101) రాల్ఫ్ హాడ్గ సన్

102) సూపర్ నేచురల్ కవి- వాల్టర్ డీ లా మేర్
103) ఎమిలీ బ్రాంట్‌కు ప్రతిరూపమే - షార్లెట్ మ్యు
104) ఆస్థాన కవి- జాన్ మాన్స్ ఫీల్డ్
51.- 105) ఆధునిక విపరీత ధోరణులపై కలం కత్తి దూసిన
- డి. హెచ్. లారెన్స్ ...........247
52. ఊసర క్షేత్రాలు ...........252
106) ఇమేజిస్ట్ కవి- ఎజ్రా పౌండ్
107) ఆధునిక కవిత్వ మార్గదర్శి- టి.ఎస్.ఇలియట్
53. ఆందోళన కాలం ...........259
108) వామభావ కవి- డబ్ల్యు.హెచ్.ఆడెన్
109) సాంఘిక న్యాయం కోసం పోరాడిన కవి- స్టీఫెన్ స్పెండర్
110) కొత్త విమర్శకు మార్గం వేసిన- విలియం ఎంప్సన్
111) జాజ్ సంగీతానికి దారి వేసిన- ఎడిత్ సిట్వేల్
112) ప్రయోగశీలి- విల్ఫ్రెడ్ ఓవెన్
113) ఇండివిద్యువలిస్ట్ కవి- రాబర్ట్ గ్రేవ్స్
114) మోడర్నిస్ట్ కవి- వాలెస్ స్టివెన్స్
54.-115) ఆధునికతకు ప్రతీకను జోడించిన కవి
- విలియం కార్లోస్ విలియమ్స్ ...........267
116) ఐరనీ విట్‌ల కవి- మరియాన్ మూర్
117) వ్యవసాయాధారిత పారిశ్రామిక విప్లవం కోరిన కవి-
జాన్‌క్రూ రాన్సం (ప్యూజిటివ్ విప్లవ కవి)
55.-118) సవన్నా కవి- కాన్రాడ్ ఐకెన్
119) మొదటి లైబ్రేరియన్ కాంగ్రెస్ కవి- ఆర్చిబాల్డ్ మెక్లీష్.........271
56.-120) టైపోగ్రాఫిక్ స్టైలిస్ట్ - ఇ.ఇ. కమింగ్స్ ...........274
121) కంప్రెస్సెడ్ మెటఫర్ కవి- హార్ట్ క్రేన్
122) ఎలిప్టికల్ కవి- రాబర్ట్ లోవెల్
123) నియో రొమెంటిక్ కవి- డైలాన్ థామస్



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు-1

# 1. జియోఫ్రీ చాసర్

## ఈ రచనకు నేపథ్యం

**నా** అమెరికా మిత్రులు శ్రీ మైనేని గోపాలకృష్ణగారు, విశాఖలో ఉన్న వారి బావగారు డా.శ్రీ రాచకొండ నరసింహ శర్మగారితో ఫోన్‌లో మాట్లాడుతుండగా "లైవ్స్ ఆఫ్ ది పోయెట్స్॥ పుస్తకం విషయం వచ్చి వెంటనే ఆ పుస్తకం దుర్గాప్రసాద్‌గారు చదవాల్సిందే అని నిర్ణయించి, ఆ వెంటనే ఆర్డర్ ఇచ్చి, యాభై అయిదేళ్ళ క్రితం ప్రచురించబడిన ఆ పుస్తకాన్ని ఆన్‌లైన్‌లో "మూడు డాలర్లకు" కొని, "పద్దెనిమిది డాలర్లు" షిప్పింగ్ చార్జీ చెల్లించి, నాకు పంపుతున్నట్లు తెలియజేశారు. అది నాకు ఏప్రిల్ 25న చేరింది. ఇంత అభిమానంతో పంపిన పుస్తకాన్ని వెంటనే చదవాలనిపించి మెదలెట్టేశాను. అప్పటికే ఆయన పంపిన పుస్తకం ఒకటి ఇంకా చదవటం మెదలెట్ట లేదు. ఇంకో పుస్తకాన్ని కూడా అప్పటికే పంపే ఏర్పాటూ చేశారు. ఈ మధ్య మిత్రులు సన్నిహితులూ పంపిన పుస్తకాలు నాకోసం బీరువాలో ఎదురు చూస్తూనే ఉన్నాయి...

కాని ఈ పుస్తకాన్ని దాదాపు నాన్‌స్టాప్‌గా చదువుతూ ఆయనకు ఎప్పటికప్పుడు నా ప్రోగ్రెస్ తెలుపుతూ దీని ఆధారంగా "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" రాయాలనిపిస్తోందని మెయిల్ రాశాను. ఆయన వెంటనే మెయిల్ చదివి "శుభస్య శీఘ్రం" అన్నారు. నా ప్రోగ్రెస్

రిపోర్ట్‌కు సద్యోస్పందన తెలుపుతూనే ఉన్నారు అనారోగ్యంలో ఉండి కూడా. ఈ కవుల గురించి అందరికి వీలైనంత త్వరలో తెలియజేయమని ఒక రకంగా "హుకుం" లాంటి అభ్యర్థన చేశారు నాకు. నేను "చూద్దాం" అంటున్నా. ఇప్పటికి నేను 720 పేజీల పుస్తకంలో చదివింది కేవలం 300 పేజీలు మాత్రమే. కాని దానిపై ఒక ఫాసినేషన్ కలిగింది. ఇవాళ అక్షయ తృతీయ. ఇప్పుడే ఇంటి దగ్గర తెలిసిన వారి కుమారుని ఉపనయనానికి ఆహ్వానిస్తే వెళ్ళి, అక్షతలేసి వచ్చి ఈరోజు మంచిదే కనుక మొదలెడదాం అనుకోని రాయటం ప్రారంభించాను. ఈ పుస్తక రచయిత "లూయీ అంటర్ మేయర్" చాలా చక్కగా పుస్తకాన్ని రాశాడు. తనకు ముందు రాసిన వారిని ఉదాహరిస్తూ తన భావాలను తెలుపుకొంటూ, ఏ కవినీ తేలిగ్గా తీసుకోకుండా దాదాపు వెయ్యేళ్ళ ఇంగ్లాండ్, అమెరికా సాహిత్యంలోని కవుల విశేషాలు, కవితా రీతులు, అన్నీ వివరించాడు. చాలా బాగా చదివిస్తోంది నన్ను ఈ పుస్తకం. ఇందులో నాకు అర్థమైనదీ, నాకు తెలిసిందీ, అవసరమైనదీ, కవిత్వపు పోకడలు, వారి జీవితాలలో వెలుగు నీడలు, ఉత్థాన పతనాలు, విశృంఖలత, "కేరే ఝూట్ తత్వం", మంచి చెప్పినా దిగజారిన వైనం, కోలుకోలేని స్థితి అన్నీ రాయటానికి ప్రయత్నం చేస్తున్నా. నాకు ప్రేరణనిచ్చి నాతో పుస్తకం చదివించి దీనిపై స్పందించి రాస్తే అందరికీ విషయాలు అందుతాయని ప్రోత్సహించిన శ్రీ మైనేని గోపాలకృష్ణగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇదీ ఈ రచనకు నేపధ్యం. దీనిని ఆయన బావగారు డా. శ్రీ రాచకొండ నరసింహశర్మగారికి అంకితమిస్తున్నాను. ఈ పుస్తక ప్రచురణ బాధ్యత తనదేనని శ్రీ మైనేని వెంటనే తెలియజేశారు. సరేనన్నాను.

## ఆంగ్ల కవిత్వ పిత - జియోఫ్రీ ఛాసర్

ఆంగ్ల కవిత్వానికి జనకుడు, ఆ కవిత్వానికి యువరాజు చాసర్. మానవ జీవిత హాస్య స్ఫోరక జీవితానికి అద్దం పట్టాడు. చాసర్ మహాకవికి ముందు ఆంగ్ల సాహిత్యంలో "మానవుడుకి" స్థానమే లేదు. ఆయన రాసిన "కాంటర్ బరీ కథలు"లో మనిషి పురుడు పోసుకొన్నాడు. మానవ సహజమైన అన్ని ఎమోషన్లను ఆవిష్కరించాడు. మనుషులు గొప్పదనం, తప్పొప్పులు, సహజ విధానం, జీవిత సాహిత్యంలో మొదటిసారిగా చాసర్ వలననే స్థానం పొందాయి. మనుషులలోని వైవిధ్యాన్ని గొప్పగా ప్రదర్శించాడు. చాసర్‌కు ముందెవరూ ఇంతటి సునిశిత పరిశీలన చేయలేదు. ఆ తర్వాత ఎవరో కొద్దిమంది కవులు మాత్రమే ఆ మార్గంలో కదిలారు. ప్రేమ, శృంగారం వాటిలోని అతిని, చక్కగా పాత్రల ద్వారా చిత్రీకరించాడు. ఆరు వందల ఏళ్ళు అయినా ఆ పాత్రలు జీవంతో తొణికిసలాడుతున్నాయి. చాసర్‌కు మనుషుల బాహ్యా అంతరంగాలు క్షుణ్ణంగా తెలుసు. అందుకే అతన్ని "ఉత్రేకం" అంటే కేటలిస్ట్ అన్నారు. అంతకు ముందున్న వందేళ్ళ సాహిత్యాన్ని అర్థం చేసుకొన్నాడు చాసర్.

**జీవిత విశేషాలు**

ఒక రకంగా చాసర్ విప్లవమే లేవదీశాడు సాహిత్యంలో. కొత్త విధానాలు, కొత్త ఆలోచనలు, కొత్త సాంఘిక ప్రమాణాలు అన్ని రంగాల్లోనూ వచ్చాయి. మనుషులు మాట్లాడే సాధారణ భాష కూడా మార్పు చెందింది. ఆంగ్ల సాహిత్యం సరళం అయింది. సజీవ భాషకు చోటు కలిగింది. నిజాన్ని నమ్మే స్థితిని కవిత్వంలో చాసర్ కల్పించాడు. 1340లో ఇంగ్లాండ్‌లో చాసర్ పుట్టాడు. వీరి కుటుంబం ఫ్రెంచ్ షూ మేకర్ కుటుంబం. అందుకే వీరికి చాసర్ పేరు వచ్చింది. కాని చాసర్ తండ్రీ, తాత రొట్టెల పరిశ్రమ నడిపినవారు. సెయింట్ మార్టిన్‌లో ఉండేవారు. తండ్రి రాజుకు డిప్యూటీ బట్లర్‌గా ఉన్నాడు. తల్లి కూడా అక్కడే పని చేసేది. ఆమె బంధువు రాయల్ మింట్‌లో ఉద్యోగి. మొత్తంమీద చాసర్‌ది మధ్య తరగతి కుటుంబం. చాసర్‌కు చిన్నప్పుడే ఖగోళ శాస్త్రంపై మక్కువ కలిగింది. ఎనిమిదేళ్ళ వయసున్నప్పుడు ఇంగ్లాండ్‌లో బుబోనిక్ ప్లేగువాధి ప్రబలి మూడోవంతు జనం చనిపోయారు. దీనినే "బ్లాక్ డెత్" అంటారు. చాసర్ కుటుంబం లండన్ వదిలి "సౌత్ అంప్టన్" చేరింది. రెండేళ్ళ తర్వాత లండన్‌కు తిరిగి వచ్చేశారు. డచేస్ కోర్టులో ఉద్యోగం వచ్చింది. కాండిల్స్ మోయటం, అతిథులకు దీపాలు చూపించటం, ఉత్సవాలలో గాయకులకు సదుపాయాలు చూడటం చేసే పని అది.

పందొమ్మిదేళ్ళ వయసులో యుద్ధ సైనికుడయ్యాడు. అప్పుడు ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌తో వందేళ్ళ యుద్ధం ప్రారంభించింది. యుద్ధ ఖైదీ అయ్యాడు చాసర్. పదహారు పౌండుల "రాన్సం"తో బయటపడ్డాడు. దీన్ని రాజుగారి వార్డ్ రోబ్ చెల్లించాడు. ఇంగ్లాండ్ చేరుకోగానే రాజ కుటుంబంలో సభ్యుడైనాడు. తర్వాత "వాలెట్"గా ప్రొమోషన్ పొందాడు. ఇప్పుడు రాజు అతన్ని "అవర్ డియర్ వాలెట్" అని గౌరవంగా పిలిచేవాడు. ముప్ఫై ఏళ్ళ వయసులో పెళ్లి చేసుకొన్నాడు. భార్య రాణీగారి అంతరంగిక సఖి. తర్వాత రెండు పెళ్ళిళ్ళు చేసుకొన్నాడు. చాసర్ కాలం నాటి మగాళ్ళకు "హెన్ పెక్కేడ్ హస్బండ్స్" అనే పేరు. భార్య చేతిలో పరాభవం హింసా దెబ్బలు తినటం ఆ నాడు మామూలే. చాసర్ దృష్టిలో "పెళ్ళి, ప్రేమ ఒకే మంచం మీద వికసిస్తాయి". ఈ భావాలు "డి నైట్స్ టేల్, డి ఫ్రాన్కిన్ టేల్"లలో స్పష్టం చేశాడు. భార్యలు ఆనాడు భర్తల్ని అన్ని రకాల వేదనలకూ గురి చేసేవారు. అణగి ఉండేవారే కాదు. నిజాయితీ కాని భర్తపై గౌరవం కాని ఉండేవి కావు. మోసమే పరమావధిగా జీవించారు. ఈ పాత్రలన్నీ చాసర్ కవిత్వంలో జీవించాయి. ముప్ఫైవ ఏట చాసర్ రాజుగారి వ్యాపారాలను బాగా నిర్వహించి నేర్పు చూపాడు. రాజు దీనికి బహుమానంగా జేనోవాకు పంపాడు. ఇటలిలోని ఫ్లోరెన్స్ నగరాన్ని చూసి ముచ్చట పడ్డాడు. అక్కడి సంస్కృతి ఆకర్షించింది. ఇటలీ వెళ్ళేదాకా చాసర్‌లో గొప్ప కవి ఉన్నాడు అన్న సంగతి స్నేహితులకే తెలియలేదు.

లండన్‌లో "కంప్ట్రోలర్ ఆఫ్ ది కస్టమ్స్" అధికారి అయ్యాడు చాసర్. మంచి ఇల్లు, గొప్ప జీతం, ఉన్నత జీవితం అనుభవించాడు. తాను చదివిన ఖగోళ, జ్యోతిష, రసవాద, వైద్య, భౌతిక శాస్త్ర, మత, సాహిత్య విషయాలన్నిటిని కవితల రూపంలో రాశాడు. దేనినీ వదలకుండా తను పొందిన అనుభవాలను, ఆనందాన్ని అనుభూతిని కవితాబద్ధం చేశాడు. సంభాషణల్లో నెమ్మది వాడినని తాను ఆరడుగుల లావుపాటి వాడినని చెప్పుకొన్నాడు. చాసర్ మరణం తరువాత కాని ఆయన చిత్రపటాలు ఎవరూ అంతకుముందు ఊహించి చిత్రించలేదు. రాజుకు రాణికి అధికారులకు చాసర్ తన కవిత్వాన్ని చదివి వినిపించేవాడు. ఇదొక సంప్రదాయంగా మారింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఒడంబడిక కుదరటానికి రాజు తరపున కృషి చేశాడు. ఇటలీలోని మిలాన్‌కు "మిలిటరీ ఫైనాన్షియల్ మిషన్"కు నాయకత్వం వహించాడు. ఇటలీని ఒప్పించి ఇంగ్లాండ్‌కు ఆర్థిక సాయం చేసేట్లు కృషి చేశాడు.

ఇటలీకి వెళ్ళే ముందే "రోమన్స్ ఆఫ్ ది రోజ్" అనువాదాన్ని పూర్తి చేశాడు. ఇది ఆ కాలంలో విపరీతంగా ప్రాచుర్యం పొందింది. "ఇంగ్లాండ్ దేశపు మొదటి నవల"గా గుర్తింపబడిన "Troilus and criseyde" రాశాడు. 47వ ఏట కంట్రోలర్ ఉద్యోగం వదిలేశాడు లేక తప్పించేశారు. ఇప్పుడు స్వేచ్ఛా జీవి కనుక కవిత్వంపై దృష్టి సారించాడు. అప్పటికే మొదలుపెట్టిన "కాంటర్ బరీ టేల్స్" ఇంకా పూర్తి కాలేదు. సుమారు పన్నెండేళ్ళు దాన్ని కష్టపడి రాసి పూర్తి చేశాడు. రాజుగారి వెస్ట్ మినిస్టర్ పనిలో గుమాస్తాగా ఉద్యోగం వచ్చింది. పనులను సూపర్‌వైజ్ చేయటమే. ఉచిత ఇల్లు, మంచి జీతం పొందాడు. భార్య చనిపోయింది. పనిమనిషిని చేరదీశాడని పుకార్లు. ప్రభుత్వ సొమ్ము "నొక్కేశాడు" అని అభియోగాలు. కాని పూర్తి విచారణలో రుజువు కాలేదు. సోమర్సెట్‌లో డిప్యూటీ ఫారెస్టర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అప్పు ఎగకొట్టాడని నేరారోపణా. రాజు అడ్డుపడి శిక్ష తప్పించాడు. అరవై ఏళ్ళ వయసులో పెన్షన్‌ను రెట్టింపు చేశారు. వెస్ట్ మినిస్టర్ దగ్గర ఒక తోటలో ఉన్న ఇంటికోసం యాభై మూడేళ్ళ లీజ్‌పై సంతకం చేశాడు. ఆ ఇంటిలో చేరి ఆనందాన్ని అనుభవించకుండా సంపాదించిన డబ్బును అనుభవించకుండా చాసర్ 1400లో అక్టోబర్ 25న ఇహలోక యాత్ర చాలించాడు. వెస్ట్ మినిస్టర్ నివాసి కనుక "ఆబ్బే"లో ఖననం చేశారు. అప్పటి నుంచే వెస్ట్ మినిస్టర్ ఆబ్బేను "పోయెట్స్ కార్నర్" అనే పేరుతో పిలవటం ప్రారంభించారు. ఆనాటి నుంచి ప్రతి గొప్ప కవినీ అక్కడే ఖననం చేస్తూ గౌరవిస్తున్నారు. చాసర్ బోణీ బానే ఉంది. చాసర్ కవిత్వంలోని మేలిమిని తర్వాత తెలుసుకొందాం. ❁

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 2

# 1. జియోఫ్రీ చాసర్

## కవితావలోకనం

**చా**ర్లెస్ "ది రోమన్స్ ఆఫ్ ది రోజ్" మొదటగా రాశాడు ఇందులో. ఇది ఫ్రెంచ్ ఎలిగరి. ఆయన "కలా" (ళా కాదు ఇది అసంపూర్ణ. అందుకే డ్రీమర్ అన్నారు)భిమానం ఉంది. అతని నిజమైన సృజనాత్మక కవిత. తన కవితలకు సంగీతం కూడా ఇవ్వటం ప్రారంభించాడు. ఇందులోని కవిత్వం చదివిన దానికంటే వింటేనే బాగుంటుంది. ఇప్పటికీ తన గమ్యం ఏమిటో తేల్చుకోలేకపోయాడు "ది హౌస్ ఆఫ్ ఫేం" అనే మళ్ళీ పూర్తికాని కవిత రాశాడు ఇందులో చాసర్. "పలుకు బడులు" బాగా పేలాయి. "ది పార్లమెంట్ ఆఫ్ ఫౌల్స్"లో కథ పాతదే కాని విధానం కొత్తగా ఉంది. ఇందులో రాసిన విధానాలకు కొత్త కళ తెచ్చాడు. అందుకే "చాసరీయన్ స్టాంజా" అన్నారు. గొప్ప కవిత కాదు కాని ఆయన ఆలోచనలకు రూపం. "ది లైఫ్ ఈజ్ టూ షార్ట్ ది క్రాఫ్ట్ సో లాంగ్ టు లెరన్" అన్నాడు ఇందులో. యువ ప్రేమికుల మధ్య ప్రేమ, అనుమానం, మోసం చిత్రించాడు. తరువాత రాసిన "ది లెజెండ్ ఆఫ్ గుడ్ విమెన్"లో "క్లియోపాత్రా" వంటి పాత్రల త్యాగం, వారి వీరోచిత చరిత్ర భావ గర్భితంగా చూపించాడు. ఇన్ని రాసినా రాస్తున్నా ఆయన మనసులో కాంటర్ బరీ కథలు, "గిలిగింతలు" పెడుతూనే ఉన్నాయి. వాటిని న భూతోగా రాయాలని చాసర్ భావన. ఆ పాత్రలు, మనసులో ఎంతో మధన పెడుతున్నాయి. సంకల్పం నిత్య దర్శనమిచ్చి తమను సజీవం చేయమని కోరుతూనే ఉన్నాయి.

చాసర్ రచనలలో "మాగ్నం ఓపస్" అనబడేది "ది కాంటర్ బరీ టేల్స్". ఇందులో ఆయన రాసిన "ప్రోలాగ్" అంటే ప్రస్తావన అదిరిందని విమర్శకులంటారు. ఆయన అమాయక విజన్, వర్షంలో తడిసిన పుష్ప సౌందర్యం, పడమటి గాలి కమ్మని సుగంధం, చిన్ని చిన్ని పక్షులు, వాటి నిశా నిస్వనాలు చదివిన వారి మనసులను రంజింప జేస్తాయి. ముప్పై మంది యాత్రికుల మనోభావాలు వాళ్ళు చెప్పిన కథలు, అనుభవాలు, అమాయకత్వం, మోసం అన్నీ చిత్రించాడు. ఈ యాత్రీకులకు "టాబార్డ్ ఇన్" నిర్వహించే "హారీ బైలీ" ఆతిధ్యం ఇస్తాడు ఈ యాత్రికులలో ఒక సన్యాసి, విద్యార్ధి, మిల్లర్, నైట్, చాసర్ మొదలైన వారుంటారు. ప్రతి యాత్రికుడిని రెండు మంచి కథ చెప్పిన వారికి ఉచిత డిన్నర్. కథలు చెప్పమని హోస్ట్ కోరతాడు. విమర్శలు. ఒకరి కథ ఇంకొకరికి నచ్చదు. ప్రతి విమర్శలు కొందరు బోర్‌కొట్టిస్తే

కొందరు గిలిగింతలు పెట్టిస్తారు. కొందరికి కథ బాగున్నా కథనంలో పస వుండదు. వంటవాడు తాగి హల్‌చల్ చేస్తాడు. తడబాటు ఉంటుంది.

ఈ కథల్లో వ్యక్తి అంతరంగాన్ని ఆవిష్కరింపజేశాడు ఈ అస్తవ్యస్త ప్రపంచంలో. మనుషులు ఎలా బతుకుతూ జీవితం లాగిస్తున్నారో మనకు తెలుస్తుంది. మనుషుల మీద చాసర్‌కున్న గౌరవం, ప్రత్యేకత స్పష్టం అవుతుంది చాసర్ రాసిన "ప్రైవేట్ ఇళ్ళల్లో". ప్రతి దాన్ని, చుట్టూ ఉన్న వారికి చదివి వినింపించి మెప్పు పొందాడు. రాజ దర్బార్‌లో పల్లె వీధుల్లో కవిత్వాన్ని వినిపించాడు. "Although much of his verse is musical in the most memorable way, showing the skill of a master craftsman, most of it is poetry that talks rather than poetry that sing. The Canterbury tales are in them selves an extended conversation, sometime bantering, some time bitter" అన్నాడు చాసర్.

మోహంతో కూడిన కథలు కావాలి, సహజ సామెతలు ఉండాలి. (లస్టే ఎనక్డోట్స్), కటువు ముతక జోకులుండాలి. అంతకు పూర్వం ఆ తర్వాత ఇలాంటి అమాయక, నమ్మకమైన కవిత వెలువడలేదనే చెప్పాలి. ఈ అమాయక చక్రవర్తులైన పాత్రధారులు ఆనాటి సమాజంలో ఉన్న మనిషిని విశాల కాన్వాస్‌పై చిత్రించాడు. విజ్ఞాన శాస్త్ర, వేదాంత, నీతి, కథలపై సంఘ ఆచారాలపై తమ మనోభావాలను విప్పి చెప్పినవారే.

చాసర్ ది విప్లవాత్మక మనసు కాదు. ఆయన ఒక సామాజిక ఆలోచనాపరుడు. సాంఘిక సంస్కర్త కాదు, రాజకీయ అతివాది కాదు. మత వ్యతిరేకీ కాదు. దీనికి అభ్యంతరం చెప్పలేదు. ఆ భావాలు వున్నవి వున్నట్లు చెప్పాడు. చర్చి గౌరవాన్ని మంట గలిపేవి నమ్మిన వాటికి వ్యతిరేకంగా ఉంటే మాత్రం ఒప్పుకోలేదు. చర్చి అధిపతుల విధానాలను బయటపెట్టాడు. సత్యానికి దాసుడు. అన్నిటికి మించి చాసర్ నిజాయితీకి పట్టం కట్టాడనిపిస్తుంది. స్వేచ్ఛ, మంచి హృదయం, అమాయక ఆరాధన ఆయనకు నచ్చిన విషయాలు. డ్రైడేన్ పదిహేడవ శతాబ్దంలో "Chaucer is a perpectual fountain of good sense with God;s plenty "అని కీర్తిస్తూ "he must have been a man of most wonderful comprehensive nature because, as it has been truly said of him, he has taken into the compass of the Canter bury tales the various manners and humors of the whole English nation in his age" అన్నాడు.

చాసర్ మరణించి ఆరు వందల ఏళ్ళు దాటినా యింకా ప్రభావం చూపిస్తున్నాడు. అతని కాంటర్ బరీ కథలు. ఆయన ప్రజ్ఞా సర్వస్వం, మేధో వికసితం, దీనితో ఇంగ్లీష్ జాతినే కాదు యావత్ మానవ జాతినీ తరతరాలుగా పరివేష్టించి ఉండి, ప్రభావితం చేస్తూనే ఉన్నాడు చాసర్. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 3

# 1. పెరల్ పోయెట్ - విలియం లాంగ్లాండ్

**చా**సర్ తరువాత ఆంగ్ల సాహిత్యం పూర్తిగా మార్పు చెందింది. అనేక విషయాలు కవితా వస్తువులైనాయి. భాష సరళం అయింది. పని చేసుకొనే వారికి కవిత చేరువైంది. పద్నాలుగు, పదిహేను శతాబ్దాలు సాంస్కృతిక పునరుజ్జీవనానికి సిద్ధమైనాయి. ఇంగ్లాండ్‌లో యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. గ్రామాలు నగరాలైనాయి. రాజభవనం, పల్లెటూరు దగ్గరైనాయి. అప్పటిదాకా చెలామణి అయిన ఆంగ్లో సాక్సన్ పదాల స్థానంలో ఫ్రెంచ్ మాటలు చోటు చేసుకొన్నాయి. కొత్త తేలిక పలుకు బడులు వచ్చాయి. చాసర్‌కు చెందిన ఆగ్నేయ మధ్య దేశపు మాండలికం ఆంగ్లేయులను ఆకర్షించింది. అదే ఆధునిక ఆంగ్ల స్థాయీ భాషగా మారింది. పద్నాలుగో శతాబ్ది సామాన్యులకే కాక రెండొందల ఏళ్ళ తర్వాత వచ్చిన షేక్స్పియర్ కవికీ కూడా ఇదే సహజ భాష అయింది. చాసర్ పాత సంప్రదాయాలను పాటిస్తూ కొత్త చిట్కాలు ప్రయోగించాడు. ఇంగ్లాండ్ దక్షిణాన నికొలాస్ గిల్డ్ ఫోర్డ్ కవి పల్లె భాషలో రెండొందల పంక్తుల "ది ఔల్ అండ్ ది నైటింగేల్" కవిత రాశాడు. పశ్చిమాన "పెరల్ పోయెట్" అని అభిమానంగా పేరొందిన "విలియం లాంగ్లాండ్" యమక చక్రవర్తిగా విజృంభించాడు.

1330లో మాల్వేర్న్‌లో పుట్టిన లాంగ్లాండ్ తనను జనం చాలాకాలం గుర్తుంచుకొంటారని కవిత అల్లాడు. మొనాస్టరిలో చదివి మత గురువైనాడు. ఆక్స్‌ఫర్డ్‌లో చదివి లండన్ నివాసి అయ్యాడు. చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం శాంతి గీతాలు పాడేవాడు. బీదతనం అతన్ని కవిని చేసింది. "డివిజన్ ఆఫ్ పీర్స్ ఫ్లో మాన్" రాశాడు. సంఘాన్ని విమర్శిస్తూ, సంఘాన్ని సంస్కరించే ప్రయత్నం చేశాడు. పరాన్న భుక్కుల పాలిటి

సింహస్వప్నం అయ్యాడు. న్యాయంపై దృష్టిలేని న్యాధిపతులను, న్యాయవాదుల్ని, అవినీతిపరుల్ని, అధికార దాహం ఉన్నవారిని యేకి పారేశాడు. మొదట చిన్న కవితగా 1360లో ప్రారంభించిన కవితను 7,000 లైన్ల దాకా పదిహేనేళ్ళ తరువాత పెంచి, ఆ శతాబ్ది చివరిలో మళ్ళీ మార్పులూ చేర్పులూ చేశాడు. అతను రాసిన "విజన్" కవిత బ్రహ్మాండంగా క్లిక్ అయి తరువాతి శతాబ్దంలోకి చొచ్చుకుపోయింది. యాభై అయిదు చేతి రాతల పుస్తకాలుగా అవతరించింది. అదొక ఏకైక సృజనాత్మక కవితగా నిలబడింది. చాసర్‌తో పోలిస్తే లాంగ్లాండ్ ముతకగా, అస్తవ్యస్తంగా కథలు చెప్పాడనిపిస్తుంది. ఈ కవితకు ఇంగ్లాండ్‌లో వ్యాపించిన బుబానిక్ ప్లేగు, దానివలన చనిపోయినవారు ("బ్లాక్ డెత్") వందేళ్ళ యుద్ధం, రైతుల తిరుగుబాటు, ఫ్యూడల్ వ్యవస్థ కూలిపోవటం నేపథ్యంగా వచ్చిన కవితలివి. ఆర్థిక అసమానత, దయా సానుభూతి లేని పాలకుల నిరంకుశత్వంపై దాడితో ఈ దీర్ఘ కవిత జనాలకు బాగా పట్టింది. లాంగ్లాండ్ తాను "పెరల్, పేషేన్స్ ప్యూరిటీ", "సర్ గవాన్ అండ్ ది గ్రీన్ నైట్" కవితలను వెస్ట్ మిడ్లాండ్ మాండలికంలో రాశానని చెప్పుకొన్నాడు. ఇందులో ముత్యాల గురించి ముచ్చటైన విషయాలెన్నో చెప్పాడు కనుక "పెరల్ పోయెట్"గా గుర్తింపు వచ్చింది. పెరల్ కవిత అతని స్వంత కథ అన్నారు. ఇదొక అమ్మాయి గురించి రాశాడు. ఆమెను పుష్పంగా, ముత్యంగా పోల్చాడు. గ్రీన్ నైట్ కవితను "మాస్టర్ పీస్" అంటారు. అందులో ఎంతో కళ ఉందంటారు. "బొ ఉల్ఫ్" అనే వీరోచిత యోధుడి కథ. భార్య అనేక సార్లు బొ ఉల్ఫ్‌ను దిగజార్చటానికి ప్రయత్నిస్తుంది. కాని పట్టువదలని విక్రమార్కుడిలా గమ్యం వైపు సాగిపోతాడు. ఇందులో ఆటవిక సంఘటనలకే ప్రాముఖ్యం. హింస, కపటం, మోసం అన్నీ గొప్పగా చిత్రిస్తాడు. సాహసవీరుడు ఎలా ఉంటాడో, ఉండాలో బొ ఉల్ఫ్ పాత్రలో నిలబెట్టి ఆదర్శంగా తీర్చాడు. ఇందులోని పాత్రలు చాసర్ పాత్రలంత సజీవాలు కాదు. కాని లాంగ్లాండ్ సామర్థ్యం తీసిపారేసేది మాత్రం కాదు. "Langland is the essential teller of tales, his very detachment as a narrator anables him to turn an incredible phantasmagoria into one of the most delightful Arthurian romances" అని లాంగ్లాండ్ తీరును విశ్లేషించారు.

**స్కాటిష్ చాసరియన్లు**

"గ్లోవర్, హోక్లేవ్, లిడ్ గేట్"లను కలిపి స్కాటిష్ చాసరియన్లు అంటారు. చాసర్ చేత మసగబారిన కవులు. ఇందులో జాన్ గోవర్ 1303లో పుట్టి 1408లో గిట్టాడు. లాటిన్ నార్మల్ ఫ్రెంచ్, మిడిల్ ఇంగ్లీష్ భాషల్లో విపరీతంగా కవితలు అల్లాడు. మిడిల్ ఇంగ్లీష్ కవితలే అతడిని కవిగా గుర్తింపు తెచ్చాయి. "కన్ఫేషియా యమాన్టిస్" అనే కథల కవిత రాశాడు. రెండవ చార్లెస్ రాజు తనను ప్రేమ ఆధారంగా రాయమన్నాడు. అందుకే

అరువు కథలు, అనువాదాలు, అను సృజనలతో కవితలు రాశాడు. చాసర్ ఇతన్ని "మోరల్ గోవర్" అన్నాడు. ఇందులో "పెరిక్లిస్" షేక్స్పియర్‌ను ఆకర్షించింది. గోవర్ ఈ నాటికలో కోరస్ పాత్ర ధరించాడు. దీనిని ఎనిమిది పుస్తకాలుగా ముప్పై నాలుగు వేల పంక్తులతో తయారు చేశాడు. కాంటర్ బరీ కథలతో పోలిస్తే ఇది ఒక చెక్క బొమ్మలా, రక్తమాంసాలు లేని పాత్రలతో, ఊక దంపుడుగా ఉంటుంది. ఇందులోని పాత్ర వీనస్ చాసర్ను "mi dicipline and mi poete" అని అంటాడు. ప్రేమతో ఉన్నతంగా జీవించమని కోరితే పో పొమ్మంటాడు చాసర్.

థామస్ హోక్లీవ్ 1370–1450 వాడు. చాసర్‌కు వీరాభిమాని. అదే అతన్ని కవిని చేసింది. "maister deere and father reverent" అంటూ గురువు చాసర్‌ను పొగిడాడు. చాసర్ శిష్యుడిని తీర్చిదిద్దే ప్రయత్నం చేశాడు. తనను పట్నవాసిగా కవితల్లో చిత్రించుకొన్నాడు. ప్రేమలో పడటం, అప్పుల్లో మునిగి ఉండటమే అతని పని. కాని పరిశోధకులు అతనికి చెందని దాన్ని అతనిదేనని బూస్ట్ ఇచ్చారు. హోక్లీవ్ వలననే చాసర్‌కు చెందిన "సాధికారిక చిత్రం" మనకు లభించింది. గురువు మీద గొప్ప కప్లేట్ రాశాడు. "to putte pther men in remembrance of his persone I have here his likeness" అని రాసుకొన్నాడు.

స్కాటిష్ చాసరియన్స్‌లో మూడవ వాడు. 1370–1449 కాలం వాడైన "జాన్ లిడ్ గేట్" సెయింట్ ఎడ్మండ్ బరిలో బెనేడిక్టన్ మాంక్. సాహిత్యంలో యధాలాపంగ ప్రవేశించాడు. "ది స్టోరి ఆఫ్ ది థేబ్స్". "ది కోర్ట్ ఆఫ్ వీనస్", "ది కంప్లైంట్స్ ఆఫ్ ది బ్లాక్ నైట్" రాశాడు. ఇవన్నీ గొప్ప విజయాలనే ఇచ్చాయి. చివరిది చాసర్ చాలాకాలం జ్ఞాపకం ఉంచుకొన్నాడు. దాదాపు రెండు లక్షల పంక్తుల కవితలు రాశాడు. అందులో ఒక్కటీ దక్కలేదు. అతనికి తాను నైపుణ్యం ఉన్న కవిని కాదని తెలుసు. చాసర్ శైలికి తాను ఎన్ని మైళ్ళ దూరంలో ఉన్నాడో గ్రహించాడు. అతను తన శక్తి సామర్థ్యాలను ఇంకా సమర్థవంతంగా ఉపయోగించుకొని ఉన్నట్లయితే, చాసర్ ప్రేరణతో వచ్చిన మరో గొప్ప కవిగా శతాబ్దాల పాటు గుర్తుండిపోయేవాడు. ❀



లిడ్ గేట్



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 4

# దన్బార్, హేన్రిసన్ జేమ్స్ - 1

**చా**సర్ లాగే దన్బార్ కూడా సివిల్ ఉద్యోగి. రాజుగారి ప్రతినిధిగా పనిచేసి పెన్షన్ పొందాడు. క్లాసికల్ విషయాలను సామాన్య భాషలో రాసిన అసామాన్యుడు. అతని రచనలలో రెండు విరుద్ధ భావాలు కన్పిస్తాయి. " ది గోల్డిన్ టార్జ్"లో ఒక మోడల్ గార్డెన్‌ను వర్ణించాడు. ఇది రోమన్స్ ఆఫ్ ది రోజ్ లాగానే ఉంటుంది. "ది త్రిసిల్ అండ్ రాయిస్"లో "ఎలిగరి" ఉంటుంది. సహజత్వాన్ని దాటి వెళ్ళాలనే ప్రయత్నం అతనిలో కనిపిస్తుంది. దన్బార్‌ను " hard and bitter" అన్నాడు చాసర్. "మెడిటేషన్ ఇన్ వింటర్" అతని స్వీయ ఇతివృత్తమే. సహజత్వం ఆకట్టుకొంటుంది. మిల్టన్ రాసిన "హైమ్స్"ను మరిపిస్తాడు. "లా మెంట్స్ ఫర్ మకరిస్ (పోయెట్స్)" గొప్ప భావాలతో "స్టాన్జాలు" రాశాడు. లాటిన్ వాక్యాలతో స్టాంజాలను పూర్తిచేసి నూతనత్వాన్ని ఆవిష్కరించాడు. 1460–1520 కాలం వాడు.

అర్థం కాని వింత భాష, క్లిష్టమైన శైలి వలన అందరికి దూరమైన కవి. 1430–1506కు చెందిన హేన్రిసన్. బెనేడిక్టియన్ గ్రామర్ స్కూల్‌లో బోధన చేశాడు. చాసర్ భావాలనే అనుసరించాడు. మూడు దీర్ఘ కవితల్ని, పదమూడు చిన్న కవితలని రాశాడు. "ఫేబుల్స్" కవిత ద్వారానే గుర్తుండిపోయాడు. ఈసప్ కథలను "టెస్టమెంట్ ఆఫ్ క్రేస్సీడ్" కథలను తీసుకొని కవితలల్లాడు. విషాదాంత నాయికలకు ప్రాముఖ్యం ఇచ్చాడు. చాసర్ హాయిగా సరదాగా ఉండే పాత్రలు సృష్టిస్తే దానికి విరుద్ధంగా ఇలా చేశాడు. విషయాలు పూర్వకాలపువే అయినా వాటిని తీర్చిదిద్దటంలో హేన్రిసన్ కొత్త దారులు తొక్కాడు.

స్కాట్‌లాండ్ రాజు మొదటి జేమ్స్ (1394–1437) "రాజులలో గొప్ప కవి కవులలో గొప్ప రాజు" అనిపించుకొన్నాడు. మహారాజు అయినా చాసర్, గోవర్ కవులంటే గౌరవం ఉన్నవాడు. ఈ రాజు రాసిన "ది కింగ్స్ క్వైర్" (ది కింగ్స్ బుక్)లో చివర ఈ ఇద్దరు కవులను

"dear masters Chauser and Gower" అని ప్రస్తుతించాడు. ఈ కవితను జేమ్స్ ఒక్కడే రాయలేదని, చాలామంది కవుల హస్తం ఉందని అంటారు. దీన్ని రాసిన కీర్తిని మాత్రం రాజుకు అందించారు వీరందరూ కలిసి. ప్రభు భక్తికి ఇది నిదర్శనం. "సాంగ్ ఆఫ్ సాలెంస్"లో అరువు భావాలున్నా, వ్యక్తీకరణ బాగుంటుందని స్పష్టంగా చెప్పాడని, స్వీయచరిత్రలా ఉంటుందని అన్నారు.

**అద్భుతాలు – నైతికత**

ముడి సరుకుగా ఉన్న కవిత్వం నాటక రచనలో ప్రవేశించింది. మధ్య యుగంలో నటులు మతాధికారులు సన్యాసులు మాత్రమే. దీనికి కారణం అప్పటి నాటకాలు చర్చి బోధకు బాహ్య రూపాలు అవటమే. ఇవి క్రిస్మస్, ఈస్టర్ పండగ విశేషాలకు ప్రాముఖ్యతనిచ్చేవి. తరువాత సీను చర్చి నుండి పల్లెకు మారింది. పవిత్ర గ్రంథాలలోని విషయాలు మతాతీతమైనాయి. అంటే నటన ప్రీస్ట్ల నుండి సామాన్య జనానికి మారింది. కథలు బైబిల్వే అయినా కథనంలో చాలా తేడా వచ్చిందన్న మాట. ఔత్సాహిక నటులే కాక, సామాన్య పనివారు కూడా నటులయ్యారు. దీనినే మిరకిల్ లేక మిస్టరి నాటకాలు అన్నారు. అనేక సంస్థలు వీటిని స్పాన్సర్ చేసి రాయించి ఆడించేవి. "నోవా అండ్ ది ఫ్లడ్" నాటకానని చేపలు పట్టేవారు, సముద్ర యాత్రికులు ఆడేవారు. "ది గార్డెన్ ఆఫ్ ఈడెన్"ను బట్టలు తయారు చేసేవారు, వడ్రంగులు వేసేవారు. "ది బాప్టిజం అండ్ క్రైస్ట్"ను మంగలివాళ్ళు ఆడేవారు. "ది లాస్ట్ సప్పర్" నాటకాన్ని రొట్టెల వాళ్ళు వేసేవారు. వీటికి సబ్ ప్లాట్ లుండేవి. గృహానికి సంబంధించిన అన్ని వివరాలు అందులో చోటు చేసుకొనేవి. ఇది మిరకిల్ ప్లేలు దూసుకుపోతుంటే నైతికతకు ప్రాధాన్యతనిచ్చే నాటకాలు సుదీర్ఘంగా ఉన్నా, మత విషయాలు తక్కువగా ఉండి ఆకట్టుకొనేవి. బైబిల్ కథలకు అధిక ప్రాధాన్యతను తగ్గించి నైతికతను ప్రోత్సహించే కథలు రాసి, అనుభవం ఉన్న నటులే నటించేవారు. మనిషి చావును తప్పించుకొనే ప్రయత్నాలు, హాస్యం నిజాయితీతో ఇవి ఉండేవి.

**ప్రజాకవిత్వం**

ఇప్పటిదాకా చదవటం, రాయటం ప్రీస్టులు విద్యావంతులకే పరిమితం. రాత ప్రతులను చదివి విజ్ఞానాన్ని పెంచుకొనేవారు. ఆనందానికే ఈ చదువు అనే భావం ఉండేది. "జాన్ గూటేన్ బర్గ్" అచ్చు యంత్రాన్ని కనిపెట్టిన తర్వాత "దృశ్యం" మారింది. 1477లో "కాక్ స్టన్" ఇంగ్లీష్లో మొదటి పుస్తకాన్ని ముద్రించాడు. దీని తర్వాత పదేళ్లకు చాసర్ రాసిన "కాంటర్ బరీ కథలు" అచ్చయ్యాయి. అచ్చు పుస్తకాల వలన భాషలో స్థాయి రావటమే కాక,

ఆంగ్ల సాహిత్యంలో గణనీయమైన మార్పులొచ్చాయి. కవిత్వం అనేది ప్రజలకోసం అనే భావన వచ్చింది. అన్ని తరగతుల వారూ కవిత్వం రాశారు. సరిహద్దులు దాటి సముద్రాలు దాటి కవిత ప్రవహించింది. చిన్న చిన్న దేశాలలోను గొప్ప కవిత్వం వచ్చింది. దీనినే "గోలియార్డిక్ కవిత" అన్నారు. ఈ పేరు గోలియాస్ అనే ప్రీస్ట్ పేరు నుంచి కాని, "గులా" అంటే దేశ సంచారులైన తిండిపోతులు అనే అర్థం వచ్చే మాట నుంచి కాని వచ్చి ఉంటుంది. కొందరు యువకులు, మరికొందరు పెద్దలు ఊరూరా తిరిగి స్వేచ్ఛా జీవనం, అనైతిక విశ్రుంఖలతలను ప్రజల్లో విపరీతంగా ప్రచారం చేశారు. "మకారత్రయం" అంటే, మగువ, మద్యం, మంచి పాట"ల కంటే ఇంకేమీ అక్కర్లేదని వాదించారు. నీటికి బదులు సారా, మత పెద్దల కంటే ఆకర్షణీయ యువతులు, బోరు కొట్టించే ప్రార్థనా గీతాలకంటే సరదా గేయాలు, తాగుడు కవిత్వాలకు ప్రాధాన్యత నిచ్చారు. గోలియార్డ్ కవిత్వానికొక ఉదాహరణ–

"Pen and copy book - how funeral they look - ovid's songs, how dull with age - still more any other page - never mind what is not allowed - love is youth's temptation - here we go a glorious cloud - hell - bent for vacation"

మధ్యయుగ కాలంలోని "బోహీమియన్"లనే గోలియార్డ్స్ అంటారు. ఆనాటి నుంచి ప్రతి కొండా కోనా పల్లె ఆ కవిత్వాలను ప్రతిఫలించింది. ముఖ్యంగా విద్యార్థులు ఆకర్షితులైనారు. కారల్ ఆర్ఫ్ దీన్ని ఆధునీకరించాడు. మూడు వాల్యూములు "సాంగ్స్ ఫ్రం వేగబాన్డియా" పేర పందొమ్మిదో శతాబ్ది చివరలో ప్రచురించారు. ఈ కవితలనే మధ్యయుగ బాలడ్స్ అంటారు. ప్రజల భాషలో ప్రజల కోసం రాసి పాడి రంజింపజేసేవారు. వీధుల మూలల్లో మార్కెట్లలో, సంతలలో ఈ కవితలను పాడేవారు. రాజాస్థానాలు సంస్థానాల్లో రాజుల మెప్పుకోసం వచ్చిన కవిత ఇప్పుడు ప్రజా మార్గం పట్టి సామాన్యుడికి చేరువై ప్రజా కవిత అయింది. పాత అద్భుత కథలను, కొత్త సంఘటనలతో, బీదవాడి చరిత్రను జోడించి, సమకాలీన సమాజానికి వ్యాఖ్యానంగా వీటిని హాయిగా పాడేవారు. నిత్య జీవితాన్ని ప్రతిబింబింపజేసేవారు. సామాన్యుడు ఈ కవితల్లో "మాన్యుడయ్యాడు". వినే వాళ్లకు సహజంగా ఉండి, తమ కథే వింటున్న అనుభూతి నిచ్చాయి ఈ బాలడ్స్. వీటిని పాడే గాయకులకు విలువ పెరిగింది. బాలడ్ ఇప్పుడు ప్రజల సంపద అయింది. రాజుల యుద్ధ వీరుల సాహసికుల కథలు ప్రజలు ప్రతిష్ఠింపబడ్డారు. వీటిని ఏ ఒకరో రాసినవి కావు. తరతరాలుగా అనేక చేర్పులూ మార్పులూ పొందుతూ తరువాతి తరాలకు అందాయి, పదిహేడవ శతాబ్దంలో "న్యూ వరల్డ్" అని పిలువబడిన అమెరికాకూ చేరాయి. కెంటకీ, కారోలీనాలో బహుళ ప్రాచుర్యం పొందాయి.

బాలడ్‌లో కథ చిన్నదిగా ఉంటుంది. కొద్ది అవకాశమే ఉన్నవారికి వినటానికి

హాయి, విన్న వెంనే గొప్ప స్పందన కలిగించటం వీటి ప్రత్యేకత. హాయిగా తాపీగా వినే అవకాశాలు తగ్గిపోయాయి. "ఇన్స్టంట్ సక్సెస్" కావాలి. అదే బాలడ్ సాధించింది. నాటకీయత దీనిలో ఉండటం వలన కాలం వృధా కాదు. సద్యో స్పందన లభిస్తుంది. భావ తీవ్రతకు ప్రాధాన్యం ఉంటుంది. విషయం సూటిగా మనసుకు చేరి ప్రభావితం చేస్తుంది. సరళమైన భాషా లయా తూగు ఉండటం వలన ఒక పూనకం కలిగి కథలో వినేవారు లీనమైపోతారు. అందరికి అర్థమయ్యే భాష వలన ఫలితం ఎక్కువ. "The ballad maker is the perfect story teller in the sense that he is out side the story, he tells the tale for what it is worth. He does not pass upon the quality or even its credibility. He does not comment upon the motives of his characters or the rights and wrongs in which they are invovled. He leaves all judgement to his listeners".

లార్డ్ లాందాల్, ఎడ్వర్డ్ ఎలీన్, సర్ పాట్రిక్ స్పెంస్, జానీ ఆర్మస్ట్రాంగ్ మొదలైన సంప్రదాయంగా వచ్చిన బాలడ్స్‌ను జనం విపరీతంగా ఆదరించారు. ఇవి మొదటి ఆంగ్ల కవిత్వ ఆవిర్భావంలో వచ్చాయి. వీటిని మనం స్వంతం చేసుకొన్నాం. మన సాహిత్యంగా చెప్పుకొంటున్నాం. ఇవి సాధారణ భాషలో ఉండటం, చిన్న కథలతో ఉండటం వలననే కాక సామాన్య ప్రజల స్పందనకు కారణాలై ప్రసిద్ధి చెందాయి. ఆ స్పందన లేకపోతే ఇంతకాలం నిలిచేవికావు. "The rhythm of the world's work is in lines - the pull of the rope, the turn of the wheel, the swing of the axe, the fall of the hammer - they lie close to man's heart - they beat in his pulse every time they are heard". ఇదీ బాలడ్ సొగసు, సొంపు, సౌభాగ్యం, సుభగత్వం, శ్రావ్యత, శోభ. ❋




"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 5

# సృజన సూర్యోదయం

**చా**సర్‌తో బలపడిన కవిత్వం ఆయన ప్రభావంతో ఇబ్బంది పడింది. కాంటర్ బరీ కథల తర్వాత ఒక శతాబ్దం కాలం కవులలో కొత్త విషయాలపై ఆలోచన చేయలేదు. అనుకరణ, ప్రతిధ్వని, అన్వయంలో కూరుకుపోయారు. కొత్త గొంతుక అవసరమైంది. కొత్త ఆలోచనలు కావాల్సి వచ్చింది. సృజన కోసం ఆరాటం పెరిగింది. ఈ నేపథ్యంలో అలాంటి గొంతు వినిపించింది. సృజనాత్మక ఆలోచన రచనతో దూసుకుపోయిన కవి వచ్చాడు. కాని అతన్ని కావాలనే దూరం చేశారు. అతడే "జాన్ స్కెల్టన్". స్కెల్‌టన్‌తో "సృజస భానూదయం" అయింది ఆంగ్ల సాహిత్యంలో.

**ప్రజా స్థానకవి - జాన్ స్కెల్టన్**

జాన్ స్కెల్‌టన్ 1460లో పుట్టాడని భావిస్తారు. 1529 జూన్‌లో మరణించాడు. పూర్వీకుల గురించి తెలియదు. కంబర్లాండ్ జానపదుడు. నారక్ ఫోక్‌లో ఉండేవాడు. ముప్ఫై ఏళ్ళు వచ్చేసరికి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలు అతని అసామాన్య ప్రతిభను గుర్తించాయి. ఆస్థాన కిరీటం లాంటిది ఇచ్చి "ప్రజాస్థాన కవి"గా గుర్తించి గౌరవించాయి. అప్పటికి రాజాస్థానాలలో "ఆస్థాన కవి" అనే గౌరవ పదవి ఏర్పడలేదు. ఈ గౌరవం పదిహేడవ శతాబ్ది నుండే ప్రారంభమై "బెన్ జాన్సన్" మొదటి రాజాస్థాన కవి అయ్యాడు. ఈ పదవి వలన ఏడాదికి రెండు వందల పౌండ్ల పారితోషికం ఒక "టన్ను వైను" జాన్సన్‌కు లభించాయి.

స్కెల్టన్ హెన్రి యువరాజుకు ట్యూటర్ అయ్యాడు. ఏడవ కింగ్ హెన్రిగా ఆయన పట్టాభిషిక్తుడైన తర్వాత గురువు గారిని "ఆస్థాన కవి"ని చేశాడు. కొద్దికాలంలో తన స్వంత ప్రదేశం నార్త్ ఫోక్‌కు "రెక్టార్" అయ్యాడు. ఆ కాలంలో చర్చి బోధకులు పెళ్లాడరాదనే

నియమం ఉంది. మనకవికి పెళ్లి అయిందో లేదో తెలీదు. అతనిపై పెద్ద అభాండం వేశారు. దీన్ని తిప్పి కొట్టటానికి అందర్నీ సమావేశపరచి తన ఇంట్లో ఉన్న ఆమెపై అభూత కల్పనలు చేసినందుకు పరిష్కారంగా ఆమెయే తన భార్య అని ప్రకటించాడు. ఆమెకు ఉన్న కొడుకు తన కొడుకే అని తెలియజేశాడు. తనపై బిషప్‌కు "మూటలు" మోసిన వారిపై తీవ్రంగా విరుచుకుపడి "to complain without a cause, I say you be and have been and will and shall be knaves" అని వాళ్ళంతా పచ్చి "మోసగాళ్ళ"ని కడిగిపారేశాడు.

స్కెల్టన్ నిజాయితీ, నిర్భీకత వలన చర్చిలో అత్యున్నత పదవి పొందాడు. ఇది అంత ప్రధాన్య పదవేమీ కాదు. గ్రామంలోని ప్రీచర్‌తో సమానమే. కాని కార్డినల్ "ఒల్సీ" మీద పదే పదే ఆరోపణలు చేసేవాడు. తర్వాత రాజ దర్బారులో "రాయల్ ఆరేటర్" అయ్యాడు. కార్డినల్‌పై మాటల దాడి ఆపలేదు. విజృమ్భిస్తూనే ఉన్నాడు. దీన్ని తిప్పి కొట్టటానికి ఒల్సీ విశ్వ ప్రయత్నం చేస్తూ ఆత్మ రక్షణలో పడిపోయాడు. ఈ బాధ భరించలేక స్కెల్టన్ మినిస్టర్ ఆశ్రమానికి వెళ్లిపోయాడు. అక్కడే 70 ఏట స్కెల్టన్ నిజంగానే "స్కెలిటన్" (అస్థి పంజరం) అయ్యిడు.

రాజు విపరీత ధోరణులకు స్కెల్టన్‌యే కారణం. ఇద్దరూ విశ్రుంఖలంగా వ్యవహరించారు. ఫుద్దూ, బెద్దూ కలిసి పంచుకొన్నారు. కలిసి స్త్రీ సంభోగాలను అనుభవించారు. కుళ్ళు జోకులు, మురికి హాస్యంతో కాలం గడిపారు. అదే స్కెల్టన్ కవిత్వంలో చోటు చేసుకొంది. విలువల పతనం జరిగింది. విలువలకు ప్రాధాన్యతనివ్వలేదు. చిన్న ఛందస్సును ఎన్నుకొన్నాడు. వేగవంతంగా కవిత నడిపాడు. భావం అనేక కొత్త పోకడలు పోయింది. విపరీత ఆచారాలకు ప్రాధాన్యత నిచ్చాడు. అందుకే అతని సృజనను గురించి "crude and classic creation" అంటారు. "హోలీ బాత్", "మోళీ బ్లూం" కవితలలో కవిత్వం ప్రవహించింది. పాత్రల చిత్రణ ఆయన పేరుకు తగ్గట్లే రక్త మాంసాలులేకుండా "అస్థి పంజరాలు (స్కెలిటన్స్)"గా, నిర్జీవంగా ఉన్నాయి. కవి మేధస్సులోని ఒక పార్శ్వమే ప్రదర్శించాడు అని విమర్శకాభిప్రాయం.

"And prettily he would pant - when he saw an aunt - lord! how he wilde pry after the butterfly - lord! how he wolde hop - after the grass shop" ఇలా నడుస్తుంది. విషయంలో ఉన్న గాఢతను బట్టి కవిత్వం రాశాడు. ఎన్నుకొన్న ఛందస్సు నాలుగు దీర్ఘాక్షర సముదాయంగా ఉంటుంది. ఇలా ఇంతకు ముందు ఏ కవీ కవిత్వం రాయలేదు. అందుకే దీనికి "స్కెల్టానిక్ మీటర్" అని అతని పేరుమీద పిలుస్తున్నారు. తనకు ముందు ఉన్న కవుల శైలిని, సరళతను ఇతను ఇష్టపడలేదు.

మర్యాదకు భిన్నమైనవి, నీచమైనవి కావాలనే కవిత్వంలో చొప్పించాడు. సద్యోగర్భిత భావాలు అలవోకగా వచ్చి దూకే పదజాలంతో స్కెల్టన్ తన తరాన్నే కాక ముందు తరాలనూ ప్రభావితం చేశాడు. కాని మూడు కారణాల వలన అతన్ని దూరం చేశారని రాబర్ట్ గ్రీవ్స్ 1920లో రాశాడు. అవే "His wide though un deserved reputation as a specialist in obscenity, a misreading of his verse structure due to the dropping of the final "e" and other changes in pronunciation which occuring shortly after his death made Skelton's rhythms seemed wild and crudy contrived and the fact that the few available editions of his work were a hodge podge of faulty guesses and flagrant errors". ఏమైనా స్కెల్టన్ అతని "Cut and thrust manner was against him" అని తేల్చారు. పందొమ్మిదో శతాబ్దపు మధ్యకాలం వరకు అతను ప్రజల, ప్రైవేట్ వ్యక్తులకు దూరం అయ్యాడు. అలేక్సాండర్ డైస్స అనే మేధావి, విద్యావేత్త స్కెల్టన్ రచనలను తప్పులు లేకుండా మొట్టమొదటిసారి ప్రచురించాడు. అది కూడా కొంతకాలం అందరి దృష్టిలోకి రాలేదు. కొందరు ఆధునిక కవులు "Enthusiastically discovered the range of Skelton's variety, the virtuosity of his technique and brusque power of his personality, four hundred years after he was buried". ఇలా చరిత్ర గర్భంలో కలిసిపోయి ఆ ప్రతిభను గుర్తించిన ఆధునిక కవుల హృదయాలలోకిచేరి మళ్ళీ బతికి ప్రజా హృదయాలలో నిలిచిపోయాడు సృజన సూర్యుడైన కవి "స్కెల్టన్".




"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 6

# వ్యాట్, సర్రే కవులు - సానెట్ ప్రదాతలు

ఇంతకు ముందు తెలుసుకొన్న స్కెల్టన్ అగామి కాలాన్ని ప్రభావితం చేయలేకపోయాడు. పదిహేను, పదహారు శతాబ్దాలు మరికొంత స్థిర, పాత ఆనవాయితీ కోసం ఎదురు చూస్తున్నాయి. ఇది ఇటలీ నుండి ఇంగ్లాండ్ చేరింది. ఇటాలియన్ పోయిట్రీని ఇంగ్లీష్ కవిత్వంగా మార్చారు. కీట్స్‌ను పెల్లీని ఎలా విడదీసి చెప్పలేమో అలానే థామస్ వ్యాట్, హెన్రి హోవార్డ్, ఎరల్ ఆఫ్ సర్రేలు 1557లో కవులుగా రంగ ప్రవేశం చేశారు. "టాటిల్స్ సాంగ్స్ అండ్ సానేట్స్" అనే మొదటి ఆంగ్ల నీతి కథా కవిత వెలువడింది. తరువాత వ్యాట్ సర్రేలు వచ్చి సీను మార్చేశారు. వీరిద్దరూ రాసిన మొదటి సావేట్స్ మొట్ట మొదటిసారిగా ఆంగ్ల కవిత్వంలో అచ్చు అయ్యాయి. వీరి సాహస కృత్యం బ్రహ్మాండమైన విజయాన్నిచ్చింది. వీరి ప్రభావం తరువాత అర్ధ శతాబ్ది కాలం ఉంది. "ది పారడైజ్ ఆఫ్ డైంటి డివైసెస్", "ఏ గార్జియస్ గాలరి", "ది ఫారెస్ట్ ఆఫ్ ఫాన్సీ" మొదలైనవి సూపర్ డూపర్ హిట్స్ అయి శతాబ్దాల కాలం ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

ఒక దశాబ్దం తేడాలో పుట్టినా వ్యాట్ సర్రేలు కొత్త యవనికను లేపారని మెచ్చారు. ఆంగ్ల కవిత్వాన్ని ఛందస్సును మార్చే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో వీరిద్దరి ఆవిర్భావం కొత్త శక్తిని సృష్టించింది. ఒక అక్షరాన్ని అనేక రీతుల్లో పలకటం ఉచ్చారణ, ఇంద్రియానుభవంలకు సరైన స్థానం లేకపోవటంతో కవిత్వ గమ్యం అగమ్య గోచరంగా ఉండిపోయింది. వీరిద్దరూ కలిసి కవిత్వానికి స్థిరత్వాన్ని కల్పించారు. ఛందస్సుకు రూపకల్పన చేశారు. అదే అప్పటికి "ఆధునిక కవిత్వం" అయింది. దీనిపై జార్జి పుట్నహాం స్పందిస్తూ "వీరిద్దరూ ఇటలీ అంతా పర్యటిస్తూ ఇటలీ భాష మాధుర్యాన్ని ఆస్వాదించి డాంటే, అరిస్టో, పెట్రార్క్‌ల ధోరణులను జీర్ణం చేసుకొని ముతకగా, నేలబారుగా ఉన్న ఆంగ్ల కవిత్వానికి వన్నె, చిన్నెలు తీర్చిదిద్దారు. అందుకనే వీరిద్దరిని ఆంగ్ల కవితా ఛందస్సును, శైలిని మార్చిన "మొదటి కవితా సంస్కర్తలు" అనవచ్చు అన్నాడు.

ఆ రోజుల్లో ప్రతివాడికీ ఏదో ఒక సంగీత వాయిద్యాన్ని వాయించే నేర్పు ఉండేది. తమ కవిత్వానికి మూడు వంతులు వాళ్ళే సంగీతాన్ని సమకూర్చుకొనేవారు,నటించి

మెప్పించేవారు. వచనంలో కాని కవిత్వంలో కాని ధారాళంగా సంభాషించే నేర్పుండేది. ఆ కాలంలో సంపన్న కుటుంబంలో పుట్టిన ప్రతివాడూ కవిత్వాన్ని ఆదరించి పోషించే "పాట్రన్"గా ఉండేవాడు. అవసరమైతే చేతిగ్రాత ప్రతులను రాయించి స్నేహితులకు అందించేవారు. ఈ సంపన్నుల నుండి దానం ఆశించటం ఆనాడు నీచం అనే భావన ఉండేది. డబ్బు లేక ఇంకేదైనా వారి నుండి గ్రహించటం దిగజారుడు తనంగా అనిపించేది. కవిత్వం అందరిదీ అనే భావంలో ఉండేవారు. అందుకే వ్యాట్ సర్రేల కవిత్వానికి అంత గుర్తింపు వచ్చింది.

ఈ ఇద్దరు కవుల్లో వ్యాట్ కవి "సానెట్"ను ఇంగ్లాండ్‌కు తెచ్చిన ఘనత పొందాడు. వ్యాట్ 1503లో కెంట్‌లోని అలింగ్‌టన్ కాజిల్‌లో పుట్టాడు. పదమూడేళ్ళకే కేంబ్రిడ్జిలో సెయింట్ జాన్స్ కాలేజిలో దాని ప్రారంభ సంవత్సరంలోనే 1516లో చేరాడు. డిగ్రీలో ఉండగానే కవిత్వం రాశాడు. పదిహేడేళ్ళకే ఎం.ఏ డిగ్రీ పొందాడు. ఇరవై అయిదేళ్ళ వయసులో ఇటలీకి రాయబారి అయ్యాడు. అదుగో అప్పుడే పెట్రార్క్ కవిత్వంపై మోజు పడ్డాడు. లార్డ్ కాభాం కుమార్తెను పద్దెనిమిదేళ్ళ వయసులో అన్నేబియాన్‌ను పెళ్ళి చేసుకొన్నాడు. ఆమెకు ఎనిమిదవ హెన్రితో అంతకు ముందే పెళ్ళి అయింది. ఆమె శృంగార చేష్టలు బయటపడి వ్యాట్‌ను "టవర్ ఆఫ్ లండన్"లో నిర్బంధించారు. విడుదల తర్వాత ఫ్రాన్స్, స్పెయిన్‌లకు పనిమీద పంపితే మళ్ళీ అరెస్ట్ అయ్యాడు. అతని మంచితనానికి రాజు విడిపించి మళ్ళీ ఉద్యోగం ఇచ్చాడు. అతనిపై మోపబడిన అన్ని అభియోగాల నుండి బయటపడ్డాడు. వయస్సు నలభై. చేజారిన ప్రేమికురాలి కోసం వ్యధతో కవిత్వం రాశాడు. ఇటలీ భాషా సౌందర్యాన్ని ఆంగ్ల భాషకు అద్దటమే కాక వ్యాట్‌లో గొప్ప చొరవ ఉండేది. ఇటలీ భాషలోని 14 పంక్తుల సానెట్‌ను ఇంగ్లీష్‌లో ప్రవేశపెట్టిన మొదటివాడైనా మొదటి ఎనిమిది లైన్ (ఆక్టేవ్)లను యధాతథంగానే గ్రహించి చివరి ఆరు లైన్లను (సేస్టెట్)లో అద్భుతమైన సమాప్తిని, దానికి అనుబంధంగా రెండు లైన్ల "కప్లేట్"ను చేర్చి చదివిన వారిపై గాఢముద్ర వేశాడు. దీన్ని షేక్స్‌పియర్ అద్భుతంగా తన సానెట్‌లలో ఉపయోగించుకొన్నాడు. పెట్రార్క్ సానెట్‌లో రెండు భాగాలను రెండుగా భావిస్తే వ్యాట్ అందులో ఫ్యూజన్ చేసి అబ్బురపరచాడు. ఎనిమిదో లైన్ తొమ్మిదితో కలిసిపోయేట్లు, బ్రేక్ లేకుండా చేసి అందాన్ని సృష్టించాడు. దీనితో "Setting an example for the unified and integrated sonnets of Milton and Words Worth" అని మెచ్చుకొన్నారు. ఆంగ్ల సాహిత్యంలో వ్యాట్ "ఒక మైలు రాయి"గా నిలిచాడు.



**బ్లాంక్ వెర్స్‌కు ఆద్యుడు – హెన్రిహోవార్డ్**

ఈ జంట కవులలో రెండవ వాడు "హెన్రి హోవార్డ్ ఎరల్ ఆఫ్ సర్రే". వ్యాట్ కంటే పద్నాలుగేళ్ళ పిన్నవాడు. తక్కువ కాలమే

జీవించినా తన ముద్ర వేశాడు. 1517లో రాయల్ వంశంలో పుట్టాడు. తండ్రి, ఎడ్వర్డ్ రాజు బంధువు. తల్లి ఎనిమిదవ ఎడ్వర్డ్ చుట్టం. కనుక ఆతని జీవితం రాజాంత:పురంలోనే గడిచింది. యువరాజులే స్నేహితులు. డ్యూక్ ఆఫ్ రిచ్ మాండ్ అంటే ఎనిమిదవ హెన్రి అక్రమ సంతానం ఇతని ముఖ్య స్నేహితుడు. సర్రేకు పదిహేనేళ్ళప్పుడు ఈ ఇద్దరూ కలిసి ఫ్రాన్స్ వెళ్ళారు. ఏడాది తర్వాత ఇంగ్లాండ్‌కు వచ్చెయ్యమని కబురు. రిచ్‌మాండ్ సర్రే సోదరిని పెళ్ళాడాడు.

మరో పన్నెండేళ్ళు సర్రే రాజ దర్బారుల్లో హాయిగా జీవితం గడిపాడు కొత్త బంధుత్వం వలన. ఒక తిరుగుబాటును అణచివేశాడు. ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా నౌకా ప్రచారం కోసం వెళ్ళాడు. యుద్ధంలో తీవ్రంగా పాల్గొన్నాడు. వీలు దొరికినప్పుడు కవిత్వం రాశాడు. 1539లో “the most foolish and proud boy that is in England” అని ఇరవై రెండేళ్ళ వయసులో ముద్ర వేయించుకొన్నాడు. అతని గర్వం ఏమిటీ అంటే ఏ పనీ చేయకపోవటమే. “ ఎడ్వర్డ్ ది కన్ఫేసర్” వంశ చిహ్నంపై చేసిన ఒక పనికి ఎనిమిదవ హెన్రిని రాజ్య భ్రష్టుడిని చేసే కుట్రలో పాల్గొన్నాడని నేరారోపణ చేశారు. అయితే సర్రే అతి తెలివితేటలు కష్టాల్ని మరింత పెంచాయి. శిక్ష పడింది. అందర్నీ అంటకాగి ఉరి తప్పించుకోవాలని అన్ని ప్రయత్నాలూ చేశాడు. జ్వరం వలన కొద్దికాలం ఆగినా ముప్ఫై మూడవ ఏట “టవర్ హిల్” మీద తల తీసేశారు. గురువు వ్యాట్‌కు ఉన్న డేరింగ్ నేచర్ లేకపోయినా సర్రే కవిత్వానికి నగిషీలు చెక్కాడు. వ్యాట్ కంటే అందమైన, సరళమైన శైలితో సానెట్లు రాశాడు. చాలా పరఛ్ఛందీగా, స్వయం నియంత్రణతో రాశాడు. సంక్షిప్తకు ప్రాధాన్యమిచ్చాడు. “Surre invented a new poetic speech, he made all sucessding poets his debtors when he translated two books of the "Aneid" into iambic pentameters and fashioned the decasyllabic line now known as "blank verse"” అంటే బ్లాక్ వేర్స్‌కు ఆద్యుడు సర్రే. సర్రే సమకాలీనులెవ్వరూ ఆంగ్ల కవిత్వంలో ఒక “విప్లవం” వచ్చిందని భావించలేదు. యాభై ఏళ్ళ తర్వాత ఎలిజబెతేన్ డ్రామాలలో అని బద్ధ కవిత్వం అంటే బ్లాంక్ వేర్స్ ఒక గొప్ప మాధ్యమం అయింది. “Its potency grew until the steady beat of its ten pulsing syllables became the normal measure of English diction, a measure that grew into the natural language of Marlowe and Shakespear and Milton”. ఇటలీ సానెట్‌ను ఇంగ్లీష్ భాషలోకి తెచ్చి ప్రాణ ప్రతిష్ట చేసి దానికి ఇంపుసొంపులు కూర్చి దాని వైభవాన్ని పెంచి ఆ తర్వాత బ్లాంక్‌వేర్స్‌కు ప్రాణ ప్రతిష్ట చేసి, ఆంగ్ల కవిత్వాన్ని రెండు గొప్ప మలుపులు తిప్పిన కవులే వ్యాట్ మురియు సర్రే కవులు.❋



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 7

# సర్ వాల్టర్ రాలీ - సాహస నౌకా యాత్రికుడు

**వ్యాట్** రాసిన "టాట్లేర్స్ సాంగ్స్" ప్రచురణతో లాభాలు బాగా సంపాదించిన ప్రచురణకర్తలు, కవులు కొత్త ఉత్సాహంతో ఊగిపోయారు. ప్రతిభ ఉన్న ఎమేచ్యూర్ కవులు ప్రొఫెషనల్ కవులైపోయారు. 1525-1577 కాలం వాడైన జార్జి గాస్కోన్ తన కవితలు ముద్రణ లాభాలతో పొందటంతో తృప్తి పడక నీతి పద్యాలు రాసి అచ్చేశాడు. నికొలాస్ బ్రీతాన్ అనే అతని మారుటి కొడుకు గ్రామీణ శృంగార కవితలు రాశాడు. జార్జి వెట్స్ స్టోన్ కూడా ఈ బృందంలో చేరాడు.

అది జాగృతమైన యుగం. అనేక విరుద్ధ భావాలమయం. దేశాల సరిహద్దుల్ని పెంచుకోవటం సాంస్కృతిక వైభవాన్ని స్తుతించటం సర్వ సాధారణమైంది. ఇంగ్లాండ్ అన్ని రకాలుగా "దివాలా" తీసి పోయింది. ధనాగారం నిండుకొంది. దాన్ని నింపటానికి కొత్త ప్రదేశాలను కనుక్కోవటానికి సముద్ర యానాలను ప్రోత్సహించింది. సముద్రాంతర భాగాల ఆక్రమణ ధ్యేయంగా ఇది సాగింది. ఇందులో రహస్యంగా యుద్ధం, పైరసీ అంటే సముద్ర దొంగతనం ఇమిడి ఉన్నాయి. ఎలిజబెత్ రాణి ఆ కాలపు అన్ని విపరీత భావాలు, అంటే మతం, క్రూరత్వం, పరిశోధనాత్మక కళ, నిరాశాపూరిత శ్రమ, బేఫర్వాతనం మేధావిత్వముపై అసంతృప్తి అన్నీ సంక్రమింపజేసుకొంది. ఇవన్నీ ఆమె వ్యక్తిత్వంలో చోటు చేసుకొన్నాయని సర్ వాల్టర్ రాలీ విశ్లేషించాడు.

ఎలిజబెత్ రాణి శృంగార పతనం రాలీమీద మిషతో పడటం వాల్టర్ చారిత్రక

పురుషుడయ్యాడు. అతను అలాంటి వాడో కాదో తెలీదు, కాని అతని చుట్టూ అనేక కథలూ గాథలూ అల్లారు. మేధావి దైవ భక్తీ ఉన్నవాడు, అన్నిట్లోనూ ముందుండే ఇంగ్లీష్ రీనైసంస్ మనిషి, యోధుడు, నావికుడు, రాజకీయ వేత్త, సాహసి, పరిశోధకుడు అన్నిటికంటే గొప్ప కవి. 1552లో దేవెంషైర్‌లో హెలీ బార్టన్ దగ్గర పుట్టాడు. ఆక్స్‌ఫర్డ్ ఓరియల్ కాలేజిలో చదివాడు. డిగ్రీ పొందలేకపోయాడు. కెప్టెన్ పదవి కంటే పెద్ద పదవి రాలేదు. పదేళ్ళలో బాగా పెరిగి తరిగిపోయాడు. రాణి అతన్ని దయగా చూసేది. సర్ హంఫ్రీ గిబ్బర్ట్ రాలీకి సోదరుని వరుస. 1578లో అతని మొదటి అమెరికాకు నౌకా యానానికి వెడుతూ తన నౌకలపై అధికారాన్ని రాలీకి అప్పగించాడు. గిల్బర్ట్ అమెరికా బయల్దేరగానే రాలీ కొత్త ప్రదేశాలు కనిపెట్టి జయించటానికి పూనుకొని బయల్దేరాడు. అప్పుడే తను కనుగొన్న “కాలని”కి కన్య (వర్జిన్)గా ఉన్న రాణి పేర “వర్జీనియా” అని పేరు పెట్టాడు.

కాని అకస్మాత్తుగా అతనిపై రాణికి దయ తప్పింది. దీనికి కారణం రాణి పనికత్తె ఎలిజబెత్ త్రాక్ మారటాన్‌పై రాలీ కన్ను పడిందని అనుమానించటమే. ఇది రాజ ద్రోహంగా రాణి భావించింది. వెంటనే ఆమెను పెళ్లి చేసుకోమని హుకుం జారీ చేసి అమలు అయ్యేట్లు చూసింది. రాలీ ఎలిజబెత్‌లు హాయిగా సంసారం సాగించారు. కాని రాణి కోపం ఆగిపోలేదు. అతన్ని క్షమించలేకపోయింది. అతని ప్రాముఖ్యాన్ని తగ్గించే అన్ని ప్రయత్నాలూ చేసింది. పనామాలో పరిశోధన చేస్తున్న రాలీని వెంటనే వెనక్కి పిలిపించి, చౌకబారు ఆరోపణల మీద టవర్ జైల్లో పెట్టించింది. “ఆమ్యామ్యా” సమర్పించి రాలీ విడుదలైనాడు. మళ్ళీ రాణీగారి కృపా వీక్షణాలను పొందాడు. కాని సమస్యలు అతన్ని వెంటాడుతూనే ఉన్నాయి. తనపై మోపబడ్డ మచ్చలను మాపుకోవటానికి అనేక నౌకా యానాలు చేశాడు. రాణి దయ కోసం వెంపర్లాడాడు. రాణి రాలీ ప్రతిభ గుర్తించి జెర్సీకి గవర్నర్‌ను చేసింది. రెండేళ్లకే రాణి చనిపోయింది. విధి వక్రించి రాలీ మళ్ళీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయాడు. మొదటి జేమ్స్ రాజైన తర్వాత కొత్త రాజును కూల దోసే కుట్రలో రాలీ కూడా ఉన్నాడని తప్పుడు అభియోగం మోపాడు. జడ్జి ఎటూ తేల్చలేక చివరికి మళ్ళీ టవర్‌లో ఉరి శిక్ష అమలు చేయమని ఆజ్ఞాపించాడు. కాని అమలుకు ముందు పద్నాలుగేళ్ళు జైల్లో ఉంచారు. అరవై ఏళ్ళు వచ్చాక విడుదలైనాడు. ధైర్య సాహసాలతో ఒరినాకోలో బంగారం కోసం మళ్ళీ సముద్ర పరిశోధనకు బయల్దేరాడు. ప్రయోగం విఫలమైంది. తిరిగి రాగానే అరెస్ట్ చేశారు. ఒక స్పానిష్ సెటిల్‌మెంట్‌ను రాలీ కావాలనే తగలబెట్టాడని స్పానిష్ రాయబారి నేరం మోపాడు. రాలీమీద పాత రాజద్రోహం మళ్ళీ వెలుగులోకి తెచ్చి మళ్ళీ జైలు పాలు చేశారు. విచారణలో రాలీ తప్పు చేసినట్లు రుజువైంది. 29-10-1618న ఆ సాహస యాత్రికుని తల నరికారు. ఆ రోజుల్లో రాలీని గురించిన సాహస గాథలు పాటలుగా, కథలుగా జనం పాడుకొన్నారు

చెప్పుకొన్నారు. అతని నౌకాయానం చరిత్రలో నిలిచిపోయింది. రాలీ యువరాజు "ప్రిన్స్ ఆఫ్ వేల్స్" జ్ఞానాభివృద్ధి కోసం "ది హిస్టరీ ఆఫ్ ది వరల్డ్"ను జైల్లో ఉండగా పదమూడేళ్ళు కష్టపడి రాశాడు. రాలీలోని కవితాత్మను అతని రాజోద్యోగం, నౌకాయానం మరుగు పరచాయి. త్రుణికారాన్ని సామాన్య విషయంగా "ది నిమ్ఫ్సు రిప్లైటు ది షెపర్డ్"లో చూపాడు. "ది వుడ్, ది వీడ్, ది వాగ్" కవిత నిరాశా నిస్పృహలతో చావుకు దగ్గరౌతున్న వాడి మాటల్లా రాశాడు. అది రాలీ తనను గురించి రాసుకొన్న "స్మృతి గీతం" అతని టెక్నిక్ గొప్పదే కాని అతని కాలనైజేషన్ లాగా అదీ ఫలించక పోవటం దురదృష్టం.

**కవులకు కవి – ఎడ్మండ్ స్పెన్సర్**



స్పెన్సర్ తన సమకాలీన కవుల, తన వంశం వాళ్ళతో విభేదించాడు. ప్రత్యేకత సాధించాడు. తన కవిత్వంతో ఇంగ్లీష్ కవిత్వాన్ని సుసంపన్నం చేశాడు. లాటిన్ భాషా సొగసుల్ని అద్దాడు. అంత ప్రాచుర్యమూ తెచ్చాడు. మహా కావ్యాలు రాయాలని తపించాడు. అవి ఓడిస్సీ, ఎనీడ్‌ల స్థాయిలో ఉండాలని ఆశించాడు. "ది ఫైరీ క్వీన్" "షెపర్డ్స్ కాలెండర్"లు వీటికి ఉదాహరణలు. టియోక్రిటాస్, వర్జిల్‌లను ప్రేరణగా గ్రహించాడు. ఆంగ్ల గ్రామీణ కవిత్వానికి సొగసులు చేకూర్చాడు.

1552లో వస్త్ర తయారీ దారుని కొడుకుగా పుట్టి టేయిలర్స్ స్కూల్‌లో చదివి కేంబ్రిడ్జిలో ఇరవై అయిదేళ్ళకే ఎం.ఏ సాధించాడు. అతని ముచ్చటైన రూపం, తెలివితేటలతో లీసేస్టర్ బంధువు ఎలిజబెత్ రాణికి బాగా ఇష్టుడైన "ఎరల్ ఆఫ్ లీ చెస్టర్"కు సెక్రటరీ అయ్యాడు. లీసేస్టర్ బంధువు సర్ ఫిలిప్ సిడ్నీతో సాహిత్య పరిచయమేర్పడింది. ఇంకో ఇద్దరు ఈ బృందంలో చేరారు. ఛందస్సుపై అనేక చర్చలు జరిపారు. రాజాస్థానంలో ఉద్యోగం పొందాలనుకొన్నా రాలేదు. ఇరవై అయిదేళ్ళకు ఐర్లాండ్‌కు క్రూరుడైన లార్డ్ గ్రే డీ విల్టన్‌కు సెక్రటరీగా వెళ్ళాడు. రెండేళ్ళలో గ్రేను వెనక్కి పంపించేశారు. డబ్లింగ్‌లో గుమాస్తాగా చేరి స్పెన్సర్ ఉండిపోయాడు. తర్వాత మంచి జీతంతో షరీఫ్ అయ్యాడు. ఐర్లాండ్‌ను "ప్రవాసదేశం"గా ఎప్పుడూ భావించేవాడు. ఐరిష్ ప్రజలంటే ద్వేషం. "లార్డ్ డిప్యూటీ" భావాలు మాత్రం నచ్చాయి. సెన్సర్ "నైట్ ఎర్రంట్ ఆఫ్ జస్టిస్"గా ఫైరీ క్వీన్‌లో అతన్ని చిత్రించాడు. లార్డ్ గ్రే దయవలన మూడు వేల ఎకరాల ఎస్టేట్‌ను కౌంట్ కార్క్‌లో పొందాడు. అందులో నిర్మించిన "కిల్కొల్మాన్ సౌధం"లో ప్రవేశించాడు. ఫైరీ క్వీన్‌లో మర్మంగా "గ్లోరియానా" పాత్రగా సృష్టించిన ఎలిజబెత్ రాణికి అంటే వర్జిన్ క్వీన్, వర్జిన్ మేరీకి అంకితమిచ్చాడు. నలభయ్యవ పడిలో "ఎలిజబెత్ బాయిల్"ను పెళ్ళాడాడు. ఆమె వలననే అందరూ పాడుకొనే

పెళ్లి పాట "ఎపితాల్మియాన్"ను మహాద్భుతంగా రాశాడు. "To which the woods did answer and your" అంటూ సాగే పాట అది.

పెళ్లి అయిన నాలుగేళ్ళకు ఐరిష్ అంతర్యుద్ధం 1598లో మొదలైంది. స్పెన్సర్ సౌధాన్ని ముట్టడించి అగ్నికి ఆహుతి చేశారు. భార్య నలుగురు పిల్లలతో తప్పించుకొని పారిపోయి ఒక చౌక ఇంట్లో అద్దెకుండి తల దాచుకొన్నాడు. ఒక నెలలోపే స్పెన్సర్ 16-01-1599న మరణించాడు. ఎరల్ ఆఫ్ ఎస్సెక్స్ స్పెన్సర్ అంత్యక్రియల ఖర్చుపెట్టాడు. తర్వాత స్పెన్సర్ భౌతిక దేహాన్ని లండన్‌లోని పోయెట్స్ కార్నర్ అయిన వెస్ట్ మినిస్టర్ అబ్బేలో భద్రపరచారు. స్పెన్సర్‌ను చదవటం కంటే ఎక్కువగా గౌరవించారు. భాషపై అనితర సాధ్యమైన పట్టు, పద ప్రయోగం ప్రవాహం వేగంతో జాలువారే పదాల వరుస స్పెన్సర్ ప్రత్యేకత. విమర్శకులు, సాహిత్య నిపుణులు స్పెన్సర్ కవిత్వాన్ని ఎంతగానో మెచ్చుకొన్నారు. స్పెన్సర్‌ను "కవులకు కవి" అన్నారు.

స్పెన్సర్ కవి తొమ్మిది లైన్ల సుందర కవితను సృష్టించి వందలాది తరువాతి కవులకు మార్గదర్శి అయ్యాడు. అదే "a-b-a-b-b-c-b-c-c ". దీనినే "స్పెన్సర్ స్టాంజా" అన్నారు. మొదటి ఎనిమిది లైన్లు, పది అక్షరాల సముదాయంతో దీర్ఘముగా, పొందికగా ఉండి చివరి లైను పన్నెండు అక్షరాల సముదాయంతో "అలెక్సాండ్రిన్" అనే పేరుతో ఉండటం స్పెన్సర్ చేసిన ప్రయోగం, సాఫల్యం. అతని ఫైరీ క్వీన్ నుంచి దీనికి ఉదాహరణ.

"It was an hill placed in an open plain - that round about was bordered by a wood - of matchless height that seemed the earth to disdain-in which all trees of honor stately stood-and did all winter as in summer bud-spreading pavilions for the birds to bower-which in their lower branches sung aloud-and in their tops the soaring hawk did tower-sitting like kings of fowls in majesty and power".

ఇదీ స్పెన్సర్ స్టాంజా అంటే. ఎనభై ఎనిమిది సానేట్స్ రాశాడు. స్పెన్సర్ ఆరాధ కవులు అతన్ని అనేక రకాల కవితలతో కీర్తించారు. అందుకే ఏదైనా ప్రత్యేకత ఉంటే దాన్ని "స్పెన్సర్ రేట్" అని "స్పెన్సర్ క్వాలిటీ" అని అనటం అలవాటయ్యింది. ❀



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 8

# సిడ్నీ, డేనియల్, డ్రేటన్ త్రయం

ఎలిజబెత్ శకానికి పూర్తిగా తగిన కవులుగా ఫిలిప్, సిడ్నీ, వాల్టర్ రాలీ కవులను భావిస్తారు. కాని సిడ్నీ రాలీకి భిన్నుడు. రాలీ జీవితం అంతా అపజయాల పరంపర అయితే సిడ్నీది విజయ పరంపర. మోసపూరిత శత్రువైల మధ్య రాలీ గడిపితే అభిమానులు, పలుకుబడి గలవారు, ఆరాధకుల మధ్య సిడ్నీ జీవితం గడిపాడు. దీనికి సిడ్నీ ఉన్నత కులంలో పుట్టటం కారణం కూడా.

**సర్ ఫిలిప్ సిడ్నీ – మనసున్న రాజకవి**

సర్ ఫిలిప్ సిడ్నీ 1554లో ఐర్లాండ్ లార్డ్ డిప్యూటీలో "చేస్టర్ ఎరల్"కు సోదరి అయిన లేడి సిడ్నీ దంపతులకు జన్మించాడు. తండ్రికి "కెంట్"లో ఉన్న విలాసవంతమైన పల్లె వాతావరణంలో భోగాల మధ్య సిడ్నీ చిన్నతనం ప్రాథమిక విద్య గడిచింది. తర్వాత కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్‌లలో చదివి, పద్ధెనిమిదేళ్ళకే "గ్రాండ్ టూర్" పేరిట అనేక ప్రదేశాలు తిరిగి ప్రింటర్లను కలిశాడు. హ్యూమనిస్ట్ అయిన "లాంగిడ్"తో విద్య నేర్చాడు. అతనితో యూరప్ అంతా పర్యటించాడు. ఇంగ్లాండ్‌కు తిరిగొచ్చి రాజదర్బారులో చేరాడు. అతని మేజస్టే, ఆకారం, పద్ధతులకు అంతా ఆకర్షితులైనారు. అతనికి చదువు చెప్పిన మేష్టర్లు కూడా అతనిలో ఏదో ప్రత్యేక ఆకర్షణ శక్తి ఉందనేవారు. కేనిల్ వర్త్‌లో అతని మేనమామ ఎరల్ ఆఫ్ లీచేస్టర్ ఎలిజబెత్ రాణికి గొప్ప సన్మానం చేశాడు. అక్కడ సిడ్నీ లార్డ్ ఎస్సెక్స్ కూతురు పెనెలోప్ దివారేక్స్‌ను చూసి మనసు పారేసుకొని "ఆస్ట్రోఫెల్ అండ్ స్టెల్లా" పేరిట రాసి సానెట్ ప్రవాహానికి పదహారు పదిహేడు శతాబ్దాలకు ప్రేరణ కలిగించాడు. పెనెలోప్ సిడ్నీ ప్రేమను అంగీకరించిందో లేదో తెలీదు. కాని ఆమెకు వేరొకరితో పెళ్లి అయింది. ఇరవైవ ఏట సిడ్నీ పెళ్లి సర్ ఫ్రాన్సిస్ వాల్సిన్ఘాన్ కూతురుతో జరిగింది.

సంపద, కీర్తి కోసం సిడ్నీ ప్రయత్నించాల్సిన అవసరమే రాలేదు. కీర్తి, కనకాలు అతని వెంటపడ్డాయి. పార్లమెంట్‌లో కూర్చున్నాడు. ఎలిజబెత్ సిడ్నీని "నైట్"ను చేసింది. ముప్ఫైవ ఏట "ప్లాషింగ్"కు గవర్నర్ అయ్యాడు. వంశం, హోదా, తెలివితేటలు అన్నీ అతనికి కలిసొచ్చాయి. "జుట్ ఫెన్" యుద్ధంలో గాయపడ్డాడు. గ్లాసులో మంచినీళ్ళు తాగటానికి నోటి దగ్గర పెట్టుకొంటుండగా, యుద్ధంలో పూర్తిగా గాయపడి చావుకు దగ్గరలో ఉన్న ఒక సైనికుడు తన వంక చూడటం గమనించాడు. అతనిలో మానవత్వం వికశించింది. మంచినీళ్ళు తాగటానికి ఇష్టపడక "నీ అవసరం నా అవసరం కంటే ముఖ్యం" అని చెప్పి ఆ నీళ్ళు ఆ సైనికుడికి ఇచ్చేశాడు. జీవితాన్ని చరితార్థం చేసుకొని చిరస్మరణీయంగా కొన్ని రోజుల తర్వాత గాయాల బాధతో సిడ్నీ 07-10-1586న మరణించాడు. సిడ్నీలో హద్దులు దాటని ఆవేశం, కవితా శైలి ఉన్నాయి. మంచి మనిషిగా పేరు. "ఆస్ట్రోఫెల్ అండ్ స్టెల్లా"లో నలభై ఏడవ సానెట్ ప్రేమికురాలు నిర్దాక్షిణ్యంగా పెట్టిన క్షోభను వర్ణించాడు. ఇది హామ్లెట్‌లో ఒకానొక "ఆత్మ గత భాషణం" అంటే "సాలి లోక్వి"గా కనిపిస్తుంది. అతని సమకాలీన కవులకంటే భిన్నంగా లాభా పేక్ష కాకుండా ఆనందానికే సిడ్నీ కవిత్వం రాశాడు. అతను చనిపోయిన చాలాకాలానికి కాని పూర్తిగా కవితలు ప్రచురింపబడలేదు. సిడ్నీ "Mingling blank verse and rhyme, attempting to vary orthodox rhymes with experimental measures, playing with intricate and internal rhyme schemes-were not appreciated until much later, and it is only recently that the unfading freshness of his lyrics has been rated high as his sonnets." అని అతని కవితా ప్రతిభను వచన కవిత్వాన్ని తీర్చిదిద్దిన విధానాన్ని ప్రశంసించారు. సిడ్నీ కవిత్వం చాలా సంక్షిప్తంగా, మసకబారకుండా, స్వచ్ఛంగా ఉంటుంది.

సిడ్నీలో ఇతర కవుల కంటే భిన్నంగా ఉండే మరో విశేషం ఉంది. "యాన్ అపాలజీ ఫర్ పోయిట్రీ" అనే గ్రంథాన్ని రాశాడు. అందులో వేదాంతి, చరిత్రకారుడు కంటే కవి గొప్పవాడని అన్నాడు. వేదాంతి కనిపించని దాని గురించి ఆలోచిస్తూ ఉంటాడు. చరిత్రకారుడు నిజమైన విషయాలను గూర్చి మాత్రమే పట్టించుకొంటాడు. కాని కవి విశ్వభావనతో ఆలోచిస్తాడు. కవి ఆనందాన్ని ఇవ్వటమే కాదు బోధిస్తాడు కూడా. "The poet cometh to you with words set in delightful proportion and with a tale which holdeth children from play and old men from the chimney corner" అని కవి శక్తిని అంచనా వేశాడు. శైలి గురించి చెబుతూ "fool" "said my Muse to me" "look in thy heart and write" అని తన అంతరంగం చెప్పిందని మనందరికీ చెప్పాడు. మనసు పెట్టి రాస్తే అన్నీ అందులోనే వస్తాయి అని చెప్పాడన్న మాట.

**సామ్యుల్ డేనియల్**



1562-1619 కాలంవాడు సామ్యుల్ డేనియల్ కవి. సానెట్‌లలో మాంచి నైపుణ్యం చూపాడు. అతను రాసిన "సివిల్ వార్" కవితలు అందర్నీ ఆకర్షించాయి. ఇవి ఎనిమిది పుస్తకాల సీరియల్‌గా 1595లో అచ్చయ్యాయి. పధ్నాలుగేళ్ళ తర్వాత మరో నాలుగు వచ్చాయి. ఈయన కవిత్వంలో చరిత్ర, నీతి, కవిత్వ విధానం మొదలైనవి ఉంటాయి. చదవటానికి ఆకర్షణగా లేకపోవటం పెద్ద లోపం.

**మైకేల్ డ్రేటన్ – ఊహా ప్రేమలేఖల కవి**



డ్రేటన్ 1563లో పుట్టి 1631లో డేనియల్ కంటే ఒక ఏడాది తరువాత చనిపోయాడు. రాసిన "పోలియోల్బిన్"లో ఇంగ్లాండ్ భౌతిక అందాలను ఆరబోశాడు. వేలకొద్దీ పన్నెండు అక్షర సముదాయాల "ద్విపదలు(కప్లేట్స్) ఉత్సాహంగా, వైవిధ్యభరితంగా, చారిత్రక కథనాత్మకంగా, నాటికలుగా, గ్రామీణ కవితలుగా, లెజెండ్స్‌గా, వ్యంగ్యంగా, మత ధ్యాన పరంగా ఉంటాయి. "ఇంగ్లాండ్స్ హీరోయికల్ ఎపిజిల్స్"లో ప్రముఖ రాజుల, లార్డ్‌ల వారి ప్రేయసుల మధ్య జరిగినట్లు ఊహించి రాసిన ప్రేమ లేఖలు విపరీతంగా పేరొందాయి. ఒక దశాబ్దంలో పన్నెండుసార్లు ఇవి పునర్ముద్రణ పొందాయి అంటే వాటి ప్రాచుర్యం యెంత గొప్పగా ఉందో తెలుస్తోంది. అలాగే అతని "ది బాటిల్ ఆఫ్ అగినో కోర్ట్"లో వీరోచిత యుద్ధం చేసిన ఒక గుర్రం కథనుకదను తొక్కిస్తాడు. కవిత్వాన్ని శక్తివంతమైన మాటలు బాణాల్లా దూసుకొస్తాయి. చరిత్రను వీరోచిత పోరాటాన్ని కళ్ళకు కట్టించాడు.

డ్రేటన్ దీర్ఘ కవితల జోలికి వెళ్ళకుండా చిన్న వాటినే మోజుగా చదువుతున్నారిప్పటి కొత్త తరం వాళ్ళు. "Since there is no help, come let us kiss and part" అన్న సానెట్‌ను "one of the greatest emotional out bursts over captured in the confines of a sonnet" అని పొగిడారు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 9

# కవితా శక్తి జలపాతం-క్రిస్టఫర్ మార్లో

**మం**డుతున్న కవితాగ్నిగా, శక్తి జలపాతంగా కీర్తింపబడ్డ క్రిస్టఫర్ మార్లో 1564 ఫిబ్రవరి 26న కాంటర్‌బరీ హౌస్‌లో షేక్స్‌పియర్‌కు రెండు నెలలు ముందు పుట్టాడు. కవులు "The muses darling" అని, షేక్స్పియర్ మార్లో తన ప్రేరణ అని, జాన్సన్ అతని కవితా పంక్తులు మహాశక్తి పూరకాలని, డ్రేటన్ "Had tranlunary things in him" ఉన్న కవి అని మెచ్చారు. మార్లో చనిపోయిన మూడు శతాబ్దాల తరువాత స్విన్ బరన్ కవి "crowned, girdled and shod with light and fire, first born of the morning sovereign star" అని కితాబిచ్చాడు. మార్లో ముప్పై ఆరు నాటకాలు, నూట ఏభై నాలుగు సానేట్స్, రెండు దీర్ఘ కవితలు రాశాడంటారు. మార్లో తండ్రి చెప్పులు తయారు చేసేవాడు. తాత తోళ్ళను శుభ్రం చేసేవాడు. అంతా ఆ ఇరుకు కొంపలోనే గడిపారు. నలుగురు చెల్లెళ్ళు వున్నారు. 15వ ఏట స్కాలర్‌షిప్ సంపాదించి మార్లో కింగ్స్ స్కూల్‌లో చేరాడు. మరో రెండేళ్లకు మరో స్కాలర్షిప్ పొంది కేంబ్రిడ్జ్‌లోని కార్పస్ క్రిస్టి కాలేజిలో చేరాడు. ఆరేళ్ళు చాలా ఇబ్బందులు పడ్డాడు. మార్లోకు అతీత శక్తులున్నాయని తోటి విద్యార్థులు అనుకొనేవారు. అనుభవించాడు కూడా. ఇతను మాత్రం పాత నిబంధనలలో జెహోవా ఉదంతాన్ని పఠిస్తూండేవాడు. కొత్త నిబంధనలోని జీసస్ కంటే యెహోవాపై నమ్మకం ఎక్కువ, కఠిన నిబంధనలకు, ఏ నిబంధనలూ లేని భయపడి "పాగన్ వరల్డ్" అంటే విగ్రహారాధనకు చేరువైనాడు. ఇరవయ్యవ ఏట పవిత్ర గ్రంధాలు చదువుతూనే "ఓవిడ్"ను సరళ భాషలో అనువాదం చేసి ప్రచురించాడు. లండన్ బిషప్, కాంటర్ బరీ ఆర్చి బిషప్ దీన్ని నడిబజారులో తగలపెట్టించారు. మరో రెండేళ్లలో క్రిస్టియన్ ఫాదర్ల నుండి దూరమై "ఈతెన్ డ్రమటిస్ట్"లకు దగ్గరయ్యాడు. "లూకాన్"లో కొన్ని భాగాలు తర్జుమా చేశాడు. వర్జిల్ దగ్గర తానూ రాయబోయే

"The tragedy of Dido-queen of Carthage" నాటకానికి ముడి సామగ్రిని సేకరించాడు.

**నాదాత్మక శబ్ద బ్రహ్మ**

మతాధికారుల దౌర్జన్యం మితిమీరిపోయింది. డిగ్రీని ఇవ్వటానికి యిష్టపడలేదు. కేంబ్రిడ్జ్‌ని వదిలేసి లండన్ చేరాడు మార్లో. నటులు, నాటక రచయితలతో పరిచయం పెంచుకొన్నాడు. థియేటర్లుతో అనుబంధం ఏర్పడింది. వారికి నాలుగు మహాద్భుత నాటకాలు ఆరేళ్లలో రాశాడు. "తామ్బుర్లేన్ ది గ్రేట్", "ది ట్రాజికల్ హిస్టరీ ఆఫ్ డాక్టర్ ఫాస్టస్", "ది జ్యూ ఆఫ్ మాల్టా అండ్ ఎడ్వర్డ్ ది సెకండ్". అంతవరకూ అలంకార శాస్త్రాన్ని అంత గొప్పగా ఉపయోగించిన వారు లేరు. ధ్వని ప్రాధాన్యతనిచ్చి కవిత్వానికి శోభ తెచ్చాడు. అనిబద్ధ కవితకు మహర్దశ పట్టించి అదొక కొత్త భాషా ప్రక్రియగా తీర్చాడు. మాటలను సంగీత ధ్వనిగా మార్చి సంగీతమే వింటున్నామేమో, వాయిద్య సమ్మోహనంలో కొట్టుకుపోతున్నామేమో అన్నంత శ్రావ్యమైన పదాల కూర్పుతో విశేషంగా ఆకట్టుకొన్నాడు. అతని శబ్ద సృష్టి ఎల్లలను దాటి "బ్లాక్ బస్టర్" విజయాన్ని సాధించింది. అంతకు డాక్టర్ ఫాస్టస్ శిఖరాయ మానంగా నిలిచింది. ముందు ముందెన్నడూ ఇంగ్లీష్ కవిత్వంలో వినని శబ్దాలను ప్రయోగించి నూతనత్వానికి మార్గగామి అయ్యాడు మార్లో.

మళ్ళీ కొత్త చిక్కుల్లో ఇరుక్కున్నాడు మార్లో. కాని అతని అజ్ఞాత వాదాన్ని సహించారు. దైవ దూషణ, నాస్తిక వాద ముద్ర వేశారు మార్లోపై. నాస్తిక వాదం ఆకాలంలో నేరం. మరికొన్ని చిల్లర దోషాలు మోపి ఇరవై నాలుగేళ్ల వయసులో జైలుకు పంపారు. విడుదలై బయటికొచ్చాడు. కాని మరో అయిదేళ్ళ తర్వాత "ప్రీవీ కౌన్సిల్" పూర్తీ విచారణకు సిద్ధమవగా 30-05-1593లో మార్లో హత్య చేయబడ్డాడు. లెస్లీ హాట్సన్ అనే చరిత్రకారుడు మార్లోను ఇంగ్రాం ఫ్రిజర్ అనే మార్లోతో బాటు తాగేవాడు డబ్బు తగాదాతో తేమ్స్ నది సమీపంలో డెప్త్ ఫోర్డ్‌లో చంపాడని తేల్చాడు. మార్లో ఉద్రేకి. త్వరగా కోపం తెచ్చుకొనే స్వభావం ఉన్నవాడు. చిన్న తగాదాకే వారిద్దరి మధ్యా ఉద్రేకాలు పెరగటంతో ఫ్రిజర్ తల పగలకొట్టాడు. అప్పటికప్పుడే మార్లో చనిపోయాడు.

మార్లో నాటక రచయిత అయి ఉండకపోతే అతన్ని ఎవరూ ఇప్పటిదాకా గుర్తుంచుకొనేవారు కాదేమో? అతను రాసిన "ది పాషనేట్ షెపెర్డ్ టు హిస్ లవ్" ఎలిజబెత్ కాలంనాటి లిరిక్కులకు అనుకరణయే. "It lies not in our power to love or hate-for will in us is overruled by fate" వంటి చిరస్మరణీయ కవితా పంక్తులు రాశాడు. షేక్స్‌పియర్ మార్లో కవితలను మర్చంట్ ఆఫ్ వెనిస్‌లో బాగా వాడుకొన్నాడు.

అందుకే "Marlowe is that affable familiar ghost in the eighty sixth of Shakespeare's sonnets and his spirit appears in un mistakably in "As you like it" when Phebes quotes the famous line with appropriateness and true appreciation" అని తేల్చారు విమర్శకులు, విశ్లేషకులు. ఉదాహరణగా "Dead shepherd now I find thy saw of night-who ever loved, that loved not at first sight" చూపించారు. నాటక రచయితగా గొప్ప పేరు సంపాదించినా అతని నాటకాలు శిఖరాయ మానంగా లేవు అని అన్నారు. శిఖరం చేరి తడబడి జారిపోయాడు అని వారి భావం. అతని విషాదంత నాటకాలు "Sprinkled with the brains of slaughtered men compounded of cruelty, stewn with individual murder and whole sale massacres". దీనికి కారణం అతను సంఘానికి దూరమై ఏకాకి జీవితం గడపటం. ఆత్మాన్వేషణలో అనేక ప్రశ్నలు వేసుకొని సంతృప్తికర సమాధానాలు పొందలేక, ప్రపంచం మీది కసితో ద్వేషం పెంచుకొని రాయటమే. "Marlowe lived wrote and died at top pitch-wrestling with his compelled creatures the last note of extremity from passion in poetry".



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 10

# ఆంగ్ల నాటక పితామహుడు-విలియం షేక్స్పియర్

బైబిల్ తప్ప ఇంకే పుస్తకమూ షేక్స్పియర్ రచనలంత ప్రాచుర్యం పొందలేదు. ఆయన కవితలను ఉదహరించలేదు. అదీ ఆ మహాకవి గొప్పతనం. కాని ఆయన జీవితంలో "ఇంకా తెరవాల్సిన పేజీలు" ఎన్నో ఉండటం ఆశ్చర్యమే. "డిస్జెక్తా మెంబ్రా"లోని అనేక ముఖ్య భాగాలు కనిపించలేదు. ఆయన రాత ప్రతులలో ఏ ఒక్కటీ లభ్యం కాకపోవటమూ మరీ విడ్డూరం. ఏ రచనకూ ముందుమాటలూ అలభ్యమే. అప్పటికే ఉత్తర ప్రత్యుత్తరాలు ఊపు అందుకొన్న కాలం అయినా ఏ ఉత్తరమూ కనిపించకపోవటం బాధగానే ఉంటుంది. ఆయన సంతకం ఉన్న కాగితాలు ఒక అరడజను మాత్రమే దొరికాయి. అంతకు మించి ఆయన దస్తూరి గురించిన దాఖలాలు లేనేలేవు. కొన్ని రికార్డులలో ఆస్తికి సంబంధించిన లావాదేవీల కాగితాలు ఉన్నాయి. ఆయన్ను పొగుడుతూ రాసిన ప్రముఖుల లేఖలూ కనిపించవు. ఆయన సజీవంగా ఉన్న కాలంలో ఏ స్మృతి చిహ్నమూ లేకపోయింది. ఆయన చనిపోయిన వందేళ్ళకు కాని ఆయనపై జీవిత చరిత్ర రాలేదు. నికొలాస్ రొ అనే రెస్టోరేషన్ రచయిత రాసిందే మొదటి జీవిత చరిత్ర. అప్పుడే అంటే 1709లో ఆయన సమగ్ర నాటకాలు ముద్రించారు. షేక్ గురించి పాత తరం నటుడు థామస్ బెటర్ టన్ చెప్పిన వ్యక్తిగత విషయాలు తెలిశాయి. జాన్ ఆబ్రే మొదలగు వాళ్ళు చూపించిన రాతప్రతులు నమ్మదగినవిగా లేవు. వీటిమీదే ఆధారపడి తరువాతి వారు రాశారు. ఆయన సానేట్లు నాటకాలలో జీవిత చరిత్ర ఉందేమోనని వెతికారు. కాని ఇవేవీ ఆయన సమగ్ర జీవితాన్ని ఆవిష్కరించలేకపోయాయి. ఇందులో నిజం పావు వీసం, కథనాలు ముప్పాతిక వీసంగా ఉన్నాయి. అంతా ఊహాగానమే. కల్పిత కథా సరిత్సాగరమే.

కష్టపడి ప్రయత్నిస్తే ఆయన జీవిత చరిత్ర తెలుసుకోవటం కష్టమేమీ కాదు. షేక్‌గారి తాత రిచార్డ్ షేక్స్‌పియర్ స్నిత్తర్ ఫీల్డ్‌లో స్తిరపడ్డాడు. ఇది "స్ట్రా ఫర్డ్ ఆన్ యావన్" దగ్గరే. తాత అదృష్టవంతుడే. ఆయన కొడుకు జాన్ రాబర్ట్ ఆర్డెన్ కూతురు మేరీ లాండ్‌ను పెళ్ళాడాడు. కొడుకు కోసం మంచి ఇల్లు ఏర్పాటు చేశాడు. మేరీ తండ్రి ఆమెకు ఆస్తిలో పెద్ద భాగమే ఇచ్చాడు. మామగారి మరణం తర్వాత జాన్ రెండు ఇళ్ళు కొని వ్యాపారాన్ని పట్నంలో పెంచుకొన్నాడు. సంఘంలో మంచి పేరు ఉన్నందున స్ట్రాట్ ఫర్డ్ కార్పోరేషన్‌కు మెంబర్ అయ్యాడు. కొద్దికాలానికే జాన్–బీరు, బ్రెడ్‌ల నాణ్యతను పరిశీలించే ఆఫీసర్ అయ్యాడు. చిన్న చిన్న జరిమానాలు విధించే అధికారమూ లభించింది. నెమ్మదిగా కో ట్రెజరర్‌గా, ఆల్డర్మన్‌గా, మేయర్‌కు సమానమైన పదవులను అందుకొన్నాడు.

జాన్ మేరీలకు ఎనిమిది మంది సంతానం. మొదటి పిల్లాడు జాన్ పుట్టి కొన్ని నెలలకే చనిపోయాడు. తర్వాత మార్గరెట్ పుట్టి పసికందుగానే మరణించింది. మూడో సంతానమే మన విలియం షేక్స్‌పియర్. అందమైన గ్లాసు డోర్లున్న హెన్రి వీధిలోని సంచార నటుల చేత నాటకాలాడించాడు. తనకంటే తక్కువ వయసులో లేని విద్యార్ధుల కోసం ఒక తాత్కాలిక స్కూల్ మాస్టర్ ఉద్యోగం చేశాడు.

పుట్టుక నుంచి 18వ ఏడు వరకు జరిగిన సంఘటనలు మనకు తెలియదు. ఒక పెళ్లి లైసెన్స్ మాత్రం దొరికింది. పెళ్లి కూతురు అన్నే హాతవె వయస్సు 26. పెళ్లి కొడుకు విలియం వయసు 18. అంటే మన కవి కంటే భార్య ఎనిమిదేళ్ళు పెద్దది. అనుభవం ఉన్న అమ్మాయి అని ఆయన ఇష్టపడ్డాడు. పెళ్లి 26-05-1583లో జరిగినట్లు కూతురు సుసన్నా తెలిపింది. చర్చి ఫాదర్ ఆమె పేరును తప్పుగా "వాట్‌లీ" అని రాశాడట. పెళ్లి అయిన ఆరు నెలలకే కూతురు సుసన్నా పుట్టింది. ఇరవై ఒక్క ఏళ్ళకే ఇద్దరు మగపిల్లలు ట్విన్స్‌గా పుట్టారు. ఇంటి జీవితం గురించి దాఖలాలేవీ లేవు. కాని లండన్‌లో ఒంటరిగా ఉండేవాడని రుజువైంది. అప్పుడప్పుడు మాత్రం స్వగ్రామానికి వచ్చి వెళ్ళేవాడట. లండన్ లాడ్జిలోనే దాదాపు పాతికేళ్ళు రిటైర్‌మెంట్ దాకా గడిపాడు. ❋

“పూర్వాంగ్ల” కవుల ముచ్చట్లు - 11

## ఆంగ్ల నాటక పితామహుడు-విలియం షేక్స్పియర్ - 2

1592 వరకు లండన్‌లో షేక్స్పియర్ ఏమి చేసిందీ తెలియదు. అప్పుడే “ఆరవ హెన్రి” నాటకం మొదటి భాగం అచ్చు అయింది. అప్పటికి ఆయనకు ఇరవై ఎనిమిది. రాబర్ట్ గ్రీన్స్ తాగుడు, వ్యభిచారంతో సర్వం కోల్పోయి బుద్ధి తెచ్చుకొని తన బాచ్‌లోని ముగ్గుర్ని తన పతనానికి వారే కారణం అని తిట్టాడు. షేక్స్పియర్‌పై నిప్పులు కక్కాడు. కింది తరగతి నటులకు కే వృత్తి అనే భావంతో గ్రీన్ నాటకాలు రాయటం మానేశాడు. గ్రీన్ రాసిన “గ్రోట్స్ వర్త్ ఆఫ్ విట్”ను షేక్స్పియర్, ఆయన అనుచరులు వ్యతిరేకించారు.

హాన్లీ స్ట్రీట్ ఇంటిలో పుట్టాడు. ఇప్పుడది జాతీయ మ్యూజియం అయింది. చర్చి రికార్డు ప్రకారం 26-04-1564లో బాప్టైజ్ అయ్యాడు. అంటే అంతకు మూడు రోజులకు ముందు 23వ తేదీన జన్మించినట్లు లెక్క. ఇతని తర్వాత ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలూ పుట్టారు.

షేక్ బాల్యం గురించి పెద్దగా తెలీదు. చుట్టూ ఉన్న అందమైన పొలాలు, చెట్లూ, పచ్చగడ్డి మైదానాలు, అడవులు అతన్ని బాగా ఆకర్షించాయని నాటకాలను బట్టి తెలుస్తోంది. గ్రామీణ ఆటలలో పాల్గొని ఉండవచ్చు. గిల్డ్ ఆఫ్ హోలీ క్రాస్ స్థాపించిన గ్రామర్ స్కూల్‌లో చదివాడు. అక్కడ బైబిల్, లాటిన్ చదివి ఉంటాడు. చిన్నతనం నుంచి పుస్తకాలు బాగా చదివే వాడని, ముఖ్యంగా ఓవిడ్, సేనేకా, ప్లాటస్ రచనలంటే మహా ఇష్టంగా చదివాడని తెలిసింది. ఆ కథలే తన నాటకాలలో తీర్చిదిద్దాడు. జాన్సన్ మాత్రం కొద్దిగా లాటిన్, లేశమాత్రంగా గ్రీకు చదివాడన్నాడు. అంటే జాన్సన్ లాగా క్లాసికల్ స్కాలర్ కాదని అభిప్రాయం.

యువ దశలో పెరిగి పోయిన కుటుంబం గురించి తండ్రి ఆదుర్దా పడ్డాడు. వ్యాపారం తన్నింది. చేస్తున్న ఉద్యోగాలు వదిలేశాడు. ఈందుకని విలియం అంటే షేక్ స్కూలు చదువు

పూర్తి చేసి ఉండడు. ఆయన కాలంలో అందరికి యూనివర్సిటి విద్య అందుబాటులో ఉన్నా, ఆయనకు ఆ అదృష్టం దక్కలేదు. నటుడు కావాలనే కల ఉండేదని తెలుస్తోంది. మంచి వాక్యాల నిర్మాణంలో ఉపన్యాసాలు తయారు చేసేవాడు. ఆబ్రే అనే ఆయన కథనం ప్రకారం ఒక బుచర్ కొడుకు విల్ తండ్రి వ్యాపారాలు చూశాడని, ఒక దూడను చంపటంతో అతను అసామాన్యమైన స్పీచ్ ఇచ్చాడని చెప్పాడు. ఇంకా చాలా విషయాలు వచ్చాయి. కాని వీటికి ఆధారం లేదు. విలియం ఒక అలార్నీకి సహాయకుడు అయ్యాడు. సంచార నటులు స్ట్రాఫర్డ్ వచ్చిన సందర్భంతగా విలియంకు నాటకాలపై మోజు కలిగి, వారి చిరస్మరణీయ నటన మనసుపై గాఢ ముద్ర వేసింది. వారిచ్చిన వినోదాన్ని మర్చిపోలేదు. విలియంకు పన్నెండు ఏళ్ళప్పుడు ఎరల్ ఆఫ్ లీచేస్టర్ ఎలిజబెత్ రాణి కోసం కేనిల్ వర్త్‌లో గొప్ప నటుడుగా విలియం పేరు పొందాడు. గ్రీన్ అతని మిత్రుల విమర్శ దాడి వలన షేక్స్పియర్ అప్పటికే లబ్ధ ప్రతిష్టుడైన నాటక రచయిత అని తెలుస్తోంది. నటనకు శిక్షణ కావాలి, దాన్ని ఆచరణలో పెట్టాలి. అందుకే లండన్‌లో ఉండిపోయాడు. కనుక ఆయన జీవితంలోని దాదాపు మొదటి సగభాగం అంటే ఆయన 28వ ఏడు వరకు అజ్ఞాతంలోనే ఉండిపోయింది. పల్లెటూరి వాడు నాగరికుడై వెలిగాడని భావించాలి. ఇంగ్లాండ్‌లో అగ్రగామి నటుడుగా, నాటక రచయితగా భాసించాడు. ఇది ఇలా ఉంటే తాను షేక్స్పియర్ అక్రమ సంతానాన్ని అని విలియం “డేవ్ నట్” అనేవాడు ప్రకటించి కలకలం రేపాడు. అతని కథనం ప్రకారం షేక్ చేతిలో పెన్నీ కూడా లేకుండా లండన్ వచ్చాడని ఒక థియేటర్‌లో డోర్ కీపర్‌గా ఉద్యోగం చేశాడని యజమాని నాటకం చూడటానికి వచ్చినప్పుడు అతని గుర్రాలను మాలిష్ చేసేవాడని, ఇది యజమాని దృష్టిలో పడిందని “చిన్న ఉద్యోగం” ఇచ్చాడని కుర్రకారు నటుల్ని పోగేసి నాటకాలు ఆడించాడని వారిని “షేక్స్పియర్ బాయ్స్” అనేవారని వారు తమ ఇళ్ళకు తీసుకుపోయేవారని కోతలు కోశాడు. బహుశా ఆ ఉద్యోగం “ఎక్స్‌ట్రా నటుడు” అయి ఉండవచ్చు. నాటకాలు బాగా లేకపోతే సీన్లు మార్చి రాసేవాడని కూడా వాడు ఉవాచ.

ఆ రోజుల్లో నాటకాలను రచయిత నుంచి కొని తెచ్చుకొని నాటక కంపెనీలు స్వంతం చేసుకొనేవి. వాటిని యథాతథంగా ఆడేవారు. మార్పులూ చేర్పులూ చేసి ఆడించేవారు. పూర్తిగా తయారయ్యేసరికి రచయిత రాసినది అంతా దాదాపు పూర్తిగా మారిపోయేది. ఈ పనులను షేక్స్పియర్ చేత చేయించి ఉండవచ్చు. దీంతో నాటక రచయితలతో గాఢ పరిచయం లభించి ఉండవచ్చు. ఈ కుర్ర షేక్స్పియర్ అలా మార్చబడిన నాటకాలన్నిటికి “రచయిత”గా గుర్తింపు పొంది ఉండవచ్చు. డోవర్ విల్సన్ అనే ఆయన “ఎరల్ ఆఫ్ సౌత్ యాం టన్”కు విలియం వ్యక్తిగత సేవ చేశాడన్నాడు. పల్లెటూరి స్కూల్ మేస్టర్‌గా చేసిన అనుభవం విలియంకు ఉంది. అందుకని ఎరల్‌కు ట్యూటర్‌గా ఉండి ఉంటాడు. స్పానిష్ ఆర్మోడా సైనికంగా

బ్రిటన్‌ను బెదిరించినప్పుడు విలియం ప్రత్యక్ష అనుభవం సంపాదించి ఉండవచ్చు. ఇరవై అయిదుకు పోర్చుగల్ నౌకా పరిశోధన తెలిసి ఉండచ్చు. ఇవన్నీ ఆయన నాటకాలలో సంభాషణలకు ముడి సరుకు అయి ఉండవచ్చు. ఇలా పుకార్ల షికార్లులో ఇప్పటిదాకా గడిపాం. ఇప్పుడు నిజ చరిత్ర తెలుసుకోవటానికి 1593కు వద్దాం. "వీనస్ అండ్ అడోనిస్" అప్పుడే అచ్చయింది. ఒక ఏడాది తర్వాత "ది రేప్ ఆఫ్ లూక్రేస్" వచ్చింది. చాలా నిబద్ధతతో వీటిని రాసి తన సంతకంతో ముద్రించాడు. అంతే స్టార్ తిరిగింది. మరో పదేళ్ళలో "పల్లాడిస్ టామియా" విడుదల అయింది. ముప్పై రెండేళ్ళ వయసులోనే విలియం పన్నెండు నాటకాలు రాసినట్లు పదహారవ శతాబ్దానికి చెందిన ఫ్రాన్సిస్ మేర్స్ రాశాడు. ఇందులో కామెడీలు, ట్రాజెడీలు కలిసే ఉన్నాయి. మేర్స్ "The sweet wittie soul of Ovid lives in the mellifluous and honey tongued Shakespeare" అని శ్లాఘించాడు. "వీనస్ అండ్ అడోనిస్"పై విరుద్ధ అభిప్రాయాలొచ్చాయి. వీటిని "A couple of ice houses" అంటూ అతను చేసిన తప్పులు లెక్కలేనన్ని అని హాజ్లేట్ అన్నాడు. కాల్రిడ్జ్ మహాశయుడు "Shakespeare wrote as if he were a visiting god from another planet charming you to gaze on the movements of Venus and Adonis as you would on the twinkling dances of vernal butterflies" అన్నాడు. యువతకు అందులోని అందం, అద్భుతం, విధానం, ఇంద్రియ అనుభవం పిచ్చపిచ్చగా నచ్చాయి. దీన్ని నాటకాలపై అమితాసక్తి ఉండి నాటకాలను తరచుగా చూసే సౌతాంప్టన్ ఎరల్‌కు అంకితమిచ్చాడు. దీని విజయంతో విలియంకు ఎరల్ మంచి మిత్రుడు. పాట్రన్ అయ్యాడు. ఈయనకే "లూక్రీస్" అంకితమిచ్చాడు. పందొమ్మిదేళ్ళ షేక్స్పియర్‌కు, ఇప్పటి ముప్పై ఏళ్ళ షేక్‌కు ఎంతో మార్పును గమనిస్తాం. "I love I dedicate to your lordship is without end where of this pamphlet without beginning but a superfluous moity-what I have done is yours what I have to do is yours being part in all I have devoted yours" అని అత్యంత విధేయతతో అంకితం చేశాడు. ఇందులోని కథ కూడా "ఓవిడ్"లోని కథే. లూక్రేస్ ముద్రించిన తరువాత సౌతాంప్టన్‌కు కొత్త కళతో బాటు కొత్త యుగమూ వచ్చింది. ఎరల్ దొర కవికి ఒక వెయ్యి పౌండ్ల ధనాన్ని కానుకగా అందజేశాడు. దీని విలువ ఇప్పుడు యాభై వేల డాలర్లు అవుతుంది. ఈ డబ్బును అంతకు ముందు నటుడుగా నాటక రచయితగా సంపాదించిన దానినీ బాగా లాభాలు ఆర్జించి పెట్టే "చాంబర్లీన్ కంపెనీ"లో పొదుపు చేశాడు. ఇక భరోసా వచ్చింది. డబ్బుకు వెంపర్లాడాల్సిన పనిలేదు. కనుక కాలాన్ని నాటక రచనకే అంకితం చేశాడు. కవి దార్శనికుడై నాటక రచయితగా పరివర్తనం చెందాడు.

పైరేటెడ్ నాటకాలను ఆ కాలంలోను మంచి డిమాండే ఉంది. కాని కవిత్వానికి ముఖ్యంగా షేక్స్పియర్ కవిత్వానికి ఇంకా ఆదరణ పెరిగింది. ఒక పబ్లిషర్ అత్యాసగా "పాషనేట్ పిల్గ్రిం" అనే పేరుతో షేక్స్పియర్ కవి రాసినట్లుగా పేరు పెట్టి అచ్చేసి దేశం మీద వదిలాడు. అందులో పాతతరం, కొత్త తరం కవులందరి రచనలు ఉన్నాయి. ఎగబడి జనం కొన్నారు. తెరిచి చూసి "మోసం గురో" అన్నారు. 1585-1596 కాలంలో స్ట్రా ఫర్డ్ గురించి చరిత్ర ఏమీలేవు. మనకవి "ట్విన్స్"లో హామ్నెట్ పదకొండేళ్ళ వయసులో చనిపోయాడు. అప్పటికి ఈయనకు ముప్ఫై రెండు. ఇంటికి వచ్చి చూసి వెళ్లి ఉంటాడని భావించాలి. తండ్రి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతే అప్పులన్నీ తీర్చి ఆయన పరువు కాపాడాడు. అంతకు ముందు ఇరవై ఏళ్ళ క్రితం దర్జాగా తండ్రి వేసుకొన్న కోటు మళ్ళీ అప్పులు తీరిన తర్వాత తండ్రి జాన్ వేసుకొని సమాజంలో "జెంటిల్మాన్" అని మళ్ళీ పేరు పొందాడు. కొడుకు చలవ ఇది. ఇంకో ఏడాదిలో కుటుంబ గౌరవం మరీ హెచ్చింది. విలియం స్ట్రాఫోర్డ్లో మరొక అతిపెద్ద భవంతిని కొన్నాడు. దీన్ని "న్యూ పాలస్" అన్నారు. దీన్ని ఎనిమిదవ హెన్రి కాలంలో అసలు నిర్మించిన వాడు సర్ హాగ్ క్లాప్టాన్.

ముప్ఫైలలో షేక్ బాగా అదృష్టవంతుడనిపించుకొన్నాడు. పెట్టుబడులను తెలివిగా పెట్టి లాభాలు దక్కించుకొన్నాడు. భార్య పొలాలకు దగ్గరలో శాట్టేరిలో నూట ఏడు ఎకరాల భూమి కొన్నాడు. న్యూ పాలస్కు ఎదురుగా పెద్ద కాటేజీ ఫల వృక్షాలు మంచి తోటను కొన్నాడు. రెండు నాటక కంపెనీలతో బాటు న్యూ గ్లోబ్ కూ భాగస్వామి అయ్యాడు. నలభై ఒకటవ ఏట చర్చికి చెల్లించాల్సిన పన్నులన్నీ కలిపి నాలుగు వందల యాభై పౌండ్లు చెల్లించేశాడు. దీని వలన ఏడాదికి అరవై పౌన్ల వడ్డీ (పదిహేను శాతం) పొందాడు. చివరికి ఈ వడ్డీలు ఈ లాభాలు పెట్టుబడులపై విరక్తి కలిగింది. స్ట్రాఫోర్డ్ సంఘంలో పెద్ద మనిషిగా జీవించాలనే నిర్ణయానికి వచ్చాడు. ❁

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 12

## ఆంగ్ల నాటక పితామహుడు-విలియం షేక్స్‌పియర్ - 3
## (చివరి భాగం)

**చ**నిపోవటానికి కొద్ది కాలం ముందు దాకా డబ్బును పొదుపు చేశాడు షేక్స్‌పియర్. యాభైల్లో రియల్ ఎస్టేట్‌ను బ్లాక్ ఫ్రాయార్స్‌లో కొన్నాడు. ముగ్గురు భాగస్వాములను చేర్చుకొన్నాడు. భార్యకు వీటిపై అధికారం లేకుండా చేయటమే ఈ భాగస్వామ్యానికి కారణం. ఉన్న ఒక్క కొడుకూ చనిపోయాడు. మనవాడి కోసం ఎదురు చూస్తున్నాడు. వాడికి తన పేరుపెట్టి ఈ మొత్తం ఆస్తికి వారసుడిని చూయాలని ఆలోచన. కూతురు సుసాన్నా డాక్టర్ జాన్ హాల్‌ను పెళ్ళాడి కూతురు ఎలిజబెత్‌ను కన్నది. చిన్న కూతురు జూడిత్ థామస్ ఇన్సిని పెళ్లి చేసుకొన్నది. కాని షేక్స్‌పియర్ మనవడి కోరిక తీరలేదు.

రాసిన నాటకాలను తిరగరాయటం మార్పులూ చేర్పులూ చేయటంతో గొప్ప నాటక రచయితగా గుర్తింపు పొందాడు. నాటక శాలయే జీవితం, ఊపిరి, శ్వాసగా జీవించాడు. మొదంతా విషాదాంత నాటకాలు రాసి విజ్రుంభించి కీర్తిని మరింత పెంచుకొన్నాడు. చాలాకాలం కామెడీలనే నమ్మి రాశాడు. కాని మనకు మాత్రం హామ్లెట్, మేక్ బెత్, కింగ్ లియర్ వంటి విషాదాంతాలనే మనం గుర్తుపెట్టుకొని ఆయన మొహాన్ని "స్టోన్ ఫేస్ ఆఫ్ ట్రాజెడి"గా గుర్తుండిపోయాడు. ఎవడైనా ఏడుపు మొహం పెడితే "షేక్స్పియర్ మొహం" అనే ముద్ర పడిపోయింది. ఆయన జీవితం అంతా ఖుషీగానే గడిచింది అని మరవరాదు. "యాజ్ యు లైక్", "ట్వేల్ఫ్ నైట్", "కామెడి ఆఫ్ ఎర్రర్స్", "లవ్స్ లేబర్ లాస్ట్", "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీం" మొదలైన హాస్య నాటకాలలో మాటల గారడీతో గొప్ప హాస్యం సృష్టించాడు. శ్లేషతో పకడ్‌బందీ అయిన పాత్రలతో, పాత్రల పేర్లే నాటకాల పేర్లుగా చెలామణి చేసి అందర్నీ అలరించాడు.

చక్కని సన్నివేశాలు, హృదయానికి హత్తుకొనే సంభాషణలు, మానసిక

సంఘర్షణలఉతో నాటకాలకు జీవం పోశాడు. తేలిక మాటలను ఎలిజబెత్ కాలపు స్త్రీ, పురుషులు ఆదరించారు. నాటకంలో అంతర్నాటకం నడిపి సస్పెన్స్‌ను సృష్టించాడు. బూతులు, చౌకబారు మాటలంటే షేక్స్‌పియర్ అసహ్యించుకొన్నాడు. ఆయనలోని "జీనియస్" తన ప్రతాపాన్ని అన్ని కోణాల్లోనూ చూపించాడు. షేక్స్‌పియర్‌ను కామెడీ రచయితలలో ఒకడిగా, ట్రాజెడి కింగ్‌గా ముద్ర వేశారు. 1609లో "షేక్స్‌పియర్ సానెట్స్" వెలువడ్డాయి. దానిని "One of the great literary enigmas" అంటూ పొంగిపోయారు విమర్శకులు. షేక్స్పసయర్ వ్యక్తిత్వం గురించి "With his key he unlocked his heart" అన్నాడు వర్డ్స్‌వర్త్. "Shakespeare's secret was inscructably his own" అన్నాడు మాథ్యూ ఆర్నోల్డ్. ఎలిజబెత్ కాలంలో సానెట్‌ను పల్లకీలో పెట్టి ఊరేగించినంత వైభవం పొందింది. నాటకాలలో మానసిక సంఘటనలు, లోతైన అవగాహన ఉన్నాయి. మేక్ బెత్, కింగ్ లియర్ వంటి వారి మనసులు విషాదాంతంగా వుండిపోయాయి. షేక్స్‌పియర్ ప్రకృతికి దర్పణం వంటివాడు. మనిషి పడిన గందరగోళంను అతని తెలివితేటలతో కూడిన హాస్యం కంటే బాగా ప్రతిఫలింపజేశాడు. షేక్స్పియర్ పాత్రలు "Were rocked by ungovernable passions" అని మెచ్చారు. "Shakespeare's genius flares up, flickers and falls" అని తేల్చారు.

లండన్‌ను అకస్మాత్తుగా వదిలి స్వగ్రామం స్రాట్‌ఫర్డ్ చేరుకొన్నాడు. లండన్‌లో మానసికంగా కుంగిపోవటమే ఈ మార్పుకు కారణం. చనిపోయే దాకా అక్కడే ఉండిపోయాడు. ఇక్కడ ఉండే మిగిలిన నాటకాలు రాసి పూర్తిచేశాడు. ఆ ఊరి సమాజంలో అతి ముఖ్యవ్యక్తిగా గుర్తింపు పొందాడు. 1616లో చివరిసారిగా వీలునామా రాశాడు. కూతుళ్ళకు వాటాలిచ్చాడు. స్నేహితులకు తలా కాస్తా ముట్ట చెప్పాడు. పుట్టబోయే మనవళ్ళు, మనవరాళ్ళకు ఏదో కొంత రాశాడు. రాసిన కొద్ది రోజులకే యాభై రెండేళ్ల వయసులో ఏప్రిల్ ఇరవై ముదున మరణించాడు. తన ఆస్తికి గార్డియన్‌లను నియమించాడు. పార్ధివ శరీరాన్ని హోలీ ట్రినిటి చర్చిలో ఉంచారు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బెలో గౌరవ ఖననం చేశారు. సాహిత్య చరిత్రలో ఒక మేధావి, గొప్ప సృజనాత్మికతను ప్రదర్శించి, వ్యాపారం చేసి లబ్ధప్రతిష్టుడై చిన్న టౌన్‌లో ఒక పౌరుడుగా జీవించలేదు. ఇది షేక్స్‌పియర్‌కే సాధ్యమైంది. జాన్సన్ తన జీవితకాలంలోనే రచనలను ముద్రించుకొని చూసుకొన్నాడు. కాని షేక్స్‌పియర్ మాత్రం దీనికి విరుద్ధంగా తన రచనలను ముద్రించుకోవటానికి వాటిని తన కళ్ళతో చూసుకోవటానికి ఇష్టపడలేదు.

షేక్స్‌పియర్ మరణానంతరం ఆయనతో పనిచేసిన నటులు ఇద్దరు జాన్ హమ్మిన్స్, హెన్రి కాండెల్‌లు 32 నాటకాల సంపుటిని, అనుబంధంగా మరో పద్దెనిమిదిని ముద్రించారు. కొత్త తరహాలో చెప్పటం విలియంకు ఇష్టం. అందుకే "Every word doth almost

tell my name" అన్నాడు షేక్. ప్రతి విసయానికి ఉన్న ఇరు పార్శ్వాలను స్పృశించాడు. హామ్లెట్‌లో ఆయన చెప్పిన మాటలు ఆయన హృదయాన్ని తెలియజేస్తాయి. "What a piece of work of man! how noble in reason! how infinite in faculty! in forn and moving how like an angel! in apprehension how like god! the beauty of the world! the paragon of animals1"

ఆయన మాటలు సామెతలుగా జనం నాలుకల మీ నిలిచిపోయాయి. "There is a divinity that shapes our ends-as flies to wanton boys are we to the gods-they kill us for their sport".

ఏ విధానమైనా "Moderation tolerance and decency" నిర్మించబడాలని భావించాడు. "In an age of private intrigue, political treachery and general turmoil, he upheld conservative law, natural order and harmony". భాషకున్న శక్తి, మాటలకు వాటి మధ్య ఉన్న అనుబంధం, అందులోని సంగీత సౌలభ్యం ఆయనకు తెలిసినంత ఎవరికీ తెలియలేదు. "The world of Shakespeare is one that continually being explored. shakespeare is one who was the universal dramatist, the mirror of mankind. we become part of his works. we can never encompass the universe he created - it contains us".



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 13**

# తళుకుల యుగం

ఎలిజబెత్ శకం తరువాత శతాబ్దాల కాలం సురక్షితంగా ఉన్న మనిషి హోదా కుంచించుకుపోయింది. మనిషి అధికృతపై సందేహాలేర్పడ్డాయి. రెండు వేల ఏళ్ళ తర్వాత మనిషి విలువ, అవసరం తెలిసి మనిషి లేనిదే ఏ గొప్ప కళ కూడా రాణించదు అనే భావం ఉంది. షేక్స్పియర్ ప్రభావం నిరంతర యుద్ధాల వలన తగ్గినా ఆయన సృజన మీద గౌరవం తగ్గలేదు. దేవుడు మనిషి కోసం ప్రాణ త్యాగం చేశాడు కనుక మనిషి కూడా దేవుడికోసం చనిపోవటానికి సిద్ధపడ్డాడు. దెయ్యాలు భూతాలతోపాటు భూమిమీద దేవతలూ మానవునితో సంచరించారు. విశ్వానికి భూమి కేంద్రమై మనిషి భూపాలకుడయ్యాడు. "Man is the beauty of the world, the paragon of animals" అన్న భావం స్పష్టమైంది. సృష్టి అంతా మానవునికి లొంగి ఉండేదే అని "జార్జి హెర్బర్ట్" అన్నాడు. "హుకర్" జీవకాలం అంతా మనిషి చెప్పుచేతల్లో నడవాల్సిందే అన్నాడు. షేక్స్పియర్ మరణం తర్వాత మనిషి ప్రకృతితో విభేదించటం, తనలోని అంత:కరణతో పోరాటం ఎక్కువైంది. ఈ కొత్త వేదాంతం అనేక అనుమానాలకు దారి తీస్తోందన్నాడు. నిజంగా అది స్వర్ణయుగం కాకపోయినా "తళుకుల యుగం" అయింది. ఆకాలంలోనే పుట్టాడు బెన్ జాన్సన్.

**మొట్టమొదటి రాజాస్థాన కవి - బెన్ జాన్సన్**

బెన్ జాన్సన్ ఎలిజబెత్ యుగం వాడే అయినా ఆలోచనలు, విరుద్ధ భావాలు మాత్రం తరువాత తరానికి సంబంధించినవే. అతని భావాలు పరస్పర విరోధం. ముతక వ్యంగ్యం అయినా చాలా లాజికల్ ఆలోచనలున్నవాడు. నాటకాలు కవితలు రాశాడు. ఏది చేసినా ఎదురొచ్చాయి. 1572లో పుట్టాడు. బెంజమిన్ జాన్సన్ అసలు పేరు. కాని "బెన్ జాన్సన్"గానే

అందరూ పిలిచారు. లండన్ వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో చదివి అక్కడి టీచర్ అయిన విలియం "కాండెన్" ప్రభావానికి లోనైనాడు. పై చదువులకు ఆర్థిక స్తోమత లేదు. తండ్రి పేరు మోసిన తాపీ మేస్త్రి. ఆ పనిలో తండ్రికి సాయం చేశాడు. కేంబ్రిడ్జి కాలేజిలో చదివాడు అంటారు కాని రుజువు కాలేదు. ఏ కాలేజీలోను చదవకుండా స్వయంగా చదువుకొని, యూనివర్సిటి ట్రెయిండ్ గ్రాడ్యుయేట్లతో, నాటక రచయితలతో స్నేహం చేశాడు. ఇరవై ఆరేళ్ళకు నటుడై, నాటక రచయితా అయి దర్శకుడూ అయ్యాడు జాన్సన్. 1598 నుంచి థియేటర్‌తో పరిచయం ఉంది.

"పల్లాదిస్ టామిన"లో నటనను మెచ్చుకొన్నారు. "ఎవిరి మాన్ ఇన్ హిస్ హ్యూమర్"లో షేక్స్పియర్‌నే ఒక పాత్రను చేసి రాశాడు. విజయాన్ని సాధించిన ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. చావు రోజులు దగ్గర పడ్డాయి. అదే ఏడాది 1598లో తోటి నటుడు గాబ్రియల్ స్పెన్సర్‌తో తగాదా పడి చంపేశాడు. ఉరిశిక్ష పడింది కాని తప్పించుకొన్నాడు బెన్. జైల్లో ఉండగా రోమన్ కేథలిక్ అయ్యాడు. వదిలేశారు. కాని ఆస్తిని అంతటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. ఉడమ బొటన వేలు నరికి శిక్షించారు. పన్నెండు ఏళ్ళ తర్వాత ఇంగ్లాండ్ చర్చికి చేరాడు. ముందే పెళ్ళాడాడు. పెళ్లి ఈయిన అమ్మాయిలతో శృంగారించాడు. భార్యకు చాలాకాలం దూరంగానే ఉన్నాడు. తలతిక్క, పొగరుబోతుతనం, చెడ తిరుగుడు, తోటి నటులతో తగాదా పడటం, కవులను అసహ్యించుకోవటం చేస్తూ అందరికి దూరమయ్యాడు. షేక్స్పియర్ చేత ప్రశంసలు పొందాడు. బేకన్, బ్యూమాంట్ ఫ్లెచర్, సిడ్ని డోన్నేలు ఆరాధించారు. జాన్సన్ ముఠాకు చెందిన యువకవులు "We are the tribe of Ben and made jonson the first dictator in the history of English literature" అని బెన్‌ను ఆకాశానికి ఎత్తేశారు. ఉడుకు రక్తంతో యవ్వనంలో పచ్చిగా తిరిగాడు. దేన్నీ లక్ష్యపెట్టలేదు. కొద్దికాలం తర్వాత బాణీ మార్చాడు. కామెడీని ఒదిలి చారిత్రక ట్రాజెడీలను రాశాడు. అందులో సేజనాస్, హిస్ ఫాల్ అండ్ కార్తిలిన్, హిస్ కాన్స్పిరసీ మాత్రమే విజయవంతమైనాయి. ఎలిజబెత్ తర్వాత మొదటి జేమ్స్ రాజు అయ్యాడు. రాజుకు ఇష్టమనుకొని ఒపెరాలు బాలేట్లు గ్రీకు, రోమన్ సెటైర్స్ ఆధారంగా తయారు చేశాడు. అనుభవం లేని నటులు వీటిని నటించారు. కవితల కంటే వీటికే ఆదరణ పెరిగింది. ఒక దశాబ్దంలోనే వీటిని రాసేశాడు. ముప్ఫై నలభైల మధ్య "వోల్పోన్", "ఆర్ దిఫాక్స్", "ఎపికోసీన్", "ఆర్ ది సైలెంట్ విమెన్", "ది ఆల్కెమిస్ట్". జాన్సన్ సాహిత్య సేవకు మెచ్చి రాజు పెన్షన్ ఏర్పాటు చేశాడు. రాజు జాన్సన్‌ను మొట్టమొదటి "ఆస్థాన కవి"ని చేశాడు. శాశ్వత వార్షికాన్ని, ఒక టన్ను వైన్‌ను ఇచ్చాడు. నలభై అయిదేళ్ళ వయసులో లండన్ బోరు కొట్టి స్కాట్‌లాండ్ చేరాడు. అక్కడ కవులతో పరిచయాలు పెంచుకొన్నాడు. "ఎడిన్ బర్గ్ బర్జేస్" అయ్యాడు.

ఆరోగ్యం క్షీణించిపోయి బలహీనపడుతున్నాడు. అతని లైబ్రరి తగలడిపోయింది. షాక్ తిన్నాడు. మళ్ళీ ఒక వెలుగు వెలగాలని ప్రయత్నించాడు. సెటైర్‌లే తనను బతికిస్తాయని అనుకొన్నాడు. అందులో "ఇనిగ్నో జోన్స్" వంటి వారిని ఉతికి ఆరేశాడు.

55లో గుండెపోటు వచ్చి, పాక్షిక పక్షవాతం వచ్చింది. రెండవసారి గుండెపోటూ వచ్చింది. అయినా తొమ్మిదేళ్ళలో కొత్త నాటకాలు రాశాడు. బాగా జబ్బుపడ్డాడు. కోలుకోలేని స్థితి. డబ్బులు లేవు. మానసికంగా కుంగిపోయాడు. అరవై నాలుగేళ్ల వయసులో 06-08-1637న బెన్ జాన్సన్ బాల్చీ తన్నేశాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో ఖననం చేశారు. సమాధిపై "O Rare Ben Jonson" అని రాసిన ఫలకం ఉంచారు. నిజాయితీగా ఉన్నాడు కాని కొద్ది గర్వం కొంపముంచింది. తన నాటకాలను "కలేక్టేడ్ ప్లేస్"గా ముద్రించుకొని చూసుకొన్న మొదటి నాటక రచయితగా బెన్ జాన్సన్ చరిత్ర సృష్టించాడు. ఈ రోజుల్లో బెన్ జాన్సన్‌ను గౌరవిస్తారు కాని ప్రేమించేవారు లేరు. రచనలు ఉత్సుకతతో చదువుతారు కాని ఆశ్చర్యం పొందలేరు. "Jonson does not possess the real magic, the genius to transform" అంటారు. కవిత్వంలో అనితర సాధ్యమైన ప్రతిభ చూపాడు. మనిషి మీది కోపం, తిరస్కార పూర్వక హాస్యం, విసుగులను అతని సంగీత శబ్ద మార్మికతతో మర్చిపోతారు. "Drink to me only with thine eyes" అన్నాడు. "Queen and huntress" బాగా పేలాయి. మచ్చుకి ఒక కవిత – it was a beauty that I saw - so pure, so perfect as the frame - of all the universe was lame - to that one figure, could I draw - or give last line or it a law.

"A skein of silk without a knot - a fair march made without a halt - a curious form without a fault - a printed book without a blot - all beauty and without a spot!"

కవిత్వమే అన్ని ప్రక్రియల కంటే ఉన్నతమైనది అని, ట్రాజెడీ ఆనందాన్ని అందిస్తూ జీవిత సత్యాలను బోధించాలని చెప్పాడు. కామెడి మనసుకు హత్తుకొని మంచి శైలితో ఉండాలన్నాడు. "ఎవెరి మాన్ ఇన్ హిస్ హ్యూమర్" నాటకంలో లండన్ నగర యదార్ధ స్థితి కళ్ళకు కట్టించాడు. మనిషిలోని దురాశకు, మోసానికి సాక్షాలు "వోల్పోన్" మరియు "ఆల్కెమిస్ట్" నాటకాలు. ప్రతి మనిషి హాస్య ప్రాణిగా ఉండాలని బెన్ జాన్సన్ ఆశించాడు. అతని విమర్శలు ఆరోగ్యకరంగా ఉండి మార్గదర్శకాలయ్యాయి. అతను ఒక ముఠాను ఏర్పాటు చేసుకొన్నాడు. వీరినే "Tribe of Ben" అన్నారు. వాళ్ళను జాగ్రత్తగా నిబ్బరంగా బుద్ధి, మనసూ పెట్టి రాయమని హితవు చెప్పాడు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 14

# యువ బాలుడు, కరపత్ర సవ్యసాచి - థామస్ నాషె

**"యం**గ్ జువెనైల్" అని పేరొందిన థామస్ నాషెను తర్వాత "రౌడీ హాస్యగాడు" అన్నారు. "ఎలిజబెతన్ రెబలియన్" లనీ ముద్రవేశారు. ఇతని కాలం 1567-1601. సవ్యమైన నిర్దుష్టమైన కఠిన శిక్షలతో ఉన్న పాలనపై తిరగబడ్డాడు. అతని భాషా భావాలు చాలా కర్కశంగా ఉద్రేకంగా ఉండేవి. ఇరవై తొమ్మిదో ఏట రాసిన చివరి నాటకం "ది ఐల్ ఆఫ్ డాగ్స్"లో రాజ్యంలో ఉన్న లొసుగులను బయటపెట్టాడు. దానికి ప్రతిఫలం కొన్ని నెలల జైలు. "ఎలిజబెతాన్ జాకోబీన్ సాంగ్స్‌లో "A body of literary work more precious to the English than any other, apart from Shakespeare and the translated Bible" అని కవిత్వాన్ని అంచనా వేశారు. కాని అవన్నీ లభ్యం కాలేదు. కరపత్ర రచనలో అంతవరకూ ఎవరూ ఇతన్ని మించలేదు. "కలబర్ట్ కర్రి నెవ్" అన్నది నాషే రాసిందిగా అందరూ అంగీకరించారు. "I am sick - I must die - Lord have mercy on us!" అని రాసుకొన్నాడు.

### పెళ్లి, చావు పాటల కవి - డాక్టర్ థామస్ కాంపి యాన్




1567-1620కు చెందిన థామస్ కాంపియాన్ తనకు తానే ఒక నీతి శాస్త్ర గ్రంథం అనిపించుకొన్నాడు. సంగీతంతో పాటు రచనలూ చేశాడు. అతని "బుక్ ఆఫ్ ఐర్స్" ప్రసిద్ధి చెందింది. జీవిత చరిత్ర ఎవరికీ తెలియదు. రచనలన్నీ చరిత్రలో కలిసి పోయాయి.

మూడు వందల ఏళ్ళ తర్వాత పందొమ్మిదో శతాబ్ది చివర్లో మళ్ళీ అతన్ని గుర్తుకు

తెచ్చుకొన్నారు. "లా" చదివాడు. ప్రాక్టిస్ చేసిన దాఖలాలు లేవు. కాని మెడిసిన్‌లో "కేయాన్ యేనివర్సిటి నుండి 1605లో డిగ్రీ పొందాడు. అందుకే "డాక్టర్ ఇన్ ఫిజిక్స్"గా గుర్తించారు. చనిపోయే దాకా వైద్యం చేస్తూనే ఉన్నాడు. గొప్ప తెలివి తేటలున్నవాడు. హైమ్స్ ఓడ్స్, పెళ్లి పాటలు, చావు గీతాలు రాశాడు. సంగీతం సమకూర్చే వారికి మార్గదర్శిగా ఉన్నాడు. "ఏ న్యూ వే ఆఫ్ మేకింగ్ ఫోర్ పార్ట్స్ ఇన్ ది కౌంటర్ పాయింట్"కు గుర్తింపు వచ్చింది. "అబ్సర్వేషన్స్ ఇన్ ది అర్ట్ ఆఫ్ ఇంగ్లీష్ పోయేట్రి" అనే విమర్శనాత్మ గ్రంధంలో క్లాసికల్ సాహిత్యపు సొగసులను అందులోని ఛందస్సును మెచ్చి మళ్ళీ అవే గతి అని తేల్చి చెప్పాడు. "He protested against the vulgar and artificial rhyming".

30 వయసులో ఫిలిప్ రోసేస్టర్ అనే తోటి సంగీతకారునితో కలిసి "ఏ బుక్ ఆఫ్ ఆర్ట్స్"లో మొదటి సగానికి లిరిక్స్ రాయటమే కాకుండా మొత్తం సంగీతాన్ని, పర్యవేక్షించాడు. ఈ ప్రయత్నం ఫలవంతమైంది. ఈ ధోరణిలోనే మరో మూడు అంకిత భావంతో తపనతో చేసి ముద్రించాడు. మెడిసిన్ కంటే మ్యూజిక్‌కు ప్రాధాన్యతనిచ్చాడు. "ఫోర్త్ బుక్ ఆఫ్ ఆర్ట్స్" రాశాడు. దీనిపై కాంప్బియాన్ "The apothecaries have books of Gold, whose leaves being opened, are so light that they are subject to be shaken, with the least breath - yet rightly handed, they serve both ornament and use" అని రెండు రకాల ప్రయోజనాలను పేర్కొన్నాడు.

కాంప్బియాన్ రాసిన లలిత, పారదర్శక లిరిక్స్ చాలా సున్నితమైనవే అయినా మనసుపై గొప్ప ప్రభావాన్ని చూపాయి. అతను అన్నట్లు కదిలించాయి కూడా. అతని లిరిక్స్‌లో "The superfluous of his deeper studies" ఉంటాయి. వాస్తవ కవిత్వాన్ని సరి అయిన మత భావాలతో జతచేసి చెప్పటం అతని ప్రత్యేకత. "Beauty since you so much desire"లాంటివి గుర్తుండిపోయే మాటలు. కవిత్వంపై కాంప్బియాన్‌కు ఉన్న భావాలను సామ్యుల్ డేనియల్ తిరస్కరించి కవిత్వానికి "రైం" (అంత్య ప్రాస) అవసరమేనన్నాడు. కాంప్బియాన్ పెళ్లి చేసుకోలేదు. పిల్లలూ లేరు. 01-03-1620న చనిపోయాడు. ఆరోజే వెస్ట్ ప్లీట్ స్ట్రీట్‌లో సెయింట్ దంస్టన్లో అంత్యక్రియలు చేశారు. 15-02-1567న జన్మించిన కాంప్బియాన్ యాభై మూడేళ్ళు మాత్రమే జీవించాడు.

**జంట కవులు – ఫ్రాన్సిస్ బీమాంట్, జాన్ ప్లేచేర్**

"A perfect union of genius and friendship" అని పేరు తెచ్చుకొన్న ఫ్రాన్సిస్ బీమాంట్ 1584-1616 కాలంవాడు. పన్నెండు ఏళ్ళ వయసులో ఆక్స్‌ఫర్డ్‌లో చేరాడు. అప్పటికే అదిరిపోయే రెండు ట్రాజెడీలను రాసిన ఘనుడు. ఇవి మార్లో రాసిన



"టంబర్ లైన్", షేక్స్పియర్ రాసిన "టైటాస్ ఆండ్రోనికస్"లకు అనుకరణలు. లా చదివి పదిహేనేళ్ళ వయసుకే "మిడిల్ టెంపుల్"లో మెంబర్ అయ్యాడు. కొద్ది కాలంలో లండన్ నాటక రచయితల సంఘంలో చేరాడు. ఇందులో ఫ్లెచర్ ఒక భాగస్వామి. ఫ్లెచర్‌కుసృజన ఎక్కువ. దానికి ముడిసరుకు బీమాంట్ అందించేవాడు. బెన్ జాన్సన్ కూడా తాను రాసింది సరి చేయటానికి బీమాంట్‌కే ఇచ్చేవాడు. ఫ్లెచర్‌తో కలిసి పదమూడు నాటకాలను రాశాడు బీమాంట్. "మొదటి బీమాంట్ ఫ్లెచర్ ఫోలియో" 35 నాటకాలతో 1647లో విడుదల అయితే 1679లో 53తో విడుదల అయింది. బీమాంట్ రాసినవి చాలా సీరియస్‌గా గొప్ప నీతిబద్ధంగా ఉంటాయి. జంట రచనలు చేసినా అందులో "సింగులర్ బ్యూటీ అండ్ పవర్" ఉందని మెచ్చుకొంటారు. జంట కవనం ఈ ఇద్దరితోనే ప్రారంభమైందని చెప్పవచ్చు.

**జాన్ ఫ్లెచర్**



బీమాంట్ కంటే తొమ్మిదేళ్ళు ఎక్కువ కాలం జీవించిన జాన్ ఫ్లెచర్ 1579లో పుట్టి 1625లో మరణించాడు. అవిశ్రాంత నాటక రచయితగా ఆకాలంలో పేరు పొందాడు. కోస్టల్ ప్రాంతం "రై"లో పుట్టాడు. కేంబ్రిడ్జి బెనేట్ కాలేజిలో చదివాడు. ఇరవైలలో లండన్ చేరాడు. స్ఫురద్రూపం, మంచి పద్ధతులతో అందరినీ ఆకర్షించాడు. పదహారు నాటకాలు స్వయంగా రాశాడని గుర్తింపు. బీమాంట్‌తో కలిసి ఏడు లేక ఎనిమిది రాసి ఉంటాడు. థామస్ మిడిల్టన్‌తో కూడా జత కలిసి రాశాడు. షేక్స్పియర్ కూడా వీరితో కలిసి "టు నోబుల్ కిన్స్‌మెన్", "కింగ్ హెన్రి ది యైత్" నాటకాలు రాశాడు. "ట్రాజీ కామెడి" రాయాలనే బలలమైన కోరిక ఫ్లెచర్‌కు ఉండేది. ఆ కోరిక తీరకుండానే "ప్లేగు" వ్యాధి సోకి అర్ధంతరంగా నలభై ఆరో ఏట చనిపోయాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో చాసర్ కవి ప్రక్కనే సమాధి చేశారు. నాటకాలు రాసినా, ఫ్లెచర్‌కు కవిగానే ఉండటం ఇష్టం. "The touch is light and the tone lyrical, the lines move with grace, warmth and spontaneity. Although his range is not great he had a definite influence on his followers" అని అతని కవితా వైభవాన్ని ఎస్టిమేట్ చేశారు. ఫ్లేచర్ రాసిన "ఎలిజీ"లు

లఘు కావ్యాలుగా నీతి బోధకాలుగా ఉండటం ప్రత్యేకత –

"lay a garland on my hearse - of the dismal yew - maidens willow branches bear - say I died true."

"My love was false, but I was firm - from the hour birth - upon my buried body lie - lightly gentle earth."

ఇలాంటి పంక్తులు ఫ్లెచర్ కవితల్లో కోకొల్లలు. అలాంటి తళుకు బెళుకులు అచ్చమైన బంగారం మెరుగుల్లా అనిపించటమే ఈ "తళుకు యుగ" లక్షణం. షేక్స్పియర్ అనుమాయిగా మంచి పేరు పొందాడు. ప్రేక్షకులు అర్థం చేసుకోలేనంత వేగంగా అతని రచనలుంటాయి. అయినా షేక్స్పియర్ రచనలు లాగా వీటికి కాలాతీత విలువలు లేకపోవటంతో మరచిపోయారు.

ఇప్పటిదాకా "రెలిజియన్ కవిత్వమే" ఈ యుగాన్ని డామినేట్ చేసింది. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 15

# జాన్ డోన్నే

**ప**దిహేడవ శతాబ్దవ సాహితీ కారులు వస్తువులోను, ఆంతర్యంలోను పెనుమార్పులు తెచ్చారు, కాని ఒక తరం తర్వాత ఈ విధానంపై మక్కువ తీరిపోయింది. మూడువందల ఏళ్ళు కనిపించకుండాపోయిన ఈ కవిత్వం ఇరవయ్యవ శతాబ్దిలో ఆ కవులతో విభేదించిన నూతన పోకడలు పోయి విశేష ప్రాచుర్యం పొందింది. "డ్రైడేన్" కవి ఈ గ్రూపుతో సంబంధం లేకుండా "Donne affects the meta physics not only in his satires but in his amorous verses" అని ఢంకా బజాయించి "జాన్ డోన్నే" గురించి చెప్పాడు.

**సామ్యూల్ జాన్సన్**

"మెటా ఫిజికల్" అనే అరువు మాటను తెచ్చుకొని డోన్నే తరువాతి కవులను పిలిచాడు. ఇది కొంచెం ముతకగా ఉన్నా "The metaphysical poets were men of learning and to show their learning was their whole endevour" అని కౌలీ మెచ్చుకొన్నాడు. ఈ కవుల అంత్యప్రాసలకు ప్రాధాన్యం ఇచ్చి కవిత్వాన్ని రాయకుండా పదాల కూర్పునే చేశారు అని అభియోగం ఉంది. మెటా ఫిజికల్ కవులకు కవులు అనిపించుకొనే అర్హత లేదన్నాడు జాన్సన్. ప్రకృతిని కాని, జీవితాన్ని కాని దేన్నీ అనుకరించలేదన్నాడు ఎడ్మండ్ గూస్. కాని విమర్శకులు జాన్సన్‌ను లెక్కపెట్టలేదు. "డోన్నే ఆంగ్ల సాహిత్యంపై, రచయితలపై ప్రభావం ఎక్కువే" అన్నాడు ఇరవయ్యవ శతాబ్దిదాకా. డోన్నే ప్రభావాన్ని గుర్తించలేకపోయారు విమర్శకులు. మెటా ఫిజికల్ కవిత్వానికి, డోన్నే గొప్ప ఉదాహరణ అని ఇలియట్ ఇప్పుడు నిర్ద్వందంగా ప్రకటించాడు. ఇలియట్ "A mechanism of sensibility which could devour any kind of experience" అని మెటాఫిజికల్

కవిత్వాన్ని అంచనా వేశాడు. జాన్ డోన్నే శారీరకంగా మానసికంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. "మానవ శరీరమే అతని పుస్తకం". మనిషి ఆత్మ ఒక మిస్టరి అనుకొన్నాడు. ప్రతి భావానికీ స్పందించాడు. వయసు పెరిగిన కొద్దీ ఈ అంతర్యుద్ధం పెరుగుతూనే ఉంది. యోధుడుగా మారిపోయి మత ప్రచారకుడయ్యాడు. డోన్నే రాసిన "సేర్మాన్స్"లో 1640లో విడుదల అయింది. అందులో అతని అనుభూతుల నుంచి ఆత్మ తత్వానికి ప్రయాణంలో అభివృద్ధి కనిపిస్తుంది. ముతక భావాల నుండి విశుద్ధ మానసిక పరిణామం గోచరిస్తుంది. "పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్" కాకపోయినా ఆత్మోద్ధరణ అతని ఆత్మక్షోభ అసలు మరణాని కన్నా ముందే చావును చూశాడు. అతని రచనలలో ఉన్న వైవిధ్యం అతని జీవితాన్ని తెలుసుకోవటానికి బాగానే సహకరిస్తుంది.

డోన్నే లండన్‌లో 1573లో ఒక సంపన్న ఇనప వ్యాపారి కొడుకుగా జన్మించాడు. తండ్రి థామస్ మోర్ బంధువు జాన్, హేవుడ్ కూతురును పెళ్లి చేసుకొన్నాడు. దర్బారులో ఉద్యోగం పొందాడు. సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉన్నాడు. తనలో అమరవీరుల రక్తం ప్రవహిస్తోందని భావించేవాడు. కేథలిక్ కుటుంబం తరపు బంధువులను గురించి ముప్ఫైవ ఏట రాశాడు. లాటిన్, ఫ్రెంచ్‌లను ఇంటి వద్దే ట్యూటర్స్ బోధించారు. పదకొండవ ఏట "ఆర్ట్ హాల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్"లో చేరాడు. యూక్లిడ్ లాజిక్‌ను మూడేళ్ళు చదివి కేంబ్రిడ్జిలో ట్రినిటి కాలేజిలో చేరాడు. విశుద్ధ రీజన్‌కు నమ్మకానికి, స్పానిష్ మిష్టిక్స్ చదివాడు. అధ్యయనం చేశాడు. భేదం గ్రహించాడు. "లా" చదివి పాసై ప్రాక్టిస్ చేశాడు. కేథలిక్‌గా ఉన్నా ఛాందసానికి దూరం అయ్యాడు. సగం విషయేచ్ఛ, సగం మానవ ద్వేషంతో తిరుగులేని కవి అనిపించుకొన్నాడు. వీటినే "సాంగ్స్ అండ్ సానేట్స్"లో ప్రతిఫలింపజేశాడు. సెటైర్స్, ఎలిజీలతో దూసుకుపోయాడు. స్పెయిన్, ఇటలీలు చూశాడు. సర్ థామస్ ఈగర్టన్‌కు ప్రైవేట్ సెక్రెటరి అయ్యాడు. ఈ పదవే కొంప ముంచింది. ఆ ఇంట్లో సన్నిహితంగా మెలిగాడు. ఈగర్టన్ బంధువు "అన్నే మోర్"తో ప్రేమలో పడ్డాడు. ఆమెతో లేచిపోయి పెళ్లి చేసుకొన్నాడు. కోపానికి బలి అయ్యాడు. ఉద్యోగం ఊడగొట్టి, జైల్లో పెట్టించాడు. ఒక ఏడాదికి పెళ్లి చట్టబద్ధమైంది. విడుదల అయ్యాడు. "Ane done - undone" అని తల్లికి రాసుకొని వాపోయాడు.

తరువాత భార్యాభర్తల జీవితం ఒడిదుడుకులతో నడిచింది. చేతిలో చిల్లిగవ్వలేని పేదరికం. అప్పుల బాధ వలన రోమన్ కేథలిక్‌ను వదిలేసి మతాధికారులను దూషిస్తూ అనేక కరపత్రాలు రాసి విడుదల చేశాడు. చివరికి ఈగర్టన్ గొప్ప పదవి, కుటుంబ పోషణకు ధనసాయం చేశాడు. డోన్నేను క్షమించాడు. రాజు దయా దాక్షిణ్యాల మీద బతకటం వలన డిప్రెషన్‌కు లోనయ్యాడు. రాజు ఇస్తున్న డబ్బు దేనికీ చాలటం లేదు. తీవ్రమైన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై జబ్బు ఏర్పడి జీవితాంతం బాధించింది. "Me thinks I have the

keys of my prison in my own land, and no remedy presents itself so soon to my heart as mine own sword" అని రాసుకొన్నాడు.

డోన్నె బీదగా, విచారగ్రస్తుడిగా చావు కోసం ఎదురుచూస్తూ గడిపాడు. సెక్రెటరి ఉద్యోగం వస్తుందని ఆశించి భంగపడ్డాడు. పదమూడేళ్ళు బాధపడ్డాడు. ఎందరినో సహాయం కోసం అర్ధించాడు. అప్పుడప్పుడు ఎవరూ ముందుకు రాలేదు. చిన్నచిన్న ఉద్యోగాలు చేశాడు. వాగ్ధానాలు చేసినవారే కాని చేతల్లో ఎవరూ ఆదుకోలేదు. "సాంగ్స్ అండ్ సానెట్స్" అనే మత సంబంధ కవితలు రాస్తూనే ఉన్నాడు. 42వ ఏట ధ్యానం, చాలాకాలంగా దేనిపై ధ్యాసలేకపోవటం వలన విసిగి వేసారి తండ్రిలాగా ఆంగ్లికన్ చర్చి భావాలకు దగ్గరయ్యాడు. మొదటి జేమ్స్ రాజు సంతోషించి డోన్నేను "చాప్లాన్"ను చేశాడు. లింకన్స్ ఇన్ అతన్ని మత ప్రచారకునిగా అంగీకరించి తీసుకొంది. "డీన్ ఆఫ్ సెయింట్ పాల్" అయ్యిడు.

ఆత్మాన్వేషణ ఫలించి డోన్నే గొప్ప ప్రచారకుడుగా పేరు తెచ్చుకొన్నాడు. డబ్బు, సుఖం కూడా బాగా అందుతోంది. సంతోషం లేదు. అతనికి అమితంగా జీవితం నుంచి దూరమై మత బోధనకే ప్రాధాన్యం యిచ్చాడు. ప్రేమించిన భార్య చనిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొని చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపం చెందాడు. జీవితం నుండి విముక్తి చెందాలనే కోరిక బలీయం అయింది. ఎక్కడా సుఖం ఉండదు అని గ్రహించాడు. ఆరోగ్యం బాగా దెబ్బతినిపోయింది. జీవితంలో దెబ్బతిన్నాననే భావం అతన్ని పీడిస్తోంది. ఇప్పుడు మనిషి జీవితం శాశ్వతం కాదని మనిషి మర్త్యుడే అని గ్రహించాడు.

"డివోషన్స్"లో కూరుకుపోయి ఎనిమిదేళ్ళు బతికాడు. అతనిలో జీవం క్షీణించిపోతూనే ఉంది. "To pay a fever every half year as a rent for my life" అని వాపోయాడు. బిషప్‌గా ప్రమోషన్ పొందిన కొద్దికాలానికే 57వ ఏట తీవ్ర అనారోగ్యం అతన్ని కుంగదీసింది. చనిపోతున్నానని గ్రహించాడు. "ఫనరెల్ స్టాట్యూ"ను తయారు చేయించాడు. దాన్ని రంగులతో తీర్చిదిద్దాడు. తన పక్కనే ఉంచుకొన్నాడు. 31-03-1631లో కేన్సర్‌తో చనిపోయాడు. డోన్నే బతికి ఉన్నకాలంలోనే అతని కవితలు బాగా ప్రచారమయ్యాయి. అతనివి రెండు మాత్రమే అతని జీవితకాలంలో ముద్రణ పొందాయి. "యనాటమి ఆఫ్ ది వరల్డ్", "ఆఫ్ ది ప్రోగ్రెస్ ఆఫ్ దిసోల్" బాగా ప్రసిద్ధి చెందాయి. బతికి ఉండగానే పొగడ్తలు, తెగడ్తలు అనుభవించాడు. "Donne's continual conflict between anxious hope and wordly disollusionment made him as characteristic of our age as of his". మూడు శతాబ్దాల తర్వాత ప్రఖ్యాత అమెరికా నవలా రచయిత ఎర్నెస్ట్ హెమింగ్‌వే డోన్నే రాసి ఎవరికీ తెలియని "డివోన్స్" నుంచి ఒక దానికి ఎన్నుకొని "ఫర్ హూం ది బెల్ రింగ్స్" రాశాడు. అందులో "Any man's death diminishes me,

because Iam involved in mankind. And therefore never send to know for whom the bell tolls. It tolls for thee" అన్నాడు.

మెటా ఫిజికల్ అంటే అది ఆలోచనను భావాలను ఏకీకృతం చేస్తుంది. భౌతికానికి అతీతమైనది. భావ చిత్రాలనేర్పరుస్తుంది. విరుద్ధాలను జత కలుపుతుంది. మిరుమిట్లు గొలిపే వెలుగును దర్శింపజేస్తుంది. "Donne showed his followers a new way of fusing sense and sensibility. He bought together pieces of a disordered universe and arranged them in a world of clear vision. He united compexity of thought and simplicity of language". డోన్నే గొప్ప సృజనశీలి. దాదాపుగా అతని అన్ని కవితల్లోనూ మరణమే వస్తువు. "Death had no horror for the sensual curiosity seeker, the exhilarated being who shrank from no excess of impulse or devotion" తన మనసును బయట పెడుతూ "I have not the rightousness of job, but I have the desire of jon - I would speak to the Almighty, and I would reason with God" అన్నాడు.

"Thou art slave to fate, chance, kings and desperate men - and dost with poison, warand sickness dwell - one short sleep, past we wake eternally - and death shall be no more - death thou shall die" అని చాలెంజ్ చేసిన కవి డోన్నే "Well serve as epitaph for one who, predestined to a fearce singularity, united the ecstatic and the austere in vehement of intellectual play and spiritual discipline" అని ఈ కవిని అంచనా వేశారు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 16

# పునర్వైభవం తర్వాత

**మ**రణంలో జీవిస్తూ మృత్యు కవితలు రాస్తూ విశ్లేషణ చేస్తూ అనేక మందిని ప్రభావితం చేసిన జాన్ డోన్నే అనుయాయులు. పదిహేడవ శతాబ్దిలో ఆది భౌతికత వైపే మొగ్గి, విరుద్ధతలను ప్రకటిస్తూ గడిపారు. వీళ్ళది "డోన్నే స్కూల్" అన్నారు. అభిరుచి, టెక్నిక్‌లో వీరు భిన్నమైన మార్గాలు తొక్కారు. గొప్ప ఊహా పిపాసులనిపించారు. దీనితో కవిత్వానికి ఒక కొత్త భాష, నూతనత్వం, చిక్కదనం, శైలి, వాక్య నిర్మాణం వచ్చి మనసులకు ఆహ్లాదం కలిగింది. ఇందులో కొందరు "డోన్నే"కు "డ్రైడేన్"కు వారధిలా నిలిచారు. వారే జార్జి హెర్బర్ట్ రిచార్డ్, క్రాషా, హెన్రి వాగన్, థామస్ ట్రాహేర్న్.

### హోలీ జార్జి హెర్బర్ట్

జార్జి హెర్బర్ట్ 1593లో వేల్స్‌లోని కాజిల్ ఆఫ్ మాంట్ గోమారీలో జన్మించాడు. అన్న హెర్బర్ట్ గొప్ప చరిత్రకారుడు. తండ్రికున్న పదిమంది సంతానంలో ఒకడు. వేదాంతి, డిప్లమాట్ అయ్యాడు. హెర్బర్ట్ ఆక్స్‌ఫర్డ్‌లో చేరగానే కుటుంబం లండన్‌కు పదిహేనవ ఏట వచ్చింది. పన్నెండవ ఏట జార్జి వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో చేరాడు. కేంబ్రిడ్జిలో "కింగ్స్ స్కాలర్"గా చేరాడు. ఇరవైవ ఏట ట్రినిటిలో "పబ్లిక్ ఆరేటర్" అయి ఎనిమిదేళ్ళు పనిచేశాడు. అన్నలా సాహస జీవి కావాలని తపనపడ్డాడు. అతని మనసు, బుద్ధి దేవుడిపైనే ఉండేవి. ఇలా చిన్నతనం నుంచి ఉంది. తల్లికి రాసిన ఉత్తరంలో తాను దేవుని మనిషినని అలాగే జీవిస్తానని తెలిపాడు. తల్లి స్నేహితుడు జాన్ డోన్నేను కవిత్వంవైపే కాక చర్చివైపూ తిప్పాడు. 32వ ఏట అధికారాలు పొంది, 36వ ఏట "రెక్టార్" అయ్యాడు. జెన్ డాన్వార్‌ను పెళ్లి చేసుకొన్నాడు. చర్చిలను నిర్మించటం అభివృద్ధి చేయటంలో కాలం గడిపాడు. మైళ్ళకొద్దీ నడిచి వెళ్లి సాలిస్ బరిలో చర్చిలో సంగీతంతో మతబోధ చేస్తూ కవిగా, రైతులను కూడా

ఆకిర్షించాడు. బోధకుడిగా సంతృప్తి పొందాడు కాని ఈ ఆనందం ఎక్కువకాలం లేదు.

హెర్బర్ట్‌కు క్షయవ్యాధి ఎప్పుడు సోకిందో తెలియదుకాని 40వ ఏటనే పొట్టన పెట్టుకొంది. తగిన ఏర్పాట్లు చేసుకొన్నాడు. చావు సంగతి ముందే గ్రహించాడు. తన పాటలను తానే సంగీతం కూర్చుకున్నాడు. కాంప్పియాన్ లాగా జార్జి సంగీతజ్ఞుడు. కవి కూడా. వీణ (lute) వాయిస్తూ పాడేవాడు. తాను ఒక దేవదూతను అనే భావంతో స్వర్గంలో గానం చేస్తున్న అనుభూతితో పాడి శ్రోతలకూ ఆ అనుభవాన్ని అతని తన్మయత్వానికి కల్గించేవాడు. “హోలీ జార్జి హెర్బర్ట్” అనేవారు. దయ, సానుభూతి, మంచితనం, కమ్మదనం హెర్బర్ట్ సొత్తు. డోన్నేలాగా మెటా ఫిజికల్ అయినా అతని కంటే సరళ స్వభావి. డోన్నేకున్న తీవ్రత, హింస ఇతనిలో లేవు. చర్చి అతనికి దేవాలయం మాత్రమే కాదు. శ్లేషను చక్కగా వొదిగేట్లు రచన చేసేవాడు. చర్చి రూపకం మీదే కవితా సౌధం నిర్మించాడు. రూపకాలంకారాలకు వేదిక కూడా అంటే ఆధ్యాత్మిక భావాలకు ఆలవాలం అనే నమ్మకం కలిగించాడు. “చర్చి నేల, నమ్మకానికి పునాది, కట్టిన రాళ్ళు రప్పా వినయానికి , ఓర్పుకి ప్రతీకలు. వీటిని కదలకుండా బంధించే సిమెంట్ లేక సున్నం ప్రేమకు చిహ్నం. “చర్చి ద్వారపు తాళం చెవి చేతుల్లో దాచుకొన్న పాపాలను విడిపించేది” అని చాలా చమత్కారంగా రూపకాలతో బోధనను పరిపుష్టి చేసేవాడు హెర్బర్ట్. దేవుడి కోసమే నటిస్తున్నాను. భూమిమీద అనేవాడు “Jesu! - Ease - you” అని మన “త్వమేవాహం”ను ఒంట బట్టిన్చుకొన్నట్లు అనేవాడు. అర్ధవంతమైన శబ్ద వ్యతిక్రమం దీన్ని అనాగ్రాం మచ్చుకొకటి ANA (MARY ARMY) GRAM అనేక ద్విపదలను రాశాడు. మనవాళ్ళు రాసిన బంధ కవిత్వం వంటిది. కవిత్వంలో సాంకేతికతను జోడించి చెప్పాడన్న మాట. చాలా సరళంగా ఎంతో ప్రత్యేకంగా ఉంటాయి ఇవి. హెర్బర్ట్ రాసిన అమర గీతం – “O Almighty Love! Man is one world and hath - another to attend him” “సెవెన్ టిప్స్ ఆఫ్ యామ్బిగ్యుటి” హెర్బర్ట్ సృజనకు పరాకాష్టగా భావిస్తారు. అతన్ని అర్ధం చేసుకోవటం కష్టమే. అనేక రూపకాలు పదచిత్రాలు సింబాలిజంతో ఒక పట్టాన కొరకుడుపడేది కాదు. ఆ భాష ఈ ప్రపంచానికి చెందిందిగా అనిపించదు కూడా. డోన్నే తన బాధను అంతటిని “డ్రమటైజ్” చేసి చెబితే హెర్బర్ట్ తన బాధలను దిగమింగుకొని దేవుడితో మాట్లాడాడు. డోన్నే లాగా తనను “job”గా వర్ణించుకోలేదు. వ్యతిరేకించకుండా అసమ్మతి మాత్రం తెలియజేశాడు. పాపానికి, ముక్తికి మధ్య సన్నని విభజన రేఖను చూశాడు. ప్రపంచ అసహాయ హెర్బర్ట్‌ను గురించి చెప్పాలంటే స్థితికీ, స్వర్గ సుఖాలకూ అంటే “humility, orderliness, serenity grace”తో వికసించిన సంపూర్ణ కవి అనవచ్చు. మానసిక చాంచల్యం లేని అసాధారణమైన ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నవాడు. క్రమశిక్షణకు మారుపేరు. “serenity came after internal conflict and a feeling of

inadequacy and underneath the grace, the wit and whimsicality, there is an unshakable fervor as reasonable as it is religious. Quiet, alternately courtly and colloquial this is a poetry which begins in wonder and ends in certainty" అని హెర్బర్ట్ కవిత్వాన్ని అంచనావేశారు. "ఎ సోల్ కంప్రైసేడ్ ఆఫ్ హర్మోనీస్" అని కీర్తించారు. "లెట్ ఆల్ ది వరల్డ్ ఇన్ ఎవిరి కార్నర్ సింగ్" అన్న కవిత బహుళ ప్రచారమైంది. "ఈస్టర్ వింగ్స్" కవిత చదవటానికే కాదు ఆకృతికి కూడా అదిరేట్లు ఉంటుంది. అత్యధిక నైపుణ్యం, శైలి ఉన్న బ్రిటిష్ ఆధ్యాత్మిక కవుల్లో అగ్రేసరుడు హెర్బర్ట్.

హెర్బర్ట్ ముప్ఫై తొమ్మిదేళ్ళు జీవించి 01-03-1633న దైవ సన్నిధికి చేరుకొన్నాడు.



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 17**

# రిచార్డ్ క్రాషా

ప్రఖ్యాత ప్యూరిటన్ బోధకుడు విలియం క్రాషాకు రిచర్డ్ క్రాషా 1612లో పుట్టాడు. మత బోధన మీదే అభిమానం. రోమన్ చర్చిపై మనసు మళ్ళింది. "యాంటి పాపిస్ట్" అయిన తండ్రికి ఇది వ్యతిరేకం. లండన్‌లో పుట్టి పెంబ్రోక్‌లో, చార్టర్ టన్‌లలో చదివి, మత ప్రచారకుల మధ్యనే నడివయసు గడిపాడు. అబ్రహాం కౌలీ కవికి దగ్గరయ్యాడు. కౌలీ కవిత్వంలో మెళకువలు నేర్పటమే కాక ఆర్ధిక సాయమూ చేసేవాడు. ఇంగ్లాండ్ అంతర్యుద్ధ సమయంలో ఆర్ధికంగా పేదరికం అనుభవించలేక పారిస్ చేరాడు. కౌలీయే రిచార్డ్‌ను లండన్ తీసుకొచ్చాడు. ప్రవాసంలో ఉన్న రాణి హెన్రి ఎట్టా మేరియా దృష్టికి క్రాషా విషయాన్ని తీసుకు వెళ్ళాడు. ఆ ఏడాదే క్రాషా మతం మారాడు. రోమ్‌కు చెందిన కార్డినల్ పలాట్టోకు ప్రైవేట్ సెక్రటరి అయ్యాడు. తరువాత లోరాటోలోని హోలీ హౌస్ కేథడ్రిల్‌కు "సబ్ కానన్"గా పదవి పొందాడు. రాజకీయంగా, వ్యక్తిగతంగా కుట్రల్లో కూరుకుపోయాడు. 36వ ఏట అకస్మాత్తుగా 16–08–1649లో క్రాషా జీవితం నుంచి కనుమరుగయ్యాడు.

"స్టెప్స్ టు ది టెంపుల్" అనే క్రాషా పుస్తకం అతని ప్రవాస కాలంలోనే వెలువడింది. ఇది హెర్బర్ట్ రాసిన "ది టెంపుల్"ను పోలి ఉందన్నారు కాని పూర్తిగా తేడాగానే ఉంది. హెర్బర్ట్ స్థిమితంగా ఉన్న చోట క్రాషా విజ్రుమ్భించాడు. హెర్బర్ట్‌ది పూర్తి ఇంగ్లీష్ ధోరణి అయితే, క్రాషాది ఇటాలియన్ స్పానిష్ ధోరణిలో ఉంటుంది. మత ఉత్సవాలను హెర్బర్ట్ ప్రోత్సహిస్తే క్రాషా అందులోనూ నాటకీయతను ప్రవేశపెట్టి కొత్తదనం తెచ్చాడు. నగిషీలు చెక్కాడు. అలంకారం చేశాడు. క్రాషా కవిత్వం "So ornate, so overembellished that it is some times hard to see the poetry because of the words. His images are alternately gorgeous and grotesque" అంటారు. మేరీ మాగ్దలీన్ సజీవ శిల్పాన్ని కవితలో మన ముందుంచాడు. "Two walking baths two

weeping motions - portable compendious oceans". కల్పనా సృజనా జమిలిగా ప్రవహిస్తాయి. నలభై రెండు స్టాంజాలలో ఆమె అద్వితీయ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తూ అది సహజ లావణ్యం అని, అది ఆమెకే స్వంతం అని రాస్తాడు.

"సెయింట్ టేరస్"పై చెప్పిన కవిత క్రాషా కవితల్లో తలమానికంగా భావిస్తారు. ప్రతీకలను వాడటంలో నిష్ణాతుడు. భాషా గౌరవం అనే ఉక్కు ఛట్రంలో బిగిసి ఊపిరాడక కొట్టుకొన్న కవులకు వాటిని "క్రాష్" చేసిన క్రాషా ఆదర్శప్రాయుడైనాడు. క్రాషా రచనలను మొదటిసారి విలియం టంబుల్ ఒక పుస్తకంగా ముద్రించాడు. క్రాషా రాసిన "బుల్లా" అంటే నీటి బుడగ కవిత ఇలియట్ కార్టర్‌కు ప్రేరణ కలిగించింది. "లో ది ఫుల్ ఫైనల్ సాక్రిఫైస్"కు జేరాల్డ్ ఫింజి సంగీతాన్ని సమకూర్చాడు. లాటిన్ కవి "కాతలాస్" రాసిన కవితను జార్జి "కం అండ్ లెట్ అజ్ లివ్"గా ఇంగ్లీష్‌లో రాశాడు. దీనికి జూనియర్ సామ్యుల్ వెబర్ ఇంగ్లీష్‌లో సంగీతం చేశాడు.

**అబ్రహాం కౌలీ**



లండన్‌లో 1618లో సంపన్నుడైన పుస్తక విక్రేత, పుస్తకాల షాపు యజమానికి జన్మించాడు. మొదటి నుంచి చాలా జాగ్రత్తగా ఉండేవాడు. పదేళ్ళకే "పైరమాస్ అండ్ తిస్బే" అనే పురాణ శృంగార కవిత రాశాడు. రెండేళ్ళ తర్వాత మరో ఎపిక్ "కాన్స్టాన్షియా అండ్ ఫైలేతాస్" తయారు చేశాడు. ఈ రెండు కవితలు "పోయేటికల్ బ్లాసంస్"లో ప్రచురితాలు. అప్పటికి ఈ బుడ్డాడి వయసు పదిహేను. ఇరవైకి మరో రెండు పుస్తకాలు వదిలాడు. వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో చేరాడు. తర్వాత ట్రినిటీ కాలేజిలో చేరి రాయలిస్ట్ దృక్పథంపై విపరీతంగా మాట్లాడటం వలన కేంబ్రిడ్జి నుంచి బహిష్కరించారు. ఆక్స్‌ఫర్డ్ చేరాడు. స్టువార్ట్ రాజులు అండగా నిలిచారు. 28కి పారిస్‌లో ఉన్నాడు ఈ ప్రవాసంలో హెన్రి ఎట్టా మేరియాకు సెక్రెటరి అయ్యాడు. పన్నెండేళ్ళు డిప్లమాటిక్ ఏజెంట్‌గా వ్యవహరించాడు. రాణీకి చార్లెస్‌కు మధ్య రహస్య రాయబారం నడిపాడు. ముప్పై ఏడేళ్లకు ఇంగ్లాండ్‌కు రాజుగారి వేగుగా (స్పై) చేరాడు. క్రామ్వేల్‌కు దొరికిపోయి జైలు పాలయ్యాడు. తిమ్మిని బమ్మిని చేసి బెయిల్‌పై విడుదలయ్యాడు. రేస్టోరేషన్ కౌలీ పదవిని నిలిపింది. ఆక్స్‌ఫర్డ్ చేరి మెడిసిన్ చదివాడు. కొద్దిపాటి ఆదాయాన్నిచ్చే ఒక చిన్న ఎస్టేట్‌ను ఇచ్చారు. ఓల్డ్ కోర్ట్‌లో హాయిగా జీవించాడు. "That solitude which from his very childhood he had always pas-

sionately desired" చిన్నప్పటి నుంచి కలలు కన్న ఒంటరి హాయైన జీవితం లభించి సంతృప్తి చెందాడన్న మాట. 49వ ఏట 28-07-1667లో ఇహలోకం చాలించాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో అతని అంత్యక్రియలు నిర్వహించారు. కౌలీ బతికి ఉండగా పెద్దగా ఏ సాయం చేయని రెండవ చార్లెస్ రాజు "Cowley has not left behind him a better man in England" అని మొసలి కన్నీరు కార్చాడు.

కౌలీ ప్రాభవం రాకెట్‌లాగా అకస్మాత్తుగా పైకి ఎగిరి అలాగే జారిపడింది. ఆ తరాన్ని ప్రభావితం చేసిన కవిగా కౌలీ గుర్తుండిపోతాడు. ఇవాళ అతన్ని పట్టించుకొనే వారు తక్కువే. "ది ఎనీద్" అనే అతని రచన బైబిల్‌లోని డేవిడ్ కథయే. "ది డేవిడీస్" కూడా నిజానికి దూరంగా ఉంటుంది. పిండార్స్ ముతకగా ఉంటుంది. కవిత్వాన్ని మొదలుపెట్టటం ముగించటంలో కౌలీ గొప్ప ప్రజ్ఞ చూపాడు. అతని బౌద్ధిక తార్కిక జ్ఞానాన్ని కళ్ళెం వేసుకొని అదుపులో పెట్టుకొని రాశాడు. చిన్నచిన్న కవితల్లో అసాధారణ ప్రతిభ చూపాడు. "Beauty thou wild fantastic ape - who dostin every country change thy shape" మచ్చుకి ఒక ఉదాహరణ. "Cowley's paraphrases from Anacreon the Greek forerunner of Omar Khayyam" అని అరువు సొమ్ము బరువు చేటుగా చేశాడని అంటారు. అతని వ్యాసాలను ఇప్పటికీ తరచుగా ముద్రించి ఆదరిస్తూనే ఉన్నారు. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 18

# టెన్నిసన్‌కు మార్గదర్శి - హెన్రి వాన్

**ద**క్షిణ వేల్సులో సిల్యూరులు అనే తెగకు చెందినవాడవటం వలన హెన్రి వాన్‌ను "సిల్యూరిస్ట్" అన్నారు. పురాతన తెగకు చెందినవాడే. ఆగిన్ కోర్ట్‌లో వాళ్లకు ప్రాతినిధ్యం ఉండేది. తండ్రి సర్ థామస్ వాన్‌ను మూడవ రిచర్డ్ రాజు చంపించాడని షేక్స్పియర్ నాటకం తెలియజేస్తోంది. హెన్రి థామస్‌లు కవలలు. 17-04-1621లో జననం. ఇంటి వద్దే ప్రాథమిక విద్య నేర్చి ఇద్దరూ ఆక్స్‌ఫర్డ్‌లోని జేసూస్ కాలేజిలో చేరారు. థామస్ బి.యే పాసై ఆల్కమిస్ట్‌గా మాజిక్ డీలర్‌గా అయ్యాడు. డిగ్రీ కాకుండానే హెన్రి లండన్ వెళ్లి మెడిసిన్ చదివి ఇరవై మూడో ఏట డాక్టర్ అయ్యాడు. బ్రిటన్ అంతర్యుద్ధం అతని వృత్తిపై ప్రభావం కలిగించింది. రాజుగారి రౌటేన్ హీత్ యుద్ధరంగంలో వెల్ష్ అంగరక్షక ఆశ్విక దళంలో ఒకడైనాడు. రాయలిస్ట్‌గా గొప్ప విశ్వాసం కలిగి ఉన్నాడు. రెండేళ్ళ తర్వాత రిటైర్ అయి, వైద్యసేవ చేస్తూ వ్యాధిగ్రస్తుల పాలిటి ఆపద్బాంధవుడై, కవిత్వాన్ని కూడా రాస్తూ గడిపాడు. బ్రేక్ నాక్‌లో అర్ధ శతాబ్దం వైద్య సేవలో గడిపాడు. తర్వాత స్వంత ఊరు "న్యూటన్ బై అస్క్"లో 23-04-1695న చనిపోయాడు.

వాన్ మతం మార్చుకొని బతకాల్సి వచ్చింది. సివిల్ వార్ ఫలితాల వైపరాత్యం వలన, జబ్బు పడటం వల్ల అన్న చావు, స్నేహితుల మరణాలతో కుంగిపోయాడు. ప్రపంచంలో మానవ దు:ఖాలను చూసి చలించాడు. ఇవన్నీ "సైలెంట్ సింటిలన్స్" రెండవ భాగంలో ప్రతిఫలించాయి. 24లో మొదటి భాగం వచ్చింది. "పోయెమ్స్"లో ఎలిజబెత్ యుగాంతర ధోరణి కనిపిస్తుంది. వాగ్హన్, హెర్బర్ట్‌ల మధ్య పోలిక ఉందని అంటారు కాని భేదమే ఎక్కువగా కనిపిస్తుంది. హెర్బర్ట్ వాడిన అలంకారాలు చర్చి సాంప్రదాయంలో ఉంటాయి. వాన్‌వి ప్రకృతిపరంగా ఉంటాయి. పరిశీలనతో కంటే ప్రేరణతో వాగ్హన్ కవిత్వం రాశాడు. హెర్బర్ట్ ఇమేజెస్ సాంద్రంగా ఉంటే వాగ్హన్ వాటిని పలచన చేస్తాడు. మేధావి కవిగా కంటే భావోద్రేకం

ఉన్న కవిగా గుర్తింపు పొందాడు. ప్రకృతి ప్రేమికుడు మాత్రమే కాదు సృష్టికర్త అయిన దేవుడికి దగ్గరయ్యాడు. "Vaughan was with man's love of God, he was also convinced of god's need of man, a love beyond logic, an essential mysticism which the intellect can never explain". ప్రకృతిని భౌతికాతీత దృష్టితో చూశాడు. అతని కవిత్వాన్ని ఆస్వాదిద్దాం.

"There is in God some say - a deep but dazzling darkness, as men here - say it is late and dusky, because they - see not all clear - of for that night where I in Him - might live invisible and dim"

సెక్యులర్ భావాలు కొన్ని అతనిలో కనిపిస్తాయి. వీటిని తరువాతి తరం కవులు ఆదర్శంగా తీసుకొన్నారు. తనకాలం కవుల కంటే భిన్నంగా రాశాడు. సమాజ దీనస్థితికి జాలిపడ్డాడు. దేవుడిని, ప్రకృతిని, స్వీయ అనుభవాలను రంగరించి కవితలు రాసి అందరికంటే భిన్నత్వం చూపాడు. అతని కవిత్వంలో ఆ కాలానికంటే ఆధునిక భావాలు ఉండటం ప్రత్యేకత. "Vaughan is recognized as another example of a poet who can write both graceful and effective prose. He influenced the work of such poets as Wordsworth, Tennyson and Siegfried Sasson". అమెరికా సైన్స్‌ఫిక్షన్ రచయిత "ఫిలిప్ కే డిక్" కూడా వాన్ ప్రభావం తనమీద ఉందని చెప్పాడు.

**వర్డ్స్‌వర్త్‌కు ప్రేరణ – థామస్ ట్రహెర్నే**



1636–37లో పుట్టి 27–09–1674లో చనిపోయిన 'థామస్ ట్రహెర్నే' గురించి వివరాలు సరిగ్గాలేవు. వెల్ష్‌లో హియర్ ఫోర్డ్ షూ మేకర్ కొడుకు. ఆక్స్‌ఫర్డ్‌లో "బేసినోస్ కాలేజి"లో చేరాడు. 1657లో డిగ్రీ పొందాడు. క్రేడేన్ హిల్‌లో ఒక "పార్సనేజ్"గా పనిచేశాడు. పదేళ్ళ తర్వాత సర్ ఒర్లాండో బ్రిడ్జ్‌మాన్‌కు "చాప్లిన్" అయ్యాడు. ఓర్లాండో రాజముద్రికలను భద్రపరచే ఉద్యోగి. అతనితో లండన్ వెళ్లి అతనితో తిరిగొచ్చాడు. అతనితోనే జీవించాడు. అతనితోనే ట్రహెర్నే 47 వయసులో మరణించాడు.

విడవకుండా రాసిన థామస్ రచనలలో ఒక్క పుస్తకమే "రోమన్ ఫోర్జేరీస్" అతని జీవితకాలంలో అచ్చయింది. ఆ తర్వాత రెండు వందల ఏళ్ళ దాకా అతని ఏ కవితా ముద్రణ

భాగ్యం పొందలేదు. ఆధునికలు వెతికి తీసి అతని కవిత్వపు విలువను నిగ్గు తేల్చారు. అతని వారసులకూ ఏమీ పట్టలేదు. రెండు శతాబ్దాల తర్వాత ఒక బుక్ స్టాల్‌లో వ్రాతప్రతులు దొరికాయి. వాటిని కొన్ని షిల్లింగులు షాపువాడికి చెల్లించి ఒక విద్వాంసుడు "అలెక్సాండర్ బలూచ్ గ్రోసార్ట్" దక్కించుకొన్నాడు. వాటిని వాన్ కవి అముద్రిత కవితలనుకొన్నాడు. పరిశోధకులు గ్రోసార్ట్ పొరపాటు పడ్డాడని నిర్ధారించి అవి ట్రహెర్నేవేనని తేల్చి ముద్రించారు.

చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో మినిస్టర్‌గా ఉన్న ట్రాహెర్నే భగవంతునిపై అచంచల విశ్వాసం, విధేయత, అణకువ ఉన్నవాడు. నిత్య సంఘటనలను కూడా దేవుని లీలగా భావించి తన్మయం చెందేవాడు. పసిపిల్ల వాడిలాగా ప్రపంచాన్ని చూసేవాడు. ప్రతిదీ ఆశ్చర్యమే, ప్రతిదీ దేవుని మహత్తే... గొప్ప జాగృత స్థితి, పసి పిల్లాడి స్వచ్ఛ మనస్తత్వం ఉండటమే కాదు అది కవిత్వంలో ప్రతిఫలించింది. "For him the mere act of wandering is wonderful" అనిపిస్తుంది.

"Traharne's singular verses are to use the title that headed his unpublished volume" "poems of felicity" మెటాఫిజికల్ కవిగానే గుర్తింపు పొందాడు. అతని కవిత్వంలో "There is a frequent discussion man's almost symbolic relationship with nature as well as frequent use of literal setting that is an attempt faithfully reproducing a sense of expression from a given movement a technique later used by William Words Worth" ఇలా ప్రకృతి కవి వర్డ్స్‌వర్త్‌ను ప్రభావితం చేసిన కవిగా చరిత్ర స్థాపించాడు. ఆంగ్లికనిజంలో "సెయింట్"గా గుర్తింపు పొందాడు. అమెరికాలోని ఎపిస్కోపల్ చర్చి ట్రాహెర్నే మరణ దివాన్ని "ట్రాహెర్నే ఫీస్ట్ డే"గా గౌరవంతో నిర్వహిస్తారు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 19

# పవిత్రులు - రంధ్రాన్వేషకులు

ఇంగ్లాండ్‌లో మొదటి చార్లెస్ రాజుకు నియంత క్రూరుడు అయిన క్రాంవెల్‌కు మధ్య జరిగిన పోరాటం ఇంగ్లాండ్‌లో ప్రతి మూలా జరిగింది. 1629 నుండి 1640 దాకా పదకొండు ఏళ్ళు సాగిన ఈ విద్వేషాగ్ని దేశంలో పార్లమెంటే లేకుండాను, మరో పదకొండేళ్ళు 1649-60 రాజే లేకుండాను పరిపాలన చేసింది. న్యూ కామన్ వెల్త్ ఫ్రీ స్టేట్ ఎలా ఉన్నా బాగా ప్రాచుర్యం పొందింది. దేవుడే తనతో చేయిస్తున్నాడని క్రూరంగా నిర్దాక్షిణ్యంగా మానవ మారణ కాండ చేసి క్రూర నియంతగా పాలించిన క్రాంవెల్ చివరికి సహచరులే అసహ్యించుకొనే స్థితిని తెచ్చుకొన్నాడు. ప్రజలు ఈ నిత్య బాధ భరించలేక సుపరిపాలన కోసం మంచి రాజు కోసం నిరీక్షిస్తున్నారు. ప్రవాసంలో ఉన్న రెండవ చార్లెస్‌ను అభిషిక్తుడిని చేశారు. ఈ దశలో దేశం అంతా రాజకీయంగా, మత పరంగా విడిపోయింది. దీని ప్రభావం సాహిత్యం మీదా పడింది. ఉత్సాహం, మానవ ద్వేషం (enthusiasm and cynism)ల మధ్య ఊగిపోయింది. ప్యూరిటన్లు అనే రంధ్రాన్వేషక కవులు (puritans so called caviliar poets) హుషారైన కవితలు రాసి ఊగిపోయారు. బెన్ జాన్సన్ ప్రభావం వీరి మీదా ఇంకా ఉంది. లాటిన్ నుండి విషయాన్ని భావాల్ని అరువు తెచ్చుకొని రాయటంలో విజృంభించారు. అలాంటి ప్యూరిటన్ కవులలో ఆండ్రూ మార్వేల్, థామస్ కేర్ రాబర్ట్ హీరిక్, ఎడ్మండ్ వాలేర్, జాన్ సక్లింగ్, రిచార్డ్ లవ్ లెస్ ఉన్నారు. ఇప్పుడు వీరి గురించే తెలుసుకోబోతున్నాం.

ఆండ్రూ మార్వేల్ ప్యూరిటన్ మాత్రమే కాదు కవిలియర్ కూడా. 31-03-1621లో పుట్టి 16-08-1678లో చనిపోయాడు. జీవితం అంతా వైరుధ్యమే. ప్యూరిటన్ కవులలో అగ్రగామి. కాని సహచరులు కేవిలియర్‌గా ఇష్టపడ్డారు. మొదటి చార్లెస్‌పై సానుభూతి ఉన్నది. క్రాంవెల్ సెక్రటరీగా మిల్టన్ ఉన్నప్పుడు ఇతను మిల్టన్‌కు అసిస్టెంట్‌గా ఉన్నాడు.

మార్వేల్ "రక్షకుడి"ని సీజర్‌తో పోలుస్తూ వోద్ రాశాడు. క్రాంవెల్ చచ్చిన తర్వాత అబ్బేలో అతని అంత్యక్రియలకు హాజరైనాడు. రెండేళ్ళ తర్వాత "రెస్టోరేషన్ పార్లమెంట్"లో సభ్యుడయ్యాడు. ఈ పార్లమెంట్ క్రాంవెల్ సమాధిని తవ్వి పారేసి తలను నరికి అవమానపరచిన సభలో ఉన్నాడు. ప్రజలకు దగ్గరగా ఉండేవాడు. దీనికోసం దేనినైనా భరించేవాడు.

హాల్ దగ్గర విన్స్టేడ్‌లో పుట్టాడు. తండ్రి దగ్గరే చదివాడు. ట్రినిటి కాలేజీలో చదివి బి.ఏ సాధించాడు. తర్వాత విరుద్ధ భావాలతో పనిచేశాడు. గట్టి రాయలిస్ట్‌గా ఉంటూనే పార్లమెంట్‌ను సమర్ధించేవాడు. మిల్టన్ బంధువు సిరియాక్ స్కిన్నార్ డబ్బుతో ఆదుకొనేవాడు. మిల్టన్‌కు పరిచయం చేశాడు. క్రాంవెల్ సైన్యాధికారి అయిన లార్డ్ ఫెయిర్ ఫాక్స్ కూతురుకు ట్యూటర్‌గా ఉన్నాడు. క్రాంవెల్ దుష్టచేష్టలకు విసిగివేసారి యార్క్ షైర్‌లోని "నన్ ఆప్పిల్‌టన్"కు వెళ్ళిన ఫైర్‌ఫాక్స్‌తో మార్వేల్ తానూ వెళ్ళాడు. అక్కడే కవిత్వం రాయటం ప్రారంభించాడు. దీన్ని "గార్డెన్ పోయిట్రీ" అన్నారు. అందరూ ఆదరించి మెచ్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్లకు క్రాంవెల్ వార్డ్‌కు ట్యూటర్ అయ్యాడు. తర్వాత మిల్టన్ అసిస్టంట్ అయి, రాయలిస్ట్‌లు మిల్టన్ ప్రాసిక్యూట్ చేసినప్పుడు అతన్ని సమర్ధించాడు. క్రాంవెల్‌ను సమర్ధించినా చార్లెస్ రాజుకు దగ్గర కాలేకపోయాడు. ఇద్దరి స్వభావాలను బేరీజు వేశాడు. క్రింవెల్ సమర్ధుడు, పాలకుడు, విధి చేతి కీలుబొమ్మ అనుకొన్నాడు. చార్లెస్ పవిత్రుడు వివేకం ఉన్న సమర్ధుడు మత ధర్మం తెలిసినవాడు అని తేల్చుకొని సివిల్ యుద్ధం గొప్ప విపత్తు తెచ్చిందని భావించాడు. పార్లమెంట్ మళ్ళీ బతికి బట్టకట్టిన తర్వాత మెంబర్ అయ్యాడు. సాధు స్వభావి. అయినా రాస్తే మాత్రం నిప్పులు చెరుగుతాడు. రాజకీయ వ్యంగ్యాత్మక రచనలు చేసి అందర్నీ కడిగి పారేసేవాడు. పారడీ పండించాడు. చార్లెస్ శైలిని ఒక ఉపన్యాసంలో పారడీగా రాసి అందరి దృష్టి ఆకర్షించాడు. చార్లెస్ ఇంటి వ్యవహారాలూ వివాహేతర సంబంధాలు అన్నిటిని దూది ఏకినట్లు ఏకేశాడు. రాజు చదివి నవ్వుకొన్నాడు. "లాస్ట్ ఇంస్ట్రక్షన్స్ టు ఏ ప్రింటర్"లో చార్లెస్ ఉద్యోగుల అవినీతిని డచ్ స్త్రీలతో శృంగారాన్ని తెలియజెప్పాడు. ప్రభుత్వ ఉద్యోగం ఊడదీయలేదు. పబ్లిక్ సర్వెంట్‌గానే యాభై ఎనిమిదవ ఏట చనిపోయేదాకా ఉన్నాడు.

విరుద్ధత మార్వేల్ ప్రత్యేకత. "His verse is both worldly and detached from the world, classical and yet colloquial rhetorical yet eminently reasonable" అతని గొప్ప కవిత "to his coy mistress" అతని కవితలో "Thou by the Indian Ganges side" అని భారత దేశాన్ని పవిత్ర గంగా నదిని అందులో చేర్చాడు. ఇరవై ఏళ్ళు పార్లమెంట్‌లో మెంబర్‌గా ఉండి, తన మేధావితనాన్ని దేశానికి ఉపయోగించేట్లు చేశాడు. అతని సమాధిపై "The grave is fine private place. But none I think do there embrance" అని అతని కవితా పంక్తుల్నే

రాశారు. "Marvel's style is more than a technical accomplishment or the vocabulary and sintax of an epoch it is what we have designated tentatively as wit a tough reasonableness beneath the lyric grace" అన్నాడు టి. ఎస్.ఇలియట్. "It is difference between intellectual poet and the reflective poet" అని భావిస్తూ, ఈ ట్రెండ్ వలన సాంప్రదాయానికి ఆత్మ అంత:కరణ సంబంధం పెరిగిందని, దాని వలన కొత్త బలమైన శిల్పం శైలీ విన్యాసం భావంలో విధానంలో వచ్చి బైబిల్‌కు క్లాసికల్ రచనకు కవిత్వం దూరమై కొత్త పోకడలు పోయింది అన్నారు. కవిగా కంటే వచన రచయితగా మంచిపేరు పొందాడు. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 20

# కొంటె కవి – రాబర్ట్ హీర్రిక్

**కొం**టెతనం చిలిపిదనంతో తన తరాన్ని ప్రభావితం చేసిన రాబర్ట్ హీర్రిక్ వజ్రాల నగిషీ చేసే కంసాలి కుటుంబంవాడు. లండన్‌లో 1591లో పుట్టి కులవృత్తిలో రాణించాడు. కవితలనూ వజ్రాల్లాగానే సానబట్టి మెరుగులు తీర్చటం అలవాటైంది. అందుకే కవితలు ధగధగా కాంతితో మిరుమిట్లుగొలుపుతాయి. పదహారవ ఏట ఉంగరాలను అద్భుతంగా తయారు చేసే నేర్పున్న బాబాయి పనికి అప్రెంటిస్‌గా ఉన్నాడు. చదువు సంగతి తెలియదు. కేంబ్రిడ్జిలో రెండేళ్ళు చదివాడు. రెండు డిగ్రీలు ట్రినిటి కాలేజి నుంచి పొందాడు. "లా" చదవాలని కోరిక ఉండేదట. చదివి ఉద్ధరించాడో లేదో తెలియదు.

లండన్ చేరి బెన్ జాన్సన్ ముఠాలో చేరాడు. బెన్ ఇతన్ని తన "వారస కవి" అని చెప్పుకొన్నాడు. హీర్రిక్‌ను అందరూ "జాన్సన్ కొడుకు" అనేవారు. కవిత్వం రాయటం మొదలెట్టాడు. మొదటి కవిత "ప్రేయర్ టు బెన్ జాన్సన్" రాశాడు. "When I a verse shall make - know I have prayed thee - for old religion's sake - saint ben to aid me" అని మొదలుపెట్టి కైమోడ్పు లందించాడు. తండ్రి కాని తండ్రి కవితకు వారసుడు అయిన హీర్రిక్ 1629లో హుందాగా జీవించటానికి అభిమానులు వికారేజ్ డీన్ ప్రియర్‌ను డేవాన్ షైర్‌లో చేశారు. ఇక్కడే మరో పద్దెనిమిదేళ్లున్నారు. చక్కని ప్రకృతి ప్రశాంత పల్లె వాతావరణం నచ్చాయి. కాని ఎందుకో ఉండాలనిపించేది కాదు. ఒక చెరసాలలో ఉన్నానని భావించేవాడు. పెద్దగా స్నేహితులు యేర్పడలేదు. గ్రామీణ అనాగరిక జనంపై అసహ్యభావం ఏర్పడింది. దానినే కవితలో "A people currish churlish as the seas - and rude almost as rudest as savages" అని మండిపడ్డాడు. ఒంటరితనం మరీ బాధించింది. ఎటూ పాలుపోని స్థితి.

పల్లె ఊసులు అతన్ని ఆకట్టుకొన్నాయి. అవే ప్రేరణనిచ్చి కవిత్వం రాయించాయి.

గొప్ప పరిశీలన, ఊహ ఉండటంతో అనేక మూడ్స్‌లో ఉండి "బే ఫరవా కవితలు" రాసి పారేశాడు. గ్రామీణ సెమి పాగన్ ఆకర్షించింది. గ్రామీణ క్రీడల్లో పాల్గొన్నాడు. పెంపుడు జంతువుల్ని బాగా చూసుకొన్నాడు. కొంచెంసేపు ఈ వాతావరణం విసుగనిపించేది. రాసినది అంతా "ఇనీసి ఏషన్" కోసం వచ్చిన వారిపై విసిరిపారేసి "మాన్ ఆఫ్ మూడ్స్" అనిపించుకొన్నాడు. వాళ్ళు ఇతన్ని అర్థం చేసుకొని మరింత ప్రేమ చూపారు. ఇతనూ కలిసిపోయాడు. ఈ మట్టి నుంచే మంచి కవిత్వం సృష్టించాడు. ఈ గ్రామీణ జీవితాన్ని నేపథ్యంగా చేసుకొనే అనేకానేక కవితలు సృష్టించాడు. యాభై ఆరో ఏట జీవిక పోయింది. సివిల్ వార్‌లో రాజును సమర్ధించాడు. కామన్ వెల్త్ ఇతని పదవి ఊడబెరికింది. లండన్ రావటం పెద్దగా ఇష్టంలేదు. "నోబుల్ నంబర్స్" అని గొప్పగా చెప్పుకొనే పుస్తకాన్ని పబ్లిష్ చేశాడు. అందులో కొన్ని మంచి కవితలే ఉన్నాయి. కవికి, అతని నిజ జీవితానికి వైవిధ్యం కనిపిస్తుంది. కవిగా ఒక రకంగా ప్రీస్ట్‌గా వేరొక రకంగా వ్యవహరించాడు. అంటే "స్ప్లిట్ పెర్సనాలిటీ" అన్న మాట. పదమూడు వందల కవితలు రాశాడు. హుషారు, ఖుషీ ఉన్న కవి. "ఎస్పెరిడెన్" అనే కవితా సంపుటి ప్రసిద్ధి చెందింది. స్విన్ బరన్ కవి హీర్రిక్‌ను "గ్రేటెస్ట్ సాంగ్ రైటర్ ఎవర్ బారన్ ఇన్ ఇంగ్లీష్ రేస్" అన్నాడు.

**థామస్ కారే**



అరిస్టాక్రాట్‌గా పుట్టి మొదటి చార్లెస్ రాజుతో సహవాసం చేసిన కవి థామస్ కారే 1595లో పుట్టాడు. చాన్సారిలో మాస్టర్ అనిపించుకొని ఆక్స్‌ఫర్డ్ మేర్టాన్ కాలేజిలో చేరి పదమూడో ఏట డిగ్రీ పొందాడు. మిడిల్ టెంపుల్‌లో పదహారవ ఏట ప్రవేశించాడు. ఇరవై ఏళ్ళ వయసులోపే ఇటలీకి రాయబారి అయ్యాడు. చాలాకాలం తర్వాత ప్రీవీ చేంబర్‌లో జెంటిల్‌మాన్ హోదా పొందాడు. ముప్పై రెండేళ్ళ వయసులో రాజుగారికి "సర్వర్" అయ్యాడు. కవిత్వం రాశాడు. అందులో బాధలూ, వేదనలూ చూపాడు.

**హీరోయిక్ కప్లేట్ కవి – ఎడ్మండ్ వాలేర్**



03-03-1606లో హెర్ట్‌ఫోర్డ్స్ షైర్‌లో విలాసవంతమైన ఎస్టేట్‌లో ఎడ్మండ్ వాలేర్ పుట్టాడు. బకింహాం షైర్‌లో బీకన్స్ ఫీల్డ్‌లో గొప్ప ఎస్టేట్‌కు వారసుడయ్యాడు. కేంబ్రిడ్జి ఈతాన్ కింగ్స్ కాలేజిలో సదహారో ఏట ఎం.ఏ పాస్ అయ్యాడు. పార్లమెంట్‌లో శిక్షణ

పొందాడని అంటారు. అధికారంలో ఉండి అసూయతో అనేక సార్లు "జంప్ జిలాని"గా రాజకీయం మార్చాడు. స్థిరత్వం యేర్పడలేదు. విధేయత లేకుండానే ప్రతి వెధవనూ అంటకాగాడు. దగ్గరికి యెంత స్పీడ్‌గా చేరేవాడో అంత వేగంగా వదిలేసేవాడు. "Trained sychophant" అనిపించుకొన్నాడు. చార్లెస్ రాజు దగ్గర బాగానే ఉన్నాడు. "వాలేర్ ప్లాట్" అని పిలువబడే కుట్రలో పాలుపంచుకొన్నాడనే నేరంతో అరెస్ట్ అయ్యాడు. టవర్ జైలుకు పంపారు. పదివేల పౌండ్లు ఫైన్ చెల్లించి విడుదలయ్యాడు. రికార్డు కాని ఇంకా ఎన్నో కుట్రల్లో స్నేహితుల్నీ మోసం చేశాడు.

ప్రొఫెషనల్ కవిగా గొప్ప గౌరవాన్ని పొందాడు. యాభైయో ఏట "పెనిగ్రిక్ టు మై లార్డ్ ప్రొటెక్టర్" రాశాడు. తర్వాత "ట్రిబ్యూట్ టు ది కింగ్ అపాన్ హిస్ మెజస్టీ" రాశాడు. ఇరవై ఐదో ఏట ఒకమ్మాయిని పెళ్లి చేసుకొన్నాడు. కాని మూడేళ్లకే చనిపోయింది. మొదటి పుస్తకం కంటే రెండోది పేలవంగా ఉంది. పెన్ షార్ట్‌లో లార్డ్ సిడ్నీ కుటుంబంతో పరిచయం ఏర్పడి లేడీ డరోతీని వలచి ఆమెపై "సచ్చరిస్సా" రాశాడు. కాని ఆమె ప్రేమను తిరస్కరించింది. మేరీ బ్రాసీని పెళ్ళాడాడు. సమకాలీనులకు దూరంగా అర్ధాయుష్షుతో చనిపోయిన వారిని గురించి కలవరపడ్డాడు. వారికి భిన్నంగా ఎనభై రెండేళ్ళ దీర్ఘ జీవితాన్ని గడిపి 21-10-1687న మరణించాడు.

పద్దెనిమిదో ఏటనే కవిత్వం రాశాడు. రాజకీయాలలో మునిగి తేలుతూ కూడా మంచి కవిత్వమే చెప్పాడు. మెటాఫిజికల్ కవిత్వం వదిలేసి ప్రకృతి కవిత్వాన్ని సరళంగా చెప్పాడు. అతని "హీరోయిక్ కప్లేట్స్" మహా ఆదరణ పొందాయి. పదిహేడవ శతాబ్ది అంతానికి ఇవి బాగా జనంలోకి చొచ్చుకు వెళ్లి ఇంగ్లీష్ కవిత్వాన్ని డామినేట్ చేశాయి.

**"క్రిబ్బేజ్" ఆటను కనిపెట్టిన - జాన్ సక్లింగ్**



ఇతని సాహిత్య సహవాసులు గొప్ప కవిగా, అతనితో ఆడిన వాళ్ళు తమ నాయకుడిగా జాన్ సక్లింగ్‌ను మెచ్చుకొన్నారు. ఆకాలంలో గొప్ప వేటకాడు, జూదగాడు. రెండు వందల ఏళ్ళు సమాజం అతనికి రుణపడి ఉంది. కారణం "Cribbage" అనే ఆటను కనిపెట్టింది అతనే. మిడిల్ సెక్స్‌లో ట్వికెన్ హాంలో 01-02-1609లో డబ్బున్న కుటుంబంలో పుట్టాడు. కేంబ్రిడ్జి ట్రినిటి కాలేజిలో చదివాడు. పదిహేనవ ఏట మొదటి జేమ్స్ రాజు తండ్రికి నైట్ హోదా ఇచ్చాడు. కాని త్వరలోనే తండ్రి మరణించటంతో ఎంతో విలువైన ఆస్థికి వారసుడయ్యాడు. స్నేహిత బృందం పెద్దది. పందొమ్మిదో ఏట ఎందుకూ పనికిరాని బేవార్సుగా తిరుగుబోతుగా

మారిపోయాడు. ఫ్రాన్స్, ఇటలీలు చూశాడు. డబ్బు హజం కిందా పైనా కాననీయలేదు. జర్మనీలో గుస్తావాస్ అదోల్ఫాస్ తరపున యుద్ధం చేశాడు. ఇంగ్లాండ్ తిరిగి వచ్చి ఏదో ఒక పనికిమాలిన సాహస కృత్యాతలతో విచ్చలవిడిగా డబ్బు దుబారా చేస్తూ గడిపాడు.

ఇరవై ఒకటవ ఏట నైట్ హుడ్ లభించింది. చతుర సంభాషణం, విచ్చలవిడి ప్రవర్తన అందర్నీ ఆకర్షించింది. రాజ దర్బారులో చేరి అందర్నీ ఆకట్టుకొన్నాడు. అతని నాటకం "ఆల్గార" ప్రదర్శించినప్పుడు నటులు వేసుకొనే సాధారణ దుస్తులను వేసుకోనివ్వలేదు. అసలైన జరీ లేసుల్ని, ఎంబ్రాయిడరీలను, అసలైన బంగారు, వెండిలతో చేయించి వేయించాడు. చార్లెస్ రాజుతో స్కాట్లాండ్ పరిశోధనకు బయల్దేరినప్పుడు వంద గుర్రాలతో పన్నెండు వేల పౌండ్లు ఖర్చు చేసి ఒక దళాన్ని ఏర్పాటు చేశాడు. గుర్రాలకు సింగారం, అశ్వికులకు అదిరే దుస్తులు స్కార్లెట్ కోట్లు సమకూర్చాడు. ఇలా అంచెలంచెలుగా ఎదిగాడు. కాని ఒక చిన్న పొరబాటు జరిగింది. ఎరల్‌ను బహిష్కరించిన తర్వాత విధేయుడైన స్ట్రాఫర్డ్‌ను రక్షించే ప్రయత్నంలో విఫలమయ్యాడు. ఇది బయట పడింది. ఫ్రాన్స్‌కు పరారయ్యాడు. అక్కడే ముప్ఫై మూడో ఏట చనిపోయాడు. తన డబ్బంతా "సక్" చేసి ఊరందరికీ పెట్టిన సాక్లింగ్ ప్రవాసంలో చావటం విడ్డూరం. ఆత్మహత్య చేసుకొన్నాడని అంటారు. కాదు అవిధేయుడైన నౌకరు పొడిచి చంపాడని రుజువైంది.

నాటక రచయితగా కొన్నే రాసినా పెద్ద కవితలు చాలా రాశాడు. ప్రజలకు దగ్గరవ్వాలనే ధ్యేయంతో తన "అగ్లారా"ను ఒకదాన్ని ట్రాజిక్‌గా మరోదాన్ని హాపీ ఎండింగ్‌గా సవ్యసాచిత్వంతో రాశాడు. అతని నాటకాలేవీ బతికి బట్టకట్టలేదు. "సెషల్ ఆఫ్ ది పోఎట్స్"ను మాత్రం విద్యావంతులు ఆదరించారు. బెన్ జాన్సన్‌కు తనను గురించి "హేవ్ యు సీన్ బట్ ఏ బ్రైట్ లిలీ గ్రో" అని తెలియజేశాడు. అతని బాలడ్ "అపాన్ వెడ్డింగ్" బాగుంటుంది. సంభాషణా చాతుర్యంతో కవిత నడిపిస్తాడు.

## రిచార్డ్ లవ్ లేస్



మొదటి జేమ్స్ వలన నైట్‌హుడ్ పొందిన ఒక పెద్ద మనిషి కొడుకే రిచర్డ్ లవ్ లేస్. బంగారు చెంచా ఉన్న నోటితో పుట్టిన భాగ్యవంతుల బిడ్డ. అందమైన రూపం, సాహసంలతో రాజస్థాన ఉద్యోగి అయ్యాడు. సక్లింగ్‌లా కాకుండా ఎప్పుడూ కష్టాల అంచులలోనే బతికాడు. ఎక్కువకాలం జైలులోనే గడిపి, కావాలనే 1657లో చచ్చిపోయాడు.

1618లో పూర్వ కేంటిష్ కుటుంబంలో వైల్ విచ్‌లో జన్మించాడు. చార్టర్ హౌస్

స్కూల్‌లో చదివాడు. ఆక్స్‌ఫర్డ్ గ్లాసేస్టర్ హాల్‌లో పై చదువు. నాలుగు పెద్ద ఎస్టేట్‌లకు వారసుడయ్యాడు. తారా పథంలోకి దూసుకుపోయాడు. సరైన రాజకీయ పక్షం వైపుకు చేరకుండా తప్పుడు నిర్ణయంతో ఇరవై నాలుగో ఏట గెట్‌హౌస్ జైలు శిక్ష అనుభవించాడు. అతని కవితల్లో గొప్పదైన "టు ఆల్తియా ఫ్రం ప్రిజన్" రాశాడు. "Stone walls do not make a prison make - nor iron bars a cage - minds innocent and quiet take - that for an hermitage - if I have freedom in my love - in my soul am free - angels alone that soar aove - enjoy such liberty" అని నిబ్బరంగా రాసుకొన్నాడు.

జైలు నుంచి విడుదల అయిన తర్వాత నలభై వేల పౌండ్ల ధనవంతుడుగానే ఉన్నాడు. స్నేహితులు కవుల బృందం చేరింది. తాను దేశభక్తుడినని రుజువు చేసుకోవాలనుకొన్నాడు. పెరోల్ మీద ఉండగానే రాయలిస్ట్ ఆర్మీ కోసం ఒక రెజిమెంట్‌ను ఏర్పరచాడు. కాని అది పూర్తిగా ఓడిపోయింది. యుద్ధంలో నాలుగు ముదనష్టపు ఆస్తులను హారతి కర్పూరంలా హరించేశాడు. పదేళ్ళు చేతిలో పెన్నీ లేకుండా కటిక దరిద్రాన్ని అనుభవించాడు. రాజ లాంఛనాలతో ఖరీదైన దుస్తులతో వెలిగిపోయినవాడు చీకి గుడ్డలతో మురికి వాసనతో ఏవగింపుగా కనిపించి అందరికీ దూరమయ్యాడు. "Poor in body and purse be fitting the worst of beggars and the poorest of the servants"లాగా తన పరిస్థితి ఉందని వాపోయాడు. చేసుకొన్న వాడికి చేసుకొన్నంత. విధి వక్రించింది. పాపం. స్నేహితులు, కవులు అంటే భయమేసింది. రోడ్ల మీద పడ్డ ఎంగిలి పదార్థాలను ఏరుకొని తినే దుస్థితి వచ్చింది. గన్ పౌడర్ ఆల్లీలో ఉన్నాడు. క్షయ సోకింది.

చిన్న కవితలకే పేరొచ్చింది. కవితల వెనక కవే కనిపిస్తాడు. రూపకాలంకారాలను స్వేచ్ఛగా వాడాడు. ❁



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 21**

# చీకటితో (లో) వెలుగు- జాన్ మిల్టన్

"ఎల్ అలిగ్రో", "పెంసేరోసో 2" రాసిన కవి ఒకడే అంటే ఆశ్చర్యమేస్తుంది. కళ్ళేలేని కబోదిగా గాజాలో బానిసల మధ్య సామ్సన్‌ను దుఖితుడిని చేసిన కవి. దుర్మార్గాన్ని, క్రూరత్వాన్ని ఎదిరించిన కుటుంబ రక్తం ప్రవహించినవాడు. తండ్రి నిర్బంధ పాపిజంకు దూరమై, కొడుకు మిల్టన్‌కు ఆదర్శంగా ఉన్నాడు. జాన్ మిల్టన్ లండన్‌లోని చీప్ సైడ్ సైన్ ఆఫ్ ది స్ప్రెడ్ ఈగిల్‌లో 09-12-1608లో జన్మించాడు. ప్రేమను, స్వాతంత్ర పిపాసను తండ్రి నుండి వారసత్వంగా పొందాడు. తండ్రి చేసిన సంగీత కృతులు ఇప్పటికీ ప్రొటెస్టెంట్ హైం బుక్స్‌లో ఉన్నాయి. అన్నే అక్క. ఎడ్వర్డ్ జాన్ ఫిలిప్‌లు తమ్ముళ్ళు. వీరిద్దరూ అన్నకు శిష్యులే కాక అతని చరిత్రను రాసిన వాళ్ళు కూడా. క్రిస్టఫర్ అనే తమ్ముడు ఏడేళ్ళు చిన్న. మిల్టన్‌కు పూర్తి వ్యతిరేకి అయి, కేధలిక్‌గా, రాయలిస్ట్‌గా, అవకాశవాద లాయర్‌గా ఉండి, రాజుగారి కోర్టులోని జడ్జిలను నియమించే స్థాయికి ఎదిగాడు.

మిల్టన్ చిన్న పిల్లాడుగా చీప్ సైడ్ జిల్లాలో ఆడుకొనే వయసులో షేక్స్పియర్ ఇంకా బతికే ఉన్నాడు. ఆ మహా నాటక రచయిత లండన్‌కు చివరిసారి వచ్చినప్పుడు మేర్మిడ్‌లో స్నేహితులను కలిసే ప్రయత్నంలో బెన్ జాన్సన్‌తో కలిసి వెళ్ళిన సాయం సంధ్యలో బ్రెడ్ స్ట్రీట్‌లో ఆరేళ్ళ "కుర్ర మిల్టన్" ఇంటి వద్ద ఆటలాడటం తేరిపార జూసి చూసి స్ట్రాఫర్డ్ చర్చి యార్డ్‌లో తనకొక చిన్న సమాధి కావాలని అనుకొని ఉండవచ్చునని డేవిడ్ మేసన్ రాశాడు. మిల్టన్ తండ్రి వద్దే ఎక్కువగా విద్య నేర్చాడు. తండ్రి స్టేషనరీ వ్యాపారం చేస్తూ నోటరీగా ఉండేవాడు. సెయింట్ పాల్ చర్చికి రివరెండ్ థామస్ యంగ్ వంటి ట్యూటర్స్ వలన చార్లెస్ డియోడటి వంటి వారి స్నేహం లభించింది. తండ్రియే మిల్టన్ "మెంటార్" మానవత్వ విలువలున్న వాటిని చదవమని తండ్రి చెప్పేవాడని మిల్టన్ చెప్పుకొన్నాడు. బాల్యం నుండి తన ప్రతి కదలిక తండ్రి కను సన్నల్లోనే జరిగగిందన్నాడు. సైన్స్ మీద అభిరుచికి ఆయనే

కారణం.

పదహారేళ్ళ వయసులో కేంబ్రిడ్జిలో క్రైస్ట్స్ కాలేజిలో చేరి ఏడేళ్ళు ఉన్నాడు. అక్కడి ప్రతి విషయాన్నీ ఏవగించుకొన్నాడు. కర్రిక్యులంలోని సబ్జెక్టులు స్ట్రిక్ట్ విధానాలు ఏవీ నచ్చలేదు. ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్ళిన మిత్రుడు దియోది రాసిన గ్రీక్ ఉత్తరంలోని తప్పులు సవరించాడు. ఆక్స్‌ఫర్డ్ వచ్చేసి హాయిగా స్వేచ్ఛగా చదువుకోమని సలహా కూడా ఇచ్చాడు. "My books are my whole life" అని మిల్టన్ సమాధానం రాశాడు. అంటే తను ఏమి కాబోతున్నాడో అతనికి అవగతమైంది. కవి కావాలనే కోరిక బలమైనది. కవి అనుభూతి చెందటమే కాక సంఘానికి తగిన సూచనలూ చేయాలని, బ్యూటీతోనూ దేవునితోను సంబంధం కలిగి ఉండాలని భావించాడు. 23 వయసులో గొప్ప సానెట్ రాశాడు. అసందిగ్ధంగా మొదలుపెట్టి ప్యూరిటన్ సమర్ధనతో ముగించాడు.

ఈ కవిత రాసే సమయంలో తోటి కాలేజి యాజమాన్యం వల్ల ఇబ్బందులు పడ్డాడు. అతని అందాన్ని, పట్న జీవితాన్ని హేళన చేసేవారు. "లేడీ ఆఫ్ క్రైస్ట్స్" అని మారుపేరు పెట్టారు. అన్నిటిలో అతని ఆధిక్యతకు అసూయపడ్డారు కూడా. దీనికి దీటుగానే సమాధానం చెప్పేవాడు. దేన్నీ దాచుకోలేదు. టీచర్లతో గొడవ పడ్డాడు. ఇంటికి పంపింది యాజమాన్యం. పనీపాటా లేక రోడ్లమ్మట తిరిగాడు. అప్పుడే తానెప్పుడూ వినని, కనని గొప్ప పుస్తకాలను చూశాడు. కొద్ది రోజుల తర్వాత మళ్ళీ స్కూల్లో చేర్చుకొన్నారు. కేంబ్రిడ్జికి వెళ్లి లాటిన్ భాషలో ఉన్న అనేకమైన వాటిని లాటిన్ భాషలో కవితలుగా రాశాడు. లాటిన్‌లో ఉన్న చాలా "సామ్స్"ను కవితలుగా రాశాడు. వీటిలో ఇంగ్లీష్ భాష ఉబికి వచ్చి వాటిని సుందరమయం చేసింది. కేంబ్రిడ్జిలో రాసిన "ఒడ్ ఆన్ ది మార్నింగ్ ఆఫ్ క్రైస్ట్స్ నేటివిటి" కవిత తిరుగులేని "మాస్టర్ పీస్". దీన్ని ఇరవై ఒక్క వయసులో రాశాడు.

ఇమాజేరిలో స్పెన్సర్ గుర్తొస్తాడు. కొన్నిటిలో మెటా ఫిజికల్ కవులు కనిపిస్తారు. మొత్తంమీద సర్వాంగ సుందరమైన కవిత భావానికి, పద విన్యాసానికి గొప్ప ఉదాహరణ. కవిత చివరికొచ్చేసరికి కవిత్వం శిఖరారోహణమే చేస్తుంది. గోల్డెన్ ఏజ్‌లో సంగీతం తోడై ఉయ్యాలలూగిస్తుంది.

ఈ కవిత రాసిన తర్వాత కేంబ్రిడ్జి వదిలి తండ్రి ఎస్టేట్ ఉన్న హోర్టాన్ వెళ్ళాడు. అక్కడి ప్రశాంత వాతావరణంలో గ్రీక్, లాటిన్ రచయితల గ్రంధాలను చదివి జీర్ణించుకొన్నాడు. సంగీతం లెక్కల మీదా దృష్టి పెట్టాడు. ఆరేళ్ళు ఇక్కడే గడిపాడు. ప్రీస్ట్ కావాలన్న కోరికను తుంచేసుకొన్నాడు. తను ఏదైనా బోధిస్తే కవిత్వం ద్వారానే చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. ప్రకృతి ఏ నిర్బంధం నియమాలు లేకుండా చదువు నేర్పుతుంది అని గ్రహించాడు. క్రిస్టియన్ బోధకుల, ఇటలీ రచయితల పుస్తకాలూ చదివాడు. గ్రీకు, రోమన్, వెనిస్ చరిత్రలను చదివి

మననం చేసుకొన్నాడు. హార్తాన్‌లో ఉండగానే మిల్టన్ చిరస్మరణీయ కవితా ఝరిని ప్రవహింపజేశాడు. బైబిల్‌ను మాత్రం వదలకుండా చదువుతూనే ఉండేవాడు. "ఎల్ ఆలిగ్రో పెంసేరోసో"లు చాలా ప్రాచుర్యం పొందాయి. మధురమైన కాలాన్ని ఇక్కడే గడిపి అంతకంటే మధుర కవిత్వం రాశాడు. "అర్కాడెస్" ఇక్కడే రాశాడు. ఎరల్ ముగ్గురు పిల్లలు ఇందులో నటించారు కూడా. "కొమాస్"లో మేధో మార్గం ఉంది. కేంబ్రిడ్జి వదిలేశాక మిత్రులను దాదాపు మరిచాడు.

కాని తనకంటే చిన్నవాడైన "ఎడ్వర్డ్ కింగ్" అనేవాడిని మర్చిపోలేదు. అతని చావుకు ఒక కవితలో అమరత్వం కల్గించాడు. ఇది గొప్ప ఎలిజీగా గుర్తింపు పొందింది. 29లో ప్యూరిటన్ కవి అయి ఎలిజీలు మానేశాడు. సంఘానికి పనికొచ్చేవే రాశాడు. "లిసిదాస్"లో పాగాన్ మైతాలజి క్రిస్టియన్ థియాలజిలను మిశ్రమం చేసి రాశాడు. దీనిని సామ్యుల్ జాన్సన్ అంగీకరించలేదు. ఎద్దేవా చేశాడు కూడా. మిల్టన్ క్లాసికల్, క్రిస్టియన్ ప్రపంచాలను కలిపాడన్న విషయాన్ని జాన్సన్ విస్మరించాడని విమర్శకాభిప్రాయం. తాను ప్రజలలో ఒకడిని అని రుజువు చేశాడు. తన అసమాన ప్రతిభను ప్రదర్శించాడు. అతని మేధోజనితమైనదే ఈ కవిత.

ముప్ఫైవ ఏట ఇంకా విస్తృత ప్రపంచాన్ని చూడాలని అందులో గడపాలని నిర్ణయించుకొని ఇంకా కొత్త లోకాలను చూడాలని కోరుకొన్నాడు. ఆ ఊరు వదిలి వెడుతూ "At last he rose and twitched his mantle blue - tomorrow to fresh woods and pastures new" అని రాసుకొన్నాడు. ప్యూరిటన్ అయినా ఇంకా పాత దేవుళ్ళు, దయ్యాలు గుర్తుకొస్తూనే ఉన్నారు. ఫ్రాన్స్‌లో కొంతకాలం ఉండి, ద డచ్ హ్యూమనిస్ట్, స్వీడన్ రాయబారి అయిన గ్రోతియస్‌తో మాట్లాడి ఇటలీ గమ్యం చేసుకొన్నాడు. జేనోవాకు బయల్దేరి లెగ్ హారన్, పీసాలను సందర్శించి ఫ్లారెన్స్‌కు 1638 సెప్టెంబర్‌లో చేరాడు. అక్కడి సాహిత్యకారులందరూ మిల్టన్‌కు అపూర్వ స్వాగతం ఇచ్చి తమ రచనలు అంకితం చేశారు. మిల్టన్ రాసిన లాటిన్ వెర్సెస్‌లను విపరీతంగా మెచ్చారు. ఇటాలియన్ మేధావులు మిల్టన్ అంటే వీరాభిమానం చూపారు. అక్కడి కళాకారులతో, నోబుల్స్‌తో, విద్యావేత్తలతో, తత్వవేత్తలతో సమావేశాలు జరిపి విందు వినోదాల్లో పాల్గొన్నారు. 74 ఏళ్ళ గెలీలియోను కలిసి ఆయన చెప్పింది విన్నాడు. సీనా, రోమ్ నేపుల్స్ తిరిగి పుస్తకాలు, వ్రాత ప్రతులు కొనుక్కున్నాడు. సిసిలీ, గ్రీస్ వెళ్ళాలనుకొన్నాడు. కాని ఇంగ్లాండ్‌లో సివిల్ కమిషన్ వార్త తెలిసి తన దేశస్తులు స్వాతంత్రం కోసం పోరాడుతూ ఉంటే తాను వృధాగా దేశయాత్రలు చేయటం భావ్యం కాదని భావించి లండన్‌కు తిరిగి వెళ్ళాడు.

లండన్ చేరిన తర్వాత తను ఒక ఏడాది బయటి జీవితంలో ఒక్కడ జరిగిన విషయాలు అవగతం చేసుకొన్నాడు. అనిశ్చిత అస్తవ్యస్త పరిస్థితులలో తనకోసం తగిన ప్రదేశం కోసం

చూస్తున్నాడు. అప్పటికి ఇంకా రాజకీయాల జోలికి వెళ్ళలేదు. ఆ అవగాహనా లేదు. ముందుగా పార్ట్ టైం టీచర్ అయ్యాడు. అతని విధవ సోదరి అన్నే మళ్ళీ పెళ్లి చేసుకోవటంతో ఆమె ఇద్దరి సంతానాన్ని ఎడ్వర్డ్, జాన్‌లను చూసుకొంటున్నాడు. ఇంకొందరు ఇంట్లో చేరారు. ఇల్లు ఒక చిన్న బోర్డింగ్ స్కూల్ అయింది. తానే ఒక టీచర్ అయి సిలబస్ తయారు చేసి తన ఆశయాలకు అనుగుణంగా వారికి బోధించాడు. గ్రీక్ టెస్టమెంట్‌లో ఒక చాప్టర్ చదివి వినిపించేవాడు. లెక్కలు నేర్పాడు. యంత్రం పని, సాహిత్యం, ఖగోళం, వ్యవసాయం, సైనిక వ్యవస్థలను గురించి బోధించాడు. ఇటలీ భాషలో చరిత్ర, ఫ్రెంచ్ భాషలో జాగ్రఫీ చదవాలనేవాడు. ముప్ఫై మూడవ ఏట ఈ ప్రైవేట్ టీచర్ ఉద్యోగం కొంప ముంచింది. చార్లెస్ రాజు పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చెయ్యాలనే ఒత్తిడి వచ్చింది. బిషప్పులు తిరుగుబాటు చేశారు. అన్ని శాసనాలు రద్దు చేయాలని కోరారు. బిషప్పుల సర్వాధికారాలను కూకటి వ్రేళ్ళతో పీకేయ్యాలని ఆందోళన వచ్చింది. కొత్త ఆలోచనకూ పాత ప్యూరిటన్ భావాలకు మధ్య మిల్టన్ నలిగిపోయాడు. చివరికి నిర్ణయానికి వచ్చి తన అభిప్రాయాలను ఒక కరపత్రం ద్వారా తెలిపాడు. “పార్లమెంటు బిషప్‌లను హుందాగా ఉండమని కోరుతుంది. మాట్లాడే స్వేచ్ఛ లేకపోతే తీవ్ర పరిణామాలొస్తాయి. చర్చి అధిపతులు రాజు సలహాతో భగవంతుని సేవే లక్ష్యంగా పని చేయాలి. మనిషి బానిసత్వం నుండి బయట పడాలి. కనుక సమాజంలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం నేను నా శక్తి యుక్తుల్ని ధారపోయటానికి నిర్ణయించుకొన్నాను” అని తన మనోభావాలను బహిర్గతం చేశాడు.

రాజుకు అధికారం కావాలన్న దాన్ని అడ్డం పెట్టుకొని క్రాంవెల్ నియంతలా వ్యవహరించాడు. అతని వల్లనే సామాన్యుడి బతుకులు బాగుపడతాయని దానికి సమర్థుడు అతనేనని మొదట మిల్టన్ అనుకొన్నాడు. ఇప్పటిదాకా పోయెట్రీ మాత్రమే రాసిన మిల్టన్ తన అభిప్రాయాలు ప్రజలకు తెలియాలంటే ఫాం ప్లేట్స్ మాత్రమే సరిపోతాయని భావించి వచనంలో విజృంభించాడు. స్వతంత్రం కోసం సర్వస్వాన్ని ఒడ్డి ప్రచారం చేశాడు. మనసులో ఒక గొప్ప “ఎపిక్” రాయాలనే ఆలోచన సుడి తిరుగుతోంది. దానికి అనువైన వాతావరణం కావాలని ఆగాడు. సేనేకా రాసిన ఒక ఎపిగ్రాంను ఇంగ్లీష్‌లోకి “There can be slain - no sacrifice to God more acceptable - than an unrighteous and a wicked king”గా తర్జుమా చేసి వదిలాడు.

అనుకోకుండా ఈ ముప్ఫై అయిదేళ్ళ ముదురు బ్రహ్మచారి “మేరీ పావెల్” అనే పదిహేడేళ్ళ పడుచును పెళ్ళాడేశాడు. వారి వయసు రీత్యా, కోరికల రీత్యా అది పొసగని దాంపత్యమే అయింది. జీవితంలో సెక్స్ హాయి అనుభవించలేకపోయాననే అని తొందర పడ్డానని ఆయనే లెంపలేసుకొన్నాడు. తమది “Brutish congress” అని చెప్పాడు.

"two carcasses chained unnaturally together" అని విచారించాడు. శరీరం సుఖం కోరుతోంది. మనసు ఆధ్యాత్మికత వైపు చూస్తోంది. ఈ వైరుధ్యాన్ని భరించలేకపోయాడు. ఇక ఈ ముసలాడితో లాభం లేదని ఆవిడే పెళ్లి అయిన ఒక నెలలోనే వదిలేసి వెళ్లిపోయి మిల్టన్‌ను తాత్కాలికంగాను సంసార బంధం నుండి తప్పించింది ఒకరకంగా. ఎన్నోసార్లు రమ్మని కబుర్లు పంపాడు. రాలేదు. వచ్చి ఇంటి బాధ్యత తీసుకోమని హుకుం లాంటి అభ్యర్థన చేశాడు. సమాధానం లేదు. కోపం వచ్చింది. ఆవిడను వదలటానికి మనసొప్పటం లేదు. బాధ, కోపం, వ్యథ అవమానంలను రంగరించి "ది డాక్ట్రిన్ అండ్ డిసిప్లిన్ ఆఫ్ డైవోర్స్" అనే కరపత్రం రాసి పురాణాలలో భార్యాభర్తల అనుబంధాన్ని గూర్చి చెప్పిన వాటిని ఉదాహరించాడు.

మిల్టన్ మామగారు పావెల్ అల్లుడికి అయిదు వందల పౌండ్లు బాకీ ఉన్నాడు. కూతురినే సపోర్ట్ చేశాడు. మిల్టన్ విడాకులపై రాసిన కరపత్రం, క్రామ్వేల్ అధికారం చూసి "అల్లుడు మామకు మొగుడు" అని గ్రహించి మామ కూతురు మేరీని లండన్‌కు పంపాడు. ఆవిడ ఇంట్లోకి రాగానే భర్త కాళ్ళమీద పడి ఏడ్చింది. మోకాలి దండా వేసి క్షమించమని కోరింది. మిల్టన్ ప్రేమగా ఆమెను చేరదీశాడు. హాయిగా ఆ తర్వాత కాపురం చేసి ముగ్గురు పిల్లల్ని కని నాల్గవ పిల్లను ప్రసవించిన వెంటనే ఇరవై ఆరవ ఏటనే చనిపోయింది. ఈ పసిపిల్ల కొద్దిరోజుల్లోనే మరణించటంతో మిల్టన్‌కు ముగ్గురు పిల్లలే మిగిలారు.❋

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 22

# స్వేచ్ఛా స్వాతంత్ర్య పిపాసి- జాన్ మిల్టన్ - 2

**వి**వాహ వివాద కాలంలో మిల్టన్ లోసలా బయటా పెద్ద ఒత్తిడికి లోనైనాడు. 1643లో పార్లమెంట్ అసహనంగా అన్నిరకాల వ్యతిరేకతనూ అణచివేయాలని నిశ్చయించింది. వాక్ రచనా స్వాతంత్రాలపై నిషేధం విధించింది. పుస్తకాలు రాస్తే సెన్సార్ చేయించి ప్రచురించాలనే నియమం పెట్టింది. విడాకుల విషయంపై మిల్టన్ రాసిన కరపత్రాలు అభ్యంతరమైనవని ఎంచింది. ఇలా నిషేధిస్తూ పోతే మానవ స్వాతంత్ర్యమే అభాసుపాలవుతుందన్నాడు మన కవి. దీనికి సమాధానంగానే "ఆర్కో పాగాడీస్" రాశాడు. సాహిత్యాన్ని, స్వేచ్ఛనూ హరించవద్దని హితవు చెప్పాడు. తన భావాలను "Who kills a man kills a reasonable creature, God's image, but he who destroys a book kills reason itself, kills the image of God as it were the eye. Good book is the precious life - blood of a master spirit, embalmed and treasured up on purpose to a life beyond life... killing books is a kind of massacre, where of the execution ends not in the slaying of an elemental life, but strikes at the ethereal and fifth essence the breath of reason itself slays an immorality rather than a life" అని సాహిత్య ప్రయోజనాన్ని దాన్ని నిషేధిస్తే వచ్చే అనర్థాన్ని నిర్భయంగా నిర్మొహమాటంగా తెలిపాడు. అప్పటికి ఇంకా మిల్టన్ విద్య అందరూ పొందే హక్కు, రాసి అచ్చు వేసే హక్కుల గురించి చెప్పలేదు.

1645 మొదటి ఇరవై ఎనిమిది కవితా సంపుటిని విడుదల చేశాడు. ఇవి అపూర్వం అనిపించాయి. ఇందులో కొన్ని ఇటాలియన్ భాషలో రాసిన సానేట్లు ఉన్నాయి. కాని రాజకీయాలు అట్టుడికిపోతున్నాయి. ప్యూరిటన్ రివల్యూషన్‌కు "అనధికార ఆస్థాన కవి" అయ్యాడు. చార్లెస్ రాజుపై విచారణ జరిగింది. యెంత గొప్ప రాజైనా సక్రమ పాలన లేకుండా, నియంతగా క్రూరంగా ప్రవర్తిస్తే నిర్దాక్షిణ్యంగా చంపేయాల్సిందే అన్నాడు మిల్టన్.

రాజును ఉరి తీసిన తర్వాత మిల్టన్‌ను "లాటిన్ సెక్రెటరి ఆఫ్ స్టేట్" హోదానిచ్చి గౌరవించారు. ఆనాడు ప్రభుత్వాల మధ్య వాడుకలో ఉన్న భాష లాటిన్. రెండవ చార్లెస్ హాలాండ్‌లో ప్రవాసంలో ఉండగా సాల్మసియాస్ అనే మర్యాద సాహిత్యకారుడితో రాజరికం పైనా రాజు దైవాంశ సంభూతుడు అనే విషయం మీద, రాజు హక్కుల మీదా రాయించాడు. మిల్టన్‌ను సమాధానం రాయమని ప్రతినిధిని చేశారు. ఇద్దరి ఉత్తర ప్రత్యుత్తరాలు లాటిన్‌లోనే నడిచాయి. వీటిని అధ్యయనం చేసిన తత్వవేత్త థామస్ హాబ్స్ ఎవరి భాష నిర్దుష్టమైనదో, ఎవరి వాదనలో సారం ఉన్నదో తేల్చి చెప్పలేము అన్నాడు.

మిల్టన్ రాత పని సాగుతూనే ఉంది. కళ్ళు మసకగా కనిపించటం ప్రారంభమైంది. ఆండ్రూ మార్వేల్ కవి సాయం తీసుకొంటున్నాడు. 48వ ఏట మిల్టన్ మళ్ళీ పెళ్లికొడుకయ్యాడు. కేథరిన్ వుడ్ కాక్ అనే అపరిచిత యువతిని పెళ్లి చేసుకొన్నాడు. మనువు అయిన పదిహేను నెలలకే ఆమె, ఆమె శిశువు మరణించారు. ఆమెపై ఒక సానెట్ రాసి తృప్తి చెందానని జాన్సన్‌కు తెలిపాడు. కొద్ది రోజులకే పూర్తిగా గుడ్డివాడైపోయాడు. దీనికి కారణంపై అందరూ చర్చించారు కాని ఒక నిర్ణయానికి రాలేకపోయారు. సమకాలీన మతాధికారి "దేవుడి తీర్పు, విడాకులపై అవాకులూ చవాకులూ రాసినందుకు దైవశిక్ష అన్నాడు. కళ్ళకు అధిక శ్రమ ఇవ్వటం వలన అని కొందరన్నారు. విపరీతమైన మానసిక, శారీరక శ్రమ వల్ల దృష్టి లోపం వచ్చిందని కొందరు డాక్టర్లు వారించినా మిల్టన్ వినలేదని మరి కొందరన్నారు. కాని నిష్ణాతులు తల్లి నుండి మిల్టన్‌కు "కన్జెనీటల్ సిఫిలిస్" సంక్రమించింది అన్నారు. దీని వలననే ఇద్దరు భార్యలు, పుట్టిన పిల్లలు చనిపోయారని తేల్చారు. ఇది పచ్చి అబద్ధం అని అతని పిల్లలు కొందరు బతికే ఉన్నారని అంటూ మిల్టన్ గుడ్డివాడు అవటానికి "గ్లోకోమా" లేక కంటినాడికి పక్షవాతం కారణాలు అన్నాడు. అవన్నీ మిల్టన్ రాసిన కవితల్లో సానెట్స్‌లో స్వీయ చరిత్రగా రాసుకొన్నాడు. ఇందులో విషాధ అనుభవాలతో కూడి అత్యున్నత కళ ఉంటాయి. మనం చాలా మంది చదివిన కొన్ని లైన్లు "Doth God exact day labor, light denied? - I fondly ask - who best bear mild yoke, they serve him best - they also serve who only stand and wait"

"సెకండ్ డిఫెన్స్ ఆఫ్ ఇంగ్లీష్ పీపుల్" అనే పుస్తకంలో తనపై మోపబడిన ఆరోపణలన్నీ అసత్యం అన్నాడు. తనకు గుడ్డితనం వరమేనన్నాడు. వారి మనసులపై మేఘాలు కప్పుకొన్నాయన్నాడు. ఇప్పుడు తనకు హాయిగా స్వేచ్ఛ లభించింది అని, మనసుతోనే సౌందర్యాన్ని, సత్యం, నీతి, ధర్మం, స్థిరత్వాన్ని చూసుకొంటున్నానని తెలిపాడు. దీనివలన మిల్టన్‌లో వచ్చిన పరిపక్వత తెలుస్తోంది. "It is not so wretched to be blind, as it is not to be capable of enduring blindness" అని స్పష్టంగా చెప్పాడు. లార్డ్

క్రామ్వేల్ నియంతృత్వం వలన ప్రజలకు మేలు కలుగుతుందని ఆశించాడు. కాని మరీ భ్రష్టు పట్టించాడు. యుద్ధం కంటే శాంతి ముఖ్యం అన్నాడు. రెస్టోరేషన్ తప్పదని తెలిసింది. రాజుకు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించాడు.

క్రామ్వేల్ చావు తర్వాత మిల్టన్ రక్షణ కోసం ఊగాడు. అప్పటికే ఇంగ్లాండు మూఠా తగాదాలతో విసిగిపోయింది. ప్రజాస్వామ్య పాలన అసాధ్యం అని తేల్చారు. మళ్ళీ రాజరికమే గతి అని నిర్ణయించారు. హౌస్ ఆఫ్ లార్డ్స్‌ను పునరుద్ధరించారు. రెండవ చార్లెస్‌ను రంగ రంగ వైభవంగా స్వాగతించారు. కౌలీ వాలేర్ డ్రైడేన్ మొదలైన కవులు స్వాగత గీతాలు రాసి చదివారు. వీటికి దూరంగా మిల్టన్ ఉన్నాడు. ఇంకా మిల్టన్‌కు స్వేచ్ఛ మీద ఆశ పోలేదు. రాచరికం స్వేచ్ఛను హరిస్తుందని భావించాడు. లండన్ వదిలి వెళ్లి ఎక్కడైనా దాక్కోమని చెప్పారు. కాని మిల్టన్‌ను అరెస్ట్ చేశారు. అదృష్టవశాత్తూ తప్పించుకొన్నాడు. ఆయన పుస్తకాలన్నిటిని పబ్లిక్‌గా తగలబెట్టేశారు. మార్వేల్ సాయంతో జైలు నుండి విడుదల అయ్యాడు. మరణ శిక్ష విధించకపోయినా ఆయన కష్టాలు తీరలేదు. ఒంటరితనం వేధిస్తోంది. చేతిలో పెన్నీ లేని దరిద్రం ఆవహించింది. ఉన్న ముగ్గురు పిల్లలమీదే ఆధారపడి జీవిస్తున్నాడు. అందులో ఇద్దరమ్మాయిలకు చదువే రాదు. కాని వారికి ఆరు భాషలను నేర్పాడు. వారు చదివి వినిపించేవారు. అందులో ఏమున్నదో వాళ్ళకేమీ తెలీదు. పెద్ద పిల్లలు అన్నే మేరీలు ఈ పైకి చదివే పద్ధతిని వ్యతిరేకించారు. తండ్రికి తెలీకుండా మోసం చేసి కొన్ని పుస్తకాలు అమ్మేశారు. యాభై అయిదేళ్ళ వయసులో ముచ్చటగా మూడో పెళ్లి చేసుకొన్నాడు. అతని కంటే ఆమె ముప్ఫై ఏళ్ళు చిన్నది. పిల్లలకు ఇష్టం లేదు. ఆమెకు సహకరించలేదు. కాని దేబోరో అనే కూతురు మాత్రమే కొత్త అమ్మపై సానుభూతి చూపింది. యాభైలో ఉన్నా మిల్టన్‌కు ముసలితనం వచ్చేసినట్లనిపించింది. కళ్ళు కనిపించకపోయినా వాటిల్లో దివ్యమైన వెలుగు కనిపిస్తోంది. అంతర్ దృష్టి ఆయనలో విజృంభించింది.

**అనిబద్ధ కవితా పిత – జాన్ మిల్టన్**

యాభై ఏడేళ్ళ వయసులో మిల్టన్ చారిత్రాత్మక ఎపిక్‌ను రాయటం ప్రారంభించాడు. కథ చారిత్రాత్మకంగా బైబిల్‌కు సంబంధించిందిగా ఉండాలని నిర్ణయించుకొన్నాడు. దీనికోసం తొంభై డ్రమాటిక్ పోయెమ్స్‌ను నోట్సుగా రాసుకొన్నాడు. దానికి “ఆడమన్ పారడైసేడ్” అని ముందు పేరు పెట్టాడు. కాని అది చివరికి “పారడైస్ లాస్ట్”గా తేలింది. సాహస కృత్యాలను వదిలేశాడు. మతానికి, సత్యానికి ప్రాధాన్యతనిచ్చాడు. మానవత్వం కోసం పోరాటమే అతని ధ్యేయం. తన భావాలను “Assert Eternal providence - and justify the ways of God to man”గా తెలిపాడు. ఇలాంటి క్లాసిక్‌కు అంత్యప్రాస అంత నప్పదు

అనుకొన్నాడు. "బ్లాంక్ వెర్స్"లో మాత్రమే చెప్పదలచుకొన్న భావాలను పకడ్బందీగా చెప్పగలను అనిపించి దానినే ఎన్నుకొన్నాడు. వక్తృత్వ భాషలో తీర్చిదిద్దాడు. అప్పటికి పెద్దగా ఆకర్షణలో లేని అనిబద్ధ కవిత్వానికే పెద్దపీట చేశాడు. అనేక ఆధునిక కవులు దీన్ని లక్ష్యం చేయలేదు కాని ఇలియట్ మాత్రం "Adam and Eve were not to be meant to be individuals but proto types of man and woman" అన్నాడు. పిల్లలకు చెప్పి రాయిస్తూ ఆ కావ్యాన్ని రాశాడు. కొంచెం నెమ్మదిగా సాగింది, పూర్తిచేసి 1667లో ముద్రించాడు. ఒక అయిదు పౌన్లు మాత్రమే లభించాయి. మిల్టన్ రాసిన రెండు లైన్లను ఆ తర్వాత వర్డ్స్ వర్త్ వాడుకొన్నాడు. "Stood almost single, phrasing odious truth - darkness before and danger's voice behind". మిల్టన్ "హిస్టరీ ఆఫ్ ఇంగ్లాండ్" గ్రంథం రాశాడు కాని సెన్సార్ అయింది. అందులో సాక్సన్ మాంక్స్‌ను నిందించాడు. బహుశా తన కాలపు వారిని చూసి అలా రాసి ఉండాలి. లాటిన్ గ్రామర్, లాజిక్ పాఠ్య పుస్తకం మత బోధనపై గ్రంథం రాశాడు. పారడైజ్ లాస్ట్ తర్వాత నాలుగేళ్ళకు పారడైజ్ రీ గైన్డ్ రాశాడు. ఈ రెండూ మిల్టన్‌లో అంతర్ దృష్టినీ, దేవుడి సన్నిధిని కలిగించాయి. మానసిక శాంతి లభించింది. చిత్తశుద్ధి ఏర్పడింది. వాదాల జోలికి పోలేదు. ఇంట్లో మతపరమైన కార్యక్రమాలు చేయలేదు. కూతుళ్ళను ఎంబ్రాయిడరీ నేర్చుకోవటానికి బయటికి పంపేవాడు. మంచి స్త్రీలుగా ఎదగాలని భావించాడు. అరవై ఆరవ ఏట 08-11-1674 మహాకవి మిల్టన్ మరణించాడు. ఆత్మ పరమాత్మలో చేరిపోయింది. "పారడైజ్ లాస్ట్" రాసినవాడు "పారడైజ్ రీ గైన్"ను పొందాడు.

యెంత గొప్ప కవి అయినా ఆయన రాసినవి చదివేవారు తక్కువే. కవి, రాజకీయవేత్త, ప్రాపగాండిస్ట్, కరపత్ర కార్యదక్షుడు, పెద్దగా చదువు లేకపోయినా అందరికి జ్ఞానం బోధించిన పరిపక్వ మానవీయమూర్తి మిల్టన్. సంగీత ధ్వనులలాంటి మాటలతో ఏకత్వ బోధన చేసే కవిత్వం రాశాడు. "Milton was infatigable worker for liberty carved and erected milestones that still stand on the road to freedom. A religious poet, he was also a builder. Choosing his phrases as they were stones for a cathedral, he raised a great edifice, a monument of words in marble". ఎడ్మండ్ బర్క్ మిల్టన్ చిత్రించిన "నరకం" అద్భుతం అన్నాడు. రొమాంటిక్ కవులు మిల్టన్ బ్లాంక్ వేర్స్‌పై ఎంతో అన్వేషించారు కాని అందులోని మత భావాలను దూరం చేశారు. వర్డ్స్‌వర్త్ "మిల్టన్ ఇప్పుడు మన మధ్య ఉంటే బాగుండును" అన్నాడు. జాన్ కీట్స్ "his style is uncongenial. his verse can not be written but in an artful rather artists humor" అని పొగిడాడు. విక్టోరియన్

యుగం అంతా మిల్టన్ ప్రభావంతోనే నడిచింది. "Milton is the central problem in any theory and poetic influence in English" అన్నాడు ప్రముఖ విమర్శకుడు రాబర్ట్ బ్లూమ్. "Milton is esteemed the parent and author of blank verse among us. His verse might be synonymous for blank verse poetry a new poetic terrain independent from both the drama and the heroic couplet" అని బద్ధ కవితకు పట్టంకట్టి "అనిబద్ధ కవితా పిత" అనిపించుకొన్నాడు జాన్ మిల్టన్.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 23

# హేతువాద యుగం - జాన్ డ్రైడేన్

**"ఆ**గస్టన్" కాలంలో లాటిన్ భాష, సంస్కృతి గొప్ప సొగసులు సంతరించుకొంది. నాణ్యత పెరిగింది. అంతకు ముందు తరాలలో విజృంభించిన రొమాంటిక్ మెటాఫిజికల్ కవిత్వానికి ఆదరణ తగ్గింది. ఇమేజరి భాషాడంబరం వెగటు పుట్టించాయి. అందంగా నేర్పుగా, నియంత్రణలో, ఒక పద్ధతిలో కవిత్వం ఉండాలన్న భావం ఏర్పడింది. దీనినే పోప్ కవి "ఆర్డర్ ఈజ్ హేవెన్స్ ఫస్ట్ లా" అని సూత్రీకరించాడు. ఈ కాలంలోనే సైన్స్‌లో కొత్త విషయాల ఆవిష్కరణ జరిగింది. కొత్త విధానాలకు ఆదరణ కలిగింది. అందుకే ఈ కాలాన్ని "ఏజ్ ఆఫ్ యెన్ లైటేన్‌మెంట్" అన్నారు. ఊహ కంటే మేధకు ప్రాముఖ్యత వచ్చింది. నాటకాలలో పెళ్లి తంతులో ఉన్న లోపల అవహేళన, గౌరవంపై చిన్నచూపు,, విలువలపై హేళన పెరిగాయి. కవిత్వంలో నగిషీలెక్కువైనాయి. విషయ ప్రాధాన్యత లేదు. కాని విధానం మాత్రం వన్నెలు చిన్నెలతో దూసుకుపోయింది. ఛందస్సు తీవ్రంగా స్టైల్‌గా కొలువు తీరింది.

జాన్ డ్రైడేన్ ఈ కాలంలో అంటే హేతువాద యుగంలో అగ్రగామి కవిగా నిలిచాడు. మిల్టన్ కంటే పిరికివాడు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొన్నాడు. దేన్నీ లెక్కచేయని తత్త్వం. నీతి నిజాయితీలను బలాదూర్ చేసి ఇష్టం వచ్చినట్లు విశృంఖలంగా విజృంభించాడు. ఉన్నదాన్ని ఉన్నట్లుగా ఉంచటమే అతని ధ్యేయం. ఆంగ్ల కవిత్వంలో భాషాభివృద్ధి జరగాలని కోరాడు. దానికోసమే శ్రమించాడు. 09-08-1631న నార్త్ యాంప్ షైర్‌లో ఆలడ్ విన్ క్లిల్ ఆల్ సెయింట్స్‌లో జాన్ డ్రైడేన్ పుట్టాడు. పద్నాలుగు మంది సంతానంలో పెద్దవాడు. స్కూల్‌లో చదువుతూనే సెటైర్లు రాసి ప్రైజులు గెల్చాడు. లాటిన్ కవి పెర్సియాస్ రచనను ఇంగ్లీష్‌లో తర్జుమా చేశాడు. కేంబ్రిడ్జి ట్రినిటి కాలేజిలో చేరి డిగ్రీ పొందాడు. మొదటి ఎలిజీ "అపాన్ ది డెత్ ఆఫ్ లార్డ్ హేస్టింగ్స్" రాశాడు. కజిన్ ఆనర్ డ్రైడేన్‌తో సరస సల్లాపాల్లో తేలి కవిత్వం, వచనం కలగలిపి ఆమెపై రాశాడు. ఆమె ఎవరినీ పెళ్లి చేసుకోలేదు

కాని ఇతనితో చివరిదాకా సంబంధం సాగించింది.

ఇరవై మూడేళ్ళ వయసులో తండ్రి పోయాడు. కొంత ఆస్తి డబ్బు ఇతనికి ఇచ్చాడు. లండన్ వెళ్లి తన విద్యా ప్రతిభ నిరూపించుకోవాలనుకొన్నాడు డ్రైడేన్. సర్ గిల్బర్ట్ ఫ్లికరింగ్ అనే కజిన్ దగ్గర సెక్రెటరిగా చేరాడు. ఇతను లార్డ్ క్రాంవెల్‌కు లార్డ్ చాంబర్లిన్. కవికి కామన్ వెల్త్‌లో చిన్న ఉద్యోగం ఇప్పించాడు. పుస్తకాలకు ముందుమాటలు రాస్తూ సమీక్షలు చేస్తూ ఆదాయాన్ని పెంచుకొన్నాడు. తన స్వంత రచనలు ప్రచురించాడు. ఎవరికొందో పనిచేసి సంపాదించటం నామోషీగా భావించి స్వంత కాళ్ళమీద నిలబడాలనుకొన్నాడు. మంచి స్థిరమైన ఉద్యోగం లభించే వయసే అది. కాని తన విశ్వాసాన్ని, విధేయతను తరచూ మారుస్తూ ఉండటంతో చిక్కులొచ్చాయి. 1658లో క్రామ్వేల్ మరణం తర్వాత ఆ డిక్టేటర్‌ను ఆకాశానికి ఎత్తుతూ “హీరోయిక్ స్టాంజాస్” రాశాడు. రెండవ చార్లెస్ రాజు ప్రవాసం వదిలి డోవర్‌లో అడుగు పెట్టినప్పుడు స్వాగతించిన కవుల్లో తానూ ఒకడుగా ఉండి “ ఏ పెనెగేరిక్ ఆన్ హిస్ కారెనేషన్” రాసి అంకితమిచ్చాడు. కొత్త ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించాడు. గోడలు దూకుతున్నా కవిత్వాన్ని వదలలేదు. రాబర్ట్ హోవార్డ్‌పై రాసిన కవిత వలన ప్రాముఖ్యత పెరగటమే కాదు భార్యనూ ఇచ్చింది. హోవార్డ్ ఎరల్ ఆఫ్ బెర్క్‌షైర్‌ను అంటకాగాడు. కుటుంబంలో సన్నిహితంగా మెలగి అతని చిన్న కూతురు లేడీ ఎలిజబెత్‌ను వలచి పెళ్లి చేసుకొన్నాడు. ఈ పెళ్లి సుఖం అందించింది. ముగ్గురు పిల్లలు కలిగారు. పొజిషనూ క్రమంగా పెరిగింది. డబ్బూ వస్తోంది. నలభైవ ఏట డ్రైడేన్ రాజుకే డబ్బు అప్పు ఇచ్చే స్థాయికి పెరిగాడు. అప్పటిదాకా ఇరవై ఏళ్ళు నాటక శాలలు మూతపడి ఉన్నాయి. డ్రైడేన్ చొరవతో వాటిని తెరిపించాడు. స్వయంగా నాటకాలు రాయాలని అనుకొన్నాడు. “ది వైల్డ్ గాలంట్” అనే వచన కామెడీని ముప్ఫై రెండో ఏటనే రాశాడు. అది తన్నింది. నిరాశ పడలేదు. విధానం టెక్నిక్ మార్చి “ది రైవల్ లేడీస్” రాశాడు. ఇందులో బ్లాంక్ వేర్స్‌ను అంత్యప్రాసలతో రాశాడు. బావ మరిదితో కలిసి “ది ఇండియన్ క్వీన్” రాసి పేరుపొందాడు. ఇలాంటి హీరోయిక్ నాటకలే బాగా క్లిక్ అవుతాయనుకొన్నాడు. వీటిల్లో హీరోయిక్ కప్లేట్స్ నింపాడు కూడా. ప్రతి ఏడాది ఒక కొత్త నాటకాన్ని పందొమ్మిదేళ్ళు రాశాడు. ఇందులో ట్రాజిక్, సెమి ట్రాజిక్‌లున్నాయి. సీక్రెట్ లవ్, ది కాంక్వెస్ట్ ఆఫ్ గ్రనడా, ఔరంగజేబ్ వంటివి ఉన్నాయి. వీటిలో మిధ్యా క్లాసికల్ పద్ధతులను చౌకబారుతనాన్ని చూపాడు. ఆ కాలానికి తగిన అభిరుచులకు అనుగుణంగా తాత్కాలిక ప్రయోజనంగా రాశాడు. అంతర్గత భావానికి ప్రాముఖ్యత నివ్వలేదు. షేక్స్‌పియర్‌ను చాలా కాలం మరిపించేశాడు నాటకాలతో. పదిహేడవ శతాబ్ధి ఉత్తరార్ధంలో కళను ప్రకృతిని ఆరాధించటమే కాక భావోద్రేకాలనూ ఆదరించారు.

రేస్టోరేషన్ కాలంలో నాటక రంగం ప్రజలకు దగ్గరైంది. ఈ వికాస యుగంలో

షేక్స్పియర్ నాటకాలను అభివృద్ధి చేశారు. పోప్ తనకు నచ్చని లైన్లను తీసేశాడు. నాటక రచన "కవిలోని కవిని" అణచేసింది. 35 వయసులో డ్రైడేన్ "ఆన్స్ మిరాబిలిస్" అనే పన్నెండు వందల లైన్ల కవితను రాసి వదిలాడు. ఇది జర్నలిజంకు ప్రేరణ కలిగించింది. చార్లెస్ రాజుకు ఈ కవిత్వం బాగా నచ్చి "ఆస్థాన కవి"ని చేశాడు. ముప్పై అయిదేళ్ళ వయసులో ఈ పదవి వరించింది. ఇద్దరు గొప్ప రాజుల వద్ద (మొదటి జేమ్స్, మొదటి చార్లెస్) ఆస్థాన కవిని అని గర్వంగా చెప్పుకొన్న విలియం దేవనంట్ స్థానంలో ఆస్థాన కవి అయ్యాడు. ఆ ఇద్దరు రాజులు దేవనంట్‌కు అధికారంగా ఆ పదవిని ఇవ్వలేదు. ఆయనే చెప్పుకొన్నాడు పాపం. కాని ఇప్పుడు రెండవ చార్లెస్ సాధికారంగా డ్రైడేన్‌ను మొట్టమొదటిసారిగా ఆస్థానకవిని చేసి గౌరవించాడు. రెండేళ్ళ తర్వాత "హిస్టరియోగ్రాఫర్"ను చేశాడు. కీర్తి పెరిగిపోయింది. ఇతని తర్వాత ఆస్థాన కవులైన పద్నాలుగు మందిలో అసలైన అర్హులు వర్డ్స్‌వర్త్, మిల్టన్లు మాత్రమే. మిగతా వాళ్ళంతా కాకాపట్టి బాకాలూది సాధించిన వారే.

రాజుగారి శత్రువులపై అనేక సెటైర్లు రాసి శహభాష్ అనిపించాడు. ఏడాదికి రెండు వందల పౌన్లు వార్షికం ఇచ్చి తర్వాత మూడొందలకు పెంచారు. పొట్టిగా, ఎర్రగా, కొంచెం కుంగినట్లు కనిపించేవాడు. నెమ్మదిగా మాట్లాడేవాడు. సెటైర్లు రిపార్టీలతో రాజ దర్బారు మారుమోగిపోయేది. 1679లో "మాక్ ప్లేక్నో" రాశాడు. దుందుడుకు స్వభావం వలన నెమ్మదిగా స్నేహితులకు దూరమైనాడు. రాజ బంధువులూ దూరమైనారు. ఒకరోజు కోవర్ట్ గార్డెన్ మీదుగా వెడుతుంటే డ్రైడేన్‌ను అవమానించి పిచ్చపిచ్చగా కొట్టారు. అయినా రాజు దగ్గర మార్కులు కొట్టేస్తున్నాడు. కేథలిక్కులకు టోరీలకు విద్వేషాలొచ్చాయి. "అబ్సలాం అండ్ అచితోఫెల్" అనే వ్యంగ్యాత్మక నాటకం రాసి సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టాడు. ఎవరినీ వదలలేదు. ఈయన రాసిన సెటైర్‌లలో ఇదే గొప్పదని పేరు. ఇది బాగా పేలటంతో దీనికి సీరియల్ అంటే సీక్వెల్ రాయమనే డిమాండ్ పెరిగింది. రెండొందల లైన్లు రాసి కోరిక తీర్చాడు. రాజకీయంగా, ఆర్థికంగా మంచి స్థితిలో ఉండాలనేదే ఎప్పుడూ కోరిక.

ఇంగ్లాండ్‌లో విప్లవం ఉవ్వెత్తున విరుచుకు పడబోతోందనే సంగతి గ్రహించలేకపోయాడు. దానికి సమాయత్తమూ కాలేదు కూడా. రెండవ చార్లెస్ పూర్తిగా మతోన్మాధిగా కాథలిక్ మోనార్క్‌గా ప్రవర్తించాడు. అప్పటిదాకా విధేయులుగా ఉన్న టోరీలు పూర్తిగా వ్యతిరేకించారు. కొందరు బిషప్పులపై అభియోగాలు మోపి రుజువు కాక వదిలేశారు. రాజు వ్యతిరేకత కట్టలు తెగి పారుతోంది. ఇంగ్లాండ్‌ను "పాపల్స్ పాపాల" నుండి రక్షించాలనే సంకల్పం బలీయమైంది. జేమ్స్ కూతురు మేరీని పెళ్లి చేసుకొన్న విలియం ఆఫ్ ఆరంజ్‌ను రాజు చేయాలనే భావం బలపడింది. ఇది తెలుసుకొన్న చార్లెస్ పలాయనం చిత్తగించాడు. వెనక్కి రప్పించి విచారించారు. తప్పించుకు పారిపోయాడు. విలియంకు మేరీకి ఉమ్మడిగా

రాజరికం కట్టబెట్టారు. కొత్త రాజుకు విధేయత ప్రకటించటానికి ఒప్పుకోలేదు. దీనితో ఆస్థాన పదవి హిస్టరియోగ్రాఫర్ పదవీ ఊడగొట్టారు. డ్రైడేన్ ద్వేషించి సెటైర్లతో చీల్చి చెండాడబడిన షాడ్‌వెల్ ఆస్థాన కవి అయ్యాడు.

మానసికంగా కుంగి ఆదాయం లేక మన కవి ఇబ్బంది పడ్డాడు. ఏభై ఎనిమిదేళ్ళొచ్చాయి. నాటకాలు రాసి అనువాదాలు చేసి డబ్బు చేసుకోవాలని నిర్ణయించాడు. ఎపెరాలకు లిబర్టోస్ రాశాడు. “ది స్టేట్ ఆఫ్ ఇన్నోసేన్స్ అండ్ ఫాల్ ఆఫ్ మాన్” అచ్చు అయింది. ఆ ఊపులో అరడజన్ నాటకాలు గీకి పారేశాడు. అరవైలో ఏ ఇంగ్లీష్ రచయితా చేయని గొప్ప ప్రయత్నం చేశాడు. తన పుస్తకాలను అమ్ముకొని బతకటం ప్రారంభించాడు. ఇలా పదేళ్ళు గడిపాడు. అనువాదాలు చేసి అచ్చేసి అమ్ముకొన్నాడు. ఇవన్నీ చాలా సరదాగా కాలక్షేపం బటాణీల్లా ఉన్నాయి. పన్నెండు వందల పౌండ్లు ఆర్జించాడు. అరవై తొమ్మిదో ఏట చివరి రచన “ఫేబుల్స్ ఏన్సెంట్ అండ్ మోడరన్” రాశాడు. ఇందులో చాసర్ కథలను ఆధునిక ఇంగ్లీష్‌లో రాశాడు. చనిపోవటానికి మూడు వారాల క్రితం మిసెస్ సీవార్డ్‌కు తాను ఒక కొత్త మాస్క్ రాశానని తెలియజేశాడు. అదే “సెక్యులర్ మాస్క్”. తను పనిచేసిన ఇద్దరు రాజుల ప్రవర్తన, ఆశతాబ్దపు ధోరణి అందులో చూపించాడు. వివాదాస్పద రచయితగానే గుర్తుండిపోయాడు. మెటాఫిజిక్స్ అవుట్ ఆఫ్ ఫాషన్ అయింది. ప్రకృతి గురించి రాశాడు. కవిత్వాన్ని సానబెట్టి మెరుగులు దిద్దాడు. మాటల మంత్రజాలంతో ఆకట్టుకొన్నాడు. కవిత్వంలో లాజిక్‌ను నింపాడు. కవిత్వానికి వేగం, టైమింగ్ ఇచ్చాడు. “He ought to be on ourselves, but he will rarely be found in our hearts” అని తేల్చారు అయినా “With the element of magic, his is in its own characteristic way, the shortest, the most pointed and perfectly finished kind of poetry, if poetry can be attained without wonder”. 12-05-1700న డ్రైడేన్ మరణించాడు.

డోన్నే, మిల్టన్‌ల తర్వాత పదిహేడవ శతాబ్దిలో గొప్ప కవి. షేక్స్‌పియర్ బెన్ జాన్సన్‌ల తర్వాత గొప్ప నాటక రచయిత. సాహిత్య విమర్శ, వచన రచనలలో అసామాన్యుడు. డ్రామాలో, కవిత్వంలో అందరినీ మించాడు. ప్రఖ్యాత హాస్య రచనలు చేశాడు. అతని అనువాదాలు అనితర సాధ్యమైనవనిపించుకొన్నాయి. “హీరోయిక్ కప్లేట్స్”ను హీరోగా చేశాడు. రెండు సృజనాత్మక సెటైర్లు రాశాడు. అతని ఆకారం కంటే ‘కవితాకారం’ బహు సుందరంగా ఉంటుంది. దాదాపు నలభై రచనలు చేశాడు. వర్జిల్‌పై గొప్ప పుస్తకం రాశాడు.

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 24

# చమత్కార ప్రపంచం

డ్రైడేన్ కవికి పోప్ కవికి మధ్య అర్ధ శతాబ్దకాలం కవిత్వానికి చిన్న రోజులే. రేస్టోరేషన్ తర్వాత కవిత్వం చాలా కృత్రిమంగా తయారైంది. సాహసానికి, వీరత్వానికి ప్రాముఖ్యత పెరిగింది. మనస్సాక్షికి అవకాశం వచ్చింది. మెటాఫిజికల్ కవిత్వం ఆదరణ కోల్పోయింది. బుద్ధి చతురత, హాస్యాలకు మోజు ఎక్కువైంది. సామ్యుల్ పెపీస్, ఎవిలిన్ రాసిన విమర్శ, సమీక్ష, కరపత్ర రచన, డైరీలను ఆదరించారు. సున్నితత్వాన్ని, వినోదాన్ని కోరారు. ఈ పరిధిలో రాసి గుర్తింపు పొందిన వారిలో జాన్ విల్మాంట్ ఎరల్ ఆఫ్ రోచెస్టర్, మార్గరెట్ లూకాస్, ఆఫ్రాబెన్ అన్నే ఫించ్, లేడీ విన్చేల్సియా మొదలైన వారున్నారు. వారిని గురించి సంక్షిప్తంగా తెలుసుకొందాం.



**సెటైర్ వజ్రం - ఎరల్ ఆఫ్ రోచెస్టర్ - జాన్ విల్మాంట్**

జాన్ విల్‌మాంట్ రెక్‌లెస్ మనిషి. 01-04-1647న ఆక్స్‌ఫర్డ్ షైర్‌లో డిచిలీలో పుట్టాడు. పన్నెండేళ్ళ వయసులోనే తండ్రికి వారసుడై ఎరల్ ఆఫ్ రోచెస్టర్ అయ్యాడు. ఆక్స్‌ఫర్డ్ వాడాన్ కాలేజిలో చదివి పదిహేనవ ఏటనే ఎం.ఏ పాస్ అయ్యాడు. డచ్ వారికి వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నాడు. ఇంగ్లాండ్ తిరిగి వచ్చి రెండవ చార్లెస్ రాజుకు సన్నిహితుడయ్యాడు. అందం, అధికారం ప్రాపకంతో అన్నీ పొందాడు. సెక్సు స్కాండల్స్, అవినీతిలో చిక్కుకుపోయాడు. డచ్ రాజు చార్లెస్‌ను అవమానపరుస్తూ రాస్తే అతను ప్రయాణం చేసే నౌకను తగలబెట్టించాడు. రోచెస్టర్ రాజ వంశానికి చెందిన మాలేట్‌ను శృంగారంలోకి దించే ప్రయత్నం చేస్తే ఆమె తిరస్కరిస్తే రహస్యంగా పెళ్లి చేసుకోక తప్పలేదు. ఆమెతో బాటు అందుబాటులో దొరికిన సామాన్య స్త్రీల దగ్గర నుంచి రాజకన్యలు రాణీలనూ అనుభవించటం

మొదలెట్టాడు. చార్లెస్ రాజు రాసలీలలను కవితామయం చేశాడు. విసుగెత్తి అతన్ని బహిష్కరించారు. భార్య ఎస్టేట్‌లో తలదాచుకొన్నాడు. రాజు ఇతన్ని వదలుకోలేకపోయాడు.

ముప్ఫై ఒకటవ ఏట ఆరోగ్యం దెబ్బతినటం మొదలైంది. జ్వరం వచ్చి శరీరాన్ని మనసును ఇబ్బంది పెట్టింది. రెండేళ్ళ తర్వాత తను చేసిన పాపకృత్యాలకు సిగ్గుపడ్డాడు, పశ్చాత్తాపం చెందాడు. ముప్ఫై మూడవ ఏటనే 16-06-1680న చనిపోయాడు. చాలా అనాగరిక భాషలో కవిత్వం రాశాడు. "ఫేర్‌వెల్ టు ది కోర్ట్" కవిత అరువు సొమ్ముతో అలంకరించిందే. "ఏ సెటైర్ ఎగైనెస్ట్ మాన్‌కైండ్" కవిత అతని మనసును ఆవిష్కరిస్తుంది. "I would be a dog, a monkey or a bear or anything but that vain animal - who is so proud of being rational" అని మనిషిగా పుట్టటానికి ఇష్టం లేదన్నాడు. రోచెస్టర్ అసందిగ్ధ భావాలను వదిలి వెళ్ళాడు. అతను చనిపోయిన తర్వాతే కవితలు అచ్చయ్యాయి. రెండున్నర శతాబ్దాల తర్వాత 1926లో ముద్రణకు నోచుకొన్నాయి. జాన్ హోవార్డ్ ఇంగ్లాండ్‌లో ప్రింట్ చేశాడు. అమెరికాలో వద్దన్నారు.

"love a woman! you are an ass - it is a most insipid passion - to choose out for your happiness - the silliest part of God's creation" అని తన అనుభవాలను నెమరేసుకొంటూ బాధపడుతూ బోధ చేశాడు. తప్పుడు భావాలను వ్యాప్తి చెందించాడని అందరూ నిరసించారు. ఒక్కమాటలో చెప్పాలంటే "Rochester expressed himself in many and often opposed moods - sordid and witty indignant and indifferent, daring vulgar and always himself". ప్యూరిటన్‌ల ఆధ్యాత్మిక సాధికారతను ఎదిరించి నిలిచిన మొదటివాడు. ఆ తరానికి మార్గదర్శి కూడా. సెటైరిస్ట్‌లలో అగ్రగామి అనిపించాడు. విక్టోరియన్ కాలంలో అతని కవిత్వం చాలా భాగం సెన్సార్ అయింది. ఆధునిక కవులు గ్రాహంగ్రీన్‌కు ఎజ్రాపౌండ్‌కూ ఆదర్శం. హాబెర్ట్ యొక్క మెటీరియలిజంకు దూరంగా "లిబర్టి నిజం" రాశాడని విమర్శకులన్నారు. యవ్వన మదంలో చెడ తిరుగుళ్ళు అసభ్య శృంగారం వ్యభిచారంలతో అతనికి "గనేరియా" సోకి దానితోనే చనిపోయాడు. ఆక్స్‌ఫర్డ్ షైర్‌లో స్పీల్స్‌బరి చర్చిలో సమాధి చేశారు. అతను రాసిన "డెత్ బెడ్ రినన్సిఏషన్" అనే "లిబర్టినిజం"ను తర్వాత ప్రచురించారు. ఇందులో భావాలన్నీ "ప్రాడిగల్ సన్" పశ్చాత్తాపంగానే ఉంటాయి. అతని "ప్రేంతిస్ వర్క్", "ఎర్లీ మేచూరి", "ట్రాజిక్ మెచూరిటి", "ది సిల్యూజన్ అండ్ డెత్" అనే నాలుగు విమర్శ గ్రంథాలు దాదాపు అతని జీవితచరిత్రలే. డెబ్భై అయిదు కవితలు రాశాడని తేల్చారు.

చార్లెస్ రాజుపై రాసిన "We have pretty witty king - and whose words no man relies on - he never said a foolish thing - and never

did a wise one"ను చదివి రాజు నవ్వుకొని "That is right - my words are my own but my actions are those of my ministers" అన్నాడట. అతని కవిత్వంలో విజ్ఞానం, ప్రభావం రెండూ ఉంటాయి. మారుపేర్లతోనే ఎక్కువగా రాశాడు. నాటక రంగంపై మోజు ఎక్కువ. అంతకంటే అందులో నటించే నటీమణులంటే మరీనూ. "కొడాం ఆర్ దిక్వినైసేన్స్ ఆఫ్ డిబాచరి" నాటకం బాగా పేరు పొందింది. తగలబెట్టగా మిగిలిన "సోడాం" నాటకాన్ని అమ్మితే 45,600 పౌండ్లు వచ్చాయట. భార్యకూ, స్నేహితుడికీ రాసిన ఉత్తరాలు సరస సల్లాపాల్లాగా, చాలా తేలిక వచనంతో అందర్నీ ఆకర్షించాయి.

ఆకాలంలో ఎందరో నటులకు రోచెస్టర్ ఆదర్శం. శామ్యూల్ జాన్సన్ "Worth-less and dissolute rake" అన్నాడు. ఆంద్రూ మార్వేల్ మాత్రం "The only man in England that had the true vein of satire" అని పొగిడాడు. వోల్టైర్ "మాన్ ఆఫ్ జీనియస్ అండ్ గ్రేట్ పోయెట్ సెటైర్‌లలో శక్తి, సామర్థ్యం ఉన్నాయి" అని మెచ్చాడు. హాజ్‌లిట్ రోచెస్టర్ కవితలు సానబెట్టిన వజ్రాలని కాంతితో మెరిసిపోతూ ఉంటాయనీ అన్నాడు. గోతే తన స్వీయచరిత్రలో రీజన్‌కు మానవత్వానికి వ్యతిరేకంగా ఉన్న రోచెస్టర్ సెటైర్‌ను పొందుపరచాడు. ఇలా దూషణ భూషణ తిరస్కార పురస్కారాలు అందుకొన్నాడు రోచెస్టర్.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 25

# డచెస్ ఆఫ్ న్యూ కాజిల్ - అందాల రాశి - స్త్రీవాద రచయిత్రి - మార్గరెట్ లూకాస్ కేవండిష్

**"మా**ర్గరేట్ లూకాస్ ఎంత రొమాంటిక్ లేడీయో అంత రొమాంటిక్‌గా రాసింది" అన్నాడు సామ్యూల్ పెపీస్. ఈమెతోబాటు ధీటుగా రాసిన మరి ఇద్దరు ఆఫ్రాబెన్, అన్నే ఫించ్ అనే స్త్రీ కవులు. మార్గరేట్ లూకాస్ 1623లో బాగా పేరున్న కుటుంబంలో పుట్టింది. సోదరులు సాహసులైతే సోదరిలు పద్ధతి ఉన్నవారు. కాని మార్గరేట్‌కు మాత్రం రొమాన్స్ వంటవి పుట్టిన విద్య. నడవటం నేర్చిన నాటి నుండే ఇందులో దిగింది. బ్రిటన్ అంతర్యుద్ధంలో వీరి కుటుంబాన్ని ప్రవాసానికి పంపారు. లూకాస్ హేన్రిట్టా మేరియాకు చెలికత్తెగా చేరింది. యాభై ఏళ్ళ న్యూ కాజిల్ డ్యూక్ ఈమెను చూడగానే ప్రేమించి పెళ్ళాడాడు. రాజుతో బాటు తాత్కాలికంగా దూరమైనా మళ్ళీ లండన్ చేరారు. రేస్టోరేషన్ తర్వాత భర్తను డ్యూక్‌ను చేశాడు. ఈమె డచెస్ అయింది. ఖరీదైన దుస్తులు ధరించి అందంగా అలంకరించుకొనేది. ఏ ఉత్సవంలో పాల్గొన్నా అందరూ తనకోసం ఎదురు చూడాలని ఆలస్యంగా వచ్చేది. అరడజన్ స్త్రీలు ఆమె కారేజ్‌ను లాక్కొచ్చేవారు. అంత వైభవం ఒలకబోసింది. రాయల్ సొసైటీలోకి దురుసుగా ప్రవేశించింది. డెస్కార్టేస్, హాబ్స్ మొదలైన ఫిలాసఫర్‌లతో తనకున్న విభేదాలను బహిర్గతం చేసేది. హాబ్స్ "ఏ నీతి పుస్తకంలోను లేనంత నీతి మార్గరెట్ దగ్గర ఉంది" అన్నాడు. ఇంతటి వైభవంగా జీవించిన ఆమె యాభైవ ఏట 1673లో మరణించింది. సైన్స్, ఫిలాసఫీలను అలవోకగా రాసింది. "అబ్సర్వేషన్స్ అపాన్ ఎక్స్పెరిమెంటల్ ఫిలాసఫీ, డిస్క్రిప్షన్ ఆఫ్ ఏ న్యూ వరల్డ్" అనే సైన్స్ ఫిక్షన్ రాసింది.

మార్గరెట్ కవిత్వం ప్రాధమికంగానే ఉన్నా మహిళా ప్రభావం ఉండేది. ఫాంటసీ ప్రాధాన్యతనిచ్చింది. చెట్లు జంతువులుగా కనిపిస్తాయి. పదిహేడు, పద్దెనిమిది శతాబ్ధాలలో

స్త్రీలు తేనే, గులాబి పూల వంటివారని కవులు వర్ణించారు.



**గూఢచారి కవి – ఆఫ్రా బెన్**

జాన్, ఏమిన్‌ల కూతురు ఆఫ్రాబెన్ ఒక వేగుగా గుర్తింపు పొందింది. కెంట్‌లో 1640లో ఒక మంగలి కుటుంబంలో పుట్టింది. ఇంగ్లాండ్ అధీనంలో ఉన్న సురియం గయానాలలో చదివింది. పద్దెనిమిదో ఏట ఇంగ్లాండ్ చేరింది. సాటిలేని మాటకారి. ఇరవై ఆరేళ్ళ వయసులోనే భర్తను కోల్పోయింది. రెండవ చార్లెస్‌కు డచ్ యుద్ధంలో గూఢచారిగా పనిచేసింది. మిలిటరీ వ్యూహంలో మంచి నేర్పున్న మహిళ. చాలా విలువైన, ముఖ్య సమాచారాలను సేకరించి రాజుకు అందజేసింది. కాని ఆమెకు ఇంటా బయటా శత్రువులున్నారు. కుట్రలు పన్ని ఆమెను రాజుకు దూరం చేశారు. ఆఫ్రాను పేదలు ఉండే చెరసాలలో బంధించి హింసించారు.

పునర్వైభవాన్ని రచనల ద్వారా సాధించాలని నిర్ణయించుకొంది. సహజ రచనా చాతుర్యం అలవడింది. తన సాహసాలను ప్రేరణనిచ్చేట్లు నాటకాలు రాసింది. దాదాపు పదిహేను నాటకాలు రాసింది. అందులో “రోవర్” బాగా క్లిక్ అయింది. మధ్య మధ్య కవితలూ నవలలూ రాసి మెప్పించింది. చిన్ననాటి స్మృతులను “ఒరనూకో”లో రాసుకొన్నది. అదొక బానిస కథ. ఫిలాసఫికల్ ఫిక్షన్. ప్రజాభిమానాన్ని ఎక్కువకాలం పొందలేకపోయింది. యాభై ఏళ్ళకే చనిపోతే వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో సమాధి చేసి గౌరవించారు. నాటకాలు ఆమెలో ఒక పార్శ్వాన్ని, కవిత్వం రెండో పార్శ్వాన్ని తెలియజేస్తాయి. మగాడిలాగా రాసిందన్నారు, కాని మించి రాసింది.

All women together, ought to let flowers fall upon the grave of Aphra Behn... for it was she who earned them the right to speak their minds... Behn proved that money could be made by writing at the sacrifice, perhaps, of certain agreeable qualities and so by degrees writing became not merely a sign of folly and a distracted mind but was of practical importance.



**అన్నే ఫించ్**

1661లో అన్నే కింగ్స్ మిల్‌లో అన్నే ఫించ్ – విలియం కింగ్స్ మిల్‌కు సౌత్ యాంప్టన్ వద్ద సిడ్ మాన్టాన్‌లో పుట్టింది. ఇరవై రెండో ఏట రాజదర్బార్‌లో మెయిడ్‌గా చేరింది.

కల్నల్ ఫించ్‌ను పెళ్ళాడింది. చిన్నప్పుడే కవిత్వం రాసింది. డ్రైడేన్‌ను, పోప్‌ను చదివి అర్థం చేసుకొంది. వీరిలా అతిగా పోకుండా రాసింది. ఆలోచనాత్మకంగా స్త్రీ వాదంగా రాసింది. హాయిగా తోటలో విశ్రాంతి పొందేది. పల్లె పట్టు సొగసుల్ని కవిత్వంలో ప్రతిఫలింపజేసింది. తాను అమితంగా ప్రేమించి ఇష్టపడిన చోటే అరవైలో చనిపోయింది. ఆమెను వర్డ్స్‌వర్త్ "ఏ నేచురల్ రేవేరీ" అని కీర్తించాడు. అందులో తాజా గ్రామీణ ఇమేజరీ ఉంటుంది. "If for a woman I would die", "The Ateist and the acorn" కవితలు స్నిగ్ధ మనోహరంగా ఉంటాయి. " If they re denied, I on myself can live - and slight those aids unequal chance can give - when in the sun my wings can be displayed - and in retirement I can bless the shade" అనేది ఆమె కవితల్లో ఒకటి. కింగ్ విలియంకు విధేయత ప్రకటించే ప్రమాణం చేయటానికి తిరస్కరించింది. హాయిగా జీవించినా కిందివారి దు:ఖాన్ని గురించి రాసింది. ఆమెను "మెలాంకలి వుమెన్" అన్నారు.

**చార్లెస్ సిడ్నీ**



1639లో రోచెస్టర్‌లో పుట్టిన చార్లెస్ సిడ్నీ వాదం కాలేజిలో చదివి "మెర్రి గాంగ్"లో చేరి రెండవ చార్లెస్ కాలంలో పనికిమాలిన రెండు ట్రాజెడీలు రాసి, కొద్దిగా నయం అనిపించినా, మూడు కామెడీలు రాసి కలకలం సృష్టించాడు. శ్రోతలకు వీనులవిందు చేశాడు. మంచి పాటలే రాశాడు.

**రిచార్డ్ లీ, ఆంబ్రోస్ ఫిలిప్స్, థామస్ పార్నెల్, జాన్ బ్రియాన్**

వీరి గురించి అప్పుడప్పుడు మాత్రమే చెప్పుకొంటారు. ముగ్గురూ 1649, 1675,1679లో పుట్టి 1779, 1718లలో చనిపోయారు. లీని "చిత్ర కవి" ఫిలిప్స్ రాసిన "ఈక్లోగ్స్" అప్పటి గొప్ప కవిత్వం అన్నారు. "నంబి పంబీ" అనే మారుపేరు.
డబ్లిన్‌లో పుట్టిన పార్నెల్ ఇలియడ్‌ను అనువాదం చేసి చనిపోయిన తర్వాత పబ్లిష్ అయి పేరొందాడు. ఓడ్స్, కథాత్మకాలు పవిత్ర కవితలు రాశాడు.



**షార్ట్ హాండ్ పిత – జాన్ బిరామ్**

జాన్ బిరామ్ 1692 – 1763వాడు. హైమ్స్ రాశాడు. పాస్టోరల్ రైమ్స్, దయాలిక్ట్ వెర్సెస్ రాశాడు. "ది యూనివర్సల్

ఇంగ్లీష్ షార్ట్ హాండ్" కనిపెట్టి మాంచెస్టర్‌లో బోధించాడు. లేఖా సాహిత్యంలో దూసుకుపోయాడు. "జర్నల్స్ అండ్ పేపర్స్"కు మంచిపేరు. ఇందులో ఆకాలంనాటి నిత్య జీవితాన్ని డైరీ లాగా రాశాడు. అంటాలజిస్టులు తప్ప అందరూ బ్రియాన్‌ను మర్చిపోయారు. అతని ఎపిగ్రం గుర్తింపు పొందింది. "God bless the king - I mean the faith's defender - god bless - no harm in blessing - our pretender - but who pretender or who is king? - god bless us all, that is quite a different thing" మచ్చుకు ఒకటి.

**జాన్ గే**



1685లో పుట్టి 1732లో చనిపోయిన జాన్ గ్రే విట్ ఉన్న కవి నాటకాలు, ఒపెరాలకు లిబర్టోలు, నీతి కథలు, జానపదాలు, పట్న కవితలూ, రాజకీయ సెటైర్లూ రాశాడు. బారన్ స్టేబుల్‌లో బీద వాడుగా పుట్టి పదేళ్ళకే అనాధ అయ్యాడు. మెట్రో పాలిటన్ జీవితంలో అడుగు వర్గాల దయనీయ స్థితిని స్వయంగా అనుభవించి చూసి చలించాడు. లంబన్‌లో సిల్క్ మర్చంట్ దగ్గర పనిచేశాడు. "ది ఆర్ట్స్ ఆఫ్ వాకింగ్ ది స్ట్రీట్స్ ఆఫ్ లండన్"లో ఆ నగర ఆనందం, విషాదాలను చూపించాడు. వీటినే నలభై ఏళ్ళ వయసులో "ది బెగ్గర్స్ ఒపేరా"లో రాస్తే, జాన్ రిచ్ దర్శకత్వం చేశాడు. దీనితో డబ్బు వచ్చింది. దాన్ని "Made rich Gay and Gay rich" అని చమత్కరించాడు. ఇందులో ప్రభుత్వాధికారుల మీద సెటైర్లు బాగా పడ్డాయి, పేలాయి. ప్రధాని సర్ రాబర్ట్ వాల్‌పోల్‌ను ఉద్దేశించి రాశాడు. అతని అవినీతి భాగోతాన్ని, చీకటి వ్యాపారాన్ని చీల్చి చెండాడాడు. హాన్డిలియాన్ ఒపేరా అవకతవకలు ఎండగట్టాడు. దీనికి సీక్వెల్ రాయాల్సి వచ్చింది. "పోలీ" రాశాడు. రాజకీయ కారణాలతో బాన్ చేశారు. అతని అదృష్టం డోలాన్దోలమానం అయింది. ఫేబుల్స్ కవితల్లో వచ్చిన డబ్బు అంతా అయిపోయింది. సౌత్ సీ స్కాండల్ అనే ఆర్ధిక దోషంపై చర్చ జరిగింది. కొద్దికాలమే జీవించినా సుఖపడ్డాడు. నలభై ఏడులో చనిపోయాడు. ఆరువేల పౌండ్ల నిలువ ధనాన్ని చనిపోయేటప్పటికి సంపాదించాడు. అతని ప్రాభవానికి వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో ఖననం చేసి గౌరవించారు.

"Life is a jest and all things show it - I thought so once and now I know it". మంచి కవిత. డ్రైడేన్, పోప్‌లంత క్రూరంగా రాయలేదు. "a satire without spite"గ రాయటం ఇతని ప్రత్యేకత. అతను రాసిన కవిత్వం అంతా నిరాపేక్షణీయ కవిత్వమే అన్నారు. పల్లెవాడైనా పట్నంలో గుర్తింపు పొందాడు.

**జోనాథన్ స్విఫ్ట్**



ఈ పేరు వినగానే గలివర్స్ ట్రావెల్స్ అందరికి గుర్తొస్తోంది. నిజానికి ఆయన కవి కాదు. 1667లో డబ్లిన్‌లో పుట్టి 1745లో చనిపోయాడు. తీవ్రమైన చురుకుదనం, భావోద్వేగాలతో రగిలిపోయాడు. జీవిత చరమాంకంలో కవిత్వం రాశాడు. డ్రైడేన్ కవికి కజిన్. తండ్రి చనిపోయిన తర్వాత అంకుల్ దయాదాక్షిణ్యాల మీద బతికాడు. ఇరవై రెండేళ్లకే ఇంగ్లాండ్‌లోని సర్ విలియం టెంపుల్ అనే దూర బంధువుకు సెక్రెటరి అయ్యాడు. టెంపుల్ తన కన్నా తెలివితేటల్లో తక్కువ వాడు. అంతేకాక అక్కడి స్ట్రిక్ట్ డిసిప్లిన్‌ను భరించలేకపోయాడు. ఏదో మంచి జరుగుతుందనే ఆశతో పదకొంగేళ్ళు అలానే లాగించాడు. లాభం లేదనుకొని ఐర్‌లాండ్ చేరుకొన్నాడు. డబ్లిన్‌లో సెయింట్ పాట్రిక్‌కు డీన్ అయ్యాడు నలభైలో. ఇక్కడా, లండన్‌లోనూ గడిపాడు కాలం. మత బోధ, రచనలు చేస్తూ ఉన్నాడు. అడిసన్ స్టీవ్, పోప్ మొదలైన ప్రముఖులతో పరిచయాలేర్పడ్డాయి. రాజకీయంగా కరపత్ర రచనలో దూసుకుపోయాడు. మతంలో విద్యా విధానంలో అవినీతిని బయటపెట్టాడు. ఐరనీతో అందరికి చెమటలు పట్టించాడు.

ఈస్తర్ జాన్సన్ అనే అమ్మాయిని చిన్నప్పటి నుండి ప్రేమించాడు. టెంపుల్ వద్ద ఆమె తల్లి సేవకురాలు. ఈ పిల్ల ఆయన పిల్లే అను పుకార్లు షికార్లు చేశాయి. ఈ అమ్మాయికి ట్యూటర్‌గా స్విఫ్ట్ ఉన్నాడు. ఐర్లాండ్‌లో స్థిరపడి ఆమెనూ డబ్లిన్‌లో ఉంచాడు. డబ్లిన్ వ్యాపారి కూతురు వెనిసాతో పీకల్లోతు ప్రేమలో పడ్డాడు. ఈస్తర్‌తో ప్రేమ, ఈమెతో సల్లాపాలు ఇబ్బంది పెట్టాయి. ఇద్దర్నీ మైంటైన్ చేశాడు. కొద్దిరోజుల్లో వేనేసా, మరో అయిదేళ్ళలో ఈస్తర్ మరణించారు. గలివర్స్ ట్రావెల్స్‌ను యాభైవ ఏట రాశాడు. అరవైలో తాను పతనం చెందుతున్నట్లు గ్రహించాడు. చెవుడు బాగా వచ్చి బాధించింది. ఇంకో పదేళ్ళు బతికాడు కాని గార్డియన్లు అవసరమైనారు. పెరాలిసిస్‌తో బాటు అఫెసియా జబ్బు వచ్చింది. డెబ్భై ఎనిమిదో ఏట చనిపోయాడు. తన సమాధిపై "Here lies Jonathan Swift - where savage indignation can no longer tear his heart" అని రాయించాడు. తన ఆస్తిని బుద్ధి మాంద్యులకు చికిత్స చేసే హాస్పిటల్‌కు రాశాడు.

"పోయిట్రీ – ఏ రాప్సడి"లో ఆయన ఐరని అంతా గుప్పించాడు. దీన్నే ఎప్పుడూ అందరూ ఉదహరిస్తారు. "So naturalists observe a flea - has smaller fleas that on him prey - and hese have smaller still to bite them - and so proceed ad infinitum". ఆయన కవిత్వంలో నిరాశ ఉండదు. "Little health he had - to build a house for fools and mad - and showed by one satiric touch - no nation wanted so much - that kingdom he

hath left his debtor - I wish it soon may have a better" అన్న కవిత చాలా ప్రసిద్ధం.

**మాథ్యూ ప్రయర్**



మాథ్యూ ప్రయర్ పెద్దగా పేరున్నవాడు కాదు. 1664లో పుట్టి 1721లో చనిపోయాడు. డ్రైడేన్ అనుయాయి. సమకాలీన పరిస్థితులపై వ్యంగ్యాత్మకంగా చెణుకులు రాశాడు. తండ్రి పోయిన తర్వాత లార్డ్ డారేట్స్ ప్రాపకం పొందాడు. అతనే వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో చేర్పించి చదివించాడు. కేంబ్రిడ్జిలో సెయింట్ జాన్ కాలేజిలో చేర్పించాడు. పదమూడేళ్ళప్పుడే ఓవిడ్, ఆరెస్‌లను అనువాదం చేసిన చిన్నారి పిడుగు. చార్లెస్ మాంటేగ్‌తో కలిసి డ్రైడేన్ రాసిన దాన్ని కథలుగా రాశాడు. కవిత్వం రాజకీయం రెండిటిలోనూ సవ్యసాచి అయ్యాడు. హాలండ్ రాయబారికి సెక్రెటరి హోదా వచ్చింది. పారిస్‌లో సీక్రెట్ ఏజెంట్‌గా నియమింపబడ్డాడు. టోరీలతో జత కలిపాడు. వారికోసం అనేక సమావేశాలు నిర్వహించి "ట్రీటీ ఆఫ్ అత్రేచ్ట్" శాంతి ఒప్పందం సాధించాడు. దీనికే అతని పేర "మాట్స్ పీస్" అని పిలిచారు.

అన్నే రాణి మరణం తర్వాత రాజకీయంగా బలపడే యత్నం చేశాడు. కాని తన్నింది. విగ్గులు జైల్లో పెట్టారు. రెండేళ్ళ తర్వాత విడుదలయ్యాడు. కంచే బాగు చేయటం, సంపద వృద్ధి చేయటంలో కృతకృత్యుడైనాడు. యాభై నాలుగులో అతని మొదటి కవితా సంపుటి "పోయెమ్స్" వెలువడింది. రచన లాభసాటి అని గ్రహించాడు. అమ్మకాలు చేస్తే నాలుగు వేల గినియస్లు లభించాయి. ఇదీ లార్డ్ హార్లీ ఇచ్చిన నాలుగు వేల పౌన్లూ కలిపి ఎస్సెక్స్‌లో డౌన్ హాల్ కొన్నాడు. అందగాడు కాకపోయినా మంచితనంతో స్నేహితుల్ని పొందాడు. పదహారవ లూయీ స్నేహితుడైనాడు. ఒకసారి ఆయన్ను రాజు వేర్సైల్స్ లాగా చిరస్మరణీయవి ఏవైనా ఏర్పరచాడా అని అడిగితే "Monuments of my master's actions are to be seen every where except in his own house" అని రాయబారిగా ఉన్నా చమత్కరించాడు.

దాదాపు అన్ని ప్రక్రియలలోనూ ప్రయర్ రచన చేశాడు. లాంగ్ సాలిలోక్వీ కప్లేట్స్, సెటైర్స్, వ్యాసాలూ, బాలడ్స్‌లను రాశాడు. సద్యో కవితలు చెప్పాడు "Be to her virtues very kind - be to her faults a little blind" అన్న కవిత పేలింది. గుర్తుండిపోయే కవిత్వం రాశాడు. తనను గురించి "nobles and heralds by tour leave - here lies what once was Mathew prior - the son of Adam and Eve - can Bourbon or Nassau claim higher?".



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 26

# పొట్టివాడైనా గట్టివాడు - అనధికార ఆస్థాన కవి - అలేక్సాండర్ పోప్

"విషం కక్కే పాలీడు" అని సమకాలీనులు అన్నా, శారీరక వంకర్లున్నా, మానసిక వక్రత ఉన్నా, ఈనాడు అలేక్సాండర్ పోప్ కవి ఆరాధింపబడుతూనే ఉన్నాడు. "కోల్డ్ బ్లడెడ్ టెక్నీషియన్" అని పేరు. తెలివిగల వ్యాసకర్త, తమాషా రైమ్స్‌తో కవిత్వాన్ని పండించినవాడు. కాలాతీత కవిత్వాన్ని సృష్టించాడని ఇరవయ్యవ శతాబ్ది విమర్శకుల అభిప్రాయం. " One of the greatest poets of our poets who is in his two finest poems perhaps the most flawless artist of our race has produced" అని ఎడిత్ సిట్వేల్ చేత ప్రశంసింపబడ్డాడు. ఆయన రచనలు అనేక ఆలోచనలకు పదశోకం. షేక్స్‌పియర్ తర్వాత తరచుగా ఉదహరింపబడే కవి. "To err is human to forgive is divine", "A little learning is a dangerous thing", "fools rush where angels fear to tread", "men must walk before they dance" మొదలైనవి అందరూ తరచుగా ఉదాహరించేవే.

అలేక్సాండర్ పోప్ లండన్‌లో 22-05-1688న జన్మించాడు. ముసలి తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. తండ్రి లినెన్ డ్రేపర్. చిన్నప్పుడు కుర్రాడు బానే ఉండేవాడు. కాని చిన్ననాటే జబ్బుకు గురై ఆరోగ్యాన్ని కోల్పోయాడు. మళ్ళీ పూర్వ ఆరోగ్యాన్ని పొందలేదు. ఒక పొందలేదని కూడా రూఢి అయింది. పూర్తిగా ఎదగక పొట్టివాడుగానే ఉండిపోయాడు. డొక్క లోపలికి పోయి యూనివర్సిటీలలో చదవలేదు. సామాన్య కుటుంబంలో పుట్టటం వలన అన్నిటికి దూరమైనాడు. జీవితాంతం బాధించిన ఆ వ్యాధియే అన్నిటికీ కారణమైంది. విధి వక్రించింది ఒక రకంగా. పదేళ్ళ వయసులో గ్రీక్, లాటిన్‌లను అనువదించిన మేధావి. పన్నెండుకు హోరేస్ రాసిన సాలిట్యూడ్‌కు పారా ఫ్రేజ్ రాశాడు. అది ఇప్పటికి గొప్ప

ఆంథాలజిగా గుర్తింపు పొందుతోంది. ఒక మహా కావ్యాన్ని "అలేక్సాండర్ ప్రిన్స్ ఆఫ్ రోడ్స్" పేరిట రాయటం ప్రారంభించాడు. ఇందులో తాను అభిమానించిన అందరి కవుల ఛాయలూ ఉన్నాయి. ముఖ్యంగా వర్జిల్, హోమర్ లంటే వీరాభిమానం.

లండన్ నుంచి కుటుంబం విన్‌స్టర్ ఫారెస్ట్‌లోని బిన్ ఫీల్డ్‌కు మారినప్పుడు ఈ కావ్యం మొదలెట్టాడు. దాన్ని తగలబెట్టేశానని చెప్పాడు. కాని పన్నెండు పదిహేనేళ్ళ మధ్య దాన్ని మళ్ళీ రాసిన వెలుగులోకి తెచ్చాడంటే పొట్టోడు గట్టోడే అనిపిస్తుంది. అందుకే "జయింట్ డ్వార్ఫ్" అన్నారు.

పద్నాలుగో ఏట "ఆన్ సైలెన్స్", "అపాన్ నతింగ్"లు రాశాడు. పదహారులో వరుస "పాస్టోరల్" పోయెమ్స్ రాశాడు. ఇవి వ్రాతప్రతులుగా అందుకొన్న వాల్ష్, జార్జి గ్రాన్ విల్లీ వంటి వారిని మెప్పించాయి. "ఒక అజ్ఞాత మహా మేధావి అడవిలో మగ్గుతున్నాడు" అనుకొన్నారు. ఇలాగే విజృంభించి రాస్తే అందర్నీ మించిపోయే మహాకవి అవుతాడని మురిశారు. ఇది తెలిసిన జాకబ్ తాన్సన్ అనే ముద్రాపకుడు వాటిని ముద్రిస్తానని ముందుకొచ్చాడు. అతనిలో మహా పాండిత్యం, కవితా ప్రతిభా ఉన్నాయని గ్రహించాడు. వాటి ముద్రణతో పోప్ గొప్ప కవి అయిపోయాడు ఇరవైకే. ఇందులో పోప్ గొర్రెల కాపర్లు లండన్ వాసుల్లా మాట్లాడి ఆశ్చర్యపరుస్తారు. ఒకే రైంను కొన్ని పంక్తుల్లో వాడాడు. చెవికి ఇంపైన పదజాలంతో అతనొక మాటల సృష్టికర్త అయ్యాడు. ఇరవై రెండో ఏట "ఎస్సే ఆన్ క్రిటిసిజం" రాశాడు. ఇందులో భాషలో, భావంలో, శబ్ద కూర్పులో, హొయల్లో, లయలలో ఆయన పోకడలు అనంతం. ఇది "పోయెం ఆఫ్ ది పీరియడ్"గా గుర్తింపు పొందింది. సరి అయిన విద్య నేర్వాలని హెచ్చరించాడు. కొత్తదనం కోసం పాకులాడవద్దన్నాడు. కొత్తొక వింతా, పాతొక రోత అనే భావం వదిలెయ్యమన్నాడు. "Fear not the anger of the wise to raise those best can bear reproof who merit praise" అని బోధించాడు.

"His life is had been no longer than one of his poems - the life of half a day" అని కొందరు ఊసడించారు. అతని శారీరక అవలక్షణాన్ని అవహేళన చేయటంతో ఆ ఇరవై మూడేళ్ళ యువకుడు మానసికంగా కుంగిపోయాడు. కాని ఎక్కడా బయట పడలేదు. కాని లోలోపల కుములుతున్నాడు. తన బాధను ఒక కవితలో "గే కవి"కి చెప్పుకొన్నాడు. యాభైలో ఎవరో ఒకరి సాయం లేకపోతే నిలబడగలిగే వాడుకాదు. దీన్ని జాన్సన్ ఎద్దేవా చేశాడు. బట్టలు మార్చటం కూడా ఎవరో చేయాల్సిందే. ఎప్పుడూ ఒక సేవకుడు ఉండాల్సి వచ్చేది. నరక యాతన అనుభవించాడు. దీనికి తోడూ సూటిపోటి మాటలు. ఆయనకు తెలియకుండా జోనాథన్ స్విఫ్ట్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రింట్ చేశారు. స్విఫ్ట్ గ్రహించి తనకు పోప్ రాసినవి తిరిగి పంపించేశాడు. ఇలా ఆ "కురచ

మహాకవిని" అన్ని విధాలా అవహేళన చేశారు. ఇందులో పోప్ స్వయం కృతాపరాధమూ లేకపోలేదు.

ఎంతోమంది స్త్రీలతో తిరిగాడంటారు. అందులో తెరెసా, మార్తా బ్లౌంట్ అనే సిస్టర్స్ ఉన్నారు. ఇందులో ఒకరు ఆయన అర్ధాంగి అయి ఉంటారని ఊహాగానం. అనుమానాలకు తావు ఇవ్వటం పోప్ లక్షణం కూడా. లేడీ మాంటేగ్‌తో తగాదా పడ్డాడు. ఆమె చేసిన అవమానాన్ని మర్చిపోలేకపోయాడు. ఒకదాని వెంట ఒకటి కవితలు గిలికిపారేశాడు. ఆమెకున్న మర్మావయవ జబ్బును అందరికి అంటించింది అని కూడా. "ది రోప్ ఆఫ్ ది లాక్"లో అనేక అసందర్భాలున్నాయి. "ది ఎపిసిల్ టు డాక్టర్ ఆర్బత్ నాట్"ను నలభై ఆరో ఏట ప్రచురించాడు. పోప్ కంటే పాతికేళ్ళు పెద్ద వాడైన ఆర్బర్త్ నాట్ "ద్వేషం వదిలేయి. మానవ ప్రకృతిలోని మంచినీ, నీతినీ గురించి ఇకనుంచైనా రాయి" అని సలహా ఇచ్చాడు. అది తన మంచికోసమేననీ చెప్పాడు. దీనితో పోప్ కళ్ళు తెరుచుకొన్నాయి. కొత్త భావాలు, ఆలోచనలు, దర్శనాలతో కవిత్వం దారి మళ్ళింది. వ్యక్తిగత ద్వేషాన్ని దూరం చేసుకొన్నాడు. "ఎపిజిల్స్"లో తన నూతన పోకడలు చూపాడు కాని లోపల లార్డ్ హీర్వీపై ద్వేషం వదలలేదు.

పోప్ అనువాదం చేసిన ఇలియడ్ ప్రచురణతో ఆర్ధికంగా పుంజుకొన్నాడు. ఒక్కోదానికి గినియా రేటు పెట్టాడు. ఆరు వందల మంది కొన్నారు. రాజు రెండు వందల పౌండ్లు కానుక ఇచ్చాడు. ఆరుగురు అసిస్టెంట్‌లతో ఆ అనువాదాన్ని ఆరేళ్లలో పూర్తిచేశాడు. అయిదు వేల పౌండ్ల ధనాన్ని చేకూర్చింది ఇది. దీనిపై విమర్శలొచ్చాయి. ఇది హోమర్ రచనలా లేదన్నారు. ఇవేవీ పోప్‌ను ఆపలేకపోయాయి. ఆ కాలపు "సాహిత్య మార్తాండుడే" అయ్యాడు. దీని తర్వాత "ట్వికెన్ హాం"కు మకాం మార్చాడు. చిన్న ఇల్లు, తోట ఏర్పాటు చేసుకొన్నాడు. స్విఫ్ట్ వచ్చి ఇక్కడ కొంతకాలం ఉన్నాడు. పోప్‌ను గురించి "Pope has the talent well to speak - but not to reach the ear his loudest voice is low and weak - the Dean too deaf to hear" అని స్విఫ్ట్ తన అనుభవాన్ని గురించి రాశాడు. ఒడిస్సీకి పోప్ రాసిన మూడు భాగాల పుస్తకాలు అప్పుడే పబ్లిష్ అయ్యాయి. నాలుగు అయిదు భాగాలు ఏడాది తర్వాత వచ్చాయి. "The story is Homer's but the accent is Pope's" అన్నారు. ఇరవై నాలుగు భాగాలలో అయిదు తప్ప మిగిలినవన్నీ పోప్ ట్రాన్స్‌లేట్ చేశాడు. నిజానికి ఆయన చేసినవి పన్నెండు మాత్రమే. మిగిలిన వాటికి పర్యవేక్షణ చేశాడు.

నలభైలో "ది డంసియాడ్" అనే స్వీయరచన ప్రారంభించాడు. ఇందులో పగా, ద్వేషం పరాకాష్టలో ఉంటాయి. యాభై ఒకటిలో దైవం మానవుడు అనే విషయాల మీద

రాయాలని ఉందని జాన్ కార్థెల్‌కు రాశాడు. "ఎస్సే ఆన్ మాన్" రాశాడు. దీన్ని ముద్రించిన తర్వాత అయిదేళ్ళు సెటైర్స్ వగైరా రాశాడు. "డి వర్క్స్ ఆఫ్ అలేక్సాండర్ పోప్" ముప్ఫైవ ఏటనే ముద్రించారు. రెండో భాగం నలభై ఏడులో దీనితోపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు అచ్చయ్యాయి. సన్నిహితురాలైన మార్తా బ్లాంట్‌కు చివరి ఉత్తరం మార్చ్‌లో రాశాడు. రెండు నెలల తర్వాత 30-05-1744లో "మరుగుజ్జు మహాకవి" మరణించాడు. డాక్టర్‌ను తన ఆరోగ్యం ఎలా ఉంది? అని అడిగాడు చనిపోయే ముందు. బాగుందని వాళ్ళు అంటే "Here I am dying hundred good symptoms" అని తన చావు దగ్గర పడిందని చెప్పాడు. రోమన్ కేథలిక్ చర్చి విధానంలో అంత్యక్రియలు చేశారు. చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్, చర్చ్ ఆఫ్ సెయింట్ మేరీ ది విర్జిన్ ఆఫ్ ట్వింకిల్ హాంలలో సమాధి చేశారు.

"Pope was an accurate recorder of a society that flourished on cliques and intrigues and countless subterfuges to this society Pope was a victim and mocking contributor. He was also un acknowledged laureate. It is a poetry that speaking almost entirely to the disillusioned intelligence, springs from the dischanted mind - a saddened but a cynical mind, aware that while men's machanations may make for ignoble living, they also make entertaining and sometimes enduring literature" అని పోప్‌ను అతని కవిత్వాన్ని అంచనా వేశారు.

హీరోయిక్ కప్లేట్స్‌లో సుప్రసిద్ధుడు. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో పోప్‌ను అనేక మార్లు షేక్స్పియర్, టెన్నిసన్‌ల తర్వాత ఉదాహరించారు. బైబిల్ సంస్కృతికి ప్రతిబింబంగా ఉన్నాడు. స్త్రీ భావవ్యతిరేకి అని స్త్రీ వాద రచయితలు భావించారు. ✺



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 27

# సొగసు లాలిత్యాల పతనం

**ప**ద్దెనిమిదో శతాబ్ద సాహిత్యం కృత్రిమం, వక్రం, పదాడంబరం అనే పేరు తెచ్చుకొంది. పోప్ కాలం అంతా వ్యక్తిగత కవిత్వానికే ప్రాధాన్యమైపోయింది. గొడవలు, మనస్పర్ధలే రాజ్యం చేశాయి. కాని వీటికి విరుద్ధంగా కవిత్వంలో మరో పాయ ప్రవహించింది. గ్రామీణ ఇంగ్లాండ్ పుష్ప, ఫలభరితమై పంటల కాలవాలమైంది. వీటి అందాలను కవిత్వంలో నింపారు కవులు. అలాంటి వారిలో మాథ్యూ గ్రీన్ జేమ్స్ థామ్సన్, థామస్ గ్రే, జాన్ డయ్యర్, విలియం కాలిన్స్, విలియం కూపర్. మారుతున్న పల్లె స్థితిగతులను ఆలివర్ గోల్డ్ స్మిత్, జార్జి క్రాబిల్‌లు ఆవిష్కరించారు. క్రిస్టోఫర్ స్మార్ట్, థామస్ చాటేర్టన్, కొంత పట్న వాసనను పల్లె కవిత్వానికి అంటించారు. రాబర్ట్ బర్న్స్ పాటలు విలియం బ్లేక్, విజన్ మరికొంత మార్పును చూపాయి. రెండో తరహా కవులు సామ్యూల్ జాన్సన్, చార్లెస్ చర్చిల్‌లు మాత్రం పోప్ తరహా కవిత్వాన్నే అనుసరించారు. హీరోయిక్ కప్లేట్స్ రాశారు. భావాలను వృద్ధి చేసి కవిత్వ విధానంలో మార్పులు చూపారు. ఈ ప్రయత్నాలు, కొత్త పోకడలు, రీతి ఉన్నా కన్సర్వేటివ్ మనస్థత్వం ఉందని ఇలియట్ అన్నాడు.

**సాహిత్య షరాబు, నిఘంటు నిర్మాత – సామ్యూల్ జాన్సన్**



కవిగా గుర్తింపు లేకపోయినా అసలు కవే కాకపోయినా సామ్యుల్ జాన్సన్ ఆగస్టన్ కాలంలో విశేష ప్రాభవం ఉన్న వ్యక్తి. వ్యాసకర్త, జీవిత చరిత్రకారుడు, లెక్సికో గ్రాఫర్, విమర్శకుడు, గొప్ప సంభాషణా చతురుడు. 17-09-1709లో శాఫోర్డ్ షైర్‌లోని లిచ్ ఫీల్డ్‌లో జన్మించాడు. తండ్రి పుస్తక వ్యాపారి. బాల్యం బాలారిష్టాలతో గడిచింది. నాలుగేళ్ళప్పుడు "కింగ్స్ ఈవిల్" అనే జబ్బు సోకి, రాజుగారి

హస్త స్పర్శతో తగ్గుతుందనే నమ్మకంతో లండన్‌కు తీసికెళ్లారు. అన్నే రాణి చేయాల్సింది అంతా చేసింది కాని గుణం కనిపించలేదు. ఆ జబ్బుతోనే జీవితాంతం బాధపడ్డాడు. కంటిచూపు తగ్గిపోయింది. ఇన్ని అవరోధాలెదురైనా స్వయంగా విజ్ఞాన సముపార్జన చేశాడు. అతని జ్ఞాపకశక్తి అసాధారణం. గ్రామర్ స్కూల్‌లో లాటిన్ నేర్చాడు. పందొమ్మిదిలో ఆక్స్‌ఫర్డ్‌లోని పెంబ్రూక్ కాలేజిలో చేరి, ఒక ఏడాది చదివి ఆర్థిక ఇబ్బందులతో మానేశాడు. అతని బూట్లు చిరిగిపోయి పాదాలు బయటపడేవి. కొత్తవి కొనుక్కోలేనంత నిర్భాగ్యుడు.

రెండేళ్ళ తర్వాత తండ్రి మరణంతో ఆయన ఇచ్చిన ఇరవై పౌండ్లతో జీవించాల్సి వచ్చింది. మార్కెట్ బాస్ వర్త్‌లోని ఒక స్కూల్‌లో టీచర్‌గా చేరి పొట్ట పోసుకొన్నాడు. బిమ్మింగ్ హాం జర్నల్‌కు రాస్తూ కాస్తో కూస్తో సంపాదిస్తుండేవాడు. అక్కడి పుస్తక వ్యాపారి జాన్సన్ మొదటి పుస్తకం "ఏ ఒడ్ టు అబిసీనియా"ను ప్రచురించాడు. ఇరవై ఆరో ఏట ఎలిజబెత్ పోర్టర్‌ను పెళ్లి చేసుకొన్నాడు. ఆమె ఇతని కంటే ఇరవై ఏళ్ళు పెద్దదైన వితంతువు. ఇద్దరు కలిసి బోర్డింగ్ స్కూల్ నడిపారు. ఏడాదికే మూతపడింది. జాన్సన్ లండన్ చేరి అక్కడే ఉండిపోయాడు. చూడటానికి అందంగా ఉండేవాడు కాదు. కోపం, ఉద్రేకం, సరైన వస్త్రధారణ లేకపోవటం, తీవ్ర స్వభావం జాన్సన్ బాహ్య లక్షణాలు. సన్నగా అస్థిపంజరంలా ఉండేవాడని శిష్యుడు బాస్వేల్ గురువును వర్ణించాడు. ఒక కంటితోనే చూడగలిగేవాడు. అవయవాలను స్వేచ్ఛగా కదిలించగలిగేవాడు కాదు. కాని మానవత్వం ఉన్నవాడు. న్యాయ ధర్మాలతో సంచరించేవాడు. సాహిత్యాన్ని బేరీజు వేసి తూచి నాణ్యతను నిగ్గుతేల్చే గొప్ప సమర్థత ఉన్న షరాబు. ప్రతి సాహిత్యకారుడి మీదా జాన్సన్ ఏం చెప్పాడు అని అందరూ ఎదురు చూసేవారు.

"ది జెంటిల్ మాన్స్ మేగజైన్" ప్రింటర్ పబ్లిషర్ ఎడ్వర్డ్ కేవ్ – జాన్సన్‌కు ఉద్యోగం ఇచ్చాడు. అందులో పనిచేస్తూ వ్యాసాలూ, స్కెచ్‌లు, కవితలు, పార్లమెంటరీ చర్చలపై రిపోర్టులు రాశాడు. వినపడని వాటిని స్వయంగా సందర్భానికి తగినట్లు కూర్చి రాసేవాడు. జువేనాల్ రాసిన "మూడవ సెటైర్" పారా ఫ్రేజ్ రాశాడు. తర్వాత "వానిటీ ఆఫ్ హ్యూమన్ విషెస్" పదకొండేళ్ళ తర్వాత రాశాడు. అతని కామెంటరీలన్నీ లాటిన్ పదజాలంతో, బైబిల్ సూక్తి ముక్తావళితో ఉండేవి. ఒక సమగ్ర డిక్షనరీ తయారు చేయాలనే కోరిక కలిగి దానికి తగిన ప్రణాళిక తయారు చేసి లార్డ్ చెస్టర్ ఫీల్డ్‌కు సమర్పించాడు. యేళ్ళు గడిచినా దానిపై రాజు స్పందించలేదు. నిర్లక్ష్యానికి బాధపడ్డాడు. అనుమతి లేకపోయినా మొదలుపెట్టాడు. పూర్తిచేశాడు. దీనిమీదా రాజు పెద్దగా దృష్టిపెట్టలేదు. విసిగెత్తి విన్నపాలుగా జాబులు రాశాడు. కావాలనే రాజు అలా చేశాడని గ్రహించాడు.

జాన్సన్ అదృష్టం దోబూచులాడింది. "ఐరీన్" పేర రాసిన బ్లాంక్ వేర్స్ ట్రాజెడీని గార్రిక్ అనే శిష్యుడు ప్రదర్శించాడు. దీనికి రెండు వందల పౌండ్లు మాత్రమే వచ్చాయి.

ట్రాజెడీ ట్రాజెడీనే మిగిల్చింది. "రాసీల్స్ – ప్రిన్స్ ఆఫ్ అబిసీనియా" నవల రాశాడు. దీన్ని ఓల్టైర్ రాసిన "కాండిడ్"తో పోల్చారు. మూడవ జార్జి అధికారంలోకి వచ్చిన తర్వాత జాన్సన్‌కు ఏడాదికి మూడొందల పెన్షన్ ఏర్పాటు చేశాడు. ఆర్థిక స్థితి బాగుపడింది. షేక్స్‌పియర్ నాటకాలను ఎనిమిది పుస్తకాలుగా పూర్వపువారి కామెంటరీలననుసరించి తెచ్చాడు. అందులో జాన్సన్ సామర్థ్యం తక్కువేనన్నారు. చివరి రచనగా "లైవ్స్ ఆఫ్ ది పోయెట్స్"ను డెబ్బైవ ఏట రాయటం ప్రారంభించాడు. అదే వ్యాపకంగా జీవించాడు. రెండు వందల గినీలొచ్చాయి. అతని జ్ఞాపకశక్తి మేధా కూర్పు అనితర సాధ్యమనిపించాయి. రెండు వందల ఏళ్ళపాటు అదే కవుల జీవితాలకు కరదీపికగా నిలిచింది. కవుల జీవితం కవిత్వం అందులోని సొంపులు ఇంపులు విమర్శనాత్మకంగా రాశాడు. సత్యాన్వేషణలో ఎవరినీ వదలలేదు. "Undisputed leader of thought for a century - a writer whose prodigious reputation surpassed his output" డెబ్బై అయిదేళ్ళ వయసులో 13-12-1784న జాన్సన్ మరణించాడు. వెస్ట్ మినిస్టర్ అబ్బేలో సమాధి చేశారు.

జాన్సన్ రాసిన చిన్న కవితలలో మెరుపులు లేవు గుర్తుండిపోయేవీ కావు. "రాసిలాస్"లో జాన్సన్ "The business of a poet examine not the individual but the species - to remark general properties and large appearences. He does not number the streaks of the tulip or describe the different shades of verdure of the forest" అని భాష్యం చెప్పాడు. సాహిత్యంలో జీవితచరిత్రలకు తెరదీసిన వాడు జాన్సన్. రాసి తక్కువైనా వాసి ఎక్కువ అనేట్లు కవిత్వం రాశాడని కొందరి అభిప్రాయం. "క్రిటిక్కుల క్రిటిక్" అన్నారు.

**వ్యంగ్య కవి చార్లెస్ చర్చిల్**



చర్చిల్ "కవిత్వం ఏవగింపు" అన్నాడు సామ్యుల్ జాన్సన్. చర్చిల్ కవిత్వం తాత్కాలికానందాన్నిస్తుందని శిష్యుడు బాస్వేల్ అంటాడు. సమకాలీనులను ఆశ్చర్యచకితుల్ని చేశాడు చర్చిల్. ఒక క్లెర్జిమన్‌కు 1732లో పుట్టిన చర్చిల్ వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో చదివి కేంబ్రిడ్జి సెయింట్ జాన్ కాలేజిలో చదివాడు కాని మెట్రిక్ కూడా పాస్ కాలేదు. బాకీ ఉన్న డబ్బులు కవిత్వం రాసి తీరుస్తానన్నాడు. "అపాలజీ" రాసి వెయ్యి పౌన్లు ఆర్జించాడు. భార్యనొదిలేసి కనపడిన అందరితో కులికాడు. ఒక వ్యాపారి కూతురికి లైన్ వేసి కొంపలో కూర్చోబెట్టాడు. ముతక కవిత్వం గిలికాడు. "ది ప్రాఫెసీ ఆఫ్ ఫామిన్" రాసి కొంచెం కదిల్చాడు జనాన్ని. జనం మర్చిపోయిన కవుల్లో చర్చిల్ ఒకడయ్యాడు. ముప్పై రెండులో

ఒక ప్రయాణంలో ఆక్సిడెంట్ వలన 04-11-1764లో చనిపోయాడు. 1763లో రచనలు ముద్రింపబడ్డాయి.

### గ్రీన్, డయ్యర్, థామస్

ప్రయోజనకరమైన కవిత్వాన్ని రాసిన వారిలో మాథ్యూ గ్రీన్ ఉన్నాడు. 1697లో పుట్టి 1737లో చనిపోయాడు. లండన్‌లో పుట్టి అదే ప్రపంచంగా బతికాడు. మర్యాదపూర్వక కవితలల్లాడు. క్వేకర్స్ కోసం "ది సీకర్", "అపాలజీ ఫర్ క్వేకర్స్" రాశాడు. ఒకరకంగా క్వేకర్ కవి.

### ఉన్ని కవి - జాన్ డయ్యర్ వేల్స్



1699 - 1744వాడు. ఇటలీలో పెయింటింగ్ కోర్సు చదివాడు. ప్రకృతి దృశ్యాలను చిత్రకారుడి దృష్టితో చూశాడు. కవిత్వం సాహిత్య భ్రాంతితో వుంటుందని అన్నారు. ప్రతి నామ వాచకానికి విశేషణం ఉంటుంది. క్లేర్జిమన్ అయిన డయ్యర్ పరిశీలనను నీతి బోధనాన్ని చేర్చి మనిషికోసం రాశాడు. విషయాన్ని వాస్తవ దృష్టితో చూసి కవిత్వం రాశాడు. ఏడు వందల లైన్‌ల "ఫ్లీస్" రాశాడు. ఇది వర్జిల్ రాసిన జిఆర్జిక్స్‌లా ఉంటుంది. ఉన్ని నేత విషయమే ఎక్కువ. మగ్గాల ధ్వనుల్ని పసికట్టి కవిత్వంలో చోటు కల్పించాడు. మాంచెస్టర్, చెస్ ఫీల్డ్‌లకు వృత్తికి ప్రతీకలివి. "The cries of sorrow sadden all the streets - and the disease of intemperature wealth" అను ఉన్ని వృత్తిలో వారి కష్టసుఖాలన్నీ కళ్ళకు కట్టించాడు. "ఉన్ని కవి" అనిపిస్తాడు. "గ్రాన్గేర్ హిల్" అనే ప్రసిద్ధ కవితలో పట్నవాస కవిత్వంలోని డొల్లతనాన్ని చూపాడు. సూక్తి ముక్తావళి లాంటి కవిత్వాన్ని రాశాడు.

### జేమ్స్ థామ్సన్



బ్రిటన్ జాతీయ గీతాన్ని రాసిన జేమ్స్ థామ్సన్ 1700లో పుట్టి 1748లో మరణించిన స్కాట్‌లాండ్ కవి. ఎడిన్ బర్గ్ యూనివర్సిటిలో చదివి చర్చి మినిస్టర్‌కు సెలెక్ట్ అయి మనసు మార్చుకొని లండన్ చేరి పోప్ సర్కిల్‌లో చేరి, పోషకుల వలన ఇటలీ, ఫ్రాన్స్‌లు తిరిగి ఫ్రాన్స్‌లో లార్డ్స్ చాన్స్‌లర్ కొడుకుకు ట్యూటర్ అయ్యాడు. డ్రామటిస్ట్‌గా

విజయ దుందుభి మోగించి లండన్ తిరిగి వచ్చాడు.
గ్రామీణ రిచ్‌మాండ్‌లో కాపురమున్నాడు. అయిదు ట్రాజెడీలు రాశాడు. టెన్ సిలిబిల్ బ్లాంక్‌వేర్స్‌ను వాడాడు. "ఓ సోఫియా సోఫియా" అనే దీర్ఘ ఎలిగరి కవిత రాశాడు. "ది కాజిల్ ఆఫ్ ఇండోలేసేన్స్", "ఆల్ఫ్రెడ్"లు కూడా రాసి మెప్పించాడు. ఆల్ఫ్రెడ్‌లో బ్రిటన్ జాతీయ గీతం ఉంది. ప్రకృతిని ప్రేమిస్తూ చాలా రాశాడు. దీర్ఘకవితల్లో బ్లాంక్ వేర్స్‌నుపయోగించాడు. కొత్త పరిశోధనలపై కవిత్వం రాసి అంతకు ముందెవరూ చేయని సాహసం చేశాడు. శరదృతువులో జాబిలి అతనికి "Week and blunt is wide refracted rays"లా కనిపించింది. "ది సీజన్స్"లో పెద్దగా సంచలనాత్మకమైన విషయాలు లేవు. కాని ఆ పంక్తులలో సంగీతవ మనసుకు హాయినిస్తుంది. ఆ తరం కవులలో ఎవరికీ అబ్బని ఈ సంగీత గుణం థామ్సన్ కవిత్వంలో చేరి బంగారానికి తావి అబ్బినట్లయింది. దీనికి జెర్మనీ అనువాదం ప్రపంచ ప్రసిద్ధమైంది. థాంసన్ మరణంపై జాన్సన్ స్పందిస్తూ "By taking cold on the waters between London and Kew, he caught a disorder which careless exasperation ended in a fever that put end to his life" అన్నాడు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 28

# విలియం కాలిన్స్

**వి**లియం కాలిన్స్ విషాద గీతాల కవి. 1721న పుట్టి 1759లో చనిపోయాడు. ఇతని జీవితం కూడా విషాదాంతమే. చివర్లో మతిస్థిమితం కోల్పోయాడు. లీసేస్టర్‌లో టోపీల వ్యాపారి కొడుకు. ఆక్స్‌ఫర్డ్‌లో మాగ్దలీన్ కాలేజిలో చదివాడు. "పెర్షియన్ కలోగ్స్"ను డిగ్రీ చదువుతూనే రాశాడు. పదమూడేళ్ళ వయసులో మొదటి సంకలనం పబ్లిష్ చేశాడు. ఇరవై ఆరులో "హౌ స్లీప్ ది బ్రేవ్" రాశాడు. ప్రతిభావంతుడైన కవి అనిపించాడు. చర్చి, సైన్యంలలో దేనిలో చేరాలో తెలీక ఊగిసలాడాడు. ఇరవై ఎనిమిదిలో చేతిలో దమ్మిడీ లేని స్థితి. ఒక అంకుల్ ఆదుకొన్నాడు. ముప్ఫైలో ఉన్మాదం వచ్చింది. చివరి తొమ్మిదేళ్ళు మానసిక ఆందోళన, శారీరక రుగ్మతలతో బాధపడ్డాడు. ఆక్స్‌ఫర్డ్‌లో శరణాలయంలో ఉన్నాడు. ఎవర్నీ చూడటానికి ఇష్టపడలేదు, చనిపోయినా ఎవరికీ తెలియలేదు. ఏ పేపర్లోనూ అతని చావు వార్త రాలేదు. "దిర్జీ అండ్ సిండలిన్" మాత్రం అందర్నీ ఆకర్షించింది. ఇది స్వీయచరిత్ర. విషాదంగా సాగుతుంది. మంచి భావుకత ఉన్న కవి.

**విలియం కూపర్**



ఈ ప్రపంచ దుస్థితికి కుంగి కాలిన్స్‌లానే పిచ్చి వాడైన విలియం కూపర్ 26-11-1731లో బెర్కామ్స్ స్టెడ్‌లో పుట్టాడు. అసూయ అతన్ని తోటివారికి దూరం చేసింది. బోర్డింగ్ స్కూల్‌లోనే అందరూ ఏడిపించేవారు. వెస్ట్ మినిస్టర్ చేరాడు. సొలిసిటర్‌కు సహాయకుడిగా ఉన్నాడు. మిడిల్ టెంపుల్‌లో బార్‌లో చేరాడు. ఒక కజిన్‌ను ప్రేమించి భంగపడి దెబ్బ తిన్నాడు. కొద్దిగా ప్రాక్టీస్‌లో ఉండగా తోటి లాయర్ల ఈసడింపుకు గురై రెండోసారీ దెబ్బతిన్నాడు.

నరాల బలహీనత మరీ కుంగదీసింది. తరచూ డిప్రెషన్‌కు లోనయ్యేవాడు. ముప్ఫై రెండులో హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో గుమాస్తా ఉద్యోగం వస్తే చేరాడు. అక్కడ చేయాల్సిన పని చూసి మనస్థిమితం కోల్పోయాడు. చావాలని ప్రయత్నిస్తే శరణాలయంలో చేర్చారు. పద్దెనిమిది నెలల తర్వాత బయటికొచ్చాడు. హంటింగ్ హోం చేరాడు. మొరాలియన్ అన్విన్ దంపతులు ఆదరించారు. రెండేళ్ళ తర్వాత మొరాలి గుర్రపు సవారిలో కిందపడి చనిపోతే కూపర్ బకింగ్‌హాం షైర్‌లో ఒల్నీకి చేరాడు. మేరీ అతని వెంట ఉండి జాగ్రత్తగా కనిపెట్టి చూస్తుండేది. ఇద్దరి మధ్యా వలపులు సాగి పెళ్లిదాకా వచ్చి మళ్ళీ దురదృష్టవశాత్తు మేరీ చనిపోవటంతో మూడోసారి మానసికంగా దెబ్బతిన్నాడు. శారీరక, మానసిక ఆరోగ్యాల లేమితో డెబ్భై ఏళ్ళు బతికి 25-04-1800లో చనిపోయాడు. జాన్ న్యూటన్ అనే మత ప్రవక్త ప్రేరణతో ఇవాంజెలికల్ ధోరణిలో అరవై ఏడు భక్తి కవితలు రాశాడు. వీటికి "ఒల్నీ హైమ్స్" అని పేరు పెట్టాడు. పెళ్లి చేసుకోదలచిన అమ్మాయి గురించిన చింతనతో రాశాడు. కూపర్ కవి విషాదాన్ని సిసిల్ "ది స్ట్రికేన్"లో రాసిన లార్డ్ డేవిడ్‌కు చూపాడు. ఆంథాలజిస్టులు కూపర్ రాసిన "ది పాప్యులర్ ఫీల్డ్", "ఆన్ ది లాస్ ఆఫ్ ది రాయల్ జార్జి" కవితల్ని తరచూ ఉదహరిస్తారు. గొప్ప లేఖా సాహిత్యాన్నీ రచించాడు. మంచి ప్రభావం ఉన్నా విధి చేతిలో దెబ్బతిన్న కవి. "ది డై వేర్టెడ్ హిస్టరీ ఆఫ్ జాన్ గిల్పిన్" రాశాడు.

## బీద డాక్టర్ కవి - జార్జి క్రేబిల్



వివాదాస్పదుడనిపించుకొన్న జార్జి క్రేబిల్ 24-12-1754లో ఆల్డేన్ బర్గ్‌లోని సఫోక్స్‌లో పుట్టాడు. విద్యా గంధం లేనివాడు. స్వయం కృషితో అన్నీ నేర్చాడు. ఉప్పు పన్ను వసూలు చేసే ఉద్యోగం చేశాడు. తర్వాత ఒక సర్జన్‌కు అసిస్టెంట్ అయ్యాడు. మిడ్ వైఫ్‌గానూ ఉన్నాడు. రోజు కూలి చేసి బతికాడు. చివరకు ఆల్డేబర్గ్‌లో డాక్టర్ అయ్యాడు. అతని ఊరివాళ్ళు ఇతను బీదవాడనే భావనతో ఉండి డాక్టర్‌గా గుర్తించలేదు. అతని సామర్థ్యంపై నమ్మకం పెట్టుకోలేకపోవటంతో కేసులు రాక, రాబడిలేక డాక్టర్‌గా ఫైల్యూర్ అనిపించుకొన్నాడు. ఇరవై ఆరుకే చిల్లిగవ్వలేని డాక్టర్ అయ్యాడు. ఎందరినో కలిశాడు. ప్రయోజనం శూన్యం. ఎడ్మండ్ బర్క్ ఆదరించి లండన్ తీసుకొని వెళ్ళాడు. అక్కడ సామ్యుల్ జాన్సన్ వంటి వారిని కలిసి వారి సాయం పొందాడు. బర్క్ సలహాతో చర్చి విధుల్లో చేరాడు. మళ్ళీ స్వంత ఊరు ఆల్డేబర్గ్ చేరినా అతని పేదరికం అతన్ని వెక్కిరించి అతని ద్వారా మత బోధ పొందటానికి ఎవరూ ముందుకు రాలేదు. మళ్ళీ నిరాశ. బర్క్ సలహా మేరకు జార్జిని చాప్లిన్ చేశాడు. డ్యూక్ ఆఫ్

రట్ లాండ్. సారా ఎమిలీని పెళ్ళాడాడు. డోర్సేట్ షైర్‌లో రెండు పట్టణాలను అప్పగించాడు.

అక్కడే మొదటి "ది విలేజ్" అనే కవితా సంకలనం తెచ్చాడు. ఇందులో గోల్డ్ స్మిత్ రోమాన్స్ కవితలని చెండాడాడు. నవలా కర్త సర్ వాల్టర్ స్కాట్ ఆహ్వానిస్తే ఎడిన్ బర్గ్ వెళ్ళాడు. జార్జి కవితకు అబ్బురపడి చదివి వినిపించుకొని మెచ్చి పదేళ్ళ తర్వాత కూడా వాటిని మర్చిపోకుండా నోటితో చెప్పాడు స్కాట్. వయసు పెరిగిన కొద్దీ భావ సాంద్రతా పెరిగింది. అరవైలో ట్రో బ్రిడ్జి చర్చికి మినిస్టర్ అయ్యాడు. "టేల్స్ ఆఫ్ ది హాల్" రాశాడు. థామస్ హార్డీ "నేను క్రేబిల్ రాసిన విలేజ్ చదవకపోయి ఉంటే నా నవలలను రాసి ఉండేవాడిని కాను" అని కితాబు ఇచ్చాడు. అభిమానులు, కవుల మధ్య చివరి రోజులు గడిపాడు. జలుబుతో ప్రారంభమైన జబ్బు అతని ప్రాణాలను 03-02-1832న బలికొన్నది. దాదాపు అజ్ఞాత కవిగా మిగిలాడు. ఒక శతాబ్దం తర్వాత ఎడ్విన్ ఆర్లింగ్‌టన్ క్రేబిల్ గుణగణాలను " Plain excellence and stubborn skill" అని పొగిడాడు.



**ఆస్థాన కవి హోదాను తిరస్కరించిన - థామస్ గ్రే**

పన్నెండు మంది పిల్లలలో మిగిలింది ఒక్క థామస్ గ్రే ఒకడు మాత్రమే. అలాగే ఒకే ఒక్క "ఎలిజీ"తో కవుల్లో అగ్రేసరుడనిపించుకొన్నాడు గ్రే. లండన్‌లో 26-12-1716 జననం. చిన్నప్పుడే క్షయ లక్షణాలతో ఇబ్బంది పడ్డాడు. నుదుటిపై ఒక రక్తనాళాన్ని కోసం తల్లి బతికించింది. తండ్రి ముక్కోపి. దమ్మిడీ సంపాదన లేదు. భార్య వదిలేసిపోయి కొడుకును స్వంతంగా పెంచుకొంది. తల్లి తరఫు బంధువు ఆదుకొన్నాడు. ప్రధాని, రిచర్డ్ వెస్ట్ మరియు లార్డ్ చాన్సలర్ ఆఫ్ ఐర్లాండ్ కొడుకు హోరేస్ వాల్‌పోల్‌కు అసిస్టెంట్‌గా చేరాడు. లార్బ్ అకస్మాత్తుగా చనిపోతే గ్రే ఒక సానెట్‌ను రాశాడు. అది బాగుందని అన్నారు "And weep the more because I weep in vain". పీటర్ హౌస్‌లో లాయర్ అవాలనే కోరిక ఉండేది. క్లాసిక్స్‌పై దృష్టి పడింది. గణితం మానేసి అనువాదాలు చేశాడు. కేంబ్రిడ్జిలో చదివినా డిగ్రీ పొందలేదు. వాల్ పోల్ తనతో యూరప్ పర్యటనకు గ్రేను వెంట తీసుకొని వెళ్ళాడు. రెండేళ్ళు ఇటలీ, ఫ్రాన్స్ వగైరాలు చూశారు. ధన గర్వంతో గ్రేను చిన్నచూపు చూసేవాడు వాల్‌పోల్. గ్రే ఇంగ్లాండ్ తిరిగొచ్చేశాడు. రెండేళ్ళు చదివి లాలో డిగ్రీ పొందాడు. కాని ప్రాక్టీస్ చేసిన దాఖలాలు లేవు.

తల్లి రిటైర్ అయి ఇతని దగ్గరే ఉంది. వాల్‌పోల్ జరిగిన దాన్ని క్షమించమని మిత్రుడికి కబురు పంపాడు. అతను రాసిన ఎలిజీ అద్భుతం అన్నాడు. దాన్ని కావ్యంగా

రాయమని కోరాడు. ఏడేళ్ళు రాసి అద్భుతం అనిపించాడు. పరువు, ప్రతిష్ఠా పెరిగాయి. వ్రాతప్రతి పైరేట్ అయి ఒక పబ్లిషర్ చేతికొచ్చి ప్రింట్ చేశాడు. డబ్బు తీసుకోవటానికి గ్రే తిరస్కరించి దెబ్బతిన్నాడు. దాన్ని అమ్ముకొన్న పబ్లిషర్ వెయ్యి పౌండ్లు సంపాదించుకొన్నాడు. తల్లి చనిపోయిన తర్వాత పల్లెటూరిలోనే ఉన్నాడు. పూర్వచరిత్ర, ఐస్‌లాండిక్ వెర్స్‌లపై దృష్టిపడింది. "పిండారిక్ ఓడ్స్" రాశాడు. నలభైలలో రాజాస్థాన కవి పదవికి ఆహ్వానం వచ్చినా తిరస్కరించాడు. అది ఏ సరుకూ బుర్రాలేని విలియం "వైట్ హెడ్"కు దక్కింది.

ప్రొఫెసర్ అయి బోధించాలని ఆరాటపడ్డాడు. రాలేదు. యాభై రెండులో "ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ అండ్ మోడరన్ లాంగ్వేజెస్" అయ్యాడు. యాభై మూడులో స్విట్జెర్లాండ్ వెళ్ళాలనుకొన్నాడు. అకస్మాత్తుగా జబ్బుపడ్డాడు. వాత రోగం వచ్చి క్షయ ముదిరి యాభై అయిదేళ్ళలో 30-07-1771న చనిపోయాడు. పిండీరీ ఓడ్స్ అందర్నీ మెప్పించాయి. దానికి సాటి అయిన రచన రాలేదు. అందుకే "Elegy is the one poem which entitles Gray to enduring fame. He presents a series of twilight pictures and condenses a philosophy which is both sad and soothing. Youth to fortune and to fame unknown" అని అతని స్నేహితుడు భావించాడు. "The elegy written in a country church yard"కు విశేష ప్రాభవం పొందాడు. ❋



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 29

# ఆలివర్ గోల్డ్‌స్మిత్

**10**-11-1728లో ఆలివర్ గోల్డ్‌స్మిత్ ఐర్లాండ్‌లోని లాంగ్‌ఫీల్డ్‌లోని పల్లాస్‌మోర్‌లో జన్మించాడు. తండ్రి క్లెర్జిమన్ ట్రినిటి కాలేజిలో చేరి, చదువుమీద శ్రద్ధ పట్టక, విదూషకుడిగా అల్లరిచేస్తూ గడిపాడు. కర్క్‌కు పారిపోయి ఆడామగా పిల్లలకు డాన్స్‌లో వినోదం కల్పించాడు. కాలేజిలో మళ్ళీ చేరమని కోరితే చేరి, తక్కువ మార్కులతో డిగ్రీ ముక్కాడు. తర్వాత హోలీ ఆర్డర్‌కు అప్లై చేస్తే తిరస్కరించారు. సంపన్న కుటుంబంకు ట్యూటర్‌గా కుదిరాడు. నిలవలేక వదిలేసి, ఒక స్కూల్‌లో చేరి నీరస రొటీన్‌కు విసిగి మానేశాడు. బాబాయి ఇచ్చిన యాభై పౌండ్లతో జల్సాగా గాంబ్లింగ్‌లో పోగొట్టుకొన్నాడు. ఇంగ్లాండ్ వదిలి అమెరికా వెళ్ళి డాక్టర్ అవ్వాలని అనుకొన్నాడు. లేడేన్లఓ క్లాసులకు హాజరై మెడికల్ డిగ్రీ సాధించాడు. తండ్రి వదిలి వెళ్ళిన చివరి పెన్నీ కూడా ఖర్చయిపోయింది. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లకు ఒకే ఒక షర్ట్, ఫాంట్‌లతో చేతిలో ఫ్లూట్‌తో కదిలి వెళ్ళాడు.

ఇరవై ఆరులో నిరాశతో తిరిగి లండన్ చేరాడు. చిన్న పల్లెటూరిలో డాక్టర్‌గా ప్రాక్టీస్ పెట్టినా రాణించలేదు. ఇండియాలో డాక్టర్ చేయాలనుకొన్నాడు అవకాశం రాలేదు. తప్పక రచయిత అయ్యాడు. ఏది కావాలంటే అది రాశాడు కాసుల కోసం. మారుపేర్లతో పబ్లిషర్లు అడిగినవన్నీ రాశాడు. అనువాదాలు, లిటరరీ సర్వేలు చేశాడు. "ది బీ" పత్రికకు ఎడిటర్ అయ్యాడు. వ్యాసకర్తగా పేరు తెచ్చుకొన్నాడు. దాదాపు డబ్బు లేకుండానూ, డబ్బు చేతికొస్తే విచ్చలవిడిగా తగలేస్తూ గడిపాడు. సామ్యుల్ జాన్సన్‌తో పరిచయం ఏర్పడింది. ఏ కష్టమొచ్చినా ఆదుకొన్నాడు. డబ్బు ఎలా జాగ్రత్తగా వాడుకోవాలో తెలియజెప్పాడు. "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్" నవల రాసి దాన్ని అమ్మి ఇంటి అద్దె బాకీ తీర్చాడు. వోలెర్ పార్నెల్, మొదలగు వారి చరిత్రలు రాశాడు. ఇంగ్లీష్ గ్రామర్ రాశాడు. నాటకాలతో అదృష్టం పరీక్షించుకోవాలని కొన్నాడు. "ది గుడ్ నేచర్డ్ మాన్", "ది ట్రావెలర్" నాటకాలు రాశాడు. ఆరేళ్ళ తరువాత "ది

డిసేర్టెడ్ విలేజి" నాటకం అమరుడిని చేసింది.

నలభై అయిదేళ్ళు వచ్చాయి, కాని చేతిలో పైసా నిలవటం లేదు. ఆరోగ్యమూ దెబ్బతింది. మనసూ సరిగ్గా లేదు. నలభై నాలుగేళ్ల వయసులో గోల్డ్‌స్మిత్ 04-04-1774న చనిపోయాడు. రచనల్లో తన కష్టాలను ప్రతిఫలింపజేశాడు. ఆరాధన పొందలేకపోయాడు. వికార్ నవల ఆయన జీవిత చరిత్రే. కవితలు ఆయన సాహిత్యంలో తక్కువగానే ఉన్నాయి. "I cannot afford to court the draggle - tail muses - they would let me starve" అన్నాడు. పోప్ తర్వాత ది ట్రావెలర్ కవిత మంచి పేరు పొందింది. డేసేర్టేడ్ విలేజి పూర్తిగా వాస్తవికత ఉన్నది కాదు. "ముచ్చటైన కవి" అన్నాడు వాషింగ్‌టన్ ఇర్వింగ్. ఆయన రాసిన విలేజ్ స్కూల్ మాస్టర్, విలేజ్ ప్రీచర్, విలేజ్ కవితలు అతని స్వంత ఐర్లాండ్‌కు సంబంధించినవే. అందులో అమాయకత్వం వ్యక్తిత్వం కనిపిస్తాయి. గోల్డ్‌స్మిత్ మరణం తర్వాత టెంపుల్ చర్చ్ వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో స్నేహితులు జాన్సన్ నాయకత్వంలో ఒక క్లబ్ ఏర్పాటు చేశారు. లాటిన్ నుంచి జాన్సన్ అనువదించిన "Oliver Goldsmith - a poet naturalist and historian who left scarcely any style of writing untouched and touched nothing that he did not adorn of all the passions whether smiles, were sublime. In style clear elevated elegant" అని రాసిన ఫలకాన్ని సమాధిపై అమర్చారు.

## క్రిస్టఫర్ స్మార్ట్



గొప్ప మతాత్మక కవితలు రాసి క్రిస్టఫర్ స్మార్ట్ చరిత్రలో నిలిచిపోయాడు. జర్నలిస్ట్‌గా ఉన్నా ఈ కవితలే రాశాడు. దివ్య స్వచ్ఛత కోసం రాశాడు. 11-04-1722 న కెంట్‌లోని షిప్ హార్న్‌లో జన్మించాడు. తండ్రి స్టివార్డ్ ఒక చిన్న ఎస్టేట్ యజమానిగా ఉన్నాడు. తండ్రి చనిపోయిన తర్వాత పదకొండేళ్ళ వయసులో వేన్ ఫామిలీ ఇతన్ని రేబీ కాజిల్‌కు తీసుకొని వెళ్ళారు. కౌంటెస్ ఆఫ్ విల్చేసా స్మార్ట్ తెలివితేటలకు ముచ్చటపడి పాట్రన్‌గా ఉన్నది. కావాల్సిన డబ్బు అందజేసేది. నాలుగేళ్ళకే రైంతో కవిత్వం చెప్పాడు. పదమూడేళ్లకే ఓడ్ రాశాడు. పదమూడేళ్లకు పెంబ్రోక్ కాలేజిలో చేరాడు. రెటరిక్‌లో లెక్చరర్ అయ్యాడు. ప్రేమలో పడ్డాడు. ఆమెపై కవితలు రాశాడు. తాగుడుకు బానిస అయ్యాడు. క్లాసులో నిద్రపోయేవాడు. ఇరవై అయిదులో అప్పుల పాలయ్యాడు. ఇంట్లో నుంచి భయంతో బయటికి వెళ్ళేవాడు కాదు. కేంబ్రిడ్జి వదిలి లండన్ చేరి ప్రింటర్ పబ్లిషర్ న్యూ బెర్రీకు

సహాయం చేశాడు. బాల సాహిత్యం ప్రచురించే సంస్థ అది. అతని బంధువులమ్మాయిని పెళ్ళాడాడు.

"ఆన్ ది ఎటర్నిటి ఆఫ్ ది సుప్రీం బీయింగ్" రాసి సియాటన్ ప్రైజ్ పొందాడు. అయిదేళ్ళలో నాలుగుసార్లు ఈ బహుమతి పొందాడు. "ది హిల్లియాద్" అనే హోమర్ రచన ఆధారంగా సెటైర్ రాశాడు. అనేక సంస్థలు అతన్ని గౌరవించాయి. స్మార్ట్ భ్రాంతి పూర్వక రచనలు ప్రమాదకరం అని జాన్సన్ అన్నాడు. శరణాలయంలో చేరాడు. అక్కడే గొప్ప కవిత రాశాడు. "ఏ సాంగ్ టు డేవిడ్" అనే ఆశ్చర్యకర రచన చేశాడు. విడుదలైన స్మార్ట్‌కు స్నేహితులు చందాలు వేసుకొని సాయం చేశారు. పని చేయలేక తాగుడు మానలేక అప్పులు తీర్చలేక అప్పుల అప్పారావుగా జీవించి కింగ్స్ బెంచ్ ప్రిజన్‌లో ఖైదు పాలయ్యాడు. 21-05-1771లో చనిపోయాడు.

ఒక శతాబ్దం తర్వాత స్మార్ట్ రచన ఆధారంగా బ్రౌనింగ్ "సాల్" రాశాడు. స్వస్థత కోల్పోయిన మనసుతో ఇమేజరీ కవితలు రాశాడు. సాంగ్ డేవిడ్ అనేకసార్లు ముద్రణ పొందింది. మొదటిసారి చదివితే అర్థం కాదు. కాని చదివిన కొద్దీ అద్భుతం అనిపిస్తాయి. ప్రకృతిపైనా, జాతీయ భావజాలం మీదా గొప్ప కవిత్వం రాశాడు. ప్రకృతి ఆరాధకుడు. జంతుజాలాన్ని ప్రేమించాడు. Images in a Song to David are related also to depictions of the Temple in Issac Newton's Chronology of Ancient Kingdoms Amended (1728), the John Bunyan's Solomon's Temple Spiritualiz'd (1688), and to the Geneva Bible, these works were relied on by the Freemasons.

Based on this theory, the first pillar, the Greek alpha, represents the mason's compass and "God as the Architect of the Universe. The second, the Greek gamma, represents the mason's square. In addition, the square represents" the vault of heaven. The third, the Greek eta, represents Jacob's ladder itself and is connected to the complete idea of seven pillars. The fourth, the Greek thete, is either the all-seeing eye or the point within a circle. The fifth letter, the Greek iota, represents a pillar and the temple. The sixth letter, the Greek sigma, is an incomplete hexagram, otherwise known as "The blazing star or hexalpha" to the Freemasons. The last, the Greek omega, represents a lyre and David as a poet.

**థామస్ చాటర్టన్**



కీట్స్ చేత "ది మార్వేలేస్ బాయ్" అని పిలవ బడిన థామస్ చాటర్టన్ ఒక పేద స్కూల్ మాస్టారబ్బాయి. చర్చి నీడలో బాల్యం గడిచింది. జననం 20-11-1752. ఎనిమిదేళ్ళ వరకు అక్షరం ముక్క నేర్వలేదు. ఫ్రెంచ్ మ్యూజిక్, బైబిల్ మీద మోజేర్పడింది. పదో ఏట కవిత్వం అలవడింది. మేరీ రెడ్ క్లిఫ్ చర్చిలో ఒక గదిలో ఉండి, పురాతన గ్రంథాల రాత ప్రతులను, స్పెల్లింగ్‌లను అధ్యయనం చేశాడు. "ది రోమాంటే ఆఫ్ ది స్నిఫ్ఫ్నేట్" కవిత చదివి అసలు రచయిత ఎవరో తేల్చి చెప్పాడు. పదిహేనేళ్ళలో అందగాడైన ఈ కుర్రాడు రూమ్సీని ప్రేమించాడు. బ్రిస్టల్ అటార్నీకి అసిస్టంట్‌గా పనిచేశాడు. శ్రద్ధ చూపలేదు. "దాడ్స్లీ" రాసి పేరు పొందాడు. ఇది బాగా పేలలేదు. హోరేస్ వాల్‌పోల్‌కు రాశాడు సహాయం చేయమని. మోసం జరిగిందని గ్రహించి న్యాయం చేసి మళ్ళీ ఆ జోలికి పోవద్దన్నాడు.

పదిహేడేళ్లప్పుడు లండన్ వెళ్లి "రౌలీ" పోయెమ్స్, సాంగ్స్, డ్రమాటిక్ లిరిక్స్, అసంపూర్తి నాటకాలు రాశాడు. ఒక నెలలోనే అరడజన్ మేగజైన్లకు రచనలు చేసి పేరొందాడు. లండన్ మేయర్ స్పాన్సర్‌గా ఉంటానని వాగ్దానం చేశాడు. సేకరించి రాసిన పురాతన గ్రంథాల ముద్రణకు ఎవరూ ముందుకు రాలేదు. మేయర్ చనిపోవటంతో స్నేహితులకు ముఖం చూపలేకపోయాడు. చలి, ఆకలితో అలమటించాడు. హాల్ బారన్ గారేట్‌కు చేరి బయటికి వచ్చేవాడు కాదు. తల్లికి భార్యకు సంతోషంగా ఉన్నట్లు పోజు పెట్టేవాడు. ఎవరైనా ముందుకొచ్చి డబ్బు ఇస్తామంటే అగౌరవం అని భావించేవాడు. రచన, జర్నలిజంతో బతకలేనని నిర్ధారించుకొన్నాడు. ఆఫ్రికా షిప్ ట్రేడింగ్‌లో స్థానం సంపాదించాడు.

24-08-1770న ఇంటి యజమానురాలు ఇతను చిన్న రొట్టెముక్కలు మాత్రమే వారం రోజులుగా బతుకుతున్నాడని తెలుసుకొని మంచి ఆహారం తీసుకొని అందజేస్తే ఆకలి లేదని వద్దన్నాడు. అర్ధరాత్రి ఒక రొట్టెల దుకాణానికి కావాలని "ఆర్సెనిక్" తెచ్చుకొని తినేశాడు. రెండు రోజులుగా రూము తలుపులు తెరచుకోకపోవటంతో లోపల తాళం వేసిన ఆ గది తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లి చూస్తే చాటర్టన్ చనిపోయి ఉన్నాడు. అప్పటికి అతని వయసు పదిహేడు సంవత్సరాల తొమ్మిది నెలలు మాత్రమే. అతని చుట్టూ చినిగిన రాతప్రతులెన్నో ఉన్నాయి. పాపర్ అయి చనిపోయాడు కనుక ఈ కవిని వర్క్ హౌస్ షూ లేన్‌లో సమాధి చేశారు.

ఇతని కవితల్లో చాసర్, స్పెన్సర్ ఛాయలుంటాయి. పందొమ్మిదో శతాబ్దం వరకు ఇతని కవితలు ఆదరం పొందాయి. రొమాంటిక్ కవులు ఇతన్ని వెతికి పట్టుకొని పునర్జీవిని

చేశారు. కార్లైల్ ఇతని డార్క్ టోన్డ్ మ్యూజిక్‌కు పరవశం చెంది "కుబ్లాయ్ ఖాన్"లో వాడుకొన్నాడు. కీట్స్ "ఎండిమేన్"లో ఈ కవిని గురించి రాశాడు. మొదట ఆంగ్లంలో సాధారణంగా రాసి తర్వాత రౌలీ విధానంలోకి మార్చాడని భావిస్తారు. కవితల్లో మనసులోని భావాలను సగమే చెప్పాడు. అనేక మేనరిజాలను ప్రయోగించాడు. ప్రతిభ ఉన్నా సమర్ధించి ప్రోత్సహించేవారు లేక దెబ్బతిన్న కవి చాటర్టన్. మరణం 24-08-1770. మధ్య యుగానికి చెందిన అనేకమైన వాటికి అనుసృజన, అనువాదాలు చేశాడు. పదిహేనవ శతాబ్దానికి చెందిన థామస్ రౌలీ అనే ఊహాజనిత సన్యాసిని తానుగా భావించి ఆ ధోరణిలో రాశాడు. చాటర్టన్ "స్వాన్ సాంగ్" అని పిలువబడే చివరి కవిత అందర్నీ కదిలించింది.

"Awake awake o Birtha swotie mayde-".



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 30

స్వర్గ నరకాల పరిణయం

# చిత్ర శిల్ప కవి - విలియం బ్లేక్

**లం**డన్‌లో 28-11-1757న జన్మించిన విలియం బ్లేక్ తండ్రి హోసరీ మర్చంట్. పుట్టుక నుంచి విజనరీ దృష్టి ఉన్నవాడు. నాలుగేళ్ళప్పుడే భగవంతుడు కనిపించినట్లు అనుభూతి పొందాడు. పొలాలలో నడుస్తూ దేవతా గణాలతో ఉన్నట్లు వాటికి రెక్కలున్నట్లు భ్రమించాడు. ప్రతి పొదలో నక్షత్రాలున్నట్లు అనుభూతి పొందాడు. వాటిని తన చేతికర్రతో స్పర్శించి ఆనందాన్ని పొందాడు. తమ్ముడు రాబర్ట్ ఈ అనుభవానికి ప్రత్యక్షసాక్షి. పెద్దన్న జేమ్స్ తండ్రి వ్యాపారాన్ని నిర్వహిస్తే మూడోవాడు జాన్ తప్పతాగి చనిపోయాడు. సోదరి కేతరీన్ అవివాహితగానే ఉండిపోయింది.

బ్లేక్ స్కూల్‌లో చదవనేలేదు. ఎప్పుడూ యేవో బొమ్మలు వేసుకొంటూ ఆనాటి లండన్‌ను కొత్తకోణంలో చిత్రించేవాడు. ఇంటికి థేమ్స్ నది అతి దగ్గర. ఇవే అతని జీవితాన్ని మలుపు తిప్పాయి. ఆనాటి కుర్రకారుకు విరుద్ధంగా కొడుకు ఉండటాన్ని తండ్రి విపరీత ధోరణిగా భావించక ప్రోత్సహించాడు. పదో సంవత్సరంలోనే ఆర్ట్ క్లాసులకు పంపాడు. ప్లాస్టర్, గ్రీకు దేవతల చిత్రాలు డబ్బు ఇచ్చి అతని సృజనను ప్రోత్సహించాడు. బ్లేక్ జీవితాదర్శం మైకేల్ యాంజేలో అవ్వాలని సొసైటీ ఆఫ్ అప్రెంటిస్‌లో చేరాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో ఉన్న స్మృతి చిహ్నాలను కాపీ చేసుకొన్నాడు. అందులోని గోథిక్ ఆభరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఈ భావనను ఎప్పుడూ వదలుకోలేదు. పదహారులో స్వంత "జోసెఫ్ ఆఫ్ అరిమాటియా అమాంగ్ ది రాక్స్ ఆఫ్ ఆల్బియాన్" అనే శిల్పాన్ని తయారుచేశాడు. దీని నేపథ్యం అంతా సృజనతో కల్పించాడు. ఇది మైకేలాన్జేలో శిల్పం "క్రూసిఫికేషన్ ఆఫ్ సెయింట్ పీటర్"ను గుర్తుకు తెస్తుంది. దీనిని వర్ణిస్తూ "ఈ పదహారేళ్ళ పడుచు కుర్రాడు" రాసిన కేప్షన్ తలలు పండిన పండితులు రాసినట్లుగా ఉండి అందర్నీ ఆశ్చర్యపరచింది అదే - "This is

one of the Greek artists who built the cathedrels in what we call the Dark ages wandering about in sheepskins and goat skins, of whom the world was nit worthy.  Such were the Christians in all ages".

ఇరవై ఒకటిలో బసీర్ దగ్గర శిక్షణ పూర్తి చేసుకొని స్విస్ ఆర్టిస్ట్ జార్జి మోసర్ దగ్గర చేరి మెరుగులు దిద్దుకొన్నాడు.  మానసిక దృష్టితో ప్రతి విషయాన్ని దర్శించి అనుభూతి చెంది చిత్రించేవాడు, శిల్పించేవాడు.  గోథిక్ కళలో శిల్పాలు జీవించలేక శవాకృతిలో ఉన్నాయనిపించేవి.  వాటికి అమరత్వం లేదని అనుకొన్నాడు.  స్వీయ భావనతో అనేక చిత్రాలు గీశాడు, చెక్కాడు.  కాని అవి జీవన భ్రుతికి సరిపడ డబ్బునివ్వలేదు.  "ఎటర్నల్ యూత్, ఎటర్నల్ మాన్"గా తయారు చేశాడు.  ఎంతో మానసిక ఆనందాన్ని అనుభవించాడు.  "గ్లాడ్ డే" అనేది బ్లేక్ ఆదర్శ చిత్ర రాజం అన్నారు.

బంగారు రంగు జుట్టుతో బ్లేక్ స్వర్ణ కిరీటధారిగా కనిపించేవాడు.  ఇరవై అయిదులో కేథరిన్ సోఫియా బూచర్‌తో సల్లాపం సాగించాడు.  నల్లకళ్ళ చదువు రాని ఆ సుందరిని పెళ్ళాడి తానే గురువై చదవటం రాయటం నేర్పాడు.  ఆతర్శ గృహిణిగా ఆమె సహకరించింది.  తన భర్త ఎప్పుడూ స్వర్గలోక విహారే అనేది ఆమె.  తిండికి కూర్చున్నప్పుడు ఖాళీ ప్లేట్ మాత్రమే పెట్టేది.  తండ్రి చనిపోయిన తర్వాత కుటుంబాన్ని పెద్దన్న చూసుకొన్నాడు.  బ్లేక్ ఒక ప్రింట్ షాప్ పెట్టాడు.  అన్న రాబర్ట్ అకస్మాత్తుగా మరణించాడు.  రాబర్ట్ ఆత్మ సీలింగ్ దాటి విశాల గగనంలోకి చేరటం తాను చూశానని బ్లేక్ చెప్పాడు.  సచిత్ర మేగజైన్లను తయారు చేయటం స్వీయానుభవంతో సాధించాడు.  ప్రింట్ షాప్ అచ్చి రాలేదు.  పబ్లిషర్ల పుస్తకాలను సొగసులు కూర్చే పని చేశాడు.  బ్లేక్ అందంగా కవితలను చదివేవాడు.  మాథ్యూస్‌తో కలిసి తన పుస్తకం "పొలిటికల్ స్కెచెస్" ముద్రించాడు.  రాత మాథ్యూస్, బొమ్మలు బ్లేక్‌తో బాగా వచ్చింది.  ఎలిజబెత్, జాకోబిన్ కవుల ధోరణిలోనే రాశాడు.  కాని వీటికి కొత్త స్వేచ్ఛ, స్వచ్ఛత అద్దాడు.  పునరుజ్జీవనం రొమాంటి కవిత్వాలకు మధ్య వారధిగా బ్లేక్ కొత్త పోకడలు పోయి కవిత్వం రాశాడు.

ముప్ఫైలో "సాంగ్స్ ఆఫ్ ఇన్నోసేన్స్" రాసి ప్రచురించాడు.  వినటానికి మహదానందంగా ఉండేవి.  బ్లేక్ కవితా లక్షణాన్ని మోనా విల్సన్ "A return from the idea of Excellence to that of Ecstasy as the aim and justification of poetical enterprise" అని శ్లాఘించాడు.  బ్లేక్ రాసిన "ది లాంబ్", "ది లిటిల్ బ్లాక్ బాయ్", "యాన్ అనదర్ సారో నైట్" కవితలు అందరూ చదివిన వాళ్ళమే.  భారీ సహాయంతో బ్లేక్ సాంగ్స్ ఆఫ్ ఇన్నోసెన్స్ పుస్తకాన్ని చేతితో తయారు చేసి, ఇంకెవరూ పబ్లిష్ చేయకుండా

విడుదల చేసి చరిత్ర సృష్టించాడు. ఇలా ఇంతకుముందెవరూ చేయలేదు. దీనినే బ్లేక్ "ఇల్యూమినేటెడ్ ప్రింటింగ్" అన్నాడు. కాగితాలను అందంగా ఆకర్షణీయంగా బంగారు రంగుతో కొన్ని పేజీలు వివిధ వర్ణాలతో తయారు చేసి ధగధగ మెరిసేట్లు చేశారు. అతని ఆలోచనకు, ఆచరణకు, సృజనాత్మక శక్తికి అందరూ నివ్వెరపోయారు. స్పష్టంగా నిర్దుష్టంగా కంటికి బాగా కనిపించి విందు చేస్తూ చదివించేట్లు చేసి తయారు చేశారు బ్లేక్ దంపతులు.

దీనికి సీక్వెల్‌గా కొన్ని లిరిక్కులు రాశాడు. బ్లేక్ భావన ప్రకారం చిన్నపిల్లాడు ఈడెన్ వదిలి, ప్రపంచంలో ఎదిరించి బతుకుతూ, స్వర్గంలో పోగొట్టుకొన్నదాన్ని ఇక్కడ పొందాలి. ద్వంద్వాలను ఏకం చేయటమే బ్లేక్ ఆదర్శం "A fusion of innocence and experience, good and evil,, flesh and spirit and as he was so enunciate with challenging vehemence, the marriage of heaven and hell". రెండు విభిన్న ప్రపంచాలలో బ్లేక్ జీవించాడు. అలానే అతని సృజన కళ కూడా ఉండేది. కొద్దికాలం తర్వాత "ట్రయల్", "ది బుక్ ఆఫ్ ది తేల్" రాశాడు. కాని ఎనభై అయిదేళ్ళ తర్వాత కాని ముద్రింపబడలేదు. బ్లేక్ స్వీడిష్ ఫిలాసఫర్ "స్వీడెన్ బర్గ్" అనుయాయి. బర్గ్ "దేవుడిని దివ్య మానవుడు" అన్నాడు. బ్లేక్ ధనాత్మక స్వభావం ఉన్నవాడు. వార్ధక్యంపై పడిన కొద్దీ బ్లేక్ అందరికి దూరంగా ఉన్నాడు.

1793లో గ్రామీణ లామ్బెత్‌కు చేరి చిన్న ఇంట్లో ఉన్నాడు. పిల్లల జంజాటం లేదు. భార్యాభర్త హాయిగా ఆనందాన్ని అనుభవించారు. ధనమూ బాగానే వస్తోంది. సుఖజీవితం గడుపుతున్నారు. ముప్ఫైలలో సంతృప్తికర జీవితాన్ని అనుభవించాడు. కొత్త భావనలు మనసులో చోటు చేసుకొన్నాయి. పాతవాటిని మార్చి కొత్తగా తయారు చేశాడు భార్య సాయంతో. వాటిని "Richly illuminated volumes" అన్నాడు. ఇంగ్లాండ్ చరిత్రను పిల్లల కోసం రాశాడు. గేట్స్ ఆఫ్ పారడైజ్‌ను కూడా పిల్లలకోసమే. దీర్ఘ కవితలను రంగుల హర్మ్యంగా తయారు చేశాడు. అమెరికా రివల్యూషన్‌కు మద్దతుగా "అమెరికా – ఏ ప్రాఫసీ" రాశాడు. ఊహా ప్రపంచంలో వుండేవాడు ఎప్పుడూ. బ్లేక్ చిత్రాలు దివ్యకళా విభూతితో దర్శనమిచ్చేవి. జార్జి కంబర్ లాండ్ అనే నేషనల్ ఆర్ట్ గాలరీకి చెందిన ఆయనతో పరిచయం ఏర్పడింది. బ్లేక్‌ను ఎడ్వర్డ్ యంగ్ రచన "నైట్ థాట్స్"కు చిత్రాలు వేయమని కోరితే వేశాడు. నలభై మూడు చిత్రాలలో ఇది మొదటి భాగంగా వెలువడింది.

నలభైలో "ది ఫోర్ జోన్స్" అనే సింబాలిక్ రచన ప్రారంభించాడు. ఇందులో పాత కొత్త నిబంధనలకు సంబంధించినవన్నీ చోటు చేసుకొన్నాయి. కొంత గందరగోళాన్ని సృష్టించాడు. "He who works and has his health can not starve" అనే దృఢమైన నమ్మకం బ్లేక్‌కు ఉండేది. ఆగస్ట్ గ్రామంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉన్నారు జంట. "ఫెల్ఫాం" అనే

రచన ప్రారంభించి చిక్కుల్లోపడ్డాడు. సహాయకుడిగా పెట్టుకొన్నవాడి పద్ధతి బాగాలేక తరిమేస్తే వాడు రాజుకు ఫిర్యాదు చేస్తే రాజుకు విషయం వివరిస్తూ ఉత్తరం రాశాడు. ఒక సైన్యాధికారిని కొట్టాడని నేరం మోపారు. కేసైంది. బ్లేక్ నిర్దోషి అని తీర్పు వచ్చింది. రాజు బ్లేక్‌ను సెక్రెటరి అసిస్టంట్‌ను చేశాడు. పాపం బ్లేక్‌ను ద్వేషించిన "హెలీ కవి" రాసిన దాన్ని విని, పొగడాల్సిన కష్టం వచ్చింది. దీనికి విచారపడుతూ "O why was I born with a different face? - why was I not orn like the rest of my race? - when I look, each one starts! when I speak, I offend - when I am silent and passive, I lose every friend" అని రాసుకొన్నాడు. శత్రువుల దాడిని సునాయాసంగా తిప్పికొట్టగలుగుతున్నాడు కాని శ్రేయోభిలాషులు పెట్టే ఇబ్బందుల్ని భరించలేకపోతున్నాడు. విసుగొచ్చి లండన్ వదిలి పుట్టిన ఊరికి చేరాడు. పవిత్ర జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నాడు. కొత్త సింబాలిక్ కవితలు "మిల్టన్ అండ్ జెరూసలెం" రాస్తున్నాడు. ఇవి మిల్టన్ రాసిన పారడైజ్ లాస్ట్‌కు వివరణలతో కూడిన చిత్ర దృశ్యాలు. రెండేళ్ళు బాగానే గడిచింది.

లాభాపేక్షతో ముచ్చటైన డిజైన్‌లతో "కాంటర్‌బరీ పిలిగ్రిమ్స్" మొదలుపెట్టాడు. ఇది తెలుసుకొన్న స్తాత్ బాండ్ అనేవాడు పబ్లిక్ ఎక్సిబిషన్ పెట్టి కుబేరుడయ్యాడు. అందరూ బ్లేక్‌ను కవిగా అంతగా గుర్తించలేదు. బాధపడ్డాడు. అతని సృజన కళను ఎవరూ గుర్తించకపోవటం దురదృష్టం. ఒక "డిస్క్రిప్టివ్ కేటలాగ్ తయారుచేసి తన చిత్రాలను ప్రదర్శించాడు. ఫలితం శూన్యం. యాభైలలో పేదరికం వరించింది. అతను ఊహల్లో విహరిస్తుంటే భార్య సంసారాన్ని దిద్దుకొన్నది. ఇంటి అద్దె కూడా చెల్లించలేని దయనీయ స్థితి. కొద్దిమంది ఉదారుల సహాయం లభించకపోయి ఉంటే బ్లేక్ దంపతులు ఆకలితో చనిపోయి ఉండేవారు. అతని శిష్యులు గురువులోని అసామాన్య కళను ఆరాధిస్తూ సహాయం చేశారు. ఇంకా ఇరవై ఏళ్ళు బతికి అసలైన రచన చేయాల్సి ఉంది. మిల్టన్‌పై పుస్తకాల డిజైన్ పూర్తి అయింది. " ది ఎవర్ లాస్టింగ్ గాస్పెల్" ఇంకా రావాలి. గేట్స్ ఆఫ్ పారడైజ్ మళ్ళీ తేవాలి. చాసర్ కథలు పునర్ముద్రణ పొందాలి. వీటిలో మిల్టన్‌పై వచ్చింది అత్యంత ఆశ్చర్యకరమైనదే. దీన్ని బ్లేక్ "Sublime allegory for future generations similar to Homer's Illiad and Milton's paradise lost". వీటిని అంతరాత్మ ప్రబోధంగా రాశానని చెప్పాడు. దీన్ని "Grandest poem that this world contains" అని బ్లేక్ చెప్పుకొంటే "The most confusing of his long parables an unsuccessful melding" అన్నారు విమర్శకులు.

నిజంగా బ్లేక్ మిల్టన్‌తో తాదాత్మ్యం చెంది రాశాడు. మిల్టన్‌ను "క్లాసిక్ ఎథీస్ట్" అన్నాడు బ్లేక్. ముసలితనం వస్తున్న కొద్దీ మిల్టన్‌లా కాకుండా బ్లేక్ జాగ్రత్త పడ్డాడు. మానసిక

పోరాటాన్ని ఆపలేదు. విప్లవం గురించి ఎక్కడా బయటికి చెప్పలేదు. అరవైలో ఆరోగ్యం దెబ్బతినటం మొదలైంది. ఒణుకు, ఫిట్లు వస్తున్నాయి. చిత్రకళాకారుడిగానే గుర్తుండిపోయాడు. 1827 ఏప్రిల్‌లో తాను మృత్యుద్వారం నిరీక్షిస్తున్నట్లు జార్జి కంబర్లాండ్‌కు జాబు రాశాడు. శరీరం కృశిస్తున్నా బుద్ధి మనసు బలంగానే ఉన్నాయన్నాడు. ఇదే ఆఖరి ఉత్తరం అయినా చివరి రచన మాత్రం కాదు. విపరీతమైన శ్రమ, రచనలతో చిక్కి శల్యమైనాడు. మూత్రపిండాలలో రాళ్ళ బాధతో ఉన్నా దాంటేపై చిత్రాలు గీస్తూనే ఉన్నాడు. 12-08-1827న చిత్ర శిల్పకవి విలియం బ్లేక్ ఇహం అనే నరకాన్ని వదలి పరం అనే స్వర్గాన్ని చేరుకొన్నాడు.

"To see a world in a grain of sand - and a heaven in wild flower - hold infinity in the palm of your hand - and Etenity in an hour" అన్న కవిత దేశదేశాలలో బహుళ ప్రచారమైంది. బ్లేక్‌ను పిచ్చోడు అన్నారు సమకాలీకులు. కాని "Blake was like the figures he loved to draw bound to no law of nature moving gravely to his goal, employing the emanations of earth, air, fire and water at home among the elements. this outward creation was a transparent shall though which Blake beheld the fiery secret, the burning core of ecstacy". సూర్యోదయం అయినప్పుడు ఆయన చుట్టూ గోల్డ్ గినియా లాంటి వలయం కనిపిస్తుంది అనటం వాస్తవం కాదు - నాకు మాత్రం "An innumerable company of heavenly host crying Holy Holy Holy is the Lord God Almighty" కనిపించటం యదార్థం అని తాదాత్మ్యంతో అన్న దివ్య విభూతి పొందిన ప్రకృతి ఆరాధకుడు. చిత్ర శిల్ప కవి విలియం బ్లేక్ మహాశయుడు. ఫ్రీ లవ్ సొసైటీకి బీజం వేసింది బ్లేక్ అంటారు. వివాహ బంధం విషయంలో క్రిస్టియానిటికి వ్యతిరేకంగా ఉండేవాడు. అతనిది "Enlightened philosophy".



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 31

# హాలిక కవి - రాబర్ట్ బర్న్స్

**మ**రచిపోరాని కవిత్వం రాసి, మేధావిగా, కష్టజీవిగా, విఫల రైతుగా, సహజ పాండిత్యునిగా, ప్రతీకాత్మక కవిగా, లెజెండరీ హీరోగా, సంచార జాతి దేవుడిగా రాబర్ట్ బర్న్స్ సుప్రసిద్ధుడు. "ది ఫార్మర్స్ ఇంగిల్" అనే కవిత చాలా సాధికారకంగా రాశాడు. 25-01-1759తో స్కాట్‌లాండ్‌లోని ఐరిషైర్‌లో కిల్‌లోని అల్లోవేలో జన్మించాడు. తండ్రి విలియం బర్న్స్ స్వంత చేతులతో ఒక చిన్న కాలేజీ నిర్మించుకొన్నాడు. అంతా రైతు వాతావరణం. తల్లి కూడా అదే కుటుంబం నుంచి వచ్చింది. చదువు రాని స్త్రీ. బైబిల్‌లో కొన్ని పేజీలు మాత్రం చదవగలిగేది. జానపద కథలు చెప్పటంలో ఆరి తేరి, పిల్లలకు ఆ కథలతో వినోదం పంచేది. ఆమె సోదరి కూడా వీరితోనే ఉండి ఆమెకు పాటల్లో గృహకృత్యాలలో తోడుగా ఉండేది. ఆరవ ఏట బర్న్స్ అల్లోవే స్కూల్‌లో జాన్ మర్డాక్ దగ్గర విద్య నేర్చాడు. ఆ మేస్టారికి పుడ్డూ బెడ్డూ అన్నీ ఈ రైతులే చూసేవారు. నిర్దుష్టమైన ఇంగ్లీష్‌ను పిల్లలు నేర్వాలని ఆయన తాపత్రయం. తండ్రి బర్న్స్‌కు పొలం పనులు నేర్పాడు. మూడు వారాలు సెలవ ఇస్తే దూరంగా ఉంటున్న గురువుగారు మర్దోక్ దగ్గరకు వెళ్లి చదువుకొనేవాడు.

తండ్రికి మొదటి బ్రేక్‌డౌన్, కొడుకు మొదటి కవిత ఒకేసారి వచ్చాయి. పదిహేనవ ఏట రైమ్స్‌తో కవిత్వం రాశాడు. కూలీల కష్ట జీవితాలను పేదరికాన్ని కవిత్వీకరించాడు. పంటలు, వాటికి పట్టే చీడ పీడలూ, కవిత్వంలో చోటు చేసుకొన్నాయి. పందొమ్మిదిలో కుటుంబం లోచ్లీకి మారి ఏడేళ్ళు ఉండిపోయారు. ఇరవైలో అలిసాన్ బేగ్ బీ అనే పనికత్తెను ప్రేమించి ముగ్గులోకి దించాడు. ఆమెపై కవితలూ రాశాడు. ఇక్కడి వాతావరణం నచ్చక ఇర్విన్ వెళ్ళాడు. తండ్రి అప్పులపాలై క్షయ సోకి చావు బతుకుల మీద ఉన్నాడు. తండ్రి దగ్గరకు చేరి సేవ చేశాడు. అతనిలోని రచయిత బయటికి వచ్చి విజృంభించాడు. తండ్రి మరణానికి ముందు "కామన్ ప్లేస్ బుక్" మొదలు పెట్టి రాస్తున్నాడు. మనసులో మెదిలిన

ప్రతిభావాన్నీ కాగితంపై పెట్టాడు. తండ్రి పోయిన తర్వాత వ్యవసాయం చేశాడు. నకిలీ విత్తనాలు, అదనుకు సాగు చేయకపోవటంతో నష్టాల్లో కూరుకుపోయాడు. పెట్టుబడులే రాలేదు.

ఈ వూరు వదిలేసి పక్కనే ఉన్న మాచ్లిన్ చేరాడు. అక్కడ అందమైన అమ్మాయిలూ సరదా అబ్బాయిలతో కాలక్షేపం చేశాడు. ఎలిజబెత్ పాటన్ అనే మరో పని అమ్మాయిని వలచాడు. ఆమెతో అక్రమ సంతానాన్ని పొందాడు. తండ్రి అయ్యాననే గర్వంతో "ఏ పోయెట్స్ వెల్కం టు హిజ్ లవ్ బిగాటెన్ డాటర్" ఒక కవిత రాసి పేపర్కు పంపాడు. పుట్టిన పిల్లను బర్న్స్ తల్లే పెంచింది. ప్రియురాలికి ఇరవై పౌండ్లు ఇచ్చి సర్దుబాటు చేసుకొన్నాడు. ఆమె తలిదండ్రులను చేరింది. తెలియని జబ్బు ప్రవేశించి బాధిస్తోంది. రాసిన కవితలను చేతివ్రాత ప్రతులనే అందరికీ ఇచ్చేవాడు. స్టాంజాలు రాయటంలో కొత్త పుంత తొక్కాడు. అందుకే వాటికి "బర్న్స్ స్టాంజాలు" అనే ముద్రపడింది. "జాలీ బెగ్గర్స్" అనే కవిత తరతరాలుగా చదివించింది. ఇందులో జంతువుల ఆత్మఘోష ఉంది.

ఇరవై ఆరులో ఒక తాపీ మేస్త్రి కూతురు జీన్ ఆర్మార్ను ప్రేమించాడు. తండ్రి ఒప్పుకోలేదు. సాక్షుల సమక్షంలో పెండ్లాడి లీగల్ మారేజీ చేసుకొన్నాడు. మామకు కోపం వచ్చి ఇతన్ని అల్లుడే కాదు పొమ్మన్నాడు. "వినే వాడిది పాపం" కవితలు పిలిచి వినిపించేవాడు. జమైకా వెళ్లి చెరుకు సాగు చేద్దామనుకొన్నాడు. ఇంతలో ఇంకో పాలమ్మే మేరీ కాంప్ బెల్ అనే అమ్మాయిని లైన్లో పెట్టుకొన్నాడు. ఆమెను "హైలాండ్ మేరీ" అని పిలిచి కవిత్వం చిందించాడు. ఆమెకు కడుపొచ్చింది. పిల్లను కనీ ఆమె చనిపోయింది. బర్న్స్ అనారోగ్యం పాలయ్యాడు. చనిపోయిన మేరీపై ఎలిజీ రాశాడు. జమైకా వెళ్లి చెరుకు సేద్యం చేశాడు. ఇక్కడా నెత్తిన చేతులే. మామగారితో అసమర్ధుడనిపించుకొని, వ్యవసాయంలో దెబ్బతిని, ఏమీ సాధించలేనివాడని ముద్రపడ్డాడు. చివరికి కవిత్వమే శరణ్యం అనుకొన్నాడు. "జాలీ బెగ్గర్స్"ను ఒక మారుమూల ఊరిలో ప్రింట్ చేశాడు. మూడు షెల్లింగుల రేట్ పెట్టాడు. చాలామంది ఎగపడి చందాదారులైనారు, ప్రింట్ చేసి డబ్బు బాగా సంపాదించాడు. ఒక్క నెలలో ఒక అజ్ఞాత పల్లెటూరి అంత్యప్రాసల కవి కవిత్వాన్ని ఆరువందల మంది పోషించి వెలుగులోకి తెచ్చారు. ఇరవై ఏడులో "సేలేడోనియా బార్డ్" అని ఆ అమాయక అక్షరం ముక్కరాని ప్రజల చేత కీర్తింపబడ్డాడు బర్న్స్. స్కాటిష్ మాండలికంలో ఉన్న ఇంగ్లీష్ శైలిలో వాటిని నగిషీలు చెక్కాడు. ఇంగ్లీష్ కవిగా గుర్తింపు పొందాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. కిల్మర్నాక్ పోయెమ్స్గా పిలవబడే ఈ కవితలు నలభై మూడు. ఇందులో చెత్త కవితలూ ఉన్నాయి. ఒక మంచి కవితను చూద్దాం –

"Is there in human form, that - a wretch a villain lost to

love and truth - that can with studied, sly, ensnaring art - beasty sweet jenny's un suspecting youth"

ఈ సంకలనం డబ్బునిచ్చింది. దానితో ఆశ పెరిగి అదృష్టాన్ని పట్నంలో పరీక్షించుకొందామని ఎడిన్ బర్గ్ చేరాడు. అక్కడి సాహితీ ప్రముఖులెవరూ స్వాగతించలేదు. "పొలంలో పెంట పోగుమీద పెరిగిన పుష్పం"గా అందరూ భావించారు. మనిషి అధైర్యపడ్డాడు. పేరు ప్రఖ్యాతలు ఒక్కసారిగా రావని గ్రహించాడు. క్రమంగా జనం దగ్గరకు వస్తున్నారు. ప్రతిభకు గుర్తింపు వచ్చింది. చిన్న చిన్న సన్మానాలు చేస్తున్నవారి మధ్య తానూ తేలిపోతున్నట్లు భావించాడు. డబ్బు వస్తోంది కాని మానసికానందం లేదు. ఎరల్ ఆఫ్ గ్లేన్కారిన్ సహాయంతో తన కవితల రెండవ ఎడిషన్ తెచ్చాడు. చేతిలో డబ్బు ఆడుతోంది. కాని మానసిక ప్రశాంతత కరువైంది. సరిహద్దు రాష్ట్రాలు తిరిగాడు. ప్రయోజనం కనిపించలేదు. పల్లె జనుల పాటలు వింటూ వాటిని సరిచేస్తూ హాయిగా గడిపాడు.

ఎడిన్ బర్గ్‌లో స్కాటిష్ సాంగ్స్‌ను "స్కాట్స్ మ్యూజికల్ మ్యూజియం" వెలువరించే ప్రాజెక్ట్‌లో జేమ్స్ జాన్సన్ వచ్చి సహాయం చేయమంటే చేశాడు. అవి ఆరు వాల్యూములుగా తెచ్చారు. అందులో బర్న్స్ ఎక్కడ సరిదిద్దాడో, ఎక్కడ స్వంతవి చేర్చాడో తెలీకుండా చేశాడు. వినటానికి మహాకర్ణపేయంగా వచ్చాయి. బర్న్స్ జీవితంలో ఇదొక గొప్ప ఎచీవ్‌మెంట్ అయింది. ఈ ప్రాజెక్ట్ వలన బర్న్స్ ఒక "లిరిక్ రైటర్" అని పేరు వచ్చింది. ఇంటికి వెళ్ళటానికి ఇష్టం లేదు. రెండోసారి ఎడిన్ బర్గ్‌కు వచ్చినప్పుడు ఆగ్నెస్ మాక్లి హోస్‌ను ప్రేమించాడు. ఆమె ఇతనికి తగిన అమ్మాయి. అప్పటికే ఇద్దరు పిల్లలు పుట్టారు. కాని పెళ్లి చేసుకోలేదు. అదృష్టం కలిసొచ్చి ఎక్సైజ్‌లో ఆఫీసర్ ఉద్యోగి అయ్యాడు. నిత్ నది ఒడ్డున డంఫ్రైస్‌లో చిన్న వ్యవసాయ క్షేత్రం కొన్నాడు. జీన్‌కు ఇద్దరేసి కవల పిల్లల్ని కన్నది. నలుగురూ రోజులే బతికి చనిపోయారు. అప్పుడు పెళ్లి చేసుకొన్నాడామెను. దాన్ని "I gave her a matrimonial title to my corpus" అని కవిత్వీకరించాడు. జీన్ గృహిణిగా ప్రింటర్‌గా, సహకరించింది. స్మగ్లింగ్‌ను అరికట్టే ఉద్యోగం చేస్తూ ఏడాదికి యాభై పౌండ్ల జీతం పొందుతున్నాడు. జీన్ స్వయంగా పొలం పనులు చేస్తూ, చేయిస్తూ ఉండేది. మరో బిడ్డ జననం. ఇక్కడి నీరస జీవితం బోర్ కొట్టింది.

ముప్ఫై రెండులో అన్నే పార్క్ అనే బార్‌లో అమ్మాయిని పడేశాడు ప్రేమలో. ఆమె ఆరాధనలలో మళ్ళీ కవిత్వం దూకి పారింది. ఈ ప్రేమకు ఒక కూన కూడా పుట్టింది. అక్కడ జీన్ మరో పిల్లాడిని కన్నది. ఐలిష్‌లాండ్ వ్యవసాయం ఏమీ కూడు పెట్టటం లేదని గ్రహించి మొత్తం అంతా అమ్మేశాడు. డంఫ్రైస్‌కి మరాం మార్చి వచ్చేకొద్ది జీతంతో బతికాడు. అయిదేళ్ళు ఇక్కడే ఉండి చనిపోయాడు. రాజకీయాలు, పౌర సమస్యలపై రాశాడు. 1776 అమెరికన్

కాంగ్రెస్‌ను మెచ్చుకొన్నాడు. ఫ్రెంచ్ విప్లవాన్ని సమర్థించాడు. 1792లో నిత్య గర్భిణి అనిపించుకొన్న జీన్ ఇంకో పిల్ల ఎలిజబెత్‌ను ప్రసవించింది. పొలంలో పంట పండించలేకపోయినా భార్య జీన్ కడుపు పండిస్తున్నాడీ హాలిక కవి. ఇదివరకటిలానే ఈ సంతానమూ దక్కలేదు. బర్న్స్‌కు ఫిట్లు, తాగుడు వలన వాత రోగం వచ్చింది. అయినా "జాన్ ఆండెర్సన్ మై జో" అనే పురాతన బూతుకథను ఆధునిక పరిభాషలో మార్చి వివాహ బాంధవ్యాన్ని బలపరచేట్లు రాశాడు. కిల్మార్ నాక్ ఎడిషన్ తర్వాత ఆరేళ్ళకు కొత్త ఎడిషన్ తెచ్చాడు. అందులో ఇరవై తొమ్మిది కొత్త కవితలున్నాయి. ఇందులో కొన్ని "రౌడీ రైమ్స్" కూడా చేరాయి.

ముప్ఫైలలో వ్యాధి పెరిగింది. ఇంకో ఏడాదికి మరీ క్షీణించిపోయాడు. ఆకలి లేదు. ఎముకల పోగుగా మిగిలాడు. గోరు చుట్టుమీద రోకటిపోటులా ఒక పబ్లిషర్ బర్న్స్ ఒక బిల్లుకు డబ్బు చెల్లించలేదని కోర్టుకెళ్లాడు. జైలుకు వెళ్ళాల్సి వస్తుందేమోనని భయపడ్డాడు. భార్య జీన్‌కు జాబు రాశాడు పరిస్థితిని తెలియజేస్తూ. అవే చివరి అక్షరాలు. 21-07-1796న హాలికుడై, నిరాశతో ఆల్కహాలికుడైన కవి రాబర్ట్ బర్న్స్ చనిపోయాడు. గొప్ప కవుల జాబితాలో బర్న్స్ చేరాడు. లోతైన అంతర్ దృష్టి, ఊహ లేని కవి. భాష హోరెత్తిస్తుంది. రసహీనత ఇబ్బంది కలిగిస్తుంది. కాని "Burns distilled a pure essence of the crude stuff of life" అని తేల్చారు. "A conciliation of the regional and the universal was finally accomplished. The overwhelming conflicts may have resulted in the death of the peasant, but they brought everlasting life to the poet".

బర్న్స్ కవిత్వంలో రిపబ్లికనిజంతో బాటు రాడికలిజం కూడా ఉన్నాయి. అతని దస్తూరి అనేక రకాలుగా ఉండేది. అందుకని "మానిక్ డిప్రెషన్"లో ఉండేవాడని తెలుస్తోంది. "బ్లూ డెవిలిజం"తో బాధపడినట్లు అతనే చెప్పుకొన్నాడు. స్కాటిష్ కేనడియన్లు బర్న్స్‌ను అమితంగా ఆరాధించారు. అమెరికా నవలాకారుడు స్టెయిన్ బెక్ బర్న్స్ కవితలో ఒక భాగాన్ని తీసుకొని "ఆఫ్ మైస్ అండ్ మెన్" నవల రాశానని చెప్పుకొన్నాడు. సాలింజర్‌కూ ప్రేరణనిచ్చిన కవి. బర్న్స్ రచనలు రష్యన్ భాషలోకి అనువాదం చెంది సామాన్యులను విశేషంగా ఆకట్టుకొన్నాయి. "ఏ మాన్స్ ఏ మాన్" కవిత రష్యన్‌లకు ప్రగతి శీలంగా అనిపించి "ప్రోగ్రెసివ్ ఆర్టిస్ట్" అన్నారు. 1924 రష్యాలోకి అనువదింపబడిన కవితలు ఆరు లక్షల కాపీలు అమ్ముడై రికార్డు సృష్టించాయి. బర్న్స్ ప్రత్యేక స్టాంప్‌ను రష్యా ప్రభుత్వం విడుదల చేసింది. రాబర్ట్ బ్రౌన్ స్కాలర్షిప్పులిస్తున్నారు. బర్న్స్ పేర అయిదు, పది పౌండ్ల కరెన్సీ నోట్లు విడుదల చేశారు. "ది గ్రేటెస్ట్ స్కాట్"గా గౌరవించి ఆరాధిస్తున్నారు.

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 32

# అంతమైన స్వప్నం

**ఒ**కరి ప్రతిభతో ఒకరు పోల్చటానికి వీలు లేకపోయినా వర్డ్స్‌వర్త్, కాల్రిడ్జ్ టేలర్, సూతీలు కొత్త మార్గాలు తొక్కారు. తిరుగుబాటు చేయకపోయినా వ్యతిరేకించారు. మనిషి సాటి మనిషిపై బాధ్యత గురించి ఆలోచించారు. రాజకీయాల బదులు సాంఘిక నీతి రాజ్యమేలాలని స్వప్నించారు (యుటోపియ). తమ సృజనతో ఆత్మశక్తిని అందించి మంచి గొప్ప ప్రపంచం కోసం కలలు కన్నారు. కాని అవి కల్లలే అయ్యాయి. దీనికి అనేక సంఘటనలు కారణమయ్యాయి. వాగ్దానాల హోరెక్కువైంది. బాస్టిల్లీ పతనం వలన రోమాన్స్ రివల్యూషన్‌లు పల్చబడ్డాయి. తిరుగుబాటు యువకుల కర్తవ్యమే అయింది. కవులు శృతి కలిపారు. వర్డ్స్‌వర్త్ వీరందరి తరఫునా వకాల్తా తీసుకొని "Bliss was it in that dawn to be alive - but to be young was very heaven" అని చెప్పాడు.

కల సాకారం కావాలనే అందరూ భావించారు. స్థబ్దత నుంచి చైతన్యం రావాలని కోరారు. కాని శిష్యులకు వాస్తవం చెడు అయింది. హింస ధ్వనిని తట్టుకోలేకపోయారు. ఫ్రెంచ్ విప్లవం తరువాత నాలుగేళ్ళకు ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌తో యుద్ధం చేసింది. నియంత నెపోలియన్ బెదిరింపుతో భయంతో పందొమ్మిదో శతాబ్ది ఉదయించింది. తిరుగుబాటు విముక్తి అని యుద్ధం భావ శుద్ధి (కేతార్సిస్)కి అన్న అభిప్రాయం తప్పు అయింది. యువత అంతా మధ్య తరగతి కన్జర్వేటివ్లుగా మారారు. సూతీ ఆస్థాన కవి అయ్యాడు. కాల్రిడ్జి లైబ్రరీ పుస్తకాలలో కూరుకుపోయాడు. వర్డ్స్‌వర్త్ ప్లేటు మార్చి "టోరీ" అయ్యాడు.



**ప్రకృతి కవి – విలియం వర్డ్స్‌వర్త్**

ప్రకృతి కవి అని పిలువబడే విలియం వర్డ్స్‌వర్త్ 07-04-1770 న కంబర్‌లాండ్‌లో కాకర్ మౌత్‌లో పుట్టాడు. ఇది అందమైన లేక

డిస్ట్రిక్ట్‌లో డార్వేంట్ నదీ తీరంలో ఉంది. తండ్రి లాయర్. ఎస్టేట్ వోనర్ కూడా. వీరిని "నార్త్ కంట్రీ పీపుల్స్" అంటారు. పురాత యార్క్ షైర్ ముతక మనషులని ముద్రపడ్డారు. భాష కూడా చాలా మొరటుగా ఉంటుంది. అయిదుగురు పిల్లలలో విలియం రెండవ వాడు. తల్లి ముప్ఫై ఏళ్ళకే చనిపోయింది. విలియం సోదరి డరోతి కంటే భిన్న మనస్తత్వం ఉన్నవాడు. చిన్నప్పుడే మూడీగా కొరుకుడు పడనివాడుగా ఉండేవాడు. ఒకసారి కోపపడితే గదిలో దూరి చస్తానంటూ బెదిరించాడు. అమ్మ తరపు బంధువులైన "కూకాంస్" తరచూ వచ్చి వెల్తూండేవారు. వారిలో మేరీ హచిన్సన్ అనే కజిన్‌పై ప్రేమలో పడి పెళ్లి చేసుకొన్నాడు. తల్లి చావు తరువాత ఎనిమిదో ఏట హాక్‌షెడ్‌లోని గ్రామర్ స్కూల్‌కు పంపారు. ఏదో వానాకాలం చదువు చదివి అత్తిసరు మార్కులతో ముక్కాడు. క్లాసు పుస్తకాలలోని చదువుకంటే విండర్ మీర్, ఆమ్బుల్ సైడ్ పర్వత దృశ్యాల వలన నేర్చిన చదువే ఎక్కువ. ఇంటిలో ఉండే ఆనందం కంటే ఇక్కడే ఎక్కువ ఆనందం, సంతోషం పొందేవాడు. ఆటా, పాటా, స్కేటింగ్, నడక, కొండలెక్కి దిగటం, సరస్సులో స్నానాలు ఎంతో ఇష్టంగా ఉండేవి. స్వీయ జీవిత చరిత్రగా పిలువబడే "ప్రిల్యుడ్"లో ఇవన్నీ రాసుకొన్నాడు కవితాత్మకంగా. "Attends upon the motion of the winds - embodied in the mystery of words" అందుకే ఈ కవిని "The essential passions of the heart"కు అంకితమైన కవి అంటారు.

తండ్రి మరణం తర్వాత కుటుంబం విచ్ఛిన్నమైంది. పద్నాలుగేళ్ళప్పుడు అన్న రిచర్డ్‌తో కలిసి అమ్మ తరపు "కాక్సంస్"ల దగ్గరకు చేరాడు. చిన్నప్పటి నుంచి అన్యోన్యంగా మెలగిన సోదరి డరోతి తల్లి కజిన్ దగ్గర పెరుగుతోంది. పదేళ్లకు కాని ఆమెను మళ్ళీ చూడలేకపోయాడు. ఎవరి మీదో ఆధారపడి ఉండటం ఇష్టంలేని విలియం పదిహేడవ ఏట సెయింట్ జాన్స్ కాలేజిలో చేరి విశేష ప్రతిభ కనబరచకుండానే చదువుపై అంతశ్రద్ధ లేకుండా చదువంటే ఏవగింపు కలిగి మానేశాడు. వికారంగా "వేగబాండ్"గా కనిపించేవాడు. మృదు స్వభావం లేదు. మొరటుతనమే కనిపించేది అన్నిట్లోనూ. స్నేహితులూ ఏర్పడలేదు. ఒంటరిగా రోడ్లమీద తిరుగుతూ బయటికి వినిపించేట్లు పాడుకొంటూ తిరిగేవాడు. వంద పంక్తుల "యాన్ ఈవెనింగ్ వాక్" కవిత రాసి తన తీరు తెన్నులను నింపాడు. జేమ్స్ బీటిల్ అనే మినిస్ట్రెల్ "ప్రిల్యుడ్" రాయమని ప్రోత్సహించాడు.

కాలేజిలో చదువు పూర్తిచేసి "లా" చదువుతాడేమోనని కుటుంబం ఆశ పడింది. మనవాడికి ఆ ధ్యాసే లేదు. పార్శ్వ నెప్పి. తలనెప్పితో బాధపడేవాడు. విలియం ఏది చేసినా చెల్లెలు హర్షించేది. "ఆరోగ్యం బాగా ఉంటే వాడే "లా" చదువుతాడులే" అని సర్ది చెప్పేది. సైన్యంలో చేరాలనుకొన్నాడు. లండన్ చేరి ఫ్రాన్స్‌లో జరుగుతున్న విషయాలు తెలుసుకొన్నాడు. బాష్టిల్లి పతనమైంది. రాజరికాన్ని కూలద్రోసి ప్రజాస్వామ్యం ఏర్పరచారు. ప్రీల్యుడ్ కవితలను

బ్యూపే అనే అతను మెచ్చి ప్రోత్సహించాడు. స్వార్థ రహిత విప్లవ వాదిగా మారాడు. దానినే "France standing at the top of golden hours - and human nature seeming born again" అని కవిత్వీకరించాడు. నిరంకుశత్వాన్ని ఈసడించాడు. ప్రజలు తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని చెప్పాడు. ఇదొక "యుటోపియా". దీన్ని సాధ్యం చేయాలని ఆలోచించాడు. ఒకరకంగా పునర్జన్మ పొందాడు. ఆర్లియాన్స్‌లో ఒక లాడ్జిలో ఉన్నాడు. పాల్‌వాలన్‌తో పరిచయం జీవితాన్నే మార్చేసింది. ఆయన తన సోదరి "ఆన్నేట్టే"ను కవికి పరిచయం చేశాడు. ఆమె ఫ్రెంచ్ కన్య. మనవాడి మారిన మనస్తత్వం ఆమెకు నచ్చింది. ఇద్దరూ ప్రేమలో పడి ఒక కూతురు, ఆన్ కరోలిన్‌ను కన్నారు. ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మధ్య యుద్ధం మొదలైంది. ఎక్కడికీ కదిలే వీలే లేకుండాపోయింది. భార్య పిల్లను పంపే అవకాశమే లేదు. ఇంగ్లీష్ దేశస్థుడైనా తను "ప్రపంచ భక్తుడు" అనిపించుకొన్నాడు. ఆ ఊహా ప్రపంచానికి తన భార్య ఒక ప్రతీక అనుకొన్నాడు.

ఇరవై మూడులో తీవ్ర హింసల పాలయ్యాడు. ఫ్రాన్స్‌లో హింస రాజ్యం చేస్తోంది, కాని ఇది ప్రపంచ విముక్తికి దోహదం చేస్తుందనుకొన్నాడు పాపం. భార్య విషయంలో ఆందోళన ఎక్కువైంది. అక్రమ సంతానానికి కారకుడైనందున ఇంట్లోకి రానివ్వలేదు. అక్కడ భార్య ఇతనికోసం ఎదురు చూస్తోంది. భర్త ఏదో ఒకరోజు వచ్చి కలుసుకొంటాడని ఎదురు చూస్తోంది. కాని మనవాడు ఆ జ్ఞాపకాలన్నీ తుడిచేసుకొన్నాడు. ఆమెతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను తగలబెట్టాడు. ఈ ఉదంతాన్ని డెబ్భై ఏళ్ళు దాచేశాడు. విలియం మరణం తర్వాతే ఇది బయటపడింది. ఆమెకు ద్రోహం చేశానని మనసు క్షోభ పడుతోంది. విప్లవం ఊపులో అన్నీ మరిచాడు. చివరికి అది రక్తపుటేరులను పారిస్తోందని తెలుసుకొన్నాడు. ట్యూటర్‌గా, మేగజైన్‌కు రచయితగా ఉండాలనుకొన్నా సాగలేదు. సంపాదనే లేదు. స్నేహితుల దయాదాక్షిణ్యం పైనే జీవిస్తున్నాడు. క్షయతో మరణానికి చేరువలో ఉన్న రైస్లీ అనే అతనికి సేవ చేశాడు. అతని మరణంతో తొమ్మిది వందల పౌండ్లు లభించాయి.

డరోతి మేనమామల ఇల్లు వదిలి విలియంను చేరింది. పల్లెటూరులో ఉండాలని కోరింది. అతను "నేచర్స్ లారియెట్" కావాలని భావించింది. లండన్ వెళ్ళిపోయాడు. మళ్ళీ డొర్సేట్ షైర్‌లో రేస్ డౌన్‌లో ఒక అద్దె ఇల్లు తీసుకొని ఉన్నారు. వారిద్దరి మధ్య విపరీతమైన ఆకర్షణ, ప్రేమ ఉండేవని చరిత్రకారులు చెప్పారు. వారిద్దరి మధ్యా సంభాషణలు కూడా ప్రేమికుల సంభాషణల్లా ఉండేవి. ఆమె ఇతని భావాలకు విరుద్ధంగా కనిపించేది. ఇరవై మూడేళ్ళ వయసులో ఒక పబ్లిషర్ విలియం రాసిన "డిస్క్రిప్టివ్ స్కెచెస్", "యాన్ ఈవెనింగ్ వాక్"అను ముద్రించి ఇచ్చాడు. ఇవి ఆగస్టన్ పోయిట్రీకి అనుకరణ. సమీక్షలు ఆశాజనకంగా రాలేదు. కాల్ రిడ్జి వచ్చి వీరితో చేరిన తర్వాతే వర్డ్స్‌వర్త్ "వర్త్ ఏమిటో" లోకానికి తెలిసింది.

ఆంగ్ల కవిత్వ తీరుతెన్ను మార్చేసే కవిత్వం వచ్చింది. కాల్ రిడ్జికి విపరీతమైన భావోద్రేకం, ఊహ ఉన్నాయి. వర్డ్స్‌వర్త్, కాల్‌రిడ్జి, సూతే త్రయం అవిభాజ్యమై కొత్త పోకడలతో ఇంగ్లీష్ కవిత్వాన్ని కదను తొక్కించారు.



**సామ్యుల్ టేయిలర్ కాలర్ రిడ్జి**

కాల్‌రిడ్జ్ రాసి వదిలిన వాటిని పూర్తిచేయటానికి రెండు నిండు జీవితాలు చాలవు అంటారు. తేల్చుకోలేని మనస్తత్వం. నల్లమందు భాయీ. 21-10-1772లో దేవాన్‌లో సెయింట్ మేరీలోని ఒటారిలో జన్మించాడు. పదముగ్గురిలో చివరి సంతానం. అన్నతో గొడవపడి, వాడు చావకొడితే నది ఒడ్డున స్పృహ తప్పి పడిపోయి మర్నాటి దాకా లేవలేదు. చలికి ఒళ్ళు మొద్దుబారింది. దీనితో నరాల బాధలేర్పడ్డాయి. అందువలన జీవితం అంతా దాదాపు పనికిరాని వాడుగా ఉండిపోవాల్సి వచ్చింది. ఒంటరిగా పుస్తకాలతో కాలక్షేపం చేశాడు. “అరేబియన్ నైట్స్” చదివి ఆరేళ్ళ వయసులో సాహస గాధలంటే మహా ఇష్టపడ్డాడు. మాయలు మంత్రాలు తమాషా కథలు చదివి రాత్రుళ్ళు పలవరించేవాడు. తొమ్మిదో ఏట దరిద్రంతో తండ్రి చనిపోయాడు. ఒక లోకల్ జడ్జి కాల్‌రిడ్జిని చారిటీ స్కూల్‌లో చేర్పించాడు. అక్కడి మురికి వాతావరణం నచ్చలేదు. తిండి అసలు బాగా లేదు. చిన్న రొట్టెముక్కే గతి. ఇవి భరించలేక ఒక మూల చేరి “చదువే చదువు”గా గడిపాడు. రివరెండ్ జేమ్స్ బాయర్ అనే టీచర్ మాత్రం ఇతన్ని దారిలో పెట్టి మార్చాడు. “Boy! the school is your father. The school is your mother - the school is your sister, your brother all the rest of your relations” అని ప్రబోధించాడు. బీజస్‌ను ప్రేమించమని బోధించాడు. అంతే కాల్‌రిడ్జి జీవితం కార్నర్ తిరిగింది.

అతని చూపుల్లో మార్పు వచ్చింది కాని కవళికలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. కళ్ళల్లో కాంతి ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. అందరిలో కొట్టవచ్చినట్లు ప్రత్యేకంగా కనిపించేవాడు. విలియం “రిడ్జి”ని ఇంటికి ఆహ్వానిస్తే అతని సోదరి ఇవాన్స్‌పై మనసు పారేసుకొని, చెట్ట పట్టాలేసుకొని తిరిగాడు. ఆమెపై కవితా వర్షం కురిపించాడు. కాల్ సోదరుడు లూక్ డాక్టర్ అయ్యాడు. మనవాడికి సర్జన్ అవాలనే అభిలాష కలిగింది. కుప్ప తెప్పలుగా మెడికల్ పుస్తకాలు, సామగ్రి అందుబాటులో ఉన్నాయి. రోగాల, మందుల గురించి సమగ్ర జ్ఞానం సాధించాడు. ఇదంతా ఒక భ్రాంతిలో చేసిన పని. కీళ్ళవాతం తిరగబెట్టింది. పదిహేడు నుండి పందొమ్మిదేళ్ళ వరకు మంచం మీదే ఉండిపోయాడు.

జీసస్ కాలేజ్ కేంబ్రిడ్జి నుంచి స్కాలర్‌షిప్ పొందాడు. మంచానికే పరిమితమైపోయాడు

జబ్బుతో. ఫ్రెంచ్ రివల్యూషన్ చూసి రిపబ్లికన్‌గా మారి గొప్ప వక్త అయ్యాడు. అప్పులు ఎక్కువయ్యాయి. తప్పించుకోవటానికి లండన్ పారిపోయాడు. దీనినే అతని భాషలో " I field to London to debauchery" అన్నాడు. సంపాదన లేదు. ఉన్నదానితో గాంబ్లింగ్ ఆడాడు. ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇరవై ఒకటిలో పేరు మార్చుకొన్నాడు. ఆర్మీలో చేరాడు. నాలుగు నెలల తర్వాత సోదరుడు జార్జి చలవతో బయటపడ్డాడు. అన్నీ తొందరబాటు నిర్ణయాలే. కేంబ్రిడ్జికి తిరిగి వచ్చి స్కాలర్‌షిప్ పునరుద్ధరింపబడితే చదువు సాగించాడు. అద్భుతంగా అనేక అనువాదాలు చేశాడు. మొదటి రచన "లెవ్ టి" మొదలెట్టాడు. దీనికే "సర్కాసియాన్ లవ్ చాంట్" అని మరోపేరు. రాబర్ట్ సూతీతో పరిచయమేర్పడింది. ఇద్దరికీ కవిత్వం పిచ్చి ఎక్కువే.

**రాబర్ట్ సూతీ**



12-08-1774లో బ్రిస్టల్‌లో పుట్టాడు రాబర్ట్ సూతీ. వంశం బాగా గౌరవాదరాలున్నదే. తాత సోమర్సెట్ రైతు. తండ్రి బట్టల వ్యాపారి. తల్లి సంపన్న గృమం నుంచి వచ్చింది. సూతీ పిన తల్లి రక్షణలో పెరిగాడు. ఆడపిల్లలూ ముద్దుచేసి డ్రెస్ చేసి ఆరేళ్ళ వరకు పెంచింది. ఎనిమిదో ఏట "స్కిపియో" అనే ట్రాజెడీ రాశాడు. తర్వాత కవిత్వం రాశాడు. పదమూడులో పెద్ద అంత్యప్రాసల కవిత్వం రాశాడు. లాటిన్‌లో పాండిత్యం సంపాదించి తోటి వారికి నేర్పాడు.

స్కూల్ చదువు కుంటి నడక నడుస్తోంది. "ది ఫ్లాజలేంట్" అనే స్కూల్ మేగజైన్‌ను నిర్వహించాడు. కాలానికి భిన్నమైన దోరణులుంటే స్కూల్ నుంచి బయటికి పంపేశారు. క్రైస్ట్ చర్చికి అప్లై చేస్తే తిరస్కరించారు. ఆక్స్‌ఫర్డ్‌లోని బిలియాల్ కాలేజి అడ్మిషన్ ఇచ్చింది. అందులో చేరిన కొద్దిరోజులకే బ్రిటన్, ఫ్రాన్స్ యుద్ధం మొదలైంది. చదువు వదిలేసి రిపబ్లికన్ అయ్యాడు. అక్కడ దేశంలో కొంపలు మునుగుతుంటే, స్వతంత్రం కోసం పోరు సాగుతుంటే కాలేజిలో "యూక్లిడ్" చదువుతూ కూర్చోవటం భావ్యం కాదనుకొన్నాడు. ఈ భావాలతో "జోన్ ఆఫ్ ఆర్క్" రాయటం ప్రారంభించాడు. ఇంకా అప్పటికి వేదాంతం ఒంట బట్టలేదు. యువరక్తపు పొంగులో రాసిన రచన అది. సమాజానికి తీవ్ర చికిత్స కావాలన్నాడు. అమెరికా వెళ్ళాలనే ఆలోచనా వచ్చింది. అమెరికాలో స్వాతంత్ర పోరాటం నచ్చింది. స్వేచ్ఛ పొందటం ఆకర్షించింది.

**అరిస్టోక్రసికి వ్యతిరేకంగా పాంటిసోక్రసి ఏర్పాటు**

సూతీ కాల్రిడ్జి స్నేహిత బృందం ఆడా మగా కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొన్నారు.

ఆదర్శ జీవితం గడపటమే ధ్యేయం. అందులో పన్నెండు జంటలు ఉన్నాయి. కొంత పొలం సంపాదించారు. ప్రతివారూ రోజుకు మూడు నాలుగు గంటలు కష్టపడి పనిచేయాలి. వచ్చింది అందరూ సమానంగా అనుభవించాలి. ఒక నమూనా రాజ్యస్థాపన చేయాలని ఆదర్శం. యుద్ధానికి, విప్లవానికి దూరంగా ఉండి దీన్ని సాధించాలని ప్లాన్. కాల్రిడ్జి దీనికి "పాంటిసోక్రసి" అని పేరు పెట్టాడు. ఇది అరిస్టోక్రసికి వ్యతిరేకం. స్వయం నిర్ణయ ప్రభుత్వం ఏర్పడాలి. కొద్దిమందిని ఎన్నుకొని వారి ద్వారా పాలన సాగించాలి. ఇందులో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులూ, బాధ్యతలు ఉంటాయి. ఇదొక సాంఘిక సంస్థ. వీరి భావనలు, అభిప్రాయాలు అంతా కవితాత్మకంగా ఆకర్షణీయంగా ఉన్నాయి. కొంతకాలం ఈ "స్వప్నలోక విహారం" బాగానే నడిచింది. కాని కాల్రిడ్జి ఇవాన్స్‌ను మర్చిపోలేకపోతున్నాడు. సారా ఫ్లికర్‌కు లైన్ వేస్తున్నాడిక్కడ. ఇంగ్లాండ్ వదిలి ఊహాలోకంలో విహరించవద్దని మేరీ ఇవాన్స్ చెబుతూనే ఉంది. ఆమె ఇతన్ని సోదరుడిలాగా భావిస్తున్నానని రాసింది. షాక్ అయి అవాక్కయ్యాడు. ఇరవై మూడు వయసులో కాల్రిడ్జి సారాను పెళ్లి చేసుకొన్నాడు. యెంత పకడ్బందీగా ప్లాన్ చేసినా "పాంటిసోక్రసి" ఇబ్బందుల పాలయ్యింది. ఇంగ్లాండ్ అమెరికాల మధ్య కొత్త ఒప్పందం కుదిరింది. ఈ బృందం వేల్సులో ఒక ప్రదేశాన్ని ఎన్నుకొని అక్కడికి చేరి రచనలు చేసి, వ్యవసాయం చేస్తూ డబ్బు సంపాదించాలనుకొన్నారు. ఇందులో ఇద్దరు అప్పుల్లో మునిగి ఉన్నారు. బృందం చీలిపోయే దశకు చేరింది. "The fraternal group ceased to fraternize" అయిపోయింది. ఒకరినొకరు తిట్టుకొన్నారు. సూతీ రహస్యంగా ఎడిత్‌ను పెళ్ళాడాడు. ఆమెలా చదవటానికి నిర్ణయించుకొంది. కాల్రిడ్జి ఈ ముఠాను వదిలేసి క్లేవ్‌డాన్ చేరి కవిత్వంలో పడ్డాడు.❋

**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 33**

# ముగ్గురు కవుల ముచ్చట్లు

**కా**ల్ రిడ్జి, నెదర్‌వేలో ఉన్న టాంపూల్ ఉన్న ఊరికి వెళ్ళాడు. అది బాగా నచ్చింది ఇక్కడే సారాబిడ్డను కన్నది. నుదిటి నుంచి బుజాల దాకా బాధ ఎక్కువైంది. ఇప్పటిదాకా వాడుతున్న నల్లమందు డోసు బాగా పెంచాడు. అయినా తగ్గలేదు. 1797లో రేస్‌డౌన్‌లో ఉన్న వర్డ్సువర్త్‌ను కలుసుకొన్నాడు. అనుంగు మిత్రుల్లా ఉన్నారు. సూతీ విషయం చర్చించారు. సాధారణంగా తీసుకోవటమే తప్ప ఇవ్వటం తెలియని వర్డ్సువర్త్ ఇప్పుడు ఆతిధ్యంలో ఆరి తేరాడు. ఆల్ఫాక్సేన్‌కు మారిన ఆయన్ను దాదాపు రోజూ చూసేవాడు. 1798 ఈ కవులిద్దరు కలిసి "లిరికల్ బాలడ్స్"ను రొమాంటిక్ పద్ధతిలో రాయాలని నిశ్చయించారు. రాసిన దానికి కొత్తదనం, ఆకర్షణ తెచ్చాడు కాల్‌రిడ్జి. అది 1800లో విడుదలైంది. మరో రెండేళ్ళ తర్వాత మార్పులు చేసి మళ్ళీ ప్రచురించారు. వర్డ్సువర్త్ ముందుమాట రాశాడు. "Wonder and beauty could be achieved by the mere mention of words like wondrous beautiful and that the cliches and circumlocuations of the established poetic diction were in themselves poetry" అనే అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. "Poetry not only could but should be written in the language really used by men" అని చెప్పాడు. లిరికల్ బాలడ్స్‌కు స్పందన పెద్దగా రాలేదు. నిరుత్సాహపడ్డారిద్దరూ. కొన్ని తరాలను ప్రభావితం చేసిన ఈ కవితలు అప్పుడు మాత్రం ఆదరణకు నోచుకోలేదు. కాల్‌రిడ్జి రాసిన "ది రైం ఆఫ్ ది ఏన్షెంట్ మారినర్" ఇంగ్లీష్ సాహిత్యానికే వన్నె తెచ్చింది. అలాగే వర్డ్సువర్త్ రాసిన సాలి లోక్వి "Lines composed a few miles above Tintern Abbey" గొప్ప ప్రభావాన్ని కలిగించినా దానిపై దృష్టిపడలేదు. అందరూ ఎక్కువగా ఉదహరించే వర్డ్సువర్త్ నిర్వచనం "Poetry is the spontaneous overflow of powerful feeling - takes its origin

from emotion recollected in tranquility"కు మంచి ఉదాహరణ.

దీని తర్వాత కాల్‌రిడ్జి కష్టాల్లో, బాధల్లో పడ్డాడు. ప్రారంభించిన "కుబ్లాయ్ ఖాన్" పూర్తి కాలేదు. అది పెద్ద నష్టం అన్నాడు. కుబ్లాయ్ ఖాన్‌లో మంత్రాలున్నాయని, పునరావృత్తమైన ప్రతిచోటా అద్భుత శక్తి గోచరిస్తుందని, అది గోథిక్ నమ్మకానికి విజయమని సర్వోత్కృష్ట రచన అని భావించాడు.

సూతీ ఇంగ్లాండ్ తిరిగి వచ్చేశాడు. పోర్చుగల్‌లో ఆరు నెలలుండిన స్వభావాన్ని మార్చుకొన్నాడు. సూతీ వర్డ్స్‌వర్త్‌ను కాల్‌రిడ్జిని మరీ సన్నిహితులయ్యేట్లు చేశాడు. ఈ ఇద్దరు కలిసి జర్మని వెళ్ళారు. జర్మని సాహిత్యాన్ని అవలోడనం చేసి ఆ ఫిలాసఫీని క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నాడు కాల్‌రిడ్జి. వర్త్ మాత్రం అంత ఉత్సాహం చూపకుండా గోస్లార్ వెళ్ళాడు. అక్కడ "లూసీ పోయెమ్స్" రాయటం ప్రారంభించాడు. దీనికి డరోతి కాని వేరెవరైనా అజ్ఞాత వ్యక్తికాని ప్రేరణ అయి ఉండాలి. ఇందులో తన బాల్య జ్ఞాపకాలను పొందుపరచాడు. జర్మన్ భాష నేర్వలేకపోయాడు. జర్మన్లను ప్రేమించ లేకపోయాడు కూడా. మన శ్రీనాథుడు రాయలసీమ బాధల్ని చాటువులుగా చెప్పినట్లు జర్మని అనుభవాల్ని కవిత్వీకరించాడు.

"I travelled among unknown men in lands beyond the sea - nor England, did I know till then - what love I bore to thee - it is past melancholy dream - nor will I quit the shore - a second time, for still I seem - it love thee more and more" అంటూ మాతృదేశం ఇంగ్లాండ్‌కు దూరమైనందుకు బాధపడ్డాడు.

1799 డిసెంబర్‌లో డరోతితో విండర్ మియర్ దగ్గర డవ్ కాటేజిలో కాపురం పెట్టాడు. పల్లెప్రాంతం. అందమైన కొండలు, ఆకర్షణీయ ప్రకృతి అందాలు మనసును పరవశింపజేశాయి. తాను డెమొక్రాట్‌గా ఉన్నానని అక్కడే విశ్రాంతి పొందుతానని చెప్పాడు. డరోతి కూడా తన "డార్లింగ్ బ్రదర్" వివాదాల జోలికి పోకుండా ప్రశాంతంగా ఇక్కడే ఉండటం ఇష్టం. ఆమెకు కాల్‌రిడ్జి అంటే ఫాసినేషన్ ఏర్పడింది. అతను భార్యకు ఇంకా విడాకులివ్వలేదు. ఆమె మెంటల్‌గా దెబ్బతిన్నది. ఆమెను చిన్నపిల్లలా చూసుకోవాల్సి వచ్చింది.

విలియంతో యూరప్ వెళ్ళింది. అతను భార్య అన్నేట్టేను, కూతుర్ని చూశాడు. పెళ్లి సంగతి తేలలేదు. భర్తగా ఆమెను సంతృప్తి పరచలేదు. ఫ్రాన్స్‌లో ఒక నెల ఉండి కూతురు కరోలిన్‌తో షికార్లు చేస్తూ గడిపాడు. ఇంగ్లాండ్‌కు తిరిగి వచ్చి మేరీ హచిన్సన్‌ను పెళ్లి చేసుకొన్నాడు. ఆమెపై కవితలు చిలికాడు. "She was a phantom of delight - when first she gleamed upon my sight - a perfect woman nobly planned - to warm, to comfort and command" అని పొగిడాడు. మేరీ,

దరోతిలు అన్యోన్యంగా ఉన్నారు. హనీమూన్‌కు ఈమె కూడా వెళ్ళింది. మేరీ నలుగురు పిల్లల్ని కంటే ఇద్దరు ముందే పోయారు. సారా హచిన్సన్ కూడా వీరితో కలిసిపోయింది.

కాల్‌రిడ్జి పరిస్థితి "నానాటికి తీసి కట్టు నాగం భొట్లు"గా తయారైంది. తనలో కవి చచ్చిపోయాడని చెప్పాడు. ఆరోగ్యం కోసం మాల్టా వెళ్ళాడు. వర్డ్స్‌వర్త్‌తో కలిసి పని చేయలేననుకొని దానిని "The lachet of whose shoes I am unworthy to unloose" అని కవితాపరంగా చెప్పుకొన్నాడు. ఆధారం లేకుండా ఉండలేకపోతున్నాడు. ఇబ్బందులూ పడుతున్నాడు. పెడుతున్నాడు. కవితా శక్తి మందగించింది ఆరోగ్యంతో బాటు. "క్రిస్టబెల్" మొదలు పెట్టి చాలాకాలం అయినా పూర్తి చేయలేదు. టెక్నికల్ క్రిటిసిజం, వ్యాసాలూ, జర్నలిజంతో గడపాలనుకొన్నాడు. మాట్లాడటం మొదలెట్టితే నాన్‌స్టాప్‌గా మాట్లాడుతున్నాడని హేజ్లిట్ అన్నాడు. ఉపన్యాసాలిస్తున్నాడు కాని చప్పట్లు కొట్టించుకోలేకపోతున్నాడు. లండన్ వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగి రాలేదు. నలభై అయిదులో కవళికల్లో మార్పు బాగా వచ్చింది. చివరి పద్ధెనిమిదేళ్ళు కష్టాలు కొంత తగ్గాయి. కొడుకులిద్దరూ కవిత్వంలో దూసుకుపోతున్నారు. ట్రీట్‌మెంట్ పొందుతూ కూడా సృజన ఆపలేదు. "బయోగ్రఫాలిటరేటా" రాశాడు. వ్యాసాలను పరిష్కరించి పునర్ ముద్రించాడు. మిల్టన్, షేక్స్‌పియర్‌లపై ఉపన్యాసాలిచ్చాడు. జనం మెచ్చారు. "ది ఫ్రెండ్ అండ్ సిడిలిన్"కూ ఆదరణ వచ్చింది. ఫిలాసఫర్లు, సైంటిస్టులు కాల్‌రిడ్జితో సమావేశమై చర్చలు జరిపి ఆయన విలువైన అనుభవాలను తెలుసుకొనేవారు. "Reason is much nearer to sense than to understanding - for reason is direct aspect of truth an inward beholding" అని అభిప్రాయపడ్డాడు. ఆ ఆత్మశక్తితోనే చివరి రోజులు గడిపి 25-07-1834న కాల్‌రిడ్జి మహాకాలంలో కలిసిపోయాడు.

చనిపోయే ముందు సూతీని వచ్చి ఉండమన్నాడు. కాని అతను ఒక ఆదర్శంలో ఉన్నాడు. "All man needed to be successful was a comfortable religion and simply of common sense" అని రాసి రాలేదు. అతని "జోన్ ఆఫ్ ఆర్క్" బాగా పేరు పొందింది. అతని ఉత్తరాలూ బాగా ప్రఖ్యాతి తెచ్చుకొన్నాయి. చిన్న కవితలు బాగా ఆకర్షించాయి. "టాలబా ది డిస్ట్రాయర్", "ది కార్స్ ఆఫ్ కహేమ" అనే ఎపిక్‌లు రాసి విమర్శకుల ప్రశంసలు పొందాడు. క్వార్టర్లి రివ్యూలో అతను రాసిన వ్యాసాలు అందర్నీ అలరించాయి. "హెన్రి జేమ్స్‌పై" కవి చనిపోయిన తర్వాత మూడవ జార్జి సూతీని ఆస్థాన కవిని చేశాడు. సర్ వాల్టర్ స్కాట్‌కు ఇవ్వాలని ఆహ్వానిస్తే ఆయన తిరస్కరించాడు. తగినవాడు అని అందరూ మెచ్చారు. కాని నైతిక విలువలు లేని వాడికి ఈ పెద్దరికం ఏమిటి అని కొందరు గుసగుసలాడారు. గౌరవంతో బాటు కష్టాలు వచ్చాయి. చాలాకాలం దూరంగా

ఉన్న భార్యా పిల్లల్లో ఏడుగురు పిల్లలు చనిపోయారు. భార్యకు మతిస్థిమితం లేక శరణాలయంలో చేర్చారు. ఆమె చనిపోయిన వెంటనే కరోలిన్ బౌవేల్స్ అనే ఆవిడను పెళ్లి చేసుకొన్నాడు. మనస్సాక్షికి, సర్దుబాటుకు మధ్య నలిగిపోయాడు. 21-03-1843న రాజాస్థానకవి సూతీ మరణించాడు. వెస్ట్ మినిస్టర్ అబ్బేలో సమాధి చేసి గౌరవించారు. యాభై వాల్యూముల వచన కవిత్వం వెలువరించాడు. ఒకటి రెండు బాలడ్స్ తప్ప ఏవీ మిగల్లేదు.

**ఆధునిక కవిత్వానికి మార్గదర్శి వర్డ్స్‌వర్త్**

ఈ త్రయంలో అందరికంటే పెద్దవాడు వర్డ్స్‌వర్త్. సహచరుల మరణం తర్వాత చాలాకాలం జీవించి ఉన్నాడు. ఆత్మ దర్శనం, ఆత్మ సంతృప్తితో జీవించాడు. అతని మాటలు "మోనో లోగ్స్"లా ఉంటాయి. సంభాషణా చాతుర్యం లేదు. లేక్ డిస్ట్రిక్ట్‌లో మరో వైపున్న రైడాల్ మౌంట్‌కు చేరాడు. స్పానిష్ ప్రజలు క్రూర నియంత ప్రభుత్వాన్ని కూలదోసినప్పుడు మాట్లాడలేదు. ఇటాలియన్లు విముక్తి సాధించినప్పుడూ మౌనమే. "స్వేచ్ఛ కంటే రక్షణ ముఖ్యం" అని భావించాడు. ఫ్రీప్రెస్‌ను వ్యతిరేకించాడు. వెస్ట్ మోర్‌లాండ్‌కు స్టాంప్స్ డిస్ట్రిబ్యూటర్‌గా నియమింపబడ్డాడు. లిబరల్ వ్యతిరేకులను ఎదిరించాడు. దీనికి కానుకగా వెస్ట్ మోర్‌లాండ్‌కు "జస్టిస్ ఆఫ్ ది పీస్"ను చేశారు. డెబ్బై రెండులో పూర్తిగా టోరీ అయిపోయాడు. రాజు ఏడాదికి మూడువందల పౌన్ల పెన్షన్ ఏర్పాటు చేశాడు. సూతీ మరణించిన తర్వాత ఆస్థాన కవి అయ్యాడు. డ్రెస్‌ను అరువు తెచ్చుకొని వేసుకొన్నాడు. రాణి విక్టోరియా ముందు ఆ డ్రస్ వేసి ఒంగొని సలాం చేశాడు. దీన్ని ఆయనకు సరిపోయేట్లు కత్తిరించి సరిచేయటానికి టైలర్ మార్క్స్‌టన్ చాలా కష్టపడ్డాడట. రాబర్ట్ బ్రౌనింగ్ అసూయపడి కవితలో ఏడ్చాడు.

వర్డ్స్‌వర్త్ జీవితంలో చివరి పాతిక ఏళ్ళలో పెద్దగా ఏమీ రాయనేలేదు. కవిత్వాన్ని సరిదిద్దుకొంటూ, చర్చలు జరుపుతూ గడిపాడు. యాభైలో మొదలు పెట్టిన "ది ఎక్స్‌కర్షన్" జీవిత సాఫల్య రచనగా భావించాడు. అందులో ఫిలాసఫీ కాని, కవిత్వం కాని లేదన్నారు. డరోతీ ఆరోగ్యం కుదుటబడలేదు. కళ్ళు సరిగ్గా కనిపించక చదవటం మానేశాడు. ఎనభైవ పుట్టినరోజు తర్వాత కొన్ని రోజులకే 23-04-1850 వర్డ్స్‌వర్త్ కవి "ఈ వరల్డ్"ను వదిలేసి "వర్త్‌ను మాత్రమే" మిగిల్చి ఉంచేసి, పైలోకాలకు చేరాడు. ఆయన సమాధిపై "Two voices are there - one is of the sea - one of the mountains - each a mighty voice" అని ఆయనే రాసుకొన్న కష్లేట్‌ను రాసిన శిలాఫలకాన్ని ఉంచారు.

ఇంగ్లాండ్‌లో గొప్ప కవుల్లో ఒకడు. గొప్ప ఫిలాసఫర్. అందరు ఉదహరించే అనేక కవితా పంక్తుల్ని రాసి జనం నాలుకపై వర్ధిల్లాడు. అతనిలో రెండు విరుద్ధ

ప్రకృతులున్నాయి. ఒకటి యువ బే ఫర్వాతనం, తీవ్ర మనస్తత్వం. రెండోది పండిన ముసలితనంలో జ్ఞాన సంపాదనతో రాసిన ఆదర్శ కవిత్వం. ఇందులో ప్రతిమాటకూ సార్ధకత ఉంది. తన కవిత్వాన్ని తానే ఎస్టిమేట్ చేస్తూ "To console the afflicted, to add sunshine to daylight by making the happy happier. But a poem is not primarily a therapy its purpose is not to instruct, although it may do so, but to delight" అని చెప్పాడు. ఆత్మ పరిశీలన ఉన్నవాడు. ఒక ట్యూటర్ లాగా చెబుతాడు. అందుకని ఆయన కవిత్వం పాఠంలాగా కాకుండా "రిపోర్ట్ కార్డ్"లాగా ఉంటుందని కొందరి అభిప్రాయం. ఉపదేశం ఇవ్వటానికే ప్రాధాన్యం ఇచ్చాడు. ఇది అబ్సర్డ్‌గా అనిపిస్తుంది. మనుషుల యదార్ధ భాషనేమీ ఆయన ఉపయోగించలేకపోయాడు. గ్రామీణ ప్రజల గురించి రాసినా, వారి ఆదరణ పొందలేదు. తనకు తాను తప్ప ఎవరూ తెలియదన్నాడు.

"The giant Words Worth - god love him" అని కాల్‌రిడ్జి మెచ్చాడు. మిల్టన్ తర్వాత ఇంత గొప్ప కవి ఇంగ్లాండ్‌లో పుట్టలేదన్నారు. ప్రకృతి తన ఆరాధనకు స్పందించింది అంటాడాయన. ప్రకృతిని చూసి మురిసే పసివాడి కంటే ఆరాధించే కుమారుడిలా కనిపిస్తాడు. ఆయన గురించి ఎవరెన్ని చెప్పినా, అన్నా ఆయన మాత్రం "Mover and shaker"గా ఉండిపోయాడు. "He altered the course of English literature by the very contradictions of his theory and practice. He made us revise our concept of the poetic idiom and in his revitalization of the language, changed the tone as well as the direction of modern poetry".




"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 34

# చిత్ర విచిత్రాలకు ప్రేరణ

**టె**క్నిక్, ప్రయోగాలలో కవిత్వంలో అనేక మార్పులొచ్చి కొత్త శబ్ద సృష్టి జరిగింది. ఈ సృష్టికర్తలకు దూరంగా కొద్దిమంది దూరమై చిత్రాలు చేశారు. అందులో సావేజ్ లాండర్, జాన్‌క్లేర్, థామస్ లోవేల్ బెడ్డోస్ ఉన్నారు.

**వాల్టర్ సావేజ్ లాండర్**

తన విపరీత ధోరణులకు తానే బలి అయినవాడు వాల్టర్ సావేజ్ లాండర్. ఆ శతాబ్దంలో చక్కని కవిత్వాన్ని చెప్పిడు. తొంభై ఏళ్ళ జీవితంలో పోరాటాలు పోట్లాటలతో ఎక్కువ గడిచిపోయింది. కోర్టు కేసులు, అవమానాలు, అప్పుడప్పుడు విజయాలుతో మిశ్రమ జీవితం. ఓల్డ్ స్టాఫోర్ట్ కుటుంబంలో వార్‌విక్‌లో 30-01-1775లో పుట్టాడు. మొదటి చార్లెస్ రాజు తల నరకబడిన సంవత్సరిక దినమే లాండర్ పుట్టినరోజు అవటం విశేషం. తండ్రి సంపన్న డాక్టర్. కొడుకును నాలుగో ఏట స్కూల్‌లో చేర్పాడు. పదేళ్ళకే లాటిన్‌లో అసమాన ప్రజ్ఞ చూపి రగ్బీ స్కూల్‌లో చరిత్ర సృష్టించాడు. అదే కొంపముంచింది. ఒక మేస్టరుతో వాక్య నిర్మాణం విషయంలో గొడవపడి తప్పు తెలుసుకొన్నా క్షమాపణ కోరకపోతే స్కూల్ నుంచి పంపించేశారు. పందొమ్మిదో ఏడు ట్రినిటి కాలేజిలో చేరి రోజువారీ విధానాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే "పిచ్చి జాకోబిన్" అన్నారట. ఉద్రేకంతో ఊగి ఒకసారి తోటి విద్యార్ధిని తుపాకితో కాల్చాడు. సస్పెండ్ చేశారు తండ్రి వచ్చి పద్ధతి మార్చుకోమని చెప్పినా మారలేదు. పైగా "నాకు చదువు చెప్పగలిగినంత స్థాయిలో ఆక్స్‌ఫర్డ్ లేదు" అన్న పొగరుబోతు.

లండన్ వెళ్లి "ది పోయెమ్స్ ఆఫ్ వాల్టర్ సావేజ్ లాండర్" పుస్తకాన్ని ముద్రించాడు. మరో మూడేళ్లకు "జేబీర్" అనే మహా కావ్యాన్ని రాసి అచ్చువేశాడు. దీనికి లాటిన్ మాతృక ఉంది. మిల్టన్ కవితో పోల్చదగిన స్థాయి పొందాడు. రెండేళ్ళ తర్వాత మరీ విజృంభించి

దాదాపు యాభై దాకా కవిత్వం, వచన రచనలు రాసి ప్రచురించాడు. ముప్ఫై ఏళ్లకే తండ్రి చనిపోయాడు. ఆస్థి సంక్రమించింది. లేక్ డిస్ట్రిక్ట్, బ్రిస్టల్‌లను చూస్తూ సూతీ వర్డ్స్‌వర్త్‌లతో స్నేహం చేశాడు. వేల్స్‌లో అందమైన ఎస్టేట్ కొనుక్కున్నాడు. ఫ్రాన్స్ విప్లవ నాయకులపై సానుభూతి చూపాడు. నెపోలియన్‌ను వ్యతిరేకించాడు. గౌరవ కల్నల్ పదవి పొందాడు. అతని బృందం వారిలో కలిసిపోతే ఇంగ్లాండ్ తిరిగి వచ్చేశాడు. ముప్ఫై ఆరేళ్ళ వయసులో పదహారేళ్ళ పడుచును ఒక బాలేలో చూసి మోహించి చేతిలో పెన్నీ కూడా లేని బాంకర్ కూతురైన ఆమెను పెళ్లి చేసుకొని రెండు నెలల్లోనే తప్పు చేశానని గ్రహించి, ఒక లేడీ హిట్లర్‌ను పెళ్లి చేసుకొన్నానని నెత్తి బాదుకొన్నాడు. ఆమెకు లేని అలవాట్లు లేవు. విసిగెత్తిపోయాడు. కోపం తీవ్రమైంది. భార్యతో పక్కింటి వాళ్ళతో, అద్దెకుంటున్న వారితో పోట్లాడేవాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాసాలు రాశాడు. ఇంగ్లాండ్ నుంచి బహిష్కరిస్తే భార్యతో ఇటలీకి వెళ్ళిపోయి, వీడి బాధ భరిస్తూనే ఆమె నలుగురు పిల్లల్ని కన్నది. ఇటలీ కవితో తగాదా పెట్టుకొంటే ఇటలీ నుంచి బహిష్కరిస్తే జెనోవా వెళ్లి మెడిసిపాలస్‌లో ఉన్నాడు. “పానీ పట్టు” (నీటి తగాదా)లో పొరుగు వాడితో ద్వంద్వ యుద్ధం చేశాడు. పిచ్చ కోపం వచ్చి వంటవాడిన కిటికీలోంచి తోటలోని పూలపొదల్లోకి నెట్టిపారేశాడు. “అయ్యయ్యో వయొలెట్ పూలచెట్ల సంగతి మర్చిపోయానే” అనుకొన్నాడట పాపం. నలభై యాభైలలో వచనం రాస్తూ “ఇమేజరీ కన్వర్వేషన్స్” రాసి ప్రచురించాడు. హిస్టారికల్ డైలాగ్స్‌ను రెండు భాగాలుగా తెచ్చాడు. అరవైలో సర్వశ్రేష్టుడనిపించుకొన్నాడు. కార్లైల్ “A tall broad, burly man with gray hair and large fiefce - rolling eyes of the most restless, impetuous vivacity, not to be held in by the most perfect breeding, expressing itself in high colored superlatives, indeed in reckless exaggeration, now and then in a dry, sharp laugh, not of sport but of mockery” అని లాండర్ రూపాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. ఇదే రూపాన్ని చార్లెస్ డికెన్స్ తన “బ్లీక్ హౌస్” నవలలో “బాయ్ హారన్”గా చిత్రించాడు.

ఇరవైలో అసంతృప్త జీవితం వ్యథల పాలైంది. భార్యకు విడాకులిచ్చేశాడు. ఇంగ్లాండ్ చేరి బాత్‌లో ఉండి డికెన్స్‌తో స్నేహం పొందాడు. పిల్లలతో సయోధ్య సాధించి దగ్గరకు పిలిపించుకొన్నాడు. తండ్రి తన కళ్ళ ముందే చనిపోవటం జీర్ణించుకోలేకపోతున్నానని కూతురు బ్రౌనింగ్‌కు రాసింది. ఇంకో కోర్టు కేసుమీద మళ్ళీ ఇటలీకి పారిపోవాల్సొచ్చింది. వెయ్యి పౌండ్ల నష్ట పరిహారాన్ని చెల్లించాల్సి వచ్చింది. బ్రౌనింగ్ ఎమర్సన్‌తో పరిచయం కలిగింది. “లాస్ట్ ఫ్రూట్స్ ఆఫ్ యాన్ ఓల్డ్ ట్రీ”ని ఎనభైలో రాశాడు. మూడేళ్ళ తర్వాత “డ్రై స్టిక్స్ ఫాగోటెడ్ బై ది లేట్ వాల్టర్ సావేజ్ లాండర్” రాసి ప్రచురించాడు. తొంభైవ పుట్టినరోజుకు

మూడు నెలల ముందు లాండర్ 17-09-1864న చనిపోయాడు. "మనిషిలోని కళ అతని జీవితంతో సమాంతరంగా నడవదు" అని రుజువు చేశాడు. అతని కాన్వర్‌సేషన్స్ క్లాసికల్‌గా ఉంటుంది. అతని చిక్కని స్టాంజాలు ఆకర్షణీయంగా ఉంటాయి. అతని గొప్పలు కవిత్వంలో ఇరికించాడు. "I strove with none was worth my strife - nature I loved and next to nature art - I warned my hands before the fire of life - it sinks and I am ready to depart" గర్వం, అసంబద్ధ జీవితంతో గడిపాడు. "జీవితమనే అగ్నితో చేతుల్ని వెచ్చ చేసుకొన్నాడు". బైరన్ షెల్లీలకు మధ్య వారధిగా ఉన్న కవి. ఎపిగ్రామ్స్‌ను పకడ్బందీగా రాశాడు. ఎలిజీలను అపూర్వంగా సృష్టించాడు. "He was a classic no formalist" అనిపించాడు. "So royally serene in its commanding power upon tragic main springs of terror and of pity"



**జాన్ క్లేర్**

సమకాలీనులు ఇచ్ఛాపూర్వక కవి అని పొగడిన జాన్‌క్లేర్ ఇరవైవ శతాబ్ధి దాకా ఎవరికీ గుర్తులేదు. చనిపోయిన అరవై ఏళ్ళ తర్వాత అతనిపై ఉన్న విరుద్ధాలను ఖండించి అలాన్ పోర్టర్, ఎడ్మండ్ బ్లండర్‌లు క్లేర్ రచనలను ప్రచురించారు. 13-07-1793న జాన్‌క్లేర్ న్యూ యాంప్ షైర్‌లోని హెల్ప్‌స్తాన్‌లో అక్షర జ్ఞానంలేని తండ్రికి కొడుకుగా పుట్టాడు. తండ్రికున్న కొద్దిపాటి పొలంలో తండ్రికి తోడుగా వ్యవసాయ పనులు చేశాడు. రాత్రి బడికి వెళ్లి చదివేవాడు. ఒకసారి పొరిగింటి ఆయన గడ్డి వాగన్ నుంచి కిందపడి మెడ విరిగిన దృశ్యాన్ని చూసి జాన్ మానసికంగా చలించి స్థిమితం కోల్పోయాడు. పశువులను కాచాడు. తర్వాత తోటమాలి ఉద్యోగం చేసి మేరీ జాయిస్ సంపన్న రైతు కూతురుపై ప్రేమలో పడి ఆమె తండ్రి కట్టడిచేస్తే కుంగిపోయి మామూలు మనిషి కాలేదు. ఆమె చనిపోయిన తర్వాత బతికి ఉందనే భ్రమలో ఎన్నో కవితలు రాశాడు. అందులో కొన్ని "వారేవా" అనిపిస్తాయి.

ఇరవై రెండవ ఏట సున్నపుబట్టిలో పనిచేశాడు. జిప్సీలాగా తిరిగాడు. కవిత్వం రాయటం మొదలెట్టాడు. తండ్రి ఏదో సాయం చేస్తున్నాడు, చాలటం లేదు. అదృష్టవశాత్తు ఒక పబ్లిషర్ ఇతని "పోయెమ్స్ డిస్క్రిప్టివ్ ఆఫ్ రూరల్ లైఫ్ అండ్ సీనరీ" పుస్తకం ముద్రించాడు. బ్రహ్మాండ విజయం సాధించింది. కొందరు మాత్రం "రైతు కవి" అన్నారు. పుస్తకాలన్నీ వెంటనే అమ్ముడాయ్యాయి. ఈ విజయంతో లండన్ చేరాడు. ఎడిన్బర్గ్ కోటరీతో మమేకం అయ్యాడు. లార్డ్ మిల్టన్ వంటి వారితో పరిచయం కలిగింది. "విలేజ్ మాన్ స్ట్రల్" ముద్రణ

పొందింది. ఇదీ బాగా ప్రాచుర్యం పొందింది. స్నేహితులు ఇతని కోసం గ్లాసులు కొట్టుకొని అతని ఆరోగ్యం కోసం తాగి సంబురాలు చేసుకొన్నారు.

పొలంలో సేద్యం చేస్తూ ఖాళీ సమయంలో కవిత్వం రాస్తూ గడిపాడు. తన పుస్తకాలను ముప్ఫై మైళ్ల దూరం మోసుకొని వెళ్లి అమ్మేవాడు. రాయబోయే దాన్ని కూడా టేలర్ అనే పబ్లిషర్‌కు ఇచ్చి రెండు వందల పౌండ్ల డబ్బు ఇమ్మని కోరితే అతను ఇవ్వకుండా "దేవుడు నిన్ను ఎలా పుట్టించాడో అలానే ఉండు అంతకంటే ఆశ పడకు" అని మనసును గాయపరిచాడు. విపరీత శారీరక శ్రమ. రచనల వలన మానసిక శ్రమతో అలసిపోయి నీరసపడ్డాడు. బాధలను మరచిపోవటానికి తాగుడు అలవాటు చేసుకొన్నాడు. కుటుంబ సభ్యులు తొమ్మిది మంది అయ్యారు. "ది షెపర్డ్స్ కాలెండర్"ను మరో ఎనిమిదేళ్ళకు, "ది రూరల్ మ్యూజ్"లను రాసి ప్రచురించాడు. కాని ఇవి జనాన్ని ఆకర్షించలేకపోయాయి. అతని విగర్ తగ్గిందని భావించారు.

నలభైలో మానసిక స్థితి మొదటిసారిగా దెబ్బ తిన్నది. త్వరలోనే తేరుకొన్నాడు కాని ఏడాదికే మళ్ళీ తిరగబెట్టింది. అతనిలో నిరాశ, విచారం పెరిగాయి. ఒకరోజు మర్చెంట్ ఆఫ్ వెనిస్ నాటకం చూస్తూ షైలా పాత్రధారిపై కోపంతో సీటు నుంచి లేచి చంపేస్తానని రంగం మీదికి వెళ్ళబోయాడు. భ్రమ, భ్రాంతి అతన్ని చుట్టుముట్టాయి. డాక్టర్ల దగ్గర చేర్చి ట్రీట్మెంట్ ఇప్పించారు. ఎప్పింగ్ ఫారెస్ట్ శానిటోరియంకు పంపారు. ఒకరోజు ఇంటికి వెళ్లాలనే కోరిక కలిగి స్వంత ఊరు హెల్ప్ స్టాన్‌కు ఒంటరిగా నడిచి బయల్దేరి మూడురోజులు ప్రయాణించి చేరాడు. కొంత ఆరోగ్యం బాగు పడిందనిపించింది. కాని పరిస్థితి చేజారిపోతోంది. పూర్తిగా పిచ్చివాడై పోయాడని నిర్ధారించి నార్త్ యంతాన్ కంట్రీ అసిలియంకు తరలించారు. ఇక్కడే ఇరవై ఏళ్ళు ఉండిపోయాడు. ఇక్కడే "ది షీప్ ఆఫ్ స్ప్రింగ్", "ఐ యాం", "ఇన్విటేషన్ టు ఎటర్నిటి" మొదలైన గొప్ప కవితలు రాశాడు. ఒంటరి జీవితం బాధించింది. భార్య, పిల్ల మందతో ఇబ్బంది పడుతూ వచ్చి చూడలేకపోయింది. శారీరక భాగాలు పనిచేయటం మానేశాయి. కాళ్ళూ చేతులూ కదిలించలేకపోయాడు. నడక అసలే లేదు. చివరికి పక్షవాతం వచ్చి డెబ్భై ఒకటి వయసులో మే నెల ఇరవై 1864లో మరణించాడు. రొమాంటిక్ కవుల కంటే చాలా ముందుకు దూసుకొని పోయిన కవి నార్త్ అమెరికాలో జాన్‌క్లేర్. సొసైటీని ఏర్పరచి స్మరించి, సేవలు చేస్తున్నారు. "Clare was the most influential poet aside from Words Worth to practice it in an older style".

**థామస్ లోవెల్ బెడ్డోస్**

బ్రిస్టల్ దగ్గర క్లిఫ్‌తనలో జూన్ ముప్ఫైన 1830లో బెడ్డోస్ పుట్టాడు. మేరియా ఎడ్జివర్త్ సోదరి, అన్నా ఎడిజ్వర్త్ ఇతని తల్లి. తండ్రి గొప్ప వైద్యుడు. కొంతవరకు శాస్త్రవేత్త

కూడా. రాయల్ అకాడెమి ప్రెసిడెంట్ డేవిస్ గిల్బర్ట్ దగ్గర సహాయకుడు. వింత ప్రయోగాలు చేసేవాడు. పదిహేడేళ్ళపుడు బెడ్డోస్ రెండు బహుమతులు పొందాడు. ఒకటి గ్రీకులో, రెండోది లాటిన్‌లో. ఒక నాటిక రాసి మార్నింగ్ పోస్ట్ మేగజైన్‌లో ప్రచురించాడు. ఆక్స్‌ఫర్డ్ పెంబ్రోక్ కాలేజిలో చేరి షిల్లర్ పండితుడి ప్రభావానికి గురి అయి జర్మని సాహిత్యంపై అమిత శ్రద్ధ చూపాడు. జర్మని, స్విట్జర్లాండ్‌లు తిరిగి, ఫిలాసఫీ కవిత్వంలకు అప్లికేషన్ పెట్టినా చివరికి "అనాటమీ"లో చేరి చదివాడు. అప్పుడే "డెత్స్ జెస్ట్ బుక్" అనే ట్రాజెడీను ఇరవై నాలుగులో రాయటం మొదలుపెట్టి ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ చనిపోయే వరకు రాస్తూనే ఉన్నాడు. గోథిక్ సాహిత్యాన్ని అమిత ఇష్టపడ్డాడు. తానూ ఒక ప్రసిద్ధ ఎలిజబెతేనియాన్ అని భ్రమించేవాడు. నలభై ఏళ్లకు ఎలిజబెతన్లలో తానూ చివరివాడిననుకొని పిల్లి గడ్డం పెంచటం ప్రారంభించి, షేక్స్‌పియర్‌లాగా పోజు పెట్టేవాడు. ఒక నటుడితో కలిసి నాటకాలాడేవాడు. తనకంటే గొప్ప నటుడని పేరు పొందితే అసూయ కలిగి చంపబోయాడు. మరోసారి పొట్లాటలో క్షణికోద్రేకంలో తన కాలినరం తెంచుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేసుకొన్న "మాన్ ఆఫ్ మూడ్స్". ప్రాణాపాయం తప్పినా విషం తాగి 26-01-1849న చనిపోయాడు ఈ క్షణికోద్రేకి.

"Is that the wind dying? o not - it is only two devils that blow through a murderers bones, to and fro - in the ghosts moon shineఎ" ఒక ఉదాహరణ కవిత మాత్రమే. డ్రమటిస్ట్ అయినా వ్యక్తిత్వం ఉన్న పాత్రలను సృష్టించలేకపోయాడు. అతని కవిత్వం మాత్రం " Full of thoughts and richness of diction" అని బేరీజు వేశారు.





**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 35**

**చారిత్రక బలి**

# జార్జి గార్డన్ లార్డ్ బైరన్

**జా**ర్జి గార్డన్ రొమాంటిక్ ఉద్యమ హీరో. నిజమైన బైరానిక్ వ్యక్తి. అందగాడు. దేన్నీ లెక్క చేయనివాడు. అంగవైకల్యం ఉన్నా అరిస్టోక్రాట్‌గా వెలిగాడు. స్వేచ్ఛను కోరి, కలల్లో తేలి, మేధావి అయిన ప్రేమికుడు.

అడ్మిరల్ జాన్ బైరన్ కవి తాత. తీవ్రస్వభావి కనుక "ఫౌల్ వెదర్ జాక్" అని మారుపేరుతో పిలిచేవారు. కవి బైరన్ అంకుల్ ఒకడు హత్యకేసులో ఉన్నాడు. అ స్వభావాలు వారసత్వంగా పొందిన బైరన్ కవి చిన్నప్పుడే స్నేహితుడితో ద్వంద్వ యుద్ధం చేశాడు. తండ్రిని "మాడ్ జాక్" అనేవారు. తండ్రి ఒక వివాహితను లేపుకుపోయి ఆమె మొగుడికి విడాకులిచ్చిన తర్వాత పెళ్లి చేసుకొన్నాడు. అగస్టా అనే కూతురు పుట్టింది. ఆమె డబ్బు అంతా హరించాడు. మొదటి జేమ్స్ రాజు బంధువులమ్మాయిని చేసుకొన్నాడు. ఈమె తండ్రి గర్వి, తీవ్ర మనస్థత్వం ఉన్నవాడు. ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఇక జార్జిగార్డన్ విషయానికొస్తే 22-01-1788లో కాలు వంకరతో పుట్టి ఎన్ని ఆపరేషన్లు జరిగినా సరికాక, తల్లి విపరీత ధోరణులకు బాధపడుతూ చాలాకాలం గడిపాడు. కొడుకును ఈ తల్లి "చిన్నారి కుంటి కుంక" అని పిలిచేది. తండ్రి డబ్బు జల్సాగా ఖర్చు చేసి తాగుడుతో చచ్చాడు. బైరన్‌కు నర్సుగా ఉన్న మేరీ గ్రే తొమ్మిదేళ్లప్పుడు పాపం చేయవద్దని బోధిస్తూనే సెక్స్‌లో మెకానిజంనూ బాగా నేర్పింది. ఇదే తర్వాత విజృంభించింది. తండ్రి మరణంతో జార్జి గార్డన్ ఆస్థికి వారసుడైనాడు. ఈయన చనిపోవటంతో బైరన్‌కు తొమ్మిది ఏళ్ళప్పుడే లార్డ్ అయ్యాడు. న్యూ స్టెడ్ ఆబ్బేలోని స్వంత ఎస్టేట్‌కు తల్లి బైరన్‌ను తీసుకు వెళ్ళింది. హారో స్కూల్‌లో చదివాడు. స్వతంత్రుడు అవటంతో ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. పదహారేళ్ళ వయసులో కజిన్ మేరీ చావర్త్‌ను ప్రేమిస్తే ఆమె కూడా ప్రేమాయణం సాగించి

చివరికి ఒక భూస్వామిని పెళ్లి చేసుకొన్నది. "గుండెజారి గల్లంతైన" బైరన్ విరహంతో ఎన్నో కవితలు "వైడ్ – ది డ్రీం" రాశాడు. సాహిత్యంలో మేటి అనిపించుకొన్నాడు.

పదిహేడేళ్ళప్పుడు ట్రినిటి కాలేజిలో చేరాడు. అయిదు వందల డాలర్ల అలవెన్స్ వచ్చేది. రూంను అందంగా తీర్చిదిద్దుకోవటానికి దీన్ని ఖర్చు చేశాడు. యువరాజు దర్జా వెలిగించాడు. "అప్పుల అప్పారావు" అయ్యాడు. "కాలేజి నీతిని కాని డబ్బును కాని ఇవ్వదు" అని స్నేహితుడికి ఉత్తరం రాశాడు. కొంత కవిత్వం గిలికాడు. కాని ఎవరూ మెచ్చలేదు. ఉండలేక బయటికొచ్చాడు. మళ్ళీ చేరినా చదువుమీద శ్రద్ధ పెట్టలేదు. రొమాంటిక్ నవలలు చదువుతూ ఫెన్సింగ్ వేస్తూ చదువు ఎగగొట్టి కాలక్షేపం చేశాడు. కొందరు మంచి స్నేహితుల్ని సంపాదించుకొన్నాడు. అందులో జాన్ కాంహోబ్ హౌస్ బైరన్‌కు ఎక్సిక్యూటర్ అయ్యాడు. గాంబ్లింగ్‌లో ఆరి తేరాడు. మొత్తం మీద "ముక్కి" డిగ్రీ సాధించాడు. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో స్థానం పొందాడు. "ఇంగ్లీష్ బార్డ్స్ అండ్ స్కాచ్ రివ్యూయర్స్" రాసి ప్రచురించాడు. ఇది పోప్ రచనా స్థాయిని పొందింది. పోప్ అంటే బైరన్‌కు మహా ఇష్టం. "దంసియాడ్" రాసినా పేరు రాలేదు. 1809 బైరాన్‌కు మెజారిటీ వయసు వచ్చింది. దానితోబాటు అదృష్టమూ వరించింది. పన్నెండు వేల పౌండ్ల అప్పులు తీర్చాడు. ఆదాయం తగ్గింది, రౌడీ పార్టీతో కలిశాడు. ఈ బృందంలో ప్రతివాడు ఒక సన్యాసి వేషం వేసుకొనే "సన్నాసే". విందు, మందు, చిందులతో కాలం గడిపారు. ఇది లేడీ బైరన్‌కు నచ్చలేదు. భార్యను వదిలేసి యూరప్ వెళ్లాడు. లిస్బన్‌లో ఉన్నాడు. అక్కడి నుండి అయిదు వందల మైళ్ళు గుర్రం మీద ప్రయాణించి "పెర్ఫెక్ట్ సైబీరియా" చేరుకొన్నాడు. మాల్టా వెళ్లి అల్బేనియా చేరాడు. కాంస్టాంట్ నోపిల్ వెళ్లి, హేల్లెస్ పాయింట్‌లో ఈతకొట్టి ఏథెన్స్‌కు వచ్చాడు. ఆర్ధర్ ఎడ్లిస్తాన్‌తో స్నేహం చేశాడు. గ్రీస్ వెళ్లి "పాఫియాన్ ప్లెజర్" అనుభవించి లండన్ చేరాడు. ఆస్థిని పర్యవేక్షించేవారి అలసట వలన రాబడి బాగా తగ్గిపోయింది. బొగ్గుగనుల్లో బొగ్గు కాదు కదా సుఖమూ రాలేదని రాసుకొన్నాడు. తల్లి చనిపోయింది. "ఏదో పాపం తనను, కుటుంబాన్ని పీడిస్తోందని" గ్రహించాడు. ఐర్లాండ్ జాతీయ గాయకుడు కవి టాంమూర్‌తో పరిచయమైంది. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో మొదటి ప్రసంగం చేశాడు బైరన్. ఆధునిక యంత్ర సామగ్రి రావటంతో వర్కర్లను తీసివేయక తప్పలేదు. వాళ్లకు కోపం వచ్చి అన్నీ ధ్వంసం చేశారు. "మెషీన్ రెకర్స్" అనే నాటకాన్ని జర్మన్ నాటకకర్త "ఎర్నెస్ట్ టోల్లర్" రాశాడు. ప్రభుత్వం "ఫ్రెం బ్రేకర్స్ బిల్" ప్రవేశపెడితే బైరన్ వ్యతిరేకించాడు. పనిచేసే వారిలో బైరన్‌కు స్నేహితులెవరూ లేరు.

యూరప్ పర్యటనలో ఉండగానే బైరన్ దీర్ఘ కవితను స్పెన్సర్ స్టాంజాలతో రాయటం ప్రారంభించాడు. గ్రీసు దేశంలో పూర్తి చేశాడు. రెండు కాంటోలను 1818లో ముద్రించాడు. ఆ విషయాన్ని బైరన్ "Byron awoke one morning and found myself

famous" అని రాసుకొన్నాడు. ఇందులో విషయం బైరన్‌దే. రొమాంటిక్ టచ్ ఇచ్చాడు అంతే. బైరన్‌కు ఉన్న పురుషత్వం, స్త్రీ మనస్సు ఆడవాళ్ళకు విపరీతమైన ఆకర్షణ అయింది. చుట్టూ మూగేవారు. ఇతనికంటే ముందే వాళ్ళు అతన్ని "ముగ్గులోకి దించేవారు". అప్పుడు "పురుష సింహమే" అయిపోయేవాడు. వల పన్ని పడేసేవాళ్ళు. అందం, ఆకర్షణ, రాచరికం ఉండటంతో అన్ని అంతస్తుల స్త్రీలు అతనితో సంగమించి సంతృప్తి చెందేవారు. అందులో మేరీ కరోలిన్ లాంబ్ ఒకరు. ఆమెకు భర్త కాబోయే ప్రధాని, యవ్వనోద్రేకంలో ఉన్న ఆమెను భర్త సుఖపెట్టలేకపోతున్నాడని బైరన్ చెంత చేరి శృంగార లీలా విలాసం సాగించి "ఈ లాంబ్ ఆ సింహానికి" ఎర అయిపోయింది. "That beautiful face is my fate - mad, bad, dangerous to know" అని డైరీలో రాసుకొంది. ఆడవాళ్ళ శృంగార సామ్రాట్ అయ్యాడు. వాళ్ళ రక్షణా ఏడుగడ తానే అనిపించాడు. సర్వ సౌఖ్యాలు పొందాడు, పొందించాడు. అదో లోకంగా గడిపాడు ఆ దక్షిణ నాయకుడు. పడేయ్యటం, పడవేయించుకోవటం "వీజీ" అయిపోయింది. "నాటీ" అని అందరూ ప్రేమగా, ఆప్యాయంగా పిలిచేవారు ఈ "లవ్ లార్డ్ బైరన్"ను. "అందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం" – "తరం తరం నిరంతరం ఈ అందం"గా గడిచిపోతోంది. కరోలిన్‌ను యెంత దూరం చేయాలని ప్రయత్నించినా అంత మీద పడిపోతోంది. ఇప్పటికి మన శృంగార లార్డ్ వయసు పాతిక మాత్రమే.

ఏది చేసినా పద్ధతి ప్రకారమే సాగించాడు. అన్న బెల్లా బైరన్‌కు సాయం చేసేది. కాని ఆమె ఇష్టం లేకుండా ముందుకు అడుగు వెయ్యలేకపోయాడు. ఇంతలో లేడీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ జెం ఎలిజబెత్ అనే వివాహిత నలభై ఏళ్ళ పిల్లాజెల్లాతో ఉన్నావిడ బైరాన్‌పై మోజు పడింది. ఎన్నో షరతులు పెడితే వదిలేశాడు. ఇంకా చాలామంది గాలం వేస్తున్నారు మన "కవి చేప" చిక్కటం లేదు. హాయిగా, ప్రశాంతంగా గడపాలని కోరుకొన్నాడు. కవిత్వమే పరిష్కారం అని ఎంచుకొన్నాడు. 1813లో "ది జియనోర్ అండ్ ది బ్రిడ్ ఆఫ్ అబిదోస్" పబ్లిష్ చేశాడు. తర్వాత "కార్సైర్" రాస్తే పన్నెండు వేల కాపీలు అమ్ముడుపోయాయి. న్యూ స్టేడ్ ఆబ్బే ఎస్టేట్‌ను లాభానికి అమ్మాడు. కాని కొనేవాడు పూర్తి డబ్బు ఇవ్వలేకపోవటంతో బైరన్‌కే దక్కింది. బిజీ బిజినెస్ మాన్ అయ్యాడు. ఒంటరితనం బాధిస్తోంది.

తన టర్కిష్ కథ ఆధారంగా "ది బ్రిడ్ ఆఫ్ అబిడోస్" ఇద్దరు విఫల ప్రేమికుల కథ రాశాడు. విషాద "ఎపిజిల్ టు ఆగస్తా" రాశాడు. బిడ్డను కనబోయే ముందు లేడీ మేల్బోర్న్ అనే అమ్మాయిని ప్రేమించి ఆమె చెల్లెలిని తీసుకొని యూరప్ వెళ్లాడు. పాపం చేస్తున్నావని ఆమె చెప్పినా పెడచెవిని పెట్టాడు. పెళ్లి చేసుకోమని మేలబోర్న్ కోరుతోంది. అనబెల్లా మీద మనసు దూరం కావటం లేదు. ఎటూ పాలుపోని స్థితి. కాని సృజనశక్తి మాత్రం విజృంభిస్తూనే ఉంది. చెల్లెలు అగస్తా మాత్రం పాదరస బుద్ధి ఉన్న అన్నగారి జీవితం ఏమైపోతుందో అని

కలవరపడుతోంది. 1815లో అనబెల్లాను పెళ్లి చేసుకొన్నాడు. చర్చి లోంచి బయటికి రాగానే "నన్ను సంస్కరించేంత గొప్పదానివా నువ్వు" అని "గురుడు" పెట్రేగిపోయి అన్నాడు. పక్కలో పడుకోవచ్చా అని అడిగితే యవ్వనం దాటేదాకా పడుకోమన్నాడు. తన సోదరితో బైరన్ ప్రేమకలాపం సాగిస్తున్నాడన్న రూమర్లు విన్నది. కాని అవి అబద్ధాలని నమ్మింది.

బైరన్ పరిస్థితి రోజు రోజుకూ కుంగిపోతోంది. డిప్రెషన్‌లో పడిపోతే అనబెల్లా సేవ చేస్తోంది. డబ్బు చేతిలో ఆడటం లేదు. మరీ ఉద్రేకం పెరిగింది. అప్పుల వాళ్ళు రోజూ వచ్చి చెవిలో రొద పెడుతున్నారు. అనబెల్లా గర్భిణి. సాయంకోసం అగస్తా వచ్చింది. బైరన్‌ను ప్రశాంతంగా ఉంచగలిగింది సోదరి అగస్తా మాత్రమే అను బిడ్డను కన్నది. కాని బైరన్‌కు ఇదేమీ పట్టలేదు. పిచ్చివాడైపోతున్నాడు. పిచ్చ పిచ్చగా భార్యను తిడుతున్నాడు. బిడ్డమీద ప్రేమే చూపలేదు. కూతురికి "అగస్తా ఆదా" పేరు పెట్టాడు. అగస్తాను పంపిద్దామనుకొంటే ఆమె ఇక్కడే ఉండిపోయింది. బైరన్‌ను ఎప్పుడూ ఎవరో ఒకరు కనిపెట్టుకొని ఉండాల్సిన అవసరమేర్పడింది. అగస్తా తల్లిదండ్రులను చేరి మళ్ళీ తిరిగిరాలేదు. పెళ్లి సంబడం ఒక ఏడాది మాత్రమే. ఈ విడిపోవటం అనేక పుకార్లకు చోటు కల్పించింది. "నాకు రెండొందల మందితో సంబంధం ఉంది" గర్వంగా చెప్పుకొనే మగధీరుడు అనేక అభియోగాల్లో చిక్కుకొన్నాడు. అగస్తాతో అక్రమ సంబంధం ఉందనీ చెవులు కొరుక్కున్నారు. కాని బైరన్ ఆమెలో తన తల్లినే చూసుకొన్నాడు. తల్లి ప్రేమను పొందలేని బైరన్ ఆమె సన్నిధిలో ఆ మాతృప్రేమ రుచిని పొందుతున్నాడు. 25-04-1816న మన లార్డ్‌గారు సెమి రాయల్ దర్జాతో ముగ్గురు సేవకులు, ఒక డాక్టర్‌తో స్వయంగా ప్రవాస జీవితాన్ని ఎన్నుకొని లండన్ వదిలి వెళ్లిపోయాడు. "కుళ్ళి కంపుకొట్టే ఈ సమాజానికి దూరంగా వెళ్తున్నా"నని చెప్పుకొన్నాడు బైరన్. ఇరవై ఎనిమిదేళ్ళ ఈ కవి వీరుడు ఇంకా సాధించాల్సిన అద్భుతాలెన్నో ఉన్నాయి. ❁

“పూర్వాంగ్ల” కవుల ముచ్చట్లు – 36

# రొమాంటిసిజంకు ప్రేరకుడు – లార్డ్ బైరన్ – 2

**ఊ**రు మార్చినా బైరన్ తీరు మార్చుకోలేకపోయాడు. రాజభోగాలు, చిహ్నాలు వదల్లేదు. కాని మనసు వ్యధ భరితమై ఉంది. మాథ్యూ ఆర్నోల్డ్ చెప్పినట్లు “The pageant of his bleeding heart”గా రక్తం కారుతున్న గుండెతో ఉత్సాహంగా ఉన్నాడు. ఆయన కారేజిలో మంచం ,పరుపు, కుర్చీ, రాతబల్ల ఉన్నాయి. నెపోలియన్ అంటే అభిమానం. ఈ హంగామాతో యూరప్ పర్యటన చేశాడు. జెనీనా చేరి షెల్లీ దంపతుల్ని చూశాడు. రాడికల్ ఫిలాసఫర్ విలియం గాడ్విన్‌ను కలుసుకొన్నాడు. తనకు ప్రేమాస్పదంగా ఉత్తరాలు రాసే క్లైర్‌ను చూశాడు. చెడ తిరుగుడు తిరిగినా బైరన్‌కు “ఫ్రీ లవ్ సొసైటీ” మీద ఇష్టం లేదు. కాని ఫ్రీ లవ్ వ్యాప్తికర్త షెల్లీ అంటే అభిమానం. షెల్లీ కూడా బైరన్ తీవ్రభావాలకు ముచ్చటపడ్డాడు. అతని సృజనకు జోహార్లిచ్చాడు. లోవేల్ పీకాక్‌తో బైరన్ చాలా ప్రత్యేకమైన వ్యక్తీ అని కాని చంచల స్వభావం ఉన్నవాడని రాశాడు.

క్లైర్‌పై ప్రేమలేకున్నా, కోరిక గాఢమైతే ఆమె కూడా లొంగింది. షెల్లీ దంపతులతో వీరిద్దరూ కలిసి మెలిసి ఉన్నారు. ఇది ఎక్కువకాలం సాగలేదు. ఆమెను వదిలించుకొన్నాడు బైరన్. చిలాన్ కోటకు వెళ్లిపోయాడు. ఇక్కడే “ది ప్రిసనర్ ఆఫ్ చిల్లాన్” కవిత రాశాడు. క్లైర్‌తో పడుకొన్నాడు కాని ఆమె అంటే అయిష్టమే. ఆమెను ఒక ప్రైవేట్ సెక్రటరీగా, తన గజిబిజి రచల కాపీయిస్ట్‌గానే భావించాడు. గర్భవతిని అని ఆమె చెప్పింది. షెల్లీలు ఇంగ్లాండ్ వెడుతూ ఆమెను జాగ్రత్తగా చూసుకోమంటే సరే అన్నాడు. తన మనోభావాలను అగస్తా రాస్తూ ఈ యువతుల బాధ ఎక్కువైందన్నాడు. జేనేవా నుండి ఇంగ్లాండ్‌కు ఒక బిడ్డను కనటానికే వచ్చానని రాసుకొన్నాడు. క్లైరా వెళ్ళిపోయినా బాధ తగ్గలేదు. మెటాఫిజిక్స్‌కు మౌంటెన్స్‌కు మధ్య ఊగిసలాడుతున్నాడు. దానినే కవిగా ఇలా చెప్పాడు. “There is a power upon me which with holds - and makes it my fatality to live

for I have ceased - to justify my deeds unto myself - the last infirmity of evil"

అగస్టాకు తన గుండె బాధ అంతా ఉత్తరాల్లో వివరిస్తున్నాడు. ఇటలీకి చేరి మూడినెస్ ను వదిలించుకొన్నాడు. మిలన్‌లో హుషారుగా ఉన్నాడు. ఆడ్రియాటిక్‌కు చేరాడు. జూలియెట్ సమాధి చూశాడు. నవంబర్‌లో చలి రోజు వెనిస్ వచ్చాడు. అంతా తడిగా, చీకటిగా ఉందనిపించింది. మానసిక ప్రశాంతత అక్కడ దొరకదనుకొన్నాడు. ఇక్కడే గొప్పపేరు పొందిన లిరిక్స్ రాశాడు. అందులో "సో వెల్ గో నో మోర్ ఏరొవింగ్" కవిత ఉంది. "For the sword outwears its sheath - and the soul wears out the breast - and the heart must pause to breathe - and love itself have rest". క్లైర్ నుంచి ఉత్సాహంతో ఉత్తరాలొస్తూనే ఉన్నాయి. షెల్లీలతో ఉన్న ఆమె బాత్‌లో పెళ్లి చేసుకొంది. కూతురు అల్లీగ్రా పుట్టిందని తెలిసి బైరన్ సంతోషించాడు. వెనిస్ దగ్గర బ్రెంతాలో ఒక కాలేజీ అద్దెకు తీసుకొని ఉన్నాడు. మార్గారిటా కాగ్ని అనే మురికివాడ పిల్లతో సన్నిహితంగా మెలిగాడు. ఆమె నిప్పుల కుంపటి. ఇంటిని కుదిర్చిన మేరియానాతో తగాదాపడి జుట్టూ జుట్టూ పట్టుకొన్నారిద్దరూ. డబ్బున్న లార్డ్ కనుక సర్దుకుపోయారు. బైరన్ ఏది రాసినా ముందే డబ్బు చెల్లించే పబ్లిషర్ దొరికాడు. 1818లో "డాన్ జువాన్" నవల ప్రారంభించాడు. అప్పులేవీ లేవు. హాయిగా ఉన్నాడు. న్యూస్టేడ్ ఆబ్బే లక్ష పౌండ్లకు అమ్మేశాడు. ఇటాలియన్ స్టేన్ ప్రకారం "ప్లూటోక్రాట్, అరిస్టోక్రాట్" అయ్యాడు. గ్రాండ్ కెనాల్ ఒడ్డున పలజో మోసినిగో కొని స్థిరపడ్డాడు. మందీ మార్బలంతో కుక్కా, నక్కా, నెమలి, కొంగ, కోతిలతో అక్కడ తిష్ట వేశాడు.

అదేమీ ఖర్మమో ఇంత సంపద ఉన్నా ఇంకా సుఖం లేదనుకొంటున్నాడు. ఇంగ్లాండ్ వార్తలు శుభ సూచికంగా లేవు అక్కడికి వెళ్ళిన తర్వాత మరీ దారుణ వార్తలు వినాల్సి వచ్చింది. అగస్టా అన్నబెల్లాలు వచ్చి సాయం చేస్తున్నారు. అగస్టాను రక్షించే ఉద్దేశ్యంతో అనబెల్లా ఉంటోంది. సోదరుడు బైరన్‌తో ఆమె ప్రవర్తన జుగుప్స కలిగిస్తోందని పద్ధతి మార్చుకోమని కౌన్సిలింగ్ ఇస్తోంది. అగస్టా రాసిన ప్రేమలేఖలను బైరన్ తిరిగి ఇచ్చేశాడు. "నిన్ను నువ్వు కించపరచుకోవద్దు" అని సలహా ఇచ్చాడు కూడా. "మనం మానవ మాత్రులం. మనం కలిసి ఉండాలని దైవ నిర్ణయం. వచ్చి ఇక్కడే ఉండు" అని రాశాడు. ఆమె తిరస్కరించింది. ఉత్తరాలు రాయటం తగ్గించింది. "విడిపోవటం పతనం కాకూడదని" బైరన్ నిర్ణయించాడు. "All suffering doth destroy, or is destroyed - even by the sufferer and in each event ends" అని కవిత చెప్పాడు.

బుర్ర బాగానే ఉన్నా శరీరం దెబ్బ తింటోంది. లావయ్యాడు. ముందుగానే జుట్టు

తెల్లబడింది. డాన్ జువాన్‌ను హుషారుగా రాస్తూనే ఉన్నాడు. వచనం అనుకొంటే కవితా ధోరణిలో సాగుతోంది. ఇందులో సాహసకృత్యాలు, సెటైర్, త్రుణీకారం అన్నీ ఉన్నాయి. "Don Juan is one of the most personal aswell as one of the most enlivening long poems ever written" అనిపించుకొంది. "టర్న్ కోట్ లేక్ పోయెమ్స్" అనిపించుకొన్న వర్డ్స్‌వర్త్ సూతీలకు ఎదురొడ్డి రాసిన కవిత్వం ఇది. వాళ్ళని అవహేళన చేస్తూ రాసిన పంక్తులెన్నో ఉన్నాయి. దీనిని "Masterly virtuous performance" అన్నారు. దీన్ని రాస్తూనే తాను ఏమిటో, తన భావాలేమిటో నిర్వచనం చేశాడు. జ్ఞాపకాలను, అనుభవాలను రాయాలని సంకల్పించాడు. దీని రాత ప్రతిని ముర్రే అనే పబ్లిషర్‌కు ఇస్తే మళ్ళీ ఇంకొక స్కాండల్‌లో ఇరుక్కుపోతాడేమోనని తగలబెట్టేశాడు.

బైరన్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. నెర్వస్ అయిపోయాడు. కలత చెందుతున్నాడు. బాదర బందీ తగ్గించేసుకొన్నాడు. తెరిస్సా గుస్సియోలితో పరిచయం అయింది. మనవాడికి ముప్ఫై ఒకటి ఆమెకు పందొమ్మిది. ఆమెకు అప్పటికే పెళ్లి అయింది. బైరన్‌తో చనువుగా ఉంటోంది. పార్టీలకు వెంట తిప్పుకొంటున్నది. అది ఇటలీ సంప్రదాయమేనట. బైరన్ ఒక "లవర్ సర్వెంట్". ఆమె భర్తకు ఇదంతా తెలుసు. కాని ఏమీ చేయలేని స్థితి. భార్యా భర్తా ఎక్కడికి వెళ్ళినా కుక్కలాగా వెంట వెళ్ళాల్సి వచ్చేది. ఆమె బలవంతం మీద అయిష్టంగానే వెళ్ళేవాడు. "The die is cast - and I must but bitterly pass the rubicon. Every thing is to be risked for a woman one likes" అని తోకాడించుకొంటూ వెళ్ళేవాడు లార్డ్ బైరన్. ఆమె గర్భం విచ్చిన్నమైనప్పుడు మనవాడిని సహాయానికి ఉంచారు. నయం అయిన తర్వాత తెరేసాతో కలిసి గుర్రపు స్వారి చేశాడు. వందకు పైగా ఆమెకు ప్రేమలేఖలు గిలికాడు. బొలోనా వెళ్లారు దంపతులు. బైరన్ వెంట వెళ్లాడు. అక్కడా సుఖం దొరకలేదు. "చూపు సుఖమేకాని శారీరక సౌఖ్యం పొందలేక" దిగులు. తనను తానూ "చవటాయ్ వెర్రి వెధవాయ్" అయిపోతున్నానేమోనని ఆందోళన. తెరెసా తనను మోసం చేస్తోందని దిగులు. ఇవన్నీ అగస్తాకు రాస్తున్నాడు. ఆమె ఓదారుస్తూనే ఉంది. తెరిస్సా ధైర్యం చేసి ఒక ప్రైవేట్ ఇంట్లో ఉంది. కౌంట్ గుస్సియోలి తిరిగి వచ్చాడు. రేవీనాకు భార్యను తీసుకుపోవటానికి నిశ్చయించాడు. బైరన్‌ను ఇక తమతో రావద్దని చెప్పాడు. హతాశుడై ప్లాటోనిక్ ప్రేమ వర్షిస్తూనే ఉన్నాడు. కాని ఆమెకు జ్వరం వచ్చి బైరన్ తన వద్ద ఉండాలని కోరుకొన్నది. తప్పిందికాదు విసనకర్ర విసరటం, "పెళ్ళాడిన స్త్రీకి గుర్తింపు పొందిన ప్రేమికుడు"గా ఉండటం చేస్తున్నాడు. తన హీన దీన స్థితిని "I have been more ravished myself than anybody since Trojan war" అని రాసుకొన్నాడు.

తెరెసా ఆరోగ్యం కుదుటబడి బ్రిటీష్ డిప్లమాటిక్ కార్పస్‌కు బైరన్ సేవలు అవసరమని

చెప్పి తమతో రమ్మన్నాడు. ఈ కామెడీ ఇలా సాగుతూనే ఉంది. అందుకే "Byron was more captured than captivated" అన్నారు. చివరికి ఆమె భర్త నుంచి విడిపోవాలనుకొంది. విడాకులు అసాధ్యం. తల్లిదండ్రులు ఆమెనే సమర్ధించి కోర్టుకు వెళ్లి భర్త ఆమెను క్రూరంగా హింసిస్తున్నాడన్నారు. ఆమె గెలిచింది. కాని బైరన్‌కు ఈ విజయం అచ్చిరాలేదు. వెళ్ళిపోతున్నానని చెప్పితే ఏడ్చేసింది. వెళ్ళిన తర్వాత పుట్టింటికి చేరింది.

బైరన్ తన కవిత్వం రాస్తూనే ఉన్నాడు. ఉత్సాహం, ప్రేరణ కావాల్సి వస్తున్నాయి. డాన్ జువాన్‌లో ఐదో అధ్యాయం మొదలెట్టాడు. మెరీనో ఫెలీరియో, సర్దానాపలాస్, ది తుఫోస్కారి అనే మూడు ట్రాజెడీలు రాశాడు. అతని "విజన్ ఆఫ్ జడ్జిమెంట్"కు పేరు బాగా వచ్చింది. అతని రాజకీయ ధోరణులు ఇబ్బంది కలిగిస్తున్నాయి. నిఘా ఉంచారు. కూతురు అల్లీగ్రా ఏమైందోననే ఆందోళన ఎక్కువైంది. బాగా చలిగా ఉండే కాన్వెంట్‌లో ఉంచారాపిల్లను. అయిదేళ్ళ పిల్ల జబ్బు చేసి చచ్చిపోయిందని తెలిసింది. లిబరల్స్ పరిస్థితి దారుణం. గామ్బాలను దేశం వదిలి పొమ్మనే ఒత్తిడి ఎక్కువైంది. ఆలస్యం చేస్తూ చివరికి పీసా చేరి షెల్లీలను కలిశాడు. మేలోడ్రమటిక్ స్టాంజాలు అద్భుతంగా రాస్తున్నాడు. షెల్లీ బృందంలో తానొక "యాహూ"గాడిగా ఉన్నాననుకొన్నాడు. బైరన్ ఉంటున్న ఇంట్లో నుంచి లీహంట్ బయటికి నెట్టేసి ఆక్రమించాడు. బైరన్‌ను నానా దుర్భాషలాడి అవమానించాడు.

తెరెసా ఉత్తరాలు రాస్తూ డాన్ జువాన్‌ను ఆపెయ్యటం కాని లేదా ఇంకాస్త శృంగారాన్ని రంగరించి, అవినీతిని తగ్గించి రాయమని కోరింది. నిజంగా ఆమె అతి గర్విష్టి. 1822లో బైరన్ చావుకు దగ్గరయ్యాడు. షెల్లీ ఆకస్మిక చావుకు బాధపడి అంత గొప్పకవి స్వార్ధరహితుడు ఎవరూ లేరని మెచ్చాడు. గ్రీకులు స్వాతంత్ర యుద్ధం చేస్తున్నారు. అక్కడికి వెళ్లి గ్రీకు కమిటీ సభ్యుడయ్యాడు. జెనోవా వెళ్లాలనుకొంటే తెరెసా తానూ వస్తానంటే వద్దని వెళ్ళిపోయాడు. గ్రీస్ చేరాడు కాని శుభ సూచనలేవీ కనిపించలేదు. గ్రీకుల్లో అంతర్యుద్ధం తీవ్రంగా ఉంది. వాతావరణమూ బాగా లేదు. అనుకోకుండా జబ్బు పడ్డాడు. తన చావు డ్రమటిక్‌గా సమాప్తం అవ్వాలని అనుకొన్నాడు. ఒక గ్రీకు కుర్రాడితో హోమో సెక్స్‌లో పాల్గొని ఎన్నో ఏళ్ళుగా మనసులో ఉన్న కోర్కెను తీర్చుకొన్నాడు. వాడికోసం ఒక కవిత కూడా రాశాడు. "If Greece should fall, I will bury myself in its ruins. If she should establish her independence I will take up residence in some part or other perhaps Attica" అని గ్రీకు స్వాతంత్రం కోసం కలకన్నాడు. గ్రీసు చేరి, తానూ ఉద్యమంలో పాల్గొనాలనుకొన్నాడు కాని అవకాశం ఇవ్వలేదు. యుద్ధం చేస్తూ వీర మరణం పొందాలనుకొన్నవాడు మంచంమీద జబ్బుపడి చనిపోవాల్సి వచ్చింది. మలేరియా సోకింది డాక్టర్ల మీద బైరన్‌కు గురిలేదు. 19-04-1824న "నా కూతురు నా చెల్లెలు" అని

కలవరిస్తూ లార్డ్ బైరన్ కవి చనిపోయాడు.

బైరన్ కవి కవిత్వం అతని జీవిత విధానమే. అది కదిలించదు ప్రేరణ కల్గించదు. కీట్స్ కవి "సెన్సస్‌తో జీవిస్తే, బైరన్ "సెన్సేషన్‌తో" జీవించాడు". బైరన్ టెక్నిక్కులు అతని వేగం, తెలివి, అజాగ్రత్త చేష్టలకు దర్పణాలు. అంత్యప్రాస హిట్ కాని ఫట్ కాని అవుతుంది. అతని సాహిత్య పరిజ్ఞానం విస్ఫోటనమే అనిపిస్తుంది. "Oh I might I kiss those eyes of fire?" అనగల నేర్పున్నవాడు. బైరన్ సృజనశీలి మాత్రమే కాదు స్వయం వ్యక్తిత్వం ఉన్న నటుడు కూడా. నాటక రంగంపై అభిరుచి అతనిలో ఉన్న కవిని దెబ్బతీసింది. "కవులపై ప్రేమ అతనికి స్త్రీలపై ఉన్న ప్రేమకంటే నీచం". కవితా దృక్పథాన్ని అర్థం చేసుకోకుండా రాశాడు. సెన్సేషన్ మాత్రమే బైరన్ కవిత్వాన్ని బతికించింది. అతనిలోని సెక్సువల్ ఎనర్జీ ఊగినట్లు అతని కవితా పంక్తులు ఊగుతాయి. రొమాంటిక్ శక్తి సామర్థ్యాలకు బైరన్ రాసిన "డాన్ జువాన్" గొప్ప ఉదాహరణ మాస్టర్ పీస్ అనవచ్చు. "సగం ఫిలాసఫర్" అంటారు బైరన్‌ను. "An ardent lover, a ruthless libertine - is creator intended him to be both a paragon and a paradox, an amoral with the truth" అని ఆవిష్కరించారు ఆయన రాసిన జువాన్ ఆధారంగా.

"చైల్డ్ హారాల్డ్స్ పిల్గ్రిమేజ్" బైరాన్ సాధించిన మరో విజయం. మాన్ఫ్రేడ్ కవిత ఉత్సాహోన్నివ్వటమే కాక గొప్ప కవిత అనిపిస్తుంది. బైరన్ జీవితాన్ని పూర్తిగా తెలుసుకోవాలంటే "కిం" కవిత చదవాలి. అందులో ఇటలీ విప్లవం, అతని పాత్ర తెలుస్తాయి. దీన్ని లేక్ కవులు హారర్ కవిత్వం అన్నారు. "వర్డ్స్‌వర్త్ ది రాజీ పద్ధతి అయితే, బైరన్‌ది తిరుగుబాటు" అని కాల్‌రిడ్జి జడ్జి చేశాడు. బైరన్ ఒక తరాన్ని పూర్తిగా ప్రభావితం చేశాడు. డాస్టోవిస్కి లాంటి వారికి ప్రేరణగా నిలిచాడు. గోథేకు జర్మన్ రోమాంటిక్స్‌కు మార్గదర్శి అయ్యాడు. స్వేచ్ఛను ప్రేమించిన ప్రేమికుడు బైరన్. మనిషి విలువను గుర్తించాడు. ఎక్కడా స్థిరంగా ఉండలేక ఇమడలేక సంచారిగా జీవించాడు. అందుకే బైరన్‌ను "Exiled piligrim of eternity. He had that within him which shall tire torture and time" బైరానిక్ హీరోలను సృష్టించాడు. అతని విధానాన్ని "బైరో మానియా" అంటారు. అతని ప్రభావం ఖండాంతరంగా వ్యాపించింది. బైరన్ సొసైటీ ఏర్పడి స్మారకోపన్యాసాల నేర్పరుస్తున్నారు. రొమాంటిక్ ఉద్యమానికి గొప్ప ప్రేరకుడు బైరన్.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 37

# వాస్తవంపై తిరుగుబాటు - పెర్సిబిషి షెల్లీ

షెల్లీ పుట్టేనాటికి ఇంగ్లాండ్ పారిశ్రామిక విప్లవ ఫలితాల చేదు అనుభవాలతో ఉన్నా సృజనాత్మకత విజృంభించింది. విలియం బ్లేక్ ముప్ఫై అయిదులో "సాంగ్స్ ఆఫ్ ఎక్స్పీరియెన్స్" రాస్తున్నాడు. బర్న్సు ముప్ఫై మూడులో స్వీయ లిరిక్స్‌తో చెలరేగుతున్నాడు. ఇరవై రెండేళ్ళ వర్డ్స్‌వర్త్ ఫ్రాన్స్‌లో విప్లవం రుచి చూస్తున్నాడు. ఇరవైలో ఉన్న కాల్‌రిడ్జి కేంబ్రిడ్జిలో చేరబోతుంటే పద్దెనిమిదో ఏట సూతీ, లాంబ్ పదిహేడు. బైరన్ నాలుగేళ్ల బుడ్డాడుగా ఉన్నారు.

షెల్లీ పూర్వీకులు సంస్కృతి పట్ల పెద్దగా అభిరుచి ఉన్నవారు కాదు. సాధారణ కుటుంబీకులే అయినా అంతటా విస్తరించారు. వారి వ్రేళ్ళు అమెరికాలోనూ ఉన్నాయి. షెల్లీ ముత్తవ్వ న్యూయార్క్ మిల్లర్‌కు విధవరాలు. తియోతీ షెల్లీని అనే కొత్తగా కాలనీకి చేరిన వాళ్ళబ్బాయిని పెళ్ళాడి బిషీని న్యూయార్క్‌లోని న్యూజెర్సీలో 1752లో కన్నది. కుటుంబం ఇంగ్లాండ్ చేరింది. అప్పుడు బిషీ యువకుడే. స్వంతంగా ఎదగాలని నిర్ణయించుకొన్నాడు. డబ్బు బాగా ఉన్న ఒక క్లేర్జిమన్ కూతురితో లేచిపోయి పెళ్లి చేసుకొని, ఆమె చనిపోయే నాటికి సంపదతోపాటు ముగ్గురు పిల్లల తండ్రి అయ్యాడు. రెండో పెళ్లి చేసుకొని ఏడుగురిని కన్నాడు. ఆమె నుంచి గొప్ప సంపద కలిసొచ్చింది. వీళ్ళ పెద్దబ్బాయి తిమోతీకి కౌంటీలో మంచి సంబంధం చూసి పెళ్లి చేశాడు. వీరి ఏడుగురి సంతానంలో పెద్దవాడు పెర్సిబి షెల్లీ. 04-08-1792లో లండన్‌కు నలభై మైళ్ళ దూరంలో ఉన్న ససెక్స్‌లోని హోషం ఫీల్డ్ బేస్‌లో పుట్టాడు.

షెల్లీ తండ్రి ఆచారాలను తు.చ తప్పకుండా పాటించాడు. కొడుకంటే విపరీతమైన గర్వం, అభిమానం. చెల్లెళ్ళు అన్నమీద అమిత అనురాగాన్ని చూపారు. ఈ అనుబంధాల మధ్య హాయిగా బాల్యం గడిపాడు. ఇప్పటినుంచి పరిస్థితులు మారిపోయాయి. సియాన్

హౌస్ మిడిల్ క్లాస్ చదవటానికి పంపారు. అతని అందచందాలు, సున్నిత మనస్తత్వం, నాణ్యమైన ప్రవర్తన, తోటి విద్యార్ధులకు ఈర్ష్య కలిగించాయి. అందులో ఒకడు అతని కజిన్ టాం మిడ్విన్ కూడా ఉన్నాడు. అతనే తర్వాత షెల్లీ జీవితచరిత్ర రాశాడు. ప్రతిరోజూ రౌడీయిజం చేసి షెల్లీని భయపెట్టారు. ఒకరకంగా క్రూరంగా హింసించారు. కొద్దికాలం ఓర్చుకొన్నాడు. తరువాత ఎదురు తిరిగాడు. అక్కడ బోధించే సాహిత్యం, భాషా శాస్త్రాలకంటే ఖగోళం, కేమిస్ట్రీ, ఫిజిక్స్ అంటే ఇష్టపడ్డాడు. పిల్లలందరి చేత చెట్టపట్టాలు పట్టించి షాక్‌కు గురి చేసేవాడు. పన్నెండేళ్ళ వయసులో సైన్స్ అంటే వీర అభిమానమేర్పడింది. ఈటన్‌లో ఉన్న ఆరేళ్ళు తోటివారు షెల్లీతో చెలగాటం ఆడారు. ఆ హింస భరించలేక పిచ్చివాడయ్యాడు. గ్రే రాసిన ఎలిజీని బట్టీపట్టి అప్పగించాడు. అక్కడ గడిపిన చివరికాలంలో ఒక "ఊహా ప్రపంచాన్ని" సృష్టించుకొన్నాడు. గోధిక్ రచనల పారం ఎరిగాడు. ఎన్నో క్లాసిక్స్ చదివాడు. కొడుకు సాహిత్యాభిమానానికి తండ్రి ఎంతో మురిసిపోయేవాడు.

సూతీ, చాటర్టన్‌లు అభిమానులైనారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ అంటే గౌరవం. 1810లో తండ్రి చదివిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటి కాలేజిలో చేరాడు. మొదటి రోజునే థామస్ జెఫర్సన్ హాగ్‌తో పరిచయం కలిగింది. అతనితో కలిసి ఒక కరపత్రాన్ని అన్యాయాలనెదిరిస్తూ వెలువరించాడు. ఇద్దర్నీ బహిష్కరించారు. తండ్రి ఎదుట పడటానికి సంకోచించాడు. విషయం తెలిసిన తండ్రి షాకయ్యాడు. పద్దెనిదేళ్ళ షెల్లీ రాడికల్ అయిపోయాడు. "రాముని బుద్ధిమంత తనం రావణుడి భాష్యం"గా మారిపోయింది. తండ్రి ఆస్థి ఇవ్వటానికి ఒప్పుకోలేదు. అయినా దారికి రాలేదు. కొద్దిపాటి ధనం మాత్రమే అప్పగించి మిగిలింది అందరకు పంచెయ్యమని తిమోతీకి చెప్పాడు. ఆమె అవాక్కే అయింది. అతని స్నేహితుల్ని పిలిపించి మంచి దారిలో నడిచేట్లు చేయమని కోరింది. ఏడాదికి రెండు వందల పౌండ్లు ఇచ్చే ఏర్పాటు చేసింది.

గోథిక్ సాహిత్యంపై ఉన్న మోజు పెరిగిందే కాని తగ్గలేదు. ఒక వైన్ మర్చంట్ కూతురు హారియట్ వెస్ట్ బ్రూక్‌ను ప్రేమించి ఆమె ఇంటికి వెడితే వోల్టైర్ రాసిన "డిక్షనరీ ఫిలాసఫిక్" చదువుతూ కనిపించింది. తండ్రి రాక్షసుడని గ్రహించి ఆ ఇంటి చెర విడిపిస్తానన్నాడు. మరో ఏడాదికి ఆమెను తండ్రి ఆంక్షలను తిరస్కరించమన్నాడు. ఫ్రీ లవ్ బాంధవ్యానికి సిద్ధమవమన్నాడు. ఇది ఆమె అక్కకు ఇష్టం లేదు. ఆమెను ఎడిన్ బర్గ్ తీసుకొని వెళ్లి పెళ్లి చేసుకొన్నాడు. ఇంటి నుంచి గెంటివేత, అమ్మాయితో పారిపోవటం షెల్లీ తల్లిని కలవరపెట్టాయి. ఇక సత్రం యజమాని కూతురితో సల్లాపం మరీ బాధించి ఆస్థిలో ఏమీ దక్కకుండా చేసింది. ఫ్రీ లవ్ ఆచరణ సాధ్యంకాదని గ్రహించాడు. హాగ్ వీళ్ళతో ఉంటూ హారిఎట్‌ను ముగ్గులో దించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆమెపై మోహం పెంచుకొన్నందుకు కాదు అతని జెలసీని వ్యతిరేకించాడు. ఈ పరిస్థితుల్లో హారియట్ తల్లికంటే అధికంగా ప్రేమించే ఎలిజా వచ్చి

అన్నిటిని చక్కబరిచింది. లేక్ డిస్ట్రిక్ట్‌లో షెల్లీ దంపతులతో బాటు ఆమె కూడా గెస్ట్‌గా ఉంది. 1812లో ఈ రాక్షస ప్రేమ బాధ తప్పించుకోవటానికి డబ్లిన్ వెళ్లాడు భార్య ఎలిజాతో. అక్కడ సుఖంగా ఉండటానికన్నా ప్రచారానికే వెళ్లాడు. "అడ్రస్ టు ఐరిష్ పీపుల్" రాసి అతి తక్కువ ధరకే ప్రచారం కోసం అమ్మాడు. వీధుల చివర్లలో నిలబడి భార్యాభర్తా వాటిని అమ్మారు. ఇంటి బాల్కనీ పైనుంచి రోడ్డుమీదకు పాంప్లెట్లు విసిరారు. "డిక్లరేషన్ ఆఫ్ రైట్స్"ను కూడా ఇలాగే చేశారు. తనేదో తప్పు చేస్తున్నట్లు అనిపించేది. యువకుడి కర్తవ్యం ఇదికాదనిపించింది. విలియం గాడ్విన్ రాసిన "పొలిటికల్ జస్టిస్"ను బైబిల్‌గా భావించాడు. ఐర్లాండ్‌లో స్వేచ్ఛ ఉద్యమం బలపడలేదు. నిరాశతో ఇంగ్లాండ్ చేరాడు. ఇరవై ఏళ్ళు వచ్చేసరికి షెల్లీ అనుమానాస్పదుడయ్యాడు. ఐరిష్ రాజకీయ వ్యవస్థను దెబ్బ తీయటానికి కుట్ర పన్నుతున్నాడని ఆరోపణ వచ్చింది. దీనితో కొంచెం స్పీడ్ తగ్గించాడు. కవిత్వమే ఆయుధం అని నిర్ణయించుకొన్నాడు. "క్వీన్‌మాబ్" అనే ఇరవై రెండొందల లైన్ల దీర్ఘ కవిత రాశాడు. ప్రపంచంలోని రాజకీయ, సాంఘిక పరిస్థితుల మీదా, రాబోయే కాలంలో జరగబోయే విషయాలపైనా రాశాడు. ఇందులో పరిణామ సిద్ధాంతం, ప్రాచీన నాగరికతా ధ్వంసం, యుద్ధ భీతి, సమాజంలో అవినీతి లంచగొండితనం ఉన్నాయి. శాకాహారం అవసరంపై "విండికేషన్స్ ఆఫ్ నేచురల్ డయట్" రాయటమే కాక శాకాహారిగానే ఉండిపోయాడు. అవసర న్యాయంను సమర్థించాడు. చట్టబద్ధ వివాహాన్ని వ్యతిరేకించాడు. మతాధిపతుల ఆగడాలను బయటపెట్టాడు. "And priests dare babble of a god of peace - even whilst their hands are red with guiltless blood - murdering the while, uprooting every germ - of truth exterminating spoiling all - making the earth a slaughter house" అని నిర్మొహమాటంగా వివరించాడు.

క్వీన్ మాక్ పుస్తకాన్ని పైరసీ చేసి అమ్మారు. ప్రభుత్వం ఇలా రాసినవాడు తన పిల్లలను పెంచేందుకు సమర్థుడు కాదన్నది. కోర్టు కేసు అయింది. దేవుడిని, పవిత్ర గ్రంథాలను దూషిస్తున్నాడని నేరం. మొదటి బిడ్డ పుట్టింది. ఆమెకు ఎలిజా ఇయిన్తే అని పేరు పెట్టాడు. తల్లి ఏమీ దగ్గరకు రానీయకపోవటం ఆర్థికంగా ఆసరాగా నిలబడకపోవటం విషాదమే మిగిల్చింది. అప్పుల వాళ్ళు ఒత్తిడి చేస్తున్నారు. పిల్లను చూసుకోవాలి కడుపులో ఇంకోరున్నారు. చివరికి గాడ్విన్నే శరణ్యమై గాడ్ అయ్యాడు జీవితాంతం. గాడ్విన్ శిష్యురాలు మేరీ పరిచయమైంది. ఆమె స్త్రీహక్కు ఉద్యమకారిణి. ఇంటికి దూరంగా మేరీకి దగ్గరగా బతుకుతున్నాడు. చివరికి హారియట్ అందరు కలిసి ఉందామని రాజీ చేసింది. "భార్య హారియట్ సోదరిలాగా" మేరీ "భార్యలాగా" ఉండే ఒప్పందం అది. బైరన్ కొడుకుని అని చెప్పుకొన్న వాడొకడు తరువాత ఈ విషయాలన్నీ బయటపెట్టాడు. అతను రాసిన ఉత్తరాలన్నిటిని చనిపోయిన వందేళ్ళకు

ప్రచురించారు.

మేరీతో విడిగా కాపురం పెట్టాడు. గాడ్విన్ దంపతుల అభ్యర్ధనతో మేరి షెల్లీని వదిలి వెళ్లిపోవటానికి ఒప్పందం కుదిర్చాడు. దీన్ని తట్టుకోలేకపోయాడు కవి పుంగవుడు. ఇంత నల్లమందు మేరీ చేతిలో పెట్టి ఆమె వెళ్ళిపోతే ఆమెతో బాటు తానూ చస్తానని బెదిరించాడు. గాడ్విన్ కూతురు అతన్ని ఓదార్చి ఇంటికి పంపేసింది. హారియట్‌తో ఉంటున్న అతనిలో మానవ స్వభావం ఏమీ లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఆమెను సోదరిగా చూడలేక వ్యధ చెందుతున్నాడు. నిజాన్ని ఒప్పుకోలేకపోతున్నాడు. క్షోభ అనుభవిస్తున్నాడు. డబ్బులేక కాదు తోటి మనిషిని అర్ధం చేసుకొనే మనస్థత్వం లేని కవి అయ్యాడు. మానవత్వం గురించి తెలుసు కాని మనుష్యుల గురించి తెలియని అవివేకి. "కవిత్వాన్ని అనుభవించాలి. వేదాంతాన్ని అర్ధం చేసుకోవాలి" అనే హారియట్ పాటి జ్ఞానం లేకపోయింది. అన్నమాట నిలుపుకోకుండా రహస్యంగా మేరీ వచ్చి మైత్రి చేసుకొని వెడుతోంది. అతన్ని లేవదీసుకొని పోయే ప్లాన్ వేసింది. తాను షెల్లీ జీవితంలోకి ప్రవేశించి ఉండకపోతే షెల్లీ ఎప్పుడో చచ్చేవాడని అన్నది కూడా.

28-07-1814 తెల్లవారుఝామున నాలుగింటికి షెల్లీ, మేరీ క్లైర్‌లతో ఒక కోచ్‌లో రహస్యంగా ఫ్రాన్స్‌కు ఉడాయించేశారు. పారిస్‌కు మంచి మిట్ట మధ్యాహ్నం చేరారు. బాగా అలసిపోయారు. వాచీని అమ్మేసి ఒక నాటుపడవ అద్దెకు తీసుకొని స్విట్జర్లాండ్‌కు బయల్దేరారు. షెల్లీ అంటే స్నేహితులందరికీ అసహ్యమేసింది. హారియట్ రెండవ బిడ్డను కడుపుతో ఉంది. లాయర్ సలహా కోరింది. కొడుకును కన్నది. "డిసేర్టేడ్ వైఫ్" పేర ఉత్తరం రాసింది. షెల్లీ తాత చనిపోయాడు. షెల్లీకి లక్ష పౌండ్ల ఆస్థి దక్కింది. అప్పులు తీర్చేశాడు. గాడ్విన్‌కు వెయ్యి పౌండ్లు ముట్టజెప్పాడు. ఒకరకంగా జీవితం కుదుటబడ్డట్లే. గ్రీక్, లాటిన్, ఫ్రెంచ్‌లను మేరీ క్లైర్‌లకు నేర్పుతున్నాడు. సానుభూతి పొందలేని జీవి అయ్యాడు.

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 38

# శోక కవి - కవి అనధికార శాసనకర్త అన్న - పెర్సి బిషెల్లీ - 2 (చివరి భాగం)

**మే**రీకి పిల్లలు పుడుతూనే ఉన్నారు. గాడ్విన్ పారసైట్ అయ్యాడని షెల్లీ బాధపడుతూనే ఉన్నాడు. బిషప్ గెట్‌లో ఒక ఏడాదే ఉన్నారు. ప్రతిచోట తనకు శత్రువులెక్కువైనారని భావించాడు. జేనేవా దగ్గర సేఖేరాన్‌లో కాపురమున్నారు. బైరన్ వచ్చి చేరాడు. షెల్లీ బైరన్‌లు కలిసి ఫ్రీ లవ్ సొసైటీ పెట్టారని గుసగుసలు వచ్చాయి. అందరు కలిసి ఎంజాయ్ చేస్తున్నారు. కొద్దికాలానికి బైరన్‌ను వదిలేసి వీళ్ళు వెళ్ళిపోయారు. గాడ్విన్ కూతురు తండ్రి నిజ స్వభావాన్ని తెలియజేస్తూ ఉత్తరాలు రాస్తోంది. లండన్ చేరిన నెలకే ఆమె ఆత్మహత్య చేసుకొన్నట్లు తెలిసింది. షెల్లీ షాకయ్యాడు. హారియట్ అకస్మాత్తుగా అదృశ్యమైంది. ఇది మరో షాక్. ఆమె శవమై సేర్పెంటిన్ రివర్‌లో తేలింది. ఆమె వయసు ఇరవై ఒక్కటి మాత్రమే. ఎలిజా రాసిన ఉత్తరానికి షెల్లీ చలించలేదు. హారియట్ మరణంతో మేరీని పెళ్లి చేసుకొనే లైసెన్స్ వచ్చింది షెల్లీకి. తన పిల్లల్ని ఇవ్వమని షెల్లీ ఎలిజాను కోరాడు. కోర్టును ఆశ్రయించాడు. తండ్రిగా అనర్హుడు అని అనేక డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించారు. కోర్టు నమ్మి అతని చేతుల్లో పిల్లలు పాడైపోతారు కనుక పిల్లల్ని తీసుకొనే అర్హత లేదని తీర్పునిచ్చారు. కోర్టులో ఓడిపోవటంతో డిప్రెస్ అయ్యాడు. క్లారాకు పిల్లాడు పుట్టినందుకు సంతోషపడ్డాడు. లీ హంట్ సర్కిల్‌లో చేరిపోయాడు. ఇరవై రెండేళ్ళ కీట్స్ కవి వీళ్ళతో కలుస్తున్నా షెల్లీకి దగ్గర కాలేకపోయాడు.

మార్లోలో కాపురమున్నాడు. మేరీతో మైత్రీగా ఉంటున్నాడు. కవితా ఝరి పారిస్తూనే ఉన్నాడు. ముప్ఫై చిన్న కవితలను రాశాడు. నాలుగు వేల ఎనిమిది వందల పంక్తుల దీర్ఘ కవిత "ది రివోల్ట్ ఆఫ్ ఇస్లాం" రాశాడు. గాడ్విన్ బెదిరింపులేమీ ఆగలేదు. బైరన్ క్లైర్

గురించి, పుట్టిన పిల్ల గురించి పట్టించుకోలేదు. షెల్లీ ఆరోగ్యమూ తగ్గిపోతోంది. మొదటిసారి గుండెపోటు వచ్చింది. ఇంగ్లాండ్ వదిలి ఆరోగ్యం కోసం ఇటలీ వెళ్లాడు. మిలన్‌కు క్లైర్ అల్లెగ్రా, పిల్లలు చేరారు. తొమ్మిది వారాలు అక్కడే ప్రదేశాలు తిరుగుతూ, ప్లేటో రాసిన "సంపోజియాంస్"ను అనువాదం చేశాడు. "మనిషి యొక్క వ్యక్తిత్వం కోసం అన్వేషణ, కలయికయే ప్రేమ అన్నాడు. బైరన్ షెల్లీ కుటుంబానికి తన సౌధం వాడుకొనేందుకు ఇచ్చాడు. షెల్లీ "జూలియన్ అండ్ మద్దాలో" రాయటం మొదలుపెట్టాడు. "డీసెన్సి" అనే ట్రాజెడీలో మొదటి భాగం రాశాడు. క్లారా డిసెంటరి వ్యాధితో బాధపడి చనిపోయింది. శోకంలో ఉన్నా జూలియన్ రాస్తూనే ఉన్నాడు. క్లైర్తతో లవ్ ఎఫైర్ సాగిస్తున్నాడు. వీళ్ళ పాపానికి పుట్టిన పిల్లలెవరో ఎవరికీ తెలీదు.

ముగ్గురూ నేపుల్స్ చేరారు. రాయటం తగ్గించి బోట్ షికార్లు, రైడింగ్ సైట్ సీయింగ్‌లో గడిపాడు. ఆరోగ్యమూ, శక్తి సమకూడాయి. కుర్రాడిగా కనిపిస్తున్నాడు. రోమ్ చేరారు. రెండున్నర ఏళ్ళ కొడుకు విలియం చనిపోయాడు. లెగ్‌హారన్‌కు మకాం మార్చారు. ఫ్లారెన్స్ చేరుకొన్నారు. మేరీ నాలుగో సంతానంగా పెర్సి ఫ్లారెన్స్‌ను కన్నది. "సెన్సి" రాయటం పూర్తి చేశాడు. "The best thing I ever wrote" అనుకొన్నాడు. కాని మంత్లీ క్వార్టర్లీ రివ్యూలు "అసంబద్ధం, అవివేక రచన" అన్నాయి. ఫ్లారెన్స్‌లో గాలి తీవ్రత ఎక్కువ. ఎప్పుడూ వర్షమే. పీసా వెళ్లారు. అక్కడ ఉన్న రెండు ఏళ్లలో అతనిలోని జీనియస్ విజృంభించాడు. "ది మాస్క్ ఆఫ్ అనార్కి" అనే శిఖరాయమానమైన కవిత రాశాడు. అందులో "Rise like lions after slumber - in unvanquishable number - shake your chins to earth like dew - which in sleep had fallen on you - ye are many - they are few" గొప్ప లైన్లు. ఇక్కడే అతను "స్కైలార్క్" క్లౌడ్, లవ్స్ ఫిలాసఫీ "సెన్సిటివ్ ప్లాంట్" అనే అపూర్వ కవితలు రాశాడు. "ఇంగ్లాండ్ ఇన్ 1819" రాశాడు. ఇక్కడి వేడి భరించలేక సాన్ గులియానోకు వెళ్లారు. అక్కడ వర్షాలు విపరీతమై నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరదలు ముంచెత్తుతున్నాయి. టాం మెడ్విన్ వచ్చి చేరి షెల్లీతో రాజకీయ సాహిత్య ప్రసంగాలు చేస్తూ షెల్లీకి తిండి ధ్యాసే లేకుండా చేస్తోంది.

ఇరవై తొమ్మిదో ఏట మరో అమ్మాయితో శృంగారం రంగరించాడు. ఆమె ఇరవై రెండేళ్ళ ఏమిలా వివియాని. ఆమెకు కాన్వెంట్ చెర విడిపించి పెళ్లి చేసుకొని చాంపియన్ అవ్వాలనుకొన్నాడు. ఏమిలా షెల్లీకి "స్పిరిట్యువల్ సిస్టర్" అయింది. ఆమె తండ్రి పీసా గవర్నర్. కేసును షెల్లీ డ్యూక్ దాకా తీసుకెళ్ళాడు. గవర్నర్ మరో పార్శ్వం జనానికి తెలియాలనేవాడు. "ఎపి సైకిడియాన్" అనే కవితను దీనిపై రాశాడు. ఇందులో "ప్లాటోనిక్ లవ్" ఉంది. అదేకాక ఫ్రీ లవ్, సెక్స్, కోరికా ఉన్నాయి. ఆరు వందల లైన్‌ల కవిత ఇది.

సంఘంలోని ఇరుకు మనస్థత్వాన్ని చూపాడు. "With one child friend, perhaps a jealous foe - the dreariest and longest journey go" ఉదాహరణకు చూపాను. ఇది పూర్తి అయి ప్రింట్ అయ్యేలోపే ఎమిలీ జైలు నుంచి పారిపోయి వేరొకరిని పెళ్లి చేసుకొని షెల్లీకి షాకిచ్చింది. వంద కాపీలు మాత్రమే వేయించాడు.

పీకాక్ అనేవాడు ఆధునిక ప్రపంచంలో కవిత్వానికి స్థానం లేదని రాశాడు. తన శక్తి యుక్తులను కూడదీసుకొని కవిత్వానికి ఉన్న శక్తి సామర్థ్యాలను నిరూపిస్తూ "డిఫెన్స్ ఆఫ్ పోయెట్రీ" రాశాడు. సమాజంలో కవిపాత్ర గొప్పదని వాదించాడు. "Lift evil from the hidden beauty of the world and make familiar objects be as if they were not familiar" అని చెప్పి కవిత్వ సామర్థ్యాన్ని "Ever strengthens and purifies the affections enlarges the imagination and adds spirit to sense. poets are the unknowledged legislators of the world" అని ఢంకా బజాయించి చెప్పాడు. ఈ చివరి వాక్యాన్నే అందరూ ఉదాహరిస్తారు. అంత ప్రాచుర్యం పొందిన వాక్యం అది.

"అడనోస్" అనే చివరి గొప్ప కవిత రాశాడు. అది మహా గొప్ప ఏకైక కవిత అంటారు. ఫిబ్రవరిలో కీట్స్ కవి రోమ్‌లో చనిపోయాడు. ఏప్రిల్‌కు కాని ఈ విషాదవార్త షెల్లీకి తెలియలేదు. అడనోస్ కూడా కవిత్వాన్ని సమర్థించే మరో కవితే. "కీట్స్‌ను అతని క్షయ వ్యాధికంటే విమర్శకులే అతిగా రాసి దారుణంగా చంపేశారని" షెల్లీ అభిప్రాయపడ్డాడు. లిసిడియాస్ తర్వాత గొప్ప ఎలిజీగా యాభై అయిదు స్పెంసేరియన్ స్టాంజాలుగా రాశాడు. ఎక్కడా జోరు, కాని భావం, భాష తగ్గకుండా పకడ్బందీగా రాశాడు. దు:ఖానికి పరాకాష్టగా నిలిచిపోయి షెల్లీని చిరంజీవిని చేసింది.

"The one remains, the many change and past - heavens light forever shines - earth's shadow fly - that light whose smile kindles the universe - that beauty in which all things work and move - by man and beast and earth are mirrors of the fire for which all thirst now beams on me - consuming the last clouds of cold mortality" అని చలించి జ్వలించి చెప్పాడు. ఈ దు:ఖంతో ఆగిపోలేదు. ఇంకా తన సృజన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాడు. కీట్స్ మరణం తర్వాత షెల్లీ పీసన్ లిటరరీ సర్కిల్ సభ్యుడయ్యాడు. లేరిసిలో గల్ఫ్ ఆఫ్ స్పీజియా దగ్గర చిన్న ఇల్లు కొనుక్కున్నాడు. అయిదుగురూ అక్కడే ఉన్నారు. ఇల్లు ఇరుకు మురికి కొంప అందులోనే సర్దుకొంటున్నారు. షెల్లీకి ఈత రాకపోయినా బోట్ షికారంటే ఇష్టం.

పన్నెండు అడుగుల బోట్ "ఏరియల్"ను కొన్నాడు. విలియంతో కలిసి మొదటిసారిగా

హేగ్ హారన్‌కు బోట్ నడుపుకొంటూ వెళ్లారు. బైరన్ ఇంటికి వెళ్లి వచ్చారు. జూలై ఎనిమిదిన విలియంతో కలిసి లేర్సికి బోట్లో తిరిగి వస్తున్నారు. కాని ఇంటికి చేరలేకపోయారు. విపరీతమైన గాలి, వర్షం నడపటం అసాధ్యం అనిపించింది. బోట్ నదిలో తిరగబడిపోయింది. మళ్ళీ లేవలేకపోయారు. రెండు వారాల తర్వాత వారిద్దరి శవాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. కీట్స్ రాసిన కవిత షెల్లీ జేబులో ఉండిపోయింది. కుళ్ళిన శవాలను బీచ్ ఒడ్డున సున్నపు పొరల్లో సమాధి చేశారు. మళ్ళీ కొన్ని నెలల తర్వాత వీరి అభ్యర్థనపై తవ్వి తీసి శవాలను అప్పగించారు. షెల్లీ గుండె దెబ్బ తినలేదట. ట్రేలావని అనేవాడు దాన్ని లాగేశాడు. రోమ్‌లోని ప్రొటెస్టంట్ సేమేటనిలో చితాభస్మాన్ని జాగ్రత్త చేశారు. ఇక్కడే కీట్స్‌నూ సమాధి చేశారు. ఇద్దరు కవులు ప్రక్క ప్రక్కనే సమాధిలో ఉండిపోయారు. ఇంకో నెలలో షెల్లీకి ముప్ఫై ఏళ్ళు వచ్చి ఉండేవి. 18-07-1822న షెల్లీ మరణించాడు.

షెల్లీ జీవితం "A paradox of reason and irresponsibility" అన్నారు. "where music and moon light and feeling are one" అన్నాడు విలియమ్స్. షెల్లీని మాథ్యూ ఆర్నోల్డ్ "A beautiful and ineffectual angels beating in the void his luminious wings in vain" అంటూ కీర్తించాడు. కాని షెల్లీలో మానవ దానవ స్వభావాలు రెండూ జమిలిగా ఉన్నాయని మనం తెలుసుకొన్న చరిత్ర చెబుతోంది. "Drive my dead thoughts over the universe" అన్నాడు షెల్లీ. సమాజంలో కవి పాత్రను విస్పష్టంగా విప్పి చెప్పినవాడు షెల్లీయే. ప్రకృతిలోని అన్ని స్వభావాలకు రూపకల్పన కవి చేస్తాడని చెబుతూ "From these create he can - forms more real than living man - nursing of immortality".

షెల్లీ స్ప్లిట్ పెర్సొనాలిటి. మనిషి గమ్యం తెలిసిన కవి. హింస, స్వేచ్ఛల మధ్య యుద్ధం గురించి రాశాడు. నిరాశ అంటే చిరాకుపడ్డాడు. నిజానికి "అసలైన కవి" అనిపించాడు షెల్లీ. కవితల్లో శిఖరాయమానవైనవీ పాతాళానికి చేరినవీ రాశాడు. సంపూర్ణ వికాసం లేని కవితలు రాశాడనీ అన్నారు. అతని లిరికల్ పవర్ ముందుగా మనల్ని కట్టిపడేస్తుంది. తర్వాత తల ఊపుకొంటూ మనం వెంటబడిపోతాం. స్కైలార్క్ కవిత అతని గుండెల లోతుల్లోంచి జలపాతంగా ఉబికిన కవిత. అలాగే ఒజిమండియాస్ కవితలో గొప్ప తాత్విక దృక్పథాన్ని వెలువరించాడు.

"The world's great age begins a new - the golden years return - the earth doth like a snake renew - her winter weeds outworn"

"Heaven smiles and faiths and empires gleam - like wrecks

of dissolving dream"

"Oh! cease - must hate and death return? - cease must men kill and die? - cease drain not to its dregs the urn - of bitter prophecy - the world is weary of the past - oh! night it die or rest atleast" వంటి అమృతోపమానమైన కవితా పంక్తులు రాసి అమరకవి అయ్యాడు షెల్లీ. కవిత్వ సారాంశాన్ని వీటిలో తెలియజేసిన మహాకవి. "Such poems convey the very essence of poetry - anbodied joy so keen that in spite of every prejudice the world must listen and respond to it"

శోకలోకైక చక్రవర్తి అనిపించుకొన్న షెల్లీతో మన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిని పోలుస్తారు. కృష్ణశాస్త్రి మరణిస్తే, శ్రీశ్రీ "షెల్లీ మళ్ళీ మరణించాడు" అని అన్నమాట మనకందరికి గుర్తుండే ఉంది. రొమాంటిక్ కవుల్లో అగ్రేసరుడు నాలుగైదు తరాలను ప్రభావితం చేసినవాడు. విక్టోరియన్, ప్రిరాఫ్లైట్ కవులపై విశేష ప్రభావం చూపాడు. థాంటే, రోసేట్టి, ఆస్కార్ వైల్డ్ వంటి హేమా హేమీలకు గురు తుల్యుడు. బెర్నార్డ్ షా కారల్‌మార్క్స్, సిన్క్లైర్ థోరోలకు మార్గదర్శి. అనేక ఉద్యమాలకు రాజకీయ ఆలోచనలకు షెల్లీ భావాలే తోడ్పాటైనాయి. అహింసా విధాన ఆందోళనకు తెర తీసినవాడు షెల్లీ. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 39

# క్లాసికల్ స్కాలర్ – జాన్‌కీట్స్

సాధారణ చదువు మాత్రమే ఉన్నా, వంశంలో ఎవరూ క్లాసికల్ సాహిత్యాన్ని చదవకపోయిపా జాన్‌కీట్స్ మాత్రం క్లాసికల్ స్కాలర్ అయ్యాడు. తాత లండన్‌లో గుర్రాలశాల నిర్వాహకుడు. తండ్రి థామస్ కీట్స్ మాత్రం అందులో పనివాడైనా దాని యజమాని కూతుర్ని పెళ్లి చేసుకొన్న అదృష్టవంతుడు. తొలి సంతానమే జాన్ కీట్స్. స్వాన్ అండ్ హోప్ స్టేబిల్స్‌లో 1795 ఇరవై తొమ్మిదిన పుట్టాడు. బాల్యం బాగానే గడిచింది. పదేళ్ళ వయసులో తండ్రి గుర్రం కిందపడేస్తే చనిపోయాడు. మూడు నెలల తర్వాత తల్లి వేరొకరిని పెళ్ళాడి వెళ్లిపోయింది. అమ్మమ్మ జెన్నింగ్స్ దగ్గరకు పిల్లలు చేరారు. తల్లి అప్పుడప్పుడు వచ్చి పిల్లల్ని చూసి వెళ్ళేది. తల్లి మరణానికి ముందు జాన్, అతని తమ్ముడు జార్జి యెన్‌ఫీల్డ్ స్కూల్‌లో చేరారు. అమ్మమ్మ ఈ పిల్లలకు గార్డియన్లుగా ఇద్దరినీ ఏర్పరచింది. అమ్మమ్మ చావు తర్వాత బంధువులే లేనివారయ్యారు. అమ్మమ్మ ఆస్థి తగాదాల్లో పడింది. ఈ తగాదా కీట్స్ మరణించిన సంవత్సరానికి కాని తేలలేదు.

కీట్స్ స్కూల్ జీవితం హుషారుగానే గడిచింది. అక్కడి హెడ్ మాస్టర్ జాన్ క్లార్క్ కీట్స్‌పై గొప్ప ప్రభావం కలిగించాడు. కొత్త భావాలు, ఆలోచనలు, కళాత్మక విషయాలను ప్రోత్సహించేవాడు. కీట్స్‌కంటే ఎనిమిదేళ్ళ పెద్దవాడైన ఆయన కొడుకు చార్లెస్ అక్కడే టీచర్‌గా పనిచేస్తున్నాడు. కీట్స్‌లోని కవిని గుర్తించారు తండ్రీ కొడుకులు. కీట్స్‌కు ఆటలంటే ఇష్టం. కుస్తీలు మరీ ఇష్టం. ఎవరితోనైనా యే క్షణాన్నైనా పోటీపడి పీటీ దెబ్బ కొట్టగలవాడని సవాలు చేసేవాడు. నిజానికి కీట్స్ సన్నగా బలహీనంగా ఉండేవాడు. ఒకరోజు పోటీలో రెచ్చిపోయి ఒకడి చెవులు కొరికి జేబులో వేసుకొన్నాడు కీట్స్.

మహా కావ్యాలు కంటబడ్డాయి. రాబిన్సన్ క్రూసో, పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్‌లను దీక్షగా చదివాడు. ఓడ్ రాసిన మోటా మార్ఫోసిస్ అనువాదాన్ని చదివాడు. క్లాసికల్ డిక్షనరీ

అనువాదాన్ని పూర్తిచేశాడు. “ఎనీద్”కు వచన అనువాదం చేశాడు. “ఇంట్రడక్షన్ ఫర్ ఆస్ట్రానమి”, మిల్టన్ పోప్ థామ్సన్ మొదలైన కొటేషన్‌లకు రెండు బహుమతులు పొందాడు. “ఎ డిక్షనరి ఆఫ్ మర్కండైజ్”పై మోజేర్పడింది. సర్జన్ థామస్ హామ్మండ్ దగ్గర అప్రెంటిస్ చేశాడు. తమ్ముడు బుక్ కీపింగ్‌లో చేరాడు. ఇంటికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న కౌడేన్ క్లార్క్ దగ్గరకు వారానికోసారి వెళ్లి అతను చదివేవి వినేవాడు. అది రొమాంటిక్ కాలం. కనుక పాత ధోరణులకు స్వస్తి చెప్పి కొత్తగా ఇద్దరూ ఆలోచించేవారు. పూర్వకవుల భావాలను స్పెన్సర్ స్టాంజాలలో అద్భుతంగా కీట్స్ రాసి వినిపించేవాడు. కౌడేన్ దగ్గర నుంచి “ది ఫైరీ క్వీన్”ను అరువుగా తీసుకొని ఆశ్విక వేగంతో చదివి పారేశాడు. నాలుగేళ్ళు అప్రింటిస్ చేసిన తర్వాత స్వంత ఇల్లేలేని ఇంటిమీద ధ్యాస మళ్ళింది. అమ్మమ్మ చనిపోయింది. తమ్ముళ్ళు చెల్లెళ్ళు ఎవరి వ్యాపకాలలో వాళ్ళున్నారు. డాక్టర్ అవాలనే కోరిక ఉండేది కాని సర్జన్ అవటం ఇష్టం లేదు. హామ్మన్డ్స్ హాస్పిటల్ వదిలేసి లండన్‌లో గీస్ హాస్పిటల్‌లో చేరాడు. మేటీరియా మేడికా, అనాటమీ మిడ్ వైఫ్, బాటని లెక్చర్లు వినేవాడు. ఫ్లవర్ డ్రాయింగ్‌లో పండిపోయాడు. తోటివాడు హెన్రీ స్టీఫెన్స్ సర్జన్ అయిపోయాడు. కీట్స్ మనసు మాత్రం దేనిమీదో ఉంది. కూపర్ కజిన్‌పై మనసు పారేసుకొన్నాడు. తొమ్మిది నెలల తర్వాత మందుల దుకాణం పెట్టుకోవటానికి సర్టిఫికేట్ ఇచ్చారు. మందుల లక్షణాలు వాటి కంపోజిషన్‌లు బాగా గ్రహించాడు. ఇంత చేస్తున్నా “మనసంతా నువ్వే” అంటూ కవిత్వం మీదే ఉండిపోయింది. కవిత్వ శక్తికి దాసోహమన్నాడు. కౌడేన్ క్లార్క్‌తో ఒకసారి “The other day during a lecture there came a sunbeam into the room and with it a whole troop of creatures floating in the ray and I was off with them into a fairy land” అంటూ స్వప్నలోకంలో విహరించాడు. జబ్బు పడ్డవారికి నయం చేయటం తనకు చేతకాని పని అని గ్రహించాడు. చివరిసారిగా ఒక పేషెంట్ ఆర్టేరిను ఓపెన్ చేసి కలల్లో తేలిపోయి అద్భుతాలు చూసి ఇక మళ్ళీ సర్జికల్ సామగ్రి జోలికి వెళ్ళలేదని కీట్స్ స్వయంగా చెప్పాడు.

ఇరవై ఒకటిలో కొన్ని కవితలే రాశాడు. “ఇమిటేషన్ ఆఫ్ స్పెన్సర్” అనే సానెట్ రాశాడు. తను ఇంకా సర్జన్‌గా ఉండలేనని తేల్చి చెప్పేశాడు. కీట్స్‌కు సన్నిహితులు అతని సోదరులే. సేవేర్న్ అనే చిత్రకారుడు కీట్స్ అద్భుత చిత్రాన్ని గీశాడు. చాలా ముచ్చటగా కీట్స్ కనిపిస్తాడు. లండన్‌లో చాపి సైడ్ జిల్లాలో సోదరులతో కొంతకాలం ఉన్నాడు. ఒకరోజు ఉదయం పదింటికి కీట్స్ ఆ రాత్రి అంతా నిద్రపోకుండా మేలుకొని రాసిన “ఆన్ ఫస్ట్ లుకింగ్ ఇంటు చాప్మాన్స్ హోమర్” “Much have I travelled in the realms of gold - and many goodly states and kingdoms seen” అని ప్రారంభమయ్యే సానెట్

చదివి వినిపించాడు. పసిఫిక్ సముద్ర అన్వేషణపై "కోరైజ్" కవిత రాశాడు. వీటి వ్రాతప్రతులు ఉన్నాయి. హంట్ రాసిన దానికి ఫైన్‌వేసి జైల్లో పెట్టారు. "కవిత్వం కాన్షస్‌తో రాసేది కాదు అన్‌కాన్షస్‌గా రాసేద"ని కీట్స్ అభిప్రాయం. "A drainless shower - of light is poesy - it is the supreme of power - its might half - slumbering on its own right arm" అన్నాడు. హంట్ బృందంలో కీట్స్ సభ్యుడైనాడు. వర్డ్స్‌వర్త్ కీట్స్‌ను మెచ్చాడు. హుంట్‌తో సాన్నిహిత్యం కీట్స్‌కు ఎంతో మేలు చేసింది. "The poetry of earth is never dead"తో ప్రారంభమైన కవిత అందరిని మెప్పించింది. "ఆన్ ది గ్రాస్‌హోపర్ అండ్ ది క్రికెట్" మొదలైనవి పేరొందాయి. సమీక్షలూ అనుకూలంగానే వస్తున్నాయి.

ఈ ఆనందం ఎక్కువకాలం లేదు. సోదరుడు టాం అనారోగ్యంతో తిరిగి వచ్చాడు. అందరూ కలిసి వెల్‌వాక్‌లో స్థిరపడ్డారు. హాంప్‌స్టేడ్ బృందం పెరిగిపోయింది. కీట్స్ ధ్యాస అంతా కవిత్వం మీదనే. కవిత్వం రాయకుండా ఒక్కక్షణం కూడా ఉండేవాడు కాదు. "షేక్స్‌పియర్‌ను చదివితే చాలు అతడొక విజ్ఞాన సర్వస్వం" అనేవాడు. "ఎందిమియాన్" తన ప్రజ్ఞా సర్వస్వం అని తన శక్తి అంతా ధారపోసి రాశానని చెప్పాడు. దాన్ని "పోలార్ స్టార్ ఆఫ్ పోయిట్రీ" అన్నాడు. చాంపియన్ పత్రికలో డ్రామా క్రిటిక్‌గా ఉన్న రేనాల్డ్స్ సెలవలకు వెడుతూ బాధ్యత కీట్స్‌మీద ఉంచాడు. ఒదేల్లో రిచర్డ్ త్రీ నాటకాలు చూసి సమీక్ష చేశాడు. వర్డ్స్‌వర్త్‌తో కలయిక హుషారునివ్వలేదు. తన ప్రాభవం తగ్గిపోతోందని ఆ లేక్ పోయేట్ బాధ పడుతున్నాడు. కీట్స్ లండన్ వదిలి జార్జి స్థానంలో టిగ్‌మౌట్‌లో పనిచేశాడు.

1818 ఏప్రిల్‌లో "ఎండిమియాన్" ప్రచురించాడు. సమీక్షలు చాలా వ్యతిరేకంగా వచ్చాయి. అందులోని "A thing of beauty is a joy forever" అందరి నాలుకలమీదా నాట్యమాడింది. విమర్శ జడివాన నుంచి బయట పడటానికి స్విట్జర్లాండ్ వెళ్లాడు. బ్రౌన్‌తో కలిసి ఐర్లాండ్ చూశాడు. వాతావరణం బాగోలేక వారానికే బెల్ఫాస్ట్ చేరారు. అక్కడి నుండి బాలన్త్రే వెళ్లి విపరీతమైన వర్షాలు, చలి, దగ్గు, జలుబు పట్టి క్షయ వ్యాధి లక్షణాలు కనిపించాయి. హాంప్‌స్టేడ్‌కు తిరిగొచ్చేశారు. టాం పరిస్థితి మరీ దారుణం. అతన్ని కనిపెట్టి ఉంటున్నాడు కీట్స్. రివ్యూలు డిప్రెషన్ తెప్పించాయి. క్వార్టర్లీ రివ్యు కోకేరి స్కూల్, ఎండిమియాన్‌లపై విషమే కక్కినా మిగిలిన వారికంటే కొంత నయం. పుస్తకాలు అమ్ముడుపోక డబ్బు ఇబ్బంది ఎక్కువైంది. బైరన్ సూతీ మూర్‌లు ఆర్థిక సాయం చేసి నిలబెట్టారు. టాం చనిపోయాడు. తల్లికి, టాంకు వచ్చిన క్షయ తననూ కబళించివేస్తుందని తెలుసుకొన్నాడు.

ఇంతలో మరో ఎదురుదెబ్బ తగిలింది. ఫాన్నీ ప్రేమ అనుకొన్నట్లు ముందుకు సాగటం లేదు. భవిష్యత్తు అంధకారంగా ఉంది. విజయం పొందలేని కవి అనిపించుకొన్నాడు. వారిద్దరి మధ్యా ప్రేమలేఖలు 1936లో మాత్రమే ప్రచురణ అయ్యాయి. ఆమెకు కీట్స్‌పై

ఆరాధన తగ్గలేదు. విధవరాలు వేషంతో గడిపింది. 1818లో "ట్రూ థామస్" అనే బాలడ్ గొప్పగా రాశాడు. సోదరుడు జార్జి స్పెక్యులేషన్‌లో బోలెడు సొమ్ము పోగొట్టుకొన్నాడు. ఎటూ పాలుపోక జర్నలిజంలో ఉండాలని మెడిసిన్ ప్రాక్టీస్ చేయాలని ఊగిసలాడాడు. "లామియా" "ఒతో ది గ్రేట్" రాశాడు. ఫాన్ని లేకుండా బతకలేనని చెప్పుతున్నాడు. ఎనిమిది వందల లైన్‌ల "ది కాప్ అండ్ ది బెల్"ను సాహసోపేతంగా రాశాడు. బాగా డిప్రెస్ అయ్యాడు. ఏడు వందల పౌండ్ల ఆస్థిని అమ్మి జార్జికిచ్చాడు వ్యాపారం కోసం. అదేమీ కీట్స్ స్వంతం కాదని కీట్స్ చనిపోయిన తర్వాత జార్జి చెప్పటం విడ్డూరం.

1820 ఫిబ్రవరిలో ఫాన్నికి పరిస్థితి వివరిస్తూ జాబు రాశాడు. కీట్స్‌కు చావు ఘడియలు దగ్గరపడ్డాయి. చలి, దగ్గు, బలహీనత బాధిస్తున్నాయి. రక్తం కక్కుకొంటున్నాడు. కొవ్వొత్తి వెలుగులో దుప్పటిపై కక్కిన రక్తాన్ని తానే పరీక్షించి చూసి "that drop of blood is my death warrant" అని తేల్చి చెప్పేశాడు. హేమరేజేలు ఎక్కువైనాయి. మార్చిలో కొంత గుణం కనిపించింది. లండన్ వెళ్లి "క్రిస్ట్ ఎంట్రి ఇంటు జెరూసలేం" చూద్దామనుకొన్నాడు. "లామియా ఇసబెల్ల", "ది ఈవ్ ఆఫ్ సుయింట్ ఆగ్నెస్" మొదలైన పోయెమ్స్ చివరి వాల్యూంలో చేర్చాడు. 1820 జూలైలో ప్రింట్ చేశాడు. దీనిపై మంచి స్పందనే వచ్చింది. అమ్మకాలు జోరుగా సాగాయి. ఇంగ్లాండ్‌లో రాజకీయ దుమారం రేగింది. నాలుగవ జార్జి భార్యను వదిలేశాడు. దీనితో అయిదు వందల కాపీలే అమ్ముడయ్యాయి. "ఇసబెల్లా ఆర్ ది పాల్ ఆఫ్ బాసిల్" బోకాసియోలోని ఒక కథ. ఈవ్ ఆఫ్ ఆగ్నెస్ గొప్ప విజయమే. సెప్టెంబర్ పద్దెనిమిదిన జోసెఫ్ సేవేర్న్‌తో కలిసి కీట్స్ రోమ్‌కు నావమీద బయల్దేరాడు. నెలరోజులు ప్రయాణించి చేరారు.

కీట్స్ చివరి రెండు నెలలు మానసిక ఆందోళన, శారీరక బాధతో గడిపాడు. అసూయ, ఆవేశాలకు అతీతంగా ఉన్నాడు. తన దీన స్థితిని నేపుల్స్ చేరిన తర్వాత బ్రౌన్‌కు జాబు రాసి తెలిపాడు. బాధ విపరీతమై రాయలేకపోయేవాడు. 23-02-1821న సేవేర్న్‌ను పిలిచి "Lift me up, I am dying, don't be frightened. Thank god it's come" అని చివరి మాటలు అని ఊపిరి అందక ఏడు గంటలు బాధపడి అర్ధరాత్రి అసువులు బాశాడు కీట్స్ కవి. రెండు రోజుల తర్వాత రోమ్‌లోని ప్రొటెస్టంట్ సేమేటరిలో ఖననం చేశారు. ఆయన రాసిన కవితా(ఎపితా) "Here lies one whose name was writ in water" ఉన్న ఫలకాన్ని ఉంచారు. కీట్స్ కోరిక మేరకు సమాధిపై అతని పేరు రాయలేదు. కవిగా అయిదేళ్ళ కాలమే జీవించాడు. తన కవిత్వాన్ని సీరియస్‌గా రాశాడు కాని గర్వంతో, పొగరుతో రాయలేదు. కీట్స్ కవిత్వం అంటే ఒక భావోద్రేకమే కాని ఆలోచనాపరం కాదంటారు. ఇది అబద్ధం అది ఆలోచన భావోద్రేక సమ్మేళనమే. అతని ఊహకు ప్రతీకయే. "సవ్యమార్గంలో

జాగ్రత్తగా ఉండమనే" కీట్స్ సందేశం. "ఇంద్రియాతీత భావనకు రూపకల్పన చేశాడు". నైటింగేల్ కవితలో గౌరవ ఆరాధన నుంచి యదార్ధానికి ప్రయాణించాడు. కీట్స్‌కు ఒక దివ్యమైన కల ఉండేది అదే "A dream of a world made not only lovelier but worthier of living. It was a pursuit of a dedicated poet, a tragic lover, and a brave man, who wounded by derision and weakened by a fatal disease, confronted death with a deathless vision".

ఐదారేళ్ళు మాత్రమే కవిగా ఉన్నా కీట్స్ కవిత్వాన్ని ఇప్పటికీ ఆరాధిస్తూనే ఉన్నారు. ఓడ్స్‌మీద రసపట్టు ఉన్న కవి. టెన్నిసన్ ఇలియట్‌లను ప్రభావితం చేశాడు. రొమాంటిక్ కవిత్వంలో షెల్లీ కీట్స్‌లు ధ్రువతారలుగా నిలిచారు. కీట్స్ రాసిన ఉత్తరాలకు కూడా సాహిత్య గౌరవం అమితంగా ఉంది.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 40

విక్టోరియా కాలపు ప్రేమకథలు

# మోనోలోగ్స్ సిద్ధహస్తుడు - రాబర్ట్ బ్రౌనింగ్

బ్రౌనింగ్ జీవించిన డెబ్భై ఏడు సంవత్సరాలలో పందొమ్మిదవ శతాబ్దపు ఇంగ్లాండ్ అనేక ప్రశాంత విప్లవాలను చవి చూసింది. విక్టోరియన్ కాలంలో మార్పులు నెమ్మదిగా వచ్చినా అవి గణనీయమైనవి. కారల్‌మార్క్స్‌కు అప్పటికి "అంత సీను" లేదు. పార్లమెంట్‌లో డబ్బున్న వాళ్ళకే ఒటు హక్కు అనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. సమాన వోటు హక్కు కోసం ప్రజలు పట్టుబడుతున్నారు. చారిటాన్‌ల ఈ ఉద్యమం క్రమంగా బలపడి అనుకొన్నవి సాధించారు. ఆ శతాబ్ది మధ్యలో కాని బాల కార్మికుల పనిపై ఆంక్షలు రాలేదు. ఫాక్టరీ కూలీల జీవితాలు బాగుపడలేదు. యెలిజబెత్ బారెట్ బ్రౌనింగ్ "ది క్రై ఆఫ్ ది చైల్డ్" థామస్ హుడ్ "సంగ్ ఆఫ్ ది షర్ట్"లే వీటిని సాధించాయి. డార్విన్ పరిణామ సిద్ధాంతంత సైన్సుకు, మతానికి మధ్య చిచ్చుపెట్టింది. బైబిల్ చెప్పిందే నమ్మాలి అన్నదానికి సవాలుగా నిలిచింది. విశ్వంలో మానవుడి ఉనికికి ప్రధాన్యమేర్పడింది.

సాహిత్యంలోను ఎన్నో మార్పులొచ్చాయి. విక్టోరియన్ నవల అయిన స్కాట్ నవలపై ఏవగింపు కలిగింది. కల్పనా సాహిత్యాన్ని డికెన్స్ విజృంభించి రాసి మెప్పిస్తున్నాడు. నిజాయితీ కంటే బాధ్యతకు గౌరవం లభిస్తోంది. అదిగో ఇలాంటి నేపథ్యంలోనే రాబర్ట్ బ్రౌనింగ్ కవి 07-05-1812న, కంబర్వేల్‌లో ఉదయించాడు. అందరు ఇంగ్లాండ్ కవుల్లా కాకుండా ఇతని వ్రేళ్ళు వెస్ట్ ఇండీస్‌లో ఉన్నాయి. తాత గ్రియోల్ రక్తం ఉన్నవాడు. అదే నల్ల రంగు బ్రౌనింగ్‌కు వచ్చి యెర్ర ఇంగ్లాండ్ కవులకు భిన్నంగా ఉండేవాడు. తల్లి సారా వీదర్మన్ జర్మన్ జ్యూ అయిన నావికుని కూతురు. ఈ తాతనే బ్రౌనింగ్ "షిప్ ఓనర్" అనేవాడు. ఈయన డూండీలోని స్కాటిష్ స్త్రీని పెళ్లి చేసుకొన్నాడు. తల్లి నుండి తనకు సంగీతం సంక్రమించిందని బ్రౌనింగ్ చెప్పాడు.

తండ్రిపైనే బ్రౌనింగ్ ఎక్కువ ఆధారపడ్డాడు. తండ్రి వెస్ట్ ఇండీస్‌లోని కిట్స్‌లో చెరుకు వ్యవసాయం చేసేవాడు. అక్కడి బానిసలపై దౌర్జన్యాన్ని ఎదిరిస్తే తండ్రి బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో పనిలో పెట్టాడు. అక్కడ పెద్దమనిషిగా, విద్యావంతుడిగా, బైబిల్ అభిమానిగా మారాడు. తండ్రి లైబ్రరీలో ఆరువేల పుస్తకాలు వివిధ భాషల్లో ఉండేవి. ఇక్కడే పెరక్లియాస్, ఫాస్తాస్ మొదలైనవి చదివాడు. ఈ విషయంలో జీవితాంతం తండ్రికి రుణపడి ఉన్నాడు. తండ్రి మంచి రచయిత కూడా. "డెవలప్‌మెంట్" అనే స్వీయచరిత్ర కవిత్వంలో వీటిని బ్రౌనింగ్ వివరించాడు. లండన్ వర్సిటిలో చదివిన కొద్దికాలంలోనే కావలసింది అంతా నేర్చేశాడు. పన్నెండవ ఏట తాను ఏమి కావాలనుకొన్నదీ ఖచ్చితంగా నిర్ణయించుకొన్నాడు. "ఇన్ కండిటా" అనే కవితా సంకలనాన్ని తెచ్చాడు. తండ్రి మెచ్చుకొన్నాడు కాని దాన్ని నాశనం చేశాడు బ్రౌనింగ్. పద్నాలుగో ఏట ఒక గొప్ప సంచలనమే సృష్టించాడు. "పాలిన్" రాసి దానికి "ఫ్రాగ్‌మెంట్ ఆఫ్ కన్ఫెషన్" పేరుతో ఇరవై ఒక్క ఏట విడుదల చేశాడు. దానికి తానే అధికారినని ముప్ఫై నాలుగవ ఏట కాని చెప్పుకోలేదు. దీన్ని కలేక్టెడ్ పోయెమ్స్‌లో చేర్చి ప్రచురించాడు.

ఇరవై రెండులో విదేశీ యాత్ర చేశాడు. రష్యాలో రెండు నెలలు ఉండి రినైసెన్స్ డాక్టర్ పెరక్లియాస్‌ను కలిశాడు. ఈ ప్రభావంతో నాలుగు వేల పంక్తుల "పారసేల్సాస్" రాశాడు. దీని ఖర్చు తండ్రి పెట్టాడు. దీన్ని చదివిన నటుడు విలియం మార్కే తనకొక నాటకం రాసి పెట్టమని అడిగాడు. "స్త్రఫోర్డ్స్" రాసి 1837లో ప్రచురించాడు. దీనిని కోవెంట్ గార్డెన్ థియేటర్‌లో అయిదు అంకాల నాటకంగా ప్రదర్శించారు. నటులు బాగా చేయలేదని బ్రౌనింగ్ యిదేమి నాటకమని డైరెక్టర్ తిట్టుకొన్నారు. జీవితంలో థియేటర్ నాటకం రాయను అని భీష్మించాడు. కాని రెండేళ్ళ తర్వాత విజృంభించి రాశాడు.

మొదటిసారి ఇటలి వెళ్లి వెనిస్ అందానికి ముగ్ధుడయ్యాడు. "సార్డేల్లా" అనే రైమేడ్ పోయెం రాశాడు. ఇది ఆరు వేల లైన్ల కవిత. "సంకల్ప బలంతో దేనినైనా సాధించవచ్చు" అనేది ఇందులో సారాంశం. కార్ లైల్ భార్య ఇదేమి కవిత్వం అంటే, టెన్నిసన్ మొదటి చివరి పంక్తులు బాగున్నాయని చెప్పాడు. అవే "Who will may hear sodello's story told" అనే మొదటిది "who would has heard sordello's story told" అనే రెండో లైనూ.

ఇలా విమర్శలొచ్చినా మంచి రచన చేసి విజయం సాధించాలని నిశ్చయించాడు. "పిప్పా పాస్సీ" నాటిక రాశాడు. "కింగ్ విక్టార్ కింగ్ చార్లెస్", "రిటర్న్ ఆఫ్ ది డ్రూసిస్", "బ్లాట్ ఇన్ ది స్కచియాన్", "కోలంబెస్ బర్త్ డే" రాసి వదిలినా దేనికీ పేరు రానేలేదు. డ్రమాటిక్ లిరిక్స్, డ్రమాటిక్ రొమాన్స్ అండ్ లిరిక్స్ రాశాడు. రెండవ సారి ఇటలీ వెళ్ళినప్పుడు

షెల్లీ కీట్స్ సమాధులను సందర్శించాడు. ఈ స్ఫూర్తితో "లేడీ జేరాల్డైన్స్ కోర్ట్ షిప్" రాశాడు.

బ్రౌనింగ్‌కు ఆడవాళ్ళపై వ్యామోహం కలగలేదు. ఒకవేళ అవకాశం వస్తే తనకంటే పెద్దవాళ్ళనే ప్రేమించాడు. ఆరేళ్ళు పెద్దదయిన ఎలిజబెత్ బారెట్‌తో లవ్ లెటర్స్ జరిపాడు. ఆమె గ్రీకు, లాటిన్‌లలో దిట్ట. తండ్రి క్రూరుడు. బ్రౌనింగ్‌ను స్నేహితునిగా చూసింది. ప్రేమా దోమా అంటే కుదరదని చెప్పింది. నలభైలో ఆమె ఆరోగ్యం దెబ్బతింటే ఇటలీ తీసుకు వెళ్ళాడు. నయం అయింది. ఇద్దరు దగ్గరయ్యారు. కొడుకు పుట్టాడు. "సానేట్స్ ఫ్రం పోర్చుగీస్" రాశాడు. ఇది "లవర్స్ పాస్‌వర్డ్"గా కొన్ని తరాలను ప్రభావితం చేసింది. వర్డ్స్‌వర్త్ మరణంతో తనకు ఆస్థాన పదవి దక్కుతుందని ఆశించింది ఎలిజబెత్ కాని టెన్నిసన్‌కు దక్కింది. భర్తకంటే పేరు ప్రఖ్యాతలు పొందింది. ఒకరకంగా "బ్రౌనింగ్‌ను బారెట్ భర్త" అనేవారు. విక్టోరియన్ కాల రచయితలలో అగ్రగామి అనిపించుకొంది ఎలిజబెత్. "డిక్రి ఆఫ్ ది చిల్డ్రన్", "మ్యూసికల్ ఇన్స్ట్రుమెంట్స్", "ఆరోరా లీ" మాత్రమే జనానికి గుర్తున్నాయి.

భార్య ప్రభావం నుండి బయటపడటానికి ఇటాలియన్ కవిత్వం వైపు వెళ్ళాడు. సాహిత్యంలో ఇటలియే తన యూనివర్సిటి అన్నాడు. బ్రౌనింగ్‌కు తండ్రి తరఫునుంచి వచ్చిన డబ్బు కంటే భార్య సంపాదనలో లభించిందే ఎక్కువ. వీరి కుటుంబ స్నేహితుడు జాన్ కెన్యా చనిపోయి వీరికి పదకొండు వేల పౌండ్ల డబ్బు ఇచ్చాడు. బ్రౌనింగ్‌కు కొడుకు పుట్టాడు. ఐనా విచారం అలముకొంది. "మెన్ అండ్ విమెన్" 1855లో రాశాడు. ఇక రాసే వాటన్నిటిలో సంగీతం మేళవించాడు. భార్యలోని కవిని మెచ్చాడు భర్త బ్రౌనింగ్. ఫ్లారెన్స్‌లో ఆమె జబ్బు పడింది. ఉబ్బస వ్యాధి బ్రౌనింగ్‌ను పీడిస్తోంది. చనిపోయింది. తర్వాత ఇరవై ఎనియిదేళ్ళు బతికాడు.

"డ్రామాటిస్ పెర్సొనే" 1864లో రాసి ప్రచురించాడు. డెత్ ఇన్ ది మడెసర్ట్, యూత్ అండ్ ఆర్ట్, చైనీస్ పజిల్ మొదలైనవి రాశాడు.

డెత్ పునర్ముద్రణ పొందింది. 1868లో "రింగ్ అండ్ ది బుక్" తెచ్చాడు. ఒకరోజు మార్కెట్‌కు వెడుతుంటే పదిహేడవ శతాబ్ధికి చెందిన లాటిన్ పుస్తకం కనపడింది. దాన్ని ఆధారంగా రాశాడు. తండ్రి చనిపోయిన తర్వాత భార్య మరణం తర్వాత రెండో పెళ్లి ఆలోచన చేయలేదు. జోలియా వెట్‌వుడ్‌తో సన్నిహితంగా ఉన్నా హద్దులు దాటలేదు. చివరి ఇరవై ఏళ్ళలో ఎన్నో రాసి ప్రచురించాడు. ఒక నిష్ఠాతుడైన సర్జన్‌లా బాంక్ ప్రెసిడెంట్‌లా కనిపించేవాడు.

1881లో మొదటిసారిగా బ్రౌనింగ్ సొసైటీ ఏర్పడింది. దీనికి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ నిఘంటు ఎడిటర్ ఫ్రెడరిక్ జేమ్స్ ఫర్నివాల్ కారకుడు. ఆ తర్వాత ఎన్నో క్లబ్బులు, సొసైటీలు, డిస్కషన్ గ్రూపులు ఏర్పడ్డాయి. డెబ్భైలో మాంచి హుషారుగా ఉన్నాడు. "డ్రమాటిక్ ఐడిల్స్"

రాసి ముద్రించాడు. "ది ఇన్ ఆల్బం" రాశాడు. ఇంకా ఎన్నో రాశాడు. ఆయనలోని సృజన ఆగలేదు. లిబరల్ అయినా అన్ని ముఖ్య కార్యక్రమాలకు హాజరయ్యేవాడు. కొడుకు పెయింటర్ అయి అమెరికా అమ్మాయిని పెళ్లి చేసుకొన్నాడు. జలుబుతో ప్రారంభమై హార్ట్ ఎటాక్‌తో 12-12-1889న నవ్వుతూ కనుమూశాడు. వెస్ట్ మినిస్టర్ అబ్బేలో పోయెట్స్ కార్నర్‌లో సమాధి చేశారు.

బ్రౌనింగ్‌ను ఆశావాది అంటారు. "God is in heaven - all is right with the world" అన్నదే ఆయన తత్త్వం. ఆయనలో గొప్ప టెక్నిక్ ఉంది. ఛందస్సును విచ్చలవిడిగా మార్చి రాశాడు. సాహిత్యంలో గొప్ప శక్తి సంపన్నుడైన కవిగా బ్రౌనింగ్ నిలిచిపోయాడు.

"Brounning's restless energy is inherent in the incalculable range of his interests. He seems to have determined as G.K Chesterton observed "to leave no spot of the cosmos unadorned by his poetry" and he almost succeeded"

ఈనాడు బ్రౌనింగ్ డ్రమాటిక్ మోనో లాగ్స్‌నే బాగా అభిమానిస్తున్నారు. అందులో వక్త స్వభావం ఖచ్చితంగా బయటపడుతుంది. ఇవి సొలిలోక్వి లాగా కాకుండా పూర్తిగా పాత్రను ఆవిష్కరిస్తాయి. మానవుని విషయంలో దైవ చేష్టల్ని తెలియజేస్తాడు. ఇలియట్, ఎజ్రా పౌండ్‌లు ఈ మోనోలోగ్స్‌ను బాగా వాడుకొని సుసంపన్నం చేశారు. నాటకీయ కవిత్వాన్ని బ్రౌనింగ్ అద్భుతంగా తీర్చిదిద్ది మార్గదర్శకుడైనాడు. భార్యాభర్తలు స్పిరిట్యులిజంకు ఆకర్షితులైనారు. దీని ప్రభావం వలననే దృఢమైన కొడుకు "పెన్" పుట్టాడు. చివరి రచన "అసలాండో" బ్రౌనింగ్ మరణించిన రోజే పబ్లిష్ అవటం యాదృచ్ఛికం. జీవితకాలంలో ఎన్నో అవార్డులు పొందాడు. లండన్ యూనివర్సిటికి జీవితకాలం గవర్నర్‌గా ఉన్నాడు. గ్లాస్గోకు లార్డ్ రెక్టార్ షిప్‌కు ఆహ్వానించినా ఉపన్యాసాలివ్వాల్సి వస్తుందని వద్దన్నాడు. సుమారు అరవై రచనలు రాసి ప్రచురించిన సాహిత్య జీవి బ్రౌనింగ్. ✺



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 41

# పందొమ్మిదవ శతాబ్దం – చీకటి వెలుగులు

**వి**క్టోరియన్ యుగాన్ని "వింత" యుగం అని సాధారణంగా అంటారు. చాలా సీరియస్‌గా రాసినవారూ, చాలా సుందరంగా కమ్మగా రాసిన వారూ ఉన్నారు. నీతికి నిబద్ధులైనవారు, అజాగ్రత్తగా ఉన్నవారు ఉన్నారు. సమాజంలో తల్లులు భరించరానిది, ఆడపిల్లలు చదవకుండా విడిచి పెట్టనిదీ లేని కవిత్వం రాసి పేరు పొందినవాడు టెన్నిసన్ కవి కాలం 1870.

విక్టోరియన్ కాలంలో పదవీ గౌరవాలే పరమార్థాలు. దీనికే బెర్నార్డ్ షా "సెవెన్ డెడ్లీ వర్చ్యూస్" అన్నాడు. మధ్య తరగతి ప్రజలు నీతికి పోరాడారు. స్పెన్సర్ "అభివృద్ధి అకస్మాత్తుగా వచ్చేది కాకపోయినా అవసరమే" అన్నాడు. భౌతిక వాదాన్ని నియంత్రించలేకపోతే ప్రమాదం అన్నవారూ ఉన్నారు. కార్మిక న్యాయాలు, ట్రేడ్ యూనియన్‌ల హక్కులు, సహకార సంస్థలు, వాటి ఉద్యమాలు, కామన్‌వెల్త్ దేశాలలో ప్రపంచ సోదర భావం వంటివి చోటుచేసుకొన్నాయి.

### లఘు కవితలలో మేటి అయిన ఆస్థానకవి – ఆల్ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్

ఈ విరుద్ధ భావాలను కవిత్వంలో నింపినవాడు ఆల్ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్. 06-08-1809లో లింకన్ షైర్‌లోని సోమర్బైలో పన్నెండుగురు సంతానంలో నాలుగవ వాడుగా పుట్టాడు. ఏడవ ఏట లౌత్ స్కూల్‌కు పంపారు. చదువు బాగా రావాలని హెడ్ మాస్టారు పిల్లల తలను పుస్తకాలతో బాదేవాడు. పన్నెండు ఏళ్ళకే స్కూల్ వదిలి, పందొమ్మిది వరకు తండ్రి దగ్గరే చదివాడు. తండ్రికి క్లాసిక్స్ అభిమానం. అయితే కొడుకు హోరేస్ రాసిన ఓడ్స్ బట్టీపట్టిన తరువాతే యూనివర్సిటీకి పంపాడు. తండ్రి తమ్ముడి వలన మోసపోయి ఆస్థి పోగొట్టుకొని మూడీగా మారాడు. ఇద్దరు పిల్లలకు నరాల బలహీనత. ఇంకొకడు మత్తుమందుకు

బానిస. యెప్పుడూ నేలమీదే పడి ఉండేవాడు. ఈ విషయాలన్నీ కవిత్వంలో రాసుకొన్నాడు కవి టెన్నిసన్.

చదవటం రాకముందే టెన్నిసన్ కవిత్వం చెప్పాడు. యెనిమిది ఏళ్ళకే బ్లాంక్‌వేర్స్‌లో ఆరువేల పంక్తుల మహాకావ్యాన్ని రాసిన చిన్నారి పెద్దకవి. పద్నాలుగులో మిల్టన్ రాసిన "సామ్సన్ అగోనిస్టెస్"ను వ్యాఖ్యానించి వివరణాత్మకంగా రాసి విమర్శకుల జాబితాలో చేరాడు. రెండు నాటకాలు "ఆర్మగడాన్" అనే కవిత రాశాడు. దీనినే తర్వాత మార్చి "టిం బుక్టూ" పేర ముద్రించి బహుమతి పొందాడు. బైరన్ మృతికి విచారించి, అడవుల్లోకి వెళ్లి రాళ్ళమీద "బైరన్ ఈజ్ డెడ్" అని రాసి మనసులోని బాధ పోగొట్టుకొన్నాడు. సోదరుడు చార్లెస్‌తో కలిసి "పోయెమ్స్ బై టు బ్రదర్స్" రాసి అచ్చువేశాడు. ఇంకో సోదరుడు ఫ్రెడరిక్ రాసిన నాలుగు కవితల్ని అరవై ఏళ్ళ తర్వాత ప్రసిద్ధ కవిగా పేరుపొందినా "కలెక్టెడ్ వర్క్"లో చేర్చి ప్రచురించిన పెద్దమనసు టెన్నిసన్‌ది.

పందొమ్మిదిలో చార్లెస్‌తో కలిసి కేంబ్రిడ్జి ట్రినిటి కాలేజిలో చేరి మెట్రిక్ పాస్ అయ్యాడు. అక్కడే ఆనందంగా ఉండలేక ఇంటిమీద మనసు మళ్లింది. "ది అపోజిల్స్" అనే క్లబ్‌ను స్నేహితులతో కలిసి స్థాపించాడు. సైన్సును అభిమానించినా అందులో దూసుకుపోలేకపోయాడు. డిగ్రీ పొందకుండానే కేంబ్రిడ్జిని వదిలేశాడు. అండర్ గ్రాడ్యుయెట్‌గా ఉండగానే "పోయెమ్స్ చీఫ్లి లిరికల్" రాసి ముద్రించాడు. అతిగా ఉందనిపించినా తియ్యదనం ఎక్కువైందనిపించినా "మారియానా"వంటి వాటిలో సంగీతం అలరించింది. మూడేళ్ల తర్వాత మరో కవితా సంకలనం తెచ్చాడు. కీట్స్‌ను చీల్చి చెండాడినవాడే దీన్నీ అదే ధోరణిలో విమర్శించాడు. తన ఆత్మ గౌరవం దెబ్బతిందని టెన్నిసన్ అనుకొన్నాడు. ఉపయోగం లేనిదైనా అందులోని సంగీత ధ్వనులు మెచ్చుకుంగా ఉండలేకపోయారు.

ఇరవై మూడులో హెన్రి ఆలం అనే చరిత్ర పరిశోధకుడు, తండ్రి ముఖ్య స్నేహితుడు అనుకోకుండా హోటల్ రూంలో రక్తం గడ్డకట్టి చనిపోతే చలించిపోయి బయటికి రాలేకపోతున్నాడు. ఆయనపై "ఇన్ మెమోరియం" అనే కవిత రాశాడు. దేవుడు అంటే ఏమిటో కొంచెం అవగాహనకు వచ్చాడు. కీట్స్, మిల్టన్‌ల ఎలిజీల లాగా కాకుండా దీన్ని స్వీయభావ ప్రకటనగా రాశాడు. ఇది కవిత మాత్రమే కాని జీవిత చరిత్ర కాదని చెప్పాడు. "Ring out, wild bells to the wild sky - the flying cloud, the frosty light - the year is dying in the night - ring out, wild bells, and let him die"

"Ring out the old, ring in the new - ring happy bells, across the snow - the year is going, let him go - ring out the false, ring the

true". అనేవి అందరూ తరచుగా వాడేవే అంతగా జనంలోకి చొచ్చుకుపోయింది. సోదరుడు చార్లెస్‌కు ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత నల్లమందుకు అలవాడు పడటంతో కాన్సిలయింది. టెన్నిసన్ పద్నాలుగేళ్ళ నుంచి ఎదురుచూస్తున్న ఎమిలీని పెళ్లి చేసుకొన్నాడు.

ఈ హుషారులో మెమోరియం విడుదల చేశాడు. అదే సమయంలో వర్డ్స్‌వర్త్ కవి చనిపోవటంతో ఆస్థానకవిగా టెన్నిసన్ నియమింపబడ్డాడు. పుట్టిన కొడుకుకు "హల్లాం" పేరు పెట్టాడు. ఇన్ని విజయాలు సాధించినా టెన్నిసన్ "ప్రజల కవి" అనిపించుకోలేకపోయాడు. కాని విద్యావంతులలో ప్రముఖుడుగా నిలిచాడు. అయిదేళ్ళ తర్వాత "ది ప్రిన్సెస్" రాసి ప్రచురించాడు. ఇందులో సంగీతాన్ని, స్త్రీ సమస్యలతో మేళవించాడు. ఇవాళ దీన్ని పట్టించుకొనే వారెవరూ లేరు.

దంపతులు ఐల్ ఆఫ్ వైట్‌లో స్థిరపడ్డారు. "టు సేక్రేడ్ పైప్స్" రాశాడు. 1855లో రాసిన "మౌడ్"ను మెలోడ్రామాగా వదిలాడు. అది ళ"ళ"చిన్న హామ్లెట్" అని చెప్పుకొన్నాడు. కాని పసలేదన్నారు. "ఇడిల్స్ ఆఫ్ ది కింగ్" రాసి అందులో ఆరవ శతాబ్దానికి చెందిన ఆడ, మగవారిని గురించి "క్వీన్ ఈనోక్ ఆర్డెన్" గురించి రాశాడు. చివరికాలంలో టెన్నిసన్ అత్యుత్తమ కవిత రాశాడు. డెబ్బైలో "బాలడ్స్ అండ్ అదర్ పోయెమ్స్" రాశాడు. ఇప్పుడే అనేక గౌరవాలు అందుకొన్నాడు. ఆక్స్‌ఫర్డ్ గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. గ్లాస్గో యూనిర్సిటి రెక్టార్‌షిప్ ఇస్తానంటే తిరస్కరించాడు. ప్రధాని గ్లాడ్‌స్టన్‌తో కలిసి నార్వే, డెన్మార్క్ టూర్ చేశాడు. యెనభైలో నరాల బలహీనతతో గౌట్ వచ్చింది. ఇన్‌ఫ్ల్యు ఎంజా సోకింది. రచన మాత్రం మానలేదు. ప్రూఫులు సరిదిద్దుతూనే ఉన్నాడు. "సిమ్బలీన్"లో ఒక పాసేజిపై చూపుడు వ్రేలిని ఉంచి చూస్తూ 06-10-1892 అర్ధరాత్రి మరణించాడు. ఆయన శవపేటికలో షేక్స్‌పియర్ నాటకాన్ని ఉంచి వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో గౌరవ లాంఛనాలతో సమాధి చేశారు.

ఆకాలంలో బాగా ప్రాచుర్యం పొంది, బాగా చదవబడిన కవి టెన్నిసన్. మార్గదర్శి కాదు కాని పూర్వకవుల దారిలో పయనించి గొప్ప కవితా సేద్యం చేసి మంచి పంటలే పండించాడు. "He was one of the best and one of the worst of poets" అంటారు. సెంటిమెంట్‌ను ఎక్కువగా వాడుకొన్నాడు. "What does little birdie say - in her nest at peep of day? - let me fly, says little birdie - mother let me fly" అనే లైన్లు అందరి మనస్సులో ఉండిపోయాయి. టెన్నిసన్‌ను "A cross between the traditional ministrel and the conventional maiden aunt" అని ఆటపట్టించారు. టెన్నిసన్‌కు జనాన్ని తనతో లాక్కుపోయే కవితా బలం లేదంటారు. చివరగా "If the style was not the complete man, it was the expression of the artist who was a perfectionist in verbal felicities. Few

poets have had a finer ear for the delicate nuances of sound and still fewer have surpassed Tennyson's undulating ease, his limpid lyricism and some times matchless music"

రాసిన ప్రతిదానినీ పెర్ఫెక్షన్ కోసం అనేకమార్లు మార్చి రాసిన ఏకైక కవి టెన్నిసన్. గ్రీకు, లాటిన్ కవిత్వంలోని నాణ్యమైన భావనలను ఛందస్సును చక్కగా ఉపయోగించుకొన్నాడు. విక్టోరియన్ కవులలో క్రమపద్ధతి భావాలను అనుసరించి ఉత్తమకవిగా భాసించాడు. తన కవిత్వంలో ప్రేరణ కల్గించలేకపోయినా వ్యక్తిత్వంతో ప్రభావితం చేశాడు. జీవితాంతం డిప్రెషన్‌తో బాధపడుతున్నా కవితా ధార ఆగిపోనీకుండా, ఇంకిపోనీకుండా కాపాడుకొన్నాడు. "Saddest of all English poets "whose technical mastery of verse and language proved a surface to his poety's depth to the abyss of sorrow" అని ఇలియట్ కవి టెన్నిసన్ కవిపై ముద్రవేశాదు. సుమారు నలభై దాక రచనలు చేశాదు. ❋



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 42

# విదరింగ్ హైట్స్ నవలాకారిణి - ఎమిలి బ్రాంట్

**టె**న్నిసన్‌కు భిన్నంగా ఎమిలీ బ్రాంట్ జీవించింది. ఐరిష్ తండ్రికి జన్మించింది. తండ్రి చిత్రకళ నేర్చుకొందామనుకొన్నాడు. కానీ యవ్వనంలోనే మరణించాడు. ఎమిలీ బ్రాంట్ 1818 - 1848కున్న అక్కలు మంచి రచయిత్రులే. అయితే ఎమిలీ అక్కల్ని మించిపోయింది. దాదాపు చదువు అంతా ఇంటి వద్దే నేర్చింది. క్లేర్జి డాటర్స్ స్కూల్‌లో చేరింది. అక్కడి పరిస్థితులు ఆహారం దారుణం. సోదరి షార్లెట్‌తో కలిసి బ్రసెల్స్ వెళ్లి, అక్కడా ఇమడలేక వచ్చేసింది. ఆమె రచనల్లో స్వీయచరిత్ర ఎంతో తెలుసుకోవటం కష్టమే. "బ్రౌన్ టేస్ వెబ్ ఆఫ్ చైల్డ్‌హుడ్" అనే పుస్తకంలో ఫన్నీ ఎలిజబెత్ ఇచ్చిన వివరణే అందరికి ఆధారం.

ఎమిలీ సోదరీమణులు ఒక ఊహా గ్రామాన్ని నిర్మించుకొన్నారు. దానికి "గొండాల్" అని పేరు పెట్టారు. ఇది ఫసిఫిక్ దీవుల్లో ఉందని మాపులు తయారు చేశారు. కవిత్వంలో ఫిక్షన్, ఎలిగరి, స్వీయచరిత్రా అన్నీ కలగలిపి "ది ఓల్డ్ స్టాయిక్"లో రాసింది. ఎమిలీ పాత్రలు "గొండాల్ సాగా"గా సాగిపోతాయి. "Cold in the earth, and the deep snow piled above thee - far, far removed, cold in the dreary grave - have I forgotten, my only love, to love thee - severed atlast by Time's all wearing wave" అంటూ సాగే కవిత్వం అది. ఈ అక్కచెల్లెళ్ళ పేరిట ఒకే ఒక పుస్తకం వెలువడింది. వాళ్ళ అస్థిత్వాన్ని దాచేసుకొన్నారు. తాము ఆడవాళ్ళమని చెప్పుకోదలచ లేదని అన్నారు. స్వంత ఖర్చుతో పుస్తకం ముద్రించి లాభాపేక్ష లేకుండా విడుదల చేశారు. రెండు కాపీలే అమ్ముడు పోయాయి. మిగిలినవి ట్రంకు పెట్టెల్లో మూలుగుతున్నాయి. "ఎల్లీస్ బెల్స్" అనే మారుపేరుతోనే రాసేది. ఆమె రాసిన గొప్ప నవల "విదరింగ్ హైట్స్". అదే ఆమె పేరుకు, ప్రభావానికి కారణమైంది. బ్రాంటీ కుటుంబాన్ని క్షయవ్యాధి పీడించింది. అక్కలు

చనిపోయారు. ఎమిలీ ఎలాగో తట్టుకొని బతికింది. ముప్ఫైవ ఏట ఎమిలికి దగ్గు, జలుబుతో క్షీణించింది. మగాడిలా ధైర్యంగా జబ్బుతో పోరాడింది. కాని విధికి లొంగి 19-12-1848న మరణించింది. "షిర్లీ" కవితలో హీరోయిన్‌ను ధైర్యవంతురాలిగా చూపింది. ఇరవై రెండేళ్ళ వయసులో రాసిన "ది ఓల్డ్ స్టాయిక్" కవితలో యెమిలీ అసాధారణ ధైర్యం, వ్యక్తిత్వం కనిపిస్తుంది. ఒకసారి తొంగి చూద్దాం.

"Riches I hold in hign esteem - and love I laugh to scorn - and lust of fame was but a dream - that vanished with the morn - and if I pray the only prayer - that moves my lips for me - is "leave the heart that now I bear - and give me liberty" సంగీత, శబ్ద శక్తికి ఎమిలీని మెచ్చుకొంటారు. ఒకేఒక్క నవలతో నవలామణిగా వెలిగిపోయింది. 1850 దాకా ఆమె అసలు పేరు వెలుగులోకి రాలేదు. "A peculiar mixture of timidity and sportan like character - she was painfully shy and physically brave to a surprising degree". తన విధి నుంచి అంగుళం కూడా ప్రక్కకు తొలగని దీక్షాపరురాలు ఎమిలీ.

**ఫ్లారెన్స్ నైటింగేల్‌కు సెక్రెటరి – ఆర్థర్ హగ్‌క్లగ్**



ఆర్థర్ హగ్‌క్లగ్ మారుతున్న ప్రపంచంలో పుట్టాడు. మార్పు నచ్చక పూర్వ భావనలే గొప్పవనేవాడు. భవిష్యత్తుపై నమ్మకం లేనివాడు. మొదటి నుంచి ఒడిదుడుకుల జీవితమే. 01-01-1819న లివర్ పూల్‌లో పుట్టి నాలుగవ ఏట సౌత్ కారోలిన్ చేరాడు తండ్రితో. రగ్బీ స్కూల్‌లో చేరి ప్రముఖ హెడ్ మాస్టర్ అయిన డాక్టర్ థామస్ ఆర్నోల్డ్ శిష్యుడైనాడు. ఆక్స్‌ఫర్డ్ కాలేజిలో చేరి ప్రపంచ పర్యటనకు బయల్దేరాడు. ఫ్రెంచ్ విప్లవ కాలంలో పారిస్‌లో ఉన్నాడు. రోమ్‌లో అమెరికా ఫిలాసఫర్ ఎమర్సన్‌ను కలిశాడు. ఆయన వలన అమెరికాలో వారానికి ఆరు డాలర్ల జీతంతో బతకచ్చు అని తెలుసుకొని అమెరికా వెళ్ళిపోయాడు. అమెరికాలో ఉపన్యాసాలిస్తూ, అనువాదాలు చేస్తూ గడిపాడు. లాభం లేదని గ్రహించి ఇంగ్లాండ్ చేరుకొన్నాడు. పెళ్లి చేసుకొని ఫారిన్ మినిస్ట్రీ ఎడ్యుకేషన్ కమిషన్ రిపోర్ట్‌కు సెక్రెటరి అయ్యాడు. ఆరోగ్యం దెబ్బతిని మలేరియా సోకి ఫ్లారెన్స్‌లో 13-11-1861న చనిపోయాడు.

క్లగ్ జీవితం వాగ్దానాలమయమే తప్ప సాధించింది శూన్యం. సత్యాన్వేషకుడుగా మిగిలిపోయాడు. బౌద్ధిక జ్ఞానం స్థిమితం లేకుండా చేసింది. కొన్ని కవితలు బాగా రాశాడు.

"Thou shalt have one God only, who - would be at the expense of two - no graven images may be - worshipped, except the currency" అతని "ఆమర్స్ డీవాయెజ్"లో సెటైర్‌తో బాటు సీరియెస్‌నెస్ కూడా ఉంది. ప్రేమ, ప్రయాణం, మతంపై అతని అభిప్రాయం తెలియదు కాని ఆత్మ అన్వేషణ కనిపిస్తుంది. హెక్సా మీటర్లలో కవిత్వం రాశాడు. భార్య సోదరి ఫారెన్స్ నైటింగేల్‌కు యుద్ధ సమయంలో జీతంలేని సెక్రెటరిగా సేవలందించాడు.

**ముని కవి – మాథ్యూ ఆర్నోల్డ్**



ఆర్నోల్డ్ కూడా విక్టోరియన్ కవి. నమ్మకం, అనుమానాల మధ్య ఊగిసలాడాడు. ఇంగ్లిష్ క్రిటిసిజంకు మూల భావాలుగా ఆయన మాటలుంటాయి. తండ్రి రగ్బీ స్కూల్ హెడ్‌మాస్టర్. మాథ్యూ మిడిల్ సెక్స్‌లోని లాలేహంలో క్రిస్మస్ ఈవ్‌నాడు 1822లో పుట్టాడు. రగ్బీ స్కూల్‌లో చదివి కవిత్వం రాసి రగ్బీ ప్రైజ్ సాధించాడు. ఇది "అలారిక్ ఎట్ హోమ్"గా ప్రసిద్ధం. ఎన్నో గౌరవాలు పొందాడు. బలోలి కాలేజికి స్కాలర్షిప్ వచ్చి చేరి హగ్ క్లగ్‌కు హాస్టల్‌మేట్ అయ్యాడు. న్యూ ది గేట్ ప్రైజ్ పొందాడు.

ఇరవై రెండులో డిగ్రీ పొంది రగ్బీ స్కూల్‌లో పనిచేసి ఒరిల్ కాలేజిలో ఫెలోషిప్ సాధించాడు. లార్డ్ లాన్స్ డౌన్‌కు పాతిక ఏళ్ళకే సెక్రెటరి అయ్యాడు. వివాహంతో పొజిషన్ పెరిగి స్కూళ్ళ ఇన్స్పెక్టర్ అయ్యాడు. విదేశీయానం తరచూ ప్రయాణం తనను ఇంటికి దూరం చేస్తున్నాయని బాధపడేవాడు. "ది స్రెయిడ్ రివీలర్ అండ్ అదర్ పోయెమ్స్"ను ఇరవై ఏడవ ఏట పబ్లిష్ చేశాడు. రెండేళ్ళ తర్వాత "ఎంపిడికిల్స్ ఆన్ యెత్నా" రాసి ప్రచురించాడు. అరవై అయిదేళ్ళు మంచి ఆరోగ్యంతో జీవించి కొద్దిపాటి అస్వస్తతతో 15-04-1888న చనిపోయాడు. రోమాంటిజానికి మోడరనిజానికి వారధి ఆర్నోల్డ్. "Want of logic and thoroughness of thought"కు ప్రాధాన్యత నిచ్చాడు. "న్యూ జర్నలిజం"కు ఆద్యుడు ఆర్నోల్డ్. ఆయన రాసినవన్నీ "కవర్ టు కవర్" చదివిస్తాయి.

ఆర్నోల్డ్ రాసిన సంస్కృతీ, మతం, వ్యాసాలూ బాగా ప్రసిద్ధి పొందాయి. "ఫైలిష్టినేస్"ను వ్యతిరేకించాడు. అంటే మధ్య తరగతి మనస్థత్వాన్ని వారి ఉదాసీనతను వ్యతిరేకించాడు. "Poetry had an ethnical purpose, that it should be "a criticism of life" and he believed that he believed that his own verse exemplified it" అని అభిప్రాయపడ్డాడు. "కవిత్వం అంటే జీవితానికి వ్యాఖ్యానం. దీన్ని కవి అందంగా శక్తివంతంగా అన్వయించి చెప్పాలి. నీటికి వ్యతిరేకమైన కవిత్వం జీవితానికీ

వ్యతిరేకమే" అంటాడు ఆర్నోల్డ్ మహాశయుడు. ఆర్నోల్డ్ కవిత్వాన్ని గౌరవించారు కాని ప్రేమించలేదు. అతని డవర్ బీచ్ కవితలోని కొన్ని పంక్తులలో "Eternal note of sadness" కనిపిస్తుంది. "The sea of faith - was once too, at the full round earth's shore - lay like the folds of a bright girdle furled - but now I only hear - its melancholy, long with drawing roar retreating to the breath - of the night wind, down the vast edge drear - and naked shingles of the world"

### ప్రీరాఫెలైట్స్

మాథ్యూ ఆర్నోల్డ్ రాసింది పెసిమిస్టిక్ కవిత్వాన్ని ఆదరించకపోయినా విక్టోరియన్ ప్రజలు ఫిట్జెరాల్డ్ రాసిన "ఒమర్ ఖయ్యాం", ఫర్కార్ టప్పర్ రాసిన "ప్రావేర్బియల్ ఫిలాసఫీ"ని లక్షలాది మంది చదివారు. పందొమ్మిదో శతాబ్ది మధ్యలో యాంటి విక్టోరియన్ గ్రూప్ ఒకటేర్పడింది. దీన్ని ప్రి రాఫెలైట్స్ బృందం అన్నారు. 1850లో వీళ్ళు ఒక మేగజైన్ను "ది జేర్మ్" పేరిట విడుదల చేశారు. అది ఒక పెయింటర్స్ ఉద్యమంగా మొదలైంది. యాంత్రిక యుగాన్ని విమర్శిస్తూ సమకాలీన జీవితాన్ని వ్యాఖ్యానించింది. కళకు కొత్త జవజీవాలు, గౌరవ ప్రాభవాలు కల్పించాలని కోరింది. మన ఆలోచనలలో నిజాయితీ ఉండాలని కోరింది. రాఫల్, రినైసేన్స్‌ల తర్వాత "We must be early Christian - pre - Raphaelite" అన్నారు. ఈ ఉద్యమం బాగా వ్యాపించి పెయింటర్లను, కొంతమంది రచయితలను ప్రభావితం చేసింది. అదొక మిశ్రమ సంస్థ అయింది. అందులో విలియం హోల్మాన్ హంట్, ఎడ్వర్డ్ బర్న్స్ జోన్స్, ఫోర్డ్ మదాక్స్ బ్రౌన్, జాన్ ఎవరెస్ట్ మిల్లేస్ వంటి పెయింటర్లున్నారు. డాంటే గాబ్రియల్ రోసెట్టే పెయింటర్ మాత్రమే కాక కవి కూడా. విలియం మోరిస్ ఒక కొత్త సంస్కృతికి దారి తీశాడు. గాజు కిటికీలను, వస్తుసామగ్రిని, కంబళీలను, పరికరాలను కొత్త తరహాలో నిర్మించాడు. తనకాలంలో చిన్నబోయిప దాన్ని మళ్ళీ వైభవానికి తెచ్చాడు. దీన్ని యుటోపియన్ ఆఫ్ "న్యూస్ ఫ్రం నోవేర్"గా తెలిపాడు.

### ద కోవెంట్రీ పాట్‌మోర్



జేర్మే మేగజైన్‌కు యధాశక్తి కృషి చేసినవాడు కోవెంట్రీ పాట్‌మోర్. 23-07-1823లో ఎప్పింగ్ ఫారెస్ట్‌లో పుట్టి, తండ్రి వద్దే అన్నీ నేర్చి, తండ్రిలా పైంటర్ అవకుండా సాహిత్యానికే అంకిత మయ్యాడు. థాకరే "వికసిస్తున్న కవి మొగ్గ" అన్నాడు. ఇరవై

ఒకటిలో మొదటి సంకలనం "యాన్ ఏంజెల్ ఇన్ ది హమ్"
వదిలాడు. బ్రిటిష్ మ్యూజియంకు అసిస్టెంట్ లైబ్రేరియన్ అయ్యాడు. భార్య మరణంతో రోమన్ కేథలిక్ అయి, ఒక ఎస్టేట్‌కు అధిపతి అయ్యాడు. "అన్‌నోన్ ఈరోస్" రాసి అందులో గృహస్థ జీవితం ప్రేమలను కరిపించాడు. మూడో పెళ్లి చేసుకొని లిమింగ్‌టన్లో ఉన్నాడు. 26-11-1896న డెబ్బై మూడో ఏట చనిపోయాడు. అతని భాష అధిక తియ్యదనం, విసుగుదనంతో ఉంటుంది.



**కవి చిత్రకారుడు - డాంటే గేబ్రియల్ రోసెట్టి**

విక్టోరియన్ కాలంలో రోసెట్టిలు ఫైన్ ఆర్ట్సుకు గొప్ప సేవ చేశారు. తండ్రి ఇటాలియన్ తల్లి సగం ఇటాలియన్. ఇల్లు అంతా నియో పోలిటన్లు టస్కాన్ సంస్కృతీతో జీవించింది. పెద్ద కొడుకు డాంటే గాబ్రియల్ కవిగా, పెయింటర్‌గా, నాయకుడుగా ఎదిగాడు. 12-05-1828లో పుట్టిన గాబ్రియల్ తన కవితలకు స్వయంగా బొమ్మలు వేసుకొని చిన్నతనంలోనే అందరిని ఆకర్షించాడు. ఇరవైలలో ఫోర్డ్ మడాక్స్ బ్రౌన్ అనే గొప్ప పైంటర్ దగ్గర చేరి మెళకువలు గ్రహించాడు. కొన్ని నెలల తర్వాత ఇద్దరు మిత్రులతో కలిసి "ప్రి రాఫెలైట్ బ్రదర్ హుడ్"ను స్థాపించాడు. విలియం మోరిస్ మొదలైన వారందరూ చేరి ఊపు తెచ్చారు. రోసెట్టి వేసిన చిత్రాలు ప్రి రాఫెలైట్స్‌కు అద్దం పడతాయి. జాన్ రస్కిన్ ఈ ముఠాపై విరుచుకు పడ్డాడు. రోసెట్టి సంపూర్ణ మోడల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసి సాధించాడు. ఎలిజబెత్ సిద్దాల్‌తో ప్రేమాయణం సాగించి, పెళ్ళాడి తన కలల స్వరూపాన్ని పొందాడు. ఆమె ఎల్లప్పుడూ జబ్బుపడే ఉండేది బాధ భరించలేక మత్తు మందుకు అలవాటు పడింది. ఒకరోజు డోసు ఎక్కువై నిద్రలోనే చనిపోయింది.

భార్య చనిపోయిన తర్వాత రోజెట్టి లండన్‌లోని చాల్సియాలో ఉన్నాడు. రొమాంటిసిజంపై కొంతకాలం ఊగాడు. కీట్స్‌పై ఆరాధన పెరిగింది. "బాలడ్స్ అండ్ సీన్స్" అనే అద్భుత కవితా సంకలనం తెచ్చి 09-04-1882న రోసెట్టి మరణించాడు. యూరోపియన్ సింబాలిజంపై గొప్ప ప్రభావం చూపాడు. ఈస్థటిక్ ఉద్యమానికి ఊపిరిలూదాడు. పెయింటింగ్‌లో "డెకరేటివ్ ఆర్ట్"లో గొప్ప సాధన చేశాడు.



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 43**

# క్రిస్మస్ గీత రచయిత్రి - క్రిస్టినా రోసెట్టి

క్రిస్టినా రోసెట్టి కుటుంబంలో చిన్నది. 05-12-1830లో లండన్‌లో పుట్టింది. గాబ్రియల్‌కు విరుద్ధం. అందగత్తె కాదు. డాంటే గాబ్రియల్ రాసిన మొదటి సినిమాలో వర్జిన్‌గా నటించింది. కవిగా, పెయింటర్‌గా వారసత్వాన్ని కాపాడుకొంది. ఇటాలియన్ నేపథ్యం ఉన్నందున విజయం రాలేదు. మగాళ్ళు వెంబడి పడేవారు. పద్దెనిమిదేళ్ళ పడుచు జేమ్స్ కాలిసన్‌తో ఎంగేజ్‌మెంట్ చేసుకొంది. ప్రీ రాఫెలైట్ బ్రదర్ హుడ్ అయిన అతను రోమన్ కేథలిక్‌గా మారగానే "తూ నా బొడ్డు" అని కాన్సిల్ చేసింది. కాలిన్స్ ఆమె ప్రశాంత మానసిక స్థితిని అల్లకల్లోలం చేశాడు. ముప్పైవ ఏట చార్లెస్ కాయిలీని ప్రేమించి జీవితాంతం అతనితో ఉంది. "హేవెన్లి బ్రైడ్ గ్రూం" కోసం కలలు కన్నది. హంగూ ఆర్భాటం లేకుండానే ఆ తరంలో పేరెన్నికగన్న కవిగా గుర్తింపు పొందింది. "గార్బిన్ మార్కెట్", "ది ప్రిన్సెస్ అండ్ అదర్ పోయెమ్స్", "ఏ పీజియెంట్ అండ్ అదర్ పోయెమ్స్" వరుసగా రాసి ప్రచురించింది. గుండె బలహీనతతో బాధపడింది. అరవైలలో కేన్సర్ వచ్చి ఆపరేషన్ చేయించుకొన్నది. కాని ప్రార్ధనలోనే ప్రశాంతంగా 29-12-1894లో చనిపోయింది. దాదాపు వెయ్యి కవితలు రాసింది. అందులో ప్రి రాఫ్లైట్ భావాలు పొదిగింది. "గోబిన్ మార్కెట్" కవితకు మంచి పేరుంది. "ఎల్లెన్ ఎలిఎన్" అనే మారుపేరుతో రాసేది. చనిపోయిన తర్వాతే ప్రసిద్ధి పొందింది. ఆమె రాసిన క్రిస్మస్ గీతం "బ్లీక్ మిడ్ వింటర్" అందరు పాడుకొంటారు.

"White and Golden Lizze stood - like a lily in a flood - like a rock of blue - veined stone - lashed by tides obstreperously - like a beacon left alone - in a hoary roaring sea - sending up a golden fire"లా కవిత్వం సాగిపోతుంది. ప్రయోగాలు లేని భావుకత, విచారాన్ని, లిరికిజంతో సమ్మేళనం చేసి రాసింది.

"When I am dead, my dearest - sing no sad songs for me - plant thou no roses at my head - nor shady cypress tree "---" I shall not see shadows - I shall not feel the rain - I shall not hear the nightingale - sing on, as if in pain - happly I may remember - and happily may forget"

**ఎడ్గార్ అలెన్ పోతో సాటి - ఆల్గేర్నాన్ చార్లెస్ స్విన్ బర్న్**



స్విన్ బర్న్ 04-05-1837లో లండన్‌లో పుట్టాడు. అరిస్టోక్రాటిక్ కుటుంబం. తండ్రి అడ్మిరల్. తాత లార్డ్. ప్రీ రాఫలైట్‌లను అధిగమించాలని ప్రయత్నించాడు స్విన్ బర్న్. ఇరవై అయిదులో "ది క్వీన్ మదర్" అండ్ "రోసమాండ్" అనే రెండు చారిత్రాత్మక ట్రాజెడీ నాటకాలు రాసి రోసెట్టికి అంకితమిచ్చాడు. బ్లాంక్‌వేర్స్‌లో లిరిక్స్ రాశాడు. "అట్లాంటా ఇన్ కాలిడాన్" రాసి సెన్సేషన్ సృష్టించాడు. బైరన్ రాసిన చైల్డ్ హరాల్డ్ తర్వాత అంతటి గొప్ప కవిత రాలేదు. భావాలు తీవ్రంగా, ఆచారాలకు విరుద్ధంగా ఉండటంతో యువకుల గుండెచప్పుడుకు దగ్గరైంది. "వెన్ ది హౌండ్స్ ఆఫ్ స్ప్రింగ్"లో దుమ్ము దులిపేశాడు.

"They gave him light in his ways - and love and a space for delight and beauty and length of days - and night and sleep in the night - his speech is a burning fire - with his lips he traveileth - in his heart is a blind desire - in his eyes fore knowledge of death" అంటూ నిప్పులు కక్కుకుంటూ ఎగిరాడు నింగికి.

ముప్ఫైలో ప్రసిద్ధ కవి అనిపించుకొన్నాడు. కవే కాక "కాంట్రవర్సీ" కూడా అయ్యాడు. అతని కామం, బూతు అందరికి జుగుప్స కల్గించాయి. నలభైలలో "స్టేడి ఆఫ్ షేక్స్పియర్", "సాంగ్స్ అండ్ స్ప్రింగ్ సైడ్స్", "మోడరన్ హేపతాల్జియా"లు వరుసగా రాసి సంచలనం సృష్టించాడు. విడువకుండా రాస్తూనే ఉన్నాడు. అయిదు పద్య నాటకాలు, ఒక నవల, పది వచన పుస్తకాలు రాసి ఏదీ వదలకుండా రాశాడనిపించుకొన్నాడు. "Swinburne has now said not only all he has to say about every thing but all he has to say about nothing" అని ఎస్టిమేట్ చేశారు. ఆలోచనా పరుడిగా కంటే ఆవేశపరుడు. "యెన్ సైక్లోపీడియా బ్రిటానికా-పదకొండవ ఎడిషన్"కు సహకరించాడు. రెండుసార్లు నోబెల్ ప్రైజ్‌కు ఎంపికైనాడు. కాని రాలేదు. "The tumultuous out cry of the adjectives and head strong rush of undisciplined sentences are the index of the impatience and laziness of a disorderly mind" అని ఇలియట్

తీర్మానించాడు. ఎడ్గార్ అల్లెన్ పో తర్వాత ఇంగ్లాండ్ అమెరికాలలో నిజమైన కవి స్విన్‌బర్న్ అన్నాడు హెచ్.పి.లోక్రాఫ్ట్.



**విక్టోరియన్ రియలిస్ట్ - థామస్ హార్డీ**

పందొమ్మిది ఇరవై శతాబ్దాలకు వారధి థామస్ హార్డీ. సగం రొమాంటిక్ సగం వాస్తవవాది. రాసిన కవితలు, ఆధునిక కవితలకు మార్గ నిర్దేశం చేశాయి. 02-06-1840లో డార్సెట్‌లోని డార్చెస్టర్‌లో పుట్టాడు. రాసిన నవలకు ఇదే నేపథ్యం అయింది. అర్భకంగా పుట్టి తల్లి సంరక్షణలో ఎనిమిదో ఏడు వరకు ఇంట్లోనే ఉన్నాడు. పదహారవ ఏట ప్రసిద్ధ ఆర్కిటిక్ దగ్గర సహాయకుడిగా చేరాడు. అప్పటికే కవితలు గిలుకుతున్నాడు. రాయల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ప్రైజ్ పొందాడు. కారన్‌వాల్ వెళ్లి వికార్ మరదల్ని ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. ఆర్కిటెక్చర్‌లో నీతులున్నా ధనలక్ష్మీ కనికరించలేదు. వదిలేసి "ది పూర్ మాన్ అండ్ ది లేడీ" రాసి ప్రచురిద్దామనుకొంటే అందులో "సరుకు లేదు" అని తిప్పి పంపేశారు. కసిగా "డెస్పరేట్ రేమిడీస్" రాస్తే ఒక మాదిరి ప్రోత్సాహం వస్తే ఒక రాస్తూనే ఉన్నాడు. నవలా ప్రయత్నమూ చేసి చివరికి కవిత్వమే పుడ్డూ బెడ్డూ అనుకొన్నాడు. ముప్ఫై అయిదు నలభై మధ్యలో ఎనిమిది నవలలు దించాడు. ముప్ఫైకిపైగా చిన్నకథలు రాశాడు. ఇవన్నీ క్లిక్ అయి లక్ష్మీ ప్రసన్నం కలిగించాయి. "టెస్ట్ ఆఫ్ ది డీ ఆర్బర్ విల్లీస్" రాసి విమర్శకులను ఆకర్షించాడు. ఓవిడ్, టేరిస్‌లను యవ్వనంలోనే చదివాడు. డార్విన్‌ను, స్టువార్ట్ మిల్‌ను అధ్యయనం చేశాడు. "టేస్స్" రాశాడు. "తుస్సు"మంది. విమర్శకుల జడివానకు ప్రతిగా సమాధాన గొడుగుపట్టి నిరుత్తరుల్ని చేశాడు. పిచ్చికోపంతో ఒకడు దాన్ని తగలబెట్టి బూడిద పార్సెల్ చేసి హార్డీకి పంపాడు.

అరవైలో "వేసెక్స్ యెమ్స్" రాసి ప్రచురిస్తే ఎవరూ పట్టించుకోలేదు. మరో అయిదేళ్లకు "పోయెమ్స్ ఆఫ్ పాస్ట్ అండ్ ప్రెసెంట్" విడుదల చేస్తే కొంత ఉత్సాహం వచ్చింది. "డైనాస్టీ" మొదటి భాగం రాసి ప్రచురించాడు. నాలుగేళ్ల తర్వాత "నెపోలియన్ యుద్ధాలు"ను మూడు పుస్తకాలలో పందొమ్మిది అంకాలుగా రాశాడు. నూట ముప్ఫై సీన్లున్నాయి. డెబ్భై రెండులో భార్య మరణించింది. తన సెక్రెటరినే పెళ్లి చేసుకొన్నాడు. సోమర్ సెట్ మాం రాసిన "కేక్స్ అండ్ ఇల్స్" హార్డీ జీవితమే. మూడు గొప్ప కవితా పుస్తకాలను రాసి ముద్రించాడు. ఎనభై ఎనిమిదవ ఏట జలుబు చేసి తీవ్రమై 11-01-1928న హార్డీ మరణించాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో సమాధి చేసి, ఆయన వీలునామాలో రాసిన దాని ప్రకారం గుండెను తనకు అతి ఇష్టమైన డార్చేస్తర్ గ్రామంలో సమాధి చేశారు.

డార్విన్‌ను సమర్ధించిన విశ్వానికి కేంద్రం మానవుడు అన్నదాన్ని హార్డీ ఒప్పుకోలేదు. "సైన్సును సాహిత్యంగా మార్చిన ఘనుడు". ప్రకృతిని వర్డ్స్‌వర్త్‌తోబాటు అర్ధం చేసుకొన్నాడు. "ప్రపంచం దేవుడి ఓటమి" అన్నాడు. విక్టోరియా యుగపు చివరివాడైనా కొత్తదనం కోసం ప్రయత్నించాడు.

"When the present has latched its postern behind my tremulous stay" మొదలైనవి అతని కవితలు. విక్టోరియన్ రియలిస్ట్ అంటారు. పతనమైపోతున్న విక్టోరియన్ సంఘంపై విమర్శచేశాడు. లారెన్స్, వర్జీనియా ఉల్ఫ్‌లకు ప్రేరణ. లిరిక్స్, సెటైర్ బాలడ్స్, డ్రమాటిక్ మోనోలోగ్స్ రాసి మెప్పించాడు. బోయర్ యుద్ధం, మొదటి ప్రపంచ యుద్ధాలపై మంచి కవితలు రాశాడు. ప్రేమ జీవిత వైఫల్యాలపైనే ఎక్కువగా రాశాడు. కవితల్లో ఐరనీ (పరిహాసం) పాలు ఎక్కువే. ఇరవయ్యవ శతాబ్ది గొప్ప కవుల్లో ఒకడుగా ప్రసిద్ధుడు. జంతు హింసకు వ్యతిరేకి. ఫ్రాస్ట్, ఆడెన్ మొదలైన వారిపై ప్రభావం చూపాడు. ఆక్స్‌ఫర్డ్ బుక్ ఆఫ్ ట్వెంటిఎత్ సెంచరి వెర్సెస్‌లో హార్డీవి ఇరవై ఏడు కవితలను చేర్చి లార్కిన్, హార్డీ కవితా ప్రాభవానికి ప్రాచుర్యం కలిగించాడు.

ఇంగ్లాండ్ దేశ పందొమ్మిదో శతాబ్ది ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభ కవుల ముచ్చట్లు సమాప్తం. ఇక న్యూ ఇంగ్లాండ్ "కొత్త ప్రపంచం" అని పిలువబడే అమెరికా కవలు ముచ్చట్లు తెలుసుకొందాం.

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 44

# అమెరికా కవులు

**బే**కన్ రాసిన "నోవం ఆర్గానం" ముద్రణ పొందిన తరువాత 1620లో కొత్త ప్రపంచం లేక "న్యూ ఇంగ్లాండ్" అనే అమెరికాలోని కేప్‌కాడబే కాలనీకి "పిలిగ్రిం ఫాదర్స్" అనబడే సెటిలర్స్ మొదట చేరుకొన్నారు. విజ్ఞానం కోసం మానవుడి అన్వేషణ, విజయం అని బేకన్ పేర్కొన్నాడు. వందేళ్ళ తర్వాత క్లాయోన్ బిషప్ వేదాంతి జార్జి బెర్క్లీ కొన్ని కవితలను "ఆన్ ది ప్రాస్పెక్టస్ ఆఫ్ ప్లాంటింగ్ ఆర్ట్స్ అండ్ లెర్నింగ్ ఇన్ అమెరికా" రాస్తూ, అమెరికాలో కవిత్వం రాయటానికి కొత్త విషయాలున్నాయన్నాడు. బెర్కిలీ ఆశాభావంతో కవిత్వం అల్లాడు. కాలనీ కాలం అంతా పాత ధోరణి సామెతలతోనే కవిత్వం సాగింది. అమెరికాలో మొదటి కవయిత్రి, న్యూ ఇంగ్లాండ్ గవర్నర్ కూతురు, ఇంకో గవర్నర్ భార్య అయిన "అన్నే బ్రాడ్ స్ట్రీట్" (1612–1672) గుర్తింపు పొందింది. తన కవితా సంకలనానికి "ది టెన్త్ మ్యూజ్‌లేట్లీ స్ప్రంగ్ అప్ ఇన్ అమెరికా" అని అర్ధవంతమైన పేరు పెట్టింది. పాత రొడ్డు కవిత్వ ధోరణిలో కాకుండా స్పెన్సర్, రాలీ, ఫ్రెంచ్ కవి డ్యు బర్టాస్ వంటి ప్రముఖుల ప్రభావంతో రాసింది. 1624–1729 కాలంవాడైన ఎడ్వర్డ్ టైలర్ రాతప్రతులు ఆయన చనిపోయిన రెండు వందల ఏళ్ళ తర్వాత కాని బయటపడలేదు. టేలర్ మెటాఫిజికల్‌గా, మత భావస్ఫూర్తిగా హెర్బర్ట్, డోన్నేల మార్గంలో రాశాడు. న్యూ ఇంగ్లాండ్ నుంచి న్యూ జెర్సికి కవిత్వపు సీను మార్చినవాడు. 1752–1832 కాలంవాడైన ఫిలిప్ ఫ్రే న్యూ అతను రాసిన "ది ఇండియన్ బరియల్ గ్రౌండ్" మొదలైన కవితలలో స్థానిక విషయాల ప్రస్తావన ఉన్నా, పద్దెనిమిదో శతాబ్ది ఇంగ్లీష్ పద్ధతిలోనే రాశాడు. స్వంత సీమభావంతో రాసిన మొదటికవి. "అమెరికా కవిత్వ పిత" విలియం కల్లెన్ బ్రయాంట్. ఆయన గురించే ఇప్పుడు మనం తెలుసుకోబోతున్నాం.

**అమెరికా కవిత్వ జనకుడు – విలియం కల్లెన్ బ్రయాంట్**

ఇంగ్లీష్ కవులు పోప్ నుండి కూపర్ దాకా మరీ ముఖ్యంగా "రాబర్ట్ బ్లైర్" ఇంకా



చెప్పాలంటే "గ్రేవ్‌యార్డ్ స్కూల్" ప్రభావంతో విలియం కల్లెన్ బ్రియాంట్ తన స్వంత బాణీ, వాణితో కవిత్వం చెప్పాడు. దీనితో అమెరికా కవిత్వానికి ఒక "డిగ్నిటి" అంటే గౌరవం, పరువు లభించాయి. మే ఫ్లవర్ సంతతికి చెందినవాడై మాసాచుసెట్స్‌లోని కమ్మింగ్‌టన్‌లో 03-11-1794న జన్మించాడు. అర్భక జీవిగా బతుకుతాడో లేదో అన్న భావంతో పుట్టాడు. తలకాయ మామూలు కంటే పెద్ద సైజ్‌లో ఉండేది. అక్కడి గ్రామీణ డాక్టర్ రోజూ మంచు నీటి ధారలో ముంచి మామూలు సైజుకు తెచ్చాడు. ఆరోగ్యసూత్రంగా తండ్రి కొడుకును రోజూ తనతో అరణ్యాలకు నడకకు తీసుకొని వెళ్ళేవాడు.

రెండేళ్లకే చదవటం వచ్చేసింది. పదికి కవిత్వమే రాస్తే "హాంప్‌షైర్ గెజిట్"లో ప్రింట్ అయింది. పదమూడుకు జఫర్సన్‌కు వ్యతిరేకంగా సెటైర్ "ది ఎంబార్గో" రాశాడు. పదిహేడులలో పరిపూర్ణ కవి అయ్యాడు. "టానా టోప్సిస్" రాసి డెస్క్‌లో ఉంచేశాడు. ఎప్పుడో తండ్రి కంటబడితే ఆయన నార్త్ అమెరికన్ రివ్యూ ఎడిటర్‌కు ఇస్తే చదివి ముచ్చటపడి నిరంతరం రాసి పంపించమని చెప్పాడు. అలాగే రాస్తే వేసేవారు పత్రికలో. ఈ కవితలు చదివిన రిచార్డ్ హెన్రి డొన్నా "అట్లాంటిక్ సముద్ర ఈ తీరంలో ఇలా అద్భుతంగా కవిత్వం రాసిన వాడేవరూ ఇంతవరకు లేరు" అని శ్లాఘించారు. రాసినవన్నీ పేపర్లు అచ్చు వేశాయి. మంచి రివ్యూలే వచ్చి ప్రోత్సహించారు. అప్పటికే లా చదివినా ప్రాక్టీస్‌పై మనసు పోలేదు. విమర్శకులు "అమెరికా నాయక కవి" అని ప్రశంసిస్తున్నారు. ముప్ఫై అయిదులో ప్రసిద్ధ "న్యూయార్క్ ఈవెనింగ్ పోస్ట్" పత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్ అయ్యాడు. జీవితాంతం ఇదే పోస్ట్‌లో పనిచేశాడు. నలభైలో అయిదు కవితా సంకలనాలు ముద్రించాడు. ఫ్రాన్సెస్ ఫెయిర్ చైల్డ్‌ను వివాహమాడాడు.

ప్రెసిడెంట్ లింకన్ బానిస విమోచనకు ఎంతో మనస్ఫూర్తిగా సహకరించి ప్రచారం చేశాడు. ఇంగ్లాండ్ నవలా చక్రవర్తి చార్లెస్ డికెన్స్ అమెరికా పర్యటనకు రాగానే "బ్రియాంట్ ఎక్కడ?" అని అడిగాడంటే అతని కీర్తి చంద్రికల వ్యాప్తి ఏమిటో తెలుస్తోంది. డెబ్భైలో కూడా మంచి ఆరోగ్యంగా ఉన్నాడు. నడక, వ్యాయామంతో బాటు నిత్యం కవిత్వం రాసేవాడు. "లైబ్రరి ఆఫ్ పోయెట్స్ అండ్ సాంగ్స్" అనే బృహత్ గ్రంధాన్ని రివిజన్ చేశాడు. ఎనభై నాలుగవ ఏట న్యూయార్క్ సెంట్రల్ పార్క్‌లో ఇటలి దేశ భక్తుడు "మజ్జిని" శిలా విగ్రహాన్ని మే నెలలో ఆవిష్కరిస్తూ, ఎక్కువసేపు తలమీద టోపీ లేకుండా నిలబడి ఉండటంతో ఎండ వేడికి తట్టుకోలేక కూలిపోయాడు. మెదడులో రక్తనాళం గడ్డకట్టటంతో కోమాలోకి వెళ్లిపోయాడు. కొన్ని వారాల తర్వాత 12-06-1878న ఎనభై నాలుగవ ఏట చనిపోయాడు.

యవ్వనంలో ముసలి వారికోసం ముసలితనంలో పిల్లలకోసం రాశాడు బ్రియంట్.

"అమెరికా వర్డ్స్‌వర్త్" అని అందరూ గౌరవంగా పిలిచేవారు. అతిసాధారణంగా, స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండేవాడు. సరదా మనిషి కూడా. "ఏ ఫేబుల్ ఫర్ క్రిటిక్స్"లో లోవెల్ బ్రియాంట్‌లోని లోపాలను తెలియజేశాడు. అయితే వీరందరి కంటే ఎడ్గార్ అల్లెన్ పో "In character no man stands more loftily than Bryant the peculiarity melancholy expression of his countenance has caused him to be accused of harshness or coldness of heart. Never was there a greater mistake. His soul is charity itself in all respects generous and noble" అని ఖచ్చితమైన యదార్ధ వివరణ చేశాడు. అమెరికన్ రొమాంటిక్ కవిగా పేరు. మార్టిన్ లూథర్‌కింగ్ ఎంతో మెచ్చుకొని ఆయన చెప్పిన మాట "Truth crushed to earth will rise again" అని పదేపదే గుర్తుచేసేవాడు. వాల్ట్ విట్మన్‌కు "మెంటార్".

### వ్యక్తిత్వ వికాస కవి – రాల్ఫ్ వాల్డో ఎమర్సన్



న్యూ ఇంగ్లాండ్ కవిత్రయంగా ఎమర్సన్, విట్టియర్, లాంగ్ ఫెలోలు గుర్తింపు పొందారు. సంస్కృతికి ఆనవాలుగా నిలిచారు. వీరి వలననే అమెరికా స్వంతగడ్డపై కవిత్వ బీజం నాటబడి, సాగు చేయబడి, పోషించబడి వికసిత పుష్పమై, అందంగా, ఆకర్షణీయంగా సువాసనలీనుతోంది.

"గాడ్ ఇంటాక్సికేటెడ్ యాంకీ"గా పిలువబడే రాల్ఫ్ ఎమర్సన్ 25–05–1803లో మాసాచూసేట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. తండ్రి వారసత్వంగా వచ్చిన యూనిటేరియన్ క్లెర్జిమన్ అయ్యాడు. మూఢాచారాలకు వ్యతిరేకి. ఎనిమిదో ఏట తండ్రి చనిపోతే ఎనిమిది మంది సంతానాన్ని పోషించే బాధ్యత ఎమర్సన్‌పై పడింది. అందరి సానుభూతి, సహకారంతో బాధ్యతను నెరవేర్చి పెంచి పెద్దవాళ్ళను చేశాడు. అంత తెలివైనవాడు కాకపోయినా పందొమ్మిదేళ్ళకే హార్వర్డ్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. కొంతకాలం స్కూల్‌లో బోధించి తర్వాత చర్చి మినిస్టర్ అయ్యాడు. ఎలెన్ లూసా టకర్‌ను వివాహమాడి, మినిస్టర్ పదవి వదిలేశాడు. ఇతరులకు బోధించటాన్ని సమర్ధించాడు. యూరప్ సందర్శించాడు. అదే జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. కార్‌లైల్ వర్డ్స్‌వర్త్ కవులతో సమావేశమై జీవితపు విలువలను అధ్యయనం చేశాడు. ఇంగ్లాండ్ తిరిగి, లేక్ పోయెట్స్‌ను చూశాడు. కార్‌లైల్‌కు సన్నిహితుడయ్యాడు.

తిరిగి వచ్చి కంకార్డ్‌లో కాపురం పెట్టి, లిడియా జాక్సన్‌ను రెండవ పెళ్లి చేసుకొన్నాడు. ప్రదేశాలు తిరుగుతూ, చాలా ఉపన్యాసాలిచ్చాడు. అసాధారణ మేధావిగా, పండిన వేదాంతిగా గుర్తింపు వచ్చింది. "మనిషి అంటే బంధుత్వాల కలయిక. అస్తిత్వ వ్రేళ్ళమూలం" అనేవాడు. "ఎవరు బాగా అర్ధం చేసుకొంటారో వారే గొప్ప". "ఉత్సాహం లేకుండా దేన్నీ పొందలేం,

హీరోయిజంకు రీజన్ అనవసరం అందుకే గొప్ప. వ్యక్తిలో ప్రపంచ భావన ఉంటేనే అది ఆకర్షిస్తుంది." అన్నాడు. మతంలో కొత్త ఆలోచనలు, భావాలు వ్యాప్తి చెందించాడు ఎమర్సన్. నలభై నాలుగులో "పోయెమ్స్" ప్రచురించాడు. ఒక ఏడాది తర్వాత "మే డే అండ్ అదర్ పోయెమ్స్" తెచ్చాడు. వ్యాస సంకలనాలు రెండు ముద్రించాడు. డెబ్భైలో జ్ఞాపకశక్తి క్షీణించింది. లాంగ్ ఫెలో చనిపోతే సమాధి దగ్గర "అతను మంచివాడు. కాని పేరు మాత్రం గుర్తుకు రావటం లేదు" అన్న జ్ఞాని. సమాజానికి దూరమైపోయి కంకార్డ్‌లో 27-04-1882లో డెబ్భై తొమ్మిదో ఏట మహా జ్ఞాని. స్కాలర్, కవి, వేదాంతి, తత్వ, వివేచనాపరుడు ఎమర్సన్ మరణించాడు. ఆయన వేదాంతం మానసికమైంది. "Emerson's poetry is both rich and casual - homespun cloth of gold" అని లోవెల్ మెచ్చాడు. ఎన్నో భాషలలోని అనువాదం పొందిన రచనలు చేశాడు. ముఖ్యంగా భారతీయ ఫిలాసఫర్లు ఎమర్సన్‌ను ఆదర్శంగా భావించారు.

**బానిసత్వ వ్యతిరేక కవి – జాన్ గ్రీన్‌లీఫ్ విట్టర్**



ఎమర్సన్ లాగానే అనుదిన కర్మకాండను విట్టర్ వ్యతిరేకించాడు. తండ్రి వ్యవసాయదారుడు. 17-12-1807లో మాసాచుసెట్స్‌లోని హావేర్ హిల్‌లో పుట్టాడు. చిన్నప్పుడే తండ్రితో పొలం వెళ్లి సాయం చేశాడు. శీతాకాలంలో ఎనిమిది సెంట్లకు స్లిప్పర్ జత తయారు చేసి అమ్మి ట్యూషన్ ఫీజు సంపాదించాడు. మొదటి టరం అయ్యేసరికి చేతిలో కేవలం ఇరవై అయిదు సెంట్లు మాత్రమే ఉన్నాయి. దేనికైనా మైళ్ళకొద్దీ దూరం నడిచి తెచ్చుకోవాల్సి వచ్చేది. స్కూల్ టీచర్ బర్న్స్ కవిత్వ పుస్తకం ఇస్తే ఇష్టపడి చదివాడు. దాన్ని జీవితాంతం దగ్గర పెట్టుకొన్నాడు. పద్దెనిమిదేళ్ళకే "ఫ్రీ ప్రెస్" మాసపత్రికలో మొదటి కవిత ప్రచురించారు. వరుసగా నూట యాభై కవితలు రాశాడు. బానిస వ్యతిరేకంగా "జస్టిస్ అండ్ ఎక్స్పిడియెన్సి" కరపత్రిక ముద్రించాడు. బానిసత్వ వ్యతిరేకతపై స్పందించిన కవి. రాజకీయ నాయకుడు అయ్యాడు. ఎమర్సన్ లాంటి ఫ్రీ థింకర్స్ బానిసత్వాన్ని సమర్థించటం జీర్ణం చేసుకోలేకపోయాడు.

ఫిలడెల్ఫియా వెళ్లి "పెన్సిల్వేనియా ఫ్రీమన్" పత్రికకు సంపాదకుడయ్యాడు. బానిసత్వ నిర్మూలన సంఘానికి పెన్సిల్వేనియా హాల్‌ను వేదిక చేశాడు. "The crank of an opinion mill - making his rustic reed of song - a weapon in the war of wrong" అని బాధపడ్డాడు. తర్వాత "స్నో బౌండ్"లో తన కవితా శక్తియుక్తులన్నీ ప్రదర్శించాడు. ఎనిమిది సెంట్‌లకు స్లిప్పర్ జత తయారు చేసిన ఈ కుర్రాడు ఇప్పుడు అక్కడ ప్రముఖ

సిటిజన్ అయ్యాడు. "లిజెండర్‌రి ఫిగర్" అనిపించాడు. అతని ఎనభయ్యవ పుట్టినరోజు జాతీయ పండుగగా నిర్వహించారు. ఎనభై అయిదవ పుట్టినరోజుకు కొన్ని నెలల ముందు 07-09-1892న విట్టర్ కవి మరణించాడు. "ఏ ఫేబుల్ ఫర్ క్రిటిక్స్"లో రస్సెల్ లోవెల్ "There is Whittier, whose swelling and vehement heart - strains the strait breasted darb of the Quaker apart - a fervor of mind which knows no seperation - twixt simple excitement and pure inspiration" అని మెచ్చుకొన్నాడు. "సాంగ్ ఆఫ్ ది నీగ్రో బాట్‌మాన్" అనేక ముద్రణలు పొందింది. క్వేకర్ ఉద్యమకవిగా కూడా ప్రసిద్ధుడు.

**హెన్రి వాడ్స్‌వర్త్ లాంగ్‌ఫెలో**



లాంగ్ ఫెలో కవికి పాఠ్యపుస్తకాలు తీవ్ర అన్యాయాన్ని చేశాయి. చెత్తకవితలే ఎంచి, వేసి ఆయన గౌరవ భంగం కల్గించాయి.ఆయన కవితలు నీతి బోధకాలు అంటూ అపచారమూ చేశారు. కనుక ఆయన అంటే "వాల్‌పోస్టర్ కవి" అనుకొన్నారు. ఆకారమూ విలేజ్ మినిస్టర్‌లా ఉండేది. "వంటింటి కవి" అని ముద్రపడింది. కాని 24మంది పబ్లిషర్లు ఆయన రచనలను ప్రచురించటమంటే అసామాన్య విషయమే. "ది కోర్ట్ షిప్ ఆఫ్ మెయిల్స్ స్టాండిష్" పదివేల కాపీలు ఒక్కరోజులోనే ఇంగ్లాండ్‌లో అమ్ముడయింది. "ది సాంగ్ ఆఫ్ హైవత" ప్రపంచ భాషలన్నిటిలోనూ అనువాదం పొందింది. కాని సమకాలీన కవులు లాంగ్ ఫెలోను "షార్ట్ ఫెలో"గా భావించి అన్యాయం చేశారు. "అమెరికాలోని భిన్న సామాజిక స్థితులపై, విభిన్న మానవులపై, సామాజిక వర్గాలపై, వృత్తుల వారిపై విలువైన కవిత్వం రాసి మాబోటి వారికి మార్గదర్శనం చేశాడు లాంగ్ ఫెలో" అన్నాడు అమెరికా జాతీయ కవి వాల్ట్ విట్మన్. సంవత్సర ఆదాయం యాభై వేల డాలర్లకు పైనే ఉండేది. "ది హంగింగ్ ఆఫ్ ది క్రేన్" కవిత మూడువేల డాలర్లు సంపాదించింది.

27-02-1807లో మెయిన్‌లోని పోర్ట్‌లాండ్‌లో జన్మించాడు. తన బాల్యాన్ని " A boy's will is the wind's will - and the thoughts of youth are long long thoughts" అని రాసుకొన్నాడు. తండ్రి కమ్మరి పనిచేసేవాడు. చిన్నప్పుడే తను కవిని అవుతాననే నమ్మకముండేది లాంట్ ఫెలోకి. ఇర్వింగ్ రాసిన దానికి అనుకరణగా "స్కెచ్ బుక్" రాశాడు. పన్నెండో ఏట "ది బాటిల్ ఆఫ్ లోవెల్స్ పాండ్" కవిత పోర్ట్‌లాండ్ గెజెట్‌లో అచ్చయింది. బోడెన్ కాలేజిలో చేరి అన్నిటా ప్రథముడుగా వచ్చాడు. "చాటర్టన్ అండ్ హిస్ పోయెమ్స్"పై రాయమంటే "అవర్ నేటివ్ రైటర్స్"గా పేరు మార్చి రాసిన సాహసి.

లాయర్ కావాలని లేదు. సాహిత్యం మీదే మనసు. ఆధునిక సాహిత్యంపై ఒక చైర్‌ను ఏర్పరచి వచ్చి చేరమని బౌడెన్ ఆహ్వానిస్తే వెళ్లి చేరి పందొమ్మిదో ఏట దాన్ని నిర్వహించిన "లేత కుర్రాడు" అనిపించాడు. దీని వలన విదేశీయాత్ర సాధ్యమైంది. ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, జెర్మని వంటి దేశాలు తిరిగి సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆ వారసత్వాన్ని తన దేశీయ అమెరికన్ కవిత్వంలో జోడించాడు. ఇరవై నాలుగులో పదవి స్థిరపడింది. మేరీ స్టొరేర్ పోటర్‌ను వలచి పెళ్ళాడాడు. బోధనపై పెద్దగా ఇష్టంలేకపోయినా పాతికేళ్ళు బోధన చేసి హార్వర్డ్ ప్రొఫెసర్ అయ్యాడు. మళ్ళీ విదేశీయానం స్కాండినేవియన్ జర్మన్ సాహిత్యాన్ని అర్థం చేసుకొని కార్లైల్‌ను కలిసి విద్యావేత్తతలతో మెదిలాడు. స్వీడిష్ భాష నేర్చాడు. "ఫిన్ని భాష"లోని మహాకావ్యం "కలేవేల"ను జీర్ణం చేసుకొని తన "హైవత"లో ప్రతిబింబింపచేశాడు.

అమెరికా తిరిగివచ్చి "క్రేగీ హౌస్" అనే చారిత్రాత్మక ప్రదేశంలో నివశించాడు. పదిహేనేళ్ళు చిన్నదైన ఫాని ఎలిజాను వలచి వలపించి రెండో పెళ్లి చేసుకొన్నాడు. వీరి వివాహం బోస్టన్‌లో పెద్ద పండగే అయింది. అయిదుగురు పిల్లల్ని కన్నారు. ఒకరోజు ప్రమాదవశాత్తు కొవ్వొత్తికి భార్య సమ్మర్ డ్రెస్‌కు అంటుకొని కాలుతుంటే లాంగ్ ఫెలో పక్కరూమ్‌లో నుంచి పరిగెత్తుకొని వచ్చినా ఆర్పలేక ఆమె పూర్తిగా కాలి చనిపోయింది. విచారం అలముకొన్నా కవిత్వం ఆగలేదు. "పోయెమ్స్ ఆఫ్ స్లేవరి" రాసి ఎవరూ చేయని సాహసం చేశాడు. ఇవాన్జిలీన్ మొదలైన లిరిక్స్ రాశాడు. ఇంకా గొప్ప రచనలు రావాల్సి ఉంది.

"టేల్స్ ఆఫ్ ఏ వెసైడ్ ఇన్" ప్రచురించి పేరు తెచ్చుకొన్నాడు. వయసు పైబడిన కొద్దీ రచనా వ్యాసంగం పెరిగింది. అరడజను పుస్తకాలు రాశాడు. నరాల జబ్బు బాధించింది. హార్ట్ ఎటాక్ వచ్చింది. 24-03-1882న చనిపోయాడు. వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో సమాధి చేవారు. కథలను మహాద్భుతంగా చెప్పాడు. కవిత్వం పర్వతఝురి లాగా వేగంగా ప్రవహిస్తుంది. మార్గదర్శిగా గుర్తింపు పొందాడు. అమెరికా గడ్డపై స్వంత కవితా సేద్యం చేసి అమూల్య ఫలాలనందించిన తొలితరం కవులలో ముఖ్యుడు. అమెరికాకు సంపూర్ణ వికాసాన్ని ఇచ్చిన కవులలో ఒకడు.

డాంటే రాసిన డివైన్ కామెడీని అనువాదం చేసిన మొదటి అమెరికన్ కవి లాంగ్‌ఫెలో. లిరిక్ పోయెమ్స్ రాసి మాస్‌కు చేరువైన కవి. హెక్సా మీటర్‌లో, ఫ్రీ వేర్స్‌లో కూడా రాశాడు. హీరోయిక్ కప్లేట్స్, బాలడ్స్‌నూ రాశాడు. నైతిక, సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చాడు. భౌతికానికి అతీతంగా ఆలోచన చేశాడు. ఆయన కాలంలో అందరికంటే ప్రసిద్ధుడు. విట్మన్, ఫ్రాస్ట్ మొదలైన కవులకు ప్రేరణ.



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 45**

**అమెరికా కవులు**

# మానవీయ కవి - జేమ్స్ రస్సెల్ లోవెల్

**లో**వెల్, హోమ్స్ ఇద్దరు కవులేకాక వ్యాస రచయితలు కూడా ఇద్దర్నీ కలిపే ఉదాహరిస్తూన్నారు. లోవెల్ 22-02-1819న మాసాచూసేట్స్‌లోని కేంబ్రిడ్జిలో పుట్టాడు. తండ్రి వద్ద పాత బాలడ్స్, జానపద గీతాలు నేర్చాడు. హార్వర్డ్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. లా చదివి నా, ప్రాక్టీస్ చేయలేదు. ఆఫీసు పెట్టినా క్లైంట్‌ల కంటే పబ్లిషర్లు ఎడిటర్లను ఆకర్షించాడు. "పెన్సిల్వేనియా ఫ్రీమన్" పేపర్‌లో బానిసత్వ నిర్మూలనపై వ్యాసాలు రాశాడు. మెక్సికోతో యుద్ధం వలన బానిస రాష్ట్రాలు పెరుగుతాయని భావించాడు. "బిగ్లో పేపర్స్"లో సెటైర్లు దంచి రాశాడు. మొదటి కవితా సంపుటి ముద్రించాడు. ఇరవైలో "ది విజన్ ఆఫ్ సర్ లాంఫాల్" రాసి, రొమాంటిక్ అభిరుచి ఉన్నవారిని ఆకర్షించాడు. బిగ్లో పేపర్స్‌లో "బోస్టన్ కొరియర్" ప్రారంభించి భిన్నత్వ ధోరణిలో నడిపాడు. యుద్ధ వ్యతిరేకంగా ఎన్నో కవితలు రాసి మెప్పించాడు.

"Ez for war I call it murder - there you have it plain an flat - I donot want to go no further" అన్నాడు "ఏ ఫేబుల్ ఫర్ క్రిటిక్స్" రాసి తేలిక విషయాలపై దృష్టినీ పెట్టాడు. ఎమర్సన్, పో, బ్రయంట్ మొదలైన వారినందరిని ఉతికి ఆరేశాడు. ఒక ఏడాది యూరప్‌లో గడిపాడు. భార్య చనిపోయింది. రచనలో మునిగాడు. లాంగ్ ఫెలో చైర్‌కు ఎంపికై, ఆధునిక భాషలపై అనేక ఉపన్యాసాలిచ్చాడు. జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషల్లో పండితుడైనాడు. స్పెయిన్ దేశానికి మంత్రి అయ్యాడు. రెండవ భార్య ఇంగ్లాండ్‌లో ఉండగా చనిపోయింది. అమెరికా తిరిగి వచ్చి అనేక విమర్శనాత్మక వ్యాసాలూ రాశాడు. పది వాల్యూముల గ్రంథ రచన చేసిన ఉద్దండ పండితుడు. వందేళ్ళ వరకు రాయాల్సినవన్నీ సిద్ధం చేసుకొన్నాడు. కాని పుట్టిన ఇంటిలోనే 12-08-1891న డెబ్బై

రెండేళ్లకే చనిపోయాడు. మధురమైన భాషలో కవిత్వం రాశాడు. రైమింగ్ బాగా తెలిసిన వాడు. మాండలికానికి హోదా, గౌరవం కల్పించాడు. నిజాయితీగా అసలైన యాంకీగా "హ్యూమర్‌ను హ్యూమన్"ను మేళవించాడు. అమెరికన్ రొమాంటిక్ కవిగా "ఫైర్ సైడ్" కవుల్లో ఒకడుగా గుర్తింపు పొందాడు. "Who ever is most universal is most national" అని అంటాడు. బోస్టన్, హార్వర్డ్ బ్రాహ్మిన్ కల్చర్‌కు ప్రతినిధి. ఆధునిక సివిల్‌రైట్స్ ఉద్యమానికి ప్లాట్‌ఫారం నిర్మించాడు. "ది ప్రెసెంట్ క్రైసిస్" కవిత సివిల్ వార్ కల్లోలాన్ని దృష్టికి తెచ్చింది.



**అన్ని ప్రక్రియలకు ఆద్యుడు - ఎడ్గార్ అల్లాన్ పో**

పేరులోనే "ఎలోన్" ఉంది కనుక ఒంటరివాడుగానే జీవించాడు. జీవితంలోని కష్టాలు, దుఖాలకు కుంగి విచారమే పరమావధిగా ప్రవర్తించాడు. రాశాడు. తల్లీ తండ్రి ఇద్దరూ స్టేజి నటులే. మాసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో "19-01-1809న జన్మించాడు. రిచ్మాండ్‌లో న్యూ మోనియా వచ్చింది. తండ్రి తరపు తాత పెంపకంలో పెరిగాడు. రిచ్మాండ్ వ్యాపారి జాన్ అలన్ సంరక్షణలో ఉన్నాడు. అలాన్‌కు పిల్లల్లేరు. ఇంగ్లాండ్‌లో మంచి స్కూల్‌లో చేర్పించాడు. అక్కడ ఒంటరితనం బాధించి "ది లేక్" కవిత రాశాడు. "Death was in that poisonous wave - and in its gulf a fitting grave - for him who thence would solace bring - to this lone imagining" అని భావ గర్భిత కవిత రాశాడు. అమెరికా తిరిగి వచ్చి ఒక స్నేహితుని తల్లి మిసెస్ సానర్డ్‌పై తల్లి భావంతో ప్రవర్తించాడు. వర్జీనియా వర్సిటీలో చేరి శ్రద్ధ చూపకుండా తాగుడులో పడి గెంటి వేయబడ్డాడు. పెంపుడు తండ్రి అలాన్‌తో పోట్లాడి బయటికొచ్చేశాడు. "టామర్లేన్", "బై ఏ బోస్టోనియన్" అని తన పేరు లేకుండా రాసి ప్రచురించాడు. ఎవరికీ పట్టలేదు. రెండేళ్ళు సైన్యంలో పనిచేసి, అలాన్ వలన బయటికొచ్చాడు. మళ్ళీ అలాన్‌తో పోట్లాడి తాగుడుతో చనిపోతున్న తమ్ముడికి సేవ చేశాడు. వెస్ట్ పాయింట్‌లో తిరిగీ ఉద్యోగం పొందాడు. అధికారుల ఆజ్ఞలను ఉల్లంఘించినందుకు ఉద్యోగంలోంచి తప్పించేశారు.

పెంపుడు తండ్రి అలాన్‌తో మళ్ళీ పోట్లాడి, అతనేమీ ఇద్దకపోయే సరికి "పెన్నీ లెస్ ఫెలో"గా రోడ్డున పడ్డాడు పో. అనారోగ్యం, తాగుడు, దరిద్రం, నిరాశ, దు:ఖం ఆవహించి ఉక్కిరి బిక్కిరి చేశాయి. సృజనాత్మక రచనలు చేశాడు. ఒక కథ రాస్తే యాభై డాలర్ల ప్రైజ్ వచ్చింది. కజిన్ వర్జీనియాను పెళ్లి చేసుకొన్నాడు. అనేక పత్రికలకు ఎడిటర్‌గా పనిచేసి వదిలేశాడు. తాగనిదే ఉండలేకపోయేవాడు. కిక్కుకోసం తాగి జీవితాన్ని కిక్ చేసుకొని

నాశనం చేసుకొన్నాడు. కుటుంబాన్ని ఫోర్డ్‌హాంకు మార్చాడు. కుటుంబ బాధ్యతల నుంచి ఎప్పుడూ వెనక్కు పోలేదు. భార్య చనిపోయింది. మరీ విషాదంలో మునిగాడు. తల్లి లేని లోటును జీవితాంతం అనుభవించి వేదన చెందాడు. అందుకే రచనలలో మాతృభావానికి పెద్దపీట వేస్తాడు.

ముప్ఫై ఎనిమిదిలో న్యూ రోటిక్‌గా, మతి స్థిమితం లేనివాడుగా మారిపోయాడు. విధవరాలైన సారా విలియం విట్మన్‌తో కలిసి ఉన్నాడు. అస్థిమితత్వంతో ఆత్మహత్యా ప్రయత్నాలు చేశాడు. భ్రమ, భ్రాంతులతో చివరిరోజులు గడిపాడు. ఎవరూ పట్టించుకోలేదు. రోడ్ల వెంబడి పడి తిరిగేవాడు. అంత గొప్ప కవి అనాధగా రోడ్డు పక్క మురికి కాలవ దగ్గర పడి 07-10-1849లో నలభై రాకుండానే చనిపోయాడు. "Almost without the first sign of moral principle or the simplier affections of the heart, poe's verses illustrate an intense faculty of technical and abstract beauty with the rhyming art to excess, an incorrigible propensity toward nocturnal themes and demoniac under tone behind" అని వాల్ట్ విట్మన్ ప్రశంసించాడు. అన్ని విషయాలలో అందమైన అమ్మాయి చావును వర్ణించాడు. క్రియకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి కవిత్వం రాశాడు. కవిత్వం అంటే "Is opposed to a work of science by having, for its immediate object, an idefinite instead of a definite pleasure being a poem only so far as the objects attained" అని అభిప్రాయ పడ్డాడు పోప్. గోల్డ్ బాగ్ రెవిన, మర్డర్ ఇన్ ర్యుమాంటేగ్ కవితలు అతని ప్రతిభకు నిదర్శనాలు. దెయ్యాలు, భూతాల కథలు రాశాడు. డిటెక్టివ్ కథలల్లాడు. కవిత్వంపై గొప్ప వ్యాస పరంపర రాశాడు. చివరగా "Poe's poems are full of the music of another sphere, a shadowy half world, out of space, out of time, where Poe's spirit was unhappy at home" అని అంచనా వేయవచ్చు. మిస్టరి కథలకు ఆద్యుడు. కవిత్వం రాసి జీవితం గడపవచ్చునని రుజువు చేసిన కవి. గోథిక్ రచనలలో సుప్రసిద్ధుడు. హారర్ కథల సృష్టికర్త. పజిల్ నిర్మాత. సాహిత్య విమర్శనలో శిఖరాగ్రాన నిలిచాడు. నిర్దాక్షిణ్య సంపాదకీయాలు, సాహితీ విమర్శలు చేశాడు. యూరప్ అంతటా ఆరాధనీయుడైన కవి. ఫిజిక్స్‌లోను, కాస్మాలజిలోను ప్రవీణుడు. "యురేకా"ను పూర్తి అంతరజ్ఞానంతో (ఇంట్యూషన్) రాసి మెప్పు పొందాడు. "క్రిప్టోగ్రఫీ"అంతు చూసినవాడు. చిన్నకథలు, నాటికలు రాసి సుసంపన్నం చేశాడు. ❋



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 46

# సామాన్యుడిని కవిత్వంలో మాన్యుడిని చేసిన జాతీయకవి - వాల్ట్ విట్మన్

"గడ్డి పరకలు"కు కావ్య గౌరవాన్ని సాధించి సమాజంలోని అన్ని వర్గాల, వృత్తుల మనుషులకు గౌరవం కలిపించి ఇంగ్లాండ్ భావదాస్యానికి భరతం పట్టి, తెర దించి అసలు సిసలు అమెరికన్ కవిత్వాన్ని రాసినవాడు, జాతీయ కవిగా గుర్తింపు పొందినవాడు వాల్ట్ విట్మన్. 31-05-1819న అమెరికాలోని లాంగ్ ఐలాండ్‌లో హంటింగ్టన్లో వెస్ట్ హిల్స్‌లో జన్మించాడు. తొమ్మిదిమంది సంతానంలో రెండవవాడు. తండ్రి కార్పెంటర్. కుటుంబాన్ని బ్రూక్లిన్‌కు మార్చాడు. తండ్రికి "టాంపైన్" అంటే వీరాభిమానం. ముగ్గురు కొడుకులకు అదే పేరు పెట్టుకొన్నాడు. మిగిలినవారికి జార్జీ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, ఆండ్రూ జాక్సన్ అని ప్రెసిడెంట్ల పేరు పెట్టుకొని మురిశాడు. పెద్దన్న సిఫిలిస్ వ్యాధికి గురైనాడు. ఒక చెల్లెలు నరాల బలహీనతతో ఇబ్బంది పడింది. ఒక అన్న వాటర్ వర్క్సులో పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో విట్మన్ పెరిగాడు.

పదకొండవ ఏట స్కూల్ చదువు పూర్తి చేశాడు. ప్రింటర్ దగ్గర సహాయకుడైనాడు. లాంగ్ ఐలాండ్ స్టార్ పత్రిక ప్రెస్‌లో పనిచేశాడు. యువకుడిగా చాలా రెస్ట్‌లెస్‌గా ఉండేవాడు. బతకటానికి అనేక పనులు చేశాడు. ఏదీ సంతృప్తినివ్వలేదు. న్యూయార్క్‌లో కంపోజిటర్‌గా పనిచేశాడు. స్కూల్ టీచర్ అయ్యాడు. చాలా కౌంటీ స్కూళ్ళలో టీచర్‌గా పనిచేశాడు. ఇరవైలో లాంగ్ ఐలాంగర్ ప్రెస్ కొన్నాడు. ఒక ఏడాది స్వంత పత్రిక తేవాలని ప్రయత్నించి విఫలుడై మళ్ళీ ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. ఎక్కడా స్థిరంగా ఉండలేకపోయాడు. ఆరేళ్ళు అరడజన్ పత్రికలలో పనిచేశాడు. చివరికి ఇరవై ఎనిమిదో ఏట "బ్రూక్లిన్ ఈగిల్" పత్రికా సంపాదకుడయ్యాడు. అప్పటికే కొన్ని వచన రచనలు, కొన్ని కవితలు రాశాడు. చిన్న

కథలూ రాశాడు. "ది ఇంకాస్ డాటర్" అనే బాలడ్ స్టాంజాలను రాసినట్లు అందరూ మర్చిపోయారు. ఈగిల్ సంపాదకుడిగా ముప్ఫైవ ఏడు వరకు పనిచేశాడు. "సోగ్గాడు" వేషంతో ఉండేవాడు ఎప్పుడూ. అదే తరువాత తరానికి ఫాషన్ అయింది. న్యూ ఆర్లియాన్ దినపత్రిక "డైలీ క్రిసెంట్"లో పని కుదిరింది. తమ్ముడు జెఫ్‌తో కలిసి న్యూ ఆర్లియాన్స్ అంతా తిరిగి చూశాడు. మూడు నెలల తర్వాత బ్రూక్లిన్ చేరాడు. ఫ్రీమన్ వారపత్రికకు ఎడిటర్ అయ్యాడు. హోమో సెక్సువల్ అయ్యాడు అమ్మాయిలతో తిరిగాడు. ముప్ఫైవ ఏట కవితాశైలిపై ప్రయోగాలు చేశాడు. ఇది అతనికీ కొత్తా, సాహితీ లోకానికి ఇతనూ కొత్త. స్వేచ్ఛగా, నిబంధనలేని రైమ్స్‌తో రాయటం మొదలుపెట్టాడు. కొంత మిస్టిజం ఉండేది. తన గురించి తన కవిత్వం గురించి చెప్పుకొన్నాడు.

"I am the poet of the body - and I am the poet of the soul - I go with the slaves of the earth equally with masters - and I will stand between the masters and the slaves - I will buoy you up - every room of your house do I fill with armed men - lovers of me, baffles of hell - sleep for, I and they stand guard this night, god and I are now here - speak! what would you have of us". ఇదొక కొత్త గొంతు, కొత్త భావం, కొత్త ఆలోచన. అందర్నీ తనతో తీసుకువెళ్ళే ఆలోచన. అందర్నీ సమానంగా చూసేతత్వం. నోట్ పుస్తకంలో గిలికిన కవితలు పన్నెండిటిని బ్రూక్లిన్ ప్రింట్ షాప్‌లో అచ్చువేశాడు. వీటికి "లీవ్స్ ఆఫ్ గ్రాస్" అని పేరుపెట్టాడు. అమెరికా స్పిరిట్‌తో రాసిన కవితలివి. 1855లో ఇవి లాంగ్‌ఫెలో కవి రాసిన "హైవాత"తో బాటే ప్రింట్ అయ్యాయి. విట్మన్‌తో అమెరికా జాతీయ కవిత్వం ఆవిర్భవించింది. అమెరికా గొంతు వినిపించింది. అమెరికా ఆశయం ప్రతిధ్వనించింది. దీనితో పేరు "వాల్ట్ విట్మన్"గా మార్చుకొన్నాడు. ముఖచిత్రంమీద ఈ మార్పును స్పష్టంగా చూపించాడు. ఎవరికీ భయపడని మనిషిగా, కోటు లేకుండా, చొక్కా పైభాగం ఓపెన్‌గా రంగుల లోపలి చొక్కాతో "పోకిరీ పోజుతో" దర్శనమిచ్చాడు ముఖచిత్రంపై. అప్పటినుండే విట్మన్ లిజేందరి ప్రారంభమైంది.

విట్మన్ లెజెండ్ అయిపోయాడు. దానికోసం అహరహం శ్రమించాడు. రాసినది చిత్రిక పడుతున్నాడు. రాయాల్సిన దానికి ప్రణాళిక తయారు చేసుకొన్నాడు. తనను కూలీల సహచరుడిగా, చదువురాని వారి స్నేహితుడిగా చెప్పుకొన్నాడు. మాస్ ఆడియన్స్‌కు దగ్గరయ్యాడు. వారిలో మమేకమయ్యాడు. ప్రజాస్వామ్య కవిగా దాని విలువల రక్షకుడయ్యాడు. అప్పటిదాకా అమెరికన్లు సామాన్యులతో కలిసి పనిచేయటానికి ఇబ్బంది పడ్డారు. లేబర్‌ని దూరం చేశారు. వారి గురించిన కవిత్వమే రాలేదు. వీరందరినీ భాగస్వాములను చేసి కవిత్వం రాశాడు. కొత్త చరిత్ర సృష్టించాడు. అథో జగత్ సహోదరులకు అండా దండగా నిలిచాడు. ఇవేమీ పట్టించుకోని

విమర్శక గణం అతని తాగుడు, వ్యభిచారం, పొగరుబోతుతనం, పోకిరీ వేషాల గురించే రాశారు కాని కవిత్వం గురించి పట్టించుకోలేదు. తన డబ్బా తానే కొట్టుకొంటున్నాడన్నారు కూడా. అతని కవితలు నిజంగానే గడ్డిపరకలని తొక్కిపారేయ దగ్గవని "అతను సగం మనిషి, సగం జంతువూ" అని ఈసడించారు. అమెరికాలోనే కాదు యూరప్‌లో కూడా. విట్టియర్ కవి లీవ్స్ ఆఫ్ గ్రాస్ పుస్తకాన్ని నిప్పుల్లో వేసి కాలిస్తే, లోవెల్ "హంబగ్" కవిత్వమని కొట్టిపారేశాడు.

అయితే మేధావి, కవి, ఫిలాసఫర్ ఎమర్సన్ మాత్రం ఎంతో మెచ్చుకొన్నాడు. "Dear sir - I am not blind to the worth of the wonderful gift of leaves of grass. I find it the most extraordinary piece of wit and wisdom that America has yet contributed. I am very happy in reading it, as great power makes us happy, I give you the joy of your free and brave thought I find the courage of treatment which so delights us. I greet you at the beginning of a great career" అని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు ఆ యోగి, మహర్షి, కవి, వేదాంతి, ఉత్తమ దేశికుడు. అదే ఆశీర్వాదం అయింది. ఇక విట్మన్ కవితా ప్రవాహానికి అడ్డులేకుండా పోయింది. విమర్శకుల జడివానలు కురుస్తున్నా అప్రతిహతంగా సాగిపోయాడు. "సాంగ్ ఆఫ్ మైసెల్ఫ్"లో "I celebrate myself and sing myself - and what I assume you shall assume - for every atom belonging to me good belongs to you". ఇలా వ్యక్తులతో కలిసిపోయాడు. దీనితో కవితలూ పెరిగాయి. బృహత్ గ్రంథంగా 384 పేజీలతో నూట ఇరవై నాలుగు కవితలతో లీవ్స్ ఆఫ్ గ్రాస్ రూపుదాల్చింది. తొమ్మిదో ఎడిషన్‌లో మరిన్ని కవితలు చేరాయి. ఇంకా విమర్శకులు ఉష్ట్రపక్షి దృక్పథాన్ని పాటించి కళ్ళు మూసుకొంటూనే ఉన్నారు. అయినా ఏదీ ఆగలేదు. ప్రజలు ఎంతో ఇష్టంగా చదివారు ఆదరించారు. తమకొక అన్నయ్యా, తమ్ముడు, మామయ్య, బాబాయి లభించాడని ఊరట చెందారు. బ్రహ్మాండమైన విజయాన్ని సాధించాడు. కాని ఆదాయం రాలేదు. మళ్ళీ జర్నలిజంలో ప్రవేశించాడు.

రాజకీయంగా కలత చెందాడు, స్లేవరిని సమర్థించే వారెక్కువైనారు. బానిసలపై దయా సానుభూతి చూపేవారే కరువైనారు. దీనితో మనసు వికలమైంది విట్మన్‌కు. అమెరికాపై పెట్టుకొన్న ఆశలు అడియాసలయ్యాయి. రాజ్యమే కాదు, మనుషులూ దగా చేశారనుకొన్నాడు. కోపం, ఉద్రేకం పెరిగి ఐరనీతో ఒక కవిత రాశాడు దాన్ని గ్రాస్‌లో చేర్చలేదు. "I pronounce openly for a new distribution of roles - let the sun and moon go - let scenery take the applause of the audience - let there be apathy under the stars" అని ఆవేశంగా ఆలోచనాత్మకంగా కదిలించేలా రాశాడు. డైలీ టైమ్స్‌లో పనిచేశాడు. యుద్ధంలో చేరి పోరాడాలని భావించాడు. ముసలితనం

అడ్డమొచ్చినది. క్వేకర్ భావాలవాడు కనుక, తుపాకి పట్టలేదు. సోదరుడు యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతని సేవ చేశాడు. వాషింగ్‌టన్ అంతా ఒక హాస్పిటల్‌గా మారి క్షతగాత్రుల ఆర్తనాదాలతో మారుమోగిపోతోంది. “హాస్పిటల్ విజిట్స్” పేర ఆర్టికల్స్ రాశాడు. అంగవికలురైన సైనికులకు కట్లు కట్టి విట్మన్ సేవలందించాడు. ప్రతి క్షణం దయా, సానుభూతితో అలుపు లేకుండా సేవ చేశాడు. అందరూ తన వాళ్ళే అనుకొన్నాడు. తన జీతంలో కొంతభాగంతో పొగాకు, స్టాంపులు, తినుబండారాలు, పండ్లు, పాలు, బిస్కట్లు, చాకోలెట్లు, పుస్తకాలు కొని గాయపడిన సైనికులకు ఇచ్చి వారిలో ధైర్యం, ఉత్సాహం, జీవితేచ్ఛ కలిగించేవాడు. ఉత్తరాలు రాసి పెట్టేవాడు. “డ్రం – టాప్స్”లో వీటిని వివరించాడు. కవిత్వంలో మానవత్వాన్ని ఎలిగెత్తి చాటటమే కాదు, దాన్ని ఆచరించి చూపి సాటివారి యెడ ఆత్మీయతానురాగాలను ప్రదర్శించి, సానుభూతితో సేవలందించిన మానవీయ కవి విట్మన్. ఈ సంఘటన తర్వాత అతన్ని బాగా అర్ధం చేసుకొన్నారు. గౌరవ ఆదరాలిచ్చి మెచ్చుకొన్నారు.

అమెరికా ప్రజలు అత్యంత కృతజ్ఞతా భావాన్ని విట్మన్‌పై ప్రదర్శించి అభిమానాన్ని చాటుకొన్నారు. అబ్రహాం లింకన్ కాబినెట్‌లో “ఇండియన్ బ్యూరో ఆఫ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ది ఇంటీరియర్”లో గుమాస్తా ఉద్యోగం దీని ప్రభావం వలననే దొరికింది. ఇంటీరియర్‌కు సెక్రెటరి అయిన జేమ్స్ హార్లాండ్ లీవ్స్ ఆఫ్ గ్రాస్ పుస్తకాన్ని ఒక డ్రాయర్ సొరుగులో చూసి చదివి భయపడి ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తాడేమోనని తొందరపడి ఉద్యోగం తీసేశాడు. దీనికి విట్మన్ స్నేహితులు తీవ్రంగా స్పందించి “గుడ్ గ్రే పోయెట్” పేర కరపత్రం విడుదల చేశారు. ఖంగుతిన్న ప్రభుత్వం తప్పు తెలుసుకొని “అటార్నీ జెనరల్” శాఖకు బదిలీ చేసింది. యాభై మూడవ ఏడు వచ్చేవరకు అందులోనే హాయిగా సెక్యూర్‌గా పనిచేశాడు. తరువాత మళ్ళీ కవి రోడ్డున పడాల్సి వచ్చింది. తను రాసిన పాసేజ్ టు ఇండియా, డెమోక్రాటిక్ విస్టా పుస్తకాలను డాలర్‌కు డెబ్బై అయిదు సెంట్లకు అమ్ముకొని జీవించాడు. మెదడులో ఏదో అలజడి అనుభవించాడు. బహుశా రోగగ్రస్తుల పుండ్లుపు కడిగి డ్రెస్సింగ్ చేయటం వలన బాక్టీరియా తలలోకి ప్రవేశించి ఉండవచ్చునని భావించారు. తల్లి హృదయంతో మగవాడిగా సేవలందించాడు. వాషింగ్‌టన్ అంటే ఇష్టం. అక్కడికి వెళ్లి సైనికులకు సేవలు చేస్తూనే ఉన్నాడు. అందరిని ప్రేమ, దయతో పలకరించి కష్టసుఖాలు తెలుసుకొని సహాయం అందించేవాడు. మాతృహృదయంతో సేవచేస్తున్న ఈ ''గడ్డం కవి''ని చూసి అమితాశ్చర్యపోయారు. చదివి కృతజ్ఞతలు చెప్పారు. విట్మన్ “మగాడుగా మహిళ”గా అందిస్తున్న సేవలకు పులకరించి పోయారు. తన ఆరోగ్యాన్ని గూర్చి గొప్పగా చెప్పుకొని తల్లికి జాబులు రాసేవాడు. తనను “వైల్డ్ బఫెలో” అనుకొనేవాడు. యాభై ఏళ్ళకు “ఈ ముదురు బెండకాయ బ్రహ్మచారికి” పెళ్లి చేసుకోవాలనే ఆలోచన వచ్చింది. తనకూ ఒక కుటుంబం కావాలని

తపించాడు.

తల్లిని సందర్శించిన కొన్ని నెలలకే న్యూజెర్సీలోని కాండెన్‌లో తల్లి చనిపోయింది. హతాశుడయ్యాడు. జార్జి ఇంటిపైభాగాన ఒక గది ఉండటానికి ఇచ్చాడు. కాండెన్‌లో "కామ్"గా ఉంటున్నాడు. ఒక్కసారిగా ముసలివాడైనట్లు కనిపించాడు. డిప్రెషన్, ఫిట్స్‌తో బాధపడ్డాడు. పుస్తకాలను ఎవరూ ప్రింట్ చేయటానికి ముందుకు రానందుకు కుంగిపోయాడు. అదే ఆధారం అనుకొంటే ఇలా అయింది. కొద్దిగా ఆరోగ్యం బాగు అవగానే కొలరాడో వెళ్లి లింకన్‌పై ఉపన్యాసాలిచ్చాడు. "లిలాక్స్ లాస్ట్ ఇన్ ది డోర్‌యార్డ్ బ్లూమేడ్" కవితను "నేటివ్ క్లాసిక్" అని అందరూ కితాబిచ్చారు. అరవై అయిదులో చిన్న దీపం, చుట్టూ న్యూస్‌పేపర్ల మధ్య గడిపాడు. చనిపోయిన సైలర్ భార్య ఇంటిని కనిపెట్టుకొని ఉండేది. అభిమానులు చందాలు పోగుచేసి పంపితే దానితో జీవించాడు. ముప్ఫైమంది శ్రేయోభిలాషులు ఒక గుర్రబ్బండినీ సమకూర్చారు.

అరవై తొమ్మిదిలో పక్షవాత లక్షణాలు కనిపించాయి. కిడ్నీ బాధ ఎక్కువైంది. డెబ్బైవ పుట్టినరోజున ఫిలడెల్ఫియా వెళ్లి లింకన్‌పై ప్రసంగించాడు. చనిపోతున్నా ఓడిపోకుండా ఉంటున్నాడు ఒంటరిగా మేడగదిలో. చనిపోతానని తెలిసి సమాధి నిర్మాణం గురించి ఆలోచించాడు. అప్పగింతలన్నీ పూర్తి చేస్తున్నాడు. డెబ్బై రెండులో చివరి ఎడిషన్‌గా 1891లో లీవ్స్ ఆఫ్ గ్రాస్ ప్రచురించాడు. దీన్నే "డెత్ బెడ్ ఎడిషన్" అన్నారు. మొదట పన్నెండుతో మొదలైన పుస్తకం ఇప్పుడు మూడు వందలకు పైగా కవితలతో బృహత్ రూపంగా "విట్మన్ కవితా విశ్వరూపం"గా అవతరించింది. న్యూమోనియా సోకి 26-03-1892న మానవీయ మహాకవి విట్మన్ మరణించాడు. పెళ్ళికాని బ్రహ్మచారిగానే మిగిలిపోయాడు. విట్మన్ ఫిలాసఫీలో అన్ని కలగా పులగంగా కలిసిపోయాయి. అమెరికాపై రాసిన "సాంగ్ ఆఫ్ ఎక్స్పోజిషన్" ఒక జాతీయ గీతంలాంటిదే. అన్ని రాష్ట్రాలను, అన్ని దేశాలను కలిపాడు. విశ్వ పౌరుడనిపించాడు.

"Whitman became the voice of a rapidly developing civilization. Half idealistic half materialistic sometimes corrupt but ever expanding America"

అమెరికాను అమెరికాగా గుర్తించటానికి చేయాల్సిన ప్రయత్నమంతా చేశాడు. ఇంగ్లీష్ భావదాస్యానికి దూరం చేశాడు. జాతీయ రక్తం ప్రవహింపజేశాడు. ప్రజాస్వామ్య మానవుడి భవితను నిర్దేశించాడు. తను చేస్తున్న పనేమిటో పూర్తి అవగాహన ఉన్నవాడు. "I have allowed the stress of my poems from beginning to end to bear upon American individuality and assist it - not only because that it is a great lesson in nature, amid all her generalizing laws, but as counterpoise to the levelling tendencies of democracy" అని ఆరాటపడిన

దేశభక్త కవి. లీఫ్స్‌లో అతనికల సాకారమైంది. అదొక మాన్యుమెంటల్ బుక్ అయింది. "It is a national phenomenon in which a poet identifies himself not only with a continent but with the cosmos. Uttering the word democratic the word en-masse he sings seemingly of himself but actually of life immence in passion pulse and power - cheerful, for forest action, formed under the laws divine - the modern man I sing" అని ఆధునిక మానవుడి కోసం గీతాలు రాశాడు, గానం చేశాడు. దేశం కోసం తన వీరవిధేయతను ప్రదర్శించాడు. తన "గడ్డిపరకలు" గురించి విట్మన్ ఏం చెప్పాడో తెలుసుకొంటేనే మజా –

"This is no book who touches this, touches a man" అని పొంగిపోయి చెప్పాడు. సాహిత్య చరిత్రలో "పుస్తకాన్ని, మనిషిని ఒకటిగా చేసిన కవి, రచయితా లేనేలేడు." "In it Whitman emerges a titanic and controversial figure - messianic, intuitive and often mistaken, roughhewn and lopsided but unquestionably the most challenging writer of his time and of ours" అని కీర్తి కిరీటం పెట్టారు. ట్రాన్సలిండజం, రియలిజంల మధ్య నిలిచాడు. "The proof of a poet is that his country absorbs him as affectionately as he has absorbed it" అని చెప్పాడు. గడ్డిపరకలు అమెరికన్ మహాకావ్యం అయింది. "Whitman is American poet. He is America" అని మనస్ఫూర్తిగా మెచ్చాడు ఎజ్రా పౌండ్. బీట్ ఉద్యమానికి ప్రతినిధిగా వాగబాండ్‌గా నిలిచాడన్నారు. అతని అనుచరులు "విట్మనైట్స్" అని పిలువబడ్డారు. ఎందరో సంగీతకారులు అతని కవితలకు సంగీతం సమకూర్చి అజరామరం చేశారు.



**కవిత్వంలో ఆత్మాన్వేషణ చేసిన – ఎమిలీ డికిన్సన్**

10-12-1830లో మాసాచుసెట్స్‌లోని ఆంహెర్స్ట్‌లో ఎమిలీ డికెన్సన్ పుట్టింది. తండ్రి గ్రామీణ లాయర్, లెజిస్లేటర్, ప్రభుత్వ కౌన్సిల్ మెంబర్. బాల్యం నుండే తిరుగుబాటు ధోరణి ఉండేది. మౌంట్ హోలీ యెక్‌ఫిమేల్ సేమిటరిలో చేరింది. అక్కడి బోధనా మతపద్ధతిలో ఉండేది. మత గ్రంథాలను అందరూ బట్టిపట్టి చెబితే వాటి అంతరార్ధాన్ని గూర్చి ఆలోచించేది. క్రిస్టియన్ కావటానికి వ్యతిరేకత లేదని ఒకసారి క్లాసులో చెప్పింది. నల్లకళ్ళు, తెల్ల శరీరం, ఒత్తైన జుట్టుతో అందంగా ఉండేది.

యుక్త వయసు రాగానే కవిత్వమే శ్వాస అయింది. ఆమెకు సెక్రెట్ లవర్స్ ఉన్నారని

చరిత్రకారులు రాశారు. ముప్పై రెండేళ్ళ వయసులో థామస్ హిగ్గింసన్‌కు ఉత్తరం రాసి తన మనసులోని ఇద్దరి మగాళ్ళ గురించి తెలిపింది. న్యూటన్ తనకు "అమరత్వం" బోధించాడని అన్నది.

"My life closed twice before its close - it yet remains to see - if immortality unveil - a third event to me" అని మనోభావాన్ని ఎరుక పరచింది. "Angels twice descending - reimbursed my store - burglar banker father - I am poor once more" అని ఎదురుచూసింది. న్యూటన్ చనిపోయిన తర్వాత తండ్రితో వాషింగ్‌టన్, ఫిలడెల్ఫియాలు చూసింది. ఇరవై మూడులో ప్రెస్బిటేరియన్ చర్చిలోని చార్లెస్ వాడ్స్‌వర్త్‌ను ప్రేమించింది. ఆయనకు దేవుడి ధ్యాసేకాని "ఈ దేవీ ధ్యాస" లేదు. ఆంహెర్ట్స్‌కు తిరిగొచ్చి అపస్మారకంగా ఏదేదో రాసి పారేసేది. "I can't live with you - it would be life is over there" మొదలైన కవితలు రాసింది. విరహం భరించలేక "so we must keep apart - you there I here - with just door ajar - that oceans are - and prayer - that pale sustenance - despair" అని నిరాశగా రాసుకొంది. తనను తానూ అంకితం చేసుకొంటానని "I wife at day break I shall be - sunrise, hast thou a flag for me? at midnight I am but a maid - how short it takes to make it bride!" అంటూ వలపు వల విసిరింది.

తండ్రి చనిపోయాడు. అప్పటి నుండి అంటే ఇరవై అయిదు నుండి డికిన్సన్ ఒంటరిగా ఉండిపోయింది. నలభైలో తండ్రి చిరకాల మిత్రుడు, మాసాచుసెట్స్ సుప్రీం కోర్టులో అసోసియేట్ జస్టిస్ అయిన ఓటిస్ పి లార్డ్‌కు సుదీర్ఘ ఉత్తరం రాసింది. 1883 ఆరోగ్యం దెబ్బతిని, శోక దేవతగా సుదీర్ఘ కాలం ఉండటంతో నరాలు బలహీనమై "బ్రైట్స్ డిసీస్" వచ్చి 15-05-1886న యాభై ఆరో ఏట చనిపోయింది. ఆమె చనిపోయిన చాలాకాలానికి కాని రచనలు ప్రచురణ కాలేదు. ఆమె సోదరి లావీనియా అన్ని రాతప్రతులను స్వాధీనపరచుకొంది. పక్కింటి ఆయన మేబల్ టాడ్ సహాయంతో నూటపదిహేను కవితలను లిస్టు రాసి "పోయెమ్స్ ఆఫ్ ఎమిలి డికెన్సన్" పేర 1890లో పబ్లిష్ చేసింది. ఏడాది తర్వాత మరో నూటడెబ్భై ఆరు చేర్చి రెండవ ఎడిషన్‌గా తెచ్చింది. ఎమిలీ ఉత్తరాలను రెండు వాల్యూములుగా తర్వాత తెచ్చారు. ఇవన్నీ సరైన పద్ధతిలో లేవు. ఆమె రాత అర్ధం కాకపోవటం గజిబిజిగా ఉండటంతో సందిగ్ధత వచ్చింది.

లావియానా పక్కింటి టాడ్‌తో స్థలం విషయమై తగాదా పడింది. కోర్ట్ కేసులు వచ్చాయి. ఆమె మరణంతో ఎమిలీ ఆస్థి పాస్తుల్ని మార్తా డికిన్సన్‌కు దక్కాయి. "ది సింగిల్

హౌంద్" పేర ఇదివరకు ప్రచురింపని 143 కవితలు అచ్చేశారు. ఎమిలీ చనిపోయిన యాభై ఏళ్ళకు ఇంకో నూటముప్పై కవితలు దొరికి 1945లో ప్రచురింపబడ్డాయి. 1958 డికిన్సన్ ఆరాధకులు మూడు గ్రంథాలుగా ఆమె వచన సాహిత్యాన్ని వెయ్యి ఉత్తరాలతో సహా ముద్రించారు. వీటితో ఆమె కవితా స్వరూపం తెలుసుకొనే వీలు కలిగింది. ఆమె కవితలు క్రమవిధానంలో ఉండవు. ఆలోచనలూ కొద్దిపాటివే. ఎక్కడో మొదలుపెట్టి ఎక్కడో తేలుతుంది. ఒకదానితో ఒకటి కలిపేస్తుంది. కొన్ని పలుకుబడులు అర్థమవటం కష్టమే.

"The brain is wider than the sky - for put them side by side - the one the other will contain ease, and you beside"



**స్ప్రంగ్ రిథంను ప్రవేశపెట్టిన – జేరాల్డ్ మాన్లి హాప్కిన్స్**

హాప్కిన్ కూడా ఎమిలీ డికెన్సన్‌లాగే చనిపోయిన తర్వాతే వెలుగులోకి వచ్చాడు. ఆధునిక కాలపు పాత ధోరణి కవి. మధ్య తరగతివాడు. శతాబ్దాలుగా రైతులు. గ్రేట్ బ్రిటన్‌లో హవాన్ కౌన్సిల్ జెనరల్‌గా తండ్రి పనిచేశాడు. అనారోగ్యంతో తండ్రి నలభై ఏళ్ళకే చనిపోయాడు. ఎనిమిదో ఏట కుటుంబం హాంప్‌స్టెడ్‌కు మారింది. 28–07–1844లో హాప్కిన్స్ స్ట్రాఫర్డ్ ఎస్సెక్స్‌లో పుట్టాడు. గ్రామర్ స్కూల్‌లో చదివి బిల్లియోల్ కాలేజిలో చేరి ఆస్థాన కవి అయిన రాబర్ట్ బ్రిడ్జెస్ వద్ద చదివాడు. సునాయాసంగా కవితలల్లేవాడు, బొమ్మలేసేవాడు. "Trees by their yield - are known but I - my sap is sealed - my root is dry - if life within - I none can show (except for sin) - nor fruit above - it must be so - I do not love" మొదలైన అందమైన కవితలు రాశాడు. "I have desires to go - where spring not fail - to fields where flies no sharp and sided hail - and a few lilies blow" వంటివి అద్భుతంగా రాశాడు. చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో ఇమడలేక కేథలిక్ అయ్యాడు. చివరి పరీక్ష తర్వాత రోహామ్ప్టన్‌లో "సాహిత్య శాస్త్రం" (రేటారిక్)లో ప్రొఫెసర్ అయ్యాడు. మూడేళ్ళు పనిచేసి ప్రీస్ట్‌హుడ్‌కు సన్నాహంలో ఉన్నాడు. పదేళ్ళు కవిత్వం జోలికే పోలేదు.

పై అధికారి థేమ్స్ నదిలో జర్మన్ స్టీమర్ "డ్యుచ్‌లాండ్" మునిగి ఎందరి ప్రాణాలో నీటిలో కలిసిపోయిన విషాద దృశ్యాన్ని గురించి రాయమంటే మళ్ళీ కలంపట్టి రాశాడు. ఇది వరకు ఎవరూ ఉపయోగించని కొత్త భాషలో, తన జీవితచరిత్రను జోడించి అత్యంత విషాదాత్మక కథనంగా రాశాడు. 1877లో హాప్కిన్స్‌కు ఆర్డినేషన్ జరిగింది. నలభైకే అధిక శ్రమతో

ఆరోగ్యం ఇబ్బంది పెట్టింది. డబ్లిన్ యూనివర్సిటి కాలేజిలో "చైర్ ఆఫ్ క్లాసిక్స్" అధిరోహించాడు. కవిత్వం రాయటమే కష్టమైంది. జీవిత చరమాంకంలోనే గొప్ప కవిత్వం రాశాడు. నలభై అయిదవ ఏట "ఐయాం సో హాపీ" అనుకుంటూ అనాయాసంగా మరణించాడు.

హాప్కిన్స్ చనిపోయిన ముప్ఫై ఏళ్ళకు 1918లో "పోయెమ్స్ ఆఫ్ జేరాల్డ్ మాన్లీ హాప్కిన్స్" పేరిట కొన్ని కవితలను బ్రిడ్జెస్ అనే ఆయన సేకరించి ముద్రించాడు. హాప్కిన్స్ కవిత్వం అంత తేలికగా అర్ధం కాదు. కఠిన పదాలు, అన్వయక్లిష్టత ఇబ్బంది పెడతాయి. 'Or to - fro tender trambeams truckle at the eye" ఇదీ ధోరణి. అలంకారాలను మధ్యలోనే వదిలేసి గందరగోళం సృష్టిస్తాడు. భరించటం కష్టమేననిపిస్తుంది. సాంప్రదాయ కవితను ఇమేజరీతో కలిపి రాశాడు. "స్ప్రుంగ్ రిథం"ను ప్రవేశపెట్టాడు. రొమాంటిక్ – మోడరన్ కవులకు వారధిగా నిలిచాడు.

**ఇరవైయవ శతాబ్ది ఉదయం**

పందొమ్మిదో శతాబ్దం తమాషాగా అంతమైంది. మర్యాద పద్ధతుల్ని అడ్డుకొన్నారు. అనేక భూమికలేర్పడ్డాయి. యువతులు పెద్దలపై తిరుగుబాటు చేశారు. మహిళా వోటు హక్కు ఒక ధ్యేయమైంది. యువకులు నిత్య ప్రార్ధనలకు వెళ్ళేవారు కాదు. "ది సావాయ్", "ది ఎల్లో బుక్" అనే రెండు మేగజైన్లు ఈ హక్కులకు వేదికగా నిలిచాయి. ఎర్నెస్ట్ డౌసన్ అనే కవి తెగ తాగి ముప్ఫైమూడుకే చచ్చాడు. లిఒనేల్ జాన్సన్ అనారోగ్యంతో ముప్ఫై అయిదేళ్ళకే పోయాడు. జాన్ డేవిడ్ సన్ తిరస్కరణకు గురై యాభై అయిదులో ఆత్మహత్య చేసుకొన్నాడు. రచయితా ఆర్ధర్ సిమాన్స్ మాత్రం ఎనభై దాకా జీవించి నాటకాలు, కవితలు రాసి సెన్సేషన్ సృష్టించాడు. ఆస్కార్ వైల్డ్ యాభై ఆరులో జైలుపాలై రెండేళ్ళ తర్వాత రచనాలోకం నుండి నిష్క్రమించాడు.

వీరికి ఒక ధ్యేయం లేదు. జీవిత సూత్రం లేదు. అయితే "కళకళ కోసమే" అని మాత్రం నినదించారు. గిల్బర్ట్ మాత్రం ఒక కన్ను బ్రిటిష్ ప్రజలమీద రెండో కన్ను ఫ్రెంచ్ వాళ్ళపై ముద్ర వేయటం పైనా ఉంచాడు. లండన్ ఇనుప కచ్చడాల మధ్య నలిగింది. దీన్నే "ఫాల్లెన్ మాగ్దలేన్సేస్" అన్నారు. విక్టోరియన్ శకం ముగింపుకొచ్చింది. ఏ బాల్ రూమ్‌కు వెళ్ళినా అరడజను మంది చెట్టాపట్టాలేసుకొని సానేట్స్ పాడుకొంటూ కనిపించారు. ఇంగ్లీష్ యువకులు ఫ్రెంచ్ పార్నాసియాన్‌లను అనుకరించారు. పతనమైపోతున్న సంస్కృతికి అద్దం పట్టింది. "Fin de siecle" అని దీనికి పేరుపెట్టారు. క్షీణ సంస్కృతి అనవచ్చు. "A swan song and a death bed repentence" అని వాపోయారు. దింపుడు కళ్ళం ఆశ అన్నమాట. పదేళ్ళు ప్రభావం చూపిన ఆస్కార్ వైల్డ్ ఒక అభియోగంలో ఇరుక్కోగా అతని

"ఈస్తటిక్ ఉద్యమం" పతనమైపోవటానికి సిద్ధమైంది. గిల్బర్ట్ రాసిన "పెషేన్స్"లోని సెటైర్లు,రాబర్ట్ హిచిన్సన్ రాసిన "గ్రీన్ కార్నేషన్" చావు దెబ్బలే కొట్టాయి. జీవితం అస్తవ్యస్తమై విపరీత ధోరణులకు నిలయమైపోయింది.

ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలోనూ సంస్కృతిలో ద్వంద్వ ధోరణులు వచ్చాయి. కొత్త ఆలోచనలు, భావాలు చెప్పటంలో నూతనత్వం ఒక ప్రక్కన, పాత పద్ధతులే శరణ్యం అని మరో ప్రక్కన దృక్పధాలేర్పడ్డాయి. ఒకే వ్యక్తి ఈ రెండిటిలోనూ నిష్ణాతుడై రాసిన వారున్నారు. కొందరు ఒకేదాన్ని పట్టుకు పాకులాడారు. విధాన భేదాలేర్పడ్డాయి. "The proper school to learn art in is not life but art" అన్నాడు ఆస్కార్ వైల్డ్. కాని ఆర్థర్ సిమాన్స్ మాత్రం "Life and nature were merely the crude materials which were to be woven cunningly into beautiful patterns" అని చెప్పాడు. ఈ భిన్న పాయలలో సాహిత్యం ప్రయాణించింది. ఫ్రాన్సిస్ థామస్ మాత్రం సనాతన భగవదన్వేషణలో మునిగిపోయి కవిత్వం రాశాడు. ఆయన్ను గురించే మనం తర్వాత తెలుసుకోబోతున్నాం.



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 47**

# ఫ్రాన్సిస్ థామ్సన్

**రో**మన్ కేథలిక్‌గా 18-12-1859న జన్మించి మాంచెస్టర్‌లోని ఓవెన్స్ కాలేజిలో చేరి ఇష్టంలేక, సరిగ్గా చదవక, తప్పి లండన్ వెళ్ళాడు. అక్కడా జ్యేష్ఠా దేవే ఎదురైంది. అగ్గిపెట్టెలు దగ్గర నుంచీ అన్నీ అమ్మాడు. బీదరికంతో కుంగిపోయాడు. కవిత్వమే భిక్ష పెట్టాలి అనుకొని దిగాడు. రాసుకోవటానికి పేపర్లూ కూడా కొనుక్కోలేని దరిద్రం. తండ్రి బ్రిటిష్ మ్యూజియంలోని రీడింగ్ రూమ్‌కు అప్పుడప్పుడు డబ్బులు పంపుతున్నా అతని మురికి బట్టలు, వాలకం చూసి లోపలి అనుమతించేవారు కాదు. అక్కడే బయట అరుగుల మీద పడుకొంటుంటే ఒక వేశ్య దయతలచి ఇంటికి తీసుకొని వెళ్ళి అన్ని సమకూర్చి సహాయం చేసింది. ఆమె దయతో బతుకుతూ కూడా నిర్లక్ష్యంగా డబ్బు తగలేస్తూ నల్లమందుకు అలవాటు పడ్డాడు.

"మెర్రీ ఇంగ్లాండ్" పేపర్‌కు అప్పటికే కవిత రాసి పంపాడు. వేసుకోవటానికి ఎడిటర్ ఇష్టపడి లెటర్ పంపిస్తే అప్పటికే ఇల్లు మార్చటం వలన అందుకోలేకపోయాడు. చివరికి పేపర్‌వాళ్ళే అడ్రస్ కనుక్కొని ఎడిటోరియల్ ఆఫీసుకు వచ్చి మాట్లాడమన్నారు. చినిగిన బూట్లు, షర్ట్ లేకుండా పైన వేసుకొన్న మురికి కోటుతో వెళ్ళాడు. మత్తుమందు మానెయ్యమని చెప్పి ఉద్యోగం ఇచ్చారు. పందొమ్మిదేళ్ళు అందులోనే పనిచేసి బతికాడు. ఎడిటర్ విల్ఫ్రిడ్ మేనెల్ అతని భార్య రచయిత్రి అయిన ఆలిస్ మేనెల్‌లు థామ్సన్ రాసిన కవితల మొదటి సంపుటిని ముద్రించారు. బాగా ప్రోత్సాహం లభించింది. షెల్లీ రాసిన హౌన్డ్ ఆఫ్ హెవెన్స్‌పై గొప్ప వ్యాసం రాశాడు. "సిస్టర్ సాంగ్స్" రెండవ పుస్తకంగా వచ్చింది. దీనిని మేనెల్ పిల్లలకు అంకితమిచ్చాడు. చాలా జర్నల్స్‌కు వ్యాసాలు రాశాడు. "హెల్త్ అండ్ హోలినేస్"పై రాయటానికి ఎక్కువ ఇష్టపడ్డాడు. "I would be the poet of the return to god" అని చెప్పుకొన్నాడు. అమాయకత్వం, పసి మనస్తత్వంతో రాసేవాడు. "ది కింగ్డం ఆఫ్ గాడ్ ఈజ్

విథిన్ యు" కవితకు మంచిపేరు.

"O world invisible, we view thee - o world intangible, we touch thee - o world unknowable, we know thee - inapprehensible, we clutch thee - yea, in the night, my soul, my daughter - cry - clinging heaven by the hems - and lo Christ walking on the water - not of Gennesareth, but Thames"

**ఏ.యి.హౌస్మన్**



"ఏ ష్రోప్‌షైర్ లాడ్" అనే నిరాశాజనక కవిత రాసి ఫిట్జెరాల్డ్‌తో సమాన ప్రాముఖ్యం సంపాదించిన అల్ఫ్రెడ్ ఎడ్వర్డ్ హౌస్మన్ 26-03-1859లో వార్సెస్టర్ షైర్లోని బ్రూమస్ గ్రోవ్‌లో పుట్టాడు. వయసుకంటే చిన్నగా కనిపించేవాడు. అందుకే స్నేహితులు "చిట్టెలుక" (మౌసీ) అని పిలిచేవారు. తలిదండ్రులు బాగా పలుకుబడి ఉన్నవారు. ఆక్స్‌ఫర్డ్ సెయింట్ జాన్ కాలేజిలో చేరటానికి స్కాలర్‌షిప్ వచ్చింది. అప్పటికే గ్రీకు, లాటిన్‌లో ప్రజ్ఞ ఉండేది. హిస్టరీ, ఫిలాసఫీలపై మోజు లేదు. చదువు చెప్పాలనే కోరిక ఉండేది. డిగ్రీ పూర్తిచేయలేదు. కనుక యూనివర్సిటి ప్రవేశం జరగలేదు.

లండన్ వెళ్లి పేటెంట్ ఆఫీస్‌లో చిన్న గుమాస్తా అయ్యాడు. జీతం తక్కువ క్లాసిక్స్ చదివాడు. పదకొండేళ్ళు నిరంతర శ్రమ చేసి అనుకొన్నది సాధించి లండన్ యూనివర్సిటి కాలేజిలో లాటిన్ ప్రొఫెసర్ అయ్యాడు. పందొమ్మిదేళ్ళు పనిచేసి కేంబ్రిడ్జి ట్రినిటి కాలేజిలో "చైర్ ఆఫ్ లాటిన్" పొందాడు. లండన్‌లో ఉన్న కాలాన్ని దారుణ కాలం అన్నాడు. జాక్సన్ భావాలకు పూర్తి విరుద్ధంగా ఉండేవాడు. తన కవిత్వానికి క్లాసికల్ ఆరిజన్ ఉంది అంటే ఒప్పుకోలేదు. లాడ్ రాసిన చాలా కాలానికి కాని ఏదీ రాయకపోవటానికి తానూ కవిని కాదని లాటిన్ ప్రొఫెసర్‌నని చెప్పాడు. ముప్పై ఆరేళ్ళ తర్వాత పోయెమ్స్ పేరిట రెండో పుస్తకం తెచ్చాడు. చనిపోయిన తర్వాత "మోర్ పోయెమ్స్", "ఎడిషనల్ పోయెమ్స్" ముద్రించారు. చివరి పాతికేళ్ళు కవిత్వం రాయలేదు. ఎనభై ఆరేళ్ళ వయసులో 03-04-1936న మరణించాడు.

**జంగిల్ బుక్ రచయిత - రుడ్యార్డ్ కిప్లింగ్**

వచనమే రాసి కవిత్వం తక్కువ రాసినవాడు రుడ్యార్డ్ కిప్లింగ్. 30-12-1865



ఇండియాలోని బొంబాయ్‌లో పుట్టాడు. మెథడిస్ట్ కుటుంబం. ఆరో ఏట ఇంగ్లాండ్ వెళ్ళాడు. నార్త్ డేవాన్‌లో వెస్ట్‌వార్డ్‌లో చదివాడు. స్కూల్ మేగజైన్‌కు రచనలు చేసేవాడు. యూనివర్సిటిలో చేరకుండా ఇండియా తిరిగి వచ్చేశాడు. లాహోర్ సివిల్ అండ్ మిలిటరీ గెజెట్‌కు సహాయ సంపాదకుడుగా పదిహేడవ ఏట చేరాడు. "డిపార్టమెంటల్ డిట్టీస్" అనే మొదటి పుస్తకం రాశాడు. ఇరవై రెండులో "ప్లైన్ టేల్స్ ఫ్రం ది హిల్స్" రాసి, ఆరు భాగాలుగా చిన్న కథలు ప్రచురించి ప్రపంచానికి భారత దేశాన్ని పరిచయం చేశాడు. "అండర్ ది దేవదార్స్", "సోల్జేర్స్ ట్రీ"లతో డికెన్స్‌తో సమానంగా విభిన్న పాత్రలను సృష్టించాడు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించటం కిప్లింగ్ గొప్పతనం. "జంగిల్ బుక్", "కిం" కథలు సంచలనం సృష్టించాయి. "బారక్ రూమ్ బాలడ్స్", "ది ఫైవ్ నేషన్స్" కవితలు రాసి ప్రచురించాడు.

ఇరవై ఒకటిలో మళ్ళీ ఇంగ్లాండ్ వెళ్ళి లండన్ చేరి కవితలు కథలతో లండన్‌ను జయించేశాడు. ఇరవై ఏడుకే ప్రసిద్ధ రచయిత అయ్యాడు. ప్రపంచ పర్యటన చేసి "ది నాలహ్కా" రాసి అమెరికాలోని వెర్మాంట్‌లో ఉన్నాడు. ఇంకా ఉండిపోయేవాడే కాని బామ్మర్దితో తగాదా వల్ల ఇంగ్లాండ్ వెళ్ళాల్సి వచ్చింది. సాంఘిక వ్యతిరేకి అయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో కొడుకు చనిపోయారు. సనెక్స్ విలేజ్‌లో ఒంటరి జీవితం గడిపాడు దు:ఖంలో. అయిదవ జార్జి రాజుకు ఉపన్యాసాలు రాసేవాడు. తరువాత రాసినవన్నీ ఇంపీరియలిజం భావాలతో రాశాడు. విధి క్రమశిక్షణ, అధికారం, విధేయతలను శాసించాడు. లార్డ్‌లు, పై తరగతి వాళ్ళతోనే ఉండేవాడు. సామాన్యుల గోడు పట్టేదికాదు. ఇండియాలో మధ్యతరగతి వారు చదువుకొని పైకి ఎదగటం సహించలేకపోయేవాడు. తెల్లజాతి ఉత్కృష్టతనే ఎప్పుడూ పొగిడేవాడు. ఫాసిజం భావాలు నరనరానా జీర్ణించుకుపోయిన రరచయిత కిప్లింగ్. అందుకే బెర్నార్డ్ షా "He never grew up - he began by being behind the times" అని దెబ్బ కొట్టాడు. విక్టోరియా రాణి డైమండ్ జూబ్లీ ఉత్సవాలలో ఆంగ్ల సామ్రాజ్యం జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందని హెచ్చరించాడు.

క్రమంగా కిప్లింగ్ ప్రాభవం తగ్గిపోయింది. "పోస్థమస్ ఆథర్" (చనిపోయిన రచయిత) అనిపించుకొన్నాడు. "ది లైట్ దట్ ఫైల్డ్" అనే శీర్షికతో "The forgotten man in English literature" అని ఆయన అరవయ్యవ ఏట పత్రికలూ, ఎడిటోరియల్స్ రాశాయి. స్వీయ జీవితచరిత్రగా "సమ్‌థింగ్ ఆఫ్ మై సెల్ఫ్" రాసి, ప్రచురించిన కొద్దికాలానికే డెబ్భైవ పుట్టిన రోజు తర్వాత కిప్లింగ్ కాలగర్భంలో కలిసిపోయాడు.

ఆయన్ను "జాతీయ పొగరుబోతు" అన్నారు. ఆయన కాలం అంతా బ్రిడ్జిల నిర్మాణం

స్టీం ఇంజిన్ ప్రాభవం, వైర్లెస్ సృష్టితో ఆధునికత తాండవించింది. కిప్లింగ్ సైనిక పద ఘట్టనల పైనా, నావికుల పాటల మీదా, ఇంజినీర్ల పనులపైనా కవితలల్లాడు. కాని అతని సమకాలికులు మాత్రం "His triumph was the triumph of the Philistine, that he could never appreciate the romantic spirit" అని తేల్చి పారేశారు. "ఎక్స్‌ప్రెస్ ట్రైన్"ను "Confound Romance - and all unseen - Romance brought up the nine fifteen" అని కిప్లింగ్ రాశాడు.

ఇంగ్లీష్ షార్ట్ స్టోరీ రచయితలలో కిప్లింగ్ మొదటితరం వాడు. గొప్ప బాలడ్ మేకర్. "Full bodied and active verse that kipling excels" అని ఇలియట్ కవి భావించాడు. "దుర్గా దిన్", "డాన్నీ దీవార్" కవితలను ఫుల్ జోష్‌తో రాశాడు. కిప్లింగ్ కవితల కిప్లింగులు సాధారణంగా జానపద పాటలుగా ఉంటాయి. స్కౌట్ ఉద్యమానికి సాయం చేశాడు. దాని నిర్మాత బేడెన్ పావెల్, కిప్లింగ్ రాసిన జంగిల్ బుక్‌లోని అనేక వాక్యాలను ఉదాహరించాడు. నెహ్రూ "కిం" తన ఫేవరేట్ రచన అన్నాడు.

**మొదటి నోబెల్ బహుమతి పొందిన ఐర్లాండ్ కవి – విలియం బట్లర్ ఏట్స్**



కవి, నాటక రచయితా అయిన విలియం బట్లర్ ఏట్స్ ఐర్లాండ్‌లో డబ్లిన్‌లోని శాండీమౌంట్‌లో ప్రోటెస్టంట్‌గా 13-06-1865న పుట్టాడు. తాత ముత్తాతలు ఆంగ్లికన్ మినిస్టర్లు. తండ్రి జాన్ బట్లర్ యేట్స్ కళాకారుడే కాక రాయల్ హైబెర్నియాన్ అకాడెమి సభ్యుడు కూడా. ఐరిష్ రివైవల్ సాహిత్యంను ముద్రించిన కువాలా ప్రెస్ వీరి బంధువులదే. సోదరుడు జాక్ ల్యాండ్‌స్కేప్ పెయింటర్. చిన్నప్పుడే కుటుంబం లండన్ చేరింది. తల్లి పుట్టిల్లు కౌంటే స్లిగోలో. వేసవిలో క్లాసులకు వెళ్ళేవాడు. అది అడవీ ప్రాంతం. గాలిక్ ఫాంటసికి నిలయం. డబ్లిన్ మెట్రోపాలిటన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో చేరి టర్నర్ శైలిలో బొమ్మలు తయారు చేశాడు.

ఇరవై ఒకటిలో మొదటి పుస్తకం "మోసడా" రాసి అచ్చేశాడు. లండన్ వచ్చి ఎర్నెస్ట్ రాయితో కలిసి "రైమేర్స్ క్లబ్" ఏర్పరచాడు. ఇది ఫ్రెంచ్ సిమ్లిజం మొదలైన ఆధునిక టెక్నిక్‌ల గురించి ఆలోచించేది. డబ్బులు లేక గుర్రం మీద వెళ్ళలేక నడిచి డబ్లిన్ నుండి లండన్ చేరేవాడినని రాసుకొన్నాడు. తన జీవిత చరిత్రలో తానొక కొత్తమతాన్ని కవిత్వం ఆధారంగా నిర్మించానని చెప్పాడు. ఇది సగం ఊహ, సగం గారడీ. చివరకు థియాసఫిస్ట్ అయ్యాడు. మేడం బ్లావట్స్కీ అనుచరుడుగా పేరు పొందాడు. దెయ్యాలను పిలవటం, మాట్లాడించటంలో సిద్ధహస్తుడనిపించాడు. కాని అసలైన ఫిలాసఫీ ఏమిటో తెలిసేదికాదు.

అంత:కరణ విలువ అర్ధం కాలేదు.

సిగ్గుపడే మనస్తత్వం. "హేర్మటిక్ స్టూడెంట్స్ ఆఫ్ ది గోల్డెన్ డాన్" బృందంలో చేరాడు. ఇందులో మాయలు, మంత్రాలు, మాజిక్ ఎక్కువ. కవిత్వమే మార్గమని తెలుసుకొన్నాడు. సెల్టిక్ రివైవల్‌లో చేరేనాటికి ఏట్స్ స్పిరిటిస్ట్, నేషనలిస్ట్ అనిపించాడు. అప్పుడే ఐర్లలాండ్‌లో రెండు ఉద్యమాలు మొదలైనాయి. మొదటిది "గేలిక్ లీగ్", ప్రాచీన ఐరిష్ సాహిత్యాన్ని అధ్యయనం చేయటం, గేలిక్‌ను జాతిభాషగా చేయటం వీరి ధ్యేయం. సహకార వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించి జీవన స్థితిగతులను మెరుగుపరచటం రెండోది. వీటితో జాతీయ సాంస్కృతి పునర్ వైభవం పొందింది. కమ్యూనిస్టులు, జానపదులు, విద్యావేత్తలు, కవులు, రచయితలూ అంతా కలిసి వచ్చి ఉద్యమాలను నడిపి అనుకొన్నవి సాధించారు. జార్జి రసెల్ "ఏ.యి" అనే మారు పేరుతో కవితలు రాశాడు. ఉద్యమం ఊపు అందుకోగానే నిర్వాహకులు రాడికల్స్‌గా మారిపోయారు. ద్వేషాలు పెరిగాయి. ఐరిక్ పునరుద్ధానం విప్లవంతో ముగిసింది. కవుల రక్తంతో నూతన ఫ్రీ ఐర్లాండ్ జన్మించింది. గేలిక్ లీగ్ వ్యవస్థాపకుడు డగ్లాప్ హైడ్ అనే కవి ఐర్లాండ్ మొదటి ప్రెసిడెంట్ అయ్యాడు.

ఈ ఉద్యమ కార్యక్రమాలకు ఐరిష్ లిటరరీ థియేటర్ వేదిక అయింది. దీనితో మన కవి యేట్స్‌కూ పాత్ర ఉంది. మాడేగొన్నె అనే అందమైన అమ్మాయి ప్రేమలో పడిపోయాడు. ఉద్యమంలో ఆమె "ఫైర్ బ్రాండ్" పాత్ర వహించింది. ఈ విజయంతో "కేతలీన్‌ని హౌలిహాన్" నాటకాన్ని దేశభక్తి ప్రధానంగా రాసి, అందులో కేతలీన్ అనే యువతి త్యాగాన్ని, ధైర్యాన్ని, సాహసాన్ని, ఉద్యమం నడిపిన తీరును గొప్పగా ప్రదర్శించి అందరి మెప్పు పొందాడు. ముప్ఫైకే ఆరు పుస్తకాలు రాసి ప్రచురించాడు. కొద్ది ప్రతీకలు మాత్రమే వాడాడు. క్రమంగా సంపూర్ణ కవిగా రూపొందాడు. యాభై వచ్చేసరికి సెంటిమెంట్‌ను, అలంకారాలను వదిలించుకొన్నాడు. ఐర్లాండ్ రాజకీయ సంక్షోభమూ దానికి కారణమైంది. 1913లో "Romantic Ireland is dead and gone - it is with o Leary in the grave" అని ప్రకటించాడు. "రేస్పాన్సి బిలిటీస్" పుస్తకం పేరులో నుంచే ఈ మార్పును తెలియజేసి ప్రజా కవిత్వం రాశాడు. "ఏ కోట్" అనే కవితలో "I made my song a coat - covered with embroideries - out of old mythologies" అని ధ్యేయాన్ని ప్రకటించాడు. ఆయన రాసిన "The fools caught it - wore it in the world's eyes - as though they, d wrought it" అన్న పంక్తుల్ని పదేపదే చదివారు జనం. తర్వాత దీన్నీ కాదనుకొన్నాడు. "ఎస్పేస్" రాసి ప్రజల్లో ఉన్న నమ్మకాలు, పాత విధానాలు ఐర్లాండ్‌లో రొమాంటిక్ కవితలు ప్రభవిల్లిన నేపధ్యంపై రాశాడు. "ది వైల్డ్ స్వాన్స్ ఎట్ కూలే"లో మానసిక వాస్తవాలను చెప్పాడు. తర్వాత అయిదేళ్లకు "లేటర్ పోయెమ్స్" ప్రచురించాడు.

క్రమంగా మంత్రాలు, మాజిక్ తంత్రాలవైపు మళ్లాడు. సూపర్ నేచురలిజం వైపు కదిలాడు. "సియాన్స్"కు వెళ్ళాడు. ఈ అన్వేషణలో జార్జీ హైడ్‌లీని చూసి ఆరేళ్ళు ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. ఆమెతో కలిసి "ఆటోమేటిక్ రైటింగ్ కమ్యూనికేటర్లు డిక్టేట్ చేస్తుండగా "ప్రాక్టీస్" చేశాడు. దీని ఫలితంగా "ఏ విజన్" రాసి అరవైలో ముద్రించాడు. డెబ్భై రెండులో కొంత మార్చి మళ్ళీ ప్రింట్ చేశాడు. "To me it means a last act of defence against the chaos of the world" అని అదే పరిష్కారంగా నమ్మినట్లు చెప్పాడు. రెండవ ఎడిషన్ వచ్చేసరికే ఏట్స్ గొప్ప గౌరవం పొందాడు. ఐరిష్ ఫ్రీ స్టేట్‌కు ఆరేళ్ళు సెనేటర్‌గా ఉన్నాడు. 1923లో సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందాడు. ప్రపంచ ప్రసిద్ధ కవి అయ్యాడు. యాభైవ ఏట నుంచి రాసిన కవిత్వం అంతా సుప్రసిద్ధమైంది. కవిత్వంలో స్పష్టత, మేలిమి, సాధికారత సాధించాడు. ఊహా ప్రపంచం ఫైరీలాండ్‌ను వదిలేసి వాస్తవ ప్రజలకోసం, వారి అభిప్రాయాలకోసం అనుభవాన్ని రంగరించి రాశాడు. "In the whole man - blood imagination, intellect running together, I am content to follow to its source every event in action or in thought" అని నిజాయితీగా చెప్పుకొన్నాడు. "ఏ డైలాగ్ ఆఫ్ సెల్ఫ్ అండ్ సోల్" కవితలో "When such as I cast out remorse - so great a sweetness flows into the breast - we must laugh and we must sing - we are blest by every thing - every thing we look upon is blest" అని కమ్మని భావధార పొంగించాడు. రాసిన ప్రతి కవితనూ తిరిగి రాస్తూ సానబెడుతూ తీర్చిదిద్దాడు. ఏట్స్‌కు కవిత్వం ఆసుధారగా వచ్చేస్తుంది అదీ ఆయన ప్రత్యేకత. ఫాసిస్ట్ కాదు కాని ఫ్యూడల్ భావాలున్నవాడు. ఐర్లాండ్‌కు దూరంగా ఇటాలియన్ రెవెరిలోని రాపెల్లోలో చివరి రోజులు గడిపాడు. చివరిదాకా రాస్తున్నా చివరి ముఖ్య గ్రంథం "బైజాంటియం". ఇందులో యేట్స్ కవిత పరవళ్ళు తొక్కింది. సృజనలో, ప్రతీకలు ఎంచుకోవటంలో అంతా నవ్యత కనిపించి ఉత్కృష్ట రచన అనిపిస్తుంది.

డెబ్భై దాటిన తర్వాత బలహీనపడ్డాడు. బతకటం కంటే చావే మేలనిపించేది. 1938 శీతాకాలాన్ని భరించలేకపోయాడు. న్యాయంగా అదేమంత చలికాదు కాని శరీరం తట్టుకోలేక బ్రేక్‌డౌన్ వచ్చి కోమాలోకి వెళ్లి గుండె ఆగి 28-01-1939న నైస్‌లోని రాక్‌బర్న్‌లో యేట్స్ చనిపోయాడు. రాసిన నాటకాలపై జనం దృష్టి ఇప్పుడు లేకపోయినా కవిత్వాన్ని ఇంకా ఆరాధిస్తున్నారు. చనిపోయిన పన్నెండేళ్ళకు "ది పెర్మనేన్స్ ఆఫ్ యేట్స్" అనే పుస్తకాన్ని ఇరవై నలుగురు విమర్శకుల వ్యాసాలతో ప్రచురించి ఘన నివాళి సమర్పించారు. "We no longer listen to the half conscious music of a trance but to the deliberate and uncompromising note of truth" అంటూ శ్రద్ధాంజలి

ఘటించారు. Nobel Committee described as "inspired poetry, which in a highly artistic form gives expression to the spirit of a whole nation"అని మెచ్చింది. రవీంద్రుని గీతాంజలి ఆంగ్ల అనువాదానికి యేట్స్ ముందు మాట రాశాడు. సంప్రదాయ కవిత్వంలో మేటి. చరిత్ర పునరావృత్తం అవుతుందని నమ్మేవాడు. అందుకే "That his age represented the end of the cycle that began with the rise of Christianity" అని చెప్పుకున్నాడు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 48

# అమెరికాలో కొత్త ధోరణులు

ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో అమెరికా చివరి సరిహద్దును నిర్ణయించి సాహసోపేత అన్వేషణకు దారి తీసింది 1920లో ప్రెసిడెంట్ కాల్విన్ కూలిడ్జ్. "THE BUSINESS OF AMERICAN DEMOCRACY IS BUSINESS" అని స్పష్టంగా చెప్పాడు. జాతీయ వాణిజ్యం అత్యంత నిర్మాణాత్మక ఆదర్శం అనీ చెప్పాడు. రాజకీయ నాయకులు ప్రభుత్వ ఆస్తులపై బాంకుల నిండా డబ్బు దాచుకొంటే గుమాస్తాలు, మిలియనీర్లు అయిపోయారు ఒకేఒక్క రాత్రిలో. ఇది ఆదర్శానికి విరుద్ధం అని వాపోయారు కొందరు. అలాంటి వారిలో ఎడ్విన్ ఆర్లింగ్‌టన్ రాబిన్సన్ ఒకడు.

### సానేట్లకు సానబెట్టిన - ఎడ్విన్ ఆర్లింగ్‌టన్ రాబిన్‌సన్

అమెరికాలోని మెయిన్ రాష్ట్రంలో హెడ్ టైడ్‌లో 22-12-1869న రాబిన్సన్ జన్మించాడు. తండ్రి ధాన్యవ్యాపారి. బాంక్ డైరెక్టర్. పుట్టిన ఏడాదికే గార్డినర్‌కు వెళ్ళిపోయారు. వేలాది జనాభా, ఉత్పత్తులకు కేంద్రం అయిన ఇక్కడే తన భవిష్యత్తు తేల్చుకోవాలనుకొన్నాడు. అందరిని తోసుకొని ముందుకు వెళ్ళలేననిపించింది. ఒంటరితనం బాధించినా వ్యక్తిత్వం పెంచుకోవటానికి అవకాశం కలిగింది. రచయిత కావాలనే ఉద్దేశ్యంతో హార్వర్డ్‌లో చేరి దాని మేగజైన్‌కు డజను కవితలు రాస్తే తిరస్కరించారు. రెండేళ్ళ తర్వాత మిల్లులు మూతపడ్డాయి, బాంకులు దివాలా తీశాయి. నలభై లక్షల మంది ఉపాధి కోల్పోయి వీధినపడి ఉద్యమించారు.

బాల్యంలోనే "మాస్టాయిడ్ ఇన్ఫెక్షన్" సోకి చెవి, ఎముకలు బలహీనమై చెవులు వినిపించవేమోనని బాధపడ్డాడు. కళ్ళు కూడా సరిగ్గా కనిపించేవి కావు. ఎవరిమీదో ఆధార పడుతున్నాననే భావమూ దెబ్బ తీస్తోంది. ప్రపంచం అంటే భయపడుతున్నాడు. "లిప్పిన్ కోట్" మేగజైన్‌లో కవిత అచ్చు అయి డబ్బు లిస్తే యెగిరి గంతేశాడు. పోపై కవిత రాశాడు.

"ది టారెంట్ అండ్ ది నైట్ బిఫోర్" అనే పేరుపెట్టి వంద పేజీలు రాసి రెండుసార్లు పంపితే తిరస్కారానికి గురైంది. చివరికి "రివర్ సైడ్ ప్రెస్"కు సంబంధించిన బంధువు రహస్యంగా మూడొందల కాపీలు యాభై రెండు డాలర్లకు ముద్రించి అమ్మాడు. బాగానే అమ్ముడుపోయి కొంత పేరొచ్చింది. వానిటి పబ్లిషర్ కొత్త ఎడిషన్ బాగా వేస్తానని ముందుకొచ్చి కొన్ని కవితలు చేర్చి కొన్ని తీసేసి పబ్లిష్ చేశాడు. "ది చిల్డ్రెన్ ఆఫ్ ది నైట్" అనే పోర్ట్రెట్ పుస్తకం 1897లో తెచ్చాడు. ఎక్కువకాలం బతకను అని తెలుసుకొని రాయటానికి తొందర పడ్డాడు. వంద డాలర్లతో న్యూయార్క్ చేరాడు. అక్కడి పబ్లిషర్ల చుట్టూ తిరిగినా ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఇతను ఒక పుస్తకాల షాపువాడో, టీచరో అనుకొన్నారు. కాని రచయితగా గుర్తించలేదు. డబ్బులేదు పర్సనాలిటి లేదు. స్నేహితులు మృగ్యం. కనుక కవిత్వంతోనే జీవించాలని నిర్ణయించుకొన్నాడు. ఒక దీర్ఘ కవిత రాస్తే ఒక పబ్లిషర్ తీసుకొని రాతప్రతి పోగొట్టాడు. దీన్ని ఒక వేశ్యావాటికలో ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్ వదిలేస్తే దాన్ని తీసుకొని మూడవ పుస్తకంగా "కెప్టెన్ క్రైగ్"గా ప్రచురించాడు. దీనికి ఏడు డాలర్లు పొందాడు. ఇదే తొలి సంపాదన కవిత్వం మీద. హోటల్‌లలో ఫ్రీ లంచ్ మీద, మిగిలిన వారి దయా దాక్షిణ్యాల మీద బతికాడు. అద్దె చెల్లించటానికి న్యూయార్క్ సబ్‌వేలో పనిచేసి గంటకు ఇరవై సెంట్లు సంపాదించాడు. అదొక నరక కూపం.

వింటర్‌లో చలికి తట్టుకోలేకపోయాడు. ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ కొడుకులు తండ్రికి రాబిన్సన్ రాసిన పుస్తకాన్ని ఇస్తే, దయ తలిచి న్యూయార్క్ కష్టం హౌస్‌లో చిన్న ఉద్యోగం ఇచ్చాడు. ఏడాదికి రెండువేల డాలర్ల జీతం. స్నేహితుడికి జాబు రాస్తూ తనకు కవిత్వం రాయటానికి కొత్త బూట్లు కొనుక్కోవటానికి సరిపడా డబ్బు వస్తోందని చెప్పాడు. నలభైవ ఏట రూజ్‌వెల్ట్ పదవి అయిపోయినప్పుడు ఉద్యోగం వూడింది. బోహీమియన్ స్నేహితుల నుండి డబ్బు అప్పుగా తీసుకొన్నాడు. మరోసారి అదృష్టం తలుపు తట్టింది. కవి, విమర్శకుడు రాబిన్సన్ జీవిత చరిత్రకారుడు అయిన హీర్మాన్ హేగ్ డార్న్ అతని జీవిత చరిత్ర రాసి, మాక్డోవేల్ కాలనీలో ఉంచాడు. సృజనశీలుర పాటి కామధేనువు అతను. న్యూయార్క్ బోస్టన్‌ల మధ్య వింటర్ కాలాలు గడుపుతూ, కవిత్వాన్ని ప్రసరిస్తూ ప్రవహింపజేస్తూ పుస్తకాలలో నిక్షిప్తం చేశాడు.

పన్నెండు ఏళ్ళలో పన్నెండు పుస్తకాలు రాశాడు. "కలెక్టెడ్ పోయెమ్స్"కు పులిట్జర్ బహుమతి రెండుసార్లు వచ్చింది. బ్లాంక్‌వెర్స్‌లో నిష్ణాతుడయ్యాడు. చాలాకాలానికి బ్లాంక్‌వేర్స్ మళ్ళీ అందర్నీ ఆకర్షించింది. మొదట్లో ఇష్టంలేకపోయినా చివర్లో రాసిన మెర్లిన్, లాన్సిలాట్, ట్రిస్ట్రాం నాటకాలలో దాన్నే వాడాడు. ఇందులో కథా కథనం అంతా పాత ధోరణిగా సాగింది. అందుకే ఎవరూ మెచ్చుకోలేదు. అరవైకి శారీరకంగా క్షీణించి కవితా పరంగా ఎండిపోయాడు.

ఏడాదికి ఒకటి వంతున రాస్తూనే ఉన్నాడు. ఇసడోరా డంకన్ అనే డాన్సర్ ఇతన్ని లొంగ దీసుకొనే ప్రయత్నం చేస్తే తప్పించుకొన్నాడు. అరవై అయిదులో "పాంక్రియాస్" వచ్చి బలహీనుడై ఆపరేషన్ జరిగినా బతకనని తెలిసి 06-04-1935న చనిపోయాడు.

రాబిన్సన్ చిన్న కవితలనే అందరూ ఇష్టపడి చదివారు. వ్యాపార ధోరణిని నిరసించాడు. "He created an entire gallery of untypical of American figures" అంటారు. పాత విధానాల్లో కొత్త అర్థాలు చూపాడు. సానెట్‌లకు సానపెట్టి ఎపిగ్రమాటిక్ ఎడ్జెస్‌తో మిరుమిట్లు గొలిపించాడు. తన ఓటమిని ప్రతి కవితలో ప్రతిబింబింపజేశాడు. "Miniver cheevy born too late - scratched his head and kept on thinking - miniver coughed called it fate - and kept on drinking" అని రాసుకొన్న నిర్భాగ్య కవి రాబిన్సన్.



**అమెరికా వ్యావహారిక భాషా కవి - రాబర్ట్ ఫ్రాస్ట్**

ప్రకృతి కవి అని అపవాదు పడిన రాబర్ట్ ఫ్రాస్ట్ ప్రదేశాల కంటే ప్రజలపై మమకారంతో రాశాడు. కాలిఫోర్నియాలోని సాన్ ఫ్రాన్సిస్కోలో పుట్టినా తూర్పు వాడనిపించుకొన్న రాబర్ట్ ఫ్రాస్ట్ 26-03-1875న పుట్టాడు. తలిదండ్రులు న్యూ ఇంగ్లాండ్ స్కూల్ టీచర్స్. ఎనిమిది తరాల నుండీ కుటుంబం ఇక్కడే ఉంది. తల్లి స్కాటిష్, తండ్రి ఇంగ్లాండ్ నుండి వలస వచ్చిన కుటుంబంవాడు. నాన్ కన్ఫర్మిస్ట్. ఉద్యోగం. రిపబ్లికన్ మాసాచూసెట్స్ వదిలి కాలిఫోర్నియా వెళ్ళాడు. డెమోక్రాటిక్ పేపర్ ఎడిటరయ్యాడు. ఫ్రాస్ట్ పుట్టటానికి పదేళ్ళ ముందే సివిల్‌వార్ సమాప్తమయింది. సౌత్ అంటే ఇష్టంతో కొడుకుకు రాబర్ట్ లీ అని పేరుపెట్టాడు. తండ్రి టిబితో చనిపోయాడు. తల్లి ఫ్రాస్ట్‌ను తీసుకొని మాసాచూసెట్స్‌లోని లారెన్స్ చేరింది.

చదువు ఇష్టంలేదు. నాలుగేళ్ళు హైస్కూల్‌లో చదివి పదిహేడులో డార్ట్‌మౌత్‌లో చేరి మూణ్ణెళ్లకే వదిలేశాడు. ఇరవై ఒకటిలో హార్వర్డ్‌లో చేరి రెండేళ్లకే బయటికొచ్చాడు. తల్లికి, చెల్లి సాయం చేసేవాడు. టీ దుకాణంలో, చెప్పుల షాపులో, బట్టల మిల్లులో పనిచేశాడు. కార్బన్ పెన్సిల్ లాంప్స్‌ను శుభ్రం చేసేవాడు. లోకల్ న్యూస్ పేపర్లో రాయటానికి కుదిరాడు. ఇరవైకి న్యూ ఆంప్‌షైర్ వ్యవసాయ దారుడైనాడు. రాళ్ళ భూమిని చదును చేసి సాగుచేయాలి. వల్లకాక టీచర్ అయ్యాడు. అప్పటికే కవితలు రాసి పంపేవాడు. అవి అచ్చు అయి వచ్చేవి. మళ్ళీ కాడి బుజాన వేసుకొన్నాడు. స్నేహితులు కవులుగా చెలామణిలో ఉన్నారు. మొదటి

కవితా సంకలనం నలభయ్యవ ఏట "ఏ బాయ్స్ విల్" పేర ఇంగ్లాండ్‌లో అచ్చు అయిందంటే ఆశ్చర్యపోతాం. అక్కడే రెండవది "నార్త్ ఆఫ్ బోస్టన్" కూడా ప్రింట్ అయింది.

ఇంగ్లాండ్ నుంచి అమెరికా చేరేసరికి గొప్ప కవి అనిపించుకున్నాడు. నాటకీయతను కవిత్వంలో జోడించాడు. "I am going out to clean the pasture spring - I will only stop to rake the leaves away - I shall not be gone long - you come too"లాంటివెన్నో ఉన్నాయి. నార్త్ బోస్టన్‌కే మరోపేరు "ఎ బుక్ ఆఫ్ పీపుల్" దీనితోబాటు ఎనిమిది వాల్యూముల కవితలు రాశాడు. "Some say the world will end in fire - some say in ice - from what I have tasted of desire - I hold with those who favour fire - but if it had to perish twice - I think I know enough of hate - to say that for destruction ice - is also great - and would suffice" మంచిపేరు తెచ్చుకొంది.

ఫ్రాస్ట్ ఆలోచనలు, భావాలు ప్రకృతి దృశ్యాల ప్రేరేపణలే. అమెరికా రాగానే మళ్ళీ వ్యవసాయం చేశాడు. ఆంప్‌షైర్‌లోని ఫ్రాన్కోనియా దగ్గర ఎత్తైన కొండపై ఫారంహౌస్ కొన్నాడు. ఈయన్ని చూసి మిగిలిన వారూ కొన్నారూ. "ఏ పోయెట్ ఇన్ రెసిడెన్స్" అనిపించాడు. ఆంహేర్స్ట్‌లో, మిచిగాన్‌లో ఎక్కువకాలం ఉండి ఎంతో నేర్చుకొన్నాడు. నలభై వరకు ఎవరికీ తెలియని ఫ్రాస్ట్ అరవై దెబ్భైలలో అనేక గౌరవాలు, పురస్కారాలు అందుకొన్నాడు. "నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్" నుండి బంగారు పతకం, నాలుగుసార్లు పులిట్జర్ ప్రైజ్ సాధించి రికార్డ్ సృష్టించాడు. ఇరవై ఎనిమిది యూనివర్సిటీల నుండి అందులో రెండు ఇంగ్లాండ్ యూనివర్సిటీల నుండి గౌరవ డిగ్రీలు పొందాడు. వెర్మాంట్ రాష్ట్రం ఫ్రాస్ట్ పేరును ఒక పర్వతానికి పెట్టి గౌరవించింది. ఎనభైలో "ఎ ఫోర్ సేడ్" అనే ఆయనే ఎంపిక చేసిన ఆయనకిష్టమైన కవితల సంకలనంగా తెచ్చారు.

రాసిన కవితలను బట్టి ఫ్రాస్ట్‌ను వర్డ్స్‌వర్త్ కవితో పోలుస్తారు. ఫ్రాస్ట్ రుషియా లేక కవియా అని అనుమానిస్తారు. పబ్లిక్‌లోకి బాగా వచ్చేవాడు. "గ్రీన్ ఆపిల్ జీనియస్" అనేవారు. "క్రాకర్ బాక్స్ ఫిలాసఫర్" అనీ అంటించారు. ఫ్రాస్ట్ "A poem should begin in delight and end in wisdom - I'd as soon write free verse as play tennis with the net down" అని కవిత్వ పరమావధి చెప్పాడు. "నీకు అదృష్టం, దురదృష్టం ఏదైనా పట్టవచ్చు కాని నీకు చివరికి కావాల్సింది కృప మాత్రమే" అనేవాడు. దీనిపైనే "ఏ మాస్క్ ఆఫ్ రీజన్", "ఏ మాస్క్ ఆఫ్ మెర్సి" దీర్ఘ కవితలు రాశాడు. "మనిషే కాదు అతని శైలీ ముఖ్యమే"నంటాడు. ఎనభై తొమ్మిదేళ్ళు నాన్ కన్ఫర్మార్‌గా జీవించి చివరి పుస్తకంగా "ఇన్ ది క్లియరింగ్" తెచ్చి 29-01-1963లో రాబర్ట్ ఫ్రాస్ట్ కవి చనిపోయాడు. అమెరికా వ్యావహారిక భాషలో కవిత్వం రాసిన రియలిస్టిక్ కవి. అరుదైన సాహితీ సంపన్నుడు,

అందరికి ప్రేమాస్పదుడు ఫ్రాస్ట్. "Greatest of the American poets of the century" అనిపించుకొన్నాడు. అస్తిత్వ మూల కారణాలను ప్రశ్నించాడు. "Perhaps no other poet in our history has put the best of the Yankee spirit into a book so completely. His frequent use of rural settings and farm life,a liked in these poems, Frost is most interested in "showing the human reaction to nature's processes"" సానుభూతితో ఉన్న హాస్యాన్ని ప్రవేశపెట్టాడు. న్యూ ఇంగ్లాండ్ జానపదుడు అనిపించుకొన్నవాడు. జాతీయ అంతర్జాతీయ కవిగా మన్ననలు అందుకొన్నాడు. జాన్ కేనేడి ప్రెసిడెంట్ అయినప్పుడు ఫ్రాస్ట్ కవిని పిలిపించి గౌరవించి "ది గిఫ్ట్ అవుట్ రైట్" కవితను చదివించాడు. ఇంతకుముందు ఏ అమెరికన్ కవికీ ఇలాంటి గౌరవం దక్కిన దాఖలా లేదు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 49

# నేషనల్ బార్డ్ - కారల్ శాండ్‌బర్గ్

**"P**oetry is the synthesis of hyacinths and biscuits. Poetry is the opening and closing of a door - a search for syllables to shoot at the barriers of the unknown and the unknowable"అని కవిత్వ లక్షణాలను నిర్వహించి దానికోసమే బతికినవాడు కారల్ శాండ్‌బర్గ్. స్వీడిష్ జాతికి చెందిన ఈ కవి ఇలినాయిస్ రాష్ట్రం గేల్స్‌బర్గ్‌లో 06-01-1878లో పుట్టాడు. డబ్బులేని కుటుంబం. మిల్క్ వాగన్ మీద పనిచేయటానికి వెళ్ళేవాడు. పదిహేనవ ఏట బార్బర్ షాప్‌లో, థియేటర్‌లో తెరలు లాగటం, ట్రాక్ డ్రైవర్‌కు సహాయకుడిగా చిన్న చిన్న పనులు చేశాడు. పొలం పనులు, హోటల్ సర్వర్‌గా కూడా చేశాడు. స్పానిష్ అమెరికన్ యుద్ధంలో సైన్యం చేరి పోర్టారికాలో పనిచేశాడు. అమెరికా తిరిగి వచ్చి లాంబర్డ్ కాలేజిలో చేరాడు. కాలేజి పేపర్‌కు ఎడిటర్ అయ్యాడు. బాస్కట్ బాల్ టీం కెప్టెన్ అయ్యాడు. కాలేజి వదిలాక సేల్స్‌మాన్‌గా, అడ్వేర్‌టైజింగ్ మేనేజర్‌గా, జర్నలిస్ట్‌గా పనిచేశాడు.

చిన్నప్పటి నుండే కవిత్వం చదవటం, ఎలా రాయాలో కూడా తెలుసుకొన్నాడు. కొన్ని కవితలను పాతికేళ్ళ వయసులో "ఇన్ రెక్‌లెస్ ఎక్స్టసి" పేర ముద్రించాడు. విట్మన్ రాసినట్లున్నాయవి. కవితా రీతిలో శాండ్‌బర్గ్ ముద్ర ఉండేది.

"డౌన్ ఇన్ సథరన్ న్యూజెర్సీ దే మేక్ గ్లాస్ - బై డే అంబ్ బై నైట్ ది ఫైర్‌బర్న్స్ అండ్ ది మిల్విల్లీ అండ్ బీడ్ ది శాండ్ లేట్ ఇన్ ది నైట్" కవిత అచ్చయింది. ఇలా పత్రికలకు రాస్తూ బతుకుతున్నాడు. ఒక కవితా సంకలనానికి ప్రైజ్ వచ్చింది. అమెరికా సాధారణ భాషనే కవిత్వానికి వాడాడు. "చికాగో పోయెమ్స్" విడుదల చేస్తే దానిపై రగడ రేగింది. "కూల్ టూమ్బ్" కవిత ఒక మచ్చు తునక.

"When Abraham Lincoln was shoveled into the tombs, he

forgot the copper heads and the assassin - in the dust in the cool tombs - and Ulysses Grant lost all thoughts of con men and wall street, cash and collateral turned ashes - in the dust, in the cool tombs"

డెబ్భై ఏళ్ళు వచ్చేసరికి శాండ్‌బర్గ్ ఎనిమిది సంపుటాల కవిత్వం, జానపద గీతాలు, ది అమెరికన్ సాంగ్ బాగ్, రిమేమ్బ్రెన్స్ రాక్ అనే ఆటో బయోగ్రఫీ వగైరా రాసి ముద్రించాడు. యువకుల కోసం ఎన్నో కథా పుస్తకాలు రాశాడు. అబ్రహాం లింకన్‌పై ఆరు భాగాల జీవితచరిత్ర రాశాడు. చారిత్రక రచన చేసినందుకు పులిట్జర్ బహుమతి లభించింది. ఇలినాయిస్ గవర్నర్ అడ్లాయిడ్ స్టీవెన్సన్ శాండ్‌బర్గ్ డెబ్భై అయిదవ జన్మదినాన్ని "కారల్ శాండ్‌బర్గ్ దే"గా ప్రకటించి నిర్వహించి గౌరవించాడు. అభిమానులు, స్నేహితులు వచ్చి కోలాహలం చేశారు. స్వీడెన్ రాజు "ఆర్డర్ ఆఫ్ ది నార్డర్న్ స్టార్"ను అందజేసి గౌరవించాడు. అమెరికా అకాడెమి ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ సంస్థ బంగారు పతాకాన్ని ప్రదానం చేసింది.

వాల్ట్ విట్మన్ తరువాత ఇంత గౌరవం పొందినవాడు శాండ్‌బర్గ్ ఒక్కడే. పంటపొలాలు, ఆకాశ హర్మ్యాలు, స్టీలు మిల్లులు అతని కవితా వస్తువులై వాటిల్లో ఆత్మాన్వేషణ చేశాడు. "ది పీపుల్"లో సామాన్య మానవుడిని అద్భుతంగా ఫోకస్ చేశాడు. ఇల్లినాయిస్‌లో చిన్న గ్రామీణ వాతావరణం నుండి నార్త్ కరోలినాలోని ఫ్లాట్ రాక్‌కు చేరాడు. ఉన్నతమైన దానిని మంచి దానిని సమాదరించాడు. స్వాన్ లివర్ ఆంథాలజీని వ్యతిరేకించాడు. పొడుగ్గా నవ్వుతూ తెల్లజుట్టు కళ్ళ మీదకు దూకుతూ కనిపించేవాడు. "నేషనల్ బార్డ్" అనిపించుకొన్నాడు శాండ్‌బర్గ్. "Indubitably an American in every pulse - beat" అన్నారు. శతాబ్ది ఉత్సవానికి ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు. అతని "రుటా బాగా" కథలు చిన్నపిల్లల్ని బాగా ఆకట్టుకొన్నాయి.

**ప్రయరి ట్రూబడోర్ – వాచల్ లిండ్ సే**



జాజ్ పద్ధతిలో కవిత్వాన్ని, గాస్పెల్ ఆఫ్ బ్యూటీని మెగా ఫోన్ ద్వారా వినిపించిన ఇవాన్జేలిస్ట్ వాచల్ లిండ్‌సే. 10–11–1879లో ఇలినాయిస్‌లోని స్ప్రింగ్ ఫీల్డ్‌లో జన్మించాడు. లింకన్ పుట్టిన స్ప్రింగ్ ఫీల్డ్ అంటే వీరాభిమానం. అది అమెరికాకు భవిష్యత్ రాజధాని కావాలని మనసారా కోరుకొన్నాడు. దీనినే "గోల్డెన్ బుక్ ఆఫ్ స్ప్రింగ్ ఫీల్డ్" పుస్తకంలో తెలియజేశాడు. ఇక్కడే అమరుడైన గవర్నర్ ఆల్టెల్డ్ స్మరిస్తూ "ది ఈగల్ దట్ ఈజ్ ఫర్గాట్టెన్" కవిత రాశాడు. రచయితగా కంటే ఆర్టిస్ట్‌గా

దీనికి వైభవం తేవాలని ఆశించాడు. ఒహాయోలోని హీరం కాలేజిలో చదివి చికాగో ఆర్ట్ కాలేజిలో చేరి న్యూయార్క్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో కళలో నిష్ణాతుడైనాడు. బ్లేక్ లాగా క్రూసేడ్‌ల తయారీలో మునిగిపోయాడు. మద్య నిషేధాన్ని సమర్ధించి ప్రచారం చేశాడు. "యాంటి సేలూన్ లీగ్"పై అనేక ఉపన్యాసాలిచ్చాడు. "విలేజ్ మేగజైన్" నిర్వహించి ఎక్కడికి వెళ్ళినా ప్రతులను ప్రజలకు అందజేసేవాడు. "రైమ్స్ టు బి ట్రేడెడ్ ఫర్ బ్రెడ్"పై కరపత్రం తయారుచేసి ఇంటింటికీ తిరిగి ఇచ్చేవాడు. రైతులతో మాట్లాడుతూ తన కవితలు వినిపిస్తూ ఉత్సాహపరచేవాడు. పిల్లలకు కథలు చెప్పి దగ్గరకు తీసుకొనేవాడు. రాత్రి ఏదో ఇంటిలో ఆతిధ్యం పొంది అక్కడే నిద్రపోయేవాడు.

ముప్ఫై నాలుగవ ఏట మొదటి పుస్తకం ముద్రించాడు. "జెనరల్ విలియం బూత్ ఎంటర్స్ ఇంటు హెవెన్" పుస్తకాన్ని మతం, అభిమాన విషయాలు సమాజానికి అవసరమైనవి అన్నీ కలిపి రాశాడు. తరువాత "కాంగో అండ్ అదర్ పోయెమ్స్", "ది చైనీస్ నైటింగేల్", "ది గోల్డెన్ వేల్స్ ఆఫ్ కాలిఫోర్నియా" మొదలైన కవిత్వపు పుస్తకాలు వెలువరించాడు. ప్రజలకు తన కవిత్వాన్ని చదివి వినిపించి కొత్త దారి తొక్కాడు. భావానికి తగ్గ పిచ్‌ని ఉపయోగించి చక్కగా భావగర్భితంగా పాడి మనసుల్ని గెలిచేవాడు. తలకాయను వివిధ భంగిమలలో తిప్పుతూ భలేగా గానం చేసేవాడు. కళ్ళు సగం మూసి అరగన్నులతో అభినయించి పాడుతుంటే జనం పరవశించి వినేవాళ్ళు. సమ్మోహనంలో ముంచి తేల్చేవాడు. చేతులాడిస్తూ వివిధ భంగిమలు పెడుతూ కవిత్వ గానం చేస్తుంటే మరో లోకంలో విహరించినట్లుండేది. గ్రామీణ స్థాయి వాడే అయినా జాతీయ స్థాయి వాడయ్యాడు. "హార్లీ బర్లీ" అమెరికా జీవిత విధానాలను కవితలో చూపాడు.

లిండ్‌సే లెక్కలేనన్ని ప్రేమ పాటలు రాసిన సారా టీడ్‌సెల్ అనే అమ్మాయిని ప్రేమించి పడేద్దామనుకొంటే ఆమె జారుకుంది. తర్వాత ఇరవై ఏళ్ళ స్కూల్ పిల్లను పెళ్లి చేసుకొన్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. కొన్ని తమాషా భావాలను బయటపెట్టాడు. "క్రిష్టియానిటి కంటే బుద్ధిజంలో ఆకర్షణ ఎక్కువ అన్నాడు. బుద్ధుడు క్రీస్తు కన్నా అణకువ, ప్రయోజనం ఉన్నవాడు కాద"న్నాడు. తన హృదయంలో ఉత్తర నక్షత్ర గది ఉందని చెప్పాడు. అదీ మూసుకుపోయింది. ఇదివరకు ఎగబడి మూగి వినే జనం క్రమంగా దూరమైపోతున్నారు. అతనిలో కావలసినదేదో లోపించింది అనుకొన్నారు. దరిద్రంతో మొదలైన జీవితం మళ్ళీ యాభైలో అదే పరిస్థితిని తెచ్చింది. బీదరికం, నిరాశా ఆవరించాయి. భ్రమ భ్రాంతులకు లోనయ్యాడు. యదార్ధానికి వ్యతిరేకి అయ్యాడు. భార్యతో నిత్యం తగాదా. మళ్ళీ యువకుడినవుతాననేవాడు. చివరికి ఈ సంక్షోభంలో తట్టుకోలేక "లైసాల్" తాగి 05-12-1931 అర్ధరాత్రి చనిపోయాడు.

అమెరికా లిండ్‌సేను సీరియస్‌గా తీసుకోలేదు. సామాన్యులకు అసాధారణ హీరో

అయిన లిండ్ సే అందరికి దూరమైపోయాడు. "I am but the pioneer - voice of democracy - I am the gutter dream - I am the golden dream - listen to my g-o-l-d-e-n d-r-e-a-m" అని కలకంటూ కల్లోల మనసుతో కానరాని లోకాలకు చేరాడు. పెర్ఫార్మన్స్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన కవి.

**పర్యావరణ ఉద్యమ సారథి – రాబిన్సన్ జెఫర్స్**



వెస్ట్‌లో పుట్టి ఈస్ట్‌లో రాబర్ట్ ఫ్రాస్ట్ పెరిగితే ఈస్ట్‌లో పుట్టి వెస్ట్‌లో పెరిగాడు రాబిన్సన్ జెఫర్స్. పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో 10-01-1887న పుట్టి తండ్రితో యూరప్ పర్యటన చేసి జెర్మని, స్విట్జెర్లాండ్‌లలో చదివి, అమెరికాలోని కాలిఫోర్నియా, వాషింగ్టన్‌లలో చదువు పూర్తి చేశాడు. ఒక కజిన్ ప్రేరణతో జీవితాన్ని రచనకు అంకితం చేశాడు. "ఫ్లాగాన్ అండ్ యాపిల్స్" పుస్తకాన్ని స్వంత ఖర్చులతో ముద్రించాడు. ఇరవై ఆరులో ఊనా కాల్ కస్టర్‌ను పెళ్ళాడి ఇంగ్లాండ్ వెళ్ళాలనుకొన్నాడు. మొదటి ప్రపంచయుద్ధం మొదలై కాలిఫోర్నియాలోనే ఉండిపోయారు. తమకు తెలియకుండానే తాము ఉండాల్సిన ప్రదేశం నిర్ణయమైంది అనుకొన్నారు. మళ్ళీ పెళ్లి చేసుకొన్నాడు. కొత్త భార్య, కవల కొడుకులతో కలిసి ఒక దుర్గం లాంటి ఇల్లు కట్టుకొని ఉండిపోయి అక్కడే 1962లో చనిపోయాడు. ఇరవై అయిదు ఆరులో పద్దెనిమిది గ్రంథాలు "ఆత్మ వినాశన ప్రేమ"కు స్థానమిచ్చి రాశాడు. జీవిత పోరాటం వ్యర్థమని, విలువలకు అర్థం లేదని సిద్ధాంతీకరించాడు. కవిగా, ఫిలాసఫర్‌గా ద్వంద్వ ప్రవృత్తులతో జీవించాడు. సృజన ఉన్నా తీవ్రంగా కవిత్వం రాశాడు. భయంకరత్వ ఉద్యమంగా కవితలుంటాయి. క్రియా బాహుళ్యం భీభత్స ప్రధానం. కవితల్ని ప్రేమించలేము. చదివితే మర్చిపోలేము. అదీ జెఫర్స్ విధానం. "ఎన్విరాన్‌మెంటల్ పోయేట్" అని పిలిచారు. మహాకావ్య విధానంలో పకడ్బందీగా కవిత్వం రాసేవాడు. "ఇన్‌హ్యూమనిజం" అంటే అమానుషత్వం అనే మాటను కాయినేజ్ చేసింది జెఫర్సనే. ప్రపంచంలోని వస్తువుల అందాన్ని చూడకుండా, ఏదీ పట్టనట్టు స్వఫలాపేక్షతో ఉండేదాన్ని "ఇన్‌హ్యూమనిజం" అన్నాడు. టైం మేగజైన్ ప్రత్యేక సంచిక తెచ్చి గౌరవిస్తే ప్రత్యేక స్టాంపు తెచ్చి ప్రభుత్వం గౌరవించింది. అమెరికా పశ్చిమ ఫోటోగ్రాఫర్లకు ఐకాన్‌గా ఉండేవాడు. "ఎన్విరాన్‌మెంటలిజంనే సోషలిజం" అన్నాడు.

**అమెరికన్ మహిళా బైరన్ – ఎడ్నాసెయింట్ విన్సెంట్ మిల్లె**

పందొమ్మిది ఇరవై శతాబ్దాలలో మిల్లె కవిత్వం బాగా ప్రచారమైంది. వందలాది



లిరిక్కులు, సానేట్లు రాసింది. అమెరికాలోని మెయిన్ రాష్ట్రం రాక్ లాండ్‌లో 22-02-1892లో పుట్టి, పందొమ్మిదో ఏట వంద లైన్ల కవితను ఆంథాలజీ డిపార్ట్‌మెంట్ పోటీ నిర్వహించిన "ది లిరిక్ యియర్"కు పంపింది. బహుమతి రాకపోయినా ఆమె "రేనేసెన్స్" కవిత అద్భుతం అనిపించి గుర్తుండిపోయింది. "All I could see from where I stood - was there long mountains and a wood - I turned and looked another way - and saw there islands in a bay" అందులో ఒక పాదం ఇది.

మిల్లె అందం చందం కవిత్వం తిరుగుబాటు ధోరణితో ఒక "లెజెండ్" అయింది. వాసర్ కాలేజిలో చేరిన తర్వాత ఈ లెజెండ్ గ్రీన్ విచ్ గ్రామంలో ఒక చిహ్నమే అయింది. చిన్న కథలు రాసి జీవించింది. పాటలను అనువాదం చేసింది. ప్రావిన్స్ టౌన్ నటులతో నటించి నాటక రచన చేస్తూ కవితలు రాసింది. మగాడికి సాటి అని నిరూపించింది అన్నిట్లో. చిలిపి ఈ చిన్నారి పెద్దలనే వణికించింది. ఆమె తెగువ, ధైర్యం తెలివితేటలను చూసి "అమెరికా మహిళా బైరన్" అన్నారు. అంతకు ముందు ఏ స్త్రీ ఇలా ప్రజా రంగంలో కాలుపెట్టలేదు.

పదహారు గ్రంథాలు రాసినా మొదటి, రెండవది అయిన "రేనాసేన్స్", "సెకండ్ ఏప్రిల్" పుస్తకాలు మాత్రమే బాగా గుర్తింపు తెచ్చాయి. ఒక వ్యాపారిని వివాహమాడింది. న్యూయార్క్ నుండి కాపురం బెర్క్‌షైర్కు మార్చారు. ప్రజలు సంస్థల కోరికపై బయటికి వెళ్లి తన కవితలను చదివి వినిపించేది. ఉపన్యాసాలిచ్చేది. ఆమె ఉపన్యాసాలకు పిచ్చ క్రేజు ఉండేది. కాని అనారోగ్యం అడ్డుపడేది. చివరికి న్యూయార్క్‌లోని పర్వత శిఖరం ఆస్టర్‌లిజ్‌లో ఉండేది.

"రెడ్ హెడెడ్ రెబెల్" అయిన మిల్లె క్రమంగా ప్రజాకవిగా, రాజకీయ ప్రచారకురాలిగా మారింది. చివరగా రాసిన "వైన్ ఫ్రం దీస్ గ్రేప్స్ అండ్ హాంట్స్ మన్ ", వాట్ కారీ" రచనలు పాత చింతకాయ పచ్చడిలా ఉన్నాయి. భర్త చనిపోయిన ఏడాదికి 19-10-1950న ఆ ఒంటరి బంగళాలో జీవిస్తూ చనిపోయింది. ఆమె లిరిక్కులు, సానేట్లు ఇప్పటికీ జనాదరణ పొందుతూనే ఉన్నాయి. "A figure of passionate feeling. She was a symbol of her age not only in her life but in the paradoxes of her poetry" అని ఆమె కవిత్వాన్ని జీవితాన్ని అంచనా వేశారు. ఆ శతాబ్దంలో గొప్ప సానేట్లు రాసిన కవిగా గుర్తింపు పొందింది. ఫ్రాస్ట్ మెడల్ సాధించిన ఆరవ మహిళ. థామస్ హార్డీ "అమెరికాలో రెండే రెండు ఆకర్షణలు ఒకటి ఆకాశ హర్మ్యాలు రెండు ఎడ్నా మిల్లె కవిత్వం" అన్నాడు. అప్పటికి రెండుసార్లు పులిట్జర్ బహుమతి పొందిన మహిళగా చరిత్రకెక్కింది.❋

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 50

ఇంగ్లాండ్ ధోరణులు

# జార్జియన్ కవిత్వం

ఇప్పటి వరకు అమెరికా ధోరణులలో వచ్చిన మార్పులు తెలుసుకొన్నాం. ఇప్పుడు ఇంగ్లాండ్ ఎలా స్పందిస్తోందో చూద్దాం. ఇరవైవ శతాబ్ది మొదటి పదేళ్ళలో దాదాపు పాతిక మంది ఇంగ్లీష్ కవులు ఒక తేలికపాటి బృందంగా ఏర్పడి వరుసగా అనేక రచనలు చేసి "జార్జియన్ పోయిట్రీ" అని పేరు పెట్టుకొన్నారు. ఎడ్వర్డ్ మార్ష్ ఎడిటర్‌గా వచ్చిన ఈ కవిత్వంపై కొత్త బలం అందాన్ని తెచ్చామని చెప్పాడు. ఒకే విధానానికి కట్టుబడి వారు రాయకపోయినా శక్తి, అందం కలిగించామని చెప్పుకొన్నారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచ పరిస్థితులపై స్పందించి రాశారు. వాస్తవ పలుకుబడులను ప్రవేశ పెట్టారు. విరుద్ధ భావాల కవులయిన వీరే లాసిలాస్ ఆబెర్ క్రోమ్బీ, గార్డన్ బాటం లి, రూపర్ట్ బ్రూక్, జి కే చేస్టర్ టన్, డబ్ల్యు హెచ్ డేవిస్, వాల్టర్ డీ లామేర్, జాన్ డ్రింక్ వాటర్, జేమ్స్ ఎల్లే ఫ్లేకర్, విల్ఫ్రిడ్ విల్సన్ గిబ్బన్, రాబర్ట్ గ్రేవ్స్, రాల్ఫ్ హోడ్గ్సన్, డి హెచ్ లారెన్స్ ప్రభ్రుతులు.

ఇందులో కొద్దిమంది సమకాలీన దృశ్యాలనే ఎంచుకొని కవిత్వం రాశారు. మేస్ ఫీల్డ్ నావికుల, దిన కూలీల వేటగాళ్ళ హత్య చేసేవాళ్ళ గురించి రాశాడు. గిబ్బన్ రాళ్ళు పగలకొట్టేవారిని, వడ్రంగులను, రైతులను, ఫెర్రె నడిపే వారిని కవిత్వంలో డ్రమటైజ్ చేస్తూ రాశాడు. డి.హెచ్.లారెన్స్ మాత్రం తన పుట్టిన గడ్డ నార్త్ ఆంప్‌షైర్ కూలీల గురించి అధిక శ్రమ చేస్తున్న వారి జీవితాల గురించి కవిత్వం రాశాడు. పట్నంలో చీకటిలో మగ్గేవారి గురించి, పల్లె ప్రజల అమాయకత్వాన్ని గురించి కూడా రాశాడు. జార్జియన్ గ్రూప్ ఎక్కువ కాలం బతకలేదు. అయిదు కవితా సంపుటాలు రెండేళ్ళకోసారి తెచ్చారు ఇందులో వారిలో ఉన్న భేదాలు ప్రస్ఫుటమైనాయి. ఒకళ్ళని ఒకళ్ళు తిట్టి పోసుకున్నారు. రొమాంటిక్ యువతకు చిహ్నమైన రాబర్ట్ బ్రూక్ ఇరవై ఏడేళ్ళకే చనిపోయాడు. ఫ్లేకర్ ముప్ఫై ఒకటికి చనిపోయారు.

మేస్ ఫీల్డ్ మళ్ళీ సాధారణ విషయాలపై రాశాడు. గిబ్బన్ సెమి రూరల్ స్టీరియో టైప్ కవితలల్లాడు. లారెన్స్ జార్జియన్ తత్త్వం ఉన్నవాడు కాకపోయినా అన్‌కాన్షస్‌తో కవిత్వం రాశాడు. ఆబార్ క్రోమ్బీ రాయటమే తగ్గించేశాడు. ఉద్యమంగా పిలువబడిన జార్జియనిజం పలాయన వాదమే అయింది. జార్జియన్‌తత్త్వం కొద్దిగా ఉన్నవాళ్ళు మాత్రం ప్రకృతిపై రాస్తూ అది ఎంతో దయ, ప్రేమ తమపై చూపిస్తోందని తృప్తిపడ్డారు. ప్రకృతికి దగ్గరగా మానవుడు ఉండాలని కోరారు. ఇక్కడే మాథ్యూ ఆర్నోల్డ్ కవి ప్రకృతి ఆరాధకులకు చేసిన సూచన గమనిద్దాం –

“Man must begin, know this, where nature ends - nature and man can never be fast friends”

**వీధి కవి – డబ్ల్యు హెచ్ డేవీస్**



జార్జి బెర్నార్డ్ షా డేవీస్‌ని గుర్తించి ఉండకపోయినట్లయితే సంచారిగా చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ బతికే బతికేవాడు. మాంట్‌మౌత్ షైర్లో న్యూపోర్ట్‌లో ఉన్న చర్చ్ హౌస్‌లో 20–04–1871 లో పుట్టాడు. వెల్ష్ జాతివాడు. తండ్రి తక్కువ ఆదాయం వచ్చే ఇన్ కీపర్. చదివించటానికి డబ్బులు లేవు. కనుక కొడుకును వ్యవసాయం పనులకు పంపాడు. దానిమీద శ్రద్ధ లేకపోవటం వలన వదిలేసి జులాయిగా తిరిగాడు. ఇరవైకి న్యూయార్క్ చేరాడు. అక్కడ అడుక్కు తినటంలో ఒక ఘనుడు ట్రిక్కులు నేర్పించాడు. లివర్ పూల్ బాల్టిమోర్‌ల మధ్య పశువుల బోటుపై చాలాసార్లు తిరిగాడు. ట్రైన్‌లోంచి దూకటం నేర్చి దూకుతూ కుడికాలు పోగొట్టుకొన్నాడు. లండన్ తిరిగొచ్చి కూడబెట్టుకొన్న డబ్బు దాదాపు ఖర్చు చేసి ఇక “కవిత్వం శరణం గచ్ఛామి” అనుకొన్నాడు. ఒక రాత్రికి ఆరు పెన్నీలిచ్చి గదుల్లో బతికాడు. చిల్లర వస్తువులమ్మి పొట్ట పోసుకొనేవాడు. “ది సోల్స్ డిస్ట్రాయర్” అనే చిన్న కవితా సంకలనం తెచ్చాడు. ఇది బెర్నార్డ్ షా కంట పడింది. షా డేవీస్ ఆత్మకథకు ఉపోద్ఘాతం రాస్తూ ఈ విషయం చెప్పాడు. వెంటనే చిల్లర అమ్మకాలు మానేసి గౌరవంగా బతకాలని భావించి మెట్రో పాలిటన్ రచయితలతో కలవకుండా వేరుగా ఉన్నాడు. ఇరవై ఆరు కవితా సంకలనాలు, పది వచన సంపుటాలు మొత్తం ముప్ఫై ఆరు రాశాడు. డెబ్భైవ ఏట 26–09–1940న ఈ “వీధి కవి” వినువీధికి చేరాడు.

ఒకరకంగా డేవీస్ చాలా రాసినట్లే, విపరీతమైన ధోరణి వేగంతో రాసేవాడు రాసిన రాశిలో వాసి ఎంతో కనిపెట్టటం కష్టం. జీవితంపై చక్కని కవితలు అల్లాడు.

“What is this life, full of care - we have no time to stand

and stare - no time to stand beneath the boughs - and stare as long as sheep or cows - no time to wait till her mouth can - enrich that smile her eyes began" ఇలా కవితా ప్రవాహం జాలువారుస్తూనే ఉండేవాడు.

**రాల్ఫ్ హాడ్గసన్**



సందర్భాన్ని బట్టి అప్పటికప్పుడు పద్దెనిమిదో శతాబ్దాపు విలువలతో కవిత్వం రాసిన వాడు రాల్ఫ్ హాడ్గసన్. యార్క్ షైర్‌లో 1817లో పుట్టాడు. ఒంటరిగా రహస్యంగా రెండు ప్రపంచాలలో జీవించాడు. నాణ్యమైన ఎద్దులను తయారు చేయటం డాగ్ షోలకు జడ్జిగా ఉండటంతో డబ్బు సంపాదించాడు. తర్వాత జర్నలిస్ట్ అయ్యాడు. లండన్ ఈవెనింగ్ పేపర్‌కు డ్రాఫ్ట్స్ మాన్ అయ్యాడు. "ఫ్రైస్" మేగజైన్‌ను ఎడిట్ చేశాడు. ముప్పై ఆరులో చిన్న కవితా సంకలనం "ది లాస్ట్ బ్లాక్ బర్డ్" తెచ్చి సాహిత్య లోకంలో కవిగా ప్రత్యక్షమయ్యాడు. ఫ్రాస్టర్, జాక్సన్‌లతో కలిసి ఒక ప్రెస్ కొని పాత పుస్తకాలు ముద్రించి అమ్మాడు. రాయల్ సొసైటీ చేత పోలిజాక్ అవార్డ్ పొందాడు. "పోయెమ్స్" 1917లో "ది సాంగ్ ఆఫ్ ఆనర్" ఉన్నాయి.

యాభైలో జపాన్‌లో సేన్దాల్ యూనివర్సిటిలో ఇంగ్లీష్ లిటరేచర్‌పై ఉపన్యాసాలిమ్మని ఆహ్వానం వస్తే అంగీకరించాడు. వెళ్ళలేకపోతే రెండోసారి పిలిచారు. అమెరికా అమ్మాయిని పెళ్ళాడి భార్యతో వెళ్ళాడు. ఒహాయో బయట మినర్వాలో ఒక ఫారం హౌస్ కొని అందులో పక్షుల ఆవాసానికి సగం కేటాయించాడు. "పాకింగ్ టన్స్ పౌండ్" అనే చిన్న ప్రెస్ కొని అందులో కొన్ని పుస్తకాలు ముద్రించి అందజేసేవాడు. అందులో "సిల్వర్ వెడ్డింగ్", "మ్యూజ్ అండ్ మాస్తిఫ్" పుస్తకాలున్నాయి. ఇంగ్లీష్ పల్లె బాలిక గురించి బాగా రాశాడు. 03-11-1962న మరణించాడు.

"Eve, with her basket, was - deep in the bells and grass - wading in bells and grass - up to her knees - picking a dish of sweet - berries and plums to eat - down in the bells and grass - under the trees"లో వర్ణచిత్రం గీసినట్లు ఆమెను వర్ణించాడు. వాల్ట్ డీలా మెర్‌కు మంచి స్నేహితుడు. నిరంతరం మాట్లాడే వసపిట్ట అన్నాడు లా మేర్.

**సూపర్ నేచురల్ కవి - వాల్టర్ డీ లామేర్**

తన కాలం భాషలో ఆనాటి ప్రపంచంలో ఒక ఊహా సామ్రాజ్యమే సృష్టించుకొని



దెయ్యాలు, భూతాలతో ఫెయిరీ టేల్స్ రాస్తూ ఈవిల్ షాడోస్ మధ్య గడుపుతూ ఉన్మాదానికి సరిహద్దులో ఉంటూ రాసినవాడు వాల్టర్ డి లా మేర్. అతని భావాలకు ప్రతీకగా ఒక కవిత

"Two worlds have we, without within - but all that sense can mete and span - until it conformation win - from heart and soul, is death to man"

వాల్టర్ జాన్ డీలా మేర్ కెంట్‌లోని చార్లటాన్‌లో 25-04-1873లో పుట్టాడు. తల్లి బ్రౌనింగ్ బంధువు. తండ్రి పూర్వీకులు హ్యూగో నాట్స్‌కు చెందినవారు. సెయింట్ పాల్ కేథడ్రిల్ స్కూల్‌లో చదివి కాలేజి మానేశాడు. స్టాండర్డ్ ఆయిల్ కంపెనిలో గుమాస్తాగా పనిచేశాడు. ఇరవై ఏళ్ళు ఇందులోనే పనిచేసి తర్వాత ఇంగ్లీష్ గ్రామీణ వాతావరణంలో ఉన్నాడు.

"సాంగ్ ఆఫ్ చైల్డ్‌హుడ్" మొదటి పుస్తకంగా తెచ్చాడు. ముప్ఫై ఆరులో సివిల్ లిస్టు పెన్షన్ పొందాడు. కంపెనీ విధుల నుంచి విడుదల చేసి రచనకు అంకితమవమని చెప్పింది. యాభై సంపుటాల కవిత్వం, చిన్న కథలు, వ్యాసాలూ, నవలలు వెలువరించాడు. డెబ్భై అయిదులో "కంపానియన్ ఆఫ్ ఆనర్" అయ్యాడు. ఎనభైలో ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డ్ పొందాడు. స్వంత ఇంట్లో ట్వికెన్ హాంలో ఎనభై మూడవ ఏట 22-06-1956 లా మేర్ "నో మోర్" అయిపోయాడు. వర్తమానాన్ని వదిలి భూతకాలంలో జీవిస్తూ రచనలు చేశాడు. కవిత్వం "మూడ్ ఆఫ్ మెమరి"గా రాశాడు. అందులో అంతా మార్మికత ఎక్కువ. " Nature itself resembles a veil over some further reality of which the imagination in its visionary moments seems to achieve a mere direct evidence" అని తన గమ్యం గురించి చెప్పాడు. కవిత్వంలో గొప్ప శక్తి ఉండి ఆకర్షిస్తుంది. "Isled in the midnight air - musked with the dark's faint bloom - out into glooming and secret haunts - the flame cries come". కథలు ఆంథాలజీలు కళల శక్తికి నిదర్శనంగా ఉంటాయి. బయటి సంఘటనకు, లోపలి చూపుకు సంఘర్షణ కనిపించి మిస్టరీగా తెలియజేస్తాయి. సైకలాజికల్ హారర్ కథలు రాసి గుమ్మరించాడు. కార్నెజీ మెడల్‌ను బాల సాహిత్యానికి పొందాడు. సూపర్ నేచురలిజంలో అద్వితాయ ప్రతిభ కనపరచాడు. రామ్సే కాంప్‌బెల్ వంటి వారికెందరికో ఆదర్శం.

**బ్రాంటేకు ప్రతిరూపమే - షార్లెట్ మ్యు**

ఎవరికీ అంతగా పరిచయం లేని రచయిత్రి షార్లెట్ మ్యు. సృజన శక్తి అమోఘంగా



ఉన్న కొద్దిమంది స్త్రీ కవులలో ఒకతే. బ్లూమ్స్ బరిలో 15-11-1869న జన్మించింది. తండ్రి ఆర్కిటెక్ట్. బాల్యంలోనే తండ్రి చని పోతే నలుగురు సంతానం నానా అగచాట్లు పడుతూ దరిద్రం అనుభవిస్తూ దు:ఖాన్ని దిగమింగుకుంటూ బతికింది. అందులో ఒకమ్మాయి, అబ్బాయి పిచ్చిపట్టి శరణాలయంలోనే ఉండిపోయారు. ఉన్న ఇంటిలో సగం అద్దెకిచ్చి చీకటి గదిలో బతుకుతూ అద్దె డబ్బే ఆధారంగా జీవించారు తల్లి మిగిలిన ఇద్దరు పిల్లలు. వారాంతంలో వేసేక్స్ వెళ్లి థామస్ హార్డీకి అతిథులుగా ఉండేవారు. మ్యులోని కవితా శక్తిని హార్డీ గుర్తించి మెచ్చుకున్నాడు. సివిల్ లిస్టు పెన్షన్ ఇప్పించాడు. వచ్చిన డెబ్బై పౌండ్లను జాగ్రత్త చేసి కాపాడుకొన్నది. చెల్లెలు అన్నే తరచూ అనారోగ్యం పాలై చనిపోయింది. నర్సింగ్ హోమ్‌కు వెడితే ఆదరణ లభించలేదు. దారిద్ర బాధ పడలేక విషం తీసుకొని, డాక్టర్లు రక్షిద్దామని ప్రయత్నిస్తే “don't keep me - let me go” అంటూ వారించి ప్రాణాలు వదిలేసింది.

బ్రాంటే సిస్టర్స్ మ్యు సిస్టర్స్‌గా పునర్జన్మ ఎత్తారని అనుకొంటారు. మ్యు తన రచనల్ని ఎన్నిటిని ధ్వంసం చేసిందో తెలియదుకాని అరవైకి పైగా కవితా సంకలనం వచ్చింది. “బిసైడ్ ది బెడ్” కవితలో “Someone has shut the shining eyes, straitened and folded - the wandering hands quietly covering the unquiet breast”

“All night you have not turned to us spoken - it is time for you to wake your dreams were never very deep - I for one have seen the thin bright twisted threads of them dimmed suddenly and broken - this is only a most pretense of sleep” అంతరంగాన్ని ఆవిష్కరించింది. విక్టోరియన్ కవిత్వానికి ఆధునిక కవిత్వానికి వారధి. “బెస్ట్ వుమెన్ పోయెట్ ఆఫ్ ది డే” అని హార్డీ మెచ్చాడు. “She was very good and quite unlike any one else” అని శ్లాఘించింది వర్జీనియా ఉల్ఫ్.

## ఆస్థాన కవి - జాన్ మాన్స్ ఫీల్డ్




డెబ్బై ఐదో ఏట జాన్ మాస్‌ఫీల్డ్ ఆత్మకథ “సో లాంగ్ టు లెరన్” పేర రాసుకొన్నాడు. హియర్ ఫోర్డ్‌షైర్లో 01-06-1878 లో పొలిసిటర్ కొడుకుగా పుట్టాడు. వార్విక్ స్కూల్‌లో చదివి మర్చంట్ సర్వీస్‌లో యువకులకు శిక్షణనిచ్చే “కాన్ వే”లో చది వాడు. కేప్‌హార్న్‌కు వెళ్ళే షిప్‌కు అసిస్టెంట్ వింద్ జామర్‌గా

పనిచేశాడు. ఇరవై యేళ్ళు కష్టపడ్డాడు. తాను సహజ సముద్ర మనిషికాడు. అమెరికా చేరి ఈ ఉద్యోగం మానేశాడు. బేకరి, గుర్రపుశాల, కార్పెట్ ఫాక్టరీలలో పనిచేశాడు న్యూయార్క్ యాంకర్స్‌లలో. ఇంగ్లాండ్‌కు 1897 చేరటానికి ముందు చాసర్ రాసిన కాంటర్‌బారీ కథలు చదివాడు. లండన్‌కు తిరిగి వచ్చి మాంచెస్టర్ గార్డియన్ పత్రికలో కాలమ్స్ రాశాడు. "సాల్ట్ వాటర్ బాలడ్స్" పుస్తకాన్ని సెంటిమెంట్ హాస్యంతో నింపి రాశాడు. "ది విడో ఇన్ ది బై స్ట్రీట్", "డాబర్", "ది డాఫోడిల్ ఫీల్డ్స్"లను ముప్పైలలో రాశాడు.

మొదటి ప్రపంచ యుద్ధం అతని సృజనకు అవకాశం కల్పించింది. రెడ్‌క్రాస్‌లో సేవలందించాడు. "లోల్లిగ్దన్ డౌన్స్", "రైట్ రాయల్", "రేనార్డ్ ది ఫాక్స్" మొదలైన కవితా పుస్తకాలు రాసి ప్రచురించాడు. చివరి దానిలో కవిత్వం పక్వమైంది. రూరల్ స్పిరిట్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు అద్దంపట్టే రచనలే చేశాడు. 1930లో రాబర్ట్ బ్రిడ్జెస్ మరణం తర్వాత ఆస్థానకవి అయ్యాడు. ఇంగ్లాండ్ సిల్వర్ జూబిలీ ఉత్సవాలలో ఆర్డర్ ఆఫ్ మెరిట్ పొందాడు. అయిదవ జార్జి మరణంపై ఫనేరల్ ట్రిబ్యూట్ రాశాడు. ఆస్థాన పదవి అడ్డుపడిందో కవితా ప్రవాహం ఆగిపోయిందో కాని తర్వాత రాసింది తక్కువే. డెబ్బై ఏళ్ళకు తొంభై రచనలు పూర్తి నిశ్చయంతో తగ్గిన కవితా ప్రతిభతో రాసి ప్రచురించాడు. ఇప్పుడు విస్మృత కవే అయ్యాడు ఫీల్డ్. ఫీల్డ్‌లో లేని కవి అనిపించాడు ఫీల్డ్.

క్లాసిక్ చిల్డ్రెన్ నవలలు రాశాడు. "ఎవర్ లాస్టింగ్ మెర్సి", "సి ఫీవర్" కవితలు గొప్పవి. గౌరవ డాక్టరేట్లు చాలా పొందాడు. అతని పేర పోయిట్రీ అసోసియేషన్స్ చాలా ఏర్పడ్డాయి. రాజాస్థాన సంగీత విద్వాంసులకు కవితలు రాశాడు. ప్రసిద్ధమైన సానేట్స్ రాశాడు. ❁



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 51

# ఆధునిక విపరీత ధోరణులపై కలం కత్తి దూసిన – డి.హెచ్.లారెన్స్

**"పో**రాడే వారి యుద్ధ క్షేత్రం లారెన్స్". ఆలోచనాపరుడైన ఫిలాసఫర్. మానసిక అన్వేషణ ఉన్న రుషితుల్యుడు. భవిష్యత్ దార్శనికుడు. కొరడా దెబ్బలు కొట్టగల మానవుడు. ఎక్కడా ఇమడలేనివాడు. వీటినన్నిటిని తన "లేడీ చాటర్లీన్స్ లవర్" నవలలో ఆవిష్కరించుకొన్నాడు. 11-09-1885న నాటింగ్ హాంషైర్ ఈస్ట్‌వుడ్‌లో జన్మించాడు. ముగ్గురబ్బాయిలు, ఇద్దరమ్మాయిలున్న కుటుంబం. అసలు పేరు డేవిడ్ హెర్బర్ట్ లారెన్స్. కొండ దిగువన చిన్న ఇంట్లో ఉండేవారు. చదువురాని తండ్రి బొగ్గుగని కార్మికుడు. తల్లి టీచర్‌గా కొంతకాలం పనిచేసింది. మంచిదే కాని డామినేటింగ్ పర్సనాలిటి. తండ్రి తాగుబోతు అని తల్లి చెప్పగా తెలుసుకొన్నాడు.

నాటింగ్ హాం హైస్కూల్‌లో చేరి చదువులో పెద్దగా ప్రావీణ్యం చూపకుండా స్కాలర్‌షిప్ పొందకుండా చదివాడు. ఇంటిపక్క పిల్లపై పదహేరేళ్ళ వయసులో ప్రేమలో పడ్డాడు. అది రొమాంటిక్ వ్యవహారమేనని "సన్స్ అండ్ లవర్స్"లో రాశాడు. తల్లి ప్రేమలో పెరిగి ప్రేమ అంటే ఏమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశాడు. ప్రేమ శారీరకమైనది కాదని గ్రహించాడు. పదిహేడుకు చదువుకొంటూ, చదువు చెబుతూ గడిపాడు. గని కూలీ పిల్లలకు చదువు నేర్పాడు. సాహిత్యాధ్యయనం చేస్తూ బాటని, ఫ్రెంచ్‌లను నేర్చాడు. ప్రొఫెసర్ ఎర్నెస్ట్ వీక్లి కొంత చదువు చెప్పాడు. తర్వాత స్వయంగానే చదివి సాధించాడు. దక్షిణ లండన్‌లో క్రయోడాన్లోని డేవిడ్సన్ రోడ్ స్కూల్‌లో పై తరగతులకు బోధించాడు. చదువు చెప్పటం చదువుకోవటం కంటే "ఫ్లవర్ డ్రాయింగ్"లో నైపుణ్యం పొందాడు. అందంగా చక్కని శారీరక దారుఢ్యంతో ఉండేవాడు.

టీన్ఏజ్‌లోనే అంతర్గత భావాలను రాయాలనే కోరిక కలిగింది. కవిత్వం రాస్తూ పూలబొమ్మలు వేస్తూ తనలాగే ఏ అమ్మాయి అయినా చదివి చూసి ఆనందించాలనుకొన్నాడు. ఇరవైలో మొదటి నవల ప్రారంభించాడు. జీవిత సాధనా వైఫల్యమే ముఖ్య విషయంగా రాశాడు. "ది వైట్ పీకాక్" లారెన్స్ తొలి ఆవిష్కరణ. ఇరవై అయిదులో రాత – బోధనా మధ్య నలిగాడు. అప్పుడే తల్లి చనిపోయింది. మాతృప్రేమ కోసం అలమటించాడు. తట్టుకోలేక ఏడ్చేవాడు. అంతా అయిపోయిందనుకొనేవాడు. చావు మర్మం, నిత్య జీవితంలో వెంబడించే చావుపై దృష్టి పడింది. ఎందరో అమ్మాయిలూ వలచారు. వలపించారు. మరణం తర్వాత కూడా తల్లి ఇంకా బలీయంగా కనిపించింది అనిపించింది. అందుకనే ఏ అమ్మాయినీ ప్రేమించలేకపోయాడు. కొంత భయంతో, కొంత విశ్రాంతి కోసం టీచింగ్ మానేశాడు. కాని బోధిస్తున్నట్లు కలలొచ్చేవి, వీటిని వదిలించుకొందామన్నా వదిలేవి కావు.

ఇరవై ఒకటిలో ఫ్రీడ్‌వాన్ రిచ్‌టోఫెన్ వీక్లీ అనే ముప్ఫై ఒక్క ఏళ్ళ స్త్రీ పరిచయమైంది. ఆమె ఒకప్పుడు తనకు ప్రొఫెసర్ అయిన జర్మన్ తండ్రి కూతురే. అప్పటికే ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆమెలో మాతృ హృదయం ఉందని తెలుసుకొని ప్రేమించి ఆమెతో ఒక ఏడాది జెర్మని, ఆస్ట్రేలియా, ఇటలీలు తిరిగి ఆమె భర్త నుండి విడాకులు పొందిన తర్వాత పెళ్లి చేసుకొన్నాడు. ఇదంతా మూడవ కవితా సంపుటిలో నిక్షిప్తం చేశాడు. దీనికి "లవ్ పోయెమ్స్ అండ్ ఎమోర్స్" అని పేరు పెట్టాడు. అలాగే "లుక్ వి హావ్ కం త్రు" అనే స్వీయ చరిత్రలోనూ రాశాడు.

లారెన్స్‌కు "ప్రేమ అంటే పెనుగులాట". దాని అన్ని ప్రభావాలకు తట్టుకోవాలి. "I prefer my strife, infinitely, to other people's peace, havens and heavens" అన్న గొప్ప ఆదర్శ సిద్ధాంతం లారెన్స్‌ది. "God deliver me from the peace of this world. As for the peace beyond understanding, I find it in conflict" అని సమాధానం చెప్పాడు.

"Something in me remembers - and will not forget - the stream of my life in the darkness - deathward set - grief grief, I suppose and sufficient - grief makes us free - to be faithful and faithful together - as we have to be" వంటి కవితల్లో జీవిత తత్వాన్ని, సత్యాన్ని తెలియజేశాడు.

ఇరవై ఎనిమిదిలో మూడవ నవల "సన్స్ అండ్ లవర్స్" రాశాడు. మొదటి కథాసంపుటి "ది ప్రస్యన్ ఆఫీసర్" తెచ్చాడు. ముప్ఫైలో "ది రైన్ బో" బాధాతప్త హృదయంతో రాశాడు. చట్టవ్యతిరేకంగా సెక్స్ ప్రేరకంగా ఉందని నిషేధించింది ప్రభుత్వం. లెస్బియన్

భావాలున్నాయనీ ఆరోపణ. తాను రాతప్రతి చదవకుండా ముద్రించానని పబ్లిషర్ నెత్తీ నోరూ కొట్టుకున్నాడు. ఈ సమయంలో లారెన్స్ "సూపర్ రేషనల్ వే ఆఫ్ లైఫ్"పై ఆలోచన చేశాడు. "బుద్ధి కంటే సహజ జ్ఞానం గొప్ప" అన్నాడు. "My great religion is a belief in the blood, the flesh, as being wiser than the intellect. We can go wrong in our minds but what our blood feels and believes and says is always true" అని సిద్ధాంతీకరించాడు.

మొదటి ప్రపంచ యుద్ధం లారెన్స్ దంపతులను ఇంగ్లాండ్‌కు దక్షిణంలో ఉన్న జెన్నార్‌కు తరిమేసింది. అక్కడే కాల్‌రిడ్జ్, సూతీ ఆలోచించిన వదిలేసిన "పాంటిసోక్రసి"ని అక్కడి ప్రజల మనసుల్లో నింపాలని కలగన్నాడు. అందరితో కలిసి ఉంటున్నా లారెన్స్ వంట చేయటం, ఇల్లు ఊడవటం లాంటి పనులు చూసి నగర ప్రజలు అనుమానపడ్డారు. ఇదంతా విడ్డూరం అనుకొన్నారు. అసలే యుద్ధ భీతి. పైగా జర్మనీతో యుద్ధం. లారెన్స్ భార్య జర్మన్. ఆమె సోదరుడు జర్మన్ వైమానికుడు. కనుక లారెన్స్ ఒక గూఢచారి అని అనుమానించారు. లైట్లు ఆర్పేశారు. ఇల్లంతా సోదా చేసి చివరికి గెంటేశారు. రెండేళ్ళు లండన్ బెర్క్‌షైర్, మిడ్ల్యాండ్ హిల్స్‌లు తిరిగారు. యుద్ధం అయిపోయిన తర్వాత 1919లో లారెన్స్ దంపతులు ఇంగ్లాండ్ వదిలి కాంటినెంట్‌కు చేరుకున్నారు. పుస్తకాలను పుంఖానుపుంఖంగా రాస్తున్నా బీదరికంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అతని పుస్తకాలు ముద్రించటం సాహసం, ఇబ్బంది అనుకున్నారు పబ్లిషర్లు. ముప్పై అయిదులో "విమెన్ ఇన్ లవ్" రైన్ బోకు సీక్వెల్‌గా ప్రచురించాడు. ఇందులో "సూపర్ సెక్సువల్ లవ్"ను ప్రతిపాదించాడు. ఆరేళ్ళు దేశ దిమ్మరిగా తిరుగుతూనే ఉన్నాడు. అప్పుడప్పుడు లండన్ వచ్చి కొద్దికాలం ఉండి వెళ్లిపోతున్నాడు. "నా నుంచి నేను దూరమై పారిపోతున్నాను" అని రాసుకొన్నాడు. ఎక్కడ ఉన్నా కొద్దికాలంలో అది బాగా లేదనిపించటం ఇంకో చోటికి వెళ్ళటం అక్కడా నచ్చకపోవటం అదీ అతని పరిస్థితి. సార్డీనియా, ఆస్ట్రేలియా, అమెరికా ఎక్కడికెళ్ళినా ఇంతే. మెక్సికో చేరాడు. అక్కడ ఒక ప్రాఫెట్‌గా నాయకుడిగా మారాడు. అక్కడి సృజనాత్మక రచయితలను ఆర్టిస్ట్‌లను కలిసి తన మనోభావాలను చెప్పాడు. "ది ఫ్లూమేడ్ సేర్పెంట్", "మార్నింగ్ ఇన్ మెక్సికో" రాసి అందులో ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువుపై తనకున్న ప్రేమ, ఆరాధనకు పట్టం కట్టాడు.

సూర్యారాధన, రక్త విజ్ఞానం మొదలైనవాటిని అమలు చేశాడు. ఇవన్నీ చూసినవారు "ప్రో ఫాసిస్ట్" అన్నారు. 1925లో మళ్ళీ తిరిగి వచ్చే ఉద్దేశ్యంతో అమెరికా వదిలి పెట్టాడు. మళ్ళీ సంచారం చేస్తూ జెనోవా ఫ్లారెన్స్, ఆస్ట్రియా, జెర్మని మొదలైనవి తిరిగి చివరికి ఫ్రాన్స్ చేరాడు. నిరంతర అన్వేషణే ధ్యేయం. ఇదే జీవితంలో చివరి మజిలీ అయింది. ఇక్కడే మరపురాని వచన గ్రంధాలు చిరస్మరణీయ కవితా సంకలనాలు రాశాడు. కోపం, ఉద్రేకంతో

రాసిన కవితలూ ఇక్కడివే. "లేడీ చాటర్లీన్" ఇక్కడ పుట్టిన నవలే. "సెక్స్‌కు పవిత్ర ప్రేమకు సంఘర్షణ"ను ఈ నవలలో గొప్పగా చిత్రించాడు. సమకాలీన సాహిత్యంలో ఇంత అలజడి సృష్టించిన నవల ఇంకోటి లేదు. అందులో కొన్ని "పాశవిక శృంగార కథనాలు" ఉన్నాయి. అందులోనే లోతైన సానుభూతినీ వ్యక్తీకరించాడు. మొదట దీనికి "టెండర్‌నెస్" అని పేరు పెట్టాడు. దీన్ని వ్యతిరేకించారు, బహిష్కరించారు, నిషేధించారు. ఆధునిక ప్రపంచంలో విపరీత అనాగరికతకు, మానసిక, ఆధ్యాత్మికతకు మధ్య సమతుల్యం సాధించే ప్రయత్నమే ఈ నవల. "The source of all beauty and all real gentleness" అని విమర్శకాభిప్రాయమే కాదు లారెన్స్ మహర్షి భావన కూడా.

ఇంకా రెండేళ్ళు జీవించాలి. మెటాఫిజికల్ రెలిజియస్ ఎంక్వైరీతో సూర్య స్తుతి, చాటర్లీన్‌పై ప్రతివిమర్శ, డజను చిన్న కథలు, వంద కవితలతో ఒక పుస్తకం వెలువరించాడు. ప్రపంచ ప్రసిద్ధ హారర్ కథల్లో ఒకటిగా ఒక సూపర్ నేచురల్ చైల్డ్ కథ కూడా ఇందులో ఉంది. క్రమంగా లారెన్స్ ఆరోగ్యం తగ్గిపోతోంది. విపరీతమైన ఒత్తిడి, శ్రమ భరించలేకపోతున్నాడు. "పాన్సీస్" అనే కవితల రాతప్రతిని హోమ్ సెక్రెటరీ ఆర్డర్‌పై సీజ్ చేసి ప్రింటింగ్‌ను ఆపేయించారు పోలాస్ సహాయంతో. వెరవని లారెన్స్ "Trying to fulfill his living wholeness and his living union" కోసం రాస్తూనే ఉన్నాడు. "For one man, as for flower and beast and bird, the supreme triumph is to be most vividly alive" అని మనస్ఫూర్తిగా నమ్మిన లారెన్స్ మనిషి 01-03-1930న ఇటలీలోని వెనిస్‌లో ఆద్ ఆస్ట్ర అని పిల్చుకొన్న ఫ్రెంచ్ రివేరా పైన నలభై అయిదేళ్ళ వయసులో మరణించి అమరుడైనాడు.

జీవితకాలంలో నలభై పుస్తకాలు రాశాడు లారెన్స్. "A body of creative fiction, poetry and plays and controversial works as studies in classic American literature. Psycho analysis of the un conscious, Pornography and obscenity and aseries of autobiographical travel books. A long record of suffering, agony and ecstasy. Almost Lawrence touched was translated into a struggle, a death and resurrection of the flesh - He wrote as though his throat were choked in its own crimson"

ఒక తరాన్ని ప్రభావితం చేసిన లారెన్స్ "తాత్కాలిక సంఘటనే చివరిది" అనే భావంతో ఉడుకు రక్తంతో మూసుకున్న కళ్ళతో రాశాడు. అతనిది "చైతన్యశీల ఆత్మాన్వేషణ". అతని "కవితాత్మక వచనం, మనోహర కవిత్వం మానసిక సంఘర్షణ, బాహ్య ప్రపంచ హింసకు ప్రతీకలే". లారెన్స్ "One realm we have never conquered - the present,

one great mystery of time is terra incognita tous - the instant. The most superb mystery we have hardly recognized - the immediate instant itself" అని తన ఫిలాసఫీని స్పష్టం చేశాడు. ఆధునికత పేరుతో మానవతను దూరం చేసుకొంటూ పారిశ్రామిక ప్రగతిలో ఆదర్శాలను బలి పెట్టుకుంటున్న సమాజాన్ని జాగృతం చేశాడు లారెన్స్. "ఆర్టిస్టిక్ ఇంటేగ్రిటి, మోరల్ సీరియస్‌నెస్ ఉన్న బ్రిటిష్ రచయిత ఇంగ్లీష్ నవలకు మహా వారసుడు. విట్మన్ మేల్విల్లీ ప్రభావంతో రాశాడు. లారెన్స్ మరణం తరువాత అతని ఆరాధకురాలు కేథరీన్ కార్స్‌వెల్ లారెన్స్‌పై ఫారేస్టర్ లాంటి వారి క్రూర విమర్శలకు దీటుగా సమాధానం చెప్పింది. ఆల్డస్ హక్స్లీ కూడా 1932లో విడుదలైన లారెన్స్ ఉత్తరాల సంచికలో లారెన్స్ ప్రభావాన్ని కీర్తించాడు. తన మనోభావాలను చిత్రాలలో చక్కగా పెయింట్ చేసి వ్యక్తపరచిన చతురుడైన చిత్రకారుడు లారెన్స్. "Pictures of real beauty and great vitality" అని మెచ్చుకున్నారు. జీవితంలో మూడు వంతులు దరిద్రంతో, బహిష్కార సంచారంతో గడిపిన దురదృష్టవంతుడు లారెన్స్. సాంప్రదాయ ఆంగ్ల కల్పనా సాహిత్యానికి గొప్ప దోహదం చేసినవాడు లారెన్స్. అప్పుడప్పుడు స్త్రీలకూ వ్యతిరేకంగా రాసినా, అబల సబల కావాలని, శక్తి సంపన్నమైన స్వయం వ్యక్తిత్వంతో సంపూర్ణ మహిళగా ఎదగాలని కోరుకున్నాడు. ఫెమినిజం అనే పేరు పెట్టకపోయినా వారికి అందగానే రాశాడు. స్వయం పద్ధతిలో సమాజంలో నిలబడిన స్త్రీలనే పాత్రలు చేసి రాశాడు. "ప్రిసనర్ ఆఫ్ సెక్స్" నవలలో లారెన్స్ భావాలను నార్మన్ మైలెర్ సమర్థించాడు. ఆ తరంలో అన్ని ప్రక్రియలను చేపట్టి నిరుపమాన రచయిత అనిపించుకొన్నాడు లారెన్స్.

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 52

# ఊసర క్షేత్రాలు

**మ**నోభావం, బుద్ధి కన్నా గొప్పది అన్న లారెన్స్‌ను సవాలు చేసి, అతన్ని ఒంటరివాడని, అసంబద్ధ రచయిత అని తీసి పారేసి ఆడెన్, స్పెండర్, లేవిస్, ఎంప్సన్‌లు కొత్త పద్ధతికి తెర దీశారు. దీనినే ఆధునిక కవిత్వమని, కొత్త పదాల పలుకుబడుల కవిత్వమని, బౌద్ధికంగా చురుకైనవాడి కలదని అన్నారు. వీరికి కూడా ఒక ప్రణాళిక లేదు. ఒక ఆలోచనా శాఖ లేదు. కాని వారికి ప్రత్యేక శైలి మాత్రం ఉంది. అందుకే వీరిని "స్టైలిస్ట్ కవులు" అన్నారు. అందులో అగ్రభాగాన నిలిచిన వారు ఇద్దరు - ఎజ్రాపౌండ్ మరియు టి ఎస్ ఇలియట్.

**ఇమేజిస్ట్ కవి - ఎజ్రా పౌండ్**



ఎజ్రా లూమిస్ పౌండ్ అమెరికాలో న్యూ ఇంగ్లాండ్ లోని ఇడాహోలో హైలీలో 30-10-1885న పుట్టాడు. తల్లికి లాంగ్‌ఫెలో కవి బంధువు. తండ్రి ప్రభుత్వోద్యోగి. స్వశక్తి, బుద్ధితో హైలీలో మొదటి ప్లాస్టర్ ఇంటిని నిర్మించాడు. పౌండ్ తూర్పున ఉన్న పెన్సిల్వేనియా యూనివర్సిటిలో విద్య నేర్చాడు. తర్వాత న్యూయార్క్‌లోని హామిల్టన్ కాలేజిలో చేరి, ఇరవైలో పెన్సిల్వేనియా యూనివర్సిటి డిగ్రీ పొందాడు. అందులోనే బోధించాడు. ఒక ఏడాది రిసెర్చ్ చేయటానికి స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీలు తిరిగాడు. తిరిగొచ్చి ఇండియానాలోని కాఫోర్డ్స్ విల్‌లోని వా బాష్ కాలేజి ఫాకల్టిలో చేరాడు. ఆ పట్నం మంచి విద్యకు, విద్యావేత్తలకు కేంద్రం. పౌండ్ మాత్రం అక్కడే "బెన్ హర్" రాసిన "ల్యూ వాలెస్" చనిపోయాడని అన్నాడు. పౌండ్‌కున్న బోహిమియస్ భావాలు నచ్చక ఉద్యోగం పీకేశారు.

అసహనంతో యూరప్ వెళ్ళాడు. "గ్రామాలలోని ఆర్టిస్ట్‌లను నమ్మనివారికి,

వ్యతిరేకంగా మాట్లాడే అమెరికన్లకు బుద్ధి చెప్పాలని" నిర్ణయించుకొన్నాడు. తన మనోభావాలను "ఏ ల్యూం స్పెంటో"లో పొందుపరచి ఇటలిలోని వెనిస్‌లో పబ్లిష్ చేశాడు. లండన్లో నివాసముండి యువకులతో ఒక గ్రూప్‌ను తయారు చేసి లీడర్ అయి, చైనా, జపాన్ కవిత్వ సేకరణకై ఏర్పడిన "ఫెనో ల్లోసా"కు సాహత్య కార్యనిర్వహణాధికారిగా నియమింపబడ్డాడు. చైనా కవిత్వంలోని క్లుప్తత, స్పష్టత, జపాన్ కవిత్వంలోని "టాంకా", "హోక్కా"లలోని లోతైన భావాలు ఆకర్షించాయి. అవే పౌండ్ తొలి కవితల్లో చోటు చేసుకున్నాయి. అరవైలో రాసిన "కాంటో"లలోను వదలక నిలిచే ఉన్నాయి. ఇరవై ఆరులో ఓరియంటల్ పోయెట్రిలోని సౌందర్యం నచ్చి ఆ ధోరణిలో రాశాడు. అందులో ఒక లైన్ – "The apparition of these faces in a crowd - petals on a wet - black bough"

ఇరవై తొమ్మిదిలో డోరోతి షేక్స్‌పియర్‌ను పెళ్లి చేసుకుని కొడుకును కన్నాడు. అప్పటికే అయిదు చిన్న కవితా పుస్తకాలు రాసిన రచయిత అయినాడు. చివరి నాలుగు "పెర్సానే", "ఎక్సుల్టేషన్స్", "కాన్జోని", "రిపోస్టెస్" అని భావ గర్భితంగా పేర్లు పెట్టుకున్నాడు. ఇవన్నీ ప్రాంతీయ, పురాతన ఫ్రెంచి, విక్టోరియన్ చివరి కాల ప్రభావం కలవే. బ్రౌనింగ్, మారిస్, ప్రీ రాఫెలైట్స్ ఆవహించగా రాసిన కలగూర గంప కవితలే. దీని తర్వాతే స్పష్టమైన ఆలోచనా, భావ ప్రకటన ఏర్పడ్డాయి. బాలడ్స్, సేస్టినాలు రాస్తూ ఫ్రెంచ్ ఫారంస్‌ను వదిలేసి రిలీఫ్ పొందాడు. మనస్ఫూర్తి పరవళ్ళు తొక్కి "Come, my songs, let us speak of perfection - we shall get ourselves rather dislike - the gilded phaloi of the crouses - are thrusting at spring at spring air" అంటూ ఆవేశపడ్డాడు. బహుశా మన శ్రీశ్రీ "కవితా ఓ కవితా" కూడా ఇలాంటిదే.

వాల్ట్ విట్మన్ భావాలను వ్యతిరేకించినా కవికి దగ్గరయ్యాడు పౌండ్. "It was you that broke the new wood" అని మెచ్చాడు. తన ప్రత్యేకతను రుజువు చేసుకున్నాడు. కాని ఆంగ్ల కవులు ఆదరించలేదు. పైగా విండర్ హాం లేవిస్ "ఈ రెడ్డిష్ బ్రౌన్ అమెరికన్ – గ్లాసు నీళ్ళలో ఆయిల్ చుక్క. తమాషా ఏమిటంటే అందులో కలవాలని కోరుకోడు. ఊరికే ఊరిస్తాడు" అన్నాడు. కానీ పౌండ్ అహంకారం గర్వమే అతన్ని లెజెండ్‌ను చేశాయి. సాహిత్యం కళలపై స్పందన కలిగించే ఉపన్యాస సునామీ సృష్టించాడు. ఇంగ్లీష్ వాయిద్యం, బ్లాస్ట్‌ను బ్లాస్ట్ చేసే ధోరణిలో తీవ్రంగా భావోద్రేకంగా గుండెల్ని చీల్చి దూరేలా మాట్లాడాడు. చరిత్రే సృష్టించాడు. చికాగోలో యెర్రగడ్డంతో, ఊగిపోతూ విప్లవకారుడై విజృంభించాడు. పౌండ్ సలహాపై తను రాసిన "వేస్ట్ లాండ్" కవితలను సగం మాత్రమే ముద్రించి ఇలియట్ ఎజ్రాపౌండ్‌కే అంకితమిచ్చాడు స్వామి భక్తిగా.

1914లో పౌండ్ ఒక కవి బృందాన్ని తయారు చేసి సమకాలీన కవిత్వంలోని

అతిని నిరసిస్తూ ఒక మేనిఫెస్టో తయారు చేసి, తన గ్రూపుకు "ఇమేజిస్ట్స్" అని కొత్త పేరు పెట్టాడు. రొమాంటిసిజానికి వ్యతిరేకంగా ప్రతీకలకు ప్రాధాన్యమిచ్చారు. వారి సిద్ధాంతాలు ముఖ్యంగా మూడు. 1. సామాన్య భాషలో సరి అయిన మాటను ప్రయోగించి దానికి తళుకు బెళుకులు అద్దకుండా రాయాలి. 2. రిథంను పాత పద్ధతిలో ఛందోబద్ధంగా కాకుండా, కొత్త రైమ్స్‌ను కొత్త మూడ్స్‌ననుసరించి ఫ్రీవేర్స్‌లో రాయాలి. 3. కవిత్వ ఉత్పత్తి అస్పష్టంగా ఉండిపోవాలి (ఇండెఫినిట్). అంతర్జాతీయ భావన పరమావధిగా రాయాలి. టెక్నిక్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. కమ్యూనికేషన్ కంటే శైలికే అధిక ప్రాధాన్యం. ఈ సెటిల్‌మెంట్ కల్లోలం సృష్టించింది. దీన్ని "ఫ్రీ వేర్స్ ఫ్యూరోర్" అన్నారు.

అమెరికాలో ఇమేజిస్ట్ ఉద్యమానికి "ఆమి లోవెల్" పురుడు పోసింది. స్వయంగా ప్రచారం చేసింది. పౌండ్‌కు తెలిసి ద్రోహం అన్నాడు. ముగ్గురు ఇంగ్లీష్ ఇమేజిస్టేలు రిచార్డ్ ఎడింగ్టన్, ఎఫ్ ఎస్ ఫ్లింట్, ది హెచ్ లారెన్స్‌లను కిడ్నాప్ చేసి, మరో ఇద్దరు అమెరికాన్ కవులు జాన్ గోల్డ్ ఫ్లేర్, హిల్డా దూ లిటిల్ (హెచ.డి)లతో కలిసి "సమ్ ఇమేజిస్ట్ పోయెట్స్"ను 1915-16-17లను ఏర్పరచింది. ఈ బందిపోటు తనానికి నివ్వెరపోయి పౌండ్ అందులోంచి తప్పుకున్నాడు. "ది లిటిల్ రివ్యూ"కు ఎడిటర్ అయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే పారిస్ వెళ్లిపోయాడు పౌండ్.

పారిస్‌లో తన సృజనతో అగ్నిపర్వత ప్రేలుడు భావాలతో చెలరేగిపోయాడు. కొత్త శైలిని వ్యంగ్యాత్మకంగా, సంభాషణా పద్ధతిలో ఏర్పరచుకున్నాడు. "హగ్ సెల్విమాబెర్లి"ని ముప్ఫై అయిదులో పబ్లిష్ చేశాడు. ఆధునిక ప్రపంచాన్ని సెటైర్‌తో కొరడా ఝులిపించాడు. "A positive document of sensibility - is compact of the experience of a certain man in a certain place at a certain time and is also the document of an epoch, a genuine tragedy and comedy" అనిపించి ఆర్నోల్డ్ మాటల్లో "జీవిత విమర్శ" (క్రిటిసిజం ఆఫ్ లైఫ్) అయింది. కాంటోస్‌కు విశేష ఆదరణ వచ్చింది. దాదాపు పాతికేళ్ళు రాశాడు దీనిని. వంద అధ్యాయాలున్న అతిపెద్ద గ్రంథం. చివరి పది అధ్యాయాలను పీసాలో అరెస్ట్ చేసి 1945లో జెయిల్‌లో పెట్టినప్పుడు రాశాడు. "రాక్ డ్రిల్"ను చదవాలని ప్రయత్నించినవారికి నిరాశ ఎదురైంది. అది కోడ్ భాషలో రాశాడు. కొరుకుడు పడలేదు. పొరపాటు పడ్డారుకాని అది తప్పు కాదు. స్పష్టంగానే రాశాడు. అవన్నీ స్వీయానుభవాలు. వ్యక్తిగతాలు. "కంటోస్"కు రాసిన సూచికే మూడు వందల ఇరవై పేజీలుంది. ఇదంతా "స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్" (చైతన్య స్రవంతి) రచన అప్పటికి కొత్త. యేట్స్ కవి "విషయం కంటే శైలి గొప్పగా ఉంది. ఇంత బాగా భావాన్ని స్పష్టంగా తెలియజెప్పిన కవి లేనే లేదు. కాని మధ్య మధ్యలో తెగిపోతూ అతుకులు పడుతూ, మెలికలు

తిరుగుతూ, నరాల ఉద్రేకం కలిగిస్తూ, దివా స్వప్నమై, గందరగోళంగా ఉన్నది మాత్రం నిజం" అన్నాడు.

కాని పౌండ్ మాత్రం తాను "హ్యూమన్ కామెడీని అనేక గొంతుకలతో, అనేక పరిమాణాలతో, కోణాలలో చిత్రించాను" అని స్పష్టంగా చెప్పాడు. ఒక నిర్దిష్ట ప్రణాళిక సిద్ధం చేసుకొనే రాశాడు. ఇందులో వస్తువు వ్యతిరేక వస్తువు. చరిత్ర పునరావృత్తాలు, సమకాలీన స్థితిగతులు కలిసి అలా అనిపిస్తాయి. మొదటి ప్రపంచ యుద్ధాన్ని "ఇంఫెర్నో"లో డబ్బు, బాంకింగ్ పాపాలను "పర్జ్ టోరియా"లో క్లైమాక్స్‌ను "పరాడిసో" చిత్రించాడు. కొన్ని కవితా పంక్తుల్ని చూద్దాం –

"Hang it all Robert Browing - there can be but the one "Sordello" - but Sordello and my Sordello - lo sordels sifo di - Mantovana - so shu - churned in the sea"

1924లో ఫ్రాన్స్ వదిలి రాపల్లోలో స్థిరపడ్డాడు. స్నేహితులు తగ్గి శత్రువులు పెరిగారు. అమెరికా ప్రెసిడెంట్ జెఫర్సన్ కంటే ఇటలీ నియంత ముస్సోలినీ ప్రజాస్వామ్యాన్ని మెచ్చి ఫాసిజంను సమర్ధించాడు. రోమ్ నగరం రేడియోలో మాట్లాడుతూ అమెరికాను చెడతిట్టాడు. "తన అమెరికా"పై దాడి చేయమని ఫాసిస్టులకు ఉపదేశించాడు. ఉద్రేకి చివరకు దేశద్రోహి అయ్యాడు. 1945 మేలో అరెస్ట్ చేసి వాషింగ్టన్‌కు తీసుకొచ్చారు. మరణశిక్ష పడేదే కాని డాక్టర్లు పౌండ్ మానసిక పరిస్థితి బాగా లేదని తేల్చారు. తొమ్మిది నెలల తర్వాత సెయింట్ ఎలిజబెత్ మానసిక హాస్పిటల్‌కు మార్చారు. పన్నెండేళ్ళు కేసు నడిచింది. చివరికి పౌండ్ ఇక ఏ మాత్రమే విచారణకు నిలబడలేదని, ఇటలీలో చేసిన రేడియో ప్రసంగం మానసిక పరిస్థితి సరిగ్గా లేనందున చేసినదేనని తేల్చారు. ప్రజలు, ప్రజా సంఘాలు, రచయితలూ వాల్ట్ విట్మన్ నాయకత్వాన పెద్ద నిరసన తెలియజేశారు. 1958 మేలో హాస్పిటల్ నుండి విడుదలై ఇటలీ వెళ్లిపోయాడు. ఇటలీని తన పెంపుడు తల్లి అంటూ ఫాస్టిస్ పద్ధతిలో సాల్యూట్ చేసి "అమెరికా ఒక పిచ్చివాళ్ళ శరణాలయం" అన్నాడు.

రాజకీయంగా తప్పుడు దోవలో నడిచినా కవిత్వ పరంగా ప్రయోగాలు చేసి కొత్త వరవడి, పదబంధం, సామెతలు సృష్టించి నూతన శైలికి మార్గదర్శి అయి, ఎందరినో ప్రభావితం చేశాడు ఎజ్రాపౌండ్. అనుయాయులు పౌండ్ మార్గాన్ని ఇంకా నిగ్గు తేల్చారు. " Pound could not teach his followers what to say, but he had a great talent for showing them how to say it" కవిత్వాన్ని సంగీతంలో రంగరించి రాశాడు. "Possessed of a sense of sound, an "ear" for words, imbuing his poetry with melopoeia". కూంటర్ పాయింట్‌కు ప్రాధాన్యం ఇచ్చాడు. "సాంద్ర"

కవిత్వాన్నే రాశాడు. ఎన్నో అనువాదాలు చేసి పేరు పొందాడు. "As a translator, Pound was a pioneer with a great gift of language and an incisive intelligence. The leitmotifs in Pound's literary criticism are recurrent patterns found in historical events, which, he believed, through the use of judicious juxtapositions illuminate truth, and in them he reveals forgotten writers and cultures, he sought to emphasize the value of art and to "aestheticize" the political. He rejected traditional rhetoric and created his own. 1967 conversation with Allen Ginsberg, Pound told the young poet, "my poems don't make sense". He went on to call himself a moron, to characterize his writing as stupid and ignorant. "a mass". Ginsberg reassured Pound that he "had shown us the way", but Pound refused to be mollified. Any good I've done has been spoiled by bad intensions - the preoccupation with irrelevant and stupid things. (he) replied. Then very slowly, with emphasis, surely conscious of Ginsberg's being Jewish. 'But the worst mistake I made was that stupid, suburban prejudice of anti-semitism" మన చలంలాగా చివరికి లెంప లేసుకున్నాడు పౌండ్.

**ఆధునిక కవిత్వ మార్గదర్శి - టి.ఎస్.ఇలియట్**



ఎజ్రా పౌండ్, ఇలియట్‌లను జంటగానే సాహిత్య చరిత్రకారులు భావిస్తారు. గురుశిష్యులే. థామస్ స్టియార్న్ ఇలియట్ ఆంగ్ల రచయితలపై విశేష ప్రభావం ఉన్నవాడు. తన కవిత్వంలో బ్రిటిష్ కంటే అమెరికా కరెంట్ ఉందన్నాడు. ఇంగ్లాండ్‌లోనే ఎక్కువ కాలం ఉన్నాడు. అమెరికాలోని మిస్సోరిలో సెయింట్ లూయిస్‌లో 26-09-1888న జన్మించాడు. పూర్వీకులు న్యూ ఇంగ్లాండ్‌కు చెందిన ప్యూరిటన్‌లు. తాత బోస్టన్ యూనివర్సిటిని, సెయింట్ లూయిలో మొదటి యూనిటేరియన్ చర్చ్‌ని స్థాపించాడు. మిల్టన్ అకాడెమిలో చదివాడు. ఇరవై ఒకటిలో బి.ఏ తర్వాత ఎం.ఏ పాసై ఇంగ్లాండ్ వెళ్లి ఆక్స్‌ఫర్డ్‌లో మేర్టాన్ కాలేజిలో స్కూల్ మేస్టర్ అయి బాంక్ క్లెర్క్‌గా పనిచేశాడు. ఎనిమిదేళ్ళ తర్వాత లండన్ పబ్లిషింగ్ హౌస్‌లో చేరి పూర్తి భాగస్వామి అయ్యాడు. నలభైలో బ్రిటిష్ పౌరసత్వం పొందాడు. "ఆంగ్లో కేథలిక్"నని ప్రకటించుకొన్నాడు. రాజకీయాలలో రాయలిస్ట్‌ను అన్నాడు. సాహిత్యంలో క్లాసిస్ట్‌నన్నాడు. ఇరవై ఏడులో వివేన్నా హేగ్‌ను పెళ్లి చేసుకొన్నాడు. ఏడేళ్ళ కాపురం తర్వాత

ఆమె చనిపోతే పదేళ్ళ తర్వాత తన సెక్రెటరి వాలెరీ ఫ్లెచర్‌ను వివాహమాడాడు.

పందొమ్మిదేళ్ళ వయసులో సంప్రదాయ పద్ధతిలో కవిత్వం రాశాడు. గ్రాడ్యుయేట్ కాక పూర్వమే ఫ్రెంచ్ సింబాలిజం అర్థం చేసుకొన్నాడు. లా ఫోర్జ్‌ను ఆదర్శంగా తీసుకొన్నాడు. అప్పుడున్న కాల మాన పరిస్థితులకు అసహనం చూపాడు. కొత్త శైలిలో దాన్ని కవిత్వీకరించాడు. స్నేహితులు దీన్ని "ఎలిప్టికల్ స్కూల్" అన్నారు. ఇడియంను ఇంకా పదును బెడుతూనే ఉన్నాడు. ఇరవై మూడులో "ది లవ్ సాంగ్ ఆఫ్ ఆల్ఫ్రెడ్ ప్రూ ఫోర్క్" అనే మొదటి ముఖ్యమైన కవిత రాశాడు. కంటికి కనిపించిన ప్రతిదాన్ని ఇమేజరిగా వివరించాడు. దీనితో ఇంగ్లీష్ ప్రజల్లో దడ పుట్టించాడు. డాంటే రాసిన కొటేషన్‌తో దీన్ని ప్రారంభించి రాశాడు. అది చదివిన వారికే ఇది అర్థమవుతుంది అదీ ఫిటింగ్. అసందిగ్ధంగా, నిర్ణయాత్మక రహితంగా సాగిన కవిత అది. ఘనీభవించిన సమాజానికి, వంధ్యత్వం పొందిన సంఘానికి అది ప్రతీక. "Let us go then if you and I - when the evening is spread out against the sky" అంటూ సాగే కవిత అది. "My life is measured by coffee spoons" అంటాడు. "Do I dare - disturb the universe? - and should I then presume? - and how should I begin?" అని ప్రశ్నించాడు.

ముప్ఫై నాలుగులో రాసిన "వేస్ట్ ల్యాండ్" కవితలలో బోర్ దం, హారర్, కీర్తిలను ప్రతిష్టించాడు. ఇందులో జ్ఞాపకాలు, కోరికలు ఉన్నాయి. క్రిస్టియానిటి చాలెంజికి సమాధానం అన్నారు. లండన్ నగర జనజీవితంలో ఉన్న "ఊసర క్షేత్ర" దర్శనమే ఇది. ప్రతి చోటా ఉన్న చావును కనిపెట్టాడు. కవితను ముక్కలు ముక్కలుగా చేసి రాశాడు. అందులోని క్రియా సౌభాగ్యానికి మురిసిన వారున్నారు. ఇందులో శిధిల చిహ్నాలున్నాయి. "బోలు మనుషుల" నిజరూపం చూడగలం. అన్నీ కోల్పోయిన ప్రపంచాన్ని చూస్తాం. "Paralysed force, gesture without motion, men figures stuffed with straw, gather on stony soil in a valley of dying stars" అని కదలలేని కుళ్ళిన కంపు కొడుతున్న, ధ్యేయంలేని సమాజాన్ని చూపించాడు. "This is the way the world ends - this is the way the world ends - this is the way the world ends - not with a bang but a whimper" అని మూడు మాటలు గంటకొట్టి ప్రపంచ పరిసమాప్తిని చెప్పాడు.

క్రమంగా అనుకోని మార్పులు ఇలియట్‌లో కలిగాయి. నాటక రచయిత అయ్యాడు. "ది రాక్" డ్రామా రాశాడు. మర్డర్ ఇన్ ది కేథడ్రిల్"ను సెయింట్ థామస్ త్యాగాన్ని గుర్తు చేస్తూ రాశాడు. ఫామిలీ రి యూనియన్, కాక్‌టైల్ పార్టీ, ది కాన్ఫిడెంషియల్ క్లెర్క్, ది ఎల్డర్ స్టేట్స్‌మన్‌లు మనసులోకి దూసుకుపోయేట్లు, బాధ వ్యధ కలిగిస్తూ, హాస్యం చిప్పిలుతూ రాశాడు.

అరవైలో "కన్సేర్వేటివ్ ఎల్డర్ స్టేట్స్ మన్" అనిపించుకొన్నాడు. కమ్మని స్పష్టమైన స్వరంతో తన కవితలను రికార్డ్ చేసుకొన్నాడు. వి.ఎస్.ప్రిచేట్ ఇలియట్‌ను "A trim anti Bohemian with black bowler and umbrella, the well-known symbol of male respectability, ushering us to our seats in hell" వర్ణించాడు.

యాభై సమీపిస్తుండగా "ఫోర్ క్వార్టర్స్" విడుదల చేశాడు. గొప్ప ఫిలాసఫికల్ పోయెం అన్నాడు. కాని అంతగా పేలలేదు. ఒక డిజైన్‌లో ఇంకో డిజైన్ కలిసిపోయి గజిబిజి అయింది. "ట్రడిషన్ అండ్ ఇండివిద్యువల్ టేలెంట్"లో సాహిత్య విమర్శ చేశాడు. అరవైలో ఆధునిక కవిత్వానికి మార్గదర్శనం చేసినందుకు నోబెల్ ప్రైజ్ నిచ్చారు. నాలుగవ జార్జి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రదానం చేశాడు. "The process of advancement is interesting, one seems to become a myth, a fabulous creature that does not exist, one does not feel any different though, it is not you get bigger to fit the world, the world gets smaller to fit you" అని ఫిలాసఫికల్‌గా స్పందించాడు. డెబ్భైలో ఆయనపై ఒక సింపోజియం నిర్వహించారు. అతని ప్రభావం పై డజనుకు పైగా పుస్తకాలు తెచ్చారు. "కొత్త క్రిటిక్స్"ను "లెమన్ స్క్వీజెడ్ క్రిటిక్స్" అన్నారు. వీటిపై "Good poetry must exhibit several qualities in proportion of which one is good sense" అని కవిత్వ పరామావధి చెప్పాడు. మేధతోపాటు మత భావాన్నీ జోడించాడు. "సెలెక్టెడ్ ఎస్సేస్"లో కవిత్వాన్ని గురించి చాలా రాశాడు. "కవిత్వం ప్రపంచాన్ని కొత్త దృష్టితో చూపిస్తోంది. అందులో కొత్త భాగాలనూ తెలియజేస్తుంది. ఎప్పటికప్పుడు లోతుల ఆవిష్కరణ చేస్తుంది. నిజంగానే దూసుకుపోయేట్లు చేయగల సమర్థతా ఉంది". ఇలియట్ సాహిత్య సర్వస్వం కొత్త శబ్ద సృష్టితో ముడిపడింది. కొత్త, చూడనిలోక దర్శనం చేయిస్తుంది. ఆనందాన్ని మాత్రమే కాక ఎక్కువ జాగృతి కలిగిస్తుంది.

చివరికాలంలో ఆల్కహోలిక్ అయి "రిం జిమ్ రిం జిమ్" అంటూ "జిమ్"ను జాం మంటూ తెగ తాగేవాడు. 04-01-1965న ఇంగ్లాండ్‌లో మరణించాడు. ఆయన ద్విశాతాబ్దికి లండన్ పోయెట్స్ కార్నర్‌లో వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో ఒక పెద్ద శిలను ఉంచి గౌరవించారు. వర్జీనియా ఉల్ఫ్ జేమ్స్ జాయిస్ మొదలైన వారిని ప్రభావితం చేశాడు. ఆధునిక కవిత్వ మార్గదర్శి టి.ఎస్.ఇలియట్, భారతీయ వేద విషయాలు "దం, దాంతం ధమద్వం" మొదలైన పదాలను వేస్ట్‌లాండ్‌లో వాడాడు.❁

"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 53

# ఆందోళన కాలం

**అ**మెరికా, బ్రిటన్ దేశాలలో గడచిన రెండు శతాబ్దాలలో రెండు వందలకు పైగా కవులున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎవర్ని గుర్తుంచుకుంటారో ఎవర్ని మర్చిపోతారో కాలమే నిర్ణయించాలి. అందులో ఒక పదహారుగురు మాత్రం తమకాలంలోని సమస్యల్ని, ఒత్తిడులను తట్టుకొని నిలిచారు. ఇరవైవ శతాబ్ది మొదటిభాగం అంతా రెండు ప్రపంచ యుద్ధాలతో మరికొన్ని చిన్న యుద్ధాలతో గడిచింది. వీటి వలన శాంతి చేకూరలేదు కాని నిరంతర ఘర్షణ వాతావరణమేర్పడింది. మూడవ ప్రపంచ యుద్ధం రావచ్చు అనే భయంతో కొంత మంచితనం దేశాల మధ్య వికసిస్తోంది. సహిష్ణుత పెరిగింది. హెన్రి డేవిడ్ తోరో నమ్మినట్లు "The mass of men lead lives of quiet desperation was now obvious to every one". ఈ కవులు బయటి సంఘర్షణలకు, లోపలి టెన్షన్‌లకు గురైనవాళ్ళే. కొందరు ఈ కుదుపులను రికార్డ్ చేస్తే కొందరు అలవికాక విసిరి వేయబడ్డారు. మరి కొందరు పలాయనానికి సిద్ధపడ్డారు. వారిని గురించే ఇప్పుడు మనం తెలుసుకోబోతున్నాం.

**వామభావ కవి – డబ్ల్యు.హెచ్.ఆడెన్**



విస్టాన్ హగ్ ఆడెన్ "ది ఏజ్ ఆఫ్ యాంక్సైటీ" రాసిన పుస్తకంలో ఈ కవిత ముఖ్యమైనదే కాదు, ఆధునిక మానవుని లోని భయాలు, ఆందోళన, కలవరం, అసూయ, నిరాశలకు ప్రతి ధ్వని. "Factories bred them - corporate compa nies, college towns - mothered his mind, and many journals - backed his beliefs. He was born here. The - bravura of revolvers in

voguenow - and the cult of death are at home - inside the city". తనకాలాన్ని అత్యధిక ప్రభావితం చేసిన మేధావి, రచయితా ఆడెన్. రిటైర్డ్ డాక్టర్ పుత్రరత్నం. ఆక్స్‌ఫర్డ్ గ్రేశం స్కూల్, హోల్ట్, క్రిస్ట్ చర్చ్‌లలో చదివాడు. మొదటి కవితాసంకలనం "పోయెమ్స్" ఇరవై మూడులో తెచ్చాడు. ఇరవై ఎనిమిది వరకు సక్లాలో పనిచేసి వామపక్ష భావకవుల్లో చేరాడు. తర్వాత ఫిలిం యూనిట్‌కు పనిచేశాడు. స్పానిష్ సివిల్‌వార్‌లో స్ట్రెచేర్‌లాగే పనిచేశాడు. "స్పెయిన్" కవిత రాసి కింగ్స్ మెడల్ పొందాడు. "ది పోయెట్స్ టంగ్" పత్రికకు సహాయ సంపాదకుడు. "ఆక్స్‌ఫర్డ్ బుక్ ఆఫ్ లైట్ వెర్స్"కు పూర్తి బాధ్యతలతో ఎడిటర్ అయ్యాడు. థామస్ మాన్ కూతురు ఎరికా మాన్‌ను పెళ్ళాడాడు. అమెరికా వచ్చి 1864లో సిటిజన్ అయ్యాడు.

ఇప్పటికే కవిత్వంలో నాలుగు పుస్తకాలు, మూడు డ్రామాలు, వ్యాస సంపుటి, యాత్రపై రెండు, మూడు ఆంథాలజీలు వెలువరించాడు. రాజకీయాల్లో, కవితా టెక్నిక్‌లలో వివాదాలకు కేంద్రమయ్యాడు. ఆడెన్ పేర "ఆడెన్ అండ్ ఆఫ్టర్" అనే ఒక ఇంగ్లీష్ మేగజైన్ తెచ్చారు. దీనికే ఉప శీర్షికగా "ది లిబరేషన్ ఆఫ్ పోయెట్రి" అని పేరు పెట్టారు. ఇలియట్ తర్వాత సాహిత్యంలో పెద్ద దిక్కు ఆడెన్ అయ్యాడు. బాల్యం నుండి కవిత్వం రాస్తున్న తనకు హార్డీ ఆదర్శం అన్నాడు. వెయ్యేళ్ళ కిందటి ఆంగ్లో సాక్సర్ కవిత్వంపై ఆడెన్‌కు మోజెక్కువ. వ్యక్తిగా, కవిగా తనకొక స్థానాన్ని తన దేశంలో పొందాడు. అమెరికా తనను రాయటానికి ఆకర్షించింది అని చెప్పాడు. "అమెరికాలో ఏది జరుగుతుందో ప్రాపంచమంతటా అదే జరుగుతుంది" అని నమ్మకంగా చెప్పాడు. "అమెరికన్ అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్" అవార్డ్ పొందటమేకాదు అందులో సభ్యత్వాన్ని కూడా పొంది గౌరవం పెంచుకున్నాడు. పులిట్జర్ ప్రైజ్ వచ్చింది. అనేక కాలేజీలలో యూనివర్సిటీలలో బోధించాడు. "లండన్ టైమ్స్" ఆడెన్‌పై సాహిత్య ప్రత్యేక సంచిక వెలువరించింది.

1956 మళ్ళీ ఇంగ్లాండ్ వెళ్లి లెక్చర్లిచ్చాడు. మాథ్యూ ఆర్నోల్డ్ తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో "చైర్ ఆఫ్ పోయెట్రి" స్థానం పొందాడు. కవితలు, నాటకాలు రాస్తూనే ఉండి అయిదు సంపుటాలు తెచ్చాడు. నార్మన్ హోమ్స్‌తో కలిసి "పోయెట్స్ ఆఫ్ ది ఇంగ్లీష్ లాంగ్వేజ్"ను "ఏ బుక్ ఆఫ్ మోడరన్ అమెరికన్ వెర్స్" పుస్తకాలు తెచ్చాడు. "ది ఎంచేఫేడ్ ఫ్లడ్" కూడా రాశాడు కార్రిడ్జ్. లూయిస్, మాన్లి హాప్కిన్ మెల్విల్లే, బాడెర్లేర్, జూల్స్ వెర్న్ వగైరాలపై ఎన్నో ఉపన్యాసాలిచ్చాడు. ఫ్రాయిడ్, పాస్కల్, వోల్టైర్, మాంటేగ్, ఐన్‌స్టీన్, కీర్కెగార్డ్ మొదలైన వారిపై కవితలు అల్లాడు. "కవితకు ఏదీ అనర్హం కాదు" అని చాలాసార్లు రుజువు చేశాడు. ఆంగ్లో కేథలిజం ప్రవర్తనను ఎండగట్టాడు. "ఆన్ ది ఐలాండ్"లో సాంఘిక భావాలు స్పష్టంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఎంతో ఉదాత్తంగా రాస్తే, మరి కొన్నిసార్లు వీధి రౌడీగా వెంబడించాడు.

"లా సే ది గార్డేనర్స్ ఈజ్ ది సన్"లో

"Law says the judge as he looks down his nose - speaking clearly and most severely - law is as I have told you before - law as you know suppose - law is let me explain it once more - law is the law"లో సహజ ప్రాకృతిక కవిలా కనిపిస్తాడు. "But in my arms till break of day - let the living creature lie - mortal, guilty but to me - the entirely beautiful"లో లిరికల్ అనిపిస్తాడు. కొత్త జాడలను, పాత విధానాలలో రాశాడు. నాశనమైపోతున్న నాగరికత నుండి కొద్దిగా మత దృష్టిలోకి మళ్లాడు. న్యూయార్క్‌లో ఏడు తరాల మానవుల్ని ఏడు దశల్లో చూపించాడు. కుంగిన ప్రపంచాన్ని చూసి "Intellectual disgrance - stars from every human face - and the seas of pity lie - locked and frozen in each eye" అని కలత చెందాడు. ఆయన కవిత్వం సాధనకు దారి చూపింది. "ఒకరిపై ఒకరం ప్రేమ చూపించాలి లేక చచ్చిపోవాలి" అని బాధగా రాస్తాడు. "In the deserts of the heart - let the healing fountain start - in the prison of his days - teach the freeman how to praise" అని రావాల్సిన మార్పును ఆశించాడు ఆడెన్ "ఆమెన్".

ప్రేమ, రాజకీయం, మతం, నీతి, పౌరసత్వం, సైకాలజీలపై గొప్ప శైలితో టెక్నిక్‌తో రాశాడు ఆడెన్. అతని భావాలపై ఎన్నో డాక్యుమెంటరి ఫిలింలను తయారు చేశారు. "ఫనేరల్ బ్లూస్", "అ నోన్ సిటిజన్", సెప్టెంబర్ ఫస్ట్", "రెఫ్యూజి బ్లూస్" కవితలు ఇప్పటికీ చదివి ప్రేరణ పొందుతున్నారు. అమెరికా హృదయంలో దూసుకు వెళ్ళిన కవిగా ఆధునిక కవులలో గొప్పవాడిగా భావించారు. నోబెల్ ప్రైజ్‌కు ఎంపికయ్యాడు కాని రాలేదు. 29-09-1973న అరవై ఆరేళ్ళ వయసులో ఆస్ట్రియాలోని వియన్నాలో చనిపోయాడు. లండన్ వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో స్మారక చిహ్నం ఉంచారు. ఇరవైవ శతాబ్దపు గొప్ప రచయితలలో ఒకడు ఆడెన్. ఒపెరా లిబర్టోస్ రాసి భావాలను బలంగా సూటిగా చెప్పాడు.

### సాంఘిక న్యాయం కోసం పోరాడిన - స్టీఫెన్ స్పెండర్



ఆడెన్‌తో లింక్ ఉన్నవాడు స్టీఫెన్ స్పెండర్. 28-02-1909లో లండన్‌లో జర్మన్ జ్యూయిష్‌గా ఆంగ్ల ఆరిజిన్‌లో జన్మించాడు. తండ్రి హెరాల్డ్ స్పెండర్ గొప్ప జర్నలిస్ట్. తల్లి "వయొలెట్ శస్టర్". పదిహేడులో కెమిస్ట్ లేబిల్స్‌ను చైనా ప్రెస్‌లో ముద్రించి జీవించాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటి కాలేజిలో చదివి

ఆడెన్‌కు అసోసియేట్ అయ్యాడు. కమ్యూనిస్ట్ పార్టీలో చేరి వారి నిర్బంధ విధానాన్ని ఎదిరించి బయటపడి "ది గాడ్ దట్ ఫైల్డ్"లో తెలియజేశాడు.

పందొమ్మిదిలో దారుణంగా "నైన్ ఎక్స్‌పెరిమెంట్స్"ను పేపర్ బౌండ్ పాంప్లేట్‌గా ముద్రించి, రెండేళ్ళ తర్వాత "ట్వెంటి పోయెమ్స్" అచ్చు వేశాడు. వీసాను తిరస్కరించినా విదేశాలకు వెళ్ళి స్పెయిన్‌లో "ఇంటర్‌నేషనల్ రైటర్స్ కాన్ఫరెన్స్"లో పాల్గొన్నాడు. కొన్ని నెలలు ఉండి స్పానిష్ లాయలిస్ట్ కవుల రచనలను అనువాదం చేశాడు. మొదటి భార్యకు విడాకులిచ్చి పియానిస్ట్ నటాషా లిత్వాన్‌ను రెండో పెళ్లి చేసుకున్నాడు. "ది హోరైజన్" పత్రికను మిత్రుడితో కలిపి నడిపి రెండవ ప్రపంచ యుద్ధంలో తరచుగా అమెరికా వెళ్లి ఉపన్యాసాలిచ్చాడు. 1953లో ఇర్వింగ్ క్రిస్టల్‌తో కలిసి "ఎన్కౌంటర్" అనే అంతర్జాతీయ మాసపత్రికను "కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం" ఆర్థిక సాయంతో నడిపాడు. సమకాలీన సమస్యలపైనే స్పందించి ఎక్కువగా రాశాడు. "ది లాండ్ స్కేప్ నియర్ ఏరో డ్రోం" కవితలో "More beautiful and soft than any moth - with burning furred antennae feeling its huge path - through dusk, the air - liner with shut off engines" అని సహజ వర్ణన చేశాడు.

"ఆధునిక కవిత్వం యంత్రాన్ని జీర్ణించుకోవాలి" అన్న హార్ట్ క్రేన్ అభిప్రాయంతో ఏకీభవించాడు. యంత్రం కూడా చెట్టు, పుట్ట, పిట్ట, పశువు లాంటిదే అన్నాడు. సాంకేతిక సింబల్స్‌ను కవిత్వంలో ప్రవేశపెట్టాడు. యంత్రం వెనక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలన్నాడు. "నాట్ పాలసెస్"లో మానవునిపై యంత్రం యొక్క ప్రభావాన్ని తెలిపాడు. "Drink from here energy and only energy - as from the electric charge of a battery" ప్రకృతిలోని సర్వాంగా శాఖలు సహకరించుకోవాలని కోరాడు. "డెత్ టు ది కిల్లర్స్ బ్రింగింగ్ లైట్ టు లైఫ్" అనేది అతని సిద్ధాంతం. "యాన్ ఎలిమెంటరి క్లాస్ రూమ్ ఇన్ ఏ స్లం"లో మానవ పీడనను చిత్రించాడు. "How that works, money, interest building, could ever hide - the palable and obvious love of man for man" అంటాడు. నీతి భావనలు చూస్తున్న ఈ దారుణాలలోంచే పుట్టాయి. అప్పుడు ఉపన్యాసం అయింది కవిత. "Poet Laurance Consultant in poetry to the United States Liberty of Congress in 1965" అయ్యాడు. 16-07-1995న ఎనభై ఆరవ ఏట లండన్‌లో చనిపోయాడు. ఇరవయ్యవ శతాబ్ద విజ్ఞానాన్ని అందించటానికి స్టీఫెన్ స్పెండర్‌పై క్లబ్ ఏర్పడి సేవ చేస్తోంది. సాంఘిక న్యాయం కోసం పోరాడిన కవి, రచయితా స్పెండర్.

**కొత్త విమర్శకు మార్గం వేసిన – విలియం ఎంప్సన్**



"రొమాంటిక్ ఇర్రేషనాలిటి"పై పోరాడినవాడు విలియం ఎంప్సన్. కవిగా కంటే రచయితగా ప్రసిద్ధుడు. 27–09–1906లో యార్క్‌షైర్‌లో పుట్టి, విన్చేస్టర్, కేంబ్రిడ్జిలోని మాగ్డలీన్ కాలేజిలో చదివి గణితం ప్రధాన విషయంగా డిగ్రీ పొందాడు. "సెవెన్ టైప్స్ ఆఫ్ యాంబిగ్యుటి" అనే మొదటి పుస్తకాన్ని ఇరవై నాలుగులో ముద్రించాడు. "న్యూ క్రిటిసిజం"కు పునాది రాయి వేశాడు. పాతికేళ్ళ వయసు నుండే టీచర్. టోక్యో, చైనా, ఇంగ్లాండ్, అమెరికాలలో లెక్చర్లిచ్చాడు. ముప్ఫైలో బిబిసిలో ఉద్యోగి అయి, ఏడాది తర్వాత చైనీస్ భాష ఉపన్యాసాలకు సూపర్వైజర్ అయ్యాడు. "కలెక్టెడ్ పోయెమ్స్" పేరిట రెండు కవితా సంకలనాలు పబ్లిష్ చేశాడు. ఆ తర్వాత వచనానికే పరిమితమైనాడు. "Johnson could see no bicycle would go - you bear yourself, and the machine as well "gannets for germans not from othello - and ixion rides upon a single wheel" అని జరగవనుకొన్నవి జరుగుతున్నాయని తెలియజేశాడు. మంచి వక్తగా, గొప్ప టీచర్‌గా ఎంప్సన్ ప్రసిద్ధుడు. 15–04–1984న 77 వయసులో మరణించాడు. సోషియో పొలిటికల్ భావవ్యాప్తి చేశాడు. "Empson's Milton's God is often described as a sustained attack on Christianity and defence of Milton's attempt to 'justify God's ways to man' in Paradise Lost". బౌద్ధ ఫిలాసఫీని రచనలలో కలిపి రాశాడు.

**జాజ్ సంగీతానికి దారి వేసిన – ఎడిత్ సిట్వేల్**



07–09–1887లో స్కార్‌బరోలో పుట్టింది. ఆకర్షణల కల యువతి. "క్లౌన్స్ హౌసెస్", "ది వుడెన్ పీగాస్", "ఫేకెడ్" సంపుటాలు రాసి ప్రచురించింది. భూలోక స్వర్గాన్ని స్వయంగా నిర్మించుకొన్నది. ఆబెద్ అనే కవితలో "Jane, jane - tall as crane - the morning light creaks down again" అంటూ నర్సరి రైంగా రాసింది. అర మూత కన్నులతో ప్రాభాత సూర్యోదయాన్ని, ఊహాత్మకంగా రాసింది. "సర్ బెల్జెబబ్"లో "When - sir - Bleezebub called for his syllabub in the hotel in hell - where Proserpine fell - blue as the grandarmerie were the waves of the sea" అంటూ కలల లోకంలో విహరిస్తూ చెప్పింది.

నలభై ఆరవ ఏట ఎడిత్‌కు రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ పతకం ఇచ్చి గౌరవించింది. రెండవ ఎలిజబెత్ రాణి "డేమ్ కమాండర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్"ను చేసింది. రోమన్ కేథలిక్ అయింది. కవిత్వంతోపాటు విమర్శ గ్రంథాలు ఎక్కువే రాసింది. పోప్ జీవితచరిత్ర రాసి రికార్డ్ సృష్టించింది. అనేక ఆంథాలజీలు రాసింది. 09-12-1964న డెబ్భై ఏడు వయసులో మరణించింది. "Hythms of the tom - tom and of jazz, and shows considerable technical skill". సృజనతో అందరికి దగ్గరైంది.

**ప్రయోగశీలి – విల్ఫ్రెడ్ ఓవెన్**



మొదటి ప్రపంచ యుద్ధం కొత్త తరహా కవులను పరిచయం చేసింది. న్యాయమైన యుద్ధం లేదని యువ గ్రూప్ వాదించింది. అందులో విల్ఫ్రెడ్ ఓవెన్ గొప్ప ప్రభావం చూపించాడు. ష్రోఫైర్‌లో 18-03-1893లో పుట్టిన ఓవెన్ లండన్ యూనివర్సిటీలోని బర్కెన్‌హెడ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి చదివి ట్యూటర్ అయి, యుద్ధంలో సైనికుడిగా చేరి గాయపడితే వార్ హాస్పిటల్‌లో చేర్చారు. తోటి బాధితుడు సీగ్‌ఫ్రీడ్ ససూన్ ప్రేరణతో కవిత్వం రాయటం ప్రారంభించాడు. ఏడాది తర్వాత వెస్టెన్ ఫ్రంట్‌కు పంపేశారు. సాహసకృత్యానికి మిలిటరీ క్రాస్ అవార్డ్ పొందాడు. సాంబ్రెర్ కెనాల్‌లో తన బృందాన్ని రక్షించే పనిలో చనిపోయాడు. ససూన్ బయటపెట్టిన వ్రాతప్రతుల ద్వారానే కవిగా లోకానికి పరిచయమైనాడు. ముందు మాటగా "This book is not about heroes. English poetry is not yet fit to speak of them, not is about deeds or lands not any thing about glory, honour or dominion - except war - above all this book is not concerned with poetry, the subject of it is war, and the pity of war, the poetry is in the pity" అని నిజాన్ని "గన్ షాట్"గా చెప్పాడు.

ఓవెన్ ఇంగ్లీష్ వెర్స్‌లో ప్రయోగాలు చేశాడు. ఆడెన్ స్పెండర్ మొదలైన కవుల మార్గాన్ని అనుసరించాడు. అతనిలో కవిత్వం చివరి రోజుల్లో జ్వాలగా వెలిగింది. కీట్స్ సమాధిని దర్శించి రాసిన కవిత కదలించేస్తుంది. "Move him into the sun - gently in touch awoke him once - at home whispering of fields unsown - always it woke him even in France - until this morning and this snow - if anything might rouse him now - to kind old sun will know".

04-11-1918న ఓవెన్ ఫ్రాన్స్‌లో చనిపోయాడు. ఫ్రాయిడ్ ప్రభావం ఉన్న కవి.

"యాంతం ఫర్ డూమ్డ్ యూత్" కవిత అద్భుతమైనది. యుద్ధ సానుభూతికి అద్దంపట్టిన కవిత్వం రాశాడు.



**ఇండివిద్యువలిస్టు కవి - రాబర్ట్ గ్రేవ్స్**

"ఇండివిద్యువలిస్ట్" అయిన రాబర్ట్ గ్రేవ్స్ ఐరిష్ కవి కుమారుడు 26-07-1895లో లండన్‌లో పుట్టి, ఆక్స్‌ఫర్డ్ కాలేజిలో స్కాలర్‌షిప్‌తో చదివి యూనివర్సిటిలో చేరకుండా రాయల్ వేస్ ఫుసిలర్స్‌లో పేరు నమోదు చేసుకొని మొదటి ప్రపంచ యుద్ధంలో పనిచేసి మూడు కవితా సంకలనాలు తెచ్చాడు. సెయింట్ జోసెఫ్‌లో డిగ్రీ పొంది ఈజిప్ట్ వెళ్లి కెయిరో యూనివర్సిటిలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయి, ఏడాదికే బయటికొచ్చి పెళ్ళాన్నీ, ఇంగ్లాండ్‌నీ వదిలేశాడు. ఒక ప్రెస్ కొని అమెరికా కవి లార్డ్ రైడింగ్‌తో కలిసి అనేక విమర్శనాత్మక వ్యాసాలు రాసి ప్రింట్ చేశాడు. "గుడ్ బై టు ఆల్ దట్" అనే స్వీయ చరిత్ర రాసుకున్నాడు. అనేక చారిత్రక నవలలు సీరియల్‌గా రాశాడు. గ్రీక్ మైథాలజీ మీద మోజు ఏర్పడి "క్రౌనింగ్ ప్రివిలేజ్" వగైరా రాశాడు. పౌండ్, ఇలియట్, ఆడెన్ మొదలైన వారిపై విరుచుకు పడ్డాడు. వీళ్ళను "ఫాల్స్ గాడ్స్ ఆఫ్ మోడరన్ పోయట్రి" అని నిందించాడు. "ట్రాడ్జి" కవితలో " Trudge body and climb, trudge and climb - but not to stand again on any peak of time - trudge body - I will cool you, body, with hot sun that draws the sweat - I will warm you body with ice - water that stings the blood - I will enrage you, body with idleness, to do - and having done to sleep the long night through trudge body".

ఇది చదువుతుంటే త్వమేవాహంలో ఆరుద్ర కవిత "తోయ్యోయ్ మొయ్యూయ్ తోయ్" జ్ఞాపకం వస్తుంది. లండన్ వెస్ట్ మినిస్టర్ ఆబ్బేలో స్మారక ఫలకాన్ని ఉంచి గౌరవించారు.



**మోడర్నిస్ట్ కవి - వాలెస్ స్టివెన్స్**

సమకాలీన సమస్యలతో, ఆందోళనలతో విసిగిపోయిన వాలెస్ స్టివెన్స్ ఆధునిక కవిత్వానికి కొంచెం దూరమైనాడు. రాక్షస యుద్ధాన్నించి తప్పించుకొనే ప్రయత్నం చేశాడు. ఎక్సిక్యూటివ్‌గా ఉండాలనుకొన్నాడు. అక్టోబర్ రెండు 1879లో డచ్, జర్మన్ కుటుంబంలో పెన్సిల్వేనియాలోని రీడింగ్‌లో పుట్టాడు. హార్వర్డ్ యూనివర్సిటిలో చేరి సంప్రదాయ సానెట్స్ రాశాడు. రైంకు ప్రాధాన్యతనిచ్చాడు. హార్వర్డ్ అడ్వొకేట్‌లో బాలడ్స్ సెంటిమెంటల్

పాటలు రాశాడు. న్యూయార్క్‌లో లా చదివి బార్ సభ్యుడై కనెక్టికట్ వెళ్లి హార్ట్ ఫోర్డ్ యాక్సిడెంట్ అండ్ ఇండెమ్నిటి ఇన్సూరెన్స్ కంపెనిలో లీగల్ అడ్వైసర్ అయ్యాడు. యాభై అయిదులో దానికి వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు. డెబ్భై అయిదేళ్ళ వయసులో 02-08-1955వరకు అందులోనే ఉద్యోగించాడు.

ద్వంద్వ మనస్తాత్వానికి ఇష్టపడలేదు. "I prefer to think just a man, not a poet part time businessman the rest" అని నిర్మొహమాటంగా చెప్పాడు. నలభై నాలుగో ఏడు వచ్చేదాకా రచనలను ప్రచురించలేదు. నాలుగు కవితలు మాత్రం "ఏ మేగజైన్ ఆఫ్ వెర్స్"లో వచ్చాయి. తొమ్మిదేళ్ళ తర్వాత మొదటి పుస్తకం "హార్మోనియం" తర్వాత "ఐడియాస్ ఆఫ్ ఆర్డర్", "ది మాన్ విత్ ది బ్లూ గిటార్", "పార్ట్ ఆఫ్ ఏ వరల్డ్", "ట్రాన్స్‌పోర్ట్ టు సమ్మర్" వగైరాలను ప్రచురించాడు. నేషనల్ బుక్ అవార్డ్‌తో బాటు పులిట్జర్ బహుమతి పొందాడు. "ఓపస్ పాస్థుమాస్" 1957లో విడుదల చేశాడు. "తరీన్ వేస్ ఆఫ్ లుకింగ్ ఎట్ ఏ బ్లాక్ బర్డ్" కవితలో "I donot know which to prefer - the beauty of inflections - or the beauty of innuendos" అని సందేహపడుతూ రాశాడు. "ది ఎంపరర్ ఆఫ్ ఐస్‌క్రీం", "ది వర్మ్స్ ఎట్ హేవెన్స్ గేట్", "ది కిచెన్ కప్స్" మొదలైన కవితలు సందర్భ శుద్ధికి ఉదాహరణలు. "The poem must resist the intelligence almost successfully" అని అభిప్రాయపడ్డాడు. "The body's death and beauty's deathlessness"పై చక్కని కవిత రాసి మెప్పించాడు స్టేవెన్స్.

"Beauty is momentary in the mind - the fitful tracing of portal - but in the flesh it is immortal - the body dies, the body's beauty lives - so evenings die in the green going - a wave interminably flowing" అంటూ సాగుతుంది ఆ కవిత. విలియం కవితలు "Not of the second part of life - they don't make the visible a little hard to see" అని అంచనా వేశారు. "He employed every nuance of rhetoric dissolving imagery and paradoxical epigrams to achieve a mystical reality - a supreme fiction to move his readers in the direction of fact as we want it to be"

అమెరికన్ మోడర్నిస్ట్ పోయెట్‌గా గుర్తింపు పొందాడు. 02-08-1955న కనెక్టికట్‌లోని హార్ట్‌ఫోర్డ్‌లో మరణించాడు. మనస్సాక్షికి వాస్తవానికి ఉన్న సంబంధంపై ఎక్కువగా రాశాడు. అతని ఇమాజినేషన్ అంత స్సాక్షీ కాదు, వాస్తవమూ కాదన్నారు. ఇది పొడిగా ఉన్న విషయం కాదు. కాని జీవితంలో నిజాన్ని, దాని అంతరార్థాన్ని కనిపెట్టే సరైన అన్వేషణా విధానం.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 54

# ఆధునికతకు ప్రతీకను జోడించిన కవి - విలియం కార్లోస్ విలియమ్స్

**వా**లెస్ స్టీవెంస్‌కు స్నేహితుడు, అభిమాని అయినా అతని భావాలు నచ్చనివాడు విలియం కార్లోస్ విలియమ్స్. జీవితంలోని అపసవ్యాన్ని ప్రేమించి, ఏ కోరికను వదలక అనుభవించాడు. "No ideas but in things" అన్నదే సిద్ధాంతం. విలియమ్స్ న్యూ జెర్సీలోని రూత్‌ఫర్డ్‌లో 17-09-1883న జన్మించాడు. పేరెంట్స్ ఇంగ్లీష్, ఫ్రెంచ్ కుటుంబాలకు చెందినవాళ్ళు. జ్యూయిష్ రక్తం ప్రవహిస్తున్నవాడు. తల్లి కేథలిక్‌గా తండ్రి ఎపిక్యూరియన్‌గా విలియమ్స్‌ను పెంచారు. న్యూయార్క్‌లో హోరేస్‌మాన్ హైస్కూల్‌లో చదివి, స్విట్జర్లాండ్‌లో మెడిసిన్‌లో చేరి పెన్సిల్వేనియా యూనివర్సిటిలో పూర్తి చేసి ఎం.డి డిగ్రీ పొందాడు. ఇరవై మూడుతో మొదటి కవితా సంకలనం తెచ్చాడు. ఫ్లోరెన్స్ హీర్మాన్‌ను పెళ్లి చేసుకొని ఇద్దరు కొడుకులను కని, ఒక కొడుకును డాక్టర్‌ను చేశాడు.

ఇమేజిస్ట్ పౌండ్‌ను అనుకరించాడు. క్రమంగా అమెరికన్ జాతీయాలకే ప్రాముఖ్యమిచ్చి రాశాడు. "ఫస్ట్ సెలెక్షన్ ఆఫ్ పోయెమ్స్" విడుదల చేశాడు. దీనికి ముందు మాట రాసిన స్టీవెన్ "The passion of anti poetic is a blood passion and not a passion of ink-pot" అన్నాడు. వాస్తవ అవాస్తవాలను కలిపి రాసిన తీరు బాగుందని మెచ్చాడు. సెంటిమెంట్‌ను యాంటి పోయెటిక్‌ను కలిపి రెండు విరుద్ధాలకు ఒకేచోట స్థానం కల్పించాడు. డెబ్భై అయిదేళ్లకు ముప్పై అయిదుకు పైగా పుస్తకాలు రాసి ప్రచురించాడు. అనేక పురస్కారాలు, గౌరవాలు పొందాడు. అందులో గొప్పది బెల్లిన్జెన్ అవార్డ్. దీనికి అయిదు వేల డాలర్ల పారితోషికం పొందాడు. ఎకాడమి ఆఫ్ అమెరికన్ పోయెట్స్‌లో ఫెలోషిప్ పొందాడు. "బుక్ టు ఆఫ్ పీటర్సన్"కు నేషనల్ బుక్ అవార్డ్ వచ్చింది.

"ఫ్లవర్స్ బై ది సి", "ట్రాక్ట్", "ఏ గుడ్ నైట్" మొదలైనవి వ్యక్తిగతమైన ఆనాటి ఫ్రీవెర్స్ కవితలు. అన్నిటిని ప్రేమించే గొప్ప లక్షణం విలియమ్స్‌కుండేది. వ్యత్యాసం తెలియని కవి. పనికిరానిది ఉందా అని ఆశ్చర్యపోయేవాడు. ప్రస్తుతాన్ని ప్రశ్నించరాని సానుభూతితో రాయటం అతని ప్రత్యేకత. పేపర్ వార్త బజారు వార్తా అన్నీ కవిత్వంలో దిగాల్సిందే. దీన్ని "If Williams errs on the side of objectivity, he uses those objects, fragments and disjointed documents to attain fresh and startling immediacy"గా అభివర్ణించారు. 04-03-1963న డెబ్బై తొమ్మిదేళ్ళ వయసులో చనిపోయాడు. డాక్టర్‌గా కంటే రచయితగానే ఎక్కువ సేవ చేశాడు. నిత్య జీవిత సంఘటనలే విలియమ్స్ కవితా వస్తువులు. "Poetry is equipment for living a necessary guide amid the bewilderments of life" అని భావించాడు. మోడర్నిజాన్ని ఇమేజిజంతో కలగలిపి రాసినవాడు కార్లోస్ విలియమ్స్.



**ఐరనీ విట్‌ల కవయిత్రి – మరియాన్ మూర్**

మరియాన్ క్రైగ్ మూర్ అమెరికాలోని మిస్సోరిలోని సెయింట్ లూయిస్‌లో 15-11-1887లో జన్మించింది. బ్రయాన్ మార్‌లో చదివి బి.ఏ పాసై స్టెనోగ్రఫీ, టైపింగ్, బుక్ కీపింగ్, ఇంగ్లీష్ కమ్మర్షియల్ లాలను పెన్సిల్వేనియాలో బోధించింది. న్యూయార్క్ హడ్సన్ పార్క్ బ్రాంచ్‌కి అసిస్టెంట్‌గా మూడేళ్ళు పనిచేసింది. సంప్రదాయం, పద్ధతి ఉన్న వనిత. మొదటి కవితా సంకలనం "పోయెమ్స్" లండన్‌లోను "అబ్సర్వేషన్స్"ను తర్వాత ప్రచురించి రెండవ దానికి "డయల్ అవార్డ్"ను కవిత్వంలో విశిష్ట సేవకు పొందింది. 1944లో "కాంటెంపరి పోయిట్రీ పేట్రన్స్ ప్రైజ్"ను పొందింది. చికాగో వర్సిటి నుండి ప్రతిష్ఠాత్మక హారియట్ మన్రో పోయెట్రి పురస్కారం అందుకొన్నది. గగ్గెన్ హీం ఫెలోషిప్ గౌరవం పొందింది.

1951లో ప్రచురించిన "కలెక్టెడ్ పోయెమ్స్"కు బోలింజేస్, నేషనల్ బుక్ పులిట్జర్ ప్రైజ్‌లను గెలుచుకొంది. "నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోయెట్రి అండ్ లెటర్స్" నుండి స్వర్ణపతకం అందుకొన్నది. "ఇందరు ఉండగా నా కవిత్వానికే ఇన్ని అవార్డులు ఎందుకిస్తున్నారో నాకు అర్థం కావటం లేదు. న్యాయ నిర్ణేతలు నా కవితలలో కవిత్వం ఉంది అని గుర్తించినందుకు కృతజ్ఞతలు" అని చెప్పింది.

మూర్ కవిత్వంలో "పారడాక్స్" ఎక్కువ. అంతకంటే ఆ కాలంలో బాగా రాసినవారు లేరు. ఆమె రాసిన వాటిని ఎందరో ఉదాహరించేవారు. అందుకే ఆమెది "సిజర్ లైక్

మెథడ్" అన్నారు. ఇన్‌వర్టెడ్ కామాలలో ఉండే ఫ్రేజులు ఆమె ప్రత్యేకం. "వుడ్ వీసెల్"లో ఆమె సాంకేతిక ఆధిపత్యం పతాక స్థాయిని చేరింది. కవిత్వంలో సంగీతమే ఉండదు రెండు మూడుసార్లు చదివి అర్థం చేసుకోవాలి. తాను రాసిన ప్రతిదీ "The chief interest is borrowed and since I have not been able to overgrow this hybrid method of composition, acknowledgements seem only honest" అని నిజాయితీని ప్రకటించింది. ఆమె కవిత్వం తెలివితేటలు, రుచికర స్థాయి నుండి నైతిక నిజాయితీ స్థాయికి చేరింది. "This is a poetry made of personal notations, verbal niceties, and preserved curiosities, but it is also playful, surprising and as penetrating as it is exquisite" అని ఆమె కవిత్వాన్ని విశ్లేషించారు. 05-02-1972న 84ఏళ్ళ వయసులో మరణించింది. ఎజ్రా పౌండ్‌ను అభిమానించినా ఆయన ఫాసిస్ట్ సమర్థతను వ్యతిరేకించింది. అమెరికా మోడర్నిస్ట్ కవయిత్రి, రచయిత్రిగా మంచి గుర్తింపు పొందింది. ఐరనీ విట్‌లలో అనితర సాధ్య కవితలల్లింది.

**వ్యవసాయాధారిత పారిశ్రామిక విప్లవం కోరిన కవి – జాన్‌క్రూ రాన్సం – ఫుజిటివ్ ఉద్యమం**



జాన్ క్రూ రాన్సం అమెరికాలోని టెన్నిసీలో పులస్కిలో 30-04-1888లో పుట్టాడు. స్కాటిష్ ఐరిష్ వంశం వాడు. తండ్రి మినిస్టర్. పూర్వీకులు "కు క్లాక్స్ క్లాన్" సంస్థకు చెందిన వారు. డిగ్రీ పొంది టెన్నిసీ నాష్‌విల్‌లోని వాండర్ బిల్ట్ యూనివర్సిటిలో ఆక్స్‌ఫర్డ్‌లోని క్రైస్ట్స కాలేజిలో పూర్తిచేసి అమెరికా వచ్చి వాండర్ బిల్ట్‌లో లెక్చరర్ అయ్యాడు. ఇక్కడే "ఫుజిటివ్ గ్రూప్"ను ఏర్పాటు చేశాడు. సభ్యులందరూ పెన్‌నేమ్స్‌తో సంతకాలు పెట్టారు. ఏడాదిలో సభ్యుల సమాఖ్య పదహారైంది. వ్యవసాయ వాణిజ్య ఆధారిత పారిశ్రామిక ప్రగతి రావాలని కోరారు. "ఐ విల్ టేక్ మై స్టాండ్" అనే సింపోజియం నిర్వహించారు. వీళ్ళు దక్షిణ రాష్ట్రావాళ్ళు అందుకని స్థానికులు భయపడ్డారు. దేనికీ నిబద్ధులని ప్రకటించుకోకపోవటమూ ఇబ్బంది కలిగించింది. ఇందులోని "అలెన్ టాటే" ప్రముఖ కవి, రచయితా అయ్యాడు. డోనాల్డ్ డేవిడ్‌సన్ స్థానికత, చరిత్రపై రెండు గ్రంథాలు "ది టెన్నేసి" పేర రాశాడు. యాభై వేల ఫ్రీవెర్స్ పంక్తుల్ని", "అమెరికన్ సానేట్స్"ను రాశాడు. రాబర్ట్ పెన్ పులిట్జర్ బహుమతి "ప్రామిసెస్" కవితా సంకలనానికి పొందాడు. ఫుజిటివ్‌లు అంటే పలాయనం చిత్తగించేవారని, అస్థిర మనస్కులని అర్థం.

ఫుజిటివ్ ఉద్యమం మఖలో పుట్టి పుబ్బలో మాడినట్లు కనుమరుగైంది. రాన్సం

ఒహాయోలోని గాంబియర్ చేరి కెన్యా కాలేజిలో పోయెట్రి ప్రొఫెసర్ అయి, కెన్యా రివ్యు పేపర్‌కు ఎడిటర్ కూడా అయ్యాడు. కెన్యా స్కూల్ ఆఫ్ క్రిటిక్స్ సంస్థను స్థాపించి నూతన విమర్శను వ్యతిరేకించాడు. "They insisted an order control, and attention to craftsmanship, objectives which could only have a salutary influence" అని ధ్యేయాన్ని ప్రకటించారు. ఈ న్యూ క్రిటిక్స్ విశ్లేషణలో ఉన్నారు. సృజించిన వాడికంటే విమర్శ, విశ్లేషణ చేసేవాడిదే గొప్ప అన్నారు. రచనతో పాటు దాన్ని బహిర్గతం చేసే పరిశీలనాత్మకమైనా, పరిశోధనాత్మకమైన విశ్లేషణకే ప్రాధాన్యతనిచ్చారు. "Poetry to be written not to delight but to dissect" అని స్పష్టం చేశారు. దీనిపై స్పందిస్తూ ఇలియట్ "Thirty three years ago it seems to have been the latter type of criticism, the impressionistic - that ha caused the annoyance I felt when I were on "The functions of criticism", today it seems to me that we need to be more on guard against the purely explanatory" అని స్పష్టంగా చెప్పాడు.

ఇంప్రెషనిజం మీద విరక్తి చెందినా రామ్సన్ మాత్రం ప్యూర్లి ఎక్సప్లనేటరికి వ్యతిరేకియే. అతని "ఫస్ట్ ట్రావెల్స్", "జెంట్ వాకింగ్", "బ్లూ గర్ల్స్" మొదలైన కవితలు బాగా ప్రాచుర్యం చెందాయి. చావును కూడా "కౌంటర్ ఫీట్ గ్రావిటి"గా భావించాడు. "Here lies a lady of beauty and high degree - of chills and fever she died, of fever and chills - to delight of her husband, her aunts, an infant of three - and of medicos marveling sweetly on her ills" అని అధిక్షేపించాడు. మనసుకు ఊరట కల్గిస్తూ గుచ్చుకుంటూ ఉండేట్లు రాస్తాడు. "His inflection is both nervous and drawling, a patrician softness of speech that mingles cavilier grace with diablerie" అని అతని కవిత్వాన్ని బేరీజు వేశారు. 03-07-1974లో ఎనభై ఆరవ ఏట ఒహాయ్‌లోని గంబియార్‌లో మరణించాడు.❁



**"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు - 55**

# సవన్నా కవి - కాన్రాడ్ ఐకెన్

**అ**మెరికాలో జార్జియాలోని సవన్నాలో కాన్రాడ్ ఐకెన్ 05-08-1889లో పుట్టాడు. సమకాలీన కవులు సంగీతాన్ని వదిలేస్తే దాన్నే పట్టుకొని పట్టు సాధించాడు. పదేళ్ళప్పుడే తండ్రి తల్లిని చంపేసి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనితో జీవితమంతా విచారమే మిగిలింది. ఒక దూరపు బంధువు మాసాచూసెట్స్‌కు తీసుకొని వెళ్ళింది. ఇక్కడే జీవితాంతం ఉన్నాడు. హార్వర్డ్‌లో చేరాడు. ఇలియట్ ఇతని క్లాస్‌మేట్. గ్రాడ్యుయేట్ అవగానే కెనడియన్ అమ్మాయి జెస్సీ మాక్డోనాల్డ్‌ను పెళ్ళాడాడు. ముగ్గురు పిల్లలు. కొద్దిపాటి ఆదాయంతో కుటుంబ పోషణ చేశాడు. కవిత్వంపై దృష్టిపెట్టి స్వంత ప్రయోగాలు చేసి "ఎర్త్ ట్రయంఫంట్" పుస్తకం తెచ్చాడు. తర్వాత "టర్న్స్ అండ్ మూవీస్"ను రెండవదిగా తీసుకొచ్చాడు.

ముప్ఫైలో ఇంగ్లాండ్ వెస్ట్ కోస్ట్‌లో గడిపి, హార్వర్డ్‌కు వెళ్లి రెండో పెళ్లి చేసుకుని, వదిలేసి మూడో పెళ్ళాడి ఇంగ్లాండ్ చేరాడు. యాభైలో మాసాచుసెట్స్‌లోనే ఉండి పోవాలనుకున్నాడు. "ది న్యూయార్కర్" పత్రికకు లండన్ విలేకరిగా ఉన్నాడు. ఎనిమిదెకరాల పొలం కొన్నాడు. గౌరవాలు, పురస్కారాలు వెంటపడ్డాయి. సెలెక్టెడ్ పోయెమ్స్‌కు పులిట్జర్ వచ్చింది. నేషనల్ బుక్ అవార్డ్‌తో బాటు కవిత్వానికి బంగారు పతకం కూడా వచ్చింది. వచనం రాసినా కవిత్వానికి తీసికట్టు. "మిస్టర్ ఆర్కులరిస్"ను బాగా ఆదరించారు. "He relies too much on the hypnotic power of his smooth phrases". ఒక డజన్ మాటలతోనే విపరీతాన్ని సృష్టించే నేర్పున్న కవి. ఇంగ్లిష్ రొమాంటిక్ కవిత్వంలోని మాజిక్‌ను బాగా వాడాడు. ప్రతిధ్వనితో కూడిన సంగీత శబ్దాలను వాడి చెవులకు ఇంపు, మనసుకు హాయి కలిగించాడు. "ఎన్నిహిలేషన్" కవితలో లైన్లు బాగుంటాయి. "These are the secret and I could hate you - when as I lean for another kiss - I see in your eyes that I don't meet you - and that love is this" అని

ప్రేమకు భాష్యం చెప్పాడు. 1973 ఆగస్ట్ పదిహేడున ఎనభై నాలుగో ఏట చనిపోయాడు. "ఉషాంట్" అనే స్వీయ జీవిత చరిత్ర రాసుకున్నాడు. నవలాకారుడిగా మంచి పేరుంది. అందులో పెళ్ళిళ్ళు, శృంగారం, అంగారం అన్నీ రంగరించాడు. మతిస్తిమితం కోల్పోయి ఆత్మహత్యా ప్రయత్నానికీ పాల్పడ్డాడు. "పోయెట్రి సొసైటి ఆఫ్ అమెరికా" ఐకెన్‌కు మొదటి "షెల్లీ మెమోరియల్ అవార్డ్"నిచ్చింది.

**మొదటి లైబ్రేరియన్ కాంగ్రెస్ కవి, రచయిత – ఆర్చిబాల్డ్ మెక్లీష్**



ఇలినాయిస్‌లో గ్లేనోయిలో 1892 మే ఏడున పుట్టాడు మెక్లిష్. పౌండ్ మనసంతా నిండిపోయాడు. విట్మన్ ఊరించాడు. సాండ్‌బర్గ్ భావజాలానికి ఊగిపోయాడు. స్కాటిష్ మర్చంట్ కొడుకు మెక్లీష్ హార్వర్డ్ ఎల్ యూని వర్సిటి లా స్కూల్‌లో చదివి మొదటి ప్రపంచ యుద్ధంలో ఆర్టిలరిగా చేరి తర్వాత బోస్టన్‌లో అటార్నీ అయ్యాడు. మూడేళ్ళ తరువాత "గౌను" విప్పేసి సంగీతం పాడే "అడా హిచ్‌కాక్"నుపెళ్లి చేసుకుని, విదేశాలకు వెళ్లి అమెరికా తిరిగివచ్చి పొలం కొని కనెక్టికట్‌లో సెటిల్ అయ్యాడు. పబ్లిక్ ఫిగర్ అనిపించుకున్నాడు. ఫార్చ్యూన్ మేగజైన్‌లో చేరి పనిచేసి, కాంగ్రెస్‌లో లైబ్రేరియన్ అయి, రెండవ ప్రపంచ యుద్ధంలో నిజ నిర్ధారణ కమిటికి డైరెక్టర్ అయ్యాడు. ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్‌కు ఆంతరంగిక బృందంలో ఒకడై, తర్వాత అసిస్టెంట్ సెక్రటరి ఆఫ్ స్టేట్ పదవి సాధించాడు. రెండవ యుద్ధంలో చురుకైన పాత్ర పోషించాడు మెక్లీష్. హార్వర్డ్‌లో "బోయిస్టాన్ ప్రొఫెసర్ ఆఫ్ ఆరేటరి అండ్ రేటరిక్"కి ప్రొఫెసర్ అయ్యాడు. ఇన్ని పదవులు పొంది ప్రాముఖ్యంలో ఉన్నా రచన ఆపలేదు. పద్దెనిమిది కవితా పుస్తకాలు, అనేక నాటకాలు, వ్యాసాలూ రాసి ఎన్నో రాజకీయ ప్రసంగాలు చేశాడు. మూడుసార్లు పులిట్జర్ బహుమతిని, నేషనల్ బుక్ అవార్డ్‌ను పొందాడు. ప్రజలకు ఇష్టమైనది, తగినదీ రుచికరంగా రాసి వండి వడ్డించాడు. ప్రతిభతోపాటు అదృష్టం ఉన్న రచయిత. "And there over heard there thee hung over - those thousands of white faces those dozed eyes - there in the starless dark, the poise, the hover - there ith vast wings across the canceled skies - there in the sudden blackness, the black pall - of nothing nothing nothing at all" అని "ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్" కవితలో గొప్పగా వర్ణించాడు. "The library, almost alone of the great monuments of civilization, stands taller now than it ever did before. The city... decays. The nation loses

its grandeur.. The university is not always certain what it is. But the library remains, a silent and enduring affirmation that the great Reports still speak, and not alone but somehow all together..." అని గ్రంధాలయ విశిష్టతను చాటి చెప్పాడు. పుస్తకం అంటే "రిపోర్ట్ అపాన్ మిస్టరి ఆఫ్ థింగ్స్" అని నిర్వచించాడు.



"పూర్వాంగ్ల" కవుల ముచ్చట్లు – 56

## టైపోగ్రాఫిక్ స్టైలిస్ట్ – ఇ.ఇ.కమింగ్స్

**అ**మెరికా సాహిత్యంలో "బాడ్ బాయ్" అనిపించుకున్నవాడు ఇ.ఇ.కమింగ్స్. 1894 అక్టోబర్ పద్నాలుగున మాసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో జన్మించాడు. తండ్రి మినిస్టర్ కాకముందు హార్వర్డ్ టీచర్. కమింగ్స్ కూడా హార్వర్డ్‌లో చదివి ఎం.ఏ పాసైనాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ సర్వీస్‌లో చేసి, సెన్సార్ పొరపాటు వల్ల మూడు నెలలు డిటెన్షన్ కాంప్‌లో ఉండాల్సి వచ్చింది. దీన్నే "ఎన్నార్మస్ రూమ్"లో వివరించాడు. ఇదికాక కొన్ని వ్యాస సంపుటుల్ని తెచ్చాడు. "టులిప్స్ అండ్ చిమ్నీస్" అనేది మొదటి కవితా సంకలనం. దీని చివర వరుసగా చాలా సానేట్లు రాశాడు. ఇందులో చాలా విరుద్ధాలు కనిపిస్తాయి. మాటల శక్తికే ప్రాధాన్యం ఇచ్చాడు. పేజీ అంతా ఖాళీగా కొద్ది లైన్లు మాత్రమే ఉండేట్లు రాశాడు. ఉదాహరణకు – a tall

Wind
Is dragging
The
Sea
With
Dream
S

ఇది చూస్తే ఒక అడ్వర్టైజ్‌మెంట్ పద్ధతి అనిపిస్తుంది. అరవై వయసులో ఆరువందల కవితలను కూర్చి పోయెమ్స్ పేరిట విడుదల చేశాడు. పాతవాటినే కొత్త తరహాలో చెప్పాడు. స్ప్రింగ్, డెత్, రొజెస్‌లపై కవితలు అల్లి నిర్లక్ష్యంగా సంభాషణ రూపంలో రాసి ప్రత్యేకత చూపాడు. అరవై ఏడులో 1962లో సెప్టెంబర్ మూడున మరణించాడు. స్వీయచరిత్ర నవలలు నాటకాలు రాసి పెయింటర్‌గా కూడా ప్రఖ్యాతుడైనాడు. రాడికల్ బెహోమియన్ వాడైనా రిపబ్లికన్‌గానే

గుర్తింపబడ్డాడు. కవిత్వంలో బ్లూస్ ఫారంను, ఎక్రాస్టిక్స్ రూపంలోను రాశాడు కొన్ని. ప్రేమ, ప్రకృతిలపైనే ఎక్కువగా రాశాడు. ఇమేజిస్ట్ ప్రభావంతో ముందు రాసినా తర్వాత ఫ్రెంచ్ కవుల ప్రత్యేకమైన "దాడాయిజం"ను అభిమానించి రాశాడు. అంత్యప్రాస, ఛందస్సులకు అంతగా విలువ ఇవ్వలేదు. అతనిది "టైపోగ్రాఫికల్లి ఎక్సూబరెంట్ స్టైల్" అంటారు. 2.900 కవితలు పండించాడు. ఆరో ఏటనే తండ్రిపై కవిత రాశాడు. "Father dear - be your father good and good - it is good - it is not good to see it rain".

"ఎనార్మస్ రూమ్" అనే ఆటోబయోగ్రఫిక్ నవల రాశాడు.

**కంప్రెస్సెడ్ మెటఫర్ కవి – హార్ట్ క్రేన్**



ఇమేజ్‌లను కేంద్రాకరించి, అలంకారాలతో అలంకరించి కావ్య గౌరవాన్ని కల్పించి కవిత్వం రాసినవాడు హార్ట్ క్రేన్. "కంప్రెస్సెడ్ మెటఫర్"ను పరిపూర్ణం చేశాడు. ఇందులో "Comparisions were stripped to their skeletal ideas, he spoke of as an instinctive "logic of metaphor" which he claimed antedated our so called pure logic and which is the genetic basis of all speech" అని దాని వివరణ ఇచ్చారు విశ్లేషకులు.

అమెరికాలో ఒహాయోలోని గారేట్స్ విల్‌లో 21-07-1899న పుట్టి బాల్యం నుండి అశాంతితోనే గడిపాడు. అప్పుడే తండ్రి క్లీవ్‌లాండ్‌కు కుటుంబాన్ని మార్చి తలిదండ్రులిద్దరూ విడిపోయారు. తల్లినే సమర్థించాడు క్రేన్. ఇతరులపై ఆధారపడటం ఇష్టంలేని క్రేన్ జీవితం నాశనమైపోయిందనుకున్నాడు. అనేక చిన్న ఉద్యోగాలు చేసి చివరికి షిప్‌లాండ్ రిపోర్టర్‌గా ఉన్నాడు. తండ్రికి ఇష్టంలేకపోయినా కవిత్వానికి అంకితమైపోయాడు. ఉద్యోగాల్లో చేరటం ఊడిపోవటంతో నిర్లక్ష్యంగా బేఫర్వాగా తిరిగాడు. విపరీతంగా తాగుడుకు అలవాటు పడి, కుదురు లేకుండా యూరప్ అంతా చెడతిరిగి, అవమాన భారంతో కుంగిపోతూ ప్రతివాళ్ళతో పోట్లాడుతూ తగాదా పడుతూ గడిపాడు.

ఇరవై ఏడులో మొదటి పుస్తకం "వైట్ బిల్డింగ్స్" ముద్రించాడు. అతని అమోఘ కవితాశక్తిని గుర్తించారు. కవిత్వంలో మెరుపులు మెరిపించాడు. ఫ్రెంచ్ సింబాలిస్ట్‌ల ప్రభావం బాగా ఉన్నవాడు. స్వంత పదాలను "కార్పోసంట్, కంక్లామెంట్, సిబిలెన్స్ సినేర్జి ఇంక్యునాబులా, లేబిరింతిస్, క్లస్టస్, గాల్వో దేర్మిక్, ట్రాన్స్మెంబెర్‌మెంట్, కోరిమ్బులస్" మొదలైన మాటలను సృష్టించుకుని "వర్డ్ ఫైండర్" అయ్యాడు. ఇరవైలలో దాత ఒట్టో హెచ్ కాహ్న్ క్రేన్ ప్రణాళికకు కావలసినంత ఆర్థిక సాయం చేశాడు. దీనితో "ది బ్రిడ్జి" అనే పెద్ద పుస్తక ముద్రణ జరిగింది.

తర్వాత "మిత్ ఆఫ్ అమెరికా" రాశాడు. జాతీయ సింబల్స్, లెజెండ్స్, పూర్వ చరిత్ర, జానపద గీతాలు, ఆధునిక సాంకేతికత అన్నీ కలిపి కావ్యరీతిలో రాశాడు. ఇందులో బ్లేక్, డికిన్సన్, మేల్విలీ, విట్మన్ మొదలైన వారందరినీ కలిపి కేలేడోస్కోప్ రీతిలో హిస్టారికల్‌గా రాశాడు. "సబ్ కాన్షస్"తో రాసినట్లనిపిస్తుంది.

రాతలో డిసిప్లిన్ లేకపోవటమే క్రేన్ కవిత్వానికి కలర్ ఇచ్చింది. భావాత్మకంగా, చిత్రాత్మకంగా రాసే వీలు కలిగింది. ఒక కవితా చిత్రాన్ని చూద్దాం –

"Stick your patent name on a sign board - brother - all over going west - young man tintex - japalac - Certain - teed Overallas ads - and lands sakes under the new pay bill ripped" అంటూ ఆర్డర్‌లో కేయాస్ కలిపి రాస్తాడు. తన తరాన్ని ప్రభావితం చేసిన క్రేన్ ముప్ఫై రెండవ ఏట ఫ్లారిడా కోస్ట్‌లో ఆత్మహత్య చేసుకొని 27-04-1932న చనిపోయాడు.

"Finding both inspiration and provocation in the poetry of T.S.Eliot, Crane wrote modernist poetry that was difficult, highly stylized, and ambitious in its scope. The logic of metaphor is so organically entrenched in pure sensibility that it can't be thoroughly traced or explain outside of historical sciences, like philology and anthropology"

నాటక రచయిత యూజీ ఓనీల్, కమ్మింగ్, టోటే మొదలైనవారు క్రేన్ కవిత్వానికి క్రేజీ అయ్యారు.

**ఎలిప్టికల్ కవి – రాబర్ట్ లోవెల్**



రాబర్ట్ ట్రైల్ స్పెంస్ లోవెల్ అమెరికాలో మాసాచెసేట్స్‌లోని బోస్టన్‌లో 01-03-1917న జన్మించాడు. మే ఫ్లవర్ మూలాలున్న "బోస్టన్ బ్రాహ్మిన్" కుటుంబానికి చెందినవాడు. జేమ్స్ రస్సెల్ లోవెల్ తాతగారు. ప్యూరిటన్ ఇన్ రివోల్ట్‌గా ప్రసిద్ధుడు. కెన్యా కాలేజీలో చదివి జాన్ క్రూ రాన్సం దగ్గర క్లాసిక్స్ చదువుకున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని పౌరులపై బాంబులు వేసి చంపటం నేరమని... దేశానికి ప్రమాదం లేదు కనుక యుద్ధం వద్దని వాదించి యుద్ధం చేయటానికి నిరాకరిస్తే జైలులో పెట్టి అయిదు నెలల తర్వాత విడిచిపెట్టారు.

దేనికీ చెందని మనస్తత్వం ఉన్నవాడు. దీనినే "లాండ్ ఆఫ్ అన్‌లైక్లినెస్" పుస్తకంలో రాశాడు. ఇందులోని కవితలు తరువాత "లార్డ్ వీరీ కాజిల్"లోను చేర్చాడు. రెండేళ్ళ తర్వాత

దీనికి పులిట్జర్ బహుమతిని పొందాడు. న్యూ ఇంగ్లాండ్ హేయంగా తయారయిందని బాధపడేవాడు. ఇరవైలలో రోమన్ కేథలిక్ అయి కవిత్వంలో నీతికి ప్రాధాన్యమిచ్చి రాశాడు. ముప్ఫైలో లైబ్రరి ఆఫ్ కాంగ్రెస్‌కు కవిత్వానికి కన్సల్టంట్ అయ్యాడు. ఎలిజబెత్ ఆర్విక్స్ అనే రచయిత్రిని పెళ్లి చేసుకున్నాడు. "ది మిల్స్ ఆఫ్ ది కావన్నాస్" రాశాడు. కవిత్వం బాగానే ఉన్నా, ఇమేజెస్ దట్టమైపోయి, స్వీయ ఉదాహరణలతో వెర్రి ఎత్తిస్తుంది. అతనిలోని "కావిలియనిజం"కూ, "కేథలిజం"కు మధ్య ఉన్న ఘర్షణకు ప్రతిరూపంగా కొన్ని కవితలుంటాయి.

ది క్వేకర్ గ్రేవ్ యార్డ్ కవిత "వారెన్ విన్‌లో"పై స్మృతి కవిత. "When ever winds are moving and their breath - heaves at the roped - in bulwarks of the pier the terns and the sea gulls tremble at your death - in these home waters. Sailor can you hear?" అని మొదలుపెట్టి హృదయ విదారకంగా రాస్తాడు. లోవెల్ పద్ధతిని "ఎలిప్టికల్ మెథడ్" అన్నారు. సమాజంలో నైతిక దివాలా కోరుతన్నాన్ని ఏవగించుకున్నాడు. దేనికీ స్పందించని జాతిని తిట్టాడు. "వేర్ ది రైన్‌బోస్ ఎండ్స్" కవితలో

"Boston serpents whistle at the cold - the victim climbs the altarsteps and sings - Hosannah to the lion, lamb and beast - who fans the furnace - face of I.S. with wings - I breathe the ether of my marriage feast" అని ఊగిపోతూ మనల్నీ ఊగిస్తూ కన్నీరు కార్పిస్తాడు.

లోవెల్‌కున్న డిసిప్లిండ్ టెక్నిక్ ఇరవయ్యవ శతాబ్దపు కవిత్వంలో అమెరికాలో మరో ధోరణికి దారి తీసింది. అందుకే ట్రెండ్ సెట్టర్ అయ్యాడు. ఫ్రీవేర్స్‌ను త్యజించి మళ్ళీ పాత ధోరణికి మారింది. కానీ యువకవులు ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. హుందాతనం పోగొట్టుకున్నారు. కారల్ షాపిరో రాసిన "వి లెటర్ అండ్ అదర్ పోయెమ్స్", "పీటర్ వీర్క్", "టెర్రర్ అండ్ డేకోరాం", "థియోడార్ రోత్కే", "ది వేకింగ్", "ఎలిజబెత్ బిషప్", "నార్త్ అండ్ సౌత్", "రిచర్డ్ విల్‌బర్", "థింగ్స్ ఆఫ్ దిస్ వరల్డ్" కవితలకు పులిట్జర్ బహుమతులు వచ్చాయి. 1960లలో అమెరికాలో ప్రఖ్యాత కవి అనే గుర్తింపు పొందాడు లోవెల్. "The poems drift from one focus to another; they avoid the histrionic; they sigh more often than they expostulate. They acknowledge exhausion; they except death. She praises some of Lowell's descriptions, particularly his descriptions of impotence, depression, and old age"

**నియో రొమాంటిక్ కవి – డైలాన్ థామస్**



ఆధునిక కవులలో ప్రత్యేక స్థానాన్ని పొందిన డైలాన్ థామస్ తన బాల్యాన్ని గురించి "వన్స్ బి ఏ టైం" కవితలో "Up through the lubber crust of Wales - I rocketed to astonish - the flashing needle rock of squatters - the criers of Shabby and Shorten - the famous stitch droppers" అని చెప్పాడు. తనలాగా ఉన్నతంగా ఎదిగిన కవి లేదని చెప్పుకున్నాడు. ఇరవై ఒక్క ఏటనే ప్రపంచాన్ని అధ్యయనం చేసి అదొక హింసా సామ్రాజ్యం అన్నాడు.

1914 అక్టోబర్ 27 స్వన్సియాకు చెందిన వెల్ష్‌సీ పోర్ట్‌లో ఇంగ్లీష్ టీచర్‌కు రెండవ కొడుకుగా పుట్టిన థామస్ పెద్దగా స్కూల్‌కు వెళ్లి చదవలేదు. గ్రామర్ స్కూల్‌లో చదవగానే సౌత్ వేల్స్‌కు చెందిన "ఈవెనింగ్ పోస్ట్" పేపర్‌కు రిపోర్టర్ అయ్యాడు. ఇరవైలో "ఎైటీన్ పోయెమ్స్" రాసి ముద్రించాడు. చదివిన ప్రతివాడూ అతని "ఆటవికానికి" ముగ్ధులైతే విమర్శకులు "సర్రియలిజం" అన్నారు. రెండేళ్ళ తర్వాత మరికొన్ని కవితల్ని "ట్వెంటి ఫైవ్ పోయెమ్స్"గా ప్రచురించి మళ్ళీ దిమ్మతిరిగేట్లు చేశాడు. చిన్నప్పుడే అల్లరి చిల్లరగా "దర్టి కర్లీ"గా ఉండేవాడని రాశాడు.

పేదరికంలోనే జీవితమంతా గడిపాడు థామస్. డబ్బు సంపాదించటం అసలు తెలియనే తెలియదు. జర్నలిస్ట్‌గా, నటుడిగా, స్క్రిప్ట్ రైటర్‌గా, చివరికి పబ్లిక్ పెర్మార్మర్‌గా కూడా ఏది దొరికితే అది చేసి పొట్ట పోసుకున్నాడు. రెండేళ్ళ తర్వాత కేట్లిన్ మాక్నమారాను పెళ్ళాడి ముగ్గురు పిల్లల్ని పొందాడు. కర్మార్దేన్ షైర్ అనే చేపలు పట్టే ఊరిలో స్థిరపడ్డాడు. బి.బి.సిలో కవితలను చదివాడు. 1950లో అమెరికా వెళ్లి రెండేళ్లకే తిరిగొచ్చి మళ్ళీ వెళ్ళాడు. కవితలు, పాటలూ సందర్భోచితంగా, లయాన్వితంగా, భావగర్భితంగా నటిస్తూ, పాడి వినిపిస్తూ డబ్బు సంపాదించాడు. అర్థం కాకపోయినా చెవులప్పగించి విని ఆనందించేవారు. అమెరికానే స్వంత గడ్డను చేసుకొన్నాడు. న్యూయార్క్‌పై నమ్మకం లేకపోయినా థర్డ్ ఎవెన్యూను ఇష్టపడతానన్నాడు. జనాన్ని పోగేసి కవితలు వినిపిస్తూ, చప్పట్లు, కేరింతలు కొట్టించుకుంటూ గడిపాడు. "ఏ టిపికల్ డే ఇన్ మై వెల్ష్‌బొగ్", "ఏ బార్డ్స్ ఇ వ్యూ" మొదలైన వాటిపై ఊహాత్మకమైన వ్యూహాత్మకమైన ఉపన్యాసాలిచ్చి రంజింప చేసేవాడు. "I want to write only poems of God's world - by a man who does not believe in God" అని చెప్పాడు.

ముప్ఫై అయిదు దాటగానే తాను "ముసలి చిన్న నల్ల డేరింగ్ డాటింగ్ దాటింగ్ – ఐడ్ బాల్డింగ్ అండ్ టూత్ లెస్సింగ్" అని చెప్పుకున్నాడు. మూడవసాని అమెరికా వచ్చి

"ఐగార్ స్ట్రా విన్స్కి"తో కలిసి ఒపేరాకు పనిచేయాలని ప్లాన్ వేసుకున్నాడు. కాలిఫోర్నియా నేపధ్యంగా చెయ్యాలని నిర్ణయం. ఇంతలోనే అతని "కలెక్టెడ్ పోయెమ్స్" విడుదలై సెన్సేషన్ సృష్టించి బ్లాక్ బస్టర్ అయింది. న్యూయార్క్‌లో ఆ విజయాన్ని ముప్ఫై తొమ్మిదవ బర్త్‌డేగా జరుపుకున్నాడు. కాని అకస్మాత్తుగా జబ్బు చేసి కొలాప్స్ అయ్యాడు. సెయింట్ విన్సెంట్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళినా మెదడులో భాగాలు దెబ్బతిని వేల్స్ నుంచి భార్య వచ్చిన కొన్ని గంటలలోనే 1953 నవంబర్ తొమ్మిదిన థామస్ మరణించాడు.

చనిపోయిన తర్వాత థామస్ ప్రాభవం మరీ పెరిగింది. అతని పేర అనేక సంస్థలు వెలిసి గౌరవాన్ని చాటుకున్నాయి. వేర్నార్ వాట్కిన్స్‌కు జాబు రాస్తూ వాళ్ళు అందజేసిన పారితోషికానికి కృతజ్ఞత తెలియజేస్తూ "మీరిచ్చిన గుండ్రని సిల్వర్ ట్రాష్ ది క్రౌన్‌ను అమ్ముకుంటే నాకు వారం రోజులు గ్రాసం లభించి జీవితం గడుస్తుంది. నాలాంటి వాడు చేతిలో పెన్నీ కూడా ప్రతిరోజు జీవించటం దారుణం" అని జీవితాంతం తన్ను వెంబడించిన దరిద్రాన్ని గురించి బాధతో చెప్పుకున్నాడు. కవిత్వంతో పాటు ఆరు చిన్న కథా పుస్తకాలు రాశాడు. అందులో "పోర్ట్రైట్ ఆఫ్ ది ఆర్టిస్ట్ యాజ్ ఏ యంగ్ డాగ్", "క్విట్ ఎర్లి వన్ మార్నింగ్" మొదలైన కథలు బాగా పేరొందాయి. అతని రచనల్లో బాల్యం, సెక్స్ సామర్థ్యం, కల్లోల మతం, చావులే విషయాలు. "My world was chistened in a stream of milk - and earth and sky were alone airy hill - I dreamed my genesis in swear of sleep" అని రాశాడు.

థామస్ చివరి రచన "అండర్ మిల్క్‌వుడ్" బి.బి.సిలో ప్రసారం కావాల్సింది అమెరికాలో 1953లో ప్రసారమైంది. ఇందులో రెండు భాగాలు థామస్ స్వంత గొంతుకతో చదివాడు. తన కవితలలో ప్రతిదాంట్లోను మనిషి ప్రేమ దేవుని ప్రశంస ఉంటుందని అవి లేకపోతే తాను ఒక నిరర్ధక జీవినే అవుతానని చెప్పాడు. చదువుతుంటే విశ్లేషణకు అందనంత వేగంగా దూసుకుపోతుంది కవిత్వం. అదీ అతని ప్రత్యేకత. "There was a cultural time lag - gradually our ears grew accustomed to the logical dissonances of modern music and the disordinances of modern poetry once this has been achieved, we will be able to evaluate the intrinsic importance of the work of the period. At this time, we will know how much of modern poetry has permanence the wonder, excitement and sustained power of enduring art" అని ఆలోచనలను రేకెత్తిస్తుంది డైలాన్ థామస్ కవిత్వం.

"డునాట్ గో జెంటిల్ ఇన్ దట్గుడ్ నైట్", "ఏ డెత్ షల్ హావ్ నో డొమినియన్" కవితలు "ప్లె ఫర్వాయిసెస్", "అండర్ మిల్క్‌వుడ్" నాటకాలు చాలు థామస్‌ను చిరంజీవిని

చేయటానికి.  ఏ సాహిత్య ముఠాకు చెందనివాడు థామస్.  “నియో రొమాంటిక్” అన్నారు. ఫ్రాయిడ్ ప్రభావం వెల్ష్ జాతీయ ప్రభావం ఉన్నవాడు.  అమెరికా వెళ్ళినప్పుడు థామస్ హార్డీ కవితల్ని చదివి ఆయనకే వినిపించాడు.  వెల్ష్ జాతీయుడైనా వెల్ష్ జాతీయత అంటే అయిష్టం. వెల్ష్ జాతీయత “హిల్ ఫారం మొరాలిటి” లాంటిది అన్నాడు.  థామస్‌లో ఉన్నది శబ్దాడంబరమే అంటారు కొందరు.  ఎంతోమంది కవులను ప్రభావితం చేసినవాడు డైలాన్ థామస్.  అతని సమాధిపై అతనే రాసుకున్న కవితను చెక్కించి ఉంచారు – “Oh! as I was young and easy in the mercy of means - time held me green and dying - though I sang in my chains like the sea”

థామస్ రచనలు సినిమాలుగా వచ్చాయి.

Not for the proud man apart from the raging moon I write on these spindrift pages nor for the towering dead with their nightngales and psalms but for the lovers, their arms round the griefs of the ages, who pay no praise or wages nor heed my craft or art.❋

